మన మహాత్ముడు

ఎం.వి.ఆర్.శాస్త్రి



మన మహాత్ముడు

(ఆఫ్రికా నుంచి అసహాయందాకా)

ఎం.వి.ఆర్.శాస్త్రి

దుర్గా పబ్లికేషన్స్
హైదరాబాద్

MANA MAHATMUDU

by **M.V. R. SASTRY**

Copies : 1000

First Published	:	August, 2008
Second Reprint	:	February, 2009
Third Reprint	:	April, 2010
Fourth Repriint	:	Sept, 2012
Fifth Reprint	:	June, 2016
Sixth Reprint	:	November, 2021

Published by :
Durga Publications, Hyderabad

For Copies :
Durga Publications
G-1, Sri Krishna Mansion,
1-1-230/9, Viveknagar,Chikkadapally,Hyderabad- 500020.
Phone : 040-27632824, 9441257961/62
durgapublications@gmail.com,
www.amazon.in

Text Printed at :
Akruti Offset Printers,
Chikkadapally, Hyderabad.

Price : Rs. 250/-

రచయిత గురించి

పుట్టింది: 22 ఏప్రిల్ 1952, కృష్ణాజిల్లా జగ్గయ్యపేటలో

1975లో 'ఆంధ్రజ్యోతి' మొఫిసిల్ విలేకరిగా జర్నలిస్టు జీవితం ప్రారంభించి అట్టడుగు స్థాయి నుంచి పైకి వచ్చారు.

1978 నుంచి 1990 వరకూ 'ఈనాడు'లో అసిస్టెంట్ ఎడిటర్ స్థాయి వరకు వివిధ హోదాల్లో

1990 నుంచి 1994 దాకా 'ఆంధ్రప్రభ'లో డిప్యూటీ ఎడిటర్‌గా.

1994 డిసెంబరు నుంచి 'ఆంధ్రభూమి' దినపత్రిక సంపాదకులుగా పనిచేస్తున్నారు.

పదిహేనేళ్ళుగా 'ఉన్నమాట', పదకొండేళ్ళుగా 'వీక్‌పాయింట్' శీర్షికలు నిర్వహిస్తున్నారు.

మూడు దశాబ్దాల పత్రికా వ్యాసంగంలో వందలాది సంపాదకీయాలు, ప్రత్యేక వ్యాసాలు రాశారు.

వెలువడిన పుస్తకాలు:

మన చదువులు,	**కాశ్మీర్ కథ,**
ఉన్నమాట,	**వీక్‌పాయింట్,**
ఏది చరిత్ర?,	**ఇదీ చరిత్ర**
1857	



నా శ్రీమతి

దుర్గ కు

ఇది వివాహ రజతోత్సవ కానుక

ధన్యవాదాలు

ఈ రచనను ధారావాహికంగా ప్రచురించిన
ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకులకు, యాజమాన్యానికి -

కొన్ని అపురూప గ్రంథాలను సేకరించి ఇచ్చిన
బి. నరసింగరావు, రాపాక ఏకాంబరా చార్యులు,
జి. వీణాదేవి (వేణు) గార్లకు -

మొదటి నుంచీ నా పుస్తకాల ముద్రణకు ప్రత్యేక శ్రద్ధతో సహకరిస్తున్న
మిత్రులు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు గారికి -

ఈ గ్రంథ రచనలో, ప్రచురణలో సహకరించిన ఇతర మిత్రులకు,
సహచరులకు

- రచయిత

ఎందుకు రాశాను ?

ఇంతకు ముందు నేను రాసిన చరిత్ర పుస్తకాలు ఒక ఎత్తు. ఈ 'మన మహాత్ముడు' ఇంకో ఎత్తు. దీనిలాగే అవీ నమ్మశక్యం కాని చేదు నిజాలను నిష్కర్షగా కుండబద్దలు కొట్టేవే. కాని శతాబ్దాల కిందటి వ్యక్తులకూ, ఘటనలకూ సంబంధించినట్టివి. సాధారణంగా నేటి చదువరులకు వ్యక్తిగత పరిచయం గానీ లేనట్టివి. 'మహాత్ముడు' అలా కాదు. మహాత్మాగాంధీని చూసినవాళ్లు, మాట్లాడినవాళ్లు, సన్నిహితంగా ఎరిగిన వాళ్లు నేటికీ మన మధ్య ఉన్నారు.

చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకున్నట్టు గాంధీ పేరు చెప్పి, స్వార్థ రాజకీయ వ్యాపారం చేసుకుంటూ... అక్టోబర్2, జనవరి 30న మినహా (అదీ మొక్కుబడిగా తప్ప) గాంధీని తలవని ధూర్తులు మాత్రమే కాదు. త్రికరణ శుద్ధితో గాంధీని నమ్మి, ఆయన సిద్ధాంతాల పట్ల అచంచల విశ్వాసంతో ఆయన చూపిన దారిలో నిజాయతీగా, నిస్వార్థంగా సాగుతున్న పుణ్యాత్ములూ, ఈ దేశంలో ఇంకా కొద్దిమందైనా ఉన్నారు. పుట్టినప్పటినుంచి గాంధీ గురించి గొప్పగా విని, పుస్తకాల్లో గొప్పగా చదివి, తమ కుటుంబాల్లో స్వాతంత్ర్య సమరయోధులైన పూర్వీకుల మూలంగా గాంధీ దివ్య స్మృతితో ఎమోషనల్ అనుబంధం పెంచుకుని ఆయనను అపరదైవంగా తలిచేవాళ్లు చాలా మందే ఉన్నారు.

గాంధీ మహిమ గురించి తడవకో గొప్ప సంగతి వెలుగులోకి వస్తూనే ఉంటుంది. ఆయన విశిష్టతను ప్రపంచం ఇంకా ఎక్కువగా గుర్తించి, అరుదైన గౌరవం కనపరిచిన దృష్టాంతాలు చాలా తరచుగా వినపడుతూనే ఉంటాయి. పల్లె నుంచి ఢిల్లీ దాకా దేశంలో ఏ చోట చూసినా, ఏ మూలకు వెళ్లినా గాంధీ రోడ్డో, గాంధీ చౌకో, గాంధీ పార్కో, గాంధీ బస్‌స్టేషనో, గాంధీ ఇన్‌స్టిట్యూషనో ఏదో ఒకటి తారసపడుతుంది. ఆఖరికి ప్రతివాడి జేబులోనూ ప్రతి కరెన్సీ నోటులోనూ బోసినవ్వుల బాపూజీ దర్శనమిస్తాడు. అంతలా మన జీవితాలతో పెనవేసుకుపోయి గాంధీలేని భారతదేశాన్ని ఊహించడమే కష్టమని ఎంతోమంది తలపోసే – అదిగో ఆ గాంధీనే ధర్మపీఠం ముందు నిలబెట్టి నిగ్గుతేల్చే ప్రయత్నమిది.

ఇది నా మిత్రులు చాలామందికి నచ్చలేదు. మంచో చెడో - గాంధీ గొప్పతనాన్ని లోకమంతా అంగీకరించింది కదా ? హింస, దౌర్జన్యాలతో అతలాకుతలమవుతూ నీతికి, నియమానికి నిలువలేకుండా పోయిన సంక్షుభిత సమాజానికి ఆయనొక్కడే ఆదర్శ ప్రాయుడిగా నిలిచాడు కదా? ఆయన ప్రబోధించిన శాంతి, ప్రేమలే ఏనాటికైనా శరణ్యమని దేశదేశాల మహామహులే మెచ్చుకున్నారు కదా? భారతదేశం సగర్వంగా చెప్పుకోగలిగిన ఆ ఒక్కణ్నీ కూడా పదుగురిలో పలచన చెయ్యాల్సిన అవసరం ఉందా? అది మనకే అప్రతిష్టకాదా - అని వారి ఆక్షేపణ.

వారన్నదీ పాయింటే. కాని గాంధీ ప్రతిష్టను ధ్వంసం చెయ్యటానికి నేనీ గ్రంథం రాయలేదు. గాంధీ మీద ద్వేషంతోనో, ఆయన విశిష్ట వ్యక్తిత్వాన్ని కించపరిచే ధ్యేయంతోనో నేనిందుకు ఉపక్రమించలేదు. గాంధీని అభిమానించేవారికి ఆయన పట్ల ఉన్న ఆరాధనా భావంతో నాకు పేచీ లేదు. గాంధీ బోధల ప్రేరణతో ఆయనని ఆదర్శంగా తీసుకుని, ఆదర్శప్రాయంగా జీవించి, తమ కార్యక్షేత్రంలో మహోన్నత సేవలందించిన ఎందరెందరో ఉత్తముల గుండెల్లో గూడుకట్టిన గాంధీ అంటే నాకూ గౌరవమే తప్ప చిన్నచూపు లేదు. లక్షలాది, కోట్లాది జనానికి గాంధీ అంటే ఉన్న భక్తిభావాన్ని పనిగట్టుకుని చెరపాల్సిన అవసరం ఎంతమాత్రమూ లేదు. ఒకవేళ అందుకు ఎవరైనా ప్రయత్నించినా అది అయ్యేపని కాదు.

గాంధీ మీద ఆయన జీవితకాలంలోనే చాలామందికి తీవ్ర వ్యతిరేకత ఉండేది. ఇంకా చెప్పాలంటే - పథకం ప్రకారం ఒక బృహత్ యంత్రాంగం ప్రపంచంలో గాంధీ ప్రచారాన్ని ముమ్మరంచేసిన ఇటీవలి దశాబ్దాల్లో కంటే ఆయన జీవితకాలంలోనే వ్యతిరేకత ఎక్కువగా ఉండేది. గాంధీగారి సన్నిహిత సహచరులకే ఆయన సంగతి బాగా తెలుసు. జవహర్‌లాల్‌నెహ్రూ వంటి ప్రియతమ శిష్యులు, అంతేవాసులే గాంధీ పోకడను, ఆయన చపలత్వాన్ని, అసంబద్ధ నిర్ణయాలను అనేక సందర్భాల్లో బాహాటంగా దుయ్యబట్టారు. అంబేద్కర్, అరవిందఘోష్, సుభాస్‌చంద్రబోస్ వంటి మహామహులైతే సరేసరి. గాంధీ మీద రావలసిన విమర్శలు, లేవవలసిన దుమారాలు ఇంతకుముందే వచ్చాయి; లేచాయి! గాంధీగారిలో తప్పుబట్టాల్సిన అంశాలన్నీ చాలా ఏళ్లకిందటే, ఆయన బతికుండగానే లోకానికి తెలిశాయి. అయినా గాంధీపట్ల ప్రపంచానికి గల పూజ్యభావం సడలలేదు. ఇప్పుడు నేను రాసిన దానివల్ల అది మసకబారుతుందన్న భ్రమ నాకు లేదు.

నా పరిశీలన పరిధి పరిమితమైంది. గ్రంథం పేరు 'మన మహాత్ముడు' అయినా ఇది మహాత్ముడి జీవిత చరిత్ర కాదు. గాంధీగారి సుదీర్ఘ వ్యక్తిత్వాన్ని, ఆయన రాజకీయ జీవితాన్ని, దాని సాఫల్య వైఫల్యాలను తులనాత్మక పరిశీలన చేయడమూ నా ఉద్దేశం కాదు. గాంధీగారి గొప్పతనాన్ని కొలవటానికో, లేక ఆయన గొప్పతనాన్ని పనిగట్టుకుని

కించపరచటానికో నేనిది రాయలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే నేను మాట్లాడుతున్నది మనం పూజించే మహాత్మాగాంధీ గురించి కాదు... మనం గుర్తించని రాజకీయ గాంధీ గురించి.

అలనాటి నుంచి ఈనాటి దాకా భారతదేశ చరిత్ర గతిని పరామర్శిస్తూ, దానికి సంబంధించిన దారుణ వక్రీకరణలను గుర్తిస్తూ... భారతజాతి ప్రస్తుత వైకల్యాలకు మూలహేతువులను కనుగొని, ఎక్కడ ఎప్పుడు ఎవరివల్ల ఏ విధంగా మోసపోయామో అర్థంచేసుకునేందుకు కొన్నేళ్లుగా నేను సాగిస్తున్న రచనా వ్యాసంగంలో భాగంగా గాంధీ ప్రభావాన్ని బేరీజు వేయవలసి వచ్చింది.ఆర్యులతో మొదలుపెట్టి ఔరంగజేబులతో ముగిసిన **'ఏది చరిత్ర'**... దానికి తరువాయిగా మరాఠా ప్రాభవ ఉత్థాన పతనాలను, ఆంగ్ల సామ్రాజ్య స్థాపనలను అవలోకించిన **'ఇదీ చరిత్ర'**ల తర్వాత... **'1857'** ప్రజా యుద్ధపు వెలుగునీడలను పరిశీలించిన మీదట ఆధునిక కాలంలో స్వాతంత్ర్య సమరాల దగ్గరికి చేరుకుంటే గాంధీ కనిపించాడు. 1857 విప్లవాన్ని కర్కశంగా అణచేసి, ఈస్టిండియా కంపెనీ తడికను ఎత్తేసి నేరుగా బ్రిటిషు సామ్రాజ్యమే ఇండియా నెత్తికెక్కింది లగాయతు 1947లో నెత్తురు ముద్ద స్వాతంత్ర్యాన్ని మన చేతుల్లో పెట్టి ఆదరాబాదరాగా నిష్క్రమించేంతవరకూ– నడిచిన 90 ఏళ్ల చరిత్రల్లో కెల్లా అత్యంత నిర్ణయాత్మక ప్రభావం చూపినవాడు గాంధీ. తాను అడుగుపెట్టేనాటికి ఉద్ధృతంగా నడుస్తున్న బ్రిటిషు వ్యతిరేక జాతీయోద్యమం గతిని మొత్తంగా మలుపు తిప్పి... పోరాట స్వరూపాన్ని, స్వభావాన్ని, మౌలికంగా మార్చి... జాతీయ సంఘర్షణ మూలతత్త్వాన్ని గుర్తుపట్టలేనంతగా మార్పుచేసినవాడు గాంధీ. కాబట్టే – ఆయన ఏమి చెప్పాడు? ఏమి చేశాడు? ఎందుకు చేశాడు? నమ్మి నాయకత్వం అప్పగించిన దేశానికి ఎంత న్యాయం చేశాడు? స్వాతంత్ర్య సంగ్రామ సర్వసైన్యాధిపతిగా సేనలను నడిపించటంలో, పటిష్ఠవ్యూహంతో బ్రిటిషు సామ్రాజ్యాన్ని ఎదుర్కొని, ఆశించిన లక్ష్యం సాధించటంలో ఎంతవరకు కృతకృత్యుడయ్యాడు? చివరికి దేశాన్ని ఎక్కడికి తీసుకుపోయాడు – అన్నవి నిశితంగా పరిశీలించవలసి వస్తున్నది.

గాంధీగారు ఎంతో గొప్పవాడు. సందేహం లేదు. కాని ఎంత గొప్పవ్యక్తి అయినా దేశంకంటే అధికుడు కాదు. గాంధీగారు సత్యాన్ని, ధర్మాన్ని కాచి వడబోసిన మహితాత్ముడే. కాని ఎంతటి ధర్మమూర్తి అయినా ధర్మంకంటే అధికుడు కాదు. దేశానికి ఆపద వచ్చినప్పుడు, విదేశీ దురాక్రమణదారుల దుష్టపాలనలో దేశ ప్రజలు యమయాతనలు పడుతూ, స్వేచ్ఛకోసం, స్వాతంత్ర్యంకోసం పరితపిస్తున్న సమయంలో, తిరుగులేని దేశ నాయకుడన్నవాడు – దేశం పక్షాన ఎంతవరకు నిలబడ్డాడు? దేశాన్ని చెరబట్టిన పరాయి దొరతనంపై ఎంత గట్టిగా పోరాడాడు... దేశ ప్రయోజనాలను ఎంతవరకు కాపాడాడు...

వాస్తవానికి ఎవరి పక్షం వహించాడు... అన్నది ధర్మపీఠం ముందు నిలదీయవలసిందే. ఆ వ్యక్తి ఎంతటి మహనీయుడు, ఎన్ని గొప్పగుణాలు కలవాడు అన్నదానితో ఇక్కడ పనిలేదు. History of the Freedom Movement in India.... గ్రంథం మూడవ సంపుటానికి పీఠికలో విఖ్యాత చరిత్రకారుడు **ఆర్.సి. మజుందార్** అన్నట్టు :

In dealing with Gandhi as the great leader of the Indian National Congress, a purely political organisation, fighting for freedom from British Yoke, history must apply to him the same standards of judgement and criticism, as have been applied to all other personalities, great or small, who have played any role in political affairs. Sober history must subject the public life of Gandhi to a critical and rational review.... uninfluenced by personal feeelings of admiration or devotion and above all, by a disposition to believe as right and proper whatever he might have chosen to do or say.

(బ్రిటిష చెర నుంచి విముక్తికోసం పోరాడిన పక్కా రాజకీయ సంస్థ అయిన భారత జాతీయ కాంగ్రెసుకు గాంధీ గొప్ప నాయకుడు. కాబట్టి రాజకీయ వ్యవహారాల్లో ప్రముఖపాత్ర వహించిన మిగతా వ్యక్తుల విషయంలో అనుసరించే ప్రమాణాలనే గాంధీకీ వర్తింపచేసి, వారిని విమర్శించినట్టే ఆయననూ విమర్శించాలి. ఆయనపట్ల వ్యక్తిగతంగా ఉన్న భక్తినీ, ఆరాధనా భావాన్నీ పక్కనపెట్టి... ఆయన ఏమి చేస్తే, ఏమి చెబితే అదే రైటు, అదే సబబు అని నమ్మే ధోరణిని విడనాడి గాంధీ బహిరంగ జీవితాన్ని నిశితంగా, సహేతుకంగా సమీక్షించాలి.)

అదే నేను చేసింది కూడా. గాంధీగారు పరమ ప్రమాణంగా నుడివిన సత్యాన్నే ప్రమాణంగా తీసుకుని, గాంధీ ఆదర్శాలతో గాంధీనే కొలిచి... జాతీయోద్యమం మీద, జాతి విశాల హితంపైన ఆయనవల్ల పడిన ప్రభావాన్ని, దాని మంచి చెడులను జాతీయ దృక్కోణంనుంచి నిష్పాక్షికంగా నిష్కర్షగా విశ్లేషించే ప్రయత్నమిది. ఏమేరకు నెరవేరిందీ విజ్ఞులు చెప్పాలి.

స్వాతంత్ర్య వజ్రోత్సవ సందర్భంగా 2007 ఆగస్టు సంచికతో మొదలుపెట్టి 2008 జులై 20 వరకూ యాభై వారాలపాటు ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో ఈ రచన ధారావాహికంగా వెలువడింది. దక్షిణాఫ్రికా పోరాటాలతో మొదలుపెట్టి 1920'ల నాటి ఆసహాయోద్యమ ప్రయోగ ఉపసంహారాల వరకూ గాంధీ కార్యకలాపాలను ఇందులో సమీక్షించాను. జాతీయ జీవనంపై గాంధీ ప్రభావానికి ఇది ఆరంభ దశే అయినా గాంధీ మౌలిక తత్వాన్ని అర్థం చేసుకోవటానికి ఈ కాలమే కీలకం. ఆ తరవాత

పాతికేళ్లకుగానీ దేశానికి 'స్వాతంత్ర్యం' రాలేదు. ఆలోగా జాతీయోద్యమం చిత్ర విచిత్ర అనుభవాలకు లోనైంది. విషాదాలు, వినోదాలు, వీరగాథలు, క్రూర ప్రహసనాలు, ఘోర ప్రకంపనలు ఎన్నో తటస్థించాయి. అనేకానేక సందర్భాల్లో మహాత్ముడు అలా ఎందుకు అన్నాడు; ఇలా ఎందుకు చేశాడు; ఫలానా అనూహ్య నిర్ణయం ఎందుకు తీసుకున్నాడు అని మహానాయకులు, మహా మహామేధావులే తికమకపడ్డారు. ఎవరి ఊహకూ అందని, ఏ ప్రమాణానికీ ఒదగని గాంధీ మిస్టరీ మానవ మాత్రులకు కొరుకుడు పడేది కాదని చాలామంది రాజకీయ పండితులు చేతులెత్తేశారు.

నిజానికి గాంధీ తత్వం అంత పాషాణ పాకమేమీ కాదు. అసలు కిటుకును కనిపెడితే ఆశ్చర్యమే ఉండదు. 'మన మహాత్ముడు'ను సావధానంగా చదివితే చిన్న కుర్రాడైనా... గాంధీగారు అనంతర కాలంలో ఏ సందర్భాన ఏమి చేస్తారో, ఏ ఘటనకు ఎలా స్పందిస్తారో, ఏ ఉద్యమానికి ఎలాంటి ముక్తాయింపు ఇస్తారో, ఏ నిర్వాకాన్ని ఎలా సమర్థించుకుంటారో, ఏ క్షణాన ఏ వాదానికి దిగుతారో కళ్లు మూసుకుని చెప్పెయ్యగలడు. మరి కొమ్ములు తిరిగిన మహా విద్వాంసులు చాలామంది ఏదీ సరిగా పోల్చుకోలేక గందరగోళంలో ఎందుకు పడతారంటే... గాంధీని నిక్కమైన సత్యప్రవక్తగా, అచ్చమైన అహింసావాదిగా, మానవసహజమైన బలహీనతలకు అతీతుడైన సూపర్‌మాన్‌గా ఊహించుకుని, దివ్యత్వం ఆపాదించి వారికివారు తగిలించుకున్న భక్తి, విశ్వాసాల గంతలు వారి కళ్లకు అడ్డొస్తాయి కనుక!

ఇప్పటి వరకూ గాంధీలోని లొసుగులను, ద్వంద్వ ప్రమాణాలను, ఆయనలోని కల్లనీ, కపటాన్నీ, నిరంకుశ పోకడనూ, నియంత మనస్తత్వాన్నీ ఎందరో రాజకీయ సహచరులు, గ్రంథకర్తలు, మేధావులు నిర్మొహమాటంగా ఎండగట్టారు. కాని సాధారణంగా వారు గాంధీ విశాల జీవితంలో ఒక దశకో, ఒక పార్శ్వానికో, ఒక ఘట్టానికో, ఒక అంశానికో ప్రధానంగా పరిమితమయ్యారు. ఆ ఒక్క దశలో, లేక ఆ ఒక్క పార్శ్వంలో, ఆ ఒక్క ఘట్టంలో, ఆ ఒక్క అంశంలో గాంధీ చేసింది చాలా తప్పు అని రూఢి అయినా... మిగతా దశల్లో, మిగతా ఘట్టాల్లో, మిగతా అంశాల్లో గాంధీ చేసింది బహుశా రైటే అయి ఉంటుంది; లేకపోతే ఆయనకు ఇంత ప్రపంచ ప్రఖ్యాతి ఎలా వస్తుంది? యావత్ప్రపంచం సత్యసంధుడు, సుగుణాల రాశి, ఆదర్శమూర్తి అని కీర్తించిన మహా పురుషుడిని తక్కువ చెయ్యటానికి మనమెంతవారం? ఒక వేళ మనం అన్నా చెల్లుతుందా? లోకం ఒప్పుకుంటుందా- అని ఎవరికివారు జంకారు. కళ్లు మిరుమిట్లు గొలిపే గాంధీ పేరు ప్రతిష్ఠల ధగధగలకు దాదాపుగా ప్రతివారూ సమ్మోహితులయ్యారు. తమకు తప్పుగా తోచిన ఫలానా విషయం మినహాయిస్తే మొత్తంగా గాంధీ చాలా గొప్పవాడేనని ఒప్పుకుని చాలా మంది విమర్శకులు తమకు చెడ్డపేరు రాకుండా జనరల్ కోరస్‌లో

శ్రుతికలిపారు. రాజుగారు దిగంబరంగా ఊరేగుతున్నారని అంటే తమ తల్లి శీలానికి ఎక్కడ తంటానో అన్న జంకుతో "దేవతా వస్త్రాల కథ" లో ఎవరికి వారు గమ్మునున్నట్టు... గాంధీ గొప్ప వాడు కాదంటే తమ శీలానికి ఎక్కడ అప్రతిష్ఠోనన్న బెంగతో మనవాళ్లూ కడు లౌక్యం చూపారు.

మహా విమర్శకులే, రాజకీయ ప్రత్యర్థులే, గాంధీ బాధితులే ఓవరాల్‌గా గాంధీ గొప్పతనాన్ని ఇష్టమున్నా లేకున్నా ఒప్పుకునేసరికి మిగతా లోకానికి ఆయన మహాత్మ్యంమీద ఆరాధనాభావం ఇంకా పెరిగింది. ఆయన 'సూపర్‌మాన్' ఇమేజి అంత కంతకూ ఆకాశానికి ఎదిగింది. ప్రజా జీవితంలో అడుగుపెట్టినది మొదలుకుని, మరణించేంతవరకూ గాంధీ కెరీర్‌లో అన్ని దశలనూ, అన్ని పార్శ్వాలనూ, అన్ని ముఖ్య ఘట్టాలనూ ఒకటి తరవాత ఒకటి నిశితంగా పరీక్షించి, ఆయన చుట్టూ ఆవరించిన తేజో వలయాలను ఛేదించి, అసలు మనిషిని పాదరసంలా జారిపోకుండా పట్టుకునే ప్రయత్నం ఇంతవరకూ ఎక్కడా జరిగినట్టులేదు. ఆ దిశలో నాకున్న పరిమితుల్లో చిరు ప్రయత్నమే ఈ రచన.

జాతి జీవితాన్ని విశేషంగా ప్రభావితం చేసిన మహాపురుషుల పట్ల జాతి జనులకు పూజ్యభావం, పరిపూర్ణ గౌరవం తప్పక ఉండాల్సిందే. అదే సమయంలో తెలిసో తెలియకో వారు చేసిన పొరపాట్లను, వేసిన తప్పటడుగులను, వాటివల్ల జాతికి వాటిల్లిన అనర్థాన్ని కూడా నిస్సంకోచంగా గుర్తించాలి. ఎక్కడ దారి తప్పామో గ్రహిస్తేగాని, మూఢ విశ్వాసాల ముళ్ల కంపల నుంచి బయట పడితే గానీ, చిరకాలంగా అబ్బిన గొర్రెదాటు మనస్తత్వాన్ని వదిలించుకుంటే గానీ ఇకనైనా సరైన దారికి చేరుకోలేము. గతాన్ని అర్థంచేసుకుని గుణపాఠం నేర్వనంతవరకూ వర్తమానం అయోమయమే. భవితవ్యం అంధకారమే. నమ్మకూడని వారిని నమ్మి, కళ్లు తెరచుకునే గోతిలోపడి మనకు మనం చేసుకున్న అన్యాయాలను ఇప్పటికైనా సరిదిద్దేందుకు ఏ కొంచెమైనా ఉపకరించాలన్న తపనే ఈ గ్రంథ పరంపరకు ప్రేరణ.

సహాయ నిరాకరణ రసాభాస మొదలుకుని రెండో ప్రపంచ యుద్ధంవరకూ దేశ రాజకీయ పరిణామాలను, వాటిలో గాంధీ పాత్రను దీనికి తరువాయి గానూ... అక్కడి నుంచి దేశ విభజన పూర్వాపరాల వరకూ చివరి భాగంగానూ వీలు వెంబడి రాయాలని ఉంది. ఇప్పటికి సెలవు.

హైదరాబాద్
ఆగస్టు 1, 2008

ఎం.వి.ఆర్. శాస్త్రి

ఇదీ వరస

మన మహాత్ముడు

స్వాతంత్ర్యం ఎవరి పుణ్యం?

కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన ఫణిభూషణ్ చక్రవర్తికి చాలాకాలంగా ఒక సందేహం ఉండేది. ఆయననే ఏమిటి? దేశంలో చాలామంది మేధావులనూ అదే సందేహం పదేపదే వేధించేది.

(కొంతమందినైనా ఇంకా వేధిస్తున్నది.)

అదేమిటంటే... తెల్లవాళ్లు ఎంత మెల్లిగా ఇండియాను ఆక్రమించారో, అంత వేగంగా చివరి ఘట్టంలో పలాయనం చిత్తగించారు. మోసాలు చేసి, వేషాలు వేసి అక్రమంగా కబ్జాచేసిన భారతదేశంపై పెత్తనాన్ని ఎలాగైనా, ఏమిచేసైనానిలుపుకోవాలని నూటయాభై ఏళ్లు నానా తంటాలు పడ్డవాళ్ళు... ఎన్ని ప్రతిఘటనలు వచ్చినా, ఎన్ని విప్లవాలు లేచినా, భీకర ప్రజాసంగ్రామాలు, విముక్తి ఉద్యమాలు ఎన్ని జరిగినా పట్టువదలక సర్వశక్తులూ ఒడ్డి దేశాన్ని అంటిపెట్టుకు కూచున్న వాళ్లు... చివరిదశలో కొంపలేవో మునుగుతున్నట్టు కంగారుపడి, ఎంత వేగిరం ఇక్కడి నుంచి బయటపడదామా అని తొందరపడి, అందరినీ తొందరబెట్టి, ఆదరాబాదరాగా జెండా పీక్కుని పోయారు. ఎందువల్ల? సంవత్సరంలో పూర్ణ స్వరాజ్యం సాధిస్తానని గాంధీ మహాత్ముడు శపథం చేశాక పావు శతాబ్దం గడిచినా అజాపజాలేని స్వాతంత్ర్యం, ఆ తరువాత ఊహించని రీతిలో వడివడిగా దూసుకొచ్చి, మనం ఒడిపట్టకుండానే ఒళ్లో వాలింది. ఎందుకని? అంత అర్జంటుగా ఇండియా నుంచి వైదొలగటానికి బ్రిటిష్ పాలకులను తొందరబెట్టిన బలిష్ఠ హేతువేది? రవి అస్తమించని సామ్రాజ్యాన్ని ఏకచ్ఛత్రంగా ఏలిన అంతటి గండరగండలను హడలగొట్టిన మహాశక్తి ఏమిటి?

ఇదీ శంక. ఎవరికి తోచినట్టు వారు ఊహాగానాలు చేయటమే తప్ప వాస్తవమేమిటో ఎవరూ ఎరగరు. సరైన సమాధానం అప్పట్లో బ్రిటిష్ ప్రభుత్వాన్ని నడిపినవారు మాత్రమే చెప్పగలరు. కాని చెప్పరు. బహిరంగంగా కాక జనాంతికంగా వారిని అడిగే అవకాశం ఎప్పుడో ఎవరికో తప్ప రాదు.

అదృష్టవశాత్తు ఆ అరుదైన అవకాశం చక్రవర్తికి కలిగింది. చర్చిల్‌లాంటి అపోజిషన్ అతిరథ మహారథులెంతగా వ్యతిరేకించినా లెక్కచెయ్యక 1947 ఆగస్టులో ఇండియాకు స్వాతంత్ర్యం ఇవ్వాలని బ్రిటిష్ ప్రభుత్వం నిశ్చయించినప్పుడు ప్రధానమంత్రిగా ఉన్నది క్లెమెంట్ అట్లీ. తొమ్మిదేళ్ల తరవాత ఆయన భారతదేశంలో పర్యటించాడు. ఆ టూరులో రెండు రోజులు కలకత్తా రాజ్‌భవన్‌లో బసచేశాడు. అప్పుడు (1956లో) పశ్చిమ బెంగాల్ గవర్నరుగా వ్యవహరిస్తున్నది ఎవరో కాదు. చక్రవర్తే! అట్లీతో సావకాశంగా మాట్లాడినప్పుడు తాను ఏమి అడిగిందీ, అందుకు ఆయన ఏ జవాబు చెప్పిందీ చక్రవర్తి మాటల్లోనే వినండి:

I put it straight to Lord Attlee like this. "The Quit India Movement of Gandhi practically died out long before 1947 and there was nothing in Indian situation at that time which made it necessary for the British to leave India in a hurry. Why did they then do so? In reply Attlee cited several reasons, the most important of which were the activities of Netaji Subhas Chandra Bose which weakened the very foundation of the attachment of the Indian land and naval forces to the British Government. Towards the end I asked Lord Attlee about the extent to which the British decision to Quit India was influenced by Gandhi's activities. On hearing this question, Attlee's lips widended in a smile of disdain and he uttered slowly, putting emphasis on each single letter "Mi-ni-mal."

[*History of the Freedom Movement in India* - R.C. Majumdar, Vol.III P.610]

(లార్డ్ అట్లీని నేను నేరుగా ఇలా అడిగాను: 'గాంధీ క్విటిండియా ఉద్యమం 1947కు చాలాముందే వాస్తవానికి అంతరించిపోయింది. తొందరగా ఇండియాను విడిచి వెళ్ళాల్సిన అవసరం బ్రిటిష్ వారికి అప్పటి భారత పరిస్థితిలో ఏదీ లేదు కదా? మరి ఎందుకలా చేశారు? దీనికి జవాబుగా అట్లీ అనేక కారణాలను పేర్కొన్నాడు. అన్నిటిలోకీ ముఖ్యమైనది నేతాజీ సుభాష్ చంద్రబోస్ కార్యకలాపాలట. భారతీయ సేనకూ, నౌకాదళానికీ బ్రిటిష్ ప్రభుత్వంతో అంతదాకా ఉన్న అనుబంధపు పునాదినే అవి బలహీనపరిచాయట. మరి ఇండియా నుంచి నిష్క్రమించాలన్న బ్రిటిష నిర్ణయాన్ని గాంధీ కార్యకలాపాలు ఎంతవరకూ ప్రభావితం చేశాయని నేను చివర్లో అట్లీని అడిగాను. సమాధానంగా ఆయన పెదవులు ఏవగింపులాంటి నవ్వుతో విచ్చుకున్నాయి. 'చాలా తక్కువ' అని ఒక్కో అక్షరాన్నీ ఒత్తి పలికాడు!)

ఇది వింటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. అట్లీ మాటలు ఒక పట్టాన నమ్మబుద్ధికాదు. భారతదేశానికి స్వాతంత్ర్యం గాంధీ పెట్టిన భిక్ష అని ఇప్పటిదాకా మనం వింటూ వచ్చాం.

గాంధీ మహాత్ముడు దేవుడిలా వచ్చి, నిద్రాణమైన జాతిని మేల్కొలిపి, అహింసాయుతంగా దీర్ఘకాలం అద్భుత సమరం సాగించిన పర్యవసానంగానే, తెల్లవాడు బెదిరి మన స్వాతంత్ర్యం మనకిచ్చి తట్టాబుట్టా సర్దుకుపోయాడని మన పెద్దలు మనకు చెబుతూ వచ్చారు. దీనికి విరుద్ధంగా – తెల్లవాళ్లు పోవటంలో గాంధీ ప్రభావం ఏమీ లేదని అట్లీ అన్నాడంటే...? మనకు పగవాడు కదా;అతగాడు అట్లే అంటాడులే అని మనకు తేలిగ్గా తోసెయ్యబుద్ధవుతుంది. దుర్నిరీక్ష్యమైన బ్రిటిషు మహాసామ్రాజ్యాన్ని సత్యాగ్రహ వజ్రాయుధంతో మట్టి కరిపించి, దేశం నుంచి తరిమికొట్టిన మహాత్ముడి గొప్పతనాన్ని ఒప్పుకుందుకు మనసొప్పకే తెల్లదొర ఆయన ప్రాధాన్యాన్ని చులకన చేసి అక్కసు వెళ్లగక్కాడని నమ్మాలనిపిస్తుంది.

అదీ కష్టమే. ఎందుకంటే – దేశానికి స్వాతంత్ర్యం రావటంలో గాంధీ ప్రభావం పరిమితమన్నది అట్లీ ఒక్కడే కాదు; ... భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను సంకలనం చేయడానికి నెహ్రూ నాయకత్వంలోని స్వతంత్ర భారత తొలి ప్రభుత్వం ఏరి కోరి ఎంపిక చేసిన సుప్రసిద్ధ చరిత్రకారుడు ఆర్.సి.మజుందార్ కూడా అదేమాట అన్నాడు! అట్లీ కంటే తీవ్రంగా!! అదీ చిత్తగించండి:

"...Gandhi was lacking in both political wisdom and political strategy... and far from being infalliable, committed serious blunders, one after another, in pursuit of some Utopian ideals and methods, which had no basis in reality... it would be a travesty of truth to give him the sole credit for the freedom of India, and sheer nonsense to look upon Satyagraha... as the unique weapon by which it was achieved."

**[*History of the Freedom Movement in India*
- R.C. Majumdar, Vol.III PP.XVIII, XXII]**

(గాంధీకి రాజకీయ విజ్ఞత, రాజకీయ వ్యూహ నైపుణ్యం రెండూ లేవు... ఆయన ఎప్పుడూ తప్పటడుగు వేయని వాడేమీకాదు. వాస్తవంతో పొంతన లేని ఊహాజనితమైన ఆదర్శాలను, పద్ధతులను అనుసరించి ఒకటి తరవాత ఒకటిగా దారుణమైన తప్పిదాలే చేశాడు... భారత స్వాతంత్ర్యానికి ఘనత అంతా ఆయనదేననటం సత్యదూరం. స్వాతంత్ర్యాన్ని సాధించిన విలక్షణ ఆయుధంగా సత్యాగ్రహాన్ని పరిగణించటం నాన్సెన్స్!)

ఇది చదివితే అయోమయం ఇంకా ఎక్కువవుతుంది. స్వాతంత్ర్యోద్యమ చరిత్రను రచించటానికి భారత ప్రభుత్వం ఎన్నిక చేసిన చరిత్రకారుడే నిజంగా అంతమాట అన్నాడా? ! మరి ప్రభుత్వం వెలువరించిన స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఈ సంగతులేమీ లేవేం? జాతీయోద్యమానికి ప్రాణం, ప్రణవం, సర్వస్వమూ గాంధీయే అయినట్టుగా అధికారిక చరిత్ర ఉద్ఘోషిస్తున్నది కదా? అది ఎలా జరిగింది?

అనుమానం కరక్టే. కానీ అదే జరిగింది. చరిత్ర వక్రీకరణ అనేది కేంద్రాన్ని ఎన్డీయే కాషాయం కమ్మాకే మొదలైందని సోకాల్డ్ సెక్యులరిస్టులు... కాదు;మేము సరిదిద్దిన చరిత్రను మేము పోయాక తిరంగా యుపిఎ వాళ్లు తింగరగా వక్రీకరించారని భాజపేయులు వాదులాడుతుంటారు. నిజానికి వాస్తవాలకు వెల్లవేసి, బుద్ధిపూర్వకంగా చరిత్రను వక్రీకరించే కార్యక్రమాన్ని నవభారత నిర్మాత అనుకునే పండిట్ నెహ్రూగారి ఆదర్శ ప్రభుత్వమే అద్భుతంగా మొదలెట్టింది.

అదో చిత్రమైన కథ.

స్వాతంత్ర్య సంగ్రామ సమగ్ర చరిత్రను తయారు చేయాల్సిన అవసరాన్ని స్వతంత్రం సిద్ధించిన లగాయతు విజ్ఞలోకం నొక్కి చెబుతూ వచ్చింది. అఖండ భారత ఉపఖండంలో అనేక తరాల తరబడి బహురీతుల్లో బహుముఖంగా సాగిన సుదీర్ఘ సంఘర్షణను సంపుటీకరించటం ఒక్క మనిషి వల్ల అయ్యే పనికాదు. ముఖ్యమైన రికార్డులను, పత్రాలను, దేశవ్యాప్తంగా ఉన్న చారిత్రక సాక్ష్యాలను, ఆధారాలను సేకరించటం, వాటిని వింగడించి నిర్దుష్టంగా ప్రామాణిక చరిత్రను రూపొందించటం విశేష వ్యయప్రయాసలతో కూడిన చాలా పెద్ద పని. భారత ప్రభుత్వమే పూనుకుని, కావలసిన నిధులను, తగిన యంత్రాంగాన్ని సమకూర్చి, సమర్థులైన నిపుణులకు ఆ బాధ్యత అప్పగిస్తే తప్ప ఆ బృహత్ కార్యం నెరవేరదు. ఇండియన్ హిస్టారికల్ రికార్డ్సు కమిషన్ (I.H.R.C.) స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ఆ మాటే చెప్పింది. సాధికారిక జాతీయోద్యమ చరిత్ర రచనకు విషయసేకరణ ఖర్చుల నిమిత్తం మొదట 25వేల రూపాయలు మంజూరు చేయాలని 1948 ఫిబ్రవరిలోజైపూర్‌లో జరిపిన మహాసభలో భారత ప్రభుత్వాన్ని కమిషను కోరింది.

1948లో పాతికవేలంటే ఇప్పటి పాతిక కోట్లతో సమానమే. కాని బానిస సంకెళ్లను తెంచుకుని స్వరాజ్యం సాధించేందుకు జాతి పడిన కష్టాలను, చేసిన త్యాగాలను, సాగించిన పోరాటాలను ప్రామాణికంగా క్రోడీకరించి భావితరాలకు స్ఫూర్తిదాయకంగా భద్రపరిచే అత్యావశ్యక బాధ్యతతో పోల్చితే దేశాన్నేలే సర్కారుకు అదేమంత పెద్దమొత్తం కాదు. కమిషన్ కోరినట్టు చారిత్రక సామగ్రి సేకరణ నిమిత్తం కేంద్రీకృత వ్యవస్థను నెలకొల్పి, ప్రాంతీయ కార్యాలయాలను పెట్టటమూ ప్రభుత్వానికి తలచుకుంటే కష్టం కాదు. మరి... నెహ్రూ పండితుడంతటివాడు ప్రధాని.. మౌలానాఅబుల్ కలాం ఆజాద్ అంతటివాడు విద్యామంత్రి అయిన స్వతంత్ర భారత ప్రభుత్వం ఏం చేసింది? "ప్రస్తుత ఆర్థిక ఇబ్బందులవల్ల ఈ కార్యం నిమిత్తం పెద్ద మొత్తాలను కేటాయించటం ఎంతమాత్రం సాధ్యపడదు" అని కరాఖండిగా తెగేసి చెప్పింది. అంతటితో ఊరుకోక "విద్వాంసులూ, విజ్ఞులతో కూడిన సొసైటీల స్వచ్ఛంద యత్నాల ద్వారానే ఈ పని ముందుకు సాగవలసి ఉంటుందని" ఉచిత సలహా కూడా ఇచ్చింది.

దానిమీద గొడవయింది. తలపెట్టిన బృహత్ కార్యాన్ని ఢిల్లీ యూనివర్సిటీ ద్వారానో, ఇంకో సంస్థ ద్వారానో జరిపించాలని ప్రయత్నాలు చేసి, ఏదీ కుదరకపోయేసరికి, విధి లేక కేంద్ర విద్యామంత్రిత్వశాఖే స్వాతంత్ర్యోద్యమ చరిత్ర సంకలనానికి 9 మందితో సంపాదక మండలిని 1952 డిసెంబరు 30న ఏర్పాటు చేసింది. సమాచార సేకరణను పర్యవేక్షించి, అందిన సామగ్రిని సరిచూసి, చరిత్ర ముసాయిదాను తయారుచేయటానికి ప్రత్యేకంగా ఒక డైరెక్టర్ ఉండాలని నిర్ణయించి ఎడిటర్ల బోర్డులో మెంబరైన డాక్టర్ **ఆర్.సి.మజుందార్**కు ఆ బాధ్యత అప్పగించారు. బోర్డు మూడేళ్లలో పని ముగించాలనీ, రెండేళ్లలో సమాచారాన్ని సేకరించి చిత్తుప్రతి తయారుచేసి మూడో ఏటికల్లా తుది ముసాయిదాను అచ్చుకు సిద్ధం చేయాలనీ టైమ్‌టేబుల్ కూడా పెట్టారు.

ఆ ప్రకారమే మజుందార్ నానా అవస్థా పడి 1954 సంవత్సరానికి తొలి సంపుటం చిత్తుప్రతి తయారుచేశాడు. మూడురోజులపాటు సాకల్యంగా చర్చించి సంపాదక మండలి దానిని స్థూలంగా ఆమోదించింది. తరువాత కొద్ది వారాలకు (1955 మార్చి 22న) ఈ విషయం పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చింది. "1884 సంవత్సరం వరకూ నడిచిన ప్రథమ దశకు సంబంధించిన చరిత్ర ముసాయిదా తయారైంది. 1885 నుంచి 1919 మధ్యకాలపు రెండో దశకు సంబంధించిన ముసాయిదా పని నడుస్తున్నది" అని పార్లమెంటరీ సెక్రటరీ డాక్టర్ కె.ఎల్.శ్రీమాలి లోక్‌సభలో జవాబు చెప్పారు. దానిపై "స్వాతంత్రోద్యమపు మిగతా అధ్యాయాలు ఎప్పటికి పూర్తవుతాయి" అని బెజవాడ గోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. "మొత్తం రిపోర్టును 1956 చివరికల్లా తయారుచేయగలమని అనుకుంటున్నాం" అని శ్రీమాలి బదులిచ్చారు.

దాని మీద మళ్లీ ఒక అనుబంధ ప్రశ్న. "ఇంతకీ మొదటి సంపుటం ప్రచురణకోసం ఎప్పుడు ఖరారవుతుంది" అని డాక్టర్ రఘువీర్‌సింగ్ అడిగారు. "చెప్పాను కదా! అది దాదాపు ఖరారైనట్టే. అవసరమైతే అక్కడక్కడ సవరిస్తాం తప్ప మొత్తంగా తిరగరాసేది లేదు–" అని శ్రీమాలి సమాధానం.

దీన్నిబట్టి ఏమని అర్థమవుతుంది? డాక్టర్ ఆర్.సి.మజుందార్ చేత తయారుచేయించి, సంపాదక మండలి ఆమోదించిన చరిత్ర ముసాయిదాను ప్రభుత్వం అంగీకరించింది, పని పూర్తిచేయటానికి కనీసం 1956 చివరిదాకా బోర్డును కొనసాగనివ్వదలిచింది – అనేకదా?

కానీ– ఒకవైపు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పోరాట చరిత్రను తయారుచేసే పని నడుస్తుండగానే ఇంకో వంక అదే ప్రభుత్వంలోఅదే పనిని నీరుగార్చే కార్యక్రమం చాపకింద నీరులా సాగింది. మజుందార్ రాసిన చిత్తుప్రతిని ఎస్.ఎన్.సేన్, ఎం.హబీబ్, కె.ఎ.నీలకంఠ శాస్త్రి వంటి చరిత్ర ప్రవీణులతో కూడిన ఎడిటర్ల బోర్డు చూసి స్థూలంగా

ఆమోదిస్తేనేమి? ఆ చిత్తుప్రతిలోని విషయాలు అధికార వర్గాన్ని, కొందరు నాయకులను, ఇబ్బంది పెడతాయని, అవి బయటికొస్తే ప్రమాదమని స్వామిభక్తి పరాయణులైన కొంతమంది సర్కారీ మేధావులు హెచ్చరించారు. ప్రభుత్వ పెద్దలూ అప్రమత్తమయ్యారు. తెర వెనుక ఏమి జరిగిందో తెలియదు. పార్లమెంటులో అధికారిక ప్రకటన వెలువడ్డ వారానికే సర్కారువైఖరి అనూహ్యంగా మారింది. పార్లమెంటుకు చెప్పినట్టు కనీసం 1956 వరకైనా గడువివ్వకుండా మూడేళ్లు నిండగానే 1955 డిసెంబర్ 31న ఎడిటర్ల బోర్డును ప్రభుత్వం రద్దుచేసింది. ఆ తరువాత సంవత్సరం పాటు గమ్మునుండి, డాక్టర్ **తారాచంద్** అనే విశ్వాసపాత్రుడికి స్వాతంత్ర్య పోరాట అధికారిక చరిత్రను గ్రంథస్థం చేసే బాధ్యతను కొత్తగా అప్పగించింది. ఏలినవారి ఇంగితమెరిగి, అప్రియ సత్యాలకు, కఠోర వాస్తవాలకు తగురీతిలో సోకుచేసి భారీ వ్యయంతో ఆయన రూపొందించిన నాలుగు సంపుటాల "History of Freedom Movement in India" గ్రంథరాజమే సాధికారిక ప్రామాణిక చరిత్ర కింద నేటికీ చలామణి అవుతున్నది.

రాజ్యమేలేవారు అధికారదర్పంతో మజుందార్ ముసాయిదాను బుట్టదాఖలు చేసి, ఆయన పదవిని ఊడగొట్టినా నిజాలు వెల్లడించాలన్న ఆయన తపనను అణచలేక పోయారు. అప్పటిదాకా విశేష శ్రమతో సేకరించిన విలువైన సమాచార సామగ్రి అందు బాటులో లేకున్నా, విషయ సేకరణ ప్రభుత్వపరంగా జరిగితే ఉండే సౌలభ్యాలకు, సౌకర్యాలకు దూరమైనా... పరిమిత వనరులతో, పట్టుదలే పెట్టుబడిగా పండు వయసులో పరిశ్రమించి భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రను మూడు సంపుటాలుగా ఆయన వెలువరించారు. వాటిలోనివే ఇంతకుముందు ఉదాహరించిన వాక్యాలు.

ఆర్.సి.మజుందార్ అంతర్జాతీయ ఖ్యాతిగడించిన ఎంత గొప్ప చరిత్రకారుడైనా సర్వజ్ఞుడేమీ కాదు. ఆయన చెప్పిందంతా అక్షర సత్యమని నమ్మక్కర్లేదు. స్వాతంత్ర్యోద్యమ రచనకు తొలుత ఆయనను నియోగించిన ప్రభుత్వమే అర్ధాంతరంగా ఆయనను ఆపి, వేరొకరికి ఆ పని పురమాయించింది. ఆ నిర్ణయం తీసుకున్నది కూడా నెహ్రూ, ఆజాద్ వంటి మహామహులున్న ప్రభుత్వం. కాబట్టి అసలు లోపం మజుందార్‌లోనే ఉండి ఉంటుందని కాసేపు అనుకుందాం. పరాయివాడు, పగవాడు కాబట్టి అట్లీ మాటనూ నమ్మవద్దు. జాతికి ఆరాధ్యులైన మహానాయకులకు కంటగింపయిన కారణంచేత మజుందార్ చెప్పేదీ విశ్వసించవద్దు. మనకు నూటికి నూరుపాళ్లు నమ్మకం ఉన్న మహనీయుల మాటలనూ, తిరుగులేని సాక్ష్యాలనూ, అసందిగ్ధమైన డాక్యుమెంటరీ రుజువులనే ప్రామాణికంగా తీసుకుందాం. మహాత్ముడు తన గురించి తాను చెప్పుకున్నదీ, స్వహస్తాలతో రాసిందీ, వివిధ సందర్భాల్లో ప్రజలకు ప్రబోధించిందీ మాత్రమే పరమ ప్రమాణంగా పరిగణిద్దాం. మహాత్ముడు సర్వోత్కృష్టంగా పరిగణించిన సత్యాన్నే కాగడాగా తీసుకుని, భారత స్వాతంత్ర్యోద్యమంపై, అందులో మన మహాత్ముడి పాత్రపై ఇక సత్యాన్వేషణ సాగిద్దాం.

శిలువలేని ఏసు

***ఇ**రవయ్యో శతాబ్దపు మహామనీషి ఎవరు? కడచిన శతాబ్దంలో భూమిమీద నడయాడిన వివిధ దేశాల, వివిధ రంగాల మహామహులనూ, ప్రపంచం మీద వారి ప్రభావాలనూ బేరీజు వేసిన మీదట 'టైమ్' మాగజిన్ ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను 'పర్సన్ ఆఫ్ ది సెంచరీ' (శతాబ్దపు మహావ్యక్తి)గా ప్రకటించింది. రెండో స్థానంలో మోహన్‌దాస్ కరంచంద్ గాంధీని నిలిపింది.*

ఐన్‌స్టీన్‌ని అడిగితే మాత్రం ఈ సెలక్షను తప్పు; నాకంటే గాంధీయే గొప్పవాడు అంటాడు. ఏదో మొహమాటానికి కాదు. Generations to come will scarce believe that such a one as this ever in flesh and blood walked upon this earth *(ఇంతటి మహాపురుషుడు మనలాగే రక్తమాంసాలతో నిజంగానే ఈ భూమిమీద నడిచాడంటే వచ్చే తరాల వాళ్లు నమ్మరు.)* అని ఐన్‌స్టీన్ తన జీవితకాలంలో తానే ఆరాధనాపూర్వకంగా చెప్పాడు. గాంధీ ఈ శతాబ్దపు మహామనీషి అని– 1939లో గాంధీజీ 70వ జన్మదిన సందర్భంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సంకలనం చేసిన ప్రత్యేక సంపుటికి వ్రాసిన వ్యాసంలో ఐన్‌స్టీన్ జోహారులర్పించాడు కూడా.

నోబెల్ శాంతి బహుమతికి నామినేషన్లలో గాంధీ పేరు 1937 నుంచి ప్రతి ఏడూ పరిశీలనకు వచ్చింది. ఆ ప్రైజుకు గాంధీ కంటే యోగ్యుడు లేడు; ఈ సంవత్సరం ఆయనకు ఖాయం– అని అభిమానులు ప్రతి ఏటా అనుకునేవారు. ప్రతిసారీ గాంధీ పేరు అనూహ్యంగా తప్పిపోయేది. నోబెల్ ప్రైజు వెనుక మతలబులపై ఉన్న ఆక్షేపణల్లో ఇది ప్రధానమైనది. ఔను– గాంధీకి నోబెల్ ఇవ్వకపోవటం తప్పేనని ఆ బహుమతులను ఎంపిక చేసే నార్వేజియన్ కమిటీ ప్రముఖుడొకరు ఒప్పుకున్నారు కూడా. ఐనా– నోబెల్ ప్రైజు రాకపోతే మాత్రమేమి? నార్వే వాళ్లకంటే బాగా ప్రపంచానికి ప్రాతినిధ్యంవహించే ఐక్యరాజ్యసమితే గాంధీ గొప్పతనాన్ని ఆలస్యంగా (అదీ పాపం సోనియాగాంధీ గారు పూనుకుని వారికీ వీరికీ చెప్పి గట్టి ఒత్తిడి తెచ్చిన మీదట) గుర్తించి, గాంధీ జన్మదినమైన అక్టోబరు 2ను అంతర్జాతీయ అహింసా దినంగా ఈ మధ్యే ప్రకటించింది.

లండన్‌లో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు హాజరై తిరిగివస్తూ కొద్దిరోజులు ఇటలీలో ఆగినప్పుడు గాంధీజీ స్వయంగా వాటికన్ వెళ్లి ఒకటికి రెండుసార్లు అర్థించినా పోప్ పియస్ XI ఆయనకు ఇంటర్వ్యూ ఇవ్వలేదు. కనీసం చూడనైనా లేదు. Gandhi quits Rome; Fails to see pope *(పోప్ దర్శనం కాకుండానే రోమ్ వదిలిన గాంధీ)* అన్న శీర్షికతో న్యూయార్క్ టైమ్స్ 1931 డిసెంబరు 14న ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించింది. కాని – చిత్రం! అర్ధ శతాబ్దం తరువాత అదే వాటికన్ రోమన్ కాథలిక్ చర్చికి పీఠాధిపత్యం వహించిన పోప్ జాన్‌పాల్ II పది రోజుల పర్యటనకు ఇండియా వచ్చినపుడు రాజ్‌ఘాట్‌ను దర్శించి, మహాత్ముడి సమాధి మీద పుష్పమాలనుంచి గాంధిని "అహింసా దూత"గా, "మానవాళికి మహావీరుడు"గా ఘన నివాళులర్పించారు.

పోప్ జాన్‌పాల్‌గారికి గాంధీ– అహింసను బోధించటానికి దేవుడు పంపిన దూతగానే కనిపించాడు. ఎందరో క్రైస్తవ మతప్రచారకులు, పాశ్చాత్య మేధావులు ఆయనలో ఏకంగా ఏసుక్రీస్తునే చూశారు. మొట్టమొదట గాంధీ జీవిత చరిత్ర వ్రాసిన బ్రిటిషు బాప్టిస్టు మత ప్రచారకుడు రివరెండ్ Joseph Doke "మన భారతీయ మిత్రుడు మామూలు మానవులకంటే ఉన్నతమైన ఉపరితలంలో జీవిస్తాడు. మేరీ కన్య లాగే ఆయన చర్యలూ వింత గొలుపుతాయి. తరచుగా అపోహలకు గురవుతాయి. ఆయన గురించి తెలియనివాళ్లు ఆయనకు దురుద్దేశాలను ఆపాదిస్తారు. బాగా ఎరిగినవాళ్లు ఆయన సన్నిధిలో తమ అలసత్వాన్ని గ్రహించి సిగ్గుపడతారు" అని వర్ణించాడు. ఇక అమెరికాలో లిబరల్ ప్రొటెస్టంటిజానికి ప్రోదిచేసిన పాస్టరు John Haynes Holmes 1921లో న్యూయార్క్ నగరంలో చేసిన ప్రఖ్యాత ప్రవచనంలో "నేటి మానవులందరిలోకి మహోన్నతుడు లెనిన్ కాదు; రామెన్ రాలాన్ (Romain Rolland) కాదు... మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అనే భారతీయ ఉద్యమకారుడు" అంటూ ఇంకా ఇలా చెప్పాడు:

"లెనిన్‌ను తలిస్తే నాకు నెపోలియన్ గుర్తొస్తాడు. రామెన్ రాలాన్‌ను స్మరిస్తే నాకు టాల్‌స్టోయ్ స్ఫురిస్తాడు. అలాగే గాంధీని తలచుకుంటే నాకు ఏసుక్రీస్తు గుర్తుకొస్తాడు. జీసస్ లాగే ఆయన తన బతుకు బతుకుతాడు. తన మాట మాట్లాడుతాడు. జీసస్ లాగే బాధలు పడతాడు. పోరాటం సాగిస్తాడు. ఏదో ఒకరోజు భూమి మీద తన రాజ్యం కోసం మహోదాత్తంగా మరణిస్తాడు."

క్రైస్తవ మత ప్రచారకుడు కాబట్టి పాస్టర్ హోమ్స్‌కు శాంతి, ప్రేమలను ప్రబోధించిన గాంధీలో క్రీస్తు అంశ కనపడటంలో ఆశ్చర్యం లేదు. విశేషమేమిటంటే ప్రపంచ ప్రఖ్యాత మహామేధావి రామెన్ రాలాన్ (Romain Rolland) కంటికి కూడా గాంధీ శిలువ లేని ఏసుగానే పొడగట్టాడు.

"చల్లని చూపు, నల్లని కళ్లు, పీలకాయం, పలచని మోము, పెద్దచెవులు. తెల్లటి ముతక కొల్లాయి కడతాడు. వట్టి కాళ్లతో నడుస్తాడు. తినేది కొంచెం అన్నం; కాసిని

పండ్లు. తాగేది కేవలం నీరు. నేల మీద పడక. విశ్రమించేది తక్కువ. ఎప్పుడూ పని... పని! చూడగానే ఎవరికైనా అనిపించేది ఆయన మూర్తికట్టిన క్షమ. అవ్యాజమైన ప్రేమ - అని. పసివాడిలా నిష్కల్మషుడు. విరోధులతో సైతం మర్యాదగా, మృదువుగా మాట్లాడే నెమ్మదస్తుడు. నిష్కలంకమైన నిజాయితీపరుడు. ఏదైనా గట్టిగా చెప్పటానికి బిడియ పడేంతటి వినయశీలి. ఐనా ఆయనది ఎవరికీ, దేనికీ లొంగని అజేయమైన ఆత్మశక్తి. ఎక్కడా రాజీపడడు. తప్పును దాచుకోవాలని ఎన్నడూ చూడడు. లౌక్యం ఆయనకు తెలియదు. గుంపులంటే భయం. ఒంటరిగా ధ్యానిస్తూ తన "లోపలి చిన్న గొంతుక"ను వినటం ఆయనకిష్టం. ముప్పై కోట్ల ప్రజలను తిరుగుబాటుకు పురికొల్పినవాడు, బ్రిటిషు సామ్రాజ్యపు పునాదులను ఊపేసినవాడు, రెండువేల సంవత్సరాల మానవ రాజకీయ చరిత్రలోకెల్లా శక్తివంతమైన ఉద్యమాన్ని నడిపించినవాడు... ఇదిగో ఈ మానవుడే."

- అని కళ్లముందు బొమ్మకట్టేలా మొదలుపెట్టి. "ఆత్మార్పణ ద్వారానే శాంతికి తోవ. ఇదే గాంధి బోధ. ఆయనకు శిలువ ఒకటే తక్కువ... ..." అని చరితార్థమైన తన Mahatma Gandhi గ్రంథాన్ని ముగిస్తాడు Romain Rolland.

ప్రపంచంలో ఖ్యాతికెక్కిన మహామేధావులు చాలామంది ఉన్నా రోలాన్ కోవ వేరు. 1914-18 మహాయుద్ధపు మారణ హోమాన్ని నిశితంగా గర్హించి, విద్వల్లోకానికి స్ఫూర్తినిచ్చి, ప్రపంచపు మనస్సాక్షిగా వెలుగొందిన ఫ్రెంచి తత్వవేత్త ఆయన. అంతటి మహాజ్ఞాని, నోబెల్ బహుమతి గ్రహీత ఆమోదించి, అభిమానించిన మహాత్ముడు కావటంతో అంతర్జాతీయ విజ్ఞ సమాజం గాంధీ శక్తిని సాదరంగా స్వాగతించింది. రాలాన్ గ్రంథం అన్ని దేశ భాషల్లోకి తర్జుమా అయి, ప్రపంచ ప్రజాభిప్రాయంపై గొప్ప ప్రభావం చూపింది.

చాలామందికి తెలియనిది ఏమిటంటే 1923లో ఈ గ్రంథం ప్రచురించేనాటికి రామెన్ రాలాన్ గాంధీని చూడనే లేదు. ఆయన జన్మలో ఇండియాకు రాలేదు. ఇక్కడి స్థితిగతులతో, ఆచార వ్యవహారాలతో పరిచయం లేని విదేశీయుడవటంవల్ల ఆ పుస్తకంలో చాలా తప్పులు దొర్లాయి. (ఆ తప్పుల్ని సరిచేయటానికే తాను 'ఆత్మకథ'కు పూనుకోవలసి వచ్చిందని గాంధీజీ చమత్కరించారు కూడా.)

ఇండియా వెలుపలి ప్రపంచానికి గాంధీ గొప్పదనాన్ని మొట్టమొదట ప్రముఖంగా తెలియజెప్పింది రాలాన్ కాగా యావత్ప్రపంచంలోగాంధీని బ్రహ్మాండంగా పాప్యులర్ చేసినవాడు సర్ రిచార్డ్ అటెన్‌బరో. 20 ఏళ్లు కష్టపడి, 22 మిలియన్ డాలర్లు (అందులో మూడోవంతు ఇందిరాగాంధీ ప్రభుత్వం భరించింది) ఖర్చుపెట్టి 1982లో ఆయన తీసిన 'గాంధీ' సినిమా సూపర్ హిట్ అయి ప్రపంచాన్ని ముఖ్యంగా పాశ్చాత్య సమాజాన్ని ఒక్క ఊపు ఊపింది.

గాంధీజీ 1919 నుంచీ భారత జన జీవితంపై ఎనలేని ప్రభావం చూపారు. కోట్లాది ప్రజలు ఆయనను ఆరాధ్య దైవంగా, అవతార పురుషునిగా తలిచారు. కొలిచారు. ఐనా 1980ల వరకూ ఆయన మీద చెప్పుకోదగ్గ సినిమా ఏదీ రాకపోవటం గమనార్హం. చలనచిత్ర కళారంగంలో కాకలుతీరిన మహా దర్శకులు, మహానటులు దేశంలో ఎందరో ఉన్నా గాంధీ మీద సినిమా తీయాలన్న ఆలోచన ఎవరికీ రాలేదు. (1914లో ఎ.కె. చెట్టియార్ అనే ఆయన రాజరత్నం, కన్నాంబ, సూర్యకుమారిలతో "మహాత్మాగాంధీ" అనే సినిమాను తన దర్శకత్వంలో తానే నిర్మించారని విన్నాను. దాని వివరాలు తెలియలేదు.) 1969లో గాంధీజీ శతజయంతి అధికారిక వేడుకల్లో భాగంగా Mahatma సినిమా రాకపోలేదు. 33 రీళ్లతో ఏకంగా ఐదు గంటలు నడిచే ఆ చిత్రం నిడివి భారీ అయినా, జనం మీద పెద్దగా ప్రభావం చూపలేదు. 1982 **గాంధీ** అలా కాదు. అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో జనం వీడియో క్యాసెట్లు కొనుక్కుని ఆ సినిమాను ఇళ్లలో వేసుకుని పదే పదే చూశారు. అమెరికన్ హైస్కూళ్లు, మిడిల్ స్కూళ్లలో శాంతి, అహింసల ప్రస్తావన వచ్చినప్పుడు టీచర్లు ఆ సినిమాను తరచూ ప్రస్తావించేవారు. కొన్ని క్రిస్టియన్ సంస్థలైతే బైబిల్ క్లాసుల్లో **గాంధీ** సినిమా చూపేవారు. (గాంధీ పుట్టిన దేశంలో కూడా ఇవాళ గాంధీ అంటే చాలామందికి మోహన్‌దాస్ గాంధీ కాక... బెన్ కింగ్‌స్లేనే గుర్తొస్తాడు.)

మన మహా నాయకుడికి అంతటి ప్రపంచ ప్రఖ్యాతి రావటం మనకు ఆనందమే. కాని లూయీఫిషర్ అనే విదేశీయుడు వ్రాసిన గ్రంథం ఆధారంగా అటెన్‌బరో అనే విదేశీయుడు తీసిన సినిమా చూసి అందులో చిత్రించిన గాంధీయే అసలు గాంధీ అనుకోవటమూ పొరపాటే. గాంధీ జీవితం, గాంధీ తత్వం ఒక పట్టాన అంతుబట్టేవి కాదు. ఆయన బ్రహ్మపదార్థం లాంటివాడు. ఒక్కొక్కరికి ఒక్కోలా స్ఫురిస్తాడు. గాంధీ వైరుధ్యాల ముద్ద. వివాదాల పుట్ట. ఆయనను దేవుడిలా తలిచి నెత్తిన పెట్టుకుని పూజించిన వారు కోట్ల సంఖ్యలో ఉన్నట్టే... ఆయన జీవిత కాలంలోనే ఆయన పోకడను, ఆయన అనుసరించిన విధానాలను, చేసిన నిర్ణయాలను అసహ్యించుకున్నవారు కోట్లు కాకపోతే కనీసం లక్షల్లోనైనా ఉంటారు. హిమాలయాలంతటి కీర్తి శిఖరాలను అందుకున్నట్టే హిమాలయ స్థాయిలో ఘోర తప్పిదాలూ ఆయన చేశారు. చేశానని ఆయనే స్వయంగా చెప్పుకున్నారు. జగతికి స్ఫూర్తినిచ్చిన ఎన్నో వెలుగు పుంజాలున్నట్టే గాంధీలో ఆయన ఎంతమాత్రం దాచుకోని బలహీనతల చీకటి కోణాలూ ఉన్నాయి. వెలుగులూ చీకట్లూ కలిస్తేనే గాంధీ. లెక్కలేనన్ని ఎగుడుదిగుళ్ల సంక్లిష్ట వ్యక్తిత్వాన్ని చదునుచేసి, నీడలను తీసేసి, వెలుగును మాత్రమే మిరుమిట్లు గొలిపేలా నింపి, అటెన్‌బరో తీసిన (లేక ఆయనచేత ఇందిరాగాంధి ప్రభుత్వం తీయించిన) సినిమా గాంధీజీని అపర క్రీస్తులా

చూపెట్టి, పాశ్చాత్య ప్రపంచాన్ని సమ్మోహితం చేసి, గాంధీకి ఆయన జీవితకాలంలో లభించనంతటి ఖ్యాతిని, గౌరవాన్ని సమకూర్చి ఉండవచ్చు. కాని ఆ క్రమంలో చారిత్రక యథార్థం, గాంధీ జీవిత వాస్తవం అనేకానేక వక్రీకరణలకు లోనయ్యాయి. ఇది అనుచితమని, పాశ్చాత్య దేశాల్లోనే సంగతి సందర్భాలు ఎరిగిన పలువురు మేధావులు ఆక్షేపించారు. ప్రశంసల వర్షంతోపాటు **'గాంధీ'** మీద విమర్శల జల్లూ కురిసింది. Michael Edwardes అయితే- మామూలు విమర్శనా వ్యాసాలతో తృప్తి చెందక The Myth of Mahatma Gandhi, the British and the Raj పేర **గాంధీ** సినిమాను ఏకుతూ ఏకంగా ఒక గ్రంథమే రాశాడు. మేధావి వర్గాల్లో అదో సంచలనమైంది.

ప్రేమమూర్తిగా, అహింసా ప్రవక్తగా గాంధీకి ఇటీవలి కాలంలో బ్రహ్మాండమైన అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టిన **గాంధీ**లో ఏవో కొన్ని లోపాలుంటేనేమి? సాధారణ ప్రజలకు గాంధీ మహిమను పరిచయం చేయటమే తప్ప ప్రామాణిక చరిత్రను చిత్రించటం అటెన్‌బరో ఉద్దేశం కాదు కదా? విదేశీయుడి గ్రంథం ఆధారంగా పరాయి దేశస్థుడు తీసిన సినిమాలో అక్కడక్కడ అవాస్తవాలుండటం సహజమేకదా? వాటికి పెద్ద ప్రాముఖ్యమెందుకు అనేవారూ ఉంటారు. వారి వాదనా సహేతుకమే. కాని- **'గాంధీ'** మామూలు కమర్షియల్ సినిమా కాదు. భారత ప్రభుత్వ ప్రమేయంతో, భారత ప్రభుత్వ ఆర్థిక సహకారంతో తయారైన ఆ సినిమా ఇతివృత్తం డైరెక్టరు, స్క్రీన్‌ప్లే రైటరు మాత్రమే తయారుచేసింది కాదు. బి.ఆర్.నందా, ప్యారేలాల్, సుశీలానయ్యర్, డి.జి.తెండుల్కర్ వంటి ప్రసిద్ధ గాంధీయులు పరిశీలించాకే, స్వయానా ఇందిరాగాంధి చూసి ఓకే చేశాకే ఆ స్క్రిప్టు ఖరారైంది. మామూలు సినిమాలకు లేని అధికారిక ప్రతిపత్తిని అనధికారంగానైనా సంతరించుకుంది కాబట్టే ఆ సినిమాలో చూపెట్టింది అక్షర సత్యమనీ, అందులో కనపడే గాంధీయే అసలు గాంధీ అని ప్రజాబాహుళ్యం అనుకోవటం సహజమే.

అసలు గాంధీకీ, అధికార వర్గం సృష్టించి, ప్రచారంలో పెట్టిన సూపర్‌మాన్ గాంధీకీ సాధారణంగా మనం ఊహించనంత, నమ్మశక్యం కానంత వ్యత్యాసం ఉంది. ఉదాహరణకు- The Gandhi Nobody knows (ఎవరికీ తెలియని గాంధీ) పేర **'గాంధీ'** సినిమాను దుయ్యబడుతూ వ్రాసిన పత్రికా వ్యాసంలో Richard Grenier ఏమన్నదీ ఆలకించండి:

*The film, moreover, does not give the slightest hint as to Gandhi's attitude toward blacks, and the viewers of "**Gandhi**" would naturally suppose that, since the future Great soul opposed South African discrimination against Indians, he would also appose South Africa discrimination against black people. But*

this is not so. While Gandhi, in South Africa, fought furiously to have Indians recognised as loyal subjects of the British empire, and to have them enjoy the full rights of Englishmen, he had no concern for the blacks whatever. In fact during one of the "Kaffir Wars" he volunteered to organise a brigade of Indians to put down a Zulu rising, and was decorated himself for valor under fire.

[Quoted in 'Gandhi': Behind the Mask of Divinity, G.B.Singh, P.77]

(నల్ల జాతీయుల పట్ల గాంధీ వైఖరి ఏమిటన్నది ఈ సినిమా నలుసంతయినా సూచించదు. దక్షిణాఫ్రికాలో భారతీయులపై జాతివివక్షను కాబోయే మహాత్ముడు ప్రతిఘటించాడు కాబట్టి నల్లజాతీయులపై దక్షిణాఫ్రికా వివక్షను కూడా ఆయన వ్యతిరేకిస్తాడని ప్రేక్షకులు సహజంగా భావిస్తారు. అది నిజం కాదు. బ్రిటిష్ సామ్రాజ్యానికి విధేయులైన పౌరులుగా భారతీయులకు గుర్తింపు తేవటానికి, ఇంగ్లీషు వారితో సమానంగా పూర్తి హక్కులు వారికి సాధించటానికి దక్షిణాఫ్రికాలో భీకరంగా పోరాడిన గాంధీ ఆ దేశపు నల్లవాళ్ల పట్ల ఎటువంటి ఆత్మీయత చూపించలేదు. నిజానికి "కాఫిర్ యుద్ధాలు" ఒక దానిలో జులూ తిరుగుబాటును అణచడానికి భారతీయ బ్రిగేడ్‌ను స్వచ్ఛందంగా ఏర్పరచి, ఆ ప్రతాపానికి గౌరవ పతకాన్ని కూడా అందుకున్నాడు.)

ఇది చదివితే మనకు మతిపోతుంది. విశ్వమానవ శ్రేయస్సుకోసం పరితపించి, సమాజంలో అట్టడుగున ఉన్న పీడిత ప్రజల పక్షాన నిలబడి... దోపిడికి, దుర్ణయానికి, దుర్విచక్షణకు గురైన ఆపన్నులకు న్యాయం చేకూర్చటానికి జీవితాన్ని అంకితం చేసిన విశ్వ మానవుడు గాంధీ ఏమిటి? నల్లవాళ్లను అణచటంలో తెల్లవాళ్ల పక్షాన నిలబడట మేమిటి? దక్షిణాఫ్రికాలో దారుణ జాతి వివక్షకు గురైన భారతీయులకు మానవ హక్కులకోసం సత్యాగ్రహ ధర్మయుద్ధాన్ని సాగించిన మహాత్ముడు అదే దక్షిణాఫ్రికాలో – అదే విధమైన (లేక అంతకంటే క్రూరమైన) జాతి వివక్షను ఎదుర్కొంటున్న అక్కడి భూమి పుత్రుల మీద తానే జాతి వివక్ష చూపడమేమిటి? అంతటి దయామయుడు ఇంత నిర్దయగా జాత్యహంకారిలా వ్యవహరించాడంటే ఎలా నమ్మగలం? ఒక్క **గాంధీ** సినిమా అనే ఏమిటి? మనం చదివిన ఏ చరిత్రలోనూ, మహాత్ముడి గురించి శతాబ్దకాలంలో ఎందరో మహానుభావులు రాసిన ఏ గ్రంథంలోనూ ఈ ఊసు లేదు. అలాంటప్పుడు తెలిసీ తెలియని విదేశీయుడెవడో అక్కసుకొద్దీ రాసిన రాతను నిజమని ఎలా నమ్మగలం?

పాయింటే. నింద వేసిన విదేశీయుడిని అమెరికాలోనే వదిలిపెట్టి మనమే వందేళ్లు వెనక్కి వెళ్లి నిజమేమిటో గమనిద్దాం.

సార్జంట్ మేజర్ గాంధి

***భా**రతదేశాన్ని ఆక్రమించినట్టే తెల్లవాళ్లు దక్షిణాఫ్రికానూ ఆక్రమించారు. భారతీయుల్ని అణచినట్టే ఆఫ్రికన్లనూ అణచారు. మనలాగే వారినీ దౌర్జన్యంగా, దుర్మార్గంగా సర్వస్వం దోచుకుని సర్వనాశనం చేశారు. వెన్నువిరిచే పన్నులతో మనల్ని పెట్టినన్ని బాధలు వారినీ పెట్టారు. జాత్యహంకారపు కండకావరంతో మనలాగే అక్కడి నల్లవారినీ కనీసం మనుషుల్లా చూడకుండా, అడ్డమైన ఆంక్షలతో నానా విధాల కాల్చుకుతిన్నారు.*

అంతులేని ఈ దురంతాలకు ఓరిమి నశించి మనలాగే ఆఫ్రికన్లూ తెల్లరాకాసులపై తిరగబడ్డారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా భారతీయులు సంఘటితమై, విదేశీ వస్తువులను బహిష్కరించి 'స్వదేశీ' ఉద్యమాన్ని మహోగ్రంగా సాగిస్తున్న సమయాన 1906 ఏప్రిల్‌లో దక్షిణాఫ్రికాలోని జులులాండ్‌లో జులుతెగ ఆదివాసులు విధిలేని పరిస్థితుల్లో తిరుగుబాటు చేశారు.

తిరుగుబాటనడమే కాని- కత్తులూ, కటార్లు తీసుకుని వేలూ లక్షల మంది శ్వేతజాతీయుల వెంటపడిందేమీ లేదు. తెల్లవారి పెత్తనపు పునాదులను కదిలించిందీ లేదు. 1887లో తెల్లవారు జులులాండ్‌ను అక్రమంగా కబ్జాచేసి నాటాల్‌లోఅడ్డగోలుగా కలిపేసుకున్నప్పటి నుంచి జులూల్లో అసంతృప్తి ప్రబలింది. ప్రధానంగా వ్యవసాయం చేసుకుని తమ మానాన తాము ప్రశాంతంగా బతికే శాంత స్వభావం వారిది. అయినా వరసగా తమపై సాగుతున్న అన్యాయాలకూ, అత్యాచారాలకూ, జాత్యహంకార పూరితమైన సామాజిక, ఆర్థిక దుర్విధానాలకు తాళలేక, నడమంత్రపు తల పన్నును కట్టేది లేదని, వారు భీష్మించారు. అప్పట్లో మన దేశాన స్వదేశీ ఉద్యమంలాగే జులు తెగవారు పన్ను నిరాకరణ ఉద్యమాన్ని పరిమితంగా మొదలెట్టారు. బలవంతంగా పన్ను వసూలు చేసేందుకు వచ్చిన ఇద్దరు అధికారులతో జులులు కొందరు ఘర్షణపడి ఆవేశంలో చంపేశారు.

అంతే ! ఆ ధిక్కారానికి తెల్లదొరలు తోకతొక్కిన తాచుల్లా బుసలుకొట్టారు. నాటాల్ సర్కారు అధికార బలమంతటినీ నిస్సహాయులైన జులులపై ప్రయోగించి దారుణమైన దమనకాండకు పాల్పడింది. జులు తండాలపైబడి 12 మందిని పట్టుకుని తెగ పెద్దను, చుట్టుపక్కల జనాన్ని పిలిచింది. అందరూ చూస్తుండగా ఫిరంగుల మూతులకు కట్టి మొత్తం 12 మందిని ముక్కలు చేసింది. తిరుగుబాటును ప్రేరేపించినట్టుగా తనకు అనుమానం కలిగినవారికి కనీస విచారణ కూడా లేకుండా మరణశిక్ష వేశాకైనా తెల్లవారి కక్ష చల్లారలేదు. ఆదివాసులు భయవిహ్వలురై దయనీయంగా ఆక్రోశిస్తున్నా జాలి, దయ లేకుండా జనావాసాల మీద పిశాచాల్లా పడి దొరికిన వారినల్లా కొరడాలతో తాట ఊడేట్టు కొట్టారు. కొంచెం నదురుగా కనిపించిన వారినల్లా తిరుగుబాటు నాయకులన్న ముద్రవేసి వందల మంది చూస్తుండగా నడివీధిలో ఉరితీయసాగారు. మానవత్వంగల ప్రతి ఒక్కరికీ తలచుకుంటేనే ఒళ్లు జలదరించే ఆ భయానక దురాగతం తెరపి లేకుండా నెలల తరబడి సాగింది.

అటువంటి అఘాయిత్యాలు ఇండియాలో మన మీదా జరిగాయి. కనీసం మనకు ధైర్యం చెప్పి ముందుండి నడిపించటానికి చెప్పుకోదగ్గ నాయకులైనా ఉన్నారు. ఆఫ్రికన్లకు ఆపాటి భాగ్యమూ లేదు. బలవంతుడైన శత్రువుతో ప్రజలను సమీకరించి సమర్థంగా పోరాడగల జాతీయ నాయకుడంటూ దక్షిణాఫ్రికా మొత్తంలో ఆ కాలాన ఒక్కడూ లేడు. జులు తెగ పెద్ద బంబతా కొద్దిమంది అనుచరులను సమీకరించి కొండకోనల్లో దాగి సాయుధ పోరాటం భీకరంగా సాగిస్తున్నాడు. తనను వెంటాడుతున్న ఇంగ్లిషు సైనికుల్లో కొందరిని చంపగలిగాడు. అతడికి ప్రజాబలం దండిగానే ఉంది. అంతకంతకూ పెరుగుతున్నది కూడా. అయినా ఇంగ్లిషు మహాశక్తిని ఎదిరించి అతడు ఎక్కువకాలం నిలబడగలడన్న ఆశలేదు. భారీఎత్తున కదిలి అన్నివైపుల నుంచి తమను ముట్టడిస్తున్న తెల్లవారి ధాటికి అతడి ప్రతిఘటన మరికొన్నాళ్లలో కుప్పకూలిపోవటం ఖాయం.

స్థానిక నాయకత్వం కొరవడితేనేమి? ఎం.కె.గాంధీ అనే భారతీయ (కాబోయే) మహాత్ముడు ఆఫ్రికన్ల అదృష్టం కొద్దీ – ఆ సమయాన దక్షిణాఫ్రికాలోనే ఉన్నాడు కదా? తెల్లవారి చేతిలో మితిలేని జాతి వివక్షకు లోనవుతున్న అక్కడి భారతీయుల పక్షాన ధైర్యంగా నిలబడి అప్పటికే ఆయన ఎన్నో కష్టాలు పడి ఎన్నో విజయాలను సాధించాడు కదా? ఫస్ట్‌క్లాసు టిక్కెటు కొనుక్కున్నప్పటికీ ఫస్ట్‌క్లాసులో దొరల సరసన ప్రయాణించే అర్హత నల్లవాడికి లేదన్న దురహంకారంతో తనను రైలు నుంచి బయటికి తోసి వేసినప్పుడే దక్షిణాఫ్రికాను పట్టి పల్లారుస్తున్న జాతివివక్ష భయంకర స్వరూపం ఆయనకు అర్థమై ఉండాలి కదా? మరి అదే జాత్యహంకార పెనుభూతం ఆఫ్రికన్ సోదరులను ఘోరాతిఘోరంగా వెంటాడి వేటాడుతుంటే ఆ మహాత్ముడు చప్పున స్పందించి రివ్వున కదిలి శాయశక్తులా సహాయపడి ఉండాలి కదా?

...ఔను. గాంధీగారు చప్పునే స్పందించారు. రివ్వునే కదిలి రంగంలోకి దిగారు. శాయశక్తులా సహాయ సహకారాలను అడక్కుండానే అందించారు. కాని - ఆఫ్రికన్లకు కాదు. వారిని వెంటాడుతున్న తెల్లతోలు సర్కారుకు! నమ్మబుద్ధి కావటం లేదా? తాను స్వయంగా నడుపుతున్న **ఇండియన్ ఒపీనియన్** పత్రిక 1906 ఏప్రిల్ 14 సంచికలో గాంధీ మహాశయుడు సోదర భారతీయులకు ఏమని కర్తవ్య బోధ చేశారో ఆలకించండి:

"The twelve kaffirs sentenced to capital punishment have been shot dead... At the time of writing Bambata is at large. Meanwhile his followers go on increasing. There is no knowing how all this will end.

"What is our duty during these calamitous times in the Colony? It is not for us to say whether the revolt of the Kaffirs is justified or not. We are in Natal by virtue of British power. Our very existence depends upon it. It is therefore our duty to render whatever help we can. ... We believe what we did during the Boer War should also be done now. That is, if the Government so desires, we should raise an ambulance corps. We should also agree to become permanent volunteers, if the Government is prepared to give us the requisite training."

[*The Collected Works of Mahatma Gandhi*, Vol.5 # 164, P.179]

("మరణశిక్ష వేయబడ్డ పన్నెండుగురు కాఫిర్లను కాల్చి చంపారు... ఇది రాస్తున్న సమయానికి బంబతా తప్పించుకునే తిరుగుతున్నాడు. ఈలోపు అతడి అనుచరులు పెరుగుతూ పోతున్నారు. ఇదంతా ఎలా ముగిసేదీ తెలియదు.

"ఈ విపత్కాలంలో కాలనీలోని మన కర్తవ్యం ఏమిటి? కాఫిర్ల తిరుగుబాటు సమంజసమా కాదా అన్నది మనం చెప్పేది కాదు. మనం బ్రిటిషు పవరును నమ్ముకుని నాటాల్‌లో ఉన్నాం. మన మనుగడే దానిమీద ఆధారపడి ఉంది. కాబట్టి చేయగలిగినంత సహాయం చేయటం మన విధి... బోయర్ యుద్ధంలో మనం చేసిందే ఇప్పుడు కూడా చేయాలి. అంటే - ప్రభుత్వం కోరే పక్షంలో అంబులెన్సు దళాన్ని మనం నెలకొల్పాలి. ప్రభుత్వం అవసరమైన ఆయుధ, సైనిక శిక్షణ మనకు ఇవ్వటానికి సిద్ధపడే పక్షంలో శాశ్వత ప్రాతిపదికన సైనిక వలంటీర్లు కావటానికి కూడా మనం అంగీకరించాలి.")

తమ మాతృభూమి విముక్తి కోసం, స్వాతంత్ర్యం కోసం, మానవ హక్కుల కోసం పోరాడుతున్న ఆఫ్రికన్లు గాంధీగారి దృష్టిలో కాఫిర్లు! ఇండియాను కబళించిన ఇస్లామిక్, క్రిస్టియన్ దురాక్రమణదారులు హిందూ ప్రజానీకాన్ని కాఫిర్లు అని ఈసడించినట్టే.

దక్షిణాఫ్రికాను కబ్జా చేసిన తెల్లవాళ్ల జాత్యాహంకారపు కళ్లకూ అక్కడి భూమిపుత్రులు కాఫిర్లుగా కానవస్తే ఆశ్చర్యం లేదు. బలహీనులపై బలవంతుల దౌర్జన్యాన్ని, దాష్టీకాన్ని ప్రతిఘటించి, పీడిత ప్రజల పక్షాన నిలబడతాడని అందరూ అనుకునే గాంధీజీ కూడా ఆఫ్రికన్ నేటివులను కాఫిర్లుగా పేర్కొనటమే వింత.

గాంధీతత్వానికి హింస సరిపడదు కనక హింసాత్మకంగా తెల్లవారితో పోరాడుతున్న ఆఫ్రికన్ ఆదివాసులకు సంఘీభావం తెలపటం ఆయనకు ఇష్టం లేకపోయిందంటే అర్థం చేసుకోవచ్చు. బాహాటంగా తిరుగుబాటుదారులతో చేతులు కలపకపోయినా, బ్రిటిష్ మహాసామ్రాజ్యాన్ని ఎదిరించి, జాతి వివక్షపై తిరగబడ్డ స్వాతంత్ర్యయోధుల పట్ల కనీసం సానుభూతి అయినా ఉండాలి కదా? ఇష్టం లేకపోతే తిరుగుబాటుదారులకు సాయపడక ఇంట్లో కూచుంటే ఎవరూ ఏమీ అనరు. కాని – పోయిపోయి నేటివు ప్రజలను కాల్చుకుతింటున్న విదేశీ దొరతనానికి స్వదేశీయుల తిరుగుబాటును కాలరాచి వేయటంలో గాంధీ అంతటివాడు సహాయపడటమేమిటి? అదే భారతీయుల తక్షణ కర్తవ్యమని ఇల్లెక్కి చాటడమేమిటి? కావాలంటే అంబులెన్సు దళంగా సాయపడతాం. మిలిటరీ శిక్షణ ఇచ్చి అవకాశమిస్తే తుపాకిపట్టి యుద్ధం చేస్తాం అని తెల్ల సర్కారుకు తనకు తానే ఆఫర్ చేయటమేమిటి? కష్టకాలంలో తెల్లవాళ్లకు భారతీయులు సహాయపడితే తెల్ల ప్రభువులు ప్రసన్నులై భారతీయుల సమస్యలను ఉదారంగా తీర్చి ప్రత్యుపకారం చేస్తారన్న ఆశతోనా?

ఆ మాట ఎవరో అననే అన్నారు. 'ఔను, అందులో తప్పేమిటి?' అని గాంధీ తన పత్రికలో ఎదురు ప్రశ్న వేశారు. ఆ సమర్థింపును కూడా ఆయన మాటల్లోనే వినండి.

"...Indians, by serving during war time. hope to obtain redressal of their wrongs... and no Indian should be ashamed of such a motive. What can be better and more praiseworthy than that Indians, by standing shoulder to shoulder with their fellow Colonists, in the present trouble, should show that they are not unworthy of the ordinary rights of citizenship which they have been claiming all these years?

[CWMG, Vol.5 # 201. P 211]

(యుద్ధకాలంలో సేవ చేయటం ద్వారా, తమకు జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దించుకోగలమని ఆశించటంలో ఏ భారతీయుడూ సిగ్గుపడవలసిన పనిలేదు. ఇండియన్లు తమ సహవలసదారులతో భుజం భుజం కలిపి ప్రస్తుత కల్లోలంలో నిలబడటం ద్వారా... తాము ఇన్నేళ్లుగా కోరుతున్న సాధారణ పౌరసత్వ హక్కులకు తాము అయోగ్యులము కామని చూపించటం కంటే ప్రశంసనీయమైనది ఏముంది?)

విన్నారా? తెల్లదొరలు భారతీయులకు సహవలసదారులు (fellow Colonists) అని గాంధీగారు చెబుతున్నారు. ఇన్నాళ్లూ.. తెల్లవారు వలసపాలకులనీ, భారతీయులు వారి దారుణ దుర్విధానాలకు గురిఅయిన వలస పీడితులనీ, మహాత్మాగాంధిగారి నాయకత్వంలో మన బాధితజాతి వలస సామ్రాజ్యవాదులపై దీర్ఘకాలం నియమబద్ధంగా పోరాడి ఎట్టకేలకు స్వాతంత్ర్యం సాధించిందని కదా మనం విశ్వసిస్తున్నది? వలసవాదాన్ని వ్యతిరేకించే నియమం ప్రకారం దక్షిణాఫ్రికాలో బ్రిటిష్ వలస దాష్టికాన్ని కూడా అంతే గట్టిగా వ్యతిరేకించాలి కదా? మరి గాంధిజీ ఏమిటి - సహవలసదారులైన తెల్లవారితో భుజం కలిపి, వారికి కష్టకాలంలో సహాయపడటం కంటే ప్రశంసించాల్సింది ఏముందని అంటున్నారు?! ఇంగ్లిషువారు దురాక్రమణకై తుపాకి చేతపట్టుకుని దక్షిణాఫ్రికాకు వలసవెళ్లినట్లే భారతీయులూ బతుకు తెరువుకై పొట్ట చేతపట్టుకుని అక్కడికే వలస వెళ్లారు. కాబట్టి భారతీయులకు తెల్లవారు 'ఫెలోకాలనిస్టులు' (సహ వలసదారులు) అయిపోతారా? ఆ గడ్డమీద అసలు హక్కుగల నేటివ్ ఆఫ్రికన్లు వలస దోపిడి భరించలేక ఎదురు తిరిగితే.. దాని మూలంగా ప్రజాకంటకులైన విదేశీయులకు కష్టం వస్తే.. ఆ కష్టకాలంలో పీడకులతో భుజం కలిపి, పీడిత ప్రజానీకాన్ని అణచివేయటంలో సహాయపడటమే మనకు వలసధర్మమా?

జులు తిరుగుబాటును అణచివేయటంలో ఇంగ్లిషువారికి సాయపడి తీరాలని గాంధీ ఇండియన్ ఒపీనియన్‌లో తొలి సంపాదకీయం రాసిన పదిరోజులకు 1906 ఏప్రిల్ 24న దర్బాన్‌లోని కాంగ్రెసు హాలులో నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ తన వైఖరి నిర్ణయించుకోవటానికి సభ జరిపింది. 250 మంది దాకా భారతీయులు హాజరయ్యారు. అసలు జులులు తిరగబడటానికి కారణమేమిటి? వారి నిరసన న్యాయమా కాదా? వారి పోరాటం సమంజసమైతే దాన్ని అణచటంలో మనమెందుకు తెల్లవాళ్లతో చేతులు కలపాలి? అని సభలో పలువురు అభ్యంతరాలు వ్యక్తపరిచారు. 'అట్లాంటి ఆలోచనలు పెట్టుకుని ముందస్తుగా దురభిప్రాయానికి రావొద్దు. ఈ కాలనీలో పౌరసత్వ హక్కులను మనం అపేక్షించేటప్పుడు వాటి వెంట బాధ్యత



సార్జెంట్ మేజర్ గాంధీ

లనూ మనం స్వీకరించి తీరాలి' అని గాంధీ గట్టిగా వాదించి, సందేహించేవాళ్ళ నోళ్లు మూయించారు. ఆయన వాదనా పటిమకు ముగ్ధులై సభాసదులు (న్యాయమైన హక్కుదారులైన ఆఫ్రికన్ ఆదివాసులపై) సాగిస్తున్న పోరులో శ్వేతజాతి ప్రభుత్వానికే అండదండలందించాలని ఏకగ్రీవంగా తీర్మానించి, తెల్లదొరతనానికి ఈ కింది ప్రతిజ్ఞా పత్రాన్ని దాఖలు చేసుకున్నారు.

We, the undersigned, solemnly and sincerely declare that we will be faithful and bear true allegience to His Majesty King Edward the Seventh, His Heirs and Successors, and that we will faithfully serve in the supernumerary list of the Active Militia Force of the Colony of Natal as streteher - Bearers, Until we shall lawfully cease to be members thereof, and the terms of the service are that we should each receive Rations, Uniform, Equipment and Is. 6d. per day.

(Sd.)M.K. Gandhi, U.M. Shelat. Khan Mahomed... ... ...
[CWMG, Vol.5 # 247 P.262]

(ఈ కింద సంతకాలు చేసిన మేము పవిత్రంగా, నిజాయతీగా ప్రకటించేది ఏమిటంటే మేము ఏడవ ఎడ్వర్డు మహాప్రభువులుంగారికి, వారి వారసులకు మరియు ఉత్తరాధికారులకు విశ్వాసపాత్రులమై, నిక్కమైన విధేయతతో వ్యవహరించగలవారము. నేటాల్ కాలనీ యొక్క యాక్టివ్ సైనికదళంలో సూపర్ న్యూమరరీ లిస్టు కింద మేము స్ట్రెచర్ బేరర్లుగా విశ్వాసంతో సేవ చేయగలవారము. చట్ట ప్రకారం మాచేత ఆ పని మాన్పించేంత వరకూ మేము చేయు సేవలకుగాను మాకు రేషన్లు, యూనిఫాం, సామగ్రి మరియు రోజుకు ఒక షెల్లింగు, ఆరు పెన్నీల భత్యం ఇప్పించ ప్రార్థన.

... ఇట్లు ఎం.కె.గాంధీ, ఇంకో 19 మంది)

మీరు వలసదారులు. మేమూ వలసదారులమే. మనం మనం ఒక్కటే. కష్టం వచ్చినప్పుడు ఒకరినొకరం సాయపడాలి. మాకు కనుక సైనిక శిక్షణ ఇచ్చి, ఆయుధాలిప్పించి, శ్వేతజాతీయుల్లాగే మమ్మల్నీ పర్మనెంటు సైనిక వలంటీర్లుగా తీసుకుంటే ఇప్పుడు నడుస్తున్న యుద్ధంలో మీకు బాసటగా నిలబడి మా సత్తా ఏమిటో చూపిస్తాం. కాలనీని కాపాడుకునే కర్తవ్యంలో మేము ఎవరికీ తీసిపోమని నిరూపిస్తాం - అని గాంధీగారు తన పత్రిక ద్వారా ఎన్ని విధాల విన్నవించినా నేటాల్ సర్కారు తుపాకీ పట్టి తెల్లవారి తరపున పోరాడే మహదవకాశాన్నయితే మంజూరు చేయలేదు. కాని - స్ట్రెచ్చర్లు మోసే పనిని ఇప్పించవలసిందన్న మహజరును మాత్రం ఉదారంగా మన్నించారు. ఇరవై మందితో స్ట్రెచర్ బేరర్ దళం ఏర్పాటుకు సర్కారువారు దయతో

అనుమతించారు. ఆ రకంగా గాంధి పడిన కష్టం ఫలించింది. ఆయన ఆశించిన అవకాశం దక్కింది.

కొత్త యూనిఫాం ధరించే సుదినం రానే వచ్చింది. 1906 జూన్ 16న గాంధీకి వైద్యపరీక్ష అయింది. జూన్ 21న తెల్లసర్కారు గాంధికి సార్జంటు మేజరు ర్యాంకును ఇచ్చింది. 20 సభ్యుల కొత్త దళానికి యూనిఫాంలూ, రేషన్లూ, కావలసిన సామాన్లూ చేతికందాయి. కొత్త దళానికి మార్చింగ్ ఆర్డర్లూ వచ్చాయి. క్షణం ఆలస్యం చేయకుండా సార్జంట్ మేజర్ గాంధీ యుద్ధరంగానికి దళ సమేతంగా కదిలారు. జూన్ 23 నుంచి జూలై 18 వరకూ రంగంలో ఉండి చురుకుగా విధులు నిర్వర్తించారు.

అప్పుడు ఆయన ఏమి చూశారు? ఏమి చేశారు? ఏ నిర్ణయాలకు వచ్చారు?

ఆయన్నే అడుగుదాం.

జనం చస్తుంటే బ్రహ్మచర్యం

నాకు జులుల మీద ఎంతమాత్రం కోపం లేదు. వాళ్లు ఏ భారతీయుడికీ హాని చేయలేదు. నిజానికి వారు చేసింది "తిరుగుబాటా" అన్నదానిమీదే నాకు అనుమానాలున్నాయి. అప్పట్లో నాకు నమ్మకమేమిటంటే బ్రిటిషు సామ్రాజ్యం ప్రపంచ సంక్షేమంకోసమే ఉన్నదని! నేను నేటాల్ పౌరుణ్ణని నేను అనుకునేవాడిని. కాబట్టి, అవసరమైతే భారతీయ అంబులెన్స్ కోర్ ఏర్పరచటానికి సంసిద్ధత తెలుపుతూ నేను గవర్నరుకు రాశాను.

నా ప్రతిపాదనను ఆమోదిస్తూ ఆయన వెంటనే బదులిచ్చాడు. నాకు సార్జంట్ మేజరు ర్యాంకును టెంపరరీగా ఇచ్చారు. నేను చెప్పిన ముగ్గురికి సార్జంట్ ర్యాంకు ఇచ్చారు. గవర్నమెంటు నుంచి యూనిఫాంలూ తీసుకున్నాము.

'తిరుగుబాటు' రంగానికి చేరుకుని చూస్తే నాకు 'తిరుగుబాటు' పదం వాడాల్సినంత దృశ్యం ఏదీ కనిపించలేదు. ఎక్కడా ప్రతిఘటననేదే కనపడలేదు. జులు ప్రజలపై కొత్తగా మోపిన పన్నును కట్టొద్దని వారి పెద్ద చెప్పాడు. పన్ను వసూలుకు వచ్చిన సార్జంటుపై దాడిచేశాడు. ఆ గొడవనే పెద్దగా చూపించి 'తిరుగుబాటు'గా చిత్రించారు. ఏమైనా నా హృదయం జులుల పక్షానే ఉంది. మేము చేయాల్సిన ముఖ్యమైన పని గాయపడ్డ జులులకు సపర్య చేయటమేనని విని సంతోషించాను.

గాయపడ్డ జులూలకు సేవ చేయటానికి తెల్లవారు ఇష్టపడటం లేదట. దాంతో కురుపులకు చీముపట్టి, ఏమిచేయాలో అర్థంకాకుండా ఉందట. ఆ అమాయక జీవులకోసం మమ్మల్ని దేవుడే పంపించినట్టుగా మెడికల్ ఆఫీసరు మహా ఆనందపడ్డాడు. బాండేజీలు, మందులు వగైరా అందించి మమ్మల్ని వైద్యశాలకు తీసుకువెళ్లాడు. మమ్మల్ని చూసి జులూలు సంతోషించారు. మేము వారికి మందురాసి కట్లు కడుతూంటే అడ్డకర్రల ఆవలి నుంచి తెల్ల సైనికులు తొంగిచూస్తూ మమ్మల్ని వారించి, ఆ పని మాన్పించాలని ప్రయత్నించేవారు. మేము వారి మాట వినేవాళ్లంకాదు. వారు మండిపడి జులులను ఉచ్చరించరాని దుర్భాషలాడేవారు.

ఇదీ.. జులు తిరుగుబాటు గురించి 1927లో ప్రచురించిన తన **'ఆత్మకథ'**లో గాంధీజీ చెప్పింది. దీన్ని చదువుతుంటే మనసున్న ప్రతిమనిషికీ కళ్లు చెమ్మగిల్లుతాయి. తిరగబడ్డవారిపై ఆయనకు కోపం లేదు. ద్వేషం లేదు. అయినా తిరుగుబాటును అణచబూనిన ప్రభుత్వానికి సహాయపడటం పౌరుడిగా తన ధర్మమని భావించాడు. తానే ముందుకొచ్చి దళం కట్టాడు. రంగం వెళ్లాడు. అదీ తిరుగుబాటుదారులపై తుపాకి పట్టి యుద్ధం చేయటానికి కాదు. వారికి సేవచేయటానికి. ఒళ్లంతా గాయాలై, పట్టించుకునేవారు లేక అలమటిస్తున్న అభాగ్యులకు చికిత్స చేసి ఆదుకోవటానికి! ఇదంతా వింటుంటే సంఘబాహ్యులైన ఆపన్నుల పుండ్లు కడిగి బాధ తీర్చిన ఏసుక్రీస్తు, శిరిడీ సాయి వంటి మహాత్ములు మన కళ్లముందు మెదులుతారు. దేవుడంపినట్టు గాంధీగారు అక్కడికి సమయానికి వెళ్లకపోతే దిక్కులేని ఆ క్షతగాత్రులందరూ ఏమయ్యేవారోనన్న పరితాపమూ కలుగుతుంది.

పౌరధర్మం కొద్దీ ప్రభుత్వానికి అండ నిలిచాడు. మానవతా ధర్మం కొద్దీ క్షతగాత్రులకు చికిత్స చేశాడు. యుద్ధ రంగంలో కూడా మానవసేవే చేశాడు. తాను విధేయుడైన ప్రభుత్వంపై తిరగబడిన వారిపై కూడా కోపం పెట్టుకోక కరుణ చూపాడు. పౌరధర్మం పాటించి ప్రభుత్వ పక్షాన నిలబడ్డా, తన హృదయంలో ఎదిరిపక్షాన పోరాడుతున్న వారినే అపరభీష్ముడిలా పొదవుకున్నాడు. అందుకే ఆయన మహాత్ముడయ్యాడు! **'ఆత్మకథ'**ను, **'దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం'** గ్రంథాన్ని చదివిన వారెవరికైనా ఇలాంటి భక్తిభావమే కలుగుతుంది.

కాని– గమనించాల్సింది ఏమిటంటే– దక్షిణాఫ్రికానుంచి తిరిగొచ్చి దశాబ్దం గడిచాక, మహాత్ముడనే తేజోవలయం తనచుట్టూ ఆవరించి, మున్నెన్నడూ లేనంత ప్రపంచ ప్రఖ్యాతి గడించాక రచించిన ఈ గ్రంథాల్లో గాంధీగారు రాసింది వేరు. దక్షిణాఫ్రికాలో గాంధీ చేసింది వేరు. గాంధీ చిత్రించిన గాంధీకీ, అసలు గాంధీకీ మధ్య ఆనవాలు పట్టలేనంత తేడా ఉంది.

ఈ సంగతి గ్రహించటానికి అజ్ఞాత చరిత్రను తవ్విపొయ్యనవసరం లేదు. ఎక్కువ శ్రమా పడనక్కరలేదు. 1956లో భారత సర్కారువారు సంపుటీకరించి, తాజాగా 2004లో సవరించిన The Collected Works of Mahatma Gandhi సంపుటాలను నిశితంగా పరిశీలిస్తే చాలు!

జులు తిరుగుబాటు కాలంలో తన **ఇండియన్ ఒపీనియన్** వారపత్రికలో గాంధీగారు రాసిన రాతలు, సాగించిన కార్యకలాపాలు అన్నీ ఈ గ్రంధావళిలోని 5వ సంపుటంలో ఉన్నాయి. జులుల పట్ల సానుభూతి గాని, వారి పోరాటం పట్ల సంఘీభావం గాని

గాంధీ గారికి కనీసం మనసులోనైనా ఉన్నాయనడానికి వాటిలో ఒక్క దాఖలా కనపడదు. 20 సంవత్సరాల తరువాత మళ్లీ వచ్చిన 'కాఫిర్ యుద్ధం'లో తెల్లదురాక్రమణదారుల పక్షాన ఆయుధంపట్టి పోరాడాలన్న తహతహే గోచరిస్తుంది. యూరోపియన్ పౌరులవలె భారతీయులనూ సైన్యంలోకి వలంటీర్లుగా తీసుకుని ఆయుధ శిక్షణ ఇప్పించి, యుద్ధరంగాన తమ సత్తా నిరూపించుకునే అవకాశం ఇవ్వాలని గాంధి ఎన్నోవిధాల ప్రచారపు ఒత్తిడి తెచ్చారు. అయినా తెల్లసర్కారు సమ్మతించకపోతే సెకండ్ బెస్టుగానే స్ట్రెచర్ బేరర్ దళాన్ని తలపెట్టారు. అంతేతప్ప అపర ఫ్లారెన్స్ నైటింగేల్‌లా జులు క్షతగాత్రుల పుండ్లకు మందు రాయటానికే ఆయన కదనరంగానికి కదలాలనుకోలేదు. రంగంలోకి దిగిన తరవాతైనా జులుల సేవ, సంరక్షణలతోనే గాంధీగారికి సరిపోయిందనీ చెప్పలేము. యాక్టివ్ సర్వీసులో ఉన్నన్ని రోజులూ తాము ఏ పొద్దు ఏమి చేసిందీ వర్ణిస్తూ గాంధీగారు తన పత్రికకు వార్ కరస్పాండెంటులా పంపిన నివేదికలను చూడండి. తెల్లవారు వద్దని వారిస్తున్నా వినకుండా జులులకు తాము చేసిన మానవతా సేవ, దానికి వారి కళ్లలో కనిపించిన కృతజ్ఞత లాంటి విశేషాలు ఏవీ వాటిలో కానరావు. గాంధీ రాసిన దినచర్య, దళపు డ్యూటీ వివరాలను బట్టి దళ సభ్యులెవరైనా, ఇతర విధులతోబాటు ఎప్పుడైనా ఖైదీలకు నర్సింగు చేశారేమోగాని గాంధీయే స్వయంగా జులుల పుండ్లు కడిగి కట్లు కట్టారన్న నిదర్శనం ఎక్కడా కానరాదు. ఈ సంగతులన్నీ **జి.బి.సింగ్** అనే ఆయన Gandhi: Behind the Mask of Divinity గ్రంథంలో వివరంగా చర్చించారు.

అనంతర కాలంలో ఇండియాలో భారత జాతీయ కాంగ్రెసు అనేక పర్యాయాల్లో చేసినట్టు 1906 ఏప్రిల్ 24న దర్బాన్‌లో నేటాల్ ఇండియా కాంగ్రెసు సమావేశం గాంధీ ప్రభావానికి తలఒగ్గి ఆయన కోరిన తీర్మానం చేసినా... దానిపై అక్కడి భారతీయ సమాజంలో పెద్ద కలకలమే లేచింది. ఆఫ్రికాకు అసలు హక్కుదారులైన నల్లవారి పట్ల, వారి దారుణ దుర్గతి పట్ల గాంధీ వైఖరిని పలువురు వ్యతిరేకించారు. పి.ఎస్.అయ్యర్ అనే ఆయనయితే "ముందు చూపులేని గాంధీ, ఆయన మిత్రుల వెర్రి విధానం నుంచి భారతీయ సమాజాన్ని రక్షించడానికి" **కాలనియల్ ఇండియన్ న్యూస్** అనే వారపత్రికను తమిళ, ఇంగ్లీషు భాషల్లో మొదలెట్టాడు కూడా. ఇతర దేశాల్లోని భారతీయుల్లోనూ కొందరు గాంధీ వైఖరిని వ్యతిరేకించారు. నల్లవారిని అణచసాగిన తెల్లవారికి గాంధీ స్వచ్ఛందంగా తోడ్పడటం "contemptible beyond expression" (మాటల్లో చెప్పలేనంత హేయమైనది) అని న్యూయార్క్‌లో Gaelie American పత్రిక ఏవగించు కుంది. గాంధీ చర్య "disgusting" (రోత పుట్టిస్తుంది) అని లండన్‌లోని Indian Sociologist పత్రిక అధిక్షేపించింది.

సరే! బ్రిటిష సామ్రాజ్యం ప్రపంచ సంక్షేమంకోసమే అవతారమెత్తిందని అప్పట్లో గాంధీగారు నమ్మారు కాబట్టి, మిగతా విషయాలకంటే పౌరధర్మానికీ, పౌరుడిగా తన బాధ్యతకీ ఆయన ప్రాధాన్యం ఇచ్చారు కాబట్టి, ఎవరేమన్నా, ఏదిఏమైపోయినా అనుకున్నది విరమించే తత్వం ఆయనది కాదుకాబట్టి... విమర్శలను, అపవాదులను లెక్కచెయ్యక బ్రిటిష ప్రభుత్వానికి స్వచ్ఛందసేవకు ఆయన ఉద్యుక్తులయ్యారని భావిద్దాం. అంతదాకా ప్రధానంగా భారతీయుల సమస్యలతోనే ఆయన సతమతమైనందున, ఆ గడ్డమీద నల్ల ప్రజల దైన్యాన్ని, హైన్యాన్ని దగ్గరగా గమనించే సావకాశం ఆయనకు లేకపోయిందనీ సంశయలాభం ఇద్దాం. కాని 'యాక్టివ్ సర్వీసు'లోకి దిగాక, జనావాసాల మీదపడి, తెల్లరాకాసులు ఆదివాసులను కొరడాలతో చర్మం ఊడేలా, స్పృహ తప్పేలా కొట్టి, స్పృహ పోయిన తరవాత కూడా కొట్టి, ఎలాంటి చిత్రహింసలు పెడుతున్నదీ కళ్లతో చూశాక... తెల్లవాళ్లు తాట వొలిచిన తరవాత క్షతగాత్రులను స్ట్రెచర్లపై మోసుకొచ్చి, గాయాలకు మందు రాస్తూంటే వారి కళ్లలో మెరిసిన కృతజ్ఞతను గమనించాకయినా నల్లజాతి విధివంచితులపై ప్రేమమూర్తి గాంధీగారికి అవ్యాజ్యమైన ప్రేమ, కరుణ ఉప్పొంగి ఉండాలి కదా?

ఔను. ఆయనలో పెద్ద సంచలనమే లేచింది. గొప్ప భావోద్వేగమే కదిలింది. అదీ ఆయన మాటల్లోనే విందాం.

"The Zulu 'rebellion' was full of new experiences and gave me much food for thought... This was no war but a man - hunt not only in my opinion, but also in that of many Englishmen with whom I had occassion to talk. To hear every morning reports of the soldiers' rifles exploding like crackers in innocent hamlets, and to live in the midst of them was a trial. But I swallowed the bitter draught, especially as the work of my corps consisted only in nursing the wounded Zulus... This work therefore eased my conscience... I pondered over ***brahmacharya*** *and its implication, and my convictions took deep root... I clearly saw that one aspiring to serve humanity with his whole soul could not do without it... On my arrival at Phoenix... ... I took the vow to observe* ***brahmacharya*** *for life... The very first change I made in my mode of life was to stop sharing the same bed with my wife, or seeking privacy with her. Thus* ***brahmacharya****, which I had been observing wilynilly since 1900, was sealed with a vow in the middle of 1906."*

(జులు 'తిరుగుబాటు' నాకెన్నో కొత్త అనుభవాలనిచ్చింది. మెదడుకు కావలసినంత మేతా దొరికింది... అది యుద్ధం కాదు... మనుషుల వేట. అది నా అభిప్రాయం మాత్రమే కాదు. నాతో మాట్లాడిన చాలామంది ఇంగ్లీషువారు కూడా అదేమాట అన్నారు. ప్రతి ఉదయం సైనికుల రైఫిళ్లు అమాయక కుగ్రామాలపై బాణాసంచాల్లా పేలుతూంటే వినటం, వాటి మధ్య బతకటం కఠోర పరీక్ష. నేను దాన్ని చేదు మందులా మింగాను. ముఖ్యంగా... గాయపడ్డ జులులకు సపర్య చేయటం మాత్రమే నా దళం పని కాబట్టి!... ఆ పని నా మనస్సాక్షికి ఊరటనిచ్చింది... నేను బ్రహ్మచర్యం గురించి, దానిలోని చిక్కుల గురించి దీర్ఘంగా ఆలోచించాను. నా విశ్వాసాలు లోతుగా వేళ్లూనాయి... మానవాళికి సేవచేయాలని మనసారా కాంక్షించేవాడు బ్రహ్మచర్యం లేకుండా పనిచేయలేడని నాకు స్పష్టమైంది. ఫీనిక్స్‌కి చేరాక నేను జీవిత పర్యంతం బ్రహ్మచర్యం పాటించాలని శపథం చేశాను... నా జీవన విధానంలో నేను చేసిన మొట్టమొదటి మార్పు ఏమిటంటే నా భార్యతో పడక పంచుకోకపోవటం... ఆమెతో ఏకాంతం అభిలషించకపోవటం. కోరీ కోరకుండా *1900* నుంచీ నేను అవలంబిస్తున్న బ్రహ్మచర్యం *1906* మధ్యలో నా శపథంతో ముద్రాంకితమైంది.)

ఇది **'ఆత్మకథ'**లోని Heart Searchings (హృదయాన్వేషణ) అధ్యాయంలో గాంధీగారు స్వయంగా చెప్పిన మాట. వినడానికి మనబోటి సామాన్యులకు విడ్డూరంగా ఉంటుంది. ఒక చెంప తన కళ్లముందే వందల సంఖ్యలో అమాయక ప్రజలు క్రూరాతి క్రూరంగా వేటాడబడుతుంటే... ఏ పాపమెరుగని జనావాసాలు సైనికుల రైఫిళ్ల పేలుళ్లతో అహరహం దద్దరిల్లుతూంటే ఈ మహానుభావుడు తీరికూర్చుని బ్రహ్మచర్యం గురించి, దానిలోని చిక్కుల గురించి దీర్ఘాలోచన చేయటమేమిటి? ఇంటికెళ్లగానే బ్రహ్మచర్య శపథంచేసి ధర్మపత్నితో మంచంపొత్తు మానుకోవటమేమిటి? మహాత్ముల లీలలు సులువుగా అంతుబట్టవు కనుక, గాంధీజీ బ్రహ్మచర్య ప్రయోగాల గురించి మాట్లాడే సందర్భాలు మునుముందు ఇంకా వస్తాయి కనుక ఆ విషయం ఇక్కడ వదిలేద్దాం.

మానవాళిని సేవించాలనుకునేవాడు సంసార సుఖాన్ని, వ్యక్తిగత సౌఖ్యాలను దూరంగా పెట్టి కఠోర బ్రహ్మచర్యం ఆచరించాలన్న దృఢ దీక్ష... కొండలూ కోనల్లో తిరుగాడుతూ క్షతగాత్రులకు సపర్య చేస్తుండగా ఒక మనుష్యుడికి కలిగిందంటే... అంతటి తీవ్ర నిశ్చయానికి తనను పురికొల్పిన సదరు అభాగ్య జీవుల పట్ల అతడిలో ఎంతటి ఆత్మీయత, ఆర్ద్రత, దయ పెల్లుబికి ఉండాలి? వారిమీద అంతటి సానుతాపం కలిగిన వాడికి వారినంతటి చిత్రహింసకు, చిత్తక్షోభకు గురిచేసిన పాపాత్ముల పట్ల, ఆ పాపాలకు కారణభూతమైన జాతి దురహంకారం మీద ఎంతటి ధర్మాగ్రహం రేకెత్తి ఉండాలి? అటువంటి జాడలేవైనా గాంధీజీలో కనిపించాయా?

గాంధీగారు చెప్పినట్టు ఆఫ్రికన్లు ఏ ఒక్క భారతీయుడికీ హాని చేయలేదు. ఆమాటకొస్తే ఏ తెల్లవాడికీ కీడు తలపెట్టలేదు. తమ భూమిపైకి వలస వచ్చిన ఏ జాతిజనుల జోలికీ పోలేదు. ఇతరులు చలాయించిన దుర్మార్గపు జులుంకు వారే పడరానిపాట్లు పడ్డారు. అది యుద్ధంకాదు; తిరుగుబాటూ కాదు; మనుషుల వేట అని స్వయానా గాంధీజీయే నిర్ధారించిన కల్లోలంలో ఒక లెక్క ప్రకారం నాలుగువేల మంది నల్లజాతీయులు నిష్కారణంగా చంపబడ్డారు. ఏడువేల మంది చెరసాల పాలయ్యారు. నాలుగువేల మంది కొరడా దెబ్బలు తిన్నారు. అంతేకాదు. దారుణ దమనకాండవల్ల ఎన్నో కుటుంబాలు కూలిపోయాయి. వేలూ లక్షల బతుకులు కాలిపోయాయి. సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ప్రజాప్రతిఘటన వెన్ను విరిగింది. అమాయక ప్రజానీకాన్ని దుస్సహమైన కష్టనష్టాలకు గురిచేసిన అమానుష దుష్కృత్యాలపై దక్షిణాఫ్రికాలోనేకాక, ఇంగ్లండులోనూ ఎంతోమంది శ్వేతజాతీయులే ఆగ్రహించారు. నేటాల్ సర్కారు సాగించిన సైనిక చర్య సమస్తం లూటీలు, దోపిడీలమయమని **జె.సి.స్మట్స్** గర్హించాడు. సైనిక చర్యల్లో 24మంది తెల్లవారి ప్రాణాలు పోయినప్పటికీ నేటాల్ సర్కారు చేసింది చాలా తప్పు, ఆఫ్రికన్లకు జరిగింది ఘోరమైన అన్యాయం అని యూరోపియన్ మేధావులెందరో గళమెత్తారు.

అప్పుడు గాంధీ మహాత్ముడు ఏమిచేశారు? ఎక్కడో వందల మైళ్ల దూరంలో ఉన్న బయటివారికే అంతటి కంపరం పుట్టించిన ఘోరకలిని రంగంలో నిలిచి ప్రత్యక్షంగా చూసి ఉన్నందున ఇతరులకంటే గట్టిగా దురంతాలను ఖండించారా? తాను దగ్గరుండి సపర్యచేసిన బాధితుల పక్షాన నిలిచి, వారికి జరిగిన ఘోరమైన అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి, ముష్కర పాలకుల కొమ్ములు వంచటానికి సరికొత్త బ్రహ్మచర్య దీక్షా తీక్షణతో సత్యాగ్రహ సమరమేదైనా మొదలెట్టారా?

లేదు. ఏదీ చేయలేదు. చేయకపోగా తెల్లదొరతనం చేసింది పెద్దతప్పేమీ కాదని తన ఇండియన్ ఒపీనియన్ పత్రికలో 1906 ఆగస్టు 4న తెగబడి ఇలా వాదించారు:

A controversy is going on in England about what the natal army did during the Kaffir rebellion. The people there believe that the whites of Natal perpetrated great atrocities on the Kaffirs... Those among the Egyptian rebels who had been captured were ordered to be flogged. The flogging was continued... in public and was watched by thousands of people... while those sentenced to death were hanging, the flogging of the others was taken up...

If this be true, there is no reason why there should be such an outcry against the Natal outrage.

[*The Collected works of Mahatma Gandhi*, Vol.5 # 272, P.290]

(కాఫిర్ తిరుగుబాటు కాలంలో నేటాల్ సైన్యం చేసిన దాని గురించి ఇంగ్లండులో ఒక వివాదం నడుస్తున్నది. కాఫిర్ల మీద నేటాల్ శ్వేత జాతీయులు ఘోరమైన అత్యాచారాలు చేశారని అక్కడివారు నమ్ముతున్నారు... (ఇంపీరియల్ ఆర్మీ) ఈజిప్టులోనూ తిరుగుబాటుదారులను పట్టుకుని కొరడా దెబ్బలు కొట్టింది. బహిరంగంగా వేలమంది చూస్తుండగానే మిగతా వారిని కొరడా దెబ్బలు కొట్టేవారు. ఇది నిజమైతే నేటాల్ అఘాయిత్యం గురించి అంతగా గొంతు చించుకోవలసిన పనిలేదు.)

ఎంతైనా ప్లీడరు కదా?!

ఛీ! ఛీ! కాఫిర్లు!!

***ఛా**ర్లెస్ టౌన్‌లో స్టేజి కోచ్ ఎక్కాను. నాకు టిక్కెటుంది. ఐనా ఏదో మిష మీద నన్ను ఎక్కనివ్వకుండా అడ్డుకోవాలని చూశారు. నేను గట్టిగా మాట్లాడటంతో అది కుదరలేదు. ఎక్కాక ఇంకో అవస్థ. మామూలుగా ప్రయాణికులు కోచ్ లోపల, సిబ్బంది బయట కూచోవాలి. కాని ఈరోజు కోచ్ 'లీడరు' లోపల కూచుని నాకు బయట సీటు చూపించాడు. నేను కూలీని (అప్పట్లో దక్షిణాఫ్రికాలోని భారతీయులందరినీ 'కూలీ'లుగా దొరలు వ్యవహరించే వారు.) కాబట్టి నన్ను తెల్లవారి సరసన కూచోబెట్టటం అతడికి ఇష్టం లేక పోయింది.*

అది అన్యాయం. ఐనా భరించి నాలో నేను మండిపోతూ కోచ్ వాడి పక్కన కూచున్నాను. కాసేపటికి లోపలి 'లీడరు'కు దమ్ముకొట్టాలనిపించి బయటికి వచ్చాడు. మురికి గోనెగుడ్డను కింద పరచి 'సామీ! నువ్విక్కడికి రా. నేను డ్రయివరు దగ్గర కూచుంటా' అన్నాడు. అంత అవమానం నేను సహించలేకపోయాను. 'నన్నిక్కడ కూచోబెట్టింది నువ్వు. నన్నసలు లోపలికి పంపించాల్సి ఉన్నా ఇక్కడ కూచోమన్నావు. పోనీలే అని ఊరుకున్నా. ఇప్పుడు నీకు సిగరెట్ కాల్చాలనిపించేసరికి నన్ను నీ కాళ్ల దగ్గర కూచోమంటున్నావు. నేను ఒప్పుకోను. ఇక్కణ్నించి లేవను. కావాలంటే లోపలికి పోయి కూచుంటా' అని లోలోపల వొణుకుతూనే బింకంగా అన్నాను.

నా మాట ఇంకా పూర్తికాకముందే అతడు నామీదికివచ్చి నా చెవులు నులుముతూ, చెయి పట్టుకుని కిందికి గుంజెయ్యసాగాడు. నేను కోచ్ బాక్సుకుండే ఇత్తడి కమ్మీలను గట్టిగా పట్టుకుని అలాగే కూచున్నాను. వాడు బూతులు తిడుతూ, పిడి గుద్దులు గుద్దుతూ నన్ను లాగెయ్యటం... నేనేమో కిమ్మనకుండా మణికట్టు ఎముక విరుగుతుందా అన్నంతగా కమ్మీలకు అతుక్కోవటం- ఇదంతా లోపలి ప్రయాణికులు చూశారు. వాడు దుక్కలా ఉన్నాడు. నేనేమో బక్కవాణ్ని. కొంతమంది ప్రయాణికులు జాలిపడి "ఏమయ్యా, అతణ్ని ఒదిలెయ్. అతడి తప్పేం లేదు. అతణ్ని కొట్టకు. అక్కడ ఉండకూడదనుకుంటే అతణ్ని

ఇక్కడికి పంపు. మా దగ్గర కూచుంటాడు" అని కేకలేశారు. దాంతో అతడు కొట్టటం ఆపాడు. మొగం మాడ్చుకుని, లోలోపల బూతులు తిడుతూనే నా చెయ్యి వదిలిపెట్టాడు. కోచ్ బాక్సుకు ఆవైపు కూచున్న పనివాణ్ని ఫుట్‌బోర్డు మీద కూచోమని ఆ సీటులో తాను కూచున్నాడు.

* * *

"ఈ దేశంలో మీలాంటివాళ్లు ఉండలేరు. మేమైతే అవమానాలకు అలవాటుపడ్డాం. ఇక్కడ భారతీయులకు అన్నీ కష్టాలే. అంతెందుకు- రేపు మీరు ప్రిటోరియా వెళ్లాలి కదా! అక్కడికి మీరు థర్డ్ క్లాసులో మాత్రమే వెళ్లగలరు. ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్ టిక్కెట్లు ఇండియన్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వరు" అన్నాడు శేఠ్ అబ్దుల్‌గనీ బాధగా.

'ఎందుకివ్వరో చూద్దాం' అన్నాను నేను. వెంటనే జొహాన్స్‌బర్గ్ స్టేషన్ మాస్టరుకు ఒక జాబు పంపాను. 'నేను బారిస్టర్ని. ఎప్పుడూ ఫస్ట్‌క్లాస్‌లోనే ప్రయాణిస్తాను. నేను అర్జంటుగా వెళ్లాలి. మీ జవాబుకోసం ఆగే వ్యవధి లేదు. రేపు ఉదయం మీ దగ్గరికి వచ్చి టిక్కెటు తీసుకుంటాను...' అని అందులో రాశాను. ఇలా రాయటానికీ ఒక కారణముంది. రాత పూర్వకంగా జవాబు ఇస్తే స్టేషను మాస్టరు కుదరదు పొమ్మనవచ్చు. 'కూలీ' బారిస్టరు అనగానే అతడికి ఉండే అభిప్రాయం అతడికి ఉంటుంది కదా! ఎక్కడా వంకలేని ఇంగ్లీషు డ్రస్సులో నేను వెళ్లి మాట్లాడితే ఫస్టుక్లాసు టిక్కెటు ఇచ్చేట్టు చెయ్యగలనేమో! ఫ్రాక్- కోటు, నెక్‌టై ధరించి మర్నాడు స్టేషనుకు వెళ్లి, కౌంటరులో పౌండు నాణెం ఉంచి ఫస్ట్ క్లాస్ టిక్కెట్టు ఇమ్మన్నాను.

తలెత్తి చూసి, 'మీరేనా ఆ నోటు పంపింది?' అన్నాడతను. నేను ఔనంటే చిరునవ్వు నవ్వాడు. 'నేను ఇక్కడివాణ్ని కాదు. హాలెండ్ వాణ్ని. మీరు జంటిల్మన్లా కనిపిస్తున్నారు. మీ ఫీలింగ్సును నేను అర్థం చేసుకోగలను. మీకు నేను టిక్కెటిస్తాను. ఐతే ఒక్క షరతు. గార్డు మిమ్మల్ని ఒకవేళ థర్డ్ క్లాసుకు పొమ్మంటే నన్ను గొడవలోకి లాగొద్దు'. నేను సరే అన్నాక టిక్కెటిచ్చాడు.

ట్రెయిను కదిలింది. కాసేపటికి ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులోకి టిక్కెట్ల తనిఖీ గార్డు వచ్చాడు. నన్ను చూడగానే మండిపడి, థర్డ్ క్లాస్‌లో పోయి కూచోమని వేలుతో సైగ చేశాడు. నేను ఫస్ట్ క్లాస్ టిక్కెటు చూపించాను. 'అదేమీ కుదరదు. థర్డ్ క్లాసుకు పో!' అని కసిరాడు.

కంపార్టుమెంటులో నేనుగాక ఒక ఇంగ్లీషు పాసింజరు మాత్రమే ఉన్నాడు. ఆయన గార్డును వారించి "ఆ జంటిల్మనును ఎందుకు అల్లరి పెడతావు? అతని దగ్గర టిక్కెటుంది కదా? అతడు నాతో వస్తే నాకేమీ అభ్యంతరం లేదు. మధ్యలో నీకేమిటి?" అని

గద్దించాడు. 'కూలీ గాడితో ప్రయాణం చెయ్యటం మీకు ఇష్టమైతే నాదేం పోయింది' అని సణుగుతూ గార్డు బయటికిపోయాడు.

* * *

ప్రిటోరియా చేరేసరికి రాత్రి 8 గంటలైంది. దాదా అబ్దుల్లాగారి అటార్నీ నాకోసం స్టేషనుకు ఎవరినైనా పంపిస్తాడేమేనని అనుకున్నాను. ఎవరూ రాలేదు. ఏం చేయాలి? ఏ హోటెలూ నన్ను రానివ్వదు. ఎక్కడికి పోవాలి? ప్రయాణికులంతా వెళ్లిపోయాక టిక్కెటు కలెక్టరును అడిగి చూద్దాం... అదృష్టం బాగుంటే ఏదైనా చిన్న హోటెలునో, ఇంకో చోటునో చూపిస్తాడేమో అనుకున్నాను. ఏదీ దొరక్కపోతే ఇక రాత్రంతా స్టేషన్లో ఉండిపోవాల్సిందే. అడిగితే టిక్కెటు కలెక్టరు ఏమంటాడో, ఎక్కడ అవమానిస్తాడోనని– చెప్పొద్దూ, భయం వేసింది. ఐనా ధైర్యంచేసి, అంతా వెళ్లిపోయాక నా టిక్కెటు చూపించి మాటల్లో పెట్టాను. అడిగిన వాటికి మర్యాదగానే బదులిచ్చాడు. కాని అతడేమీ సహాయం చేయలేదని నాకు అర్థమైంది.

అంతలో అక్కడే ఉన్న అమెరికన్ నీగ్రో ఒకడు మా సంభాషణలో చొరబడ్డాడు. "మీరీ ఊరికి బొత్తిగా కొత్త అనుకుంటా. తెలిసినవాళ్లెవరూ ఉన్నట్టు లేరు. నాతో రండి. ఓ చిన్న హోటెలుకు తీసుకెళతా, దాని యజమాని అమెరికను. నాకు బాగా తెలిసినవాడు. మిమ్మల్ని రానిస్తాడనుకుంటా" అన్నాడు.

నాకు అనుమానం వేసింది. ఐనా ఒప్పుకున్నాను. అతడు నన్ను జాన్స్టన్స్ ఫామిలీ హోటెలుకు తీసుకెళ్లాడు. మిస్టర్ జాన్స్టనును పక్కకు పిలిచి మాట్లాడాడు. ఆ రాత్రికి నన్ను ఉండనివ్వటానికి అతడు ఇష్టపడ్డాడు. ఐతే ఒక్క షరతు. నేను డిన్నర్ నా గదిలోనే చేయాలట. "మరోలా అనుకోకండి. నాకేమీ రంగు పట్టింపు లేదు. కాని ఇక్కడంతా యూరోపియన్ పద్ధతి. మిమ్మల్ని డైనింగు రూములో తిననిస్తే మిగతా గెస్టులకు కోపం రావచ్చు. వెళ్లిపోవచ్చు కూడా" అని ప్రొప్రయిటరు నచ్చచెప్పబోయాడు.

"థాంక్యూ. నన్నీ రాత్రి ఇక్కడ ఉండనిచ్చారు చాలు. ఇక్కడి పరిస్థితులు నాకు చాలావరకు తెలుసు. మీ ఇబ్బందిని అర్థం చేసుకోగలను. గదిలోనే భోంచేయటానికి నాకేమీ నామోషీలేదు. రేపు ఇంకెక్కడైనా మకాం ఏర్పాటుచేసుకోగలననుకుంటా" అన్నాను.

నాకు గది ఇచ్చారు. అందులో కూచుని భోజనంకోసం ఎదురుచూస్తున్నా. హోటెల్లో గెస్టులు ఎక్కువమంది లేరు. వెయిటరు త్వరగానే డిన్నరు తెస్తాడనుకున్నా. కాని వెయిటరుకు బదులు మిస్టర్ జాన్స్టనే వచ్చాడు. "మిమ్మల్ని ఇక్కడ తినమన్నందుకు నేను సిగ్గుపడ్డాను. మిగతా గెస్టులకు మీ సంగతి చెప్పాను. అతణ్ని డైనింగు రూములోకి రానిస్తే ఏమైనా అనుకుంటారా అని అడిగాను. వాళ్లు తమకేమీ అభ్యంతరం లేదన్నారు.

ఈ రాత్రే కాదు; మీరు ఎన్నాళ్లయినా ఇక్కడ ఉండవచ్చుననీ అన్నారు. దయచేసి డైనింగు రూములోకి రండి. మీ ఇష్టం వచ్చినంతకాలం ఇక్కడ ఉండండి" అన్నాడు. నేను ఆయనకి మళ్లీ ధన్యవాదాలు తెలిపి, డైనింగు రూముకు వెళ్లి తృప్తిగా తిన్నాను.

* * *

తొలిసారి ప్రిటోరియా వెళ్లినప్పటి పరిస్థితుల గురించి గాంధీ మహాత్ముడు తన **ఆత్మకథ**లో రాసుకున్న అనుభవాలివి. వీటిని చదివితే 19వ శతాబ్దపు దక్షిణాఫ్రికాలో వర్ణవివక్ష ఎంత దారుణంగా ఉండేదో, అడుగడుగునా అవమానాలతో, ఒళ్లు మండే అసమానతలతో శ్వేతేతర జనాభా ఎన్నెన్ని అగచాట్లు పడ్డారో, ఎంతటి చిత్తక్షోభ అనుభవించారో కళ్లకు కడుతుంది.

అంతే కాదు. ఇంకో సంగతీ అర్థమవుతుంది. దక్షిణాఫ్రికాలో దుర్మార్గమైన వర్ణవివక్ష రాజ్యమేలినా, దక్షిణాఫ్రికాలోని తెల్లవారందరూ వర్ణవివక్షను పాటించిన దుర్మార్గులు కారు. తమది తెల్లతోలు అనే మిడిసిపాటు లేకుండా, రంగు తక్కువ వారిని కూడా సాటి మానవుల్లా చూసి తమతో సమానంగా ఆదరించిన సజ్జనులూ ఆ కాలంలో ఎందరో ఉన్నారు. టిక్కెటు కొనుక్కుని ఫస్ట్ క్లాస్ కంపార్టుమెంటులో ప్రయాణిస్తున్న గాంధిని తెల్ల ప్రయాణికుడొకడు ఫిర్యాదు చేయగానే నేటాల్ రాజధాని Maritzburg స్టేషనులో బలవంతంగా బయటకు తోసి, సామాన్లు ప్లాట్‌ఫాం మీదికి విసిరేసి, రైలు వెళ్లిపోయిన దృశ్యాన్ని అటెన్‌బరో **గాంధీ** సినిమాలో చూసినవారు జన్మలో మరిచిపోలేరు. దక్షిణాఫ్రికా యథార్థ స్థితిని బారిస్టరు గాంధీకి తొలిసారి తెలియజెప్పి రాత్రంతా చలిలో వణుకుతూ రైల్వే ప్లాట్‌ఫాం బల్లమీద దీర్ఘాలోచనకు గురిచేసిన ఆ అనుభవం దారుణమైందనడంలో సందేహం లేదు. కాని ఆ దేశంలో గాంధి గారికి కలిగిన అన్ని అనుభవాలూ అంతే దారుణమైనవి కావు.

మచ్చుకు పైన ఉదహరించిన మూడు ఉదంతాలనే గమనించండి. చేతిలో టిక్కెటు ఉండీ ప్రయాణికులకు నిర్దేశించిన సీట్లలో కూచునేందుకు నోచుకోక, కోచ్ వెలుపల పనివారి సీటులో గాంధీగారు కూచోవలసి రావటం దురదృష్టమే. కనీసం అక్కడా ఆయనను స్థిమితంగా ఉండనివ్వక పనివాడెవడో మీదపడి ఆయనంతటివాడిని కొట్టి, కిందికి నెట్టెయ్యాలని చూడటమూ నిస్సందేహంగా అమానుషమే. కాని అక్కడున్న తెల్ల తోలు ప్రయాణికులు దాన్ని చూస్తూ కూచోలేదు. నల్లవాడికి తగినశాస్తి జరిగింది లెమ్మని సంతోషించలేదు. హద్దుమీరిన తెల్లవాడి మీద కేకలేసి, ఆ అఘాయిత్యాన్ని అడ్డుకున్నారు. రూలు ప్రకారం రంగు తక్కువవాడిని తమ సరసకు రానివ్వక్కరలేదని తెలిసి కూడా, మానవత్వానికి విలువ ఇచ్చి గాంధీని తమ దగ్గర కూచోబెట్టుకోవటానికి స్వచ్ఛందంగా సిద్ధపడ్డారు.

జోహాన్స్‌బర్గ్ స్టేషను మాస్టరూ అంతే. ఫస్ట్ క్లాసు టిక్కెటు నీకు ఇవ్వను పొమ్మని అతడు తలచుకుంటే గాంధీకి మొండి చెయ్యి చూపించగలడు. అయినా టిక్కెటు ఇచ్చాడు. ఏదైనా గొడవయితే నన్ను మాత్రం అందులోకి లాగొద్దన్నదే అతడు కొరిందల్లా. అలాగే ఆ ప్రయాణంలో గార్డు వచ్చి గాంధీని బయటికి గెంటెయ్యబోతే వారించి, నాకు లేని అభ్యంతరం నీకేమిటని దెబ్బలాడిందీ తెల్ల ప్రయాణికుడే. ప్రిటోరియా హోటల్లో డైనింగు రూములోకి గాంధీని అనుమతించటానికి హోటెలు యజమానికి ధైర్యం చాలకపోతే, ఫరవాలేదు రానివ్వు; మాతో కలిసి తిననివ్వు; ఎన్నాళ్లయినా ఉండనివ్వు; మేమేమీ అనుకోమని భరోసా ఇచ్చిందీ తెల్లవాళ్లే. గాంధీలో మహాత్ముడిని చూసి వాళ్లు ఆ వరమివ్వలేదు. గాంధీ మొగం చూడకముందే వాళ్లలా ఒప్పేసుకున్నారు. ఎందుకంటే మనసున్న మంచివాళ్లు కాబట్టి.

సరే. బాగానే ఉంది. కాని– అదే మంచితనం గాంధీగారిలో ఉందా? స్టేజ్ కోచ్‌లోని తెల్ల ప్రయాణికుల స్థానంలోనో, జొహాన్స్‌బర్గ్ స్టేషను మాస్టరు స్థానంలోనో, గార్డుతో గొడవపడ్డ తెల్లవాడి స్థానంలోనో, ప్రిటోరియా హోటలులోని యూరోపియన్ గెస్టుల స్థానంలోనో తానే కనుక ఉంటే వారు చూపించినపాటి కనికరాన్ని ఒక నల్లవాడి మీద బారిస్టర్ మిస్టర్ ఎం.కె.గాంధీ చూపించేవాడా?

సందేహం అక్కర్లేదు. ససేమిరా చూపించరు. అప్టరాల్ ఒక నల్లవాడిని మాతో సమానంగా మా సరసన కూచోబెట్టడమేమిటి? ఠట్, వీల్లేదంటూ పెద్ద యుద్ధం చేస్తారు. నమ్మశక్యం కావటంలేదా? మహాత్ముడు స్వహస్తాలతో Indian opinion పత్రిక 1908 మార్చి 7 సంచికలో రాసిపెట్టిన ఈ కింది జైలు అనుభవాలను ఓసారి చిత్తగించండి.

There, our garments were stamped with the letter 'N', which meant that we were being classed with the Natives. We were all prepared for hardship, but not quite for this experience. We could understand not being classed with the whites, but to be placed on the same level with the Natives seemed too much to put up with... It is indubitably right that Indians should have separate cells. The cells for Kaffirs were adjacent to ours. They used to make a frightful din in their cells as also in the adjoining Yard... Apart from whether or not this implies degradation, I must say it is rather dangerous. Kaffirs are as a rule uncivilised- the convicts even more so. They are troublesome, very dirty and live almost like animals.

[*The Collected works of Mahatma Gandhi*, Vol.8, # 97, PP 198 - 199]

(అక్కడ, మా దుస్తుల మీద 'N' అని ముద్రవేశారు. దానర్థం మమ్మల్ని 'నేటివు'ల తరగతిలో చేర్చారని, మేమందరం కష్టాలకు సిద్ధపడ్డాము కాని ఈ అనుభవం ఊహించనిది. తెల్లవారితోబాటు మమ్మల్ని వర్గీకరించలేదంటే అర్థం చేసుకోగలం. కాని నేటివుల లెవెలుకు మమ్మల్ని నెట్టటాన్ని భరించటం కష్టమనిపించింది... భారతీయులకు ప్రత్యేకమైన సెల్సు నిస్సంశయంగా ఉండాల్సిందే. కాఫిర్ల సెల్సు మేమున్నవాటి పక్కనే ఉన్నాయి. జైలు గదుల్లోనూ, బయటి ఆవరణలోనూ వాళ్లు భయంకరమైన లొల్లి పెట్టేవారు... తక్కువ శ్రేణికి దిగజార్చటం మాట ఎలా ఉన్నా ఈ ఏర్పాటు ప్రమాదకరమని చెప్పాలి. సాధారణంగానే కాఫిర్లు అనాగరికులు. నేరగాళ్లయితే మరీనూ. వాళ్లు కజ్జాకోర్లు. మహా మురికిగా ఉంటారు. పశువుల్లా బతుకుతారు.)

"Degradation underlay the classing of Indians with Natives... ...It would have been simple humanity if we were given special Quarters. The fault did not lie with the gaol authorities. It was the fault of the law that has made no provision for the special treatment of Asiatic prisoners. the (Chief Warder) was powerless to accomodate us beyond the horrible din and the yells of the Native prisoners throughout the day and partly at night also. Many of the Native prisoners are only one degree removed from the animal and often created rows and fought among themselves in their cells."

[*CWMG*, Vol.8 # 92, PP 182, 183]

(నేటివుల తరగతిలో చేర్చటమంటే భారతీయుల స్థాయిని దిగజార్చటమే... మాకు స్పెషల్ క్వార్టర్లను ఇచ్చి ఉంటే అది మానవత్వం అనిపించుకునేది. ఆ తప్పు జైలు అధికారులది కాదు. ఆసియన్ ఖైదీలకు స్పెషల్ ట్రీట్‌మెంటు ఇచ్చేందుకు వీలు కల్పించకపోవటం చట్టంలోనే లోపం. పొద్దంతా, కొంతవరకు రాత్రి కూడా నేటివ్ ఖైదీలు వేసే కేకలకు, చేసే గోలకు దూరంగా మమ్మల్ని ఉంచటానికి చీఫ్ వార్డరుకు అధికారం లేదు. నేటివు ఖైదీల్లో చాలామంది పశువులకంటే ఒక పిసరు మాత్రమే మెరుగు. వాళ్లు తరచు గొడవపడి సెల్సులో కొట్లాడుకునే వాళ్లు)

ఇదీ – దక్షిణాఫ్రికా జైల్లో తోటి ఖైదీలైన నల్ల జాతీయుల గురించి మన మహాత్ముడు చెప్పిన మాట! ప్రపంచమంటే ఏమిటో తెలియని లేత వయసులో, స్థిరమైన అభిప్రాయాలు ఏర్పడటానికి ముందుచేసిన అనాలోచిత వ్యాఖ్యలు కావవి. **'ఇండియన్ ఒపీనియన్'** పత్రికలో ఈ మాటలు రాసే నాటికి గాంధీగారి వయసు ఒకటి తక్కువ నలభై. అప్పటికి ఆయన దక్షిణాఫ్రికా వచ్చి 14 ఏళ్లయింది. ఆ దేశాన్ని పీల్చి పిప్పి చేస్తున్న దారుణ వర్ణ

వివక్ష, జాతి వివక్షల స్వరూప స్వభావాలు ఆపాటికి ఆయనకు పూర్తిగా అంతుబట్టి ఉండాలి. స్వయంగా తానే జాత్యహంకారులైన తెల్లవారి చేతిలో అనేక రకాల అవమానాలకు గురిఅయినందున అదే రకమైన జాత్యహంకారానికి భారతీయులకంటే ఎన్నో రెట్లు క్రూరంగా, ఘోరంగా బలి అవుతున్న నల్లజాతీయుల పట్ల ఆత్మీయతా, సంఘీభావమూ ఆయనలో సహజంగా పెంపొంది ఉండాలి కదా? మరి ఇదేమిటి? 1908 జనవరి 10న చట్ట ధిక్కార నేరానికి రెండు నెలల సాధారణ కారాగారవాస శిక్ష పడి, ట్రాన్స్‌వాల్ జైలుకి జీవితంలో తొలిసారిగా వెళ్లిన సందర్భంలో– గాంధీజీ కళ్లకు అక్కడి భూమి పుత్రులు అనాగరికులుగా, పశుప్రాయులుగా కనిపించారేమిటి? వారున్న సెల్సు పక్కనే భారతీయ ఖైదీలను ఉంచటం, ఆసియన్లకు స్పెషల్ ట్రీట్‌మెంటు ఇవ్వకుండా 'కాఫిర్' నేటివు నల్లోళ్లతో సమానంగా చూడటం అమానుషంగా, చట్టంలోని భయానక లోపంగా ఆయన నిర్ధారించారేమిటి? సత్యాగ్రహాలు జైలులో ఎటువంటి ప్రత్యేక వసతులూ, రాయితీలూ అపేక్షించరాదనీ, ప్రత్యేక సౌకర్యాలు ఇస్తామన్నా తీసుకోరాదనీ, అమల్లోని నిబంధనలకు కట్టుబడి ఉండాలనీ ప్రబోధించిన మహాత్ముడు కదా ఆయన? ఖైదులో భారతీయులనూ, ఆఫ్రికన్లనూ ఒకే తరగతి కింద చూడాలని తెల్ల ప్రభుత్వం నిబంధన పెట్టినప్పుడు సత్యాగ్రహ నియమం ప్రకారం దానిని గౌరవించి భారతీయుల లాగే తెల్లవారి దౌష్ట్యానికి గురి అవుతున్న ఆఫ్రికన్ల పట్ల దళిత జన బాంధవుడు సహానుభూతి చూపించి, ఐచ్ఛికంగా వారితో కలిసిపోవటానికి యత్నించాలి కదా? మరి – వారి గాలి సోకితేనే కంపరం అన్నట్లు ఈ నఖరాలేమిటి?

ఆఫ్రికా జైల్లో ఒక రాత్రి

***ద**క్షిణాఫ్రికాలో మొదటిసారిగా జైలుకెళ్లినప్పుడు గాంధీగారికి నేటివులకు దూరంగా భారతీయ ఖైదీలకు ప్రత్యేక ఏర్పాటు ఉంటే బావుంటుందనిపించింది. అది సాధ్యపడదని తెలిశాక అదీ ఒకందుకు మంచిదే అనుకున్నారట. నేటివులతో తమనూ కలిపి ఉంచితే నేటివ్ ఖైదీల జీవితాన్ని, వారి ఆచారాలను, వ్యవహారాలను దగ్గరగా అధ్యయనం చేసే అవకాశం చిక్కుతుంది లెమ్మని తాను భావించినట్టు విడుదలయ్యాక 'ఇండియన్ ఒపీనియన్' పత్రికలో (1908 మార్చి 7న) ఆయన రాసుకున్నారు. చదివితే మనకూ నిజమే కాబోలనిపిస్తుంది.*

నల్ల ఆఫ్రికన్లు గాంధీజీకి కొత్త కాదు! రెండేళ్ల కింద జులూ తిరుగుబాటు కాలంలో స్ట్రెచర్లు మోసే దళానికి సార్జంటు మేజరుగా ఆయన వారిని సన్నిహితంగా చూసిన వాడేనాయె! తెల్ల సైనికులు కొరడాలతో చెమ్డా ఒలిచే కార్యక్రమం పూర్తిచేశాక అభాగ్యుల పుండ్లను తెల్లవారు వద్దంటున్నా లెక్కచెయ్యక కడిగి మందురాసి కట్లు కట్టివారి కళ్లనిండా కృతజ్ఞతను చూశానని ఆయనే స్వయంగా ఆత్మకథలో రాసుకున్నారాయె! మిలటరీ డ్యూటీ, పని ఒత్తిడి, క్రమశిక్షణ నిబంధనల కారణంగా వారితో ఆత్మీయంగా మంచీచెడ్డా ముచ్చటించే సావకాశం ఆయనకప్పుడు దక్కి ఉండకపోవచ్చు. మొదటిసారి జైలుకెళ్లినప్పుడూ ఆ ముచ్చట తీరలేదు. ఎందుకంటే పక్కపక్కనే ఉన్నా **'కాఫిర్'** క్రిమినల్సున్న కొట్లు వేరు. గాంధి బృందం ఉన్న సెల్లు వేరు. పైగా ఖైదులో పడ్డ ఇరవై రోజులకే జనరల్ స్మట్స్‌తో మాట్లాడుకుని అటునుంచి అటే గాంధీగారు స్వేచ్ఛగా బయటికి వెళ్ళిపోయారు.

మళ్లీ తొమ్మిది నెలలకు గాని ఆఫ్రికన్ సోదరులను తిరిగి కలిసే అవకాశం మహాత్ముడికి దక్కలేదు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు లేకుండా ట్రాన్స్‌వాల్‌లో ప్రవేశించిన అపరాధానికి గాంధీని, మరో 15 మంది భారతీయులను దర్బాన్ నుంచి తిరిగి వస్తుండగా వోక్‌స్రస్ట్ స్టేషనులో 1908 అక్టోబరు 7న అరెస్టుచేసి రెండు నెలల సాధారణ ఖైదు విధించారు. వోక్‌స్రస్ట్ జైలులో భారతీయులను, నల్లవారిని వేర్వేరుగా ఉంచడమేగాక భారతీయులను

తెల్లవారితో కలపటంవల్ల ఏ గొడవా లేకపోయింది. గాంధీగారికి కాలం సుఖంగానూ గడిచింది. అక్కడ శిక్ష అనుభవిస్తూండగానే ఏదో కేసులో సాక్ష్యం చెప్పటానికి ఆయనను జొహాన్స్‌బర్గ్ తీసుకువెళ్లవలసి వచ్చింది. స్థానిక జైలులో ఆయనకు విడిది. అక్కడేమో ఆయనను వేరుగా ఉంచకుండా తీసుకుపోయి ఆఫ్రికన్ల సరసన పడేశారు.

ఇంకేం? అంతకంటే ఏమికావాలి? నేటివుల జీవితాన్ని వారి ఆచారాలను, వ్యవహారాలను దగ్గరగా అధ్యయనం చేసే అవకాశం గాంధీగారికి ఎట్టకేలకు కలిగింది కదా? కష్టసుఖాలు కలబోసుకుని వారితో అనుబంధం పెంచుకోవచ్చునని ఆయన సంతోషించి ఉండాలి కదా? ఎప్పుడో రెండేళ్ల కింద మిలిటరీ సర్వీసులో చేసిన విధంగా నేటివు సోదరులకు సపర్యలు చేసి సేద తీర్చుదామనీ మనకు తెలిసిన గాంధీగారు మానవతా ధర్మంతో తహతహలాడి ఉండాలి కదా? మరి, ఆ ఉద్విగ్న, ఉదాత్త సన్నివేశంలో మహాత్మాజీ ఎలా స్పందించారు? ఆయనే చెబుతారు వినండి: (1909 జనవరి 16వ తేదీ **ఇండియన్ ఒపీనియన్** పత్రికలో)

It was evening when we reached Johannesburg, ... I was given a bed in a cell of the prison where there were mostly Kaffir prisoners who had been lying ill. I spent the night in this cell in great misery and fear. I did not know that the very next day I would be taken among our own people, and thinking that I would be kept in this place all the time, I became quite nervous. I felt extremely uneasy...

The reason why I felt so uneasy was that the Kaffir and Chinese prisoners appeared to be wild, murderous and given to immoral ways. I did not know their language. A Kaffir started putting questions to me. I felt a hint of mockery even in this... I returned no reply. He asked me in broken English why I had been brought there in that fashion. I gave a brief reply, and then I lapsed into silence...

As soon as we rose the following day, I was taken to where the other prisoners were lodged... I have, Though, resolved in my mind on an agitation to ensure that Indian prisoners are not lodged with Kaffirs or others... I observed with regret that some Indians were happy to sleep in the same room as the Kaffirs, the reason being that they hoped for a secret supply of tobacco etc. This is a matter of shame to us. We may entertain no aversion to Kaffirs, but we cannot ignore the fact that there is no common

ground between them and us in the daily affairs of life. Moreover, those who wish to sleep in the same room with them have ulterior motives for doing so. Obviously, we ought to abandon such notions if we want to make progress.

[The Collected Works of Mahatma Gandhi, Vol.9 # 55, PP 256, 257]

(జొహాన్స్‌బర్గ్ చేరాక నా సామాన్లు నేనే మోసుకుంటూ కాలినడకన జైలుకు వెళ్లవలసి వచ్చింది. దీనిపై పత్రికల్లో ఘాటైన విమర్శలు వచ్చాయి. బ్రిటిషు పార్లమెంటులో ప్రశ్నలూ అడిగారు. చాలామంది బాధపడ్డారు. నేను రాజకీయ ఖైదీని. జైలు యూనిఫాంలో బరువుమోయిస్తూ నన్ను అంతదూరం నడిపించవలసింది కాదు.

మేము జొహాన్స్‌బర్గ్ చేరేసరికి సాయంత్రమైంది... ఒక జైలు గదిలో నాకు బెడ్ ఇచ్చారు. అక్కడ దాదాపు అందరూ కాఫిర్ ఖైదీలే. వారిలో చాలామంది జబ్బుపడి ఉన్నారు. ఈ సెల్లులో రాత్రంతా నేను మహాభయంతో, దుఃఖిస్తూ గడిపాను. ఆ మరునాడే నన్ను మన వాళ్ల దగ్గరికి తీసుకుపోతారని అప్పుడు నాకు తెలియదు. అక్కడ ఉన్నంత కాలమూ నన్ను అక్కడే ఉంచుతారనుకుని నేను చాలా కంగారుపడ్డాను. కడుపులో వికారం వేసింది. ఐనా నా కర్తవ్యంకోసం అలాంటి బాధలన్నీ భరించాల్సిందే అనుకున్నాను. నేను కూడా తెచ్చుకున్న భగవద్గీత తీసి, అప్పటి నా అవస్థకు సరిపోయే శ్లోకాలను చదివి, వాటిమీద ఆలోచిస్తూ నిబ్బరం తెచ్చుకున్నాను.

అంత కలవరపాటుకు కారణమేమిటంటే కాఫిర్, చైనీస్ ఖైదీలు ఆటవికుల్లా, హంతకుల్లా కనిపించారు. వారు నీతిబాహ్యమైన పద్ధతులకు అలవాటుపడ్డట్టున్నారు. నాకు వారి భాష తెలియదు. ఒక కాఫిర్ నా దగ్గరికి వచ్చి ప్రశ్నించసాగాడు. అందులో కూడా నాకు ఎగతాళి కనిపించింది. ... నేనేమీ బదులివ్వలేదు. నన్ను ఆవిధంగా ఎందుకు తీసుకువచ్చారని అతడు వచ్చీరాని ఇంగ్లీషులో అడిగాడు. నేను ముక్తసరిగా సమాధానమిచ్చి మౌనంలోకి వెళ్లిపోయాను...

మర్నాడు పొద్దున లేవగానే మిగతా భారతీయ ఖైదీలున్నచోటికి నన్ను తీసుకు పోయారు. ఐనా, కాఫిర్లతోనో ఇంకొకరితోనో భారతీయ ఖైదీలను కలిపి బస ఏర్పరచ కుండా చేయటానికి ఒక ఉద్యమం చేపట్టాలని నేను మనసులో నిశ్చయించు కున్నాను. కాఫిర్లు వున్న గదిలోనే వారితో కలిసి పడుకోవటానికి కొంతమంది భారతీయులు ఇష్టపడటాన్ని గమనించి నేను నొచ్చుకున్నాను. వారితో ఉంటే రహస్యంగా పొగాకు వగయిరాలు దొరకుతాయని వారి ఆశ. ఇది మనం సిగ్గుపడవలసిన విషయం. మనకు కాఫిర్లంటే ఏవగింపు ఉండనక్కర్లేదు. కాని వారికీ మనకు మధ్య దైనందిన జీవన వ్యవహారాల్లో సమానాంశం ఏదీ లేదన్న వాస్తవాన్ని మనం మరిచిపోకూడదు. పైగా

వారితో కలిసి ఒకే గదిలో ఉండాలని కోరుకునే వారికి నిగూఢమైన ఇతర ఉద్దేశాలున్నాయి. మనం అభివృద్ధి చెందాలనుకుంటే అలాంటి భావాలను విడనాడాలి.)

గాంధీ గారిచ్చిన ఈ వివరాలనుబట్టే అక్కడి దృశ్యం మన కళ్లకు కడుతుంది. పొద్దుగుంకే సమయానికి ఆయనను ఒక జైలు గదికి తీసుకెళ్లి పడుకోమన్నారు. అక్కడి ఖైదీల్లో చాలావరకూ ఆఫ్రికన్ నేటివులే. వారిలో చాలామంది జబ్బుపడి ఉన్నారు. రోగాలూ నొప్పులతో బాధపడుతూ ఆ స్థితిలో వారిని చూస్తే మనిషన్న వాడికి జాలివేస్తుంది. దయ కలుగుతుంది. చేతనైన సాయం చేద్దామన్న బుద్ధి పుడుతుంది. కాని మానవత్వం మూర్తీభవించిన మన మహామనీషికి అలాంటి సానుతాపమేదీ కలగలేదు. రెండేళ్లకింద జులు తిరుగుబాటు కాలంలో సర్కారీ పక్షాన తానుండి, కొరడాదెబ్బలకు గాయపడ్డ నేటివులను పుండ్లకు మందువేసి ఆదుకున్న తరవాత మళ్లీ ఇన్నాళ్లకు సోదర బాధితులను సేవించే అవకాశం కలిగింది కదా అని సంతోషించలేదు. 'ఏమిటి బాధ' అని రోగగ్రస్తులను కనీసం పరామర్శించలేదు. పైగా కాఫిర్ల మధ్య పడి ఉండాల్సిన కర్మం పట్టిందేమిటని పుట్టెడు దుఃఖంతో మన కరుణామయుడు తల్లడిల్లాడు. కాఫిర్లతో కలిసుంటే వారి ఆచారాలను, వ్యవహారాలను, జీవిత విధానాలను సన్నిహితంగా అధ్యయనం చేయవచ్చు ననుకున్నానని తరవాతి కాలంలో సొంత పత్రికలోనైతే రాసుకున్నారు. కాని యథార్థంగా కాఫిర్ల మధ్యకు వెళ్లేసరికి ఆయనకు కుతూహలానికి బదులు కలవరపాటు కలిగింది. ఉన్నన్ని రోజులూ వారితో కలిసిమెలిసి ఉండవచ్చునని అనుకోకపోగా... ఉన్నన్నాళ్లూ వాళ్ల మధ్యే పడి ఉండాలా ఏమిటి దేవుడా అని ఆయన మహాభయపడిపోయాడు. రోగార్తులు జ్వరంతోనో, నొప్పులతోనో మూలుగుతూంటే వారికి ఉపశమనం ఎలా కలిగించగలనా అని ఆయన తలపోయలేదు. కనీసం వారికి ఉపశమనం కలిగించమని భగవంతుడిని ప్రార్థించనూ లేదు. తీరిగ్గా భగవద్గీత తీసి అప్పటి తన దురవస్థకు తగినట్టి శ్లోకాలను చదివి, మననం చేసి, తనకు పట్టిన దుర్గతికి తన మీద తానే జాలిపడుతూ, దుఃఖపడుతూ తన లోకంలో తానున్నాడు.

'కాఫిర్ల'ను చూస్తే గాంధీజీకి వికారం కలిగినా గాంధీని చూస్తే 'కాఫిర్ల'కు వికారమేదీ కలగలేదు. తోటి మానవుడిని చూసినట్టే చూశారు. ఆయన ఎవర్నీ పట్టించుకోకుండా ఉలుకూ పలుకూ లేకుండా మొగం తిప్పుకున్నా వారు ఆయనను పలకరించారు. కనీసం ఒక్కడు ఆయన దగ్గరికి వెళ్లి "అదేమిటి, మిమ్మల్ని సామాను మోయిస్తూ వీధులవెంబడి నడుస్తూ అలా తీసుకొచ్చారు" అని తనకు వచ్చిన తత్తిబిత్తి ఇంగ్లీషులో పరామర్శించాడు. అయినా పెద్దాయన స్పందించ లేదు. సంభాషణ పొడిగించలేదు. ముక్తసరిగా జవాబిచ్చి ఊరుకున్నాడు. ఎందుకంటే అతడి మాటల్లో ఆయనకు ఎగతాళి ధ్వనించింది. కాఫిర్ల భాష ఆయనకు తెలియదు. వారు ఏమి మాట్లాడుకుంటున్నారో ఆయనకు అర్థంకాదు.

ఐనా వారంతా ఆటవికులు, హంతక ప్రవృత్తి కలవారు, నీతిమాలిన వారు అని ఆయన తనకు తాను అనేసుకున్నారు. అదృష్టం బాగుండి మరునాడు ఆయనను ఆ నరకం నుంచి విముక్తిచేసి, ఆయన కోరుకున్న సహచరుల దగ్గరికి తీసుకుపోయి ఉంచినా, కిందటి రాత్రి తాను పడిన 'యమ యాతన'ను మహాత్ముడు మరచిపోలేకపోయాడు. అటువంటి 'క్షోభ' తనలా మళ్లీ ఏ భారతీయుడికీ కలగకూడదనుకున్నాడు. అందుకోసం- భారతీయ ఖైదీలని కాఫిర్లతో కలిపి ఉంచరాదంటూ జైలు సంస్కరణకోసం పెద్ద ఉద్యమమే నిర్వహించాలని నిశ్చయించుకున్నాడు!

అలాగని- 'కాఫిర్లం'టే ఆయనకు అసహ్యం అనుకుంటారేమో! అలాందేమీ లేదట. వారికీ, మనకూ మధ్య రోజువారీ జీవిత విధానంలో ఎటువంటి సాపత్యం లేదు కనకే వారి పొడ మన వారికి సోకకుండా జైలులో అడ్డుగోడలు లేపి భారతీయ ఖైదీలను నల్ల కాఫిర్ల నుంచి వేరు చెయ్యదలిచారట. (ఆమాటకొస్తే తెల్లవారి జీవిత విధానంతోనూ భారతీయులకు సాపత్యం లేదు. ఐనా వారితో కలవటానికి మహాత్మాజీకి అభ్యంతరం లేదు. పైగా మహా ఇష్టం కూడా. ఎటొచ్చీ నల్లతోలు వారంటేనే ఈ గోరా సాహెబ్‌కు ఏవగింపు. సూటిగా చెప్పాలంటే అది కల్తీలేని వర్ణ వివక్ష.)

కాఫిర్లు అనాగరికులనీ, నర పశువులనీ తొలిసారి జైలుకెళ్లినప్పుడే గాంధీజీ తేల్చిచెప్పారు. వారికీ, మన వంటి నాగరికులకూ నడుమ సహజీవనం కుదరదని ఆయన దృఢనిర్ణయానికి వచ్చినప్పటికీ కొంతమంది భారతీయ ఖైదీలకు ఆయనకున్నంత ఉన్నత సంస్కారం లేకపోయింది. గండాగొండి కాఫిర్‌గాళ్లతో కలిసి వారున్న గదిలో వారితోబాటే పడుకోవటానికి వాళ్లకు అభ్యంతరం లేకపోగా, బోలెడు ఇష్టపడుతున్నారట. అది గమనించి గాంధీగారికి కంపరం పుట్టింది. వాళ్లంత ఇదైపోతున్నారంటే ఏదో మతలబు ఉండే ఉంటుందని ఆయన సమదృష్టికి తోచింది. పొగాకో మరొకటో తేరగా దొరుకుతుందన్న ఆశతోటే వాళ్లు కాఫిర్లతో రాసుకు పూసుకు తిరుగుతున్నారని ఆయన ఒక్క రాత్రిలోనే, అటు తిరిగి పడుకుని, భగవద్గీత శ్లోకాలు చదువుతూ కళ్లు మూసుకుని ధ్యానం చేస్తూనే కనిపెట్టేశారు. తనకలా అనిపించింది కనుక అదే నికార్సయిన నిజమని నమ్మారు.

'జులు తిరుగుబాటు' కాలంలో నేటివ్ ప్రజానీకాన్ని అణచే పుణ్యకార్యానికి రంగానికి కదలే బ్రిటిషు సైనికుల అవసరార్థం పొగాకును విరాళంగా పంపించాలని భారతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది ఈ మహాత్ముడే. తెల్ల సైనికులు సేవిస్తే తప్పులేదు కాని అదే పొగాకును నల్లవారు కోరుకోవటం మాత్రం ఆయనకు మహాపరాధంగా, నీతి బాహ్యంగా తోచింది! మనం అభివృద్ధి చెందాలంటే పొగాకుకు కక్కుర్తిపడటం, కాఫిర్లతో కలిసి తిరగటం లాంటి అనైతికమైన పనులను మానాలని ఆయన ముక్తాయించటం కొసమెరుపు. ఈ విధంగా ఒక రాత్రి అనుభవంతో తన జాతిజనులకు అద్భుతమైన నీతి బోధ

చేశానని గాంధిగారు భావించి ఉండవచ్చు. కాని- మనబోటి సందేహ జీవులకు మాత్రం ఆయన వర్ణించిన అనుభవంలో, దానిని ఆయన అర్థం చేసుకున్న తీరులో, దాని నుంచి ఆయన తీసిన నీతిలో పక్కా వర్ణ వివక్షే దర్శనమిస్తుంది. నల్ల జాతి జన బాహుళ్యం పట్ల దొరలను మించిన జాతి దురహంకారమే కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

ఒక్క ఆఫ్రికాలోనే కాదు. ప్రపంచంలో ఎక్కడైనా, ఆఖరికి నవనాగరిక బ్రిటన్, అమెరికాలాంటి దొరల దేశాల్లోనైనా ఖైదీలు మొరటుగానే ఉంటారు. వెగటుగానే మాట్లాడుతారు. అనేక దౌర్బల్యాలకు, పైత్యప్రకోపాలకు లోనై రకరకాల నేరాలు చేసి శిక్ష అనుభవించే రౌడీలు, గూండాలు, దొంగలు, ఖూనీకోర్లే చెరసాలలో ఉంటారని అందరికీ తెలుసు. తెలిసి కూడా జైలుకు సిద్ధపడి... స్వచ్ఛందంగా సత్యాగ్రహం చేసినవారు జైలుకు వెళ్లాక సహజంగా ఎదురయ్యే జుగుప్సావహ అనుభవాలకూ మానసికంగా సిద్ధపడాలి. అక్కడికి చేరాక రాజకీయ ఖైదీలన్న ప్రత్యేక ప్రతిపత్తి లభించని పక్షంలో మామూలు కరకు నేరగాళ్లతో కలిసి, వారితోబాటే తింటూ, వారు వెళ్లే మరుగుదొడ్డికే వెళుతూ, వారితోనే సహజీవనం చేయాలి. సభ్యత, సంస్కారం కలిగిన దేశభక్తులకు అది దుస్సహమే. భయానకమైన నరక యాతనే. దక్షిణాఫ్రికాలోనే కాక భారతదేశంలోనూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో లక్షలాది సత్యాగ్రహులూ, విప్లవయోధులూ యమ కూపాల్లాంటి చెరసాలల్లో అనుభవించిన భయంకర క్లేశమే అది. స్వాతంత్ర్య పోరాట కాలంలో సత్యాగ్రహులు జైలు నిబంధనలను పాటించాలని, ప్రత్యేక సౌకర్యాలను కోరరాదనే గాంధీగారు చెప్పారు తప్ప మామూలు నేరగాళ్ల పొడ తగలకుండా దేశభక్తులను వేరుచేస్తూ భారతీయ చెరసాలల్లో దడి కట్టించాలని డిమాండు చేయలేదు. ఇక్కడి జైళ్లలో ఇక్కడి నేరగాళ్లతో సత్యాగ్రహులు సహజీవనం చేయగలిగినప్పుడు దక్షిణాఫ్రికా జైళ్లలో నల్లజాతి నేరగాళ్ల గాలి సోకకుండా భారతీయ ఖైదీలను వేరుగా ఉంచాలని మహాత్ముడు ఉద్యమించటంలో అర్థంలేదు.

ఆఫ్రికన్లు అనాగరికులు, ఆటవికులు, జంతు స్థాయికి పిసరంతే ఎక్కువయినవారు కాబట్టి... వారికీ మనకూ ఆచార వ్యవహారాల్లో పొంతన లేదు కాబట్టి... వారూ మనమూ కలిసి బతకలేమని, మన చాయలకు రాకుండా వారిని దూరంగా వెలివేయాలని గాంధీ చేసిన వాదమూ తర్కానికి నిలవదు. సరిగ్గా నల్లజాతి ఆఫ్రికన్లనుద్దేశించి ఆయనన్న మాటలే భారతీయులనుద్దేశించి తెల్లతోలు దొరాధములూ అన్నారు. ఉదాహరణకు- 'హిందూ దేశం మనిషి కేవలం జంతు ధర్మాలు నిర్వర్తించటానికి మాత్రమే పరిమితమైన జీవిలా కనపడుతున్నాడు' అని గవర్నర్ జనరల్ **హేస్టింగ్సు** దొరవారు 1813లో అద్భుతంగా నిజనిర్ధారణ చేశారు! హిందూ దేశంలో ఉన్నదంతా కుళ్లు... 'ఎక్కడ చూసినా మురికి మనుషులు, మురికి మనసులు- అని **కాథరిన్ మేయో** దొరసాని ప్రఖ్యాతి

చెందిన **'మదరిండియా'** గ్రంథంలో తేల్చారు. అది 'డ్రయినేజి ఇన్స్పెక్టర్ రిపోర్టు'లా ఉన్నదని గాంధీజీయే చాలా బాగా అధిక్షేపించారు.

మంచిదే. కాని– ఇండియాలోని నల్ల జనాభాను చూసి తెల్లదొరలు చేసిన వ్యాఖ్యలనే ఇంచుమించుగా వారు చూపిన కారణాలతోనే ఆఫ్రికన్ తెల్లవారిని ఉద్దేశించి మన మహాత్ముడూ చేశారు కదా? దానికి ఏమనుకోవాలి? ఆఫ్రికన్లకూ సంబంధించినంతవరకూ ఆయన కూడా తెల్లదొరలకు తోడుబోయిన జాత్యహంకారేనా? ఆఫ్రికాను అన్యాయంగా, దుర్మార్గంగా ఆక్రమించిన తెల్లవారిపై ఆఫ్రికన్లు ఓరిమి నశించి తిరగబడితే, వారిని నిర్దాక్షిణ్యంగా అణచటంలో తెల్లవారికి స్వచ్ఛందంగా సహాయపడటం 'ఫెలో కాలనిస్టులు' (సహవలస వాసులు)గా భారతీయుల కర్తవ్యమని గాంధీజీ ప్రబోధించడంలోని మర్మ మేమిటి? భారతీయులకు హక్కులు, రాయితీలు, ఇతోధిక సౌకర్యాలు కోరుతూ తెల్లదొర తనంపై సత్యాగ్రహ సంఘర్షణ మొదలెట్టి, దొరతనపు కరకును చవిచూసి, జైలుకెళ్లిన తరవాత కూడా పీడనకు, దోపిడీకి గురైన ఆ దేశపు నేలతల్లి పుత్రులలో సంఘీభావం చూపకుండా, దొరలతో సమాన ఫాయాలో వారిని ఏవగించుకోవటం నడమంత్రపు దొర మనస్తత్వం కాక మరేమిటి?

'కూలీ'కి కాఫిర్ లోకువ

***ఎం**తైనా ఆయన మన 'జాతిపిత!' కోట్లాది భారతీయులు తర తరాలుగా గుండెల్లో గుడికట్టి పూజించుకుంటున్న మహామనీషి. మహోన్నతమని- మనం అనుకునే ఆయన వ్యక్తిత్వంలో నలుసంత నలుపు ఉందంటే మనకు ఒక పట్టాన నమ్మబుద్ధికాదు.*

తెల్లవారి జాత్యహంకారంపై జీవితాంతం రాజీలేకుండా పోరాడాడని మనం విశ్వసించే జాతీయ నాయకుడిలో తెల్లవాళ్లే తెల్లబోయేంతటి జాత్యహంకారం గూడుకట్టిందంటే... భారతదేశంలో భారతీయులపై ఆంగ్లేయులు చూపినంతటి జాతి వివక్షను, వర్ణ వివక్షను దక్షిణాఫ్రికాలో ఆఫ్రికన్లపై 'మహాత్ముడే' కనపరచారంటే విశ్వాసం కలగదు. ఇంతకుముందు ఉదహరించినవి జైల్లో ఆఫ్రికన్ నేరస్థులను ఉద్దేశించి గాంధీజీ చేసిన వ్యాఖ్యలు. కాబట్టి ఆయన అసహ్యించుకున్నది కరకు నేరగాళ్ల నీచత్వాన్ని, ధూర్తత్వాన్ని మాత్రమేనేమో? మొత్తంగా ఆఫ్రికన్ నల్లజాతిని కాదేమో- అన్న శంక సహజంగానే కలుగుతుంది.

ఇండియాకు తిరిగి వచ్చాక గాంధీగారు దీర్ఘకాలం జాతీయోద్యమాన్ని నడిపించి, అనేక పర్యాయాలు జైలుకెళ్లారు. ఒక్కోసారి సంవత్సరాల పర్యంతం ఖైదులోనే ఉన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గడించిన 'మహాత్ముడు', జాతీయ కాంగ్రెస్‌కు సర్వాధికారి అయిన జాతీయ నాయకుడు కాబట్టి జైల్లో ఆయన హోదాకు తగినట్టు ప్రత్యేక బస, అందులో ఆయనకూ ఆయన సహాయకులకూ ప్రత్యేక సౌకర్యాలు, గౌరవ మర్యాదలు బాగానే లభించాయి. దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం చేసి 1908లో జైలుపాలైన సమయాల్లో ఆయనకు అధికారికంగా అలాంటి గుర్తింపూ లేదు. వి.వి.ఐ.పి. ఖైదీగా ప్రత్యేక వసతులూ లేవు. జైల్లోని మిగతా ఖైదీల్లాగే ఆయననూ చూశారు. గూండాలూ, రౌడీలూ, దొంగలూ, ఖూనీకోర్ల మధ్యే ఆయననూ పడేశారు.

వారేమో వారి సంస్కారానికి తగ్గట్టు ప్రవర్తించారు. తలుపుల్లేని మరుగుదొడ్డిలో కూచున్న గాంధీజీని ఒకడు బలవంతంగా ఎత్తి అవతలకు విసిరేశాడు. ఇద్దరేమో స్వలింగ సంపర్కానికి ఉపక్రమిస్తూ ఆయన కళ్లపడ్డారు. ఖైదీల అనాగరిక ప్రవర్తన, వారి దుర్భాష,

వారు చేసే రణగొణధ్వని మర్యాదస్తుడైన గాంధీ భరించలేకపోవటం సహజమే. నేటివ్ ఖైదీల కుసంస్కారానికి ఆగ్రహించే, నల్లవారిలో అలాంటి నేరగాళ్లను మాత్రమే దృష్టిలో పెట్టుకునే అప్పటి వేడిలో అటువంటి తీవ్ర వ్యాఖ్యలు చేశారేమోనన్న సందేహం కలగటమూ సహేతుకమే.

కాని– ఆఫ్రికన్లంటే గాంధీగారికి అసహ్యం జైలుకు పోయాక కలిగిందీ కాదు. కరకుబారిన నేరగాళ్లకు మాత్రమే పరిమితమైనదీ కాదు. 1908లో జైలుకు వెళ్లటానికి పది పదిహేనేళ్ల ముందునుంచే ఆయనకు నల్లజాతీయులంటే ఏవగింపు! ఇంకా చెప్పాలంటే ఆఫ్రికన్ గడ్డపై కాలిడినది మొదలుకుని 21 ఏళ్ల తరవాత నిష్క్రమించేదాకా 'నల్లవాళ్ల' మీద చులకనభావం ఆయనలో తొణికిసలాడుతూనే ఉంది. అనాగరికులు, ఆటవికులు అయిన నల్ల "కాఫిర్ల"తో భారతీయులను సరిసమానంగా చూడటం ఆయనకు ఎప్పుడూ ఒళ్లు మండించేది. తెల్లవారితో సమాన ఫాయాలో బతకాలి... మనం మనం ఒకటి అని తెల్లవారిచేత గుర్తింపజేయాలి అని ఆయన మనసు ఉవ్విళ్లూరేది.

దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టిన మరుసటి సంవత్సరమే (1894 డిసెంబర్‌లో) నేటాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్, లెజిస్లేటివ్ అసెంబ్లీల మాన్య సభ్యులకు రాసిన బహిరంగ లేఖలో గాంధీగారు ఇలా అన్నారు.

"I venture to point out that both the English and the Indians spring from a common stock, called the Indo-Aryan... A general belief seems to prevail in the colony that the Indians are little better, if at all, than savages or the Natives of Africa... with the result that the Indian is being dragged down to the position of a raw Kaffir."

[*The Collected works of Mahatma Gandhi*, Vol. 1, # 55, PP 192 -193]

(ఆంగ్లేయులు, భారతీయులు ఇండో-ఆర్యన్ అనే ఒకే జాతి నుంచి ఉద్భవించినవారని నేను గుర్తు చేయదలిచాను... ఆటవికులకన్నా, ఆఫ్రికన్ నేటివులకన్నా భారతీయులు ఎక్కువ కారన్న సాధారణాభిప్రాయం మన కాలనీలో నెలకొన్నది. దాని ఫలితంగా భారతీయుడిని నాటు కాఫిర్ స్థితికి దిగజార్చి వేస్తున్నారు.)

ఇందులో 'కాఫిర్' మాటకు అర్థమేమిటని వెదుక్కోనవసరం లేదు. "దక్షిణాఫ్రికా నేటివు లందరికీ కలిపి ఆ పదాన్ని లూజుగా వాడుతుంటారని" గాంధీ రచనల గ్రంథావళిలో ఆ పేజికిందే వివరణ ఉంది.

1896 జూన్‌లో గాంధీజీ భార్యాబిడ్డలను తీసుకువెళ్లటానికి ఇండియా వచ్చారు. ఆయన ఖర్చులన్నీ నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ భరించింది. ఇక్కడున్న ఐదు నెలల్లో

దక్షిణాఫ్రికాలో భారతీయ ప్రముఖులు ఎదుర్కొంటున్న దుర్భర సమస్యల మీద భారతీయ మేధావుల మద్దతును కూడగట్టటానికి ఆయన విస్తృతంగా పర్యటించి అనేక విధాల కృషిచేశారు. "దక్షిణాఫ్రికాలో బ్రిటిష్ ఇండియన్ల స్థితి - భారత ప్రజలకు ఒక విజ్ఞప్తి" పేర సొంత రాష్ట్రం గుజరాత్‌లో వెలువరించిన కరపత్రంలో ఆయన ఇలా అన్నారు.

We are classed with the natives of South Africa - Kaffir race... There is a law which says that natives and Indians, when driving cattle must be provided with certain passes... The Indian is put on the same level with the native in many other ways also. Lavatories are marked "Natives and Asiatics" at the railway station... we felt the indignity too much.)

[CWMG, Vol 1, # 101, PP 364, 367]

(మమ్మల్ని కాఫిర్ జాతీయులైన దక్షిణాఫ్రికా నేటివుల తరగతిలో చేర్చారు... నేటివులకూ, ఇండియన్లకూ పశువులను తోలుకెళ్లేప్పుడు పాసు ఉండి తీరాలని ఒక శాసనం ఉంది... ఇంకా చాలా రకాలుగా భారతీయుడిని నేటివులను ఒకే రకంగా చూస్తున్నారు. రైల్వేస్టేషన్లలో మరుగుదొడ్ల మీద "నేటివులకు, ఆసియన్లకు" అని రాసి ఉంటుంది... ఇది భరించరాని అవమానమని మేము భావించాము.)

దక్షిణాఫ్రికాలోని "లక్ష మంది భారతీయుల" తరఫున వెలువరించిన ఈ కరపత్రంలో ఆసక్తికరమైన అనేక గణాంక వివరాలనిచ్చారు. ఉదాహరణకు నేటాల్ రాష్ట్రంలో నేటివుల జనాభా 4 లక్షలు కాగా యూరోపియన్ల సంఖ్య 50 వేలు, భారతీయులు 51వేలు. దీన్నిబట్టే ఆ గడ్డ ఆఫ్రికన్ నేటివులదనీ, వారి నేలను ఆక్రమించి వారి మీదే యూరోపియన్లు దాష్టీకం చలాయిస్తున్నారనీ అర్థమవుతుంది. ఆఫ్రికన్లతో సమానంగా భారతీయులు జాతి వెలి దుర్విధానానికి లోనవుతున్నప్పుడు భారతీయులకు సంఘీభావం ఉండాల్సింది నేటివులతో! వ్యతిరేకించాల్సిందీ, పోరాడాల్సిందీ తమనంతటి దుర్విచక్షణకు గురిచేస్తున్న తెల్లవారి జాత్యహంకారం మీద! కదా? కాని చిత్రం! గాంధీగారు మాత్రం దక్షిణాఫ్రికా గడ్డమీద తెల్లవాడిదే హక్కు అన్నారు. ఎల్లకాలం అలాగే ఉండి తీరాలన్నారు. తెల్లజాతి ఆధిక్యాన్ని తాము ఎన్నడూ ప్రశ్నించబోమన్నారు. ఆ ఆధిక్యానికి ఇబ్బంది కలిగించే ఎటువంటి పనిని చేయబోమన్నారు. అంతేకాదు. సాంఘిక సమానత్వాన్నీ తామెన్నడూ కోరబోమన్నారు. నమ్మలేకపోతున్నారా? ఆయన మాటల్లోనే చిత్తగించండి:

We believe as much in the purity of race as we think they do... we believe also that the White race in South Africa should be the predominating race.

[*Indian Opinion*, 24-9-1903, *CWMG* Vol.3, # 163, PP 255, 256]

(జాతి స్వచ్ఛతను కాపాడాలని వారికున్నంత తపన మాకూ ఉంది... దక్షిణాఫ్రికాలో తెల్లజాతికి మాత్రమే ప్రాబల్యం ఉండాలని మేము కూడా విశ్వసిస్తున్నాము)

We do not aspire to social equality, and I dare say our social evolution lies along different lines. We have stated so repeatedly- that we shall not at present ask for the whole franchise. We understand who is the predominant race here. In the process of time, when we have deserved it, we shall get the franchise also.

[*CWMG*, Vol.14, 172, P189]

(మనం సాంఘిక సమానత్వాన్ని కోరటం లేదు. మన సామాజిక పరిణామక్రమం దానికి భిన్నమైన రీతుల్లో సాగుతుంది. అందరికీ ఓటు హక్కును కూడా మనమిప్పుడు అడగడంలేదు. ఆ సంగతి అనేక పర్యాయాలు చెప్పాము. ఇక్కడ పెత్తనం చేసే జాతి ఏదో మనకు తెలుసు. కాలక్రమంలో మనం అర్హత సంపాదించుకుంటే ఓటు హక్కూ మనకు వస్తుంది.)

రెండు దశాబ్దాలు దక్షిణాఫ్రికాలో జీవించి, అక్కడి పీడనను, ప్రజల వేదనను, నెత్తురు మరగించే దారుణ జాతి వివక్షను ప్రత్యక్షంగా చూసి, దీర్ఘకాలం ప్రజాజీవితంలో చురుకైన పాత్ర వహించి ఇండియాకు తిరిగివచ్చే ముందు 1914 జూన్ 30న 'నేటాల్ మెర్క్యురీ' పత్రికలో గాంధి మహాత్ముడు సెలవిచ్చిన అక్షర లక్షలు విలువచేసే అద్భుత అభిప్రాయమిది.

జాతి వివక్ష ఎంత భయంకరంగా ఉంటుందో గాంధీజీ కంటే బాగా ఎవరికీ తెలియదు. "దక్షిణాఫ్రికా అంతటా భారతీయులంటే తగని అసహ్యం. యూరోపియన్ల దృష్టిలో ప్రతి భారతీయుడూ 'కూలీ'యే! మన దుకాణదార్లని 'కూలీ దుకాణదారులు' అంటారు. భారతీయ క్లర్కులనూ, టీచర్లనూ 'కూలీ క్లర్కులు', 'కూలీ టీచర్లు' అని పిలుస్తారు. ఇంగ్లీషు విద్యనభ్యసించిన భారతీయులకు కూడా వీసమెత్తు గౌరవం ఇవ్వరు. దక్షిణాఫ్రికాలోని చాలా ప్రాంతాల్లో రాత్రి 9 తరువాత పాసులేనిదే మనం ఇల్లు కదలటానికి వీల్లేదు. హోటెళ్లలోకి మనల్ని రానివ్వరు. ఫుట్‌పాత్‌ల మీద నడవనివ్వరు. అఘాయిత్యమేదీ జరక్కుండా ట్రాముకార్లు ఎక్కగలమన్న ఆశలేదు. కోచ్‌లలో బయట డ్రయివరు దగ్గర సర్దుకోవాల్సిందే తప్ప మిగతా ప్రయాణికులతోబాటు మనల్ని లోపల కూచోనివ్వరు. పబ్లిక్ బాత్‌రూంలు మనకోసం కాదు. హైస్కూళ్లలో ఇండియన్లకు ప్రవేశం లేదు. ఇండియా నుంచి హైకోర్టు జడ్జి వెళ్లినాసరే అక్కడి హోటెల్లో బస దొరకదు. డైనింగు హాల్లో తినే యోగం అసలే లేదు. చేతిలో ఫస్ట్‌క్లాస్ టిక్కెటున్నా చాలా ప్రాంతాల్లో థర్డ్‌క్లాస్ కంపార్టుమెంట్లో కాఫిర్లతో కలిసి గొర్రెల్లా ప్రయాణం చేయాల్సిందే. 1894 వరకూ నేటాల్‌లో మనవారికి యూరోపియన్లతో సమానంగా ఓటు హక్కు ఉండేది. దాన్ని కాస్తా చట్టం చేసి లాగేశారు. మొత్తం ఆసియన్లందరికీ ఓటు హక్కు తీసి పారేశారు.

ఎక్కడికిపోయినా మనల్ని పరాన్నభుక్కులుగా, నాగరికత లేని ఆటవికులుగా చిన్నచూపు చూస్తారు. ఆ అవమానాలను సహించటం దుర్భరం" అంటూ 1896 భారత పర్యటనలో బొంబాయిలోనూ, మద్రాసులోనూ పెద్దబహిరంగసభల్లో మహాత్ముడు చేసిన సుదీర్ఘ ప్రసంగాలను వింటే ఎవరికైనా గుండె జలదరిస్తుంది. మనల్ని అన్నన్ని విధాల జాతి దురహంకారంతో సతాయిస్తున్న తెల్లదొరల కండకావరాన్ని తలచుకుంటే కడుపుమండుతుంది.

కాని వింతల్లోకెల్లా వింత ఏమిటంటే ప్లీడరుకు సహజంగా ఉండే వాగ్ధాటితో తన క్లయింట్లయిన భారతీయ వర్తక సమాజం దక్షిణాఫ్రికాలో పడుతున్న కష్టాలను, అడుగడుగునా ఎదుర్కొంటున్న దుర్వివక్షను బొమ్మకట్టినట్టు చిత్రించిన గాంధీగారికే తెల్లదొరల దాదాగిరి మీద, వారు పాటించే దుర్మార్గపు జాతి వెలి విధానం పట్ల ఏహ్యత లేదు. మమ్మల్ని పశువులకంటే హీనంగా చూడటానికి మీరెంత, మీ మిడిసిపాటెంత అని ధైర్యంగా ఎదిరించాలన్న పౌరుషం లేదు. పైగా తెల్లవారిది రాజా జాతి. వారి పెత్తనమే ఇక్కడ కొనసాగాలి. దానికి అడ్డుపడే ఉద్దేశం మాకు ఎంతమాత్రం లేదు. సామాజిక న్యాయం అడగనే అడగం. ఓటు హక్కును కూడా మాకు అర్హతకలిగి, దొరలు దయతలిచి ఇచ్చినప్పుడే తీసుకుంటాం... అని సత్యాగ్రహ సృష్టికర్త అనడం బానిస మనస్తత్వానికి సూచిక. తమనంత కర్కశమైన జాతి వివక్షకు గురిచేసిన దురహంకారుల జాతిపై ఆరాధనాభావం చూపటమే విడ్డూరమనుకుంటే దానిని మించిన చోద్యం- ఒక చెంప తెల్లవారి చేతిలో జాతి వివక్షకు గురవుతూనే మరో వంక ఆఫ్రికన్ నల్లవారిపై అదే రకమైన జాతి వివక్షను గాంధీయే చూపటం! భారతీయులందరినీ 'కూలీలు' అని తెల్లవారు తూలనాడుతున్నందుకు బాధపడుతూనే ఇంకోవైపు ఆఫ్రికన్ నల్లజాతీయులందరినీ 'కాఫిర్ల'ని మహాత్ముడే చులకన చెయ్యటం! ఇండియన్లని ఫుట్‌పాత్‌ల మీద నడవనియ్యటంలేదనీ, ట్రాముల్లో, కోచ్‌ల్లో ఎక్కనివ్వటం లేదని లబలబలాడుతూనే నల్లకాఫిర్లను భారతీయులుండే ప్రాంతాల్లోకి రానివ్వరాదని, ట్రాముల్లోకి అడుగుపెట్ట నివ్వరాదని హుంకరించటం! ఇది ఎటువంటి మనః స్థితిని సూచిస్తుంది?

మచ్చుకు- జొహాన్స్‌బర్గ్ ఆరోగ్య, వైద్య అధికారి డాక్టర్ సి.పోర్టర్‌కి 1904 ఫిబ్రవరి 15న గాంధీ రాసిన ఈ లేఖ చూడండి:

Why, of all places in Johnnesburg, the Indian location should be chosen for dumping down all the Kaffirs of the town passes my comprehension... The Town Council must withdraw the Kaffirs from the location. About the mixing of the Kaffirs with the Indians, I feel most strongly. I think it is very unfair to the Indian

population, and it is undue tax on even the proverbial patience of my countrymen.

[CWMG, Vol.4, 173, PP 58, 59]

(జొహాన్స్‌బర్గ్‌లో ఎన్నో ప్రదేశాలుండగా భారతీయులుండే ప్రాంతాన్నే కాఫిర్లను తెచ్చి పడెయ్యటానికి ఎందుకు ఎంచుకోవాల్సి వచ్చిందో నాకు అర్థంకావటంలేదు... టౌన్ కౌన్సిల్‌వారు అక్కణ్నించి కాఫిర్లను తొలగించి తీరాలి. ఇండియన్లతో కాఫిర్లను కలపటం మీద నాకు తీవ్ర అభ్యంతరాలున్నాయి. ఇది భారతీయ జనాభాకు చాలా అన్యాయం.)

అలాగే జొహాన్స్ బర్గ్‌లో సంచలనం రేపిన ట్రామ్ కేసులో మేజిస్ట్రేటు తీర్పుపై 'ట్రాన్స్‌వాల్ లీడర్' పత్రిక వ్యాఖ్యకు 1906 మే 21న గాంధీగారి స్పందనను కాస్త గమనించండి:

You say that the Magistrate's decision is unsatisfactory, because it would enable a person, however unclean, to travel by a tram and that even the Kaffirs would be able to do so. ...The court has declared that the Kaffirs have no legal right to travel by the trams... Thanks to the court's decision, only clean Indians or coloured people other than Kaffirs can now travel by trams.

[CWMG Vol.5, Page 235]

(మేజిస్ట్రేటు నిర్ణయంవల్ల మురికి మనుషులు, ఆఖరికి కాఫిర్లు కూడా ఇక ట్రాముల్లో ప్రయాణించగలరని మీరు అసంతృప్తి వ్యక్తపరిచారు... కాని కాఫిర్లకు ట్రాముల్లో ప్రయాణించేందుకు చట్టరీత్యా హక్కులేదని కోర్టు ప్రకటించింది. దాని ఫలితంగా కాఫిర్లు కాక – పరిశుభ్రంగా ఉండే ఇండియన్లు ఇతరులు మాత్రమే ఇకపై ట్రాముల్లో తిరగ గలరు.)

అందరికీ నేను లోకువ... నాకు నంబికొండాయ లోకువ అన్నట్టు దొరలందరికీ 'కూలీలు'(ఇండియన్లు) లోకువైతే 'కూలీ' నాయకుడికేమో 'కాఫిర్లు' లోకువ! సంశయ లాభం ఇవ్వటానికి ఆస్కారమే లేని, దాపరికం అసలే లేని ఇలాంటి విపరీత వ్యాఖ్యలను వింటే ఎవరైనా వాటిని చేసినవాడు పక్కా, రేసిస్టు, జాత్యహంకారి అనే అని తీరాలి. కాని చిత్రం! ప్రపంచం మాత్రం గాంధీని ప్రేమమూర్తి, విశ్వమానవుడు, కరుణామయుడు, అభినవ జీసస్ అంటూ ఆకాశానికెత్తింది!

ఇది ఎలా జరిగింది?

సత్యంతో భలే ప్రయోగం

"సత్యంతో నేను ఎన్నో ప్రయోగాలు చేశాను. ఆ ప్రయోగాలు మినహా నా జీవితంలో ఏమీ లేదు" అంటారు మహాత్మాగాంధి తన 'ఆత్మకథ' పీఠికలో. అది అక్షరాలా నిజం. సత్యంతో గాంధీగారు ప్రపంచంలో బహుశా ఏ మహా నాయకుడూ చేయనన్ని ప్రయోగాలు చేశారు. ముఖ్యంగా- ఇబ్బందికరమైన సత్యాలను మరుగుపరచి, సమయానుకూలంగా వాటికి అసత్యపు మేలిముసుగు వేసే ప్రక్రియలో! ఆయనన్నట్టు జీవితమంతా నిరంతరం సాగిన ఈ ప్రయోగ పరంపరలో మొదటి పెద్ద ప్రయోగం ఆయన పబ్లిక్‌లైఫులో మొదటి మజిలీలోనే మొదలైంది.

దక్షిణాఫ్రికాను వదిలి ఇండియాకు తిరిగొచ్చాక గాంధీజీకో చిక్కుసమస్య ఎదురైంది. ఆయన గతం ఆయనను వెన్నాడింది. బారిస్టరు అయ్యాక ప్రాక్టీసు లేక, ఏమిచేయాలో తోచక, జీవితంలో విఫలమయ్యానా అని మథనపడుతున్న స్థితిలో గాంధీకి దక్షిణాఫ్రికా అవకాశం వచ్చింది. పోర్బందరుకు చెందిన ముస్లిం వ్యాపారులు కొందరు తమ కేసులు చూసిపెట్టటానికి ఆ దేశం రమ్మని పిలిచారు. 1893 మే చివరిలో డర్బాన్‌లో అడుగు పెట్టేనాటికి గాంధి వయసు 24. స్వతహాగా పిరికివాడు. పైగా తగని బిడియం. మొదట్లో భారతీయ వ్యాపారుల ప్లీడరుగానే ఆయన తనను తాను భావించుకున్నాడు. వారి కళ్లతోనే దక్షిణాఫ్రికాను చూశాడు. పోనుపోను రాటుదేలి, ఆ వ్యాపార వర్గానికి రాజకీయ నాయకుడిగా ఎదిగి, భారతీయుల ప్రయోజనాలకై ప్రచారం సాగించి, ఉద్యమాలు నడిపినప్పటికీ... తన క్లయింట్లయిన వ్యాపార వర్గానికి ఉండే రాగద్వేషాలనే తాను సైతం దక్షిణాఫ్రికాలోని ఇతర వర్గాల మీద కనపరిచాడు. వారిలాగే తానూ భారతీయ సమాజంలో అత్యధిక సంఖ్యాకులైన కాంట్రాక్టు(ఇండెంచర్) కూలీలను, కాంట్రాక్టు ముగిసి అక్కడే స్థిరపడ్డ మాజీ కూలీలను చిన్నచూపు చూశాడు.

ప్లాంటేషన్ల యజమానులు ఇండెంచరు కూలీలకు కనీస వేతనాలివ్వక, ఇచ్చేవాటిలో కూడా విపరీతంగా కోతపెడుతూ, గొడ్లను బాదినట్టు బాదుతూ, కట్టుబానిసల్లా చూస్తూ,

అమానుషంగా హింసిస్తూ, వందల మందిని ఆత్మహత్యలకు పురికొల్పుతున్నట్టు విస్తృతంగా గగ్గోలు లేచినా గాంధీగారు పట్టించుకోలేదు. 'భారతీయ కూలీలు మురికి మనుషులు, అబద్ధాలకోర్లు అయిన మాట నిజమే. కాని భారతీయ వ్యాపారులు అలాంటివారు కారు. వారు చాలా పెద్ద మనుషులు. పరిశుభ్రంగా జీవిస్తారు' అంటూ కిందటి అధ్యాయంలో ఉటంకించిన నేటాల్ లెజిస్లేటర్లకు బహిరంగ లేఖలో బారిస్టర్ గాంధీ తన క్లయింట్లను వెనకేసుకు వచ్చారు. తన దేశపు కూలీలను చిన్నచూపు చూసినట్టే, ఆ గడ్డమీద పుట్టిన ఆఫ్రికన్లనూ 'కాఫిర్ల'ని, 'అనాగరికులని', 'నరపశువులని' ఈసడించారు. వారి పొడే గిట్టనట్టు అసహ్యించుకున్నారు. ఆ అసహ్యాన్ని దాచుకోకుండా అనేక సందర్భాల్లో అనేక విధాల వ్యక్తీకరించారు.

అది తప్పు అని గాంధీగారు అనుకోలేదు. తన మనసులో ఉన్న అభిప్రాయాన్నే, ఆ కాలంలో తన తోటివారందరికీ ఉన్న భావాలనే ఆయనా (నాయకుడు కనక ఇంకొంచెం గట్టిగా) బల్లగుద్ది చెప్పారు. ఆ స్టేట్‌మెంట్లు ఇచ్చే సమయంలో ఆయనకు మునుముందు తాను "మహాత్ముడు" అవుతాననీ, యావద్భారతానికీ తిరుగులేని నాయకుడై ప్రపంచ ప్రఖ్యాతి చెందుతాననీ తెలియదు. జీవితంలో సగానికిపైగా ఆయనకు దక్షిణాఫ్రికాలోనే గడచిపోయింది. అక్కడ ఉన్నంత కాలమూ దక్షిణాఫ్రికాయే తన కార్యక్షేత్రమని ఆయన భావించాడు. దొరల మీది ఆరాధనాభావంతో దొరల్లాగే ఆఫ్రికన్ ప్రజలను ఏవగించుకున్నాడు. 21 ఏళ్లపాటు దక్షిణాఫ్రికాలో గడిపి, 45వ ఏట ఇండియాకు తిరిగి వచ్చాక ఆయన జీవితమే మారిపోయింది. "మహాత్ముడన్న" పేరు, "అహింసాప్రవక్త" అన్న అంతర్జాతీయ గుర్తింపు వచ్చాయి. అఖిల భారత జాతీయోద్యమంపై ఊహించ నంతటి పట్టు దొరికింది. యుద్ధాలను వ్యతిరేకించే శాంతిమూర్తిగా... జాతి, వర్ణ, కుల, మతాలకు అతీతంగా అందరినీ సమానంగా ప్రేమించే విశ్వమానవుడిగా పేరు వచ్చిపడ్డాక గతంలో తాను దొరల యుద్ధాల్లో కనపరచిన రణోత్సాహమూ, దక్షిణాఫ్రికా నల్లవారిపై చూపించిన జాత్యహంకారమూ గొంతులో వెలక్కాయలా గాంధీజీని ఇబ్బంది పెట్టాయి. తన తాజా కీర్తికి తగ్గట్టు గతాన్ని అర్జంటుగా సవరించవలసిన అవసరం ఆయనకు కనిపించింది.

మామూలుగా అయితే అది చాలా కష్టమైన పని. జరిగిపోయిన దానిని ఏ మానవుడూ మార్చలేడు. కాని గాంధీగారు సాధారణ మానవుడు కాదు. మహాత్ముడు. వర్తమానానికి కావలసిన రీతిలో గతాన్ని మార్చివేయటంలోనూ ఆయన అనితర సాధ్యమైన అద్భుత మహత్త్వం చూపాడు.

ఎలాగంటారా? 1923లో ఎరవాడ జైల్లో మొదలుపెట్టి **దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం** అనే గ్రంథాన్ని రెండేళ్లలో పూర్తిచేశారు. మొదట గుజరాతీ భాషలో దాన్ని జైలు సహచరుడికి

డిక్టేట్ చేశారు. తరవాత వి.జి.దేశాయి ఇంగ్లీషులోకి అనువదించారు. ఇంచుమించుగా అదే సమయంలో సత్యాగ్రహ గ్రంథం తరవాత **'సత్యముతో నా ప్రయోగాల కథ'** అనే **'ఆత్మకథ'**ను నవజీవన్ పత్రికలో వారం వారం ప్రచురించటంకోసం గుజరాతీలో రాశారు. దానికి మహాదేవ్ దేశాయ్, ప్యారేలాల్‌లు చేసిన ఆంగ్లానువాదం 1925 డిసెంబరు నుంచీ యంగ్ ఇండియా పత్రికలోనూ, దక్షిణాఫ్రికాలోని ఇండియన్ ఒపీనియన్ పత్రికలోనూ సీరియల్‌గా వచ్చి, తరవాత గ్రంథస్థమైంది. 317 పేజీల **సత్యాగ్రహం** గ్రంథం యావత్తూ దక్షిణాఫ్రికాకు సంబంధించినదే కాగా 420 పేజీల **ఆత్మకథలో** 220 పేజీలు దక్షిణాఫ్రికా అనుభవాలే. జీవితంలో సగ భాగం గడిపిన దక్షిణాఫ్రికాలో తాను చేసిన దానిపై స్వయంగా గాంధీయే రాసిపెట్టిన రికార్డు కావటంతో అనంతర కాలంలో చరిత్రకారులందరూ, ఆయన జీవిత చరిత్రను రాసినవారూ సహజంగా వాటిమీదే ఆధారపడ్డారు. గాంధీ అంతటి సత్యవాదే రాసిన సత్యకథలు కాబట్టి వాటిలో ఉన్నదంతా అక్షర సత్యమని అందరూ నమ్మారు. గాంధీగారి దక్షిణాఫ్రికా జీవితం గురించి ప్రపంచంలో ఎవరు మాట్లాడినా, ఏమి రాసినా ఈ రెండు గ్రంథాలనుబట్టే! లేక- ఈ రెండు గ్రంథాల ప్రభావంతోటే. ఆఖరికి మార్టిన్ లూథర్‌కింగ్, నెల్సన్ మండేలా వంటి నీగ్రో మహనీయులే గాంధీ ప్రచార యంత్రాంగ ప్రభావానికి లోనై... వర్ణ వివక్షను వ్యతిరేకించి, నల్లజాతికి బాసటగా నిలిచిన స్ఫూర్తిప్రదాత అని గాంధిని కొనియాడారు.

చిత్రమేమిటంటే పై రెండు స్వయంకృత గ్రంథాల్లో కనపడే గాంధీ వేరు. దక్షిణాఫ్రికాలో ఉన్న అసలు గాంధీ వేరు. వెనుకటి గాంధీ ఇండియన్ ఒపీనియన్ పత్రికలోనూ, దక్షిణాఫ్రికా అధికారులకు పంపిన విజ్ఞాపనల్లోనూ, సభల్లోనూ, ఉత్తర ప్రత్యుత్తరాల్లోనూ వెలిబుచ్చిన అభిప్రాయాలను ఈ అనంతర గ్రంథాల్లో గుర్తుపట్టలేనంతగా రచయిత గాంధీ మార్చేశారు. తన తాజా తేజో వలయానికి తగ్గట్టుగా వెనుకటి రేసిస్టు (Racist) గాంధీని హ్యూమనిస్టు గాంధీగా మార్చి ముస్తాబు చేశారు.

ఉదాహరణకు- దక్షిణాఫ్రికా నేటివులందరినీ 'కాఫిర్లు' అని పాత గాంధీ పదేపదే ఈసడించిన తీరు గుర్తుంది కదా? 'కాఫిర్లు' అని తప్ప ఇంకో విశేషణాన్నే ఆయన వారికి వాడలేదు కదా? గాంధీగారు తరవాత రాసిన రెండు గ్రంథాల్లో 'కాఫిర్' పదమే ఎక్కడా మచ్చుకు కూడా కనిపించదు. ఆ మాటకొస్తే గాంధిగారి ఆత్మకథలో 'జులు తిరుగుబాటు' అధ్యాయంలో మినహా అసలు ఆఫ్రికన్ ప్రజల ఊసే ఎక్కడా కనిపించదు. ఆ గ్రంథాన్ని మాత్రమే చదివితే ఆఫ్రికాలో నేటివులనబడే నల్లరంగు స్థానిక ప్రజలూ ఉండేవారని ఎవరూ అనుకోరు.

ఆత్మకథలోనేమో నల్లవారిని మొత్తంగా మటుమాయం చేశారు. **దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహం** గ్రంథంలోనేమో 'కాఫిర్ల'ను కాస్తా 'నీగ్రో'లుగా పేర్కొన్నారు. అంతేకాదు.

వెనుక 'ఇండియన్ ఒపీనియన్' పత్రికలోనూ, ఇతర వ్యవహారాల్లోనూ "ఆటవికులు", 'అనాగరికులు', 'పశువుల స్థాయికి కొంచెం మాత్రమే ఎక్కువయినవారు', భారతీయుల దరిదాపుల్లో ఉండదగని వారు, 'మర్యాదస్తులెక్కే రైళ్లలోకీ, ట్రాముల్లోకీ అడుగుపెట్ట నివ్వకూడని వారు' అంటూ తాను తీవ్రంగా అసహ్యించుకున్న నీచ నికృష్ట జాతిని నాలుక మడతవేసి కడు గౌరవంగా ప్రస్తావించి, అందమైన విశేషణాలను అద్దారు. అద్భుతమైన ఆ అర్ధకం పనితనానికి ఈ మచ్చుతునకను పరిశీలించండి:

Among the Negroes, the most handsome are the Zulus... the Creator did not spare himself in fashioning the Zulu to perfection. Men and Women are both tall and broad-chested in proportion to their height. Their muscles are strong and well-set... The eyes are round and bright... It is a law of nature that the skin of races living near the Equator should be black.... These innocent children of nature derive all their knowledge from their experience of her...

Now a days they use blankets. Even now many... cover the private parts with a piece of skin. Some dispense even with this. But let not anyone infer from this that these people can not control their senses. Where a large society follows a particular custom... the custom is harmless even if it seems highly improper to the members of another society. These Negroes have no time to be staring at one another. When Shukadeva passed by the side of women bathing in a state of nudity, so the author of Bhagavata tells us, his own mind was quite unruffled... It is only vanity which makes us look upon the Negroes as Savages. They are not the Barbarians we imagine them to be.

[*Satyagraha in South Africa*, M.K.Gandhi, PP 7-9]

(నీగ్రోల్లోకెల్లా అందమైనవారు జులులు... వంక లేనంత పరిపూర్ణంగా జులును తీర్చిదిద్దటానికి సృష్టికర్త తన నైపుణ్యమంతటినీ చూపించాడు. స్త్రీలు, పురుషులు పొడగరులు. పొడుగుకు తగ్గ విశాల వక్షస్థలం. బలమైన చక్కని కండలు... మిలమిలమెరిసే గుండ్రని కళ్లు వారివి... భూమధ్య రేఖకు దగ్గరలో ఉండేవారు నల్లగా ఉండటమనేది ప్రకృతి ధర్మం... ప్రకృతి మాతకు అమాయకపు బిడ్డలైన వీరికి గల జ్ఞానమంతా ప్రకృతినుంచి నేర్చుకున్నదే.

ఈ కాలంలో నీగ్రోలు ఒంటిమీద దుప్పట్లు ధరిస్తున్నారు. ఇప్పటికి కూడా చాలామంది మొలకు చర్మపు పీలిక మాత్రం చుట్టుకుని, కొందరైతే అదీ లేకుండా తిరుగుతారు.

దీన్నిబట్టి ఈ జనం ఇంద్రియాలను అణచుకోలేరని ఎవరూ భావించకూడదు. ఒక పెద్ద మానవ సమాజం ఒక రకమైన ఆచారాన్ని పాటించేటప్పుడు ఇంకో సమాజం వారికి అది చాలా అనుచితంగా కనపడినాసరే దానివల్ల హాని ఉండదు. ఈ నీగ్రోలకు ఒకరినొకరు తేరిపారచూసేంత తీరిక ఉండదు. దిగంబరంగా స్నానం చేస్తున్న స్త్రీల పక్కనుంచి వెళ్లినా శుకదేవుడి మనసు ఎలాంటి వికారం లేకుండా నిర్మలంగా ఉండేదని భాగవత కర్త చెప్పలేదూ?!... మన స్వాతిశయంవల్లే మన కళ్లకు నీగ్రోలు ఆటవికుల్లా కనిపిస్తారు. మనం ఊహించుకునేంతటి బర్బరులేమీ కారు వారు.)

మరి ఇంత చూడచక్కని సుందరాంగులను... శుకదేవుడి లాంటి అద్భుత ఇంద్రియ నిగ్రహంగల ప్రకృతిమాత ముద్దుబిడ్డలను చూసి దక్షిణాఫ్రికాలో ఉన్నంతకాలమూ తన కెందుకంత అసహ్యం కలిగిందో గాంధీగారు చెప్పలేదు. “దిక్కుమాలిన కాఫిర్లను తెచ్చిపారెయ్యటానికి ఊళ్లో మా ప్రాంతమే దొరికిందామీకు? తక్షణం వారినిక్కడినుంచి తొలగించండి. కాఫిర్లనూ భారతీయులనూ ఒకచోట కలపటం చాలా అన్యాయం” అని జొహాన్స్‌బర్గ్ అధికారి మీద తాను ఎగిరిపడింది ఇదిగో ఈ అందమైన, స్వచ్ఛమైన, శుకదేవుల జాతిమీదేనన్న సంగతి సత్యాగ్రహ గ్రంథం రాసే సమయానికి మహాత్ముడు సమయానుకూలంగా మరచిపోయాడు.

సరే! జులుల తిరుగుబాటు కాలంలో ఆయుధాలు పట్టి తెల్లదొరతనానికి బాసటగా యుద్ధసేవ చెయ్యాలని తాను చూపిన రణోత్సాహాన్ని మరుగుపరిచి... మానవసేవ చేసేందుకే తాను స్ట్రెచర్ దళంతో వెళ్లాననీ, వెళ్లి జులుల పుండ్లకు మందురాచి ప్రేమతో కట్టుకట్టాననీ, తాను కనుక లేకపోతే పాపం వారు ఏమైపోయేవారోనని **ఆత్మకథ, సత్యాగ్రహ** గ్రంథాల్లో మహాత్ముడు అద్దిన జలతారును ఇంతకుముందే చూశాం. దక్షిణాఫ్రికాలో జైలుకు వెళ్లినప్పుడు ‘కాఫిర్ల’తో కలిపివేసి తమ స్థాయిని దిగజార్చినందుకు తనకు కలిగిన కంపరాన్ని... పశుప్రాయులైన అనాగరిక కాఫిర్ల కాకిగోలను, ముష్కరత్వాన్ని భరించలేక రాత్రంతా భయపడుతూ, వారి మధ్యన ఉండాల్సి వచ్చినందుకు దుఃఖిస్తూ, భగవద్గీతను మననం చేసుకున్న వైనాన్ని గాంధిగారు ఈ గ్రంథాల్లో మాటమాత్రమైనా ప్రస్తావించలేదు. ‘నీగ్రోల’ను, మమ్మల్ని ఒకే వార్డులో ఉంచారు. వారికిచ్చే దుస్తులే మాకూ ఇచ్చారు అన్నది మినహా కాఫిర్ నీగ్రోల గురించి ఒక్క పొల్లు మాట అనలేదు.

అప్పుడు అలా తామే సెలవిచ్చారు కదా; ఇప్పుడు ఇలా ప్లేటు మార్చారేమిటి స్వామీ అని ఎవరూ అడక్కుండా బారిస్టరుగారు ముందే బందోబస్తు చేసుకున్నారు. ఎప్పుడో పదిహేను ఇరవై ఏళ్ల కిందటి సంగతులు తమకు గుర్తులేవని ఆయన అనగలరు. తాను రాసింది జీవిత చరిత్ర కాదనీ, సత్యంతో తానుచేసిన ప్రయోగాల గురించి మాత్రమే తాను రాయదలిచాననీ ఆయన ముందే చెప్పినందువల్ల మీ కథలో ఫలానా జీవిత

ఘట్టాలను వదిలేశారేమని ఎవరూ అడగలేరు. దక్షిణాఫ్రికానుంచి తిరిగొచ్చిన చాలా ఏళ్ల తరవాత, అవసరమయ్యే పత్రాలు, గ్రంథాలు, ఇతర రికార్డులు ఏవీ అందుబాటులో ఉండని జైలు గదిలో పూర్తిగా జ్ఞాపకం మీదే ఆధారపడి రాసినందువల్ల తన వాటిని ప్రామాణిక గ్రంథాల కింద పరిగణించకూడదనీ ఆయన తెలివిగా హెచ్చరించారు. పోనీ- జైలునుంచి విడుదలయ్యాక అచ్చువేసే ముందు మీ దగ్గరి పాత రికార్డులతోనే మీరు సరిచూసి ఉండవచ్చు కదా- అనీ ఎవరూ అడగలేరు. ఎందుకంటే దానికీ ముందరికాళ్లకు బంధంలా తన దగ్గరి పాత కాగితాలను ఎప్పుడో 1910లో టాల్‌స్టోయ్ ఫాంలో ఉండగానే తగులబెట్టేశానని గాంధీజీ ముందే చెప్పేశారు.

I have thrown away or burnt... such papers as I felt it was not necessary to preserve them... to have preserved all of them would have been burdensome and expensive. I should have been compelled to keep cabinets and boxes, which would have been an eyesore to one who has taken the vow of poverty.

[*Satyagraha in South Africa*, M.K.Gandhi, P.221]

(దాచి పెట్టాల్సిన అవసరం లేదనుకున్న పత్రాలను నేను పారేయుడమో, తగలబెట్టడమో చేశాను... వాటన్నిటినీ దాచాలంటే పెట్టెలూ, భోషాణాలూ కావాలి. పేదరికపు శపథం చేసిన నాలాంటి వాడికి అది ఖరీదైన భారం.)

గాంధీగారి పేదరికమే ఒక ఫార్సు, పేదరికాన్ని వరించి శపథం చేసిన తరవాత కూడా దక్షిణాఫ్రికాలో ఉన్నంతకాలమూ, సీమకు ఓడపై వెళ్లిన ప్రతిసారీ ఫస్టుక్లాసులో తప్ప ఆయన ప్రయాణం చెయ్యలేదు. ఇండియాకు తిరిగొచ్చి థర్డ్‌క్లాసు ప్రయాణాన్ని నియమంగా ఎంచుకున్నప్పటికీ సాధారణ ప్రయాణికుల్లా ఆయన కిటకిటలాడే థర్డ్ క్లాస్ పెట్టెలో నానా అవస్థలు పడుతూ ఏమీ ప్రయాణించలేదు. ఆయన ఎక్కిన పెట్టెలోకి ఆయన సహచరులను, అనుచరులను, వలంటీర్లను, ఆయన అనుమతించిన సందర్శకులను తప్ప వేరొకరిని రానిచ్చేవారు కాదు. ఆయన ఒక్కడి థర్డ్ క్లాస్ ప్రయాణం కోసం బ్రిటిషు ప్రభుత్వానికీ, కాంగ్రెస్ పార్టీకి ఒక ఫస్ట్ క్లాస్ టిక్కెటుకంటే వందరెట్లు ఎక్కువే ఖర్చయ్యేది.

పేదరిక ప్రహసనం ఎలా ఉన్నా పెట్టెలను భరించే స్తోమతు లేక రికార్డులను తగలబెట్టాడన్న గాంధి మాట పచ్చి అబద్ధం. గాంధీజీ దక్షిణాఫ్రికానుంచి అక్కడి తన పనికి సంబంధించిన పత్రాలను పెట్టెనిండా పట్టుకు వచ్చారని 28 ఏళ్లపాటు ఆయనకు కార్యదర్శిగా పనిచేసిన ప్యారేలాల్ తన Mahatma Gandhi: The Early Phase గ్రంథం పీఠికలో పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికానుంచి తిరిగి రాగానే 1915లో అహ్మదాబాద్ లోని శేర్ మానిక్‌లాల్ జేతాభాయి పుస్తకాలయకు 15వేల గ్రంథాలను గాంధీజీ

బహూకరించారని A Comprehenseive, Annotated Bibliography on Mahatma Gandhi గ్రంథంలో **ఆనంద ఎం.పందిరి** బయటపెట్టారు. మరి, పెట్టెల్ని మెయింటెయిన్ చేసే స్తోమతులేక పత్రాలను, ఇతర వస్తువులను పారవేశానని గాంధీగారు ఎందుకు బొంకారు? ఇండియన్ ఒపీనియన్ లాంటి పత్రికల్లోనూ, ఇతర పత్రాల్లోనూ తమరు గతంలో వేరే విధంగా అన్నారేమిటని ఎవరైనా నిలదీస్తారేమోనన్న జంకే అందుకు కారణంకావచ్చు.

గాంధీగారు ముందుచూపుతో (అన్నేసి) జాగ్రత్తలు తీసుకున్నా గతాన్ని పూడ్చివెయ్యటం ఆయన వల్లకాలేదు. ఆయన మరణానంతరం పరమానందయ్య శిష్యుల్లాంటి ఆయన భక్తులు బహుశా ఆయన కలనైనా ఊహించని విధంగా పాత పత్రాలన్నిటినీ కష్టపడి సేకరించి The Collected Works of Mahatma Gandhi పేర 98 సంపుటాలుగా అచ్చేశారు. అలా చేస్తారని తెలిస్తే దాన్ని అడ్డుకోవటానికి ఆయన మరో ఆమరణ నిరశన దీక్షకు కూచునేవారేమో! దక్షిణాఫ్రికాలో గాంధీగారి రాతలకు, చేతలకు సంబంధించిన సమస్త సమాచారం గాంధీ రచనల గ్రంథావళిలో ఏనాడో బహిర్గతమైనా వందల సంఖ్యలో గాంధీ జీవిత చరిత్రను రాసిన దేశదేశాల మహా రచయితలు, మహామేధావులు దాదాపుగా అందరూ గతాన్ని తరచి చూడకుండా, తన గ్రంథాల్లో గాంధీ తిరగరాసిన చరిత్రనే గొర్రెల్లా అనుసరించటం గాంధీగారి అదృష్టం.

గాంధీ మెస్మరిజంలో మేధావులు ఎంతగా పడ్డా నిజం నిజం కాకపోదు. తప్పు అని గ్రహించినప్పుడు వెనుకటి అభిప్రాయాలను మార్చుకోవటంలో తప్పులేదు. దక్షిణాఫ్రికాలో ఉండగా తాను నీగ్రోలను ఏవగించుకోవటం తప్పు అని మహాత్ముడు గుర్తించి, ఆ విషయాన్ని ధైర్యంగా ప్రకటించి, అనంతర కాలంలో, సవరించుకుని ఉంటే ఎవరూ తప్పుబట్టరు. దానివల్ల ఆయన వ్యక్తిత్వానికి మరింత వన్నె చేకూరేది. అలాకాకుండా గుట్టుచప్పుడు కాకుండా గతాన్ని పూడ్చెయ్యబూనడం సూటిగా చెప్పాలంటే హిపోక్రసీ! గాంధీ మహోన్నత వ్యక్తిత్వం వెనుక దాగిన కపటత్వాన్ని పట్టి ఇచ్చే దక్షిణాఫ్రికా కీలకాన్ని గుర్తుపెట్టుకుంటే తప్ప అనంతరం భారత జాతీయోద్యమ కీలక ఘట్టాల్లో మహాత్ముడి వింత పోకడలు మనకు అర్థంకావు.

అసలు కథలోకి అడుగుపెట్టేముందు మహాత్ముడి రంగప్రవేశానికి పూర్వం భారత జాతీయోద్యమం ఏ స్థితిలో ఉందో చప్పున సింహావలోకన చేద్దాం.

వందే మాతరం

చల్లని వెన్నెల రాత్రి. మైదాన ప్రాంతంలో ఇద్దరు మౌనంగా నడిచి పోతున్నారు. వారిలో ఒకడు సన్యాసి భావానంద. రెండోవాడు జీవితంలో చితికి, భార్యాబిడ్డలతో సహా అన్నీ పోగొట్టుకున్న జమీందారు మహేంద్రసిన్హా. అతణ్ణి మాటల్లో పెడదామని ప్రయత్నించినా స్పందన లేకపోవడంతో భావానంద తనలో తానే పాడుకోసాగాడు.

వందే మాతరం
సుజలాం సుఫలాం మలయజ శీతలాం
సస్యశ్యామలాం మాతరం వందేమాతరం
శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం
ఫుల్లకుసుమితా ద్రుమదళ శోభినీం
సుహాసినీం సుమధుర భాషిణీం
సుఖదాం వరదాం
మాతరం వందే మాతరం

మహేంద్రసిన్హా విన్నాడు. "తల్లి అంటూ దేశాన్ని పొగుడుతావేమిటి?" అని అడిగాడు ఆశ్చర్యంగా.

"మాకు ఇంకో తల్లి తెలియదు. జననీ 'జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ' అన్నారు కదా! జన్మభూమే మాకు జనని. మాకు తల్లి, తండ్రి, సోదరులు, భార్యాబిడ్డలు, కొంపాగోడూ ఏమీ లేదు. ఉన్నదంతా దేశమాతే" అన్నాడు భావానంద.

మహేంద్రకు లీలగా అర్థమైంది. 'ఆ పాట మళ్లీ పాడు' అన్నాడు. భావానంద పాడుతూ భావోద్వేగంలో కన్నీరు పెట్టుకున్నాడు. మహేంద్రకు కుతూహలం పెరిగి "మీరెవరు" అని అడిగాడు.

"మేమంతా అమ్మను అర్చించే బిడ్డలం".

చట్ట బహిష్కృతుడి నోట ఈ మాటలు విని ఆశ్చర్యం కలిగి "దోచుకున్న సొత్తుతో అమ్మను పూజిస్తారా బిడ్డలు?" అన్నాడు కొంచెం వెటకారంగా మహేంద్ర సిన్హా

"మేము అలాంటి పనులేవీ చెయ్యం."

"ఇప్పుడేకదా నువ్వు ఓ బండిని దోచుకున్నావ్. అది రాజద్రోహం కాదా?"

"రాజ్యాన్ని పాలించనివాడు రాజు ఎలా అవుతాడు?"

"ఇలా మాట్లాడితే ఏదో ఒకరోజు సిపాయిలు నిన్ను ఫిరంగికి కట్టి ముక్కలు చేస్తారు."

"అయితే ఏమిటట? ఎవరైనా చచ్చేది ఒకసారే."

"కాని ఏరికోరి చావును ఎందుకు తెచ్చుకోవాలి?"

"నేలమీద పాకే నీచమైన పాము కూడా దానిమీద కాలువేస్తే బుస్సున కరుస్తుంది. ఒకసారి నీ చుట్టూ చూడు జనం ఎంత దుఃఖపడుతున్నారో. తినడానికి తిండి దొరకక వాళ్లు గడ్డి తింటున్నారు. అదీ దొరక్కపోతే మట్టి మింగుతున్నారు. చచ్చిన కుక్కల్నీ నక్కల్నీ కూడా పీక్కుతింటున్నారు. రక్షించాల్సిన రాజు ప్రజల్ని రక్షించటం లేదు. మన మతం పోయింది. కులం పోయింది. మన గౌరవం, కుటుంబ మర్యాద మంట కలిశాయి. ఈ గడ్డాలవాళ్లని తరిమేస్తే తప్ప మన మతం నిలిచే ఆశ లేదు."

"కాని వాళ్లని నువ్వు ఒక్కడివి ఎలా తరిమివేయగలవు?"

"అదేమిటి? ఇప్పుడే కదా మా వాళ్లని రెండొందల మందిని చూశావ్?"

"వాళ్లూ నీలా సంతానులేనా? ఇంకా ఎంతమంది ఉన్నారేమిటి?"

"వేల మంది. ఇంకా ఎందరో మునుముందు రానున్నారు. సాధన చేస్తే తుపాకి గుండులా దూసుకుపోగలం. ఏదైనా సాధించగలం."

"ఔనా? ఏమిటట మీ సాధన?"

"కనపడటం లేదూ- మేమంతా సన్యాసులం. దేశమాత బిడ్డలం. మేము అన్నీ వదిలేసుకున్నది ఈ సాధనకోసమే. అది పూర్తయి మా ఆశయం నెరవేరాక మా ఇళ్లకు మేము వెళతాం. మాకూ భార్యాబిడ్డలున్నారు. ప్రతిజ్ఞా పాలనకోసం కుటుంబ బంధాలను పక్కనపెట్టి వచ్చాం. నువ్వూ మాలో కలుస్తావా?"

***

19వ శతాబ్దాంతంలో వచ్చి జాతి జనులను, ఉగ్రూతలూపి, యువతరానికి అద్భుత స్ఫూర్తినిచ్చిన **ఆనందమఠం** నవలలో ఒక ఘట్టమిది. ఆంగ్లేయులు దేశంలో చొరబడ్డ తొలినాళ్లలో అవధ్ నవాబుపై జరిగిన సన్యాసుల తిరుగుబాటును ఇతివృత్తంగా తీసుకున్నా

బంకించంద్ర చటర్జీ అసలు ఉద్దేశం తెల్ల రాకాసుల పీడ దేశానికి విరగడ చేయాలన్నదే. ముసల్మాన్ రాజు అన్నచోటల్లా ఇంగ్లీషు సర్కారును ఊహించుకుని చదివితే ఆ నవల సమకాలీన దురవస్థకు అద్దం పడుతుందని సర్కారుకూ తెలుసు. పాఠకులకూ తెలుసు. అందుకే తెల్లదొరతనం ఆ గ్రంథాన్ని నిషేధించి, కనపడకుండా తొక్కెయ్యబోయింది. పాఠక లోకం దాన్ని భక్తితో పారాయణ చేసి ఎనలేని స్ఫూర్తి పొందింది.

ఆనందమఠం లో చేసింది వట్టి కల్పనే కాదు. పైన ప్రస్తావించిన భావానంద లాంటి సన్యాసుల్లా దేశమాత విముక్తికి ప్రతినబూని, సర్వస్వం త్యాగం చేసి, నిప్పుల దారిలో నడిచి, మహా సాహసాలు చేసిన దేశభక్తులు ఆ కాలంలో ఎందరో ఉన్నారు. విదేశీ దురాక్రమణదారులపై యావద్దేశం సింహంలా తిరగబడి సాగించిన 1857 భీషణ సంగ్రామం ఘోరంగా విఫలమైనా ఆ పరాజయానికి కుంగి భారత జాతి బెంబేలెత్తిపోలేదు. చావు తప్పి కన్ను లొట్టపోయినట్టు పెద్ద గండాన్ని కొద్దిలో తప్పించుకున్న తెల్లవారు విజయగర్వంతో రెచ్చిపోయి, దారుణ దమన నీతికి భయానకంగా పాల్పడ్డా భారతీయుల్లోని స్వాతంత్ర్యకాంక్ష అణగారిపోలేదు. వారి గుండెలను దహించే మంట చల్లారలేదు. బలవంతుడైన శత్రువు ముందు శక్తులుడిగినా వారు మానసికంగా అశక్తులు కాలేదు. ఒకరి తరవాత ఒకరుగా ఎందరో యోధులు ముందుకొచ్చి దేశంకోసం బలిపీఠం ఎక్కి, ఎవరి పద్ధతిలో వారు విముక్తి పోరాటం సాగిస్తూనే ఉన్నారు.

1857 సమరం సమసిపోయి దశాబ్దం తిరక్కుండా బెంగాల్ అంతటా, పూనాలాంటి చోట్లా రహస్య సంఘాలు పుట్టుకొచ్చాయి. వాటిలో ఒకదానిలోనైతే మెంబర్లుగా చేరేవారు కత్తితో ఛాతీ పొడుచుకుని రక్తాక్షరాలతో ప్రమాణపత్రంపై సంతకం చేసేవారని బిపిన్ చంద్రపాల్ వెల్లడించారు. అరవింద ఘోష్‌కి తాతగారైన రాజనారాయణ్ బోస్ స్థాపించిన రహస్య విప్లవ సంఘం రవీంద్రనాథ్ టాగోర్ వంటి నవయువకులెందరికో తర్ఫీదునిచ్చి స్వాతంత్ర్య సమరానికి సన్నద్ధం చేసింది. కాగా 1857 పోరాటం తరవాత బ్రిటిషువారిని వెళ్లగొట్టటమే ధ్యేయంగా మొట్టమొదటి సాయుధ విప్లవ సంస్థను నడిపిన ఘనత **వాసుదేవ్ బల్వంత్ ఫడ్కేది.**

మహారాష్ట్రలోని కొలాబా జిల్లాలో 1845లో పుట్టిన ఫడ్కే పెద్దగా చదువుకోలేదు. వచ్చిన కొద్దిపాటి ఇంగ్లీషుతో మిలటరీ డిపార్టుమెంటులో నెలకు 60 రూపాయల జీతంతో క్లర్కుగా పనిచేసేవాడు. జస్టిస్ రానడే ఉపన్యాసాలు విని ఉత్తేజం పొందిన ఫడ్కే అమితంగా ప్రేమించిన తల్లి మరణం అతని జీవితాన్ని మార్చివేసింది. 1871లో ఒక రోజు ఆఫీసులో ఉండగా తల్లికి చాలా జబ్బుగా ఉన్నదని అతడికి స్వగ్రామం నుంచి కబురు అందింది. సెలవుకు అర్జీ పెడితే తెల్లదొర ససేమిరా కుదరదన్నాడు. ఎన్ని రోజులు బతిమిలాడినా ఫలితం లేకపోవటంతో ఏమైనా కానీ అని తెగించి ఊరికి

పరుగుపెట్టాడు. కాని వెళ్లేసరికి అంతా అయిపోయింది. చివరి చూపు కూడా దక్కలేదు. కర్మకాండ ముగించుకుని తిరిగొచ్చాక అతికష్టంమీద ఉద్యోగమైతే నిలిచింది. ఏడాది తరవాత సంవత్సరీకాలకు ఊరు వెళ్లాల్సివచ్చింది. మళ్లీ సెలవు కోరాడు. ఈసారీ పైఅధికారి ఇవ్వను పొమ్మన్నాడు.

ఫడ్కే చాలా బాధపడ్డాడు. తన దురవస్థకు తల్లడిల్లాడు. దాని గురించి చాలా రోజులు దీర్ఘంగా ఆలోచిస్తూనే ఉన్నాడు. చివరికి అతడి కళ్లు తెరచుకున్నాయి. తన కర్తవ్యమేమిటో అతడికి బోధపడింది. తెల్లవారి కొలువు కారణంగా కన్నతల్లి చివరిచూపు కరువైంది. ఉత్తర క్రియలకూ అడ్డం వచ్చింది. అందుకే తాను దుఃఖిస్తున్నాడే!? మరి దేశం కూడా తల్లిలాంటిదే కదా? విదేశీయులకు దాస్య వృత్తిలో ఉన్నందున తనలాగే వేలాది బిడ్డలూ దేశమాతకు చేయాల్సిన సేవ చేయలేకపోతున్నారు కదా... అన్న భావం అతడికి కలిగింది. వెంటనే తనవంటి సోదరులందరినీ సమీకరించి, ఇకనైనా దేశమాత రుణం తీర్చుకోవటానికి జీవితాన్ని అంకితం చేయాలన్న స్థిర నిశ్చయం నాటుకుంది. వెంటనే ఉద్యోగం వదిలేశాడు. ఇక ఆ తరవాత అతడు వెనక్కి తిరిగి చూసుకోలేదు. గతంలో రానడే నుంచి పొందిన ప్రేరణ అతడిని ముందుకు నడిపింది. 1876లో భయానకమైన కరవులో ప్రజల దుర్గతిని, పాలకుల నిర్లిప్తతను చూశాక సాయుధ పోరాటం చేసి విదేశీ పెత్తనపు పీడ విరగడ చేయాలన్న కాంక్ష అతడిని కూచోనివ్వలేదు. పడుకోనివ్వలేదు. డైరీలో ఫడ్కే రాసుకున్నట్టు "స్నానం చేస్తున్నా, అన్నం తింటున్నా, నిద్రిస్తున్నా అహర్నిశలూ అదే ధ్యాస. అర్ధరాత్రి లేచి కూచుని దేశ విముక్తిని ఎలా సాధించాలా అని నరాలు చిట్లేలా ఒకటే ఆలోచన."

విశాల దేశంలో పాతుకుపోయిన విదేశీ విష వృక్షాన్ని పెకలించటం విస్తృత వ్యవస్థ, భారీ నిధులు, అనేక రంగాల్లో ఏకకాలంలో ప్రతిఘటన ఉంటే తప్ప సాధ్యపడదని ఫడ్కేకు అర్థమైంది. సాయుధ విప్లవానికి ప్రజలను సమాయత్తం చేయటానికి ముందుగా విద్యావంతులను సమరోన్ముఖం కావించాలని అతడు మొదట విశ్వప్రయత్నం చేశాడు. పూనాలో మొదలెట్టి దేశమంతటా సుడిగాలిలా తిరిగి విద్యాధిక వర్గాలకు ఉత్తేజ పూరితమైన ఉపన్యాసాలు ఇచ్చాడు. వినడమైతే విన్నారుగాని మేధావుల్లో వీసమెత్తు చలనం లేదు. ఇంగ్లీషు చదువుల వల్ల వారిని ఆవరించిన బ్రిటిషు భక్తి, బానిస బుద్ధి ఒక పట్టాన వదలేవి కావనీ, పనికిమాలిన మాటలకే తప్ప జాతీయ లక్ష్యం సాధించేందుకు వారు ఎందుకూ కొరగారనీ అనుభవం మీద ఫడ్కేకు బోధపడింది. దాంతో విద్యావంతుల్ని ఆకట్టుకునే పనిమాని, చదువూ సంధ్యా లేని అట్టడుగు సామాజిక వర్గాల మీద దృష్టిసారించాడు. తన బృహత్ కార్యానికి ఎవరు కలిసి రాగలరా అని వెతకగా అతడికి ధైర్యానికి, పౌరుషానికి పేరుగాంచిన రామోసీల తెగ కనిపించింది. వారిలో ఆరాచక

ధోరణి, బందిపోట్ల ప్రవృత్తి ఉన్నప్పటికీ సవ్యంగా నడిపిస్తే వాటిని అదుపుచేయవచ్చునని ఫడ్కేకు తోచింది. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడ్డా రామోసీలకు తెల్లవారంటే మహాద్వేషం. తమ బద్ధ శత్రువులపై పోరుకు ఫడ్కే అడగ్గానే వారు ఆనందంగా ఒప్పేసుకున్నారు. పెద్ద సంఖ్యలో అతడి వెంట నిలిచారు.

అంగబలమైతే సమకూరింది. కాని అర్థబలమే పెద్ద సమస్య అయింది. ఎంతో అక్కర్లేదు; చేతిలో ఐదువేల రూపాయలుంటే చాలు తెల్ల రాకాసులను దేశం నుంచి తరిమివేయవచ్చునని ఫడ్కే తలిచాడు. ఆమాటే డైరీలో రాశాడు:

"నా దగ్గర ఐదువేల రూపాయలు ఉంటే చాలు. నా మనుషులను దేశమంతటికీ పంపించి తిరుగుబాట్లు లేవదీయించగలను. అన్నిచోట్లా ఒకే సమయంలో దాడిచేసి కమ్యూనికేషన్లను తెంపేస్తే పోస్టాఫీసులు పనిచేయవు. టెలిగ్రాఫ్ లైన్లు విచ్ఛిన్నమవుతాయి. రైళ్లు నడవవు. ఒకచోట నుంచి ఇంకోచోటికి సందేశాలందక సంబంధాలు తెగిపోతాయి. ప్రభుత్వ వ్యవస్థ స్తంభించిపోతుంది. ఈ లోపు జైళ్ల తలుపులు తెరిచి, ఖైదీలను వదిలేస్తే వారిలో కనీసం కొన్ని వందల మంది విప్లవానికి మెరికల్లా ఉపయోగిస్తారు. సర్కారు చచ్చుపడితే ప్రజలకూ ధైర్యం వచ్చి బాహాటంగా తిరగబడతారు. ఆ అద్భుతమే జరిగితే మన ఆశయం నెరవేరుతుంది. దేవుడు దయతలిస్తే భారత్‌లో స్వతంత్ర రిపబ్లిక్‌ను ఏర్పాటుచేయగలుగుతాం. అంతకంటే కావలసింది ఏముంది?"

పథకం బాగానే ఉంది. ఇలా అఖిల భారత స్థాయిలో ఆలోచించి, ఏక కాలంలో పోరాటం నడిపించి, ప్రభుత్వ వ్యవస్థను స్తంభింపజేసేందుకు బృహత్ ప్రణాళికతో, ముందస్తు వ్యూహంతో ఉద్యమించిన జాతీయ నాయకుడు ఒక్కడంటే ఒక్కడు లేని కారణంగానే 1857 విప్లవం విఫలమైంది. నాటి లోపాలను సవరించి, జాతీయ స్థాయిలో ఏకోన్ముఖ పోరాటానికి ఫడ్కేవంటి వీరుడు నడుము కట్టినప్పుడు అతడు ఆశించిన అద్భుతం నెరవేరడం అసంభవమేమీ కాదు. కాని ముందస్తుగా అవసరమనుకున్న 5వేలు ఎక్కడి నుంచి తేవాలన్నదే పెద్ద సమస్య. ఫడ్కే తనకు తెలిసిన శ్రీమంతులను అడిగి చూశాడు. దేశభక్తి కబుర్లు దండిగా చెప్పే సంపన్నులు కూడా 5వేలు కాదు- 5 రూపాయలు జేబులోంచి తీసి ఇవ్వటానికి వెనకాడారు.

వారినీ, వీరినీ అడిగి, భిక్షాటన చేసి ప్రయోజనం లేదని రూఢిఅయ్యాక ఫడ్కేకు సేనల నిర్వహణకు డబ్బులకోసం దోపిడీ ఒక్కటే దారిగా కనిపించింది. దాన్నే విధిలేక ఎంచుకున్నాడు. 1879లో పూనా సమీప గ్రామంలో మొదలుపెట్టి అనేక ఊళ్లపై మెరుపులా దాడిచేసి సంపన్న సాహుకార్లను దోచుకున్నాడు. పూనాలో ప్రభుత్వ కార్యాలయాలను తగులబెట్టి, పూనా ట్రెజరీని దోచుకునేందుకు ప్రయత్నించి సర్కారును ఠారెత్తించాడు. ఫడ్కేకున్న దేశభక్తి, నియమ నిబద్ధత అతడి వెనుక చేరిన రామోసీలకు లేకపోయింది.

ఎవరిని దోచుకోవాలి. కొల్లగొట్టిన సొత్తును ఎలా పంచుకోవాలి, ఎలా జల్సా చేయాలన్నదే ఎంతసేపూ వారి ధ్యాస. ఎంత ప్రయత్నించినా వారు మారకపోవటంతో ఫడ్కే క్రమేణా వారికి దూరమయ్యాడు. ఒక మిత్రుడి సాయంతో నైజాం నుంచి రోహిల్లా దండును సమీకరించి, బ్రిటిషు సర్కారుకు గుండెల్లో రైళ్లు పరిగెత్తించాడు. గొప్ప సాహసాలే చేశాడు. వెంట పడిన పోలీసులను తప్పించుకునేందుకు అడవుల వెంట తిరుగుతూ అనుక్షణం మృత్యువును సవాలు చేస్తూ, నిద్రాహారాలు లేక అవస్థపడుతూ, జబ్బుల పాలయి; వీరోచితంగా పోరాడినా ఫడ్కే చివరికి ఓడిపోయాడు. జ్వరంతో ఒళ్లు సలసల కాలుతూ, అప్పటికి చాలా రోజులుగా తిండి లేక నీరసించి, ఒక ఊరి గుడిలో రాత్రివేళ తల దాచుకుని ఉండగా, సర్కారుకు ఉప్పంది మేజర్ డానియల్, నైజాం పోలీసు కమిషనర్ అబ్దుల్‌హక్‌లు మెరుపుల్లా వచ్చి, నిద్రపోతున్న సింహాన్ని 1879 జులై 3 తెల్లవారు ఝామున ఎట్టకేలకు పట్టుకున్నారు. అంతటి దుర్బల దీనావస్థలో కూడా ఫడ్కేలో పౌరుషం చావలేదు. కళ్లు తెరిచి చూసి, దమ్ముంటే తనతో ద్వంద్వ యుద్ధం చెయ్యమని డానియల్‌ను సవాలుచేశాడు. దానిని స్వీకరించే ధైర్యం ఆ మేజర్‌కి లేకపోయింది. అంతా కలిసి ఒడిసిపట్టి ఫడ్కేను బంధించారు. ఆ వార్తను టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి ఆంగ్లో ఇండియన్ పత్రికలు చాలా ప్రముఖంగా ప్రచురించాయి. తాము అభిమానించే వీరుడిని పూనాకు తీసుకుపోతుంటే దారిపొడవునా ప్రతి స్టేషనులోనూ ఆయనను చూసేందుకు జనం పెద్ద సంఖ్యలో గుమికూడారు.

తెల్లదొరతనం ఫడ్కేను ప్రమాదకరమైన బందిపోటుగా నిర్ధారించి యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. కోర్టు ఆవరణలో గుమికూడి 'వాసుదేవ్ బల్వంత్ కీ జై' అని నినదించి, కన్నీటి వీడ్కోలు ఇచ్చిన ప్రజాసమూహం మాత్రం ఫడ్కేను జాతీయ వీరుడిగా తలచి జోహారు చేసింది. బందీ అయ్యాక కూడా దౌర్జన్యానికి తల వంచక, తనకు పూర్వం శివాజీలా ఫడ్కే కూడా జైలునుంచి సాహసికంగా తప్పించుకున్నాడు. కాని భాష తెలియనిచోట, ఎటుపోవాలో ఎరుగక, చేతిలో గవ్వలేక, ఆశ్రయమిచ్చేవారు లేక కొద్ది గంటలకే బ్రిటిషు జాగిలాలకు మళ్లీ పట్టుబడ్డాడు. ఈసారి ఇంకా క్రూరమైన చిత్రహింసలనుభవించి, జబ్బు ముదిరి ఏడెన్ జైలులోనే 1883 ఫిబ్రవరి 17న వాసుదేవ్ ఫడ్కే జీవనయాత్ర చాలించి అమరుడయ్యాడు.

బ్రిటిషు సామ్రాజ్యాన్ని పరిమిత శక్తితో పరిమిత వనరులతో కూలదోయాలన్న ఫడ్కే సంకల్పం అనివార్యంగా విఫలమైనా, అతడి సాహసం, పరాక్రమం భావితరాల స్వాతంత్ర్యయోధులకు గొప్ప స్ఫూర్తినిచ్చింది. మహారాష్ట్రలో చాపేకర్ సోదరులు, బెంగాల్ విప్లవకారులు, దేశం ఇతర ప్రాంతాల పోరాట యోధులు ఫడ్కేను ఆదర్శంగా తీసుకున్నారు. సేనలను రహస్యంగా సమీకరించటంలో, ఆయుధాలను సంపాదించి,

యువతకు సైనిక శిక్షణ ఇవ్వటంలో, దోపిడీలు చేసి విధులు సమకూర్చుకోవటంలో ఫడ్కే చూపిన దారినే వారూ అనుసరించారు. ఆ విధంగా ఆధునిక భారతదేశంలో మిలిటెంటు జాతీయ పోరాటానికి ఫడ్కే ఆద్యుడయ్యాడు.

"It was my ambition to establish a Republic of Free India... If I collected gold and silver, it was only for this noble and meritorious object... why should I not suffer like the Sage Dadheechee who took out his very bones in order to serve the good of the Gods? If by my sacrifice and total surrender, I can help our resurrection from slavery, why should I not make that effort?..."

(స్వతంత్ర భారత రిపబ్లిక్‌ను స్థాపించాలన్నదే నా ఆకాంక్ష... నేను బంగారం, వెండి పోగుచేసిందీ ఈ ఉదాత్త ధ్యేయంకోసమే... దేవతల క్షేమంకోసం తన వెన్నెముకను త్యాగంచేసిన మహర్షి దధీచిలా నేను మాత్రం ఎందుకు బలికాకూడదు? నా త్యాగంలో, నా సంపూర్ణ ఆత్మార్పణలో బానిసత్వం నుంచి మన పునరుజ్జీవనానికి సహాయ పడగలిగితే నేనెందుకు వెనకాడాలి?)

– అని 1857 పోరాటం సమసిపోయిన రెండు దశాబ్దాలకు వాసుదేవ్ ఫడ్కే బ్రిటిషు న్యాయస్థానంలో చేసిన చరిత్రాత్మక ప్రకటన భారతజాతి సమరశీలానికి, దాని పోరాట పటిమ అవిచ్ఛిన్నతకు సూచిక. భారతీయులకు తెల్లవారుచేసిన మహా ద్రోహాల్ని ఖండిస్తూ, భారత ప్రజల స్వాతంత్ర్య కాంక్షను ఉగ్గడిస్తూ సీమదొరల గుండెలదిరేలా 1880లో ఫడ్కే ఈ సింహగర్జన చేసే సమయానికి మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అనే పదకొండేళ్ల కుర్రవాడు రాజ్‌కోటలో గోలీలాడుకుంటున్నాడు.

ఎందరో మహానుభావులు

" Young men, your country expects great things from you. Now I ask, how many of you are prepared, when you have finished your studies at the college, to devote your lives, to consecrate your energies to the good of the country? (cries of "all'' "all'')... ... There comes a time in the history of a nation's progress, when every man may verily be said to have a mission of his own to accomplish. Such a time has now arrived for India. Every Indian must now do this duty, or stand condemned before God and Man.''

"కుర్రాళ్లూ! మీ దేశం మీ నుంచి గొప్ప సేవలను ఆశిస్తున్నది. ఇప్పుడు నేను అడుగుతున్నాను. కాలేజీ చదువయ్యాక దేశ క్షేమం కోసం జీవితాలను అంకితం చేసి, మీ శక్తులన్నీ ధారపోయటానికి మీలో ఎంతమంది సిద్ధంగా ఉన్నారు? ("అందరం", "అందరం" అని కేకలు)... ప్రతి జాతి ప్రగతి ప్రస్థానంలోనూ ఒక సమయం వస్తుంది. ప్రతి మనిషీ తనదంటూ ఒక విశిష్ట భూమిక పోషించవలసి ఉంటుంది. అలాంటి సమయం ఇండియాకిప్పుడు వచ్చింది. ప్రతి భారతీయుడూ తన ధర్మం నిర్వర్తించాలి; లేదో దేవుడికీ, మనిషికీ అపచారం చేసినవాడవుతాడు.

"మన బాధలనుంచి బయటపడటానికి మనం హింసకు దిగాల్సిన అవసరం లేదు. శాంతియుతంగానే మన కోర్కెలు, హక్కులు సాధించవచ్చు. రాజ్యాంగ పరిధిలోనే పోరాడవచ్చు. ప్రతి భారతీయుడూ ఇందులో పాలుపంచుకుని తీరాలి... హిందువులూ, ముసల్మానులూ, క్రైస్తవులూ, పార్శీలూ అందరూ భారత మహా సమాజంలో సభ్యులే. వెనుకటి ద్వేషాలనూ, వైరాలనూ విస్మరించి అందరమూ ఒకరినొకరం ప్రేమాభిమానాలతో ఆలింగనం చేసుకుని మన ప్రియతమ జన్మభూమి సేవకు సహోదరుల్లా కదలాలి".

ఇదో అద్భుత ప్రసంగం. ఉత్తేజకరమైన ఉద్బోధ. విన్నవారు ఉత్సాహంతో, ఉద్వేగంగా ఊగిపోయారు. గుండెల్లో పదిలంగా దాచుకుని జీవితాంతం ఆ మహాబోధను మననం చేస్తూనే ఉన్నారు. శాంతి, అహింసల ప్రబోధం, హిందూ-ముస్లిం సమైక్యతల ప్రస్తావన ఉన్నది కాబట్టి ఇది... నిద్రాణమైన జాతిని దేవదూతలా వచ్చి మేల్కొలిపాక అహింసా ప్రవక్త మహాత్మాగాంధీ యువతరానికి చేసిన ఉపదేశమా? కాదు. ఇండియాను ఉద్ధరించడానికి మహాత్ముడు రంగప్రవేశం చేయటానికి దాదాపు నాలుగు దశాబ్దాల పూర్వమే 1878లో **సురేంద్రనాథ్ బెనర్జీ** యువతరానికి చూపిన వెలుగుదారి ఇది. దేశం దశదిశలా తిరిగి చిరస్మరణీయమైన ఉపన్యాసాలిచ్చి తన అనర్గళ వాగ్ధాటితో శ్రోతలను మంత్రముగ్ధులను చేయటంతోనే సురేంద్రనాథ్ ఆగలేదు. కుల, మత, ప్రాంతీయ స్పర్థలకు అతీతంగా తాను ప్రబోధించిన జాతీయ వాదానికి కార్యరూప మివ్వటానికి 'ఇండియన్ అసోసియేషన్'లాంటి రాజకీయ సంస్థలను స్థాపించి జాతీయ కాంగ్రెస్ పుట్టటానికి ముందే, గాంధీగారి బాల్యావస్థలోనే ఆయన శాంతి, అహింసలు ఆయుధాలుగా యువతను సమీకరించి, సమరోన్ముఖం చేశాడు.

అప్పటికే కేశవచంద్రసేన్ 'బ్రహ్మసమాజం', స్వామి దయానంద సరస్వతి 'ఆర్యసమాజం', అనిబిసెంట్ 'దివ్యజ్ఞాన సమాజం' భారతీయ సంస్కృతి ప్రాశస్త్యాన్ని, ఆర్షధర్మ విశిష్టతను, భారతీయుల ఘన వారసత్వాన్ని గుర్తుచేసి, ఆత్మన్యూనతతో దిక్కుతోచని జాతిజనుల్లో అంతులేని విశ్వాసం నింపాయి. ఇంచుమించుగా అదే సమయంలో రామకృష్ణ పరమహంస దివ్యప్రేరణతో వివేకానందస్వామి హిందూ మత ప్రాముఖ్యతను దేశదేశాల్లో గొప్పగా ప్రచారం చేయటమేగాక భారత ప్రజల్లో దేశభక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించి, పిరికితనాన్ని పారదోలి, సామాజిక అసమానతలను, కులాల మతాల అడ్డుగోడలను ఛేదించి, స్వాతంత్ర్య సమరానికి సమాయత్తపరచడానికి అవిరళ కృషి చేశాడు.

"ధైర్యం ఉన్న వీరులే స్వాతంత్ర్యానికి అర్హులు. పిరికితనం సిగ్గుచేటు. భారతీయులుగా పుట్టినందుకు గర్వపడండి. ధైర్యం తెచ్చుకోండి. 'నేను భారతీయుణ్ని, ప్రతి భారతీయుడు నా సహోదరుడు' అని సగర్వంగా చాటండి... మనుషుల్ని తయారుచేయటం నా జీవిత ధ్యేయం. నాకు కావలసింది ఉక్కు కండలు. ఉక్కు నరాలు గల పిడుగులాంటి మనుషులు. మాతృభూమి సేవే మీ ప్రథమ కర్తవ్యం.. అంటూ వివేకానందుడు యువజనులకు ప్రబోధించాడు. ఆధ్యాత్మిక శిఖరాలనందుకున్న మహాజ్ఞాని అయికూడా "మీ భక్తి ముక్తి ఎవరికి కావాలి? తమస్సులో మునిగి ఉన్న నా జాతి ప్రజలను ఉద్ధరించి, వారి కాళ్లపై వారు నిలబడేట్టు చేయగలిగితే వెయ్యి నరకాలకైనా నేను ఆనందంగా వెళతాను" అన గలిగిన మహాదేశభక్తుడాయన. 'నాకు కావలసింది చిచ్చర పిడుగులాంటి కార్యశూరుల'ని

చెప్పటమేగాక అలాంటివారిని తయారుచేయటానికి జీవించిన స్వల్ప కాలంలోనే వివేకానందుడు అవిశ్రాంతంగా పాటుపడ్డాడు. సర్వసంగ పరిత్యాగి అయిన పరివ్రాజకుడు కావటంతో నిస్వార్థమైన, నిష్కలంకమైన ఆ స్వామి బోధలు భారత యువతపై చెరగని ముద్రవేశాయి.

భారత జాతికి ఆది నుంచీ ఉన్న దేశభక్తి, ధర్మనిరతి 1857 సంగ్రామ వైఫల్యం తరవాత కూడా ఇలా ఎందరో మహారథుల కృషి ఫలితంగా తేజరిల్లి జాతీయ భావం, జాతీయ పౌరుషం ఆధునిక సొబగులు దిద్దుకున్నాయి. గోపాలకృష్ణ గోఖలే 1905లో (గాంధీగారి రంగప్రవేశానికి పదేళ్లముందు) అన్నట్టు-

"The growth, during the last fifty years, of a feeling of common nationality based upon common tradition, common disablities and common hopes and aspirations has been most striking. The fact that we are Indians first, and Hindoos, Mahomedans, Parsees, or Christians afterwards is being realised... and the idea of a united and renovated India... is no longer a mere idle dream..."

(గడచిన యాభై ఏళ్లలో మనందరిదీ ఉమ్మడి జాతీయత, ఉమ్మడి సంప్రదాయాలు, ఉమ్మడి దౌర్బల్యాలు, ఉమ్మడి ఆశలూ ఆకాంక్షలూ కలిగిన ఒకే జాతి అన్న భావం అధికమైంది. మనం మొదట భారతీయులం, ఆ తరవాతే హిందువులమో, మహమ్మదీయులమో, పార్శీలమో, క్రైస్తవులమో- అన్న సత్యాన్ని అందరూ గ్రహించారు... ఇక నవోన్మేషమైన ఐక్య భారతదేశం కొద్దిమంది భావుకుల కల ఏమీ కాదు.)

సురేంద్రనాథ్ బెనర్జీ, కేశవ్‌చంద్రసేన్, దయానంద సరస్వతి, వివేకానంద, గోఖలే, తిలక్, రానడే వంటి జగత్ప్రసిద్ధులేగాక లోకానికి తెలియని ఎందరో మహానుభావులు దేశ స్వాతంత్ర్య మహా యజ్ఞానికి అసంఖ్యాక సమిధలనందించారు. సామాన్య ప్రజల్లో స్వాతంత్ర్యకాంక్ష రగిలించి, మతాభినివేశాన్ని రంగరించి వేలాది పోరాట యోధులను తయారుచేసి, విదేశీ దురాక్రమణదారులపై అంతిమ పోరుకు సిద్ధమైన ఎందరో దేశభక్తులు చరిత్రపుటలకెక్కకుండా అజ్ఞాతంగా, అనామకంగా మిగిలిపోయారు.

ఉదాహరణకు- **సద్గురు రామ్‌సింగ్ కూకా !** నామ్‌ధారి లేక కూకా సంప్రదాయానికి ఆయన ఆద్యుడు. వాసుదేవ్ ఫడ్కే కార్యరంగం మహారాష్ట్ర అయినట్టు కూకా కార్యక్షేత్రం పంజాబ్. లూధియానా జిల్లా భైనీలో పుట్టిన రామ్‌సింగ్ కొంతకాలం మహారాజా రంజిత్‌సింగ్ సైన్యంలో పనిచేశాడు. రంజిత్‌సింగ్‌ను కూలదోసి తెల్లవారు పంజాబ్‌ను కబళించాక విదేశీయులకు తొత్తుకావటం ఇష్టంలేక కొలువు మానాడు. ఆధ్యాత్మికంవైపు

మనసు మళ్లి కఠోర సాధన చేసి విరాగి అయ్యాడు. పెద్ద సంఖ్యలో ఆయనకు శిష్యులు తయారయ్యారు. మతపరమైన మూఢాచారాల మీద తిరగబడి... సామాజిక, మతపరమైన విషయాలకే పరిమితమయ్యాడు. గోరక్షణ ధ్యేయంగా 'నామధారి సంప్రదాయాన్ని' నెలకొల్పి, ఎంపిక చేసిన శిష్యులకు అందులో దీక్షనిచ్చాడు.

అనంతర కాలంలో అనేక మహాత్ముల్లా ఆషామాషీ కబుర్ల ఉత్తుత్తి గోసంరక్షణ కాదు రామ్‌సింగ్ చేపట్టింది. గోమాతను పూజించటమేగాక- పవిత్రమైన గోవులను వధించే వారిని ఎక్కడ కనపడితే అక్కడే వధించాలన్నది ఆయన ఆజ్ఞ! క్రమేణా ఆయన ఆలోచనా పరిధి విశాలమై మత విషయాలతోబాటు రాజకీయ వ్యవహారాలపైనా దృష్టి సారించాడు. మత సంస్కరణకంటే, సామాజిక వైరుధ్యాలను సరిచేయటంకంటే అన్ని సమస్యలకూ, అన్ని దురవస్థలకూ మూలకారణమైన విదేశీ దాస్యాన్ని అంతమొందించటం ముఖ్యమని అనుభవం మీద గ్రహించాడు. గోమాతకోసం తపించినంత తీవ్రంగా దేశమాత విముక్తికోసమూ పరితపించాడు. అలాగని- గోవును వధించేవాడినల్లా వధించమన్నట్టు కనపడిన తెల్లవాడినల్లా తల నరకమని ఆయన ఆనతియ్యలేదు. శత్రువు బలవంతుడు కనుక సమగ్ర వ్యూహంతో సర్వసన్నాహాలు చేసుకుని అదనెరిగి దెబ్బతీస్తే తప్ప విదేశీ పీడ విరగడ కాదని ఆయన గుర్తించాడు. దీర్ఘంగా ఆలోచించి ఇందుకు బృహత్ పథకం వేశాడు.

'సహాయ నిరాకరణ', 'విదేశీ వస్తు బహిష్కరణ' దేశానికి గాంధీ అందించిన దివ్యాయుధాలని చాలామంది అనుకుంటారు. వాస్తవానికి గాంధీగారు భూమిమీదికి రావటానికి ముందే సద్గురు రామ్‌సింగ్ బ్రిటిషు సామ్రాజ్యంపై పోరటానికి ఈ రెండు అస్త్రాలనూ ప్రయోగించాడు. స్కూళ్లనూ, కాలేజీలనేగాక తెల్లదొరలు పెట్టిన కోర్టులను, రైళ్లను, తంతితపాలా సేవలను కూడా బహిష్కరించమని ఆయన వేల సంఖ్యలో ఉన్న తన అనుచరగణాన్ని ఉద్బోధించాడు. అనంతర కాలంలో కాంగ్రెసు వారివలె విస్తృత స్థాయిలో బాహాటంగాకాక, తన రహస్య సమాజంలో సభ్యులైన వేలాది అనుయాయులకు మాత్రమే ఈ కార్యక్రమాన్ని పరిమితం చేయటంవల్ల బయటి ప్రపంచానికి దీని గురించి పెద్దగా తెలియదు.

ఐనా- తెలియవలసిన వారికి బాగానే తెలిసింది. వినూత్నమైన ఈ సహకార నిరాకరణ, బహిష్కరణల తీరును, పరిమితంగానైనా వాటి ప్రభావాన్ని చప్పున గుర్తించి బ్రిటిషు ప్రభుత్వం 1864లో 'నామ్‌ధారి' సంప్రదాయాన్ని నిషేధించింది. దాన్ని అనుసరించేవారిని వెదికి వెదికి నానావిధాల వేధించసాగింది. దాంతో సద్గురు రామ్‌సింగ్ చప్పున పంథామార్చాడు. బహిరంగ 'బహిష్కరణ'లను కట్టిపెట్టాడు. సర్కారీ ఆగ్రహానికి హడలి తోక ముడిచినట్టుగా అభిప్రాయం కలిగించి గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వాన్ని కూలదోసే పనిలో నిమగ్నమయ్యాడు. పంజాబ్‌ను 22 డివిజన్లుగా విభజించి, ఒక్కో దానికీ ఒక బాధ్యుడ్ని నియమించి, ఎవరి ప్రాంతంలో వారు చాపకింద నీరులా వ్యాపించి

తెల్లదొరతనంపై ఏకకాలంలో సాయుధ తిరుగుబాటుకు ప్రజలను, సిపాయిలను సమాయత్తపరిచే పనిని అప్పగించాడు. ఈ సన్నాహాలు అత్యంత గోప్యంగా, మెల్లిమెల్లిగా సాగటంతో వెయ్యి కళ్ల సర్కారీ వేగులు సైతం వాటిని ఆనవాలు పట్టలేకపోయారు. 'కూకాల' ధిక్కారం అణగిపోయిందనే భావించి 1869లో ప్రభుత్వం వారిపై నిషేధం ఎత్తివేసింది. రామ్‌సింగ్ మనసులోనే నవ్వుకుని తన రహస్య పథకాన్ని అమలుపరిచే పనిలో మునిగాడు.

అన్నీ అనుకున్నట్టు జరిగి, అందరినీ మెల్లిగా కూడగట్టి, నిర్ణీత సమయంలో పంజాబ్ అంతటా ఒకేసారి సాయుధ సిపాయిలు, పోలీసులు, సామాన్య ప్రజలు తిరగబడి, ట్రెజరీలను, ఆయుధాగారాలను వశపరచుకుని ప్రభుత్వాన్ని స్తంభింపజేసి ఉంటే ఫలితం ఎలా ఉండేదో! 1857లో సాధించలేని కార్యం కనీసం పంజాబ్‌లో అయినా నెరవేరేదేమో! కాని- ఈ లోపే అనుకోనిది జరిగింది. మొత్తం ప్రయత్నం వమ్మయింది.

ఆ రోజు 1872 జనవరి 13. సద్గురు రామ్‌సింగ్ జన్మస్థలమైన భైనీకి నామ్‌ధారీలు కొందరు తీర్థయాత్రకు వెళుతుండగా మాలెర్‌కోట్ల సంస్థానం చేరేసరికి వారిలో ఒకడు వెనకబడిపోయాడు. ఒంటరిగా వెళుతుండగా ఒక మహమ్మదీయుడు అతడితో గొడవపడ్డాడు. కబురందగానే చుట్టుపట్ల ముస్లింలు గుంపుగా వచ్చి నామ్‌ధారీని చితక గొట్టారు. హిందువులు ఎప్పటిలాగే ఆ దృశ్యాన్ని చోద్యంలా చూశారే తప్ప అడ్డుకునేందుకు అడుగు వెయ్యలేదు. 'కాఫిర్'గాడికి తగిన శాస్తి చెయ్యాలనుకుని ముస్లింలు ఒక ఆవును లాక్కొచ్చి అతడి కళ్లముందే క్రూరంగా, నెమ్మది నెమ్మదిగా నెత్తురోడ్చి చంపి, ఆ నెత్తురును అతడి ఒంటినిండా చిలకరించారు. గోవును దేవతలా పూజించే నామ్‌ధారి ఆ అపచారాన్ని భరించలేకపోయాడు. కడబట్టిన ప్రాణాన్ని ఎలాగో కూడదీసుకుని భైనీకి వెళ్లి అనేక వేల నామ్‌ధారీల సమక్షంలో గురువుకు ఆ సంగతి చెప్పాడు.

అది విన్న నామ్‌ధారీల గుండెలు మండాయి. ఈ అవమానాన్ని సహించి ఊరుకోరాదు; ఏదో ఒకటి చేయాల్సిందే; తక్షణం మన సత్తా ఏమిటో చూపాల్సిందే- అని గురువును పట్టుబట్టారు. వారిలాగే తనకూ మహాక్రోధం కలిగినా రామ్‌సింగ్ వారిలా తొందర పడలేదు. తీవ్రాగ్రహాన్ని తమాయించుకుని, "ఇంకా సమయం రాలేదు. తొందరపడితే వ్యవహారం బెడిసికొడుతుంది. ఇంకొంతకాలం ఓపిక పట్టండి" అని హితవు పలికాడు. గురువు మీద భరోసాతో చాలామంది శిష్యులు శాంతించారు. కొద్దిమంది ఉడుకు రక్తపు యువకులు మాత్రం గురువు చెప్పినా వినేది లేదంటూ, ప్రతీకార జ్వాలలో దహించుకుపోతూ వీరభద్రుల్లా ఉరికి వెళ్లారు. మొదట- దగ్గర్లోని మలోధ్ కోటపై పడ్డారు. అప్పటికే నామ్‌ధారీల ప్రభావానికి లోనైన అధికారుల, సిపాయిల సాయంతో దాన్ని వశపరచుకున్నారు. తుపాకులను, ఫిరంగులను, గుర్రాలను, ధనాన్ని పెద్ద సంఖ్యలో స్వాధీనం చేసుకుని అక్కణ్నుంచి దుర్ఘటన జరిగిన మాలెర్‌కోట్లకు తరలారు. ఉప్పెనలా

వచ్చిన జన సమూహం ధాటికి తట్టుకోలేక అక్కడి అధికారులు పరారయ్యారు. నగరాన్ని సునాయాసంగా పట్టుకుని, కనపడ్డ ముస్లింనల్లా నరికేసి, రాజమహలును కొల్లగొట్టారు. సంభ్రమం నుంచి తెప్పరిల్లిన సర్కారు మాలెర్‌కోట్లకు హుటాహుటిన సైనిక బలగాలను తరలించింది. భీకర పోరాటం జరిగి, ఇరుపక్షాలా వందల మంది మరణించాక, సర్కారు బలాధిక్యం ముందు తిరుగుబాటుదారులు నిలవలేకపోయారు. 68 మంది పట్టుబడ్డారు. మిగతావారు పారిపోయారు.

లూథియానా డిప్యూటీ కమిషనరు కావెన్ వారిని మిలటరీ కోర్టు ముందు హాజరు పరిచాడు. ముక్తసరిగా విచారణ ముగించి సైనిక న్యాయస్థానం వారందరినీ ఫిరంగి మూతికి కట్టి పేల్చెయ్యమంది. మరుసటిరోజు పట్టణంలోని కూడలి ప్రాంతంలో ఫిరంగిని నిలబెట్టారు. తడవకు ఐదారు మంది చొప్పున కట్టగట్టి దానికి కట్టేసి... వేల జనం నిర్ఘాంతపోయి చూస్తుండగా ధామ్మని పేల్చి ముక్కలు చేశారు. ఒక బ్యాచిని ఖతం చెయ్యగానే ఇంకో బ్యాచిని ఫిరంగికి బలి ఇస్తూ పోయారు. ఎగిరిపడి ఖండ ఖండాలైన శరీర శకలాలతో ఆ ప్రాంతమంతా బీభత్సంగా తయారైంది. కావెన్ సతీమణి భర్త పక్కనే నిలబడి ఆ ఘోర ఘాతుకాన్ని చోద్యంలా చూసింది.

అలా 49 మందిని దారుణంగా చంపేశాక 13 ఏళ్ల బాలుడి వంతు వచ్చింది. వాడి లేత ముఖం చూసి దొరసానికి మనసు కరిగి, పాపం, వాణ్ని వదిలెయ్యమంది. ఇల్లాలి కోరికను దొర కాదనలేకపోయాడు. అయితే అంత తేలిగ్గా ద్రోహిని వదిలెయ్య కూడదు కదా? వాడిని దగ్గరికి పిలిపించి "ఒరేయ్, నిన్ను ప్రాణాలతో వదిలేస్తా. కాని- నువ్వు ఆ దగుల్బాజీ వెధవ రామ్‌సింగ్ గాడిని వదిలెయ్యాలి" అని సరసమైన షరతు పెట్టాడు. ప్రాణం నిలుస్తుందంటే కుర్రకుంక ఎగిరి గంతేసి తన కాళ్ల మీద పడి 'సరే, దొరా' అంటాడనుకున్నాడు. కాని ఆ కుర్రవాడు గురునిందను సహించలేకపోయాడు. ప్రాణం దక్కించుకోవటం కంటే గురువు గౌరవం నిలపటం ముఖ్యమనుకున్నాడు. తనను పట్టుకుని ఉన్న సైనికుల చేతులు విసిరికొట్టి ఆవేశంతో ఊగిపోతూ ఒక్క గంతులో కావెన్ మీదికి లంఘించి అతడి పొడుగు గడ్డాన్ని పట్టుకుని లాగి నేలమీద పడేసి పిడి గుద్దులు గుద్దాడు. అంత లావు అధికారీ ఎంత గింజుకున్నా బాలుడి పట్టును విడిపించు కోలేకపోయాడు. వెనక నుంచి సైనికులు దాడిచేసి ఆ కుర్రవాడి రెండు చేతులూ నరికేసిన తరవాత గానీ కావెన్ దొర బయటపడలేదు.

తరవాతేముంది? దొరగారు పళ్లు పటపట కొరికి ఆ 'పిల్లదయ్యాన్ని' తక్షణమే ఫిరంగికి కట్టి ముక్కలు చేయించాడు. చిన్న కుర్రాడే అంత ఆగం చేస్తే మిగిలినవాళ్లు ఇంకెంతకు తెగిస్తారో అన్న భయంతో కాబోలు మిగతా 18 మందిని మలోధ్ కోటకు తరలించి జాగ్రత్తగా ఉరితీయించారు. ఎదురు తిరిగిన శిష్యుల తిరుగుబాటుతో తనకు

సంబంధం లేదని రామ్‌సింగ్ ప్రకటించినప్పటికీ వారికి స్ఫూర్తినిచ్చింది అతడేనని తెల్లదొరతనం గ్రహించింది. స్వేచ్ఛగా తిరగనిస్తే ఇలాంటి అగ్గిపిడుగులను ఇంకెందరిని తయారుచేసి ఎక్కడ తమ కొంప ముంచుతాడోనని సద్గురు రామ్‌సింగ్‌ను అరెస్టుచేసి జీవిత ఖైదు విధించారు. తలపెట్టిన కార్యం పూర్తిచేయలేకపోయానన్న చింతతో చితికి, నరకం లాంటి కారాగారంలో జబ్బుపడి, ఆ మహాయోధుడు చెరలోనే కన్నుమూశాడు. నాయకుడికి దీక్ష, దక్షత ఎంత ఉన్నా, అనుచరుల శౌర్యం, పౌరుషం ఎంత గొప్పవైనా వారిలో నిగ్రహం, క్రమశిక్షణ లేకపోతే పర్యవసానం ఎంత దారుణంగా ఉంటుందో నామ్‌ధారీల విషాదానుభవం రుజువు చేసింది.

తిరుగుబాటుదారులను హతమార్చి, వారి నాయకుడిని చెరబట్టి, ఇకపై ఇంకెవరూ అలాంటి దుస్సాహసానికి పాల్పడకుండా నిరోధించామని తెల్ల సర్కారు భ్రమపడింది. నామ్‌ధారీల పోరాటం విఫలమైనా వారి పోరాట పటిమ అనంతర కాలంలో ఎందరో యోధులకు స్ఫూర్తినిచ్చింది. ఒక పంజాబ్‌లో ఒక రామ్‌సింగ్ తలపెట్టిన సంగ్రామం లాంటివి పలు రాష్ట్రాల్లో పలు విధాలుగా పలువురి పూనికతో చెలరేగాయి. సర్వశక్తి మంతమైన సర్కారును ఏమీ చేయలేకపోయినా.ఆ అగ్ని కణాలు దేశమంతటా వ్యాపించి జాతి జనుల గుండెలు మండించాయి. ఎందరో దేశభక్తుల అపార త్యాగాల వెరశి పర్యవసానంగా 19వ శతాబ్దం చివరికొచ్చేసరికి యావద్భారతం అగ్నిపర్వతంలా సెగలు కక్కసాగింది.

కాంగ్రెస్ తండ్రి ఎవరు?

సర్ ఎలాన్ ఆక్టేవియన్ హ్యూమ్ తల గిర్రున తిరిగింది. తన ముందున్న కాగితాలను తిరగేసేకొద్దీ అతడి బుర్ర వేడెక్కింది. ఒకటి రెండా? ఏడు పెద్ద సంపుటాలు. ఒక్కో దానిలో వందలకొద్దీ పేజీలు. వేల సంఖ్యలో ఎంట్రీలు. మొత్తం పూర్తిచేసే సరికి అతడికి కాళ్లకింద నేల కదిలినట్టయింది. ఒళ్లంతా చెమటలు పట్టాయి.

దేశం అన్ని ప్రాంతాలనుంచి 30వేలకు పైగా వేగులవారు పంపిన రహస్య నివేదికలవి. తమతమ ప్రాంతాల్లో రాజకీయ పరిస్థితి, ప్రజల మనఃస్థితి ఎలా ఉందో జాగ్రత్తగా గమనించి పైవారికి నివేదించిన విషయాలవి. వేరు వేరు ప్రాంతాల నుంచి పంపిన రిపోర్టులే అయినా అన్నిటి సారాంశమూ ఇంచుమించు ఒకలాగే ఉంది. అదేమిటో హ్యూమ్ జీవిత చరిత్ర రాసిన వెడ్డర్‌బర్న్ చెబుతాడు వినండి:

"Seven large volumes which were shown to Hume contained a vast number of communications from over thirty thousand different reporters from the different parts of India. These seemed to indicate that even men of the lowest classes all over the country were determined to do something, and that something meant violence... Innumerable entries referred to the accretion of swords, spears and matchlocks... what was predicted was a sudden violent outbreak of sporadic crimes, murders of obnoxious persons, robbery of bankers, looting of bazars. In the existing state of the lowest half-starving classes, it was considered that the first few crimes would be the signal for hundreds of similar ones, and for a general development of lawlessness, paralysing the authorities... and that very soon after the bands obtained formidable proportions, certain small number of educated classes,

at the time desperately bitter against the Government would join the movement, give the outbreak cohesion and direct it as a national revolt."

[*Biographical Sketch of A.O.Hume,* W.Wedderburn PP 80,81]

(హ్యూమ్‌కి చూపించిన ఏడు పెద్ద సంపుటాల్లో ఇండియాలోని వివిధ ప్రాంతాల్లో ముప్పైవేలకు పైగా వేర్వేరు వ్యక్తులనుంచి భారీ సంఖ్యలో అందిన సమాచారాలున్నాయి. దేశమంతటా– ఆఖరికి అట్టడుగు వర్గాల జనం కూడా ఏదో ఒకటి చేసెయ్యాలన్న నిశ్చయంతో ఉన్నారని వాటినిబట్టి బోధపడుతుంది. ఏదో ఒకటి అంటే అర్థం హింసకు దిగడమే... ఇందుకోసం కత్తులు, ఈటెలు, నాటు ఫిరంగులు సేకరించి పెట్టుకుంటున్నారని అసంఖ్యాకమైన రిపోర్టులొచ్చాయి... బహుశా ఏమి జరగవచ్చునంటే... అక్కడక్కడ చెదురుమదురు నేరాలతో మొదలుపెట్టి, గిట్టని వ్యక్తులను చంపేస్తారు. బ్యాంకులను దోచుకుంటారు. బజార్లను లూటీ చేస్తారు. అర్ధాకలితో అలమటిస్తున్న కడగొట్టు జాతులవాళ్లు మొదట కొన్ని నేరాలు జరగగానే చెలరేగి అలాంటి నేరాలనే వందల సంఖ్యలో చేస్తూపోతారు. దాంతో దేశమంతటా అరాచకం అలుముకుంటుంది. అధికార వ్యవస్థ చచ్చుపడుతుంది. ... మూకల ఆగడాలు పెచ్చుమీరాక ప్రస్తుతం ప్రభుత్వమంటే క్రోధంతో భగభగలాడుతున్న విద్యాధిక వర్గాలవారు కొద్దిమంది ఉద్యమంలో చేరి దానికి ఒక రూపం ఇచ్చి జాతీయ తిరుగుబాటుగా నడిపిస్తారు.)

దేశంలో పరిస్థితి బాగాలేదని అందరూ అనుకోవడమే కానీ మరీ ఇంత విషమించిందని ఇండియన్ సివిల్ సర్వీసులో తల పండిన హ్యూమ్ ఊహించలేదు. తక్షణం ఏదో ఒక ప్రతిక్రియ చెయ్యకపోతే ఇండియాలో బ్రిటిష్ సామ్రాజ్యానికి ఆశవదిలేసుకోవలసిందేనని అతడికి అర్థమైంది. ఇంగ్లీషు చదువులు చదివి బ్రిటిషు నాగరికతను వంటబట్టించుకున్న విద్యావంతులను ఒక దగ్గర చేర్చడమే తరణోపాయమనీ తానే ఇందుకు పూనుకోవాలనీ అతడు అనుకున్నాడు. ఆ ప్రకారమే ప్రభుత్వ విధానాలపై అసంతృప్తినీ, ఆగ్రహాన్నీ వెలిగక్కేందుకు సేఫ్టీవాల్వ్‌గా ఆయన 1885 చరిత్రాత్మక రాజకీయ సంస్థను స్థాపించాడు. దానిపేరు భారత జాతీయ కాంగ్రెసు.

ఇదంతా చరిత్ర గ్రంథాల్లో ఉన్నదే. భారత జాతీయ కాంగ్రెసు అధికారిక చరిత్రను రచించిన పట్టాభి సీతారామయ్య కూడా కాంగ్రెసు పుట్టుక అధ్యాయంలో ఈ వివరాలను కొంతవరకూ చెప్పారు:

Mr.Hume had unimpeachable evidence that the political discontent was going underground. He came into possession of seven volumes containing reports of the seething revolt incubating

in various districts, based upon the communications of the disciples of various gurus to their religious heads... The reports were arranged according to districts, sub-districts, sub-divisions, and the cities, towns and villages... Hume thereupon resolved to open a safety valve for this unrest and the Congress was such an outlet.

[***The History of the Indian National Congress,*** **B.Pattabhi Sitaramayya, P.11]**

(అండర్‌గ్రవుండులో రాజకీయ అసంతృప్తి అలుముకున్నదనడానికి మిస్టర్ హ్యూమ్‌కు తిరుగులేని సాక్ష్యం లభించింది. వివిధ జిల్లాల్లో సలసల కాగుతున్న తిరుగుబాటుకు సంబంధించిన రిపోర్టులు ఏడు సంపుటాలుగా ఆయన చేతికి వచ్చాయి. మతగురువులకూ, వారి శిష్యులకూ మధ్య నడిచిన కమ్యూనికేషన్లు వాటిలో ఉన్నాయి. ... ఈ రిపోర్టులు జిల్లాల వారీగా, సబ్ డివిజన్ల వారీగా, నగరాలూ, పట్నాలూ, పల్లెల వారీగా వర్గీకరించబడి ఉన్నాయి... వాటిని చూసిన మీదట సెగలుకక్కే అశాంతికి సేఫ్టీవాల్వు ఒకటి తెరవాలని హ్యూమ్ నిశ్చయించాడు. అదే కాంగ్రెసు.)

రిపోర్టులను జిల్లాల వారీగా, సబ్ డివిజన్ల వారీగా, ఊళ్ల వారీగా వర్గీకరించారని అనడాన్నిబట్టే అది ప్రభుత్వపరంగా జరిగిన వ్యవహారమని అర్థమవుతుంది. ఏకకాలంలో దేశవ్యాప్తంగా 30వేల మంది గూఢచారులనో, స్థానిక అధికారులనో నియోగించి రాజకీయ అశాంతిపై రిపోర్టులను తెప్పించారంటేనే దానికి సంబంధించిన నిర్ణయం అత్యున్నత స్థాయిలో జరిగి ఉండాలి.

ఆ ప్రాంతం ఈ జిల్లా అన్న తేడా లేకుండా యావద్భారతం అసంతృప్తిలో సెగలు కక్కుతున్నదనీ, అట్టడుగు వర్గాల నిరుపేదలు బ్రిటిష్ సర్కారుపై సాయుధ సమరానికి సన్నద్ధమవుతున్నారనీ, కొంతమంది విద్యాధికులూ వారితో చెయ్యి కలిపి తిరుగుబాటును నడిపించే సూచనలున్నాయనీ కదా నాటి బ్రిటిషు ప్రభుత్వానికి అందిన సమాచారం? వేల మంది ఒకే సమయంలో వేరువేరు ప్రాంతాలనుంచి పంపిన విడివిడి రిపోర్టులు కాబట్టి అవి యథార్థమా కాదా అని శంకించాల్సిన పని లేదు. ప్రభుత్వ ఏజంట్లే పరిస్థితి మహాప్రమాదకరంగా ఉందన్నారు. కాబట్టి అది అక్షరాలా నిజమే అయి ఉండాలి.

చిత్రమేమిటంటే ఆ కాలాన ప్రజల ఆగ్రహం ఇంతలా సలసలమరిగిన జాడలేవీ మన చరిత్ర గ్రంథాల్లో కనిపించవు. సురేంద్రనాథ్ బెనర్జీ లెక్చర్లు, కేశవ్‌చంద్ర సేన్, స్వామి దయానందల సంస్కరణ యత్నాలు, వివేకానందుడి బోధలు, బంకించంద్రుడి రాతలు, కదాచిత్తుగా ఫడ్కే లాంటి ఒకరిద్దరి బందిపోటు సాహసాలు, అక్కడక్కడా టెర్రరిస్టు దాడులు– ఇవి మాత్రమే మనం చదివే చరిత్ర పుస్తకాల్లో కానవస్తాయి. అవి చదివితే

మొత్తంమీద 19వ శతాబ్దం చరమ దశలో దేశం స్తబ్ధంగా ఉన్నదనీ, అసలు యాక్షను యావత్తూ ఆ తరవాతే నడిచిందనీ మనకు అభిప్రాయం కలుగుతుంది. 1857 తిరుగుబాటుకూ కాంగ్రెసు పుట్టిన 1885కు నడుమ నడిచిందంతా విరామ సంగీతం లాంటిది అనుకుంటామే తప్ప నిజానికి ఆ సమయంలో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుని, ఆయుధసేకరణ ముమ్మరంగా జరుగుతూ మహాసంగ్రామానికి సన్నాహాలు సాగుతున్నాయని ఎంతమాత్రం పోల్చుకోలేము. వివిధ మత గురువులకూ, వారి శిష్యులకూ మధ్య సాగిన కమ్యూనికేషన్లను చూసిన బ్రిటిషు సర్కారుకేమో తారెత్తింది. ఇంతకుముందు అధ్యాయంలో ప్రస్తావించిన సద్గురు రామ్‌సింగ్ బృహత్ వ్యూహం ఈ సందర్భంలో సహజంగానే గుర్తొస్తుంది. కాని రామ్‌సింగ్ ఘనతను మన చరిత్రకారులు గుర్తించరు. నామ్‌ధారి సంప్రదాయాన్ని నెలకొల్పి, మతావేశం కనపరిచాడే తప్ప అతడికి రాజకీయ వ్యూహం ఉందనడానికి నమ్మదగ్గ ఆధారాలు లేవని ఆర్.సి.మజుందార్ అంతటి మహాచరిత్రకారుడే కొట్టిపారేశాడు. అప్పటి ఇంటిలిజెన్స్ రిపోర్టులను చూసిన ఎ.ఒ.హ్యూమ్‌కి ఈ సంగతి చెబితే ఫక్కున నవ్వుతాడు. మన దేశ పోరాట చరిత్ర గురించి మనకూ, మన చరిత్రకారులకూ ఎంత తక్కువ తెలుసనడానికి ఇదో ఉదాహరణ.

ఎ.ఒ.హ్యూమ్ జన్మతః ఆంగ్లేయుడైనప్పటికీ భారతదేశమన్నా, భారత ప్రజలన్నా అతడికెంతో అభిమానమనీ... ఇండియాకు మేలుచేసి, దాని స్వాతంత్ర్యానికి ప్రోదిచేసే సదాశయం తోటే అతడు 1885లో భారత జాతీయ కాంగ్రెసును స్థాపించాడనీ మనం తరచూ వింటుంటాం. అతడి తండ్రి జోసెఫ్ హ్యూమ్. ఇంగ్లండులో రాడికల్ పార్టీని నడిపించినవాడు. ఆయన నుంచి ఉదార భావాలను పుణికి పుచ్చుకున్న హ్యూమ్ ఇండియాలో తన మిత్రులైన లిబరల్ మేధావులను సంప్రదించి, కొత్తగా వైస్రాయ్ అయిన లార్డ్ డఫెరిన్‌తో మాట్లాడి బ్రిటిష్ సామ్రాజ్యానికి విధేయులైన విద్యావంతుల వేదికగా, స్వేచ్ఛాయుత భావ వ్యక్తీకరణకు నెలవుగా, ప్రజాస్వామిక సంస్కరణలకు సాధనంగా కాంగ్రెసును మలిచాడని మన పెద్దలు చెబుతుంటారు. మేధావుల జాతీయ సభగా తాను సంకల్పించిన సంస్థ నిర్మాణానికి సహకరించవలసిందిగా కలకత్తా యూనివర్శిటీవారికి ఆయన రాసిన చవులూరించే లేఖను చాలామంది ఉటంకిస్తుంటారు. "యాభైమంది భారతీయులు ముందుకొస్తే చాలు. ఏమైనా సాధించగలం. దేశ ప్రయోజనాలకోసం, ప్రజాస్వామిక పురోగతి కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వర్ధిల్లడంకోసం కొద్దిపాటి త్యాగాలు చెయ్యలేరా? అదికూడా చేతకాకపోతే భారతదేశ ఉజ్జ్వల సంస్కృతికి వారసులమని చెప్పుకోవటమెందుకు" అన్న తరహాలో ఆయన ఇచ్చిన పిలుపు భారత నవయువతకు మేలుకొలుపు అనటంలో సందేహం లేదు. అలాగని పూర్తిగా ఇండియా మీది ప్రేమతో, దాని అవసరాలు కనిపెట్టి దాని సర్వతో ముఖాభివృద్ధికి దోహదించాలన్న

తహతహతో నిస్వార్థంగా హ్యూమ్ దొర జాతీయ కాంగ్రెసును స్థాపించాడని చెప్పటమూ సరికాదు.

రాజకీయ వేదికగా కాంగ్రెసును పెట్టినవాడు హ్యూమ్ అయినా పెట్టించినవాడు వేరే ఉన్నాడు. రంగం మీద ప్రముఖంగా కనిపించేది హ్యూమే కాని- తెర వెనక సూత్రధారి అప్పటి వైస్రాయ్ లార్డ్ డఫెరిన్.

దేశంలోని రాజకీయ ప్రముఖులను ఏడాదికోసారి ఒకచోట చేర్చి సామాజిక విషయాలను స్నేహ పూర్వకంగా చర్చించేట్టు చేస్తే దేశానికి చాలా మేలు జరుగుతుందని ఎ.ఒ.హ్యూమ్ తొలుత భావించాడు. రాజకీయ వ్యవహారాలను మాత్రం అక్కడ చర్చించకూడదని ఆయన తలిచాడు. ఎందుకంటే కలకత్తా, బొంబాయి, మద్రాసు నగరాల్లోనూ, ఇంకా కొన్ని చోట్లా అప్పటికే గుర్తింపు పొందిన రాజకీయ సంఘాలు ఉన్నాయి. కొత్తగా పెట్టే జాతీయ సంస్థలోనూ మళ్లీ రాజకీయాలనే చర్చిస్తే ఆయా సంస్థల ప్రాధాన్యం తగ్గుతుందని హ్యూమ్ ఆలోచన. అంతేకాదు రాజకీయవాదులు ఏ రాష్ట్రంలో సమావేశమైతే ఆ రాష్ట్ర గవర్నరును సభాధ్యక్షుడిగా పెట్టుకుంటే రాజకీయ వర్గాలకూ, అధికార వర్గాలకూ మధ్య చక్కని పొంతన పొసగుతుందనీ ఆయన భావించాడు.

ఇలాంటి ఐడియాలెన్నో బుర్రనిండా పెట్టుకుని 1885 మొదట్లో కొత్త వైస్రాయ్ డఫెరిన్‌ను కలిసేందుకు హ్యూమ్ సిమ్లా వెళ్లాడు. వైస్రాయిగారు ఆయన చెప్పిందంతా శ్రద్ధగా విని "ఏమీ బాగాలేదు. ఇలా చేస్తే పెద్ద ఉపయోగమేమీ ఉండదు" అని పెదవి విరిచాడు. ఇంగ్లండులో వలె ఇండియాలో ప్రతిపక్షమంటూ లేదు. కాబట్టి దేశంలోని రాజకీయవాదులు ఏటా ఒకసారి కలిసి రాజకీయ వ్యవహారాలనే చర్చించి, ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపి, తగిన సూచనలు చేస్తే ప్రభుత్వానికీ, ప్రజలకూ కూడా మంచిది. కేవలం సాంఘిక విషయాలను చర్చించటం దండుగ అని నిష్కర్షగా చెప్పాడు. అలాగే- రాజకీయవాదుల సభకు గవర్నరు అధ్యక్షత వహించటమేమిటి? గవర్నరు పెద్దరికంలో జరిగే సభకు అధికారవాసనే ఉంటుంది తప్ప స్వేచ్ఛాయుతంగా నిర్ణయాలు జరిగాయని జనానికి గురి ఎలా కుదురుతుంది- అనీ డఫెరిన్ ప్రభువు ఆక్షేపించాడు. ఆయన చెప్పిందే బాగున్నదని హ్యూమ్‌కీ అనిపించి 'సరే' అన్నాడట. 'ఇంకేం? అలాగే కానీ. కాని ఇది నేను చేసిన ఏర్పాటు అన్నది మాత్రం ఎక్కడా బయటపెట్టవద్దు. నేను ఇండియాలో ఉన్నంతకాలం ఈ సంగతి ఎవరికీ తెలియటానికి వీల్లేదు' అని వైస్రాయి దొర షరతు పెట్టాడట. ఈ గుట్టు విప్పింది ఆషామాషీ ఆసామీ కాదు. భారత జాతీయ కాంగ్రెసుకు ప్రథమ అధ్యక్షుడుగా పనిచేసిన ఉమేశ్ చంద్ర బెనర్జీ స్వయంగా వెల్లడించిన

విషయమిది. పట్టాభి సీతారామయ్యగారి The History of the Indian National Congress గ్రంథం 23వ పేజీలో ఈ వైనాన్ని చదవొచ్చు. 'ఎ.ఓ.హ్యూమ్ అను ఆంగ్లేయుడు ఇండియన్ సివిల్ సర్వీసు నుంచి ఉద్యోగ విరమణ చేశాక భారతీయులకు మేలు చేయవలెనన్న సద్భావముతో భారత జాతీయ కాంగ్రెస్ అను రాజకీయ వేదికను 1885లో స్థాపించెను' అని మనం చరిత్ర పుస్తకాల్లో చదువుకున్న దానిలో నిజమెంతో దీన్నిబట్టి తెలిసింది కదా?

ఇంతకుముందు ప్రస్తావించిన ఇంటెలిజెన్స్ రిపోర్టులు వచ్చినప్పుడు హ్యూమ్ కేంద్ర హోంశాఖకు కార్యదర్శి. అధికార విధి నిర్వహణలో భాగంగానే ఆయన వాటిని పరిశీలించాడు. రిటైరై ప్రభుత్వంతో సంబంధంపోయాక ఎ.ఒ.హ్యూమ్ జాతీయ కాంగ్రెసు స్థాపించాడు కాబట్టి అందులో ప్రభుత్వ ప్రమేయమేదీ ఉండి ఉండదని ఊహించడానికి ఆస్కారం ఉంది. కాని లార్డ్ డఫెరిన్ అలా కాదే! కొత్త సంస్థలో రాజకీయాలు వద్దని హ్యూమ్ అంటే కాదు రాజకీయాలనే ఉండితీరాలని పట్టుబట్టినప్పుడు ఆయన దేశాధినేత; బ్రిటిషు సర్కారుకు సర్వాధికారి. భారతదేశంలో ఎవరూ తల ఎగరేయకుండా అసమ్మతిని ఎలా అణచాలి... బ్రిటిషు పెత్తనానికి ఎటునుంచీ ముప్పురాకుండా ఎలా చూసుకోవాలి అన్నదేకదా ఆయన స్థానంలో ఎవరున్నా ఆలోచించేది? వారికి రాజకీయ శిక్షణ ఇప్పించి, వారి అసంతృప్తిని వెలిగక్కేందుకు, వారంతా కలిసి ఒక్కటై జాతీయ డిమాండ్లపై పోరాడేందుకు తామే ఒక వేదిక అమర్చి పెట్టాలని వైస్రాయిగా ఉన్నవాడు కోరుకోడు.

మరి– డఫెరిన్ ఎందుకలా చేశాడు?

ఎందుకంటే– సర్కారుకందిన విశ్వసనీయ సమాచారాన్నిబట్టి 1857 పోరాటం భగ్నమై, దారుణ దమనకాండ తరవాత కూడా ప్రజల్లో స్వాతంత్ర్యకాంక్ష చావలేదు. 1857లాగే ఇప్పుడూ అట్టడుగు వర్గాల నిరుపేదలు కత్తులూ, ఈటెలూ పట్టి తెల్ల సర్కారు పీచమణచటానికి సన్నద్ధమవుతున్నారు. కొత్త పరిణామం ఏమిటంటే... 1857లో ఇంగ్లీషు చదువుల మేధావులు స్వాతంత్ర్య యుద్ధానికి దూరంగా ఉండిపోయారు. ఇప్పుడు విద్యాధిక వర్గాలవారు కూడా తమకు విద్యాబుద్ధులు గరిపిన తెల్లదొరలపై ద్వేషం పెంచుకుని తిరుగుబాటులో చేరి పోరాటాన్ని నడిపించడానికి ఉద్యుక్తులవుతున్నారు. అదే జరిగితే బ్రిటిష్ సామ్రాజ్యానికి మరీ ప్రమాదం. దొరలంటే మోజు, మొగమాటం లేని అలగా జనాన్ని ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఎవరు వారించినా వారు వినరు. కనీసం ఇంగ్లిషు వ్యామోహంగల చదువుకున్న వారినైనా ఆకట్టుకుని, ఆగ్రహించిన జనంనుంచి వేరుచెయ్యగలిగితే ఆమేరకు వ్యతిరేక వెల్లువ బలహీనమవుతుంది. తెల్లదొరతనానికి కావలసిన రీతిలో భారత రాజకీయాన్ని మలచుకోవటం వీలవుతుంది.

కాబట్టి విద్యావంతులైన భారతీయులను మచ్చిక చేసి, ప్రమాదం లేని దారిలో పెట్టటానికి అర్జంటుగా ఒక వేదిక కావాల్సి వచ్చింది.

లాభం లేని వ్యాపారి వరదనపోడన్నట్టు ఏదో పెద్ద లాభాన్నే ఆశించకుండా ఇటువంటి రిస్కుతో కూడిన పనులు ఎవరూ తలబెట్టరు. భారతీయులకు రాజకీయ బుద్ధులు గరిపి రేపటి స్వాతంత్ర్యానికి తర్ఫీదునిచ్చి బాధ్యతాయుతంగా తీర్చటానికి గాక... ముంచుకొస్తున్న ప్రజాగ్రహ వెల్లువను అడ్డుకట్టవేయటానికీ... భారతీయులను మభ్యపెట్టి జోకొట్టటానికీ, భారతీయ మేధావులను వాటంగా వాడుకోవటానికే బ్రిటిష్ ప్రభువులు బహుజాగ్రత్తగా ఆలోచించి జాతీయ కాంగ్రెసును హ్యూమ్ చేతి మీదుగా సృష్టించారన్నది తెలుస్తూనే ఉంది కదా?

భలే నాటకం

***క**మ్యూనిజం కన్నుమూయటానికి పూర్వం ప్రపంచంలో కార్మికోద్యమం బలంగా ఉండేది. పనివారు సంఘంకట్టి, తమకు ఎదురు తిరుగుతున్నారని గ్రహిస్తే వారి కట్టును చెడగొట్టటంకోసం తెలివిమీరిన యాజమాన్యాలు తమ తైనాతీలచేత కీలుబొమ్మ కార్మిక సంఘాలను పెట్టేస్తుండేవి. యజమానులు సృష్టించిన యూనియన్లు యజమానుల కొమ్మే కాస్తుండేవి.*

ప్రగల్భాలూ, ఉత్తుత్తి విన్యాసాలతో ఎంత హడావుడి చేసినా వాటికి కార్మిక జనంలో ఆదరణ పెద్దగా ఉండేది కాదు. కార్మికుల చైతన్యం, పోరాట పటిమ పెరిగేకొద్దీ కీలుబొమ్మల అసలు బండారం బయటపడేది.

భారత జాతీయ కాంగ్రెసు కథా ఇంచుమించుగా ఇదే తీరు! రంగం వేరు. నేపథ్యం వేరు. కాని నాటకం అదే.

దొంగదారిన తాము దురాక్రమణ చేసిన హిందూ దేశంలో తమపై సర్వత్రా ఆవరించిన అసంతృప్తినీ, అసమ్మతినీ గ్రహించి, బ్రిటిషు దొరతనం ప్రజాగ్రహాన్ని జోకొట్టి నిదురపుచ్చాలన్న ఎత్తుతో జాతీయ కాంగ్రెసు అనే పిండి బొమ్మకు ప్రాణం పోసింది. సురేంద్రనాథ్ బెనర్జీ వంటి దిగ్గజాల నేతృత్వంలో అప్పటికే రాణకెక్కిన ఇండియన్ అసోసియేషన్, నేషనల్ కాన్ఫరెన్సుల్లాంటి రాజకీయ సంఘాలకు పోటీగా కాంగ్రెసును రంగంలోకి దించింది.

నాటకం బాగానే ఆడారు. ఎంత బాగా అంటే... కొత్తగా పుట్టిన జాతీయ కాంగ్రెసు బ్రిటిషు సామ్రాజ్యానికి శత్రువు అని బ్రిటిష్ ప్రజలే భావించేంతగా! మొట్టమొదటి బొంబాయి సభలో కాంగ్రెసు తీర్మానాలను చూసి లండన్ 'టైమ్స్' అంతటి పత్రికే మండిపడి, వాటిని కనక అమలుచేస్తే ఇండియా అప్పుల బరువును మోయటం మినహా ఇంగ్లండుకు ఏమీ మిగలదని హెచ్చరించింది. "India was won by force and must be governed by force" (ఇండియాను బలంతో గెలిచాం. బలంతోనే దాన్ని పాలించాలి) అని ఆవేశపడింది. నిజానికి బ్రిటిష్ సర్కారు వారి రాజప్రతినిధి డఫెరిన్

ప్రభువుగారే వెనక ఉండి భారత జాతీయ కాంగ్రెసు అనే తోలుబొమ్మను తెరముందుకు తెచ్చిన సంగతి తెల్లవారికే తెలియదు. అలాగే- నూతన సంస్థను రాజకీయాల ప్రమేయం లేకుండా సామాజిక అంశాల చర్చకే పరిమితం చెయ్యాలని మొదట ఎ.ఒ.హ్యూమ్ అంటే- "కాదు కాదు; ప్రధానంగా రాజకీయాలే చర్చించాలి. రాజకీయ సంస్థగానే పనిచెయ్యాలి" అని పట్టుబట్టి మాట నెగ్గించుకున్నది వైస్రాయి డఫెరినేనని ఇంతకుముందు చూశాము కదా? మళ్లీ ఆ మహానుభావుడే పబ్లికుకు వచ్చేసరికి "నాకైతే ఇష్టంలేదు, రాజకీయాల జోలి మీకెందుకు? సాంఘిక సమస్యలకే పరిమితమవండి బాగుంటుందని చెప్పా. కాని నా మాట వినలేదు" అని మూడేళ్ల తరవాత (1888 నవంబరు 30న) ఓ సుప్రసిద్ధ ప్రసంగంలో వాక్రుచ్చాడు.

1885 డిసెంబరు చివరి వారం బొంబాయిలో జరిగిన ప్రథమ కాంగ్రెసు సభలో బ్రిటిషు గవర్నమెంటు ఉద్యోగులు చాలామంది హాజరై తీర్మానాల తయారీలో సహాయపడ్డారు. గవర్నమెంటుకు తెలియకుండా, దాని అనుమతి, ప్రోద్బలం లేకుండా వారు అలా రాజకీయ కార్యకలాపాల్లో పాలుపంచుకునేందుకు సాహసిస్తారని నమ్మలేము. బొంబాయి న్యాయమూర్తి జస్టిస్ రానడే సైతం ఆ సభలో బాహాటంగా పాల్గొని ప్రసంగించాడు. 1890లో కలకత్తాలో జరిగిన ఆరో మహాసభ దగ్గరికి వచ్చేసరికి సర్కారువారు భారత జాతీయ కాంగ్రెసు "perfectly legitimate" (పూర్తిగా న్యాయబద్ధం) అని ప్రకటించి, మహాసభలో పాల్గొనేందుకు ప్రభుత్వోద్యోగులకు అనుమతి ఇచ్చారు కూడా.

ఇలా కాంగ్రెసును తామే చెప్పి పెట్టించి, తమ నౌకర్లను తీర్మానాల రచనలో సాయానికి నియోగించి, సభలో పాల్గొనేందుకు తమ సిబ్బందికి అనుమతి ఇచ్చి, చట్టబద్ధమని ప్రకటించి ఒక చెంప ఆ సంస్థకు వత్తాసు ఇస్తూనే, ఇంకో చెంప దానితో తమకు సంబంధం లేనట్టు, దాని పొడే తమకు గిట్టనట్టు, దాని సత్వర మరణాన్నే తాము కోరుకుంటున్నట్టు సర్కారీ ముఖ్యులు వీర స్టేట్‌మెంట్లిచ్చారు. The British Government would never allow the Congress, which represented a microscopic minority of the population of India, to control her administration. *(భారత జనాభాకు నలుసంత ప్రాతినిధ్యం వహించే కాంగ్రెసు, ప్రభుత్వాన్ని నియంత్రించడాన్ని బ్రిటిషు గవర్నమెంటు ఎన్నటికీ అనుమతించదు)* అని ఇందాక ఉదాహరించిన ఉపన్యాసంలో డఫెరిన్ దొర అనగా ఇండియాకు విదేశాంగ మంత్రి అయిన లార్డ్ జార్జి హామిల్టన్ ఇంకో అడుగు ముందుకెళ్లి "The more I see and hear of the National Congress Party, the more I am impressed with the seditious and double sided character of the prime movers of

the Organisation" *(జాతీయ కాంగ్రెసు పార్టీని చూసేకొద్దీ, దాని గురించి వినేకొద్దీ ఆ సంస్థ ప్రధాన సంచాలకులది రాజద్రోహ పూరిత ద్వంద్వ ప్రవృత్తి అని నాకు నమ్మకం కుదిరింది)* అని 1896 డిసెంబరు 11న ప్రకటించాడు. 'దుర్మార్గం... రాజద్రోహ పూరితం' అని సర్కారువారు రంకెలేస్తే... వారికంతటి కంపరం కలిగించింది కాబట్టి కాంగ్రెసు జాతీయ ప్రయోజనాల కోసం చాలా బాగా పనిచేస్తున్నదని, జనం నమ్మేస్తారని వారి ఊహ. వాస్తవానికి తొలి రెండు దశాబ్దాల్లో కాంగ్రెసు నడిచిన తీరులో సర్కారువారు హడలిపోవలసింది, తీవ్ర సవాలుగా పరిగణించవలసింది ఏమీలేదు. ఇంకా చెప్పాలంటే వారు తమ పాచిక బాగా పారిందని లోలోన మురిసిపోయేంత గొప్పగా తొలినాళ్ల కాంగ్రెసు నడక సాగింది. ఉదాహరణకు కాంగ్రెసు రాజద్రోహ బుద్ధితో పనిచేస్తున్నదని హామిల్టన్ ప్రభువు పబ్లిగ్గా ఆగ్రహం అభినయించిన మరుసటి సంవత్సరం (1897) కాంగ్రెసు వార్షిక మహాసభ అధ్యక్షోపన్యాసంలో సర్ సి.శంకరన్ నాయర్ మాటతీరును గమనించండి:

"We are also aware that with the decline of British supremacy, we shall have anarchy, war and rapine. The Mahomedans will try to recover their lost supremacy. The Hindu races and chiefs will fight among themselves. The lower castes who have come under the vivifying influence of western civilisation are scarcely likely to yield without a struggle to the domination of the higher castes."

[*History of Freedom Movement,* R.C.Majumdar, Vol.I P.439]

(మనకు తెలుసు... బ్రిటిషు ఆధిపత్యం క్షీణిస్తే అరాచకం, అంతర్యుద్ధం, అల్లకల్లోలం వస్తాయని! తాము పోగొట్టుకున్న ప్రాభవాన్ని తిరిగి పొందాలని మహమ్మదీయులు ప్రయత్నిస్తారు. హిందూ జాతులు, వాటి నాయకులు తమలో తాము పోట్లాడుకుంటారు. పాశ్చాత్య నాగరికత ప్రభావంతో ఉజ్జీవం పొందిన దిగువ కులాలవారు అగ్రవర్ణాల పెత్తనానికి అంగీకరించరు. పోరాటం చేసే తీరుతారు.)

తొలి తరం కాంగ్రెసు నాయకులు కష్టపడి చేసిన ప్రచారమేమిటంటే, ఇండియాకు తన కాళ్లమీద తాను నిలబడే శక్తిలేదు. తనను తాను పరిపాలించుకునే స్తోమత దానికి కలగాలంటే ఇంకా చాలా ఏళ్లు అది తెల్లవారి ఒద్దికలో ఎదగాలి. వారి తర్ఫీదులో తగినంత రాజకీయ శిక్షణ పొందాలి. భారతదేశం సమస్యల పుట్ట. వైరుధ్యాల గుట్ట. సాంఘిక దురాచారాలకు పెట్టింది పేరు. మత మౌఢ్యానికి మేర లేదు. మతాల మధ్య, కులాల మధ్య సఖ్యత లేదు. సామాజిక దౌర్బల్యాలు తొలగి, అజ్ఞాన తిమిరంలోని జనబాహుళ్యానికి అక్షర జ్ఞానం సిద్ధించి, సాంఘిక పీడన తొలగేంతవరకూ... సొంతంగా

దేశాన్ని రక్షించుకోగల సైనిక పాటవం సమకూర్చుకునేదాకా... రాజకీయ స్వాతంత్ర్యం గురించి ఆలోచించరాదు. ఇన్నిన్ని సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న దేశానికి బ్రిటిషు పరిపాలన దేవుడిచ్చిన వరం. మహా ఘనత వహించిన ఆంగ్ల సార్వభౌములకు విధేయంగా మెలగి, బుద్ధిగా నడుచుకుంటే ఏదో ఒకనాటికి మనల్నీ వారంతవారిని చేయగలరు. ప్రభుత్వ విధానాల్లో మనకు బాధాకరమైన అంశాలు, అన్యాయ వైఖరులు ఉన్నా, వాటి గురించి మనం పిటిషన్లు పెట్టుకుంటే తప్పక ఆలకించగలరు. మనం అడిగేది సమంజసమని నచ్చ చెప్పగలిగితే మనం కోరే సంస్కరణలకు సమ్మతించగలరు. ఒకవేళ ఆలకించకపోయినా, అందరమూ కలిసి గట్టిగా ప్రార్థిస్తే తప్పకుండా దయచూపగలరు. కొంతమంది అధికారులు చెడ్డవారైనా ఆంగ్లేయులు స్వతహాగా సజ్జనులు. ఉదార హృదయులు. ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించినప్పటికీ, దాని గురించి ఆంగ్ల ప్రజానీకానికి సరైన అవగాహన కలిగించగలిగితే ప్రజాభిప్రాయ తీవ్రతకు దొరతనం తప్పక తల ఒగ్గుతుంది. సీమ దొరల దయాగుణంపై భరోసా ఉంచి, వారి పట్ల కృతజ్ఞతా భావంతో మనకు కావలసిన సంస్కరణలను వినమ్రంగా సాధించడమే మన కర్తవ్యం.

ఇదీ స్థూలంగా కాంగ్రెసు నేతల వైఖరి. ఇలాంటి ఉపదేశాన్ని దేశవాసులందరూ పాటించటం కంటే తెల్లవారికి కావలసింది మరొకటి లేదు. తమ దురాక్రమణకు, దుర్విధానాలకు రోసి భగ్గున మండుతున్న భారతీయులను సముదాయించి, వారి స్వాతంత్ర్య కాంక్షను అణగార్చి, ఇంతకాలమూ ద్వేషిస్తున్న వలస పెత్తనాన్ని వారు పూజించేట్టు చేయగలిగితే ఇండియాలో ఆంగ్ల సామ్రాజ్యానికి ఢోకా ఉండదు. భారతీయ ప్రముఖులచేతే కావలసిన రీతిలో ప్రచారం చేయిస్తే ప్రజలపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వారి మాటలు గట్టిగా వినిపించటానికి ఎంత అవకాశం కల్పిస్తే సామ్రాజ్యానికి అంత మేలు జరుగుతుంది.

ఇలా ఆలోచించి బ్రిటిషు ప్రభుత్వం 1892లో లెజిస్లేటివ్ కౌన్సిల్స్ చట్టం తెచ్చి చట్టసభల్లో భారతీయులకు ప్రవేశం కల్పించింది. దాని పుణ్యమా అని ఆంగ్ల మానస పుత్రులూ, దొరల దాసులేగాక ఫిరోజ్‌షా మెహతా, సురేంద్రనాథ్ బెనర్జీ, అశుతోష్ ముఖర్జీ లాంటి మహామేధావులు కూడా శాసనసభల్లో అడుగుపెట్టి, భారతీయుల పక్షాన శాయశక్తులా వాదించసాగారు. అదే సమయంలో దాదాభాయ్ నౌరోజి బ్రిటిషు పార్లమెంటు సభ్యుడై కామన్సు సభలో ఇండియా వాణిని గొప్పగా వినిపించాడు. ఇలా దేశంలో క్రమేణా రాజకీయ వర్గం ఎదిగింది. క్రమంగా జాతీయ భావమూ బలోపేతమైంది. జాతీయ దృష్టితో ఆలోచించేకొద్దీ కాంగ్రెస్ స్థాపకుల, వారి వారసుల

ఆంగ్ల భక్తి, వారి భిక్షాటన రాజకీయాలు భారతీయులకు బోలుగా కనిపించసాగాయి.

స్వాతంత్ర్యమనేది దొరలకు దయ కలిగితే వేసే బిచ్చంకాదు. అది భారతీయుల జన్మహక్కు. అడుక్కొని కాదు– పోరాడి దాన్ని సాధించాలి. తెల్లవారి అండ లేకుంటే భారతదేశానికి మనుగడ లేదనటం వేల సంవత్సరాల ఉజ్జ్వల చరిత్ర కలిగిన భారత జాతికి అవమానం. జాతి పూర్వ ప్రాభవాన్ని మరచి ఆత్మన్యూనతతో దొరలకు దాసోహమనటం పరువుతక్కువ పని. భారతీయులను ఉద్ధరించాలన్న దొడ్డబుద్ధితోకాక ఎడాపెడా దోచుకుందామనే తెల్లవారు ఈ దేశానికి వచ్చారు. వారు చేసేదంతా వారి స్వార్థంకోసమే... వారి పెత్తనాన్ని నిలుపుకోవటానికే తప్ప భారతీయులకు స్వపరిపాలనలో శిక్షణ ఇచ్చి, తీర్చిదిద్ది, యోగ్యత పొందారనుకున్నప్పుడు స్వాతంత్ర్యం ఇచ్చి చక్కా పోవటానికి కాదు. వారికి దయ కలిగేంతవరకూ స్వాతంత్ర్యం ఊసు ఎత్తకూడదంటే కల్పాంతంవరకూ వేచి ఉండవలసిందే– అని బాలగంగాధర తిలక్, బిపిన్ చంద్రపాల్, లాలా లజపతిరాయ్ వంటి దిగ్గంతులు చేసిన జాతీయవాద ప్రబోధం యువతరాన్ని విశేషంగా ఆకట్టుకుంది.

"Are you so dull-headed as to think that our foreign conquerors are a set of philanthropists who have come to our country to serve your interests only and not their own? Do you think they will neglect their own Birmingham and Manchester, and encourage your arts and manufactures as you wish? know ye not that he who would rise must himself make the attempt?"

(మీ దేశాన్ని జయించిన విదేశీయులు వారి ప్రయోజనాలనుగాక మీ ప్రయోజనాలను కాపాడటానికే ఆరాటపడే వదాన్యులని నమ్మేంత మందమతులా మీరు? వారి బర్మింగ్‌హామ్‌ను, మాంచెస్టరును నిర్లక్ష్యం చేసి మీ కళలను, మీ ఉత్పత్తులను వారు ప్రోత్సహిస్తారని మీరు అనుకుంటున్నారా? లేవాలంటే ఎవడి ప్రయత్నం వాడే చెయ్యాలని మీరెరుగరా?)

– అని బెంగాల్‌లో ఆధునిక జాతీయవాదానికి ఆద్యుడనదగ్గ రాజనారాయణ్ బోస్ కాంగ్రెసు పుట్టిన మూడేళ్లకే దేశవాసులను హెచ్చరిస్తే... లోకమాన్యుడు తిలక్ 'స్వాతంత్ర్యం నా జన్మహక్కు... పోరాడి అయినా దాన్ని సాధించి తీరుతా'నని ఎలుగెత్తి చాటి స్వాతంత్ర్య సమర శంఖాన్ని పూరించాడు. విద్యాబుద్ధులు గరిపి, నాగరికత నేర్పారంటూ తెల్లదొరల భజన చేయటం మాని... ఈ ప్రాచీన జాతి ఉజ్జ్వల సంస్కృతికి గర్వించి, ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకుని జీవించండని తిలక్ మహాశయుడు ఉద్బోధించాడు. అంతేకాదు గణపతి నవరాత్రులను, శివాజీ ఉత్సవాలను 1893లో ప్రారంభించి ఏటేటా విలక్షణంగా పెద్ద ఎత్తున జరిపించాడు. ప్రజలలోని మతపరమైన సెంటిమెంటును

జాతీయ సెంటిమెంటుతో చక్కగా మేళవించి, జన సామాన్యంలో జాతీయ స్ఫూర్తిని రగిలించాడు. 1896లో భయానకమైన కరవుతో బొంబాయి జనం అల్లాడి, ఆకలి బాధలతో లూటీలు చెలరేగినప్పుడు "బజార్లను ఎందుకు దోచుకుంటారు? పోయి కలెక్టరును అడగండి. మీకు పని చూపించి, ఆహారం ఇవ్వటం చట్టరీత్యా అతడి విధి. మీ హక్కును మీరు పొందండి. కట్టే శక్తి లేకపోతే ప్రభుత్వానికి శిస్తులు, బకాయిలు చెల్లించకండి" అని 'కేసరి' పత్రికలో ప్రేరేపించటంతో బ్రిటిషు సర్కారు తిలక్‌ను ప్రథమ శత్రువుగా పరిగణించింది. మరుసటి సంవత్సరం తెల్లవారి అత్యాచారాలకు ప్రతీకారంగా పూనా కలెక్టరును చాపేకర్ సోదరులు హత్య చేసినప్పుడు ఆ సోదరులను వేటాడి పట్టుకుని ఉరి తీయటంతో బాటు పనిలో పనిగా తిలక్ మీద రాజద్రోహం కేసు బనాయించి 18 నెలల కఠిన కారాగారశిక్ష విధించారు.

చరిత్రాత్మకమైన తిలక్ విచారణ, ఆయనకు జైలు శిక్ష భారత జాతీయోద్యమంలో పెద్ద మలుపు. అప్పటిదాకా రాజకీయాలంటే మేధావులు సభ తీర్చి, వివిధ విషయాలపై తర్జన భర్జనలు చేయటం... ప్రభుత్వానికి పిటిషన్లు పెట్టటం... ప్రభుత్వానికి ఆగ్రహం కలగని రీతిలో, చట్టానికి లోబడి విమర్శలు చేయటం, సమావేశ మందిరాల్లో, శాసనసభా ప్రాంగణాల్లో వాదనాపటిమ చూపించటం అనుకునేవారు. రాజకీయాలంటే పర్యవసానాలకు వెరవక ప్రజాసమస్యలపై గళమెత్తటం, నిర్భయంగా పోరాడటం, త్యాగాలు చేయటం, చెరసాలకు సిద్ధపడటం... అని తిలక్ ఆచరించి చూపించాడు.

లోకమాన్యుడి ప్రభావంతో ప్రజల ఆలోచనా రీతి మారింది. వట్టి మాటలకంటే గట్టి చేతలు ముఖ్యమన్న తెలివిడి కలిగింది. జన్మహక్కు అయిన స్వరాజ్యాన్ని సాధించుకోవాలన్న తహతహ పెరిగేకొద్దీ బ్రిటిషు దురాక్రమణదారులకు వంగి దండాలు పెట్టి, దయ చూపించమని ప్రార్థించే (ఇంతకుముందు ఉటంకించిన శంకరన్‌నాయర్ వంటి) కాంగ్రెసు నేతల పోకడపై వైముఖ్యం కలిగింది. పోరాడి సాధించాలనే జాతీయవాదులకు, అడుక్కుని తెచ్చుకోవాలనే కాంగ్రెసు తత్వానికీ మధ్య క్రమేణా దూరం పెరిగింది.

I say, of the congress, this: that its aims are mistaken, that the spirit in which it preceeds towards their accomplishment is not a spirit of sincerity and whole-heartedness, and that the methods it has chosen are not the right methods, and the leaders in whom it trusts, not the right sort of men to be leaders- in brief, that we are at present the blind led, if not by the blind, at any rate by the one-eyed.

(కాంగ్రెసు గురించి నేను చెప్పేదిది. దాని ఆశయాలు తప్పు. వాటిని సాధించేందుకు

అది నడుస్తున్న తీరు మనఃపూర్వకంగాదు. దానిలో నిజాయతీ లేదు. అది అనుసరించే పద్ధతులు సరైనవి కావు. అది విశ్వసించే నాయకులు సరైన వాళ్లు కాదు. ఒక్క మాటలో చెప్పాలంటే మనం గుడ్డివాళ్లచేత- కాకుంటే ఒంటి కంటి వాళ్లచేత నడిపించబడుతున్న గుడ్డివాళ్లం)

- అని 1893లో అరవిందఘోష్ చేసిన నిశిత నిర్ధారణ కాంగ్రెసు పట్ల ఆ కాలపు మేధావుల అవగాహనకు సూచిక.

ఈ రకమైన పరిస్థితిని ఇలాగే కొనసాగిస్తే తమ వ్యూహం భగ్నమై, ప్రజల ఆగ్రహం తీవ్రమై చివరికి తమ ఉనికికే మోసం రావచ్చునని తెల్లదొరతనం గ్రహించింది. తేరిపార చూస్తే దేశంలో అలజడికి మూలం, కేంద్ర స్థానం బెంగాల్ అని ప్రభువులకు తోచింది. దాన్ని చీలుస్తే తిరుగుబాటుతత్వమూ చిన్నాభిన్నమైపోతుందని వారి అమోఘమైన బుర్రకు స్ఫురించింది.

ఇంకేం? వైస్రాయి లార్డ్ కర్జన్ చక్రం విసిరాడు. తీరి కూర్చుని 1905లో బెంగాల్ విభజనకు అడ్డగోలుగా పాల్పడ్డాడు. కాని దానివల్ల అతడు ఆశించినట్టు అలజడి అణగిపోలేదు. మరింత తీవ్రమైంది. భారత జాతీయోద్యమంలో చిరస్మరణీయమైన పోరాట ఘట్టానికి తెర లేచింది.

దేశం గర్జించింది

'బెంగాల్ రాష్ట్ర మహాసభ' బెంగాలీలకు కొత్త కాదు. 1888 నుంచీ ఏటేటా జరుగుతూ వస్తున్నదే. కాని మునుపటి 18 సభలు ఒక ఎత్తు. ఈసారి బారిసాల్‌లో 1906 ఏప్రిల్ 14, 15 తేదీల్లో జరగనున్న మహాసభ ఇంకో ఎత్తు. బ్రిటిషు సామ్రాజ్యానికి పెను సవాలయిన బెంగాల్ జాతీయ వాదాన్ని ముక్కలు చేయటానికి కర్జన్ ప్రభువు కంకణం కట్టుకుని, ప్రబల ప్రజా వ్యతిరేకతను లెక్క చేయక, విశాల వంగ దేశాన్ని అడ్డగోలుగా రెండు చెక్కలు చేసిన తరువాత జరుగుతున్న వార్షిక మహాసభ ఇది.

బ్రిటిష్ ఇండియాలోని రాష్ట్రాల్లోకెల్లా బెంగాలే పెద్దది. సుమారు 2 లక్షల చదరపు మైళ్ల వైశాల్యం, దగ్గర దగ్గర ఎనిమిది కోట్ల జన బాహుళ్యం కలిగిన బెంగాల్‌లో వంగ దేశమే గాక బీహార్, ఒరిస్సా, చోటా నాగపూర్‌లు కూడా చేరి ఉన్నాయి. అంత పెద్ద రాష్ట్రాన్ని అజమాయిషీ చేయటం కష్టంగా ఉంది కనుక పాలనా సౌలభ్యంకోసం ఇతర ప్రాంతాలను బెంగాల్ నుంచి వేరు చేయాలన్న ప్రతిపాదన చాలాకాలంగా ఉన్నదే. కాని వైస్రాయి కర్జన్‌కి కావలసింది పరిపాలనా సౌలభ్యం కాదు... ఆంగ్ల సామ్రాజ్య రాజకీయ సౌలభ్యం. తెల్లదొరతనానికి బెంగాల్ పక్కలో బల్లెంలా తయారైంది. అందునా బెంగాలీ హిందువులు మరీ తెలివిమీరారు. కాబట్టి, మళ్లీ లేవకుండా వారిని చితకగొట్టి, బెంగాలీ తాదాత్మ్యాన్ని కాలరాచి వేయటంకోసం మహాప్రభువు కసాయి కత్తి పట్టారు. బెంగాలీ మాట్లాడే వంగ దేశాన్ని రెండుగా చీల్చారు. తూర్పు బెంగాల్‌ను తీసుకుపోయి అస్సాంలో కలిపి ప్రత్యేక రాష్ట్రంగా మార్చారు. పశ్చిమ బెంగాల్‌ను పట్టుకెళ్లి బీహార్, ఒరిస్సాలలో కలగలిపి ఇకపై అదే బెంగాల్ రాష్ట్రం పొమ్మన్నారు.

ఇందులోని దురుద్దేశం ఎవరికైనా చూడగానే అర్థమవుతుంది. సరికొత్త తూర్పు బెంగాల్ రాష్ట్రంలో నడమంత్రపు ఏర్పాటువల్ల ముస్లింలది మెజారిటీ అవుతుంది. వారిలో రాజకీయ చైతన్యం తక్కువ. బ్రిటిషు ప్రభుత్వానికి హిందువులకంటే ఎక్కువ విధేయులు.

వారి సంఖ్యాధిక్యం ముందు బెంగాలీ హిందువుల ధిక్కారం బలాదూరు అవుతుంది. హిందీ మాట్లాడే బీహార్‌ను, ఒరియా మాట్లాడే ఒరిస్సాను తెచ్చి పశ్చిమ బెంగాల్‌లో కలపడం వల్ల రెండో రాష్ట్రం పేరుకు బెంగాల్ అయినా బెంగాలీలు అందులో మెజారిటీ కోల్పోతారు. ఏతావతా హిందువుల నుంచి ముస్లింలను వేరుచేసి, వారిపై వీరిని రెచ్చగొట్టి, శాశ్వత మత వైషమ్యం రగిలించినట్టూ అవుతుంది. సొంత రాష్ట్రంలోనే బెంగాలీలను మైనార్టీలుగా మార్చి, ఆప్తబంధువులను విడదీసి, వంగ సంఘీభావపు వెన్ను విరిచినట్టూ అవుతుంది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు.

భలే మాస్టర్ ప్లాన్ వేశామని తెల్లదొరలు తెగ మురిసిపోయారు. కాని, వారి కుత్సితానికి వ్యతిరేకంగా వారు కలనైనా ఊహించని ప్రజాగ్రహ వెల్లువ పెల్లుబికింది. హిందువుల బారినుంచి రక్షించి ముసల్మాన్లకేదో మహోపకారం చేసి, వెనుకటి పూర్వవైభవానికి ప్రోదిచేసేందుకే బెంగాల్‌ను విభజించినట్టు లార్డ్ కర్జన్ ఎంత ప్రచారం చేసినా జాతీయవాదులైన ముస్లింలు ఆ మాయకు లోబడక విభజన వెనుక బ్రిటిష్ దుర్నీతిని గ్రహించారు. హిందువులతో భుజం కలిపి విభజన దుర్మార్గానికి వ్యతిరేకంగా పిడికిలి బిగించారు. సర్కారువారికి సవినయంగా పిటిషన్లు పెట్టుకోవటం, దయ చూపి న్యాయం చేయవలసిందని వారి ఘనతను గూర్చి మిక్కిలి ప్రార్థించటం, సభలు పెట్టి బహిరంగ విజ్ఞప్తులు చేయటం, పత్రికల ద్వారా ప్రచారం చేయటం వంటి కాంగ్రెస్ మార్కు మామూలు మార్గాలన్నీ అనుసరించాక, దేనివల్లా పనికాకపోవటంతో, రాజ్యాంగబద్ధ పద్ధతులవల్ల లాభం లేదని గ్రహించి బెంగాల్ నేతలు కీలెరిగి వాత పెట్టదలిచారు.

ప్రజల తీవ్ర వ్యతిరేకతను తూష్ణీకరించి, ప్రజా నాయకుల సమంజస వాదనలను పెడచెవిన పెట్టి, బ్రిటిషు ప్రభుత్వం మొండిగా బండగా బెంగాల్ విభజనను 1905 జులై 20న అధికారికంగా ప్రకటించింది. దానిని ఎలా ఎదుర్కోవాలా అని పక్షం రోజులపైగా తర్జన భర్జనలు చేసి, అనేక ప్రతిపాదనలు పరిశీలించిన మీదట 1905 ఆగస్టు 7న కలకత్తా టౌన్‌హాల్ సమావేశంలో బ్రిటిష్ తయారీ వస్తువులను, సరుకులను బహిష్కరించాలనీ, స్వదేశీ ఉత్పత్తులనే ఇకపై అందరూ ఉపయోగించాలనీ ఏకాభిప్రాయం కుదిరింది. చరిత్రాత్మకమైన 'స్వదేశీ ఉద్యమం' అలా మొదలైంది.

బెంగాల్‌కు మాత్రమే పరిమితమైన విభజన సమస్యపై స్థానిక ఆందోళనగా ఆరంభమైనా స్వదేశీ ఉద్యమం అతి తక్కువ కాలంలో దేశమంతటా అంటుకుంది. బెంగాలీలు తలపెట్టిన వినూత్న పోరాటం వారిలాగే బ్రిటిషు దుర్విధానాల బారిన పడ్డ యావద్భారతాన్ని ఆకర్షించింది. ఎక్కడెక్కడి విద్యార్థులూ చొరవ తీసుకుని వీధుల్లోకి వచ్చి ఉప్పు, చక్కెర, మాంచెస్టర్ మిల్లు వస్త్రాలూ వగైరా విదేశీ వస్తువులను బహిష్క

రించాలని ప్రజలను ధైర్యంగా పురికొల్పారు. బ్రిటిషు దమన నీతికి జంకక పత్రికలవారూ, మేధావులూ నిర్భయంగా గళమెత్తారు. 'వందేమాతరం' అఖిల భారతానికీ యుద్ధ నినాదమైంది. అది చెవిన పడితేనే తెల్ల దొరతనానికి గంగవెర్రులెత్తసాగింది. హిందూ దేశాన్ని నిలువుదోపిడీ చేసి, ఇక్కడి ముడి పదార్థాలను కారుచౌకగా పట్టుకుపోయి, సీమ మిల్లు ఉత్పత్తులను తెచ్చి దేశంలో అమ్మి విశేష లాభాలు గడించటానికి అలవాటు పడ్డ బ్రిటిషు ఆర్థిక వ్యవస్థ ఆయువు పట్టుమీద స్వదేశీ ఉద్యమం గట్టిదెబ్బకొట్టింది. దాంతో ఎలాగైనా ఆ ఉద్యమాన్ని అణచాలని విదేశీ ప్రభుత్వం భయానకంగా విరుచుకుపడింది. 'వందేమాతరం' అంటే చాలు లాఠీలతోమోది, కొరడాలతో కొట్టి ఒళ్లు హూనం చేయసాగింది. దెబ్బలు తగిలేకొద్దీ దేశభక్తులకు వీరావేశం పెరిగేది. బ్రిటిషు సర్కారు ముందు సాగిలపడి, అణగిమణగి ప్రార్థనలు, విన్నపాలు చేసే కాంగ్రెస్ తరహా రాజకీయానికి భిన్నంగా తిలక్, బిపిన్‌చంద్రపాల్, అరవిందఘోష్ లాంటి అతివాద జాతీయ నేతల ఆధ్వర్యంలో సిసలైన ప్రజాపోరాటం హోరాహోరీగా సాగుతున్నది.

ఇదిగో ఈ పరిస్థితుల్లో బారిసాల్‌లో బెంగాల్ రాష్ట్ర మహాసభకు తెరలేచింది. హిందూ ముస్లింలను విభజించి, పాలించాలని తెల్లదొరతనం ఎన్ని తంటాలు పడుతున్నా, మతసఖ్యత ఇంకా మిగిలే ఉందని గుర్తుచేసేలా అబ్దుల్ రసూల్ అనే ముస్లిం బారిస్టరు ఆ సభకు అగ్రాసనాధిపతి. మహాసభ ఆరంభానికి ముందురోజు (ఏప్రిల్ 13) సాయంత్రానికల్లా కలకత్తా, ఢక్కా తదితర కేంద్రాల నుంచి ప్రతినిధులు స్టీమర్ల మీద పెద్ద సంఖ్యలో బారిసాల్ చేరుకున్నారు. నేలమీద కాలు మోపకముందే వారికి పరిస్థితి తీవ్రత అర్థమైంది. వారిని స్వాగతించటానికి వెళ్లిన ఆహ్వాన సంఘ నిర్వాహకులు స్టీమర్లలోనే వారికి పూర్వాపరాలను వివరించారు.

'వందేమాతరం' అని ఎవరూ అనడానికి వీల్లేదని మిగతాచోట్ల లాగే బారిసాల్ అధికారులూ కర్కశంగా ఆంక్ష పెట్టారు. గోడమీద 'వందేమాతరం' అని రాసివున్న అపరాధానికి ఈమధ్య ఒక ఇంటిని ఏకంగా కూల్చేశారు. వంటింట్లో ఉండి వందేమాతరం కూనిరాగం తీసిన నేరానికి ఒక పదేళ్ల కుర్రాడిని కలెక్టరేటు కోర్టుకు ఈడ్చుకెళ్లి కాళ్లూచేతులు కట్టేసి కొరడాలతో తాటలేచేట్టు కొట్టారు. ఇంట్లో 'వందేమాతరం' చెవిన పడితేనే సహించనివారు బహిరంగ కార్యక్రమాల్లో ఆ నినాదాన్ని అనుమతించే ప్రసక్తేలేదు. ఆ సంగతి సభా నిర్వాహకులను పిలిపించి కొద్దిరోజుల ముందే అధికారులు స్పష్టం చేశారు. ప్రతినిధుల స్వాగతంలో 'వందేమాతరం' అని ఎవరైనా అన్నారో కబడ్దార్ అని హుంకరించారు. అలా జరగనివ్వమని వారినుంచి మాట కూడా తీసుకున్నారు.

"ఇదీ సంగతి. మా ఇబ్బందిని అర్థం చేసుకుని మా మాటను మన్నించండి" అన్నారు నిర్వాహకులు. వచ్చిన ప్రతినిధులు తెల్లబోయారు. ఏమిటి చేయటమని చాలాసేపు

మల్లగుల్లాలు పడ్డాక "సరే, స్థానిక సహచరులను ఇరుకున పెట్టటమెందుకు? స్వాగత కార్యక్రమాల్లో వందేమాతరం అనబోమనే కదా వారు సర్కారుకు హామీ ఇచ్చింది? అంతవరకు ఒప్పుకుందాం. ఊళ్లోకి వెళ్లాక ఏమి చేయాలో తరవాత ఆలోచిద్దాం" అని అంతా అనుకున్నారు. అలాగే చేశారు.

ఊళ్లోకి వచ్చాక సురేంద్రనాథ్ బెనర్జీ వంటి అగ్ర నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించారు. 'వందేమాతరం' అనడమే నేరమన్న సర్కారీ ఆంక్ష చట్టరీత్యా చెల్లదు. చట్టవిరుద్ధమైన ఉత్తర్వుకు లోబడవలసిన అవసరం మనకు ఎంతమాత్రం లేదు అని అంతా కలిసి తేల్చారు. ఏది ఏమైనా సరే మన హక్కును నిలబెట్టుకోవాలి. సభలోనూ, సభకు ముందూ 'వందేమాతరం' నినదించి తీరాలి అని నిశ్చయించుకున్నారు. తరువాత ఏమైందో A Nation in Making గ్రంథంలో సురేంద్రనాథ్ బెనర్జీ చెబుతారు:

"మర్నాడు ఉదయం ముఖ్యులందరం సమావేశమయ్యాం. అక్రమ నిషేధాన్ని ధిక్కరించాలనీ, మధ్యాహ్నం డెలిగేట్లంతా రాజావారి హవేలీలో బయలుదేరి 'వందేమాతరం' నినదిస్తూ సభాస్థలికి ఊరేగింపు తీయాలనీ నిర్ణయించాం. ధిక్కారాన్ని పోలీసులు చూస్తూ ఊరుకోరు. బలప్రయోగం చేసి తీరుతారు. అయినా మనం రెచ్చిపోకూడదు. పోలీసులపై ఎవరూ తిరగబడకూడదు. లాఠీలూ కట్టెలూ ఎవరూ చేతపట్టరాదు- అని కట్టడి చేసుకున్నాం.

"ఆ ప్రకారమే మధ్యాహ్నం 2.30కి అంతా కలిసి బయలుదేరాం. సభాధ్యక్షుడు అబ్దుల్ రసూల్, ఆయన ఇంగ్లీషు భార్య ముందు బండెక్కారు. నేను, మోతీలాల్ ఘోష్, భూపేంద్రనాథ్ బసు నడిచి వెళ్లాం. అప్పటికే పోలీసులు ఆరడుగుల దుడ్డుకర్రలు చేతపట్టి పెద్దఎత్తున మోహరించి ఉన్నారు. పోలీసు సూపర్నెంటు గుర్రమెక్కి తిరుగుతున్నాడు. మమ్మల్నయితే వెళ్లనిచ్చారు. యువ ప్రతినిధులు హవేలీ నుంచి వీధిలోకి వచ్చి 'వందేమాతరం' అని ఎలుగెత్తి నినదిస్తూ, మా వెనుక ఊరేగింపులో కలుస్తుండగా దాడి మొదలైంది. రెగ్యులేషన్ లాఠీలతో పోలీసులు విరుచుకుపడ్డారు. వందలాది డెలిగేట్లను గొడ్లను బాదినట్టు బాది, వారి ఒంటిమీద 'వందేమాతరం' బాడ్జిలను చించేయసాగారు.

"ఇదంతా చూసి నేను, మోతీలాల్ ఘోష్ వెనక్కి వెళ్లాం. 'మా వాళ్లను ఎందుకు కొడుతున్నారు? వాళ్లేమైనా తప్పుచేస్తే శిక్షించాల్సింది నన్ను. కావాలంటే నన్ను అరెస్టు చేయండి" అని పోలీసు సూపర్నెంటు మిస్టర్ కెంప్‌తో అన్నాను. 'మీరు అడగక్కర్లేదు సర్! మీరు మా ఖైదీ' అని అతడు తడుముకోకుండా బదులిచ్చాడు. నన్ను అరెస్టుచేయాలని ప్రభుత్వం ముందే నిర్ణయించినట్టుంది.

"నాకోసం సభ ఆపకండి. కార్యక్రమాన్ని మామూలు ప్రకారమే జరిపించండి' అని నేను పక్కనే ఉన్న భూపేంద్రనాథ్‌కు చెప్పాను. నా అరెస్టు కబురు తెలిసి డెలిగేట్లు

ఆగ్రహోద్విగ్నులయ్యారు. అయినా నా మాటను మన్నించి, యథావిధిగా సభా కార్యక్రమాన్ని సాగించారు.

"సూపరింటెంటు నన్ను మేజిస్ట్రేటు మిస్టర్ ఎమర్సన్ ఇంటికి తీసుకెళ్లాడు. నా వెంట హితవాది పత్రిక సంపాదకుడు కాళీప్రసన్న, ఇంకో ఇద్దరు ఉన్నారు. కాళీప్రసన్నను చూడగానే మేజిస్ట్రేటు మండిపడి "గెటౌట్" అని గెంటేశాడు. మిగతా ఇద్దరినీ కూచోనిచ్చాడు. నేనూ అక్కడ కనపడ్డ డొక్కు కుర్చీలో కూచోబోతుండగా "నువ్వు ఖైదీవి. ఇక్కడ కూర్చోకూడదు. నిలబడాల్సిందే" అని మేజిస్ట్రేటు ఉరిమాడు. "అవమానిస్తే సహించేది లేదు. మర్యాద మీరొద్దు" అన్నాను నేను. అతడు మండిపడి నా మీద కోర్టు ధిక్కారం చార్జి మోపాడు. అక్కడే ఉన్న ఇంకో మేజిస్ట్రేటు "గొడవెందుకు? క్షమాపణ చెప్పరాదా?" అని నాతో అన్నాడు. "నేనేమి తప్పు చేశాను? ఎందుకు క్షమాపణ చెప్పాలి?" అన్నాను నేను. మేజిస్ట్రేటును ధిక్కరించిన నేరానికి నాకు రెండొందల రూపాయల జరిమానా విధించారు.

"తర్వాత పోలీసు కేసు టేకప్ చేశారు. సూపరింటెంటు కెంప్ నాకు వ్యతిరేకంగా సాక్ష్యమిచ్చాడు. అనుమతి లేని ఊరేగింపులో చేరి నిషిద్ధ నినాదం చేశానని నాపై అభియోగం. నేను తప్పు చెయ్యలేదనీ, సూపరింటెంటును క్రాస్ ఎగ్జామిన్ చేస్తాననీ, నా నిర్దోషిత్వం రుజువు చేసుకుంటాననీ నేను అడిగాను. మేజిస్ట్రేటు దాన్ని తోసిపుచ్చాడు. నేను దోషినని అక్కడికక్కడే నిర్ధారించి, ఇంకో రెండొందల రూపాయల జరిమానా వేశాడు.

"ఫైనుకట్టి బయటపడి నేను సభా ప్రాంగణం చేరుకున్నాను. అక్కడో విలక్షణ దృశ్యం కానవచ్చింది. మమ్మల్ని చూడగానే సభలోని వేలమంది డెలిగేట్లు లేచి నిలబడి, పిడికిలెత్తి, 'వందేమాతరం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా పదే పదే అరిచారు. మేము వేదిక మీద కూచున్నాక సభా కార్యక్రమం మళ్లీ కొనసాగింది. అదే సమయంలో తలకు కట్టుకట్టుకుని చిత్తరంజన్ గుహ అనే యువకుడు తండ్రితో కలిసి వచ్చాడు. ఊరేగింపులో అతణ్ని పోలీసులు లాఠీలతో చితకబాది, దగ్గర్లోని నీళ్ల టాంకులోకి విసిరేశారు. సమయానికి ఎవరో ఆదుకోకపోతే అతడు ఊపిరాడక చనిపోయేవాడే. ఆ తర్వాతా వదిలిపెట్టకుండా పోలీసులు వెంటాడి అతణ్ని క్రూరంగా కొట్టారు. బలశాలి అయినా అతడు తిరగబడలేదు. దెబ్బదెబ్బకూ 'వందేమాతరం' అని అరుస్తూనే ఉన్నాడు. ఆ సంగతి అతడి తండ్రి కళ్లకు కట్టినట్టు వర్ణిస్తుంటే సభికుల కళ్లు చెమర్చాయి.

"సాయంత్రం తొలిరోజు సభ ముగిసింది. తిరిగి వెళుతూ కూడా డెలిగేట్లు దమనకాండకు భయపడకుండా పురవీధుల్లో నిర్భయంగా "వందేమాతరం" నినాదం చేశారు. పోలీసులు మిర్రిమిర్రి చూశారు. కాని అడ్డుకోలేదు. బహుశా మధ్యాహ్నం చూపిన ప్రతాపం ఆ రోజుకు చాలుననుకున్నారేమో.

"అణచివేత కథ అక్కడితో అయిపోలేదు. మరునాడు (1906 ఏప్రిల్ 15న) రెండో రోజు సభాకార్యక్రమం మధ్యలో పోలీసు సూపర్నెంటు కెంప్ పెద్ద బలగంతో విసురుగా వచ్చాడు. సభానంతరం వీధుల్లో 'వందేమాతరం' నినాదం చేయబోమని హామీ ఇస్తే తప్ప సభను సాగనిచ్చేది లేదని అధ్యక్షుడికి చెప్పాడు. అలాంటి గ్యారంటీ ససేమిరా ఇవ్వమని సభాధ్యక్షుడు చెప్పాడు. అయితే- క్రిమినల్ ప్రొసిజర్ కోడ్ సెక్షన్ 144 కింద సభను నిషేధిస్తున్నట్టు మేజిస్ట్రేటు ఉత్తర్వును సూపర్నెంటు చదివి వినిపించి, వెంటనే అందరూ ఇక్కణ్నించి వెళ్లిపోవాలని హుకుం వేశాడు. మేమెందుకు పోవాలి అని ఉడుకురక్తపు యువకులు ఎదురు తిరగబోయారు. కాని- అన్యాయమైనదైనా సరే ప్రభుత్వ ఉత్తర్వును మన్నించాలని నచ్చచెప్పి సీనియర్ నాయకులు వారిని వారించారు. అర్ధాంతరంగా ముగిసిన సభ నుంచి తిరిగివెళుతూ వందలాది ప్రతినిధులు దారిపొడవునా ప్రభుత్వ పశుబలాన్ని ధైర్యంగా సవాలుచేస్తూ 'వందేమాతరం' అని దిక్కులదిరేలా అరుస్తూనే ఉన్నారు."

[*A Nation in making,* Surendranath Banerjee, PP.220-226]

బారిసాల్‌లో నాయకులకు జరిగిన అవమానం, లెఫ్టినెంట్ గవర్నర్ ఫుల్లర్ పురమాయింపుపై అక్కడ చెలరేగిన దాష్టీకం వార్తలు దావానలంలా దేశమంతటా వ్యాపించాయి. రెండురోజుల తరవాత తిరుగు ప్రయాణంలో సురేంద్రనాథ్ బెనర్జీ ఎక్కిన స్టీమరో, రైలో ఆగిన ప్రతిచోటా వందల మంది గుమికూడి ఆయన పాదధూళిని శిరసున దాల్చారు. ఏప్రిల్ 18 తెల్లవారుఝామున కలకత్తా చేరేసరికి పదివేల మంది ఆయనకు ఘనస్వాగతం పలికి రైల్వేస్టేషను నుంచి కాలేజి స్క్వేర్ దాకా ఊరేగిస్తూ తీసుకెళ్లారు. బారిసాల్‌లో పుట్టిన వాయుగుండం క్రమేణా పెనుతుఫానుగా మారి బ్రిటిషు మహాసామ్రాజ్యపు పునాదులను ఊపేసింది. అంతదాకా రాజకీయాలకు దూరంగా తమ లోకంలో తాము బతికినవారు కూడా 'స్వదేశీ శపథం' పూనారు. లాహోర్, మద్రాసు, పూనా వంటి సుదూర ప్రాంతాల నుంచి బారిసాల్ యోధులకు సంఘీభావం తెలుపుతూ టెలిగ్రాంలు కుప్పతెప్పలుగా వచ్చాయి. మదరాసు ఎస్ప్లనేడ్‌లో పదివేల మంది బహిరంగ సభ జరిపి, 'వందేమాతరం' అని ఆకాశాన్నంటేలా నినదించి, బారిసాల్‌లో ప్రభుత్వ దమన నీతిని గర్హిస్తూ తీర్మానం చేశారు. స్వదేశీ ఉద్యమ స్ఫూర్తితోనే మచిలీపట్నం పురజనులు 1907 నవంబర్ 17న సమావేశమై నేషనల్ కాలేజిని, జాతీయ ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పాలని నిశ్చయించారు. ఇంచుమించుగా అదే సమయంలో దక్షిణ భారతాన ప్రప్రథమంగా జాతీయ సెకండరీ స్కూలు రాజమండ్రిలో ఏర్పాటైంది. ఉత్తరాన యునైటెడ్ ప్రావిన్సుల్లో 23 జిల్లాలు, మధ్యభారతంలో 15 పట్నాలు, బొంబాయి ప్రెసిడెన్సీలో 24 నగరాలు, పంజాబులో 20 జిల్లాలు, మద్రాసు ప్రెసిడెన్సీలో 13

జిల్లాలు విదేశీ వస్తుబహిష్కరణ- స్వదేశీ ఉద్యమాలకు కేంద్రాలయ్యాయని బ్రిటిష్ సర్కారుకు గూఢచారి వర్గాలు నివేదించాయి.

విదేశీ ప్రభుత్వ దుర్నీతిని నిరసిస్తూ ప్రజలు సహాయ నిరాకరణ, సత్యాగ్రహాలను అహింసాయుతంగా సాగించటం, ఎన్ని దెబ్బలు తగిలినా పళ్ల బిగువున భరించి నిశ్చలంగా నిలబడడం మహాత్మాగాంధీగారు రంగంలోకి వచ్చాకే జరిగిందని సాధారణంగా మనం అనుకుంటాం. ఆయన రంగప్రవేశానికి దశాబ్దం పూర్వమే అటువంటి పోరాట పటిమను జాతీయోద్యమం సంతరించుకున్నదనటానికి బారిసాల్ అనుభవమే సాక్షి. నిజానికి ఆ చిన్న పట్టణంలో నెత్తురుమండే వేలాది నవ యువకులు బ్రిటిషు సామ్రాజ్యంపై రాజీలేని పోరు సాగిస్తూ, పాశవికమైన పోలీసు దాడిని నిబ్బరంగా తట్టుకుని, ఒళ్లు హూనమయ్యేలా లాఠీ దెబ్బలు తింటూ, దెబ్బదెబ్బకూ వందేమాతరాన్ని ప్రణవ మంత్రంలా జపిస్తూ తరిస్తున్న సమయాన బారిస్టర్ ఎం.కె.గాంధీగారు దక్షిణాఫ్రికాలో బ్రిటిష్ మహా సామ్రాజ్యానికి తిరుగుబాట్ల అణచివేతలో ఏ రకమైన సేవ చేసి, తన ప్రభుభక్తిని ఎలా నిరూపించుకోవాలా అని మహా ఆరాటపడుతున్నారు.

మనం జరపని శతజయంతి

***వం**దేమాతరం శతజయంతి, సత్యాగ్రహ శతజయంతి... ఇలా అనేక శతజయంతులను గత కాలపు ఘనతకు గర్వపడుతూ మనం ఇటీవలి కాలంలో జరుపుకున్నాం. సిగ్గుపడుతూ జరుపుకోవలసిన ఒక శతజయంతిని మాత్రం వదిలేశాం. ఏమిటది? 'చెప్పల సంస్కృతి' శతజయంతి!*

ఆధునిక భారత రాజకీయ చరిత్రలో గొప్ప ఎంతుందో చెత్త కూడా అంతే ఉంది. దూరపు కొండలు నునుపు అన్నట్టు మన ముత్తాతల కాలపు రాజకీయ విలువల మీద, నాటి నేతల నియమబద్ధ విశుద్ధవర్తన మీద మనకు మహాగౌరవం. క్రమానుగతంగా ప్రమాణాలు క్షీణించి, వ్యవస్థలు దిగజారి యుక్తాయుక్త విచక్షణ నశించిన పర్యవసానంగా మన కాలంలోనే రాజకీయాలు భ్రష్టు పట్టాయని, అలనాటి అత్యున్నత విలువలకు నిలువ నీడ లేకుండా పోయిందని తెగ బాధపడుతూంటాం. వెనుకటి నేతల నడత మీద నమ్మకంతో మనం గమనించని చేదు నిజమేమిటంటే... జాతీయోద్యమ చరిత్రలో గర్వించదగిన విషయాలు ఎన్నో ఉన్నట్టే గర్హించదగిన అంశాలూ కొన్నయినా ఉన్నాయి. ఉత్తమోత్తములనుకునే కొందరు మహా నేతలే కొన్ని సందర్భాల్లో అధమాధమంగా ప్రవర్తించారు. త్యాగాలు చేసిన పెద్దలే ఆగాలూ చేశారు. ఉత్కృష్టంగా బతికిన వారే కొండొకచో నికృష్టంగానూ వ్యవహరించారు. వర్తమానంలో మనం చూస్తున్న పతనానికి పునాదులు గతంలోనే పడ్డాయి. ఇపుడంత తీవ్రంగా, ఇంత విస్తృతంగా కాకపోయినా రాజకీయాలు బజారు స్థాయికి అప్పుడు కూడా దిగజారాయి.

నమ్మశక్యం కావటం లేదా? సరిగ్గా వందేళ్లు వెనక్కివెళ్లి సూరత్‌లో భారత జాతీయ కాంగ్రెసు మహాసభ 'సూరత్'ను ఒకపరి పరికించండి. ఈ కాలంలో మనం అసహ్యించుకునే చెత్త రాజకీయాలకు అచ్చమైన మూస ముక్కుపుటాలను బద్దలు చేసేంత 'సుగంధాన్ని' వెదజల్లుతూ కనపడుతుంది.

1905 బెంగాల్ విభజన పెనుకుదుపుతో జాతీయ భావం జాగృతమైంది. దేశభక్తి పురివిప్పింది. 'స్వదేశీ ఉద్యమం' ఊపందుకుని, 'వందేమాతరం' ప్రణవనాదమై, భారత

జాతి వినూత్న స్ఫూర్తితో, కొంగొత్త శక్తితో విలక్షణ పోరాట పటిమను సంతరించుకుంది. దాని ప్రభావం జాతీయ రాజకీయ రంగం మీద, ఆ రంగంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న భారత జాతీయ కాంగ్రెసు మీద సహజంగానే పడింది. అప్పటిదాకా తెల్లదొరతనానికి అతి విధేయంగా అణగిమణగి ఉండి, వారి దయాధర్మానికై మిక్కిలి ప్రార్థించి, పిటిషన్లతో దేబిరించి బ్రిటిషు సామ్రాజ్య వాదానికి కొమ్ముగాస్తూ వచ్చిన కాంగ్రెసు నాయకశ్రేణి ప్రజాభిప్రాయ తీవ్రతకు తల వంచి, 1906 సంవత్సరాంతాన జరిగిన కలకత్తా మహాసభలో స్వదేశీ ఉద్యమాన్ని, బహిష్కరణ ఆందోళనను, జాతీయ విద్య అవసరాన్ని సమర్థిస్తూ తీర్మానాలు చేసింది. రెండు దశాబ్దాలుగా కాంగ్రెసుపై ఆధిపత్యం చలాయిస్తున్న మితవాదులు శాయశక్తులా ప్రతిఘటించి, ఎన్నివిధాల మోకాలు ఒడ్డినా జాతీయవాద ప్రభంజనాన్ని నిలవరించలేకపోయారు. దాదాభాయ్ నౌరోజీ అంతటి కరడుగట్టిన మితవాదే అధ్యక్ష ప్రసంగంలో స్వరాజ్యం కాంగ్రెసు ధ్యేయమని ప్రకటించాడు.

ఇదంతా మితవాద వర్గానికి కంటగింపు అయింది. కాంగ్రెసులో కొత్తగా పుట్టిన తీవ్రవాద పక్షం ధాటికి, దానికి నాయకులైన తిలక్, అరవింద ఘోష్ వంటి మహామహుల ప్రభావానికి తాళలేక రాజీపడి పై తీర్మానాలకు తల ఒగ్గినా ప్రజాభిమతాన్ని మన్నించి వాటికి కట్టుబడటం మితవాదులకు ఇష్టంలేకపోయింది. "స్వాతంత్ర్యం గురించి మాట్లాడటం, ఆలోచించటం పిచ్చాసుపత్రుల్లోని వెర్రివాళ్లు మాత్రమే చేస్తారని, బ్రిటిషు పరిపాలనకు ప్రత్యామ్నాయం లేదని, దాని చల్లని నీడలో బతకడమే దేశానికి క్షేమ"మని నొక్కి చెబుతూ వచ్చిన గోపాలకృష్ణ గోఖలే వంటివారికి తమ ఒద్దికలోని కాంగ్రెసే స్వరాజ్యం గురించి ఊసులాడటం, బ్రిటిషువారితో సంపర్కాన్ని బహిష్కరించాలంటూ 'స్వదేశీ' అనుకూల తీర్మానాలు చేయటం దుస్సహమైంది. బానిస మనస్తత్వం నుంచి బయటపడి కాంగ్రెసు సంస్థ చరిత్రాత్మక తీర్మానాలను చేసిన వెనువెంటనే వాటిని వమ్ముచేసి, తుంగలో తొక్కే కార్యకలాపాలూ మొదలయ్యాయి. 1907 సంవత్సరం పొడవునా దేశంలో పత్రికలలోనూ, రాజకీయ వేదికల మీదా కలకత్తా తీర్మానాలకు వ్యతిరేకంగా పెద్ద దుమారం లేచింది. దీన్ని పెను వివాదంగా మార్చటానికి సాగుతున్న కుయత్నాలను చూస్తే తదుపరి కాంగ్రెసు మహాసభలో ఆ తీర్మానాలను వీలైతే తొలగించాలని, కనీసం నీరుగార్చాలని మితవాద వర్గం కంకణం కట్టుకుందని జాతీయ వాదులకు తేటతెల్లమైంది.

ఇది వట్టి అనుమానం కాదనడానికి గట్టి దాఖలాలు కనిపించాయి. తదుపరి మహాసభ నాగపూర్‌లో జరపాలని కలకత్తా కాంగ్రెసు నిర్ణయించగా, సన్నాహ కార్యక్రమాలు సాగుతూండగా సభాస్థలం ఆకస్మికంగా సూరత్‌కి మారింది. నాగపూర్‌లో తిలక్ ప్రాబల్యానికి తిరుగులేదు కనక స్వాగతసంఘంలో ఆయన మాటే చెల్లుబాటు అవుతుందని మితవాదుల భయం. అదే సూరత్ అయితే మితవాద నేత ఫిరోజ్‌షా మోహతా 'అడ్డా'. రిసెప్షను కమిటీలో, అధ్యక్షుడి ఎన్నికల్లో అక్కడైతే మితవాదులకు అనుకూలంగా ఉంటుంది.

కాంగ్రెసుకు కొత్త అధ్యక్షుడి ఎన్నిక ఇంకో పేచీ. చిరకాల కారాగారవాసం తరవాత అప్పుడే జైలు నుంచి విడుదలయిన పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్‌ని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దుర్మార్గంగా ఆయన వెంటపడి వేధించిన బ్రిటిషు సర్కారుకు చెంప పెట్టు అవుతుందని, జాతీయ యోధుడికి సముచిత గౌరవం ఇచ్చినట్టూ కాగలదని జాతీయవాదులు పట్టుబట్టారు. మితవాదులు దానికి ససేమిరా అన్నారు. తమకు ఇష్టుడైన రాస్‌బిహారీ ఘోష్ పేరు అధ్యక్ష పదవికి ప్రతిపాదించారు. రొచ్చు రాజకీయాల్లోకి దిగబడటం ఇష్టంలేక లజపతిరాయ్ తాను పోటీపడనని చెప్పి హుందాగా తప్పుకున్నారు. జాతీయవాదులూ ఎన్నిక విషయంలో పంతానికి పోలేదు. వారి నాయకుడైన లోకమాన్య బాలగంగాధర తిలక్ కోరిందల్లా ఒక్కటే. నిరుటి కలకత్తా మహాసభలో స్వపరిపాలన, బహిష్కరణ, విద్యా విధానాలపై చేసిన తీర్మానాలను తిరగదోడకండి; వాటి జోలికి పోమని హామీ ఇస్తే ఎన్నిక విషయంలో మేము అడ్డురాము; మీ ఇష్టం వచ్చినవారిని అధ్యక్షుడిగా పెట్టుకోండి- అని!

ఇందులో తప్పేముంది? ప్రకటిత విధానాలకు కట్టుబడతామని స్పష్టీకరించడానికి ఎవరికైనా అభ్యంతరం ఎందుకుండాలి? కాని- చిత్రం! మితవాదుల నుంచి ఉలుకు, పలుకు లేదు. పైగా సూరత్ మహాసభకు పది రోజుల ముందు అధికారికంగా ప్రకటించిన చర్చనీయాంశాల జాబితాలో స్వపరిపాలన, బహిష్కరణ ఉద్యమం, జాతీయ విద్యల ప్రస్తావనే లేదు. కలకత్తాలో పడిన ముందడుగుకు అడ్డంకొట్టి, జాతీయోద్యమాన్ని తిరుగుముఖం పట్టించటానికి మితవాదులు కంకణం కట్టుకున్నారని తేలిపోయింది. దీన్ని సహించేది లేదు; అమీతుమీ తేల్చుకోవలసిందేనని జాతీయవాదులు నిశ్చయించారు.

ఇరువైపులా రోషాలు, ఆవేశాలు పెచ్చుమీరిన ఉద్రిక్త స్థితిలో 1907 డిసెంబరు 26న సూరత్ కాంగ్రెసు మహాసభకు తెర లేచింది. ఆరోజు మధ్యాహ్నం దాకా ముసాయిదా తీర్మానాలను బయటపెట్టలేదు. అదేమంటే ముద్రణ ఆలస్యమైందని గోఖలేగారు సెలవిచ్చారు. అసలు కారణం అది కాదని, కావాలనే జాప్యం చేశారని, ఎట్టకేలకు ముసాయిదాలు బట్టబయలు కాగానే అందరికీ అర్థమైంది. జాతీయవాదులు భయపడినంతా జరిగింది. విదేశీ వస్తువులను బహిష్కరించి, దేశవాళీ ఉత్పత్తులనే ఎంచుకుని, స్వదేశీ ఉద్యమాన్ని బలపరచాలన్న కలకత్తా తీర్మానం కొత్త ముసాయిదాలో ఎగిరిపోయింది. బ్రిటిషు పాలనా యంత్రాంగాన్ని శాసన నిర్మాణ సభలను, బ్రిటిషు విద్యాసంస్థలను సైతం బహిష్కరించాలన్న పూర్వ విధానం నీరుగారి 'బహిష్కరణ' పరిధి కుంచించుకుపోయింది. జాతీయ తరహాలో జాతీయ నియంత్రణ కింది విద్యా విధానాన్ని రూపొందించాలన్న కలకత్తా పలుకు సూరత్ ముసాయిదాలో జాడలేదు.

ఇక సంఘర్షణ తప్పదని జాతీయవాదులు నిశ్చయించుకున్నారు. కిక్కిరిసిన సభలో మితవాదులతో పోల్చితే వారి సంఖ్య తక్కువే. ఒక చరిత్రకారుడి అంచనా ప్రకారం మొత్తం ప్రతినిధులు 1200; అందులో తీవ్రవాదులనబడే జాతీయవాదులు 500 మంది. అరవిందుడు చెప్పిన దానిబట్టి మితవాదులు 1300 మంది కాగా జాతీయవాదులు 1100 మంది. ఇందులో ఏది కరక్టు అయినా మితవాదులదే పైచేయి అన్నది నిర్వివాదం. గెలిచే ఆశలేకున్నా ప్రతిఘటించవలసిందేనని జాతీయవాదులు కృతనిశ్చయులయ్యారు. డాక్టర్ రాస్‌బిహారీ ఘోష్ పేరును అధ్యక్ష పదవికి ప్రతిపాదించగానే 'నో', 'నో' అని సభలో కేకలు లేచాయి. సురేంద్రనాథ్ బెనర్జీ లేచి ఆ పేరును బలపరుస్తూ ప్రసంగిస్తూండగా గలభా తీవ్రమైంది. రణగొణ ధ్వనిలో ఎవరేమంటున్నదీ వినరాలేదు. పరిస్థితి ఎంతకూ అదుపులోకి రాకపోవటంతో సభా కార్యక్రమం మరుసటిరోజుకు వాయిదా పడింది.

ఆ రాత్రి స్వాగత సంఘం ఉపాధ్యక్షుడు లోకమాన్య తిలక్‌ని కలిసి- గోఖలేగారితో మాట్లాడుకుని సమస్య సర్దుబాటు చేసుకోరాదా అని సూచించాడు. అందుకు తనకు అభ్యంతరం లేదని తిలక్ అన్నాడు. సరే, గోఖలేగారిని అడిగి వస్తానని వెళ్లిన మనిషి మళ్లీ పత్తాలేడు. మర్నాడు ఉదయం మళ్లీ తిలకే చొరవ తీసుకుని గోఖలేకి ఒక ప్రతిపాదన పంపాడు. ఒక్కో రాష్ట్రం నుంచి ఒక మితవాది, ఒక అతివాది చొప్పున ఎంపిక చేసి ఒక కమిటీ వేద్దాం. ప్రతిష్టంభన పరిష్కారానికి ఆ కమిటీ ఎలా చెబితే అలా నడుచుకుందాం- అని దాని సారాంశం. దానికీ అటునుంచి జవాబులేదు.

"Sir, I wish to address the delegates on the proposal of the election of the President after it is seconded. I wish to move an adjournment with a constructive proposal. Please announce me" (అయ్యా. అధ్యక్షుడి పేరు ప్రతిపాదించి, దాన్ని బలపరచడం అయ్యాక నేను ప్రతినిధులనుద్దేశించి మాట్లాడదలిచాను. ఒక నిర్మాణాత్మక ప్రతిపాదనతో వాయిదా తీర్మానాన్ని నేను ప్రవేశపెడతాను. దయచేసి నన్ను పిలవండి) అని సభాధ్యక్షుడు మాల్వీకి మధ్యాహ్నం 12.30కి పెన్సిలుతో చీటీ రాసి తిలక్ పంపాడు. ఎన్.సి.కేల్కర్ చేతా కబురు చేశాడు. దానికీ స్పందన లేదు.

డిసెంబర్ 27 మధ్యాహ్నం ఒంటి గంటకి సభ మొదలైంది. కిందటిరోజు ఎక్కడ ఆగిందో అక్కడి నుంచి కార్యక్రమం కొనసాగింది. రాసబిహారీ ఘోష్ అభ్యర్థిత్వాన్ని సురేంద్రనాథ్ బెనర్జీ బలపరిచారు. మోతీలాల్ నెహ్రూ దాన్ని సమర్థించారు. 'ఔను'లే ఎక్కువ అని తేల్చి, ఘోష్ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైనట్టు అగ్రాసనాధిపతి ప్రకటించారు. వెంటనే ఘోష్‌గారు లేచి అధ్యక్షోపన్యాసం లంకించుకున్నారు.

ఆ దశలో తిలక్ వేదిక మీదికి వెళ్లారు. 'నేను ఇంతకుముందే నోటీసు ఇచ్చాను

కదా? వాయిదా తీర్మానం ప్రవేశపెట్టనివ్వండి' అని గట్టిగా అడిగారు. మీ తీర్మానం చెల్లదు. కుదరదు- అని సభాధ్యక్షుడు తెగేసి చెప్పాడు. ఎందుకు కుదరదో డెలిగేట్లనే అడుగుతానని తిలక్ ప్రసంగించసాగాడు. దాంతో పెద్ద కలకలం లేచింది. ఒక చెంప అధ్యక్షులవారు ఉపన్యాస పాఠాన్ని చదువుకుంటూ పోతుండగా, ఇంకోవంక లోకమాన్యుడు తనకు అవకాశం ఇవ్వకపోతే సభను సాగనిచ్చేది లేదని పొలికేకలు పెట్టాడు. సభలోని మితవాదులూ, అతివాదులూ లేచి తిట్లకూ, కొట్లాటకూ దిగారు. చేతులు కలిశాయి. కుర్చీలు లేచాయి. వేదిక మీది నుంచి తిలక్‌కు లాగి అవతల పడెయ్యటానికి కొంతమంది మితవాదులు ఉత్సాహంగా దూసుకుపోయారు. తమ నాయకుడికి అండగా కొందరు అతివాదులు కట్టెలు తీసుకుని వేదిక ఎక్కారు.

అంతలో సభలోని ఒక ఉత్సాహవంతుడు కాలి చెప్పు తీసి తిలక్ మీదికి విసిరాడు. అది గురి తప్పి పక్కనున్న సురేంద్రనాథ్ బెనర్జీకి తగిలింది. ఇంకో చెప్పు ఫిరోజ్‌షా మీదపడింది. అది చూసి సభికులు రెచ్చిపోయారు. కొంతమంది తిలక్ మీదికి చెప్పులు, కర్రలు విసిరారు. బండ బూతులతో సభా స్థలం మారుమోగింది. ఎవరు ఎవరిని కొడుతున్నారో, ఏమని తిడుతున్నారో, ఎటునుంచి ఎవరు దాడి చేస్తున్నారో అర్థం కాకుండాపోయింది. గందరగోళం మిన్నుముట్టింది. అడ్డగోలు ఆగాలతో నానా రభస నడుమ సభ నిరవధికంగా వాయిదా పడింది.

నాటి భారతదేశంలో పేరెన్నికగన్న రాజకీయ హేమాహేమీలు, మహామేధావులు, మహాదేశభక్తులు ఎందరెందరో సూరత్ సభలో ఉన్నారు. యుక్తాయుక్త విచక్షణ లేకుండా కుర్చీలు విసురుకుంటూ, చెప్పులతో, కర్రలతో కొట్టుకుంటూ, సిగ్గుచేటు రౌడీయిజంతో సభా ప్రాంగణం దద్దరిల్లుతూంటే ఒక్కరు కూడా అడ్డుకోలేకపోయారు. అనంతర కాలంలో కాంగ్రెసు సంస్థలో వికటించిన ముఠా గొడవలకూ, అరాచకపు ఆగడాలకూ... భారత రాజకీయాల్లో చెప్పుల సంస్కృతికీ సూరత్ సభ నాంది.

సభా బీభత్స పతాక సన్నివేశంలో మితవాదులూ, అతివాదులన్న తేడా లేకుండా ఇరు వర్గాల పెద్దలూ స్థాయిని మరచి అల్లరిచిల్లరి చేష్టలకు పాల్పడిన మాట నిజం. కాని ఘటనాక్రమాన్ని మొత్తంగా చూస్తే ప్రజాభీష్టాన్ని, ప్రకటిత విధానాన్ని వమ్ముచేసి కాంగ్రెసును తిరోగమనం పట్టించేందుకు ఇసుమంతైనా బెసగకుండా మితవాదులు చూపిన మొండితనమే సంఘర్షణకు హేతువు. తాము కోరేదే దేశానికి క్షేమమన్న ప్రగాఢ విశ్వాసంతోటే, జాతి హితాన్ని కాపాడాలన్న ఏకైక లక్ష్యంతోటే ఇతరేతర ప్రోద్బలాలేవీ లేకుండా మితవాదులు అలా వ్యవహరించి ఉంటే పొరపాటు పడ్డారు; పోనీ లెమ్మని సరిపెట్టుకోవచ్చు. కాని అది మితవాదుల పుర్రెకు పుట్టిన బుద్ధికాదు. తోలుబొమ్మలవలె వారినలా తెర వెనుకనుంచి ఆడించినవారు వేరే ఉన్నారు.

ఇంకెవరు? కుటిల తంత్రాల్లో కౌటిల్యుడికి చదువు చెప్పగల ఆంగ్ల సామ్రాజ్య ప్రభువులే! ఇది నిజమేనా, గోపాలకృష్ణ గోఖలే వంటి జాతీయ మహానాయకులు తెల్లవారి బుట్టలో పడి బ్రిటిషు ఏజంట్ల స్థాయికి దిగజారుతారా అని మీ సంశయమా? ఆనాటి బ్రిటిషు విదేశాంగ మంత్రి జాన్ మోర్లే 1906 ఆగస్టు 2న వైస్రాయి లార్డ్ మింటోకు రాసిన ఈ లేఖను చిత్తగించండి:

Yesterday I had my fifth and final talk with Gokhale... "For reasonable reforms', I said to him, there is now an unexampled chance... Only one thing can spoil it: perversity and unreason in your friends. If they keep up the fuss in Eastern Bengal they will only make it hard, or even impossible, for Government to move a step... He professed to acqcuiesce very cordially in all this and assured me that immediately after my Budget Speech he had written off to his friends in India and pitched a most friendly and hopeful note.

[*History of Freedom Movement*, R.C.Majundar, Vol.II P.204]

(నిన్న నేను చివరగా ఐదోసారి గోఖలేతో మాట్లాడాను... సహేతుకమైన సంస్కరణలకు ఇప్పుడు అపూర్వావకాశం వచ్చిందనీ, అది చెడిపోవటమంటూ జరిగితే మీ మిత్రుల మొండితనం, కుటిలత్వాలవల్లేననీ నేను చెప్పాను. తూర్పు బెంగాల్‌లో రచ్చను వారు అలాగే కొనసాగిస్తే ప్రభుత్వానికి అడుగువేయటం అసాధ్యమవుతుందన్నారు... నేను చెప్పినదంతా హృదయ పూర్వకంగా అంగీకరిస్తున్నానని ఆయన చెప్పాడు. నా బడ్జెటు ప్రసంగం వెనువెంటనే ఇండియాలోని తన మిత్రులకు జాబు రాశానని హామీ ఆయన ఇచ్చాడు. చాలా స్నేహ పూర్వకంగా, ఆశావహంగా ఆయన మాట్లాడాడు.)

మంత్రిగారి మాట కాదనలేక మొగమాటానికి అలా అనడమే కాదు. లండన్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చాక కూడా మోర్లేతో ఒడంబడిన దానికి గోఖలేగారు కట్టుబడే ఉన్నారు. ఆ సంగతి రెండోసారి ఆయనను కలిశాక వైస్రాయి మింటో విదేశాంగ మంత్రి మోర్లేకి రాసిన ఈ జాబును బట్టి తెలుస్తుంది.

"Gokhale was very reasonable... He says that the whole younger generation of India is going over to the extremists' side; that they are quite unreasonable, and attracted by the idea of getting rid of British rule... and that the only way to recover our moral control is to do something that will appeal to the Native imagination." (Ibid P.205)

(గోఖలే చాలా సమంజసంగా మాట్లాడాడు... ఇండియాలోని మొత్తం యువతరం తీవ్రవాదులవైపు వెళుతున్నదనీ, బ్రిటిష్ పాలనను అంతమొందించటానికి ఆకర్షిత మవుతుందనీ ఆయన చెప్పాడు. మన నైతిక కంట్రోలును తిరిగి పొందాలంటే దేశీయులను ఆకట్టుకునే విధంగా ఏదో ఒకటి చేయటమే మార్గమని ఆయన అన్నాడు.)

దేశంలోని మొత్తం యువత విదేశీ పీడన పరిమార్చేందుకు ఉవ్విళ్లూరుతున్నదని తనకు తెలిసినా, స్వపరిపాలనకు ఇంకా చాలా చాలా కాలంవరకూ అంగీకరించేది లేదని మోర్లే తనకు స్వయంగా చెప్పినా, తెల్లదొరల పెత్తనాన్ని ఎలా పునరుద్ధరించాలా అని మహానాయకుడు తహతహలాడటం గమనార్హం. 1907 సంవత్సరం పొడవునా జాతీయవాదులపై మితవాదులు సాగించిన ప్రచార దుమారానికి, కలకత్తా కాంగ్రెసు స్వదేశీ తీర్మానాలను తిరగదోడేందుకు సాగిన కుయత్నాలకు గోఖలేకు మోర్లే ప్రేరేపణే హేతువని అనుకుంటే తప్పులేదు.

ఇంతకీ కాంగ్రెసుకు అగ్ర నాయకుడిగా ఉండీ కాంగ్రెసు విధానాలను కుళ్లబొడిచిన గోఖలేగారు ఎవరో కాదు. కాబోయే మహాత్ముడు ఎం.కె.గాంధీగారికి రాజకీయ గురువు!

పారని పాచిక

డామిట్, కథ అడ్డం తిరిగిందేమిటని తెల్లబోయారు తెల్లదొరలు. తమ ఏలుబడిలోని ఇండియాలో జాతీయవాద భూతాన్ని సీసాలో బంధించి గుప్పిట్లో పెట్టుకోవడానికి వాళ్లు పాపం - మాస్టరు ప్లాను బాగానే వేశారు.

ఎ.ఓ.హ్యూమ్ అనే నౌకరును పురమాయించి, భారత జాతీయ కాంగ్రెసు అనే సీసాను తయారుచేయించి, దాని బిరడా వేడినీ, వత్తిడినీ తట్టుకునేలా కావల్సిన బిగింపులన్నీ చేయించారు. ఇరవయ్యేళ్లు వారి ఒద్దికలో అణగిమణగి ఉన్న తరువాత 1905లో కాంగ్రెసును స్వదేశీ ఉద్యమం పురుగు కుట్టినా చేతనైన మంత్రాలూ, మాకులూ వేసి, గోఖలే లాంటి విశ్వాసపాత్రులను ఒడుపుగా వాడుకుని, దాదాపుగా చెయిదాటిన పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు.

1907 డిసెంబర్ 27న సూరత్ కాంగ్రెస్ మహాసభలో చెప్పులు, కుర్చీలు లేచి, సభా ప్రాంగణం రణరంగమై, సభ అర్ధాంతరంగా వాయిదా పడ్డ తరవాత కూడా జాతీయవాదుల నాయకుడు లోకమాన్య తిలక్ సంధి యత్నాలను కొనసాగించాడు. 'మీ ఇష్టం వచ్చిన వారిని అధ్యక్షుడిగా పెట్టకోండి. మేము అడ్డురాము. జరిగిందంతా మరిచిపోదాం. స్వపరిపాలన, బహిష్కరణ, స్వదేశీ ఉద్యమాలపై నిరుటి కాంగ్రెస్ తీర్మానాలకు కట్టుబడి ఉంటామని మీరు స్పష్టంచేస్తే చాలు మీకు మేము పూర్తిగా సహకరిస్తాం' అని డిసెంబర్ 28న ఆయన మిగతా నాయకులకు రాతపూర్వకంగా సంధి ప్రతిపాదన పంపాడు. జాతీయవాదులతో కలిసి దేశ ప్రయోజనాలకోసం పనిచేయటం కంటే మింటో, మోర్లేల ఉపదేశం ప్రకారం దొరలకు విధేయంగా మెలగటమే ముఖ్యమనుకున్న మితవాదులు ఆ ప్రతిపాదనను తోసిపుచ్చారు. తిలక్ జాబుకు కనీసం జవాబయినా ఇవ్వలేదు సరికదా మర్నాడు సభా ప్రాంగణంలో తమ వరకూ ప్రత్యేకంగా ఒక సదస్సు జరిపారు. జాతీయవాదులెవరినీ ఆ ఛాయలకు రానివ్వలేదు. ఇకపై తీవ్రవాదులతో ఎటువంటి సంబంధమూ పెట్టుకొనరాదని ఆ సదస్సులో తెగతెంపుల తీర్మానం చేశారు.

జాతీయవాదులకు కాంగ్రెసు తలుపులను శాశ్వతంగా మూసివేశామని సామ్రాజ్యవాదులు, వారి తైనాతీలు సంబరపడ్డారు. జాతీయ వేదికగా ఉద్దేశించిన కాంగ్రెసును కేవలం ఒక పార్టీ సంస్థగా దిగజార్చారు. 1906 కలకత్తా కాంగ్రెసులో స్వదేశీ ఉద్యమం, బహిష్కరణ ఆందోళన, స్వపరిపాలనలను సమర్థిస్తూ చేసిన తీర్మానాలను చెత్తబుట్టలో పడవేసి, దరిమిలా ఏ కాంగ్రెసులోనూ వాటి ఊసు ఎత్తకుండా జాగ్రత్త పడ్డారు.

జాతీయ వాదులను స్వేచ్ఛగా వదిలేస్తే కాంగ్రెస్ కాకుంటే మరో కుంపటి పెట్టి బ్రిటిషు సామ్రాజ్యానికి కొంప ముంచగలరని ఏలిన వారికి తెలుసు. ఆ ప్రమాదాన్ని నివారించటానికి దారుణమైన దమననీతికి పాల్పడ్డారు. పత్రికల మీద కర్కశమైన ఆంక్షలు పెట్టారు. జాతీయ వాదానికి అనుకూలమైన రాతలను ఎంతమాత్రం సహించేది లేదన్నారు. ధిక్కరించిన పత్రికలను మూయించారు. సంపాదకులను, యజమానులను ఖైదు చేశారు. మోయలేని పెనాల్టీలను మోపారు. బహిరంగ సభల్లో స్వేచ్ఛగా గళమెత్తటానికీ వీల్లేకుండా అడ్డమైన ఆంక్షలు విధించారు. జాతీయ నాయకులను స్వేచ్ఛగా మసలనిస్తే ఇంతటి అణచివేతనూ ధైర్యంగా ఎదిరించి, ప్రజలను పోరాటానికి సమీకరించగలరు కనక వారిమీదా దుర్మార్గంగా విరుచుకుపడ్డారు. 1907లో లాలా లజపతిరాయ్‌ని, 1908లో అరవింద ఘోష్‌ను నిర్బంధించారు. 1908లోనే బాల గంగాధర్ తిలక్‌కి ఏకంగా ఆరేళ్లు ద్వీపాంతర కారాగార శిక్ష విధించారు.

ఇలా దారుణ దమననీతితో ప్రజలను హడలగొట్టి, పత్రికల నోళ్లు నొక్కి, నాయకులను రంగం నుంచి తొలగించి జాతీయవాదపు సవాలును తెలివిగా, కడుసమర్థంగా తిప్పి కొట్టామనే బ్రిటిషు పాలకులు అనుకున్నారు. తిరుగుబాటుదారుల తోకలు కత్తిరించి, వారిని కాంగ్రెసు లోపల అడుగుపెట్ట లేకుండా చేయగలిగాము కనుక కాంగ్రెసు సంస్థ ఇకపై తమ ఇంగితమెరిగి మెలిగే మితవాదుల విధేయతా పూర్వక నిర్వాహకంలో బుద్ధిగా సాగి, తొట్టతొలి ప్రణాళికకు అనుగుణంగా భారతీయులనే గొర్రెలను సరైన దారిలోకి మలపగలదని గంపెడాశ పెట్టుకున్నారు.

అక్కడే వారి అంచనాలు తలకిందులయ్యాయి. కాంగ్రెసు పెత్తందారులు జాతీయవాదులను ఖర్చురాస్తే జాతీయోద్యమం కాంగ్రెసునే ఖర్చు రాసింది. అ మాటకొస్తే దొరలు పెట్టించిన కాంగ్రెసు దుకాణమంటే సిసలైన దేశభక్తులకు ఆదినుంచీ చిన్న చూపే. దేశాన్ని దురాక్రమణ చేసి దారుణంగా దోచుకుంటున్న తెల్లవాళ్ల పీచమణచి భారత మాతకు బానిసత్వ విముక్తి సాధించాలని తహతహలాడే ఉడుకు నెత్తురు వారికి – పిటిషన్లు పెట్టుకుని దొరల దయను గూర్చి మిక్కిలి ప్రార్థించి, వారు అనుగ్రహించిన మేరకు లబ్ధిపొందుదామనే కాంగ్రెసు దేబిరింపు రాజకీయమంటే సహజంగానే ఏవగింపు.

అయితే తిలక్, అరవిందఘోష్ వంటి జాతీయ నేతలు కాంగ్రెసులో ప్రముఖ భూమిక వహించసాగాక ఈ చులకన భావం కాస్త తగ్గింది. స్వదేశీ ఉద్యమం పుణ్యమా అని కాంగ్రెసుకూ ప్రజాదరణ పెరిగింది. జాతీయోద్యమానికి చోదక శక్తిగా ఎదుగుతున్న ఆరంభదశలోనే జాతీయవాదులకు తీవ్రవాదులన్న ముద్రవేసి, అరాచక శక్తులుగా చిత్రించి, కాంగ్రెసు నుంచి గెంటివేయటంతో ప్రజల దృష్టిలో కాంగ్రెసు సంస్థ పలుచన అయింది. కాంగ్రెసు మహాసభల్లో డెలిగేట్లుగా పాల్గొనేందుకు ఉత్సుకత చూపేవారి సంఖ్య అంతకంతకూ తగ్గసాగింది. సూరత్‌లో, అంతకు ముందు కలకత్తా కాంగ్రెసులో డెలిగేట్ల సంఖ్య రమారమి 1600గా ఉన్నది కాస్తా సూరత్ అనంతరం ఐదేళ్లలో సగటున 400 అంటే నాలుగో వంతుకు పడిపోయింది. ఒక సంవత్సరమైతే భారత జాతీయ కాంగ్రెసు మహాసభకు అఖిలభారతం నుంచీ పాల్గొన్న డెలిగేట్లు కేవలం 207. జాతీయ వాదుల అగ్రనాయకుల్ని ఖైదు చేశాక, కర్కశమైన అణచివేత చర్యల దరిమిలా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం సాగించేందుకు దారులు మూసుకుపోయాక, జాతీయోద్యమం అండర్‌గ్రౌండ్‌కు వెళ్లింది. టెర్రరిస్టు సాహసాలు విజృంభించి తెల్ల దొరతనానికి కంటికి కునుకు లేకుండా చేశాయి.

అప్పటికే శ్యామ్‌జీ కృష్ణవర్మ లండన్‌లో ఇండియన్ హోం రూల్ సొసైటీని స్థాపించి, 'ఇండియన్ సోషియాలజిస్ట్' పత్రిక పెట్టి భారత వాణిని ఖండాంతరాల్లో వినిపిస్తూ విప్లవ కార్యక్రమాలను గుంభనంగా సాగిస్తూ, విప్లవకారులకు పెద్ద అండగా ఉన్నాడు. కృష్ణవర్మకు సన్నిహిత సహచరులైన మేడం భికాజీ రుస్తుంకామా, సర్దార్‌సింగ్ రాణాలు పారిస్‌ను కేంద్ర స్థానం చేసుకుని భారత స్వరాజ్యానికి మద్దతుగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని సమీకరించడానికి ప్రచార సమరం ముమ్మరంగా సాగిస్తున్నారు. 1907 ఆగస్టులో Stuttagart లో జరిగిన ఇంటర్నేషనల్ సోషలిస్టు కాంగ్రెసుకు భారత ప్రతినిధులుగా ఎన్నిక కావటమే కాక ఆ అంతర్జాతీయ మహాసభచేత-

The continuance of British rule in India is positively disastrous and extremely injurious to the best interests of India and lovers of freedom all over the world ought to cooperate in freeing from slavery the fifth of the human race inhabiting that oppressed country...

(ఇండియాలో బ్రిటిష్ పాలన కొనసాగడం భారతదేశ ప్రయోజనాలకు తీవ్ర విఘాతకరం, ప్రపంచంలోని స్వేచ్ఛా ప్రియులందరూ ప్రపంచ మానవ జాతిలో ఐదో వంతు నివసిస్తున్న ఆ పీడిత దేశాన్ని బానిసత్వం నుంచి బయట వేసేందుకు సహకరించాలి) అని చరిత్రాత్మక తీర్మానం కూడా చేయించారు. ఇండియాకు బ్రిటిష్ వారు చేస్తున్న దారుణమైన అన్యాయాలపై నిప్పులు చెరుగుతూ ప్రసంగించి, దానికి

ముక్తాయింపుగా చరిత్రలో ప్రప్రథమంగా మువ్వన్నెల భారత జాతీయ పతాకాన్ని మేడమ్ కామా ఎగురవేసిందీ ఈ సభలోనే.

బ్రిటిషు ప్రభుత్వం తన కార్యకలాపాలను వాసన పట్టిందని గ్రహించి శ్యామ్‌జీ కృష్ణవర్మ తన మకాంను పారిస్‌కు (దరిమిలా జెనీవాకు) మార్చాక లండన్‌లో'ఇండియా హౌస్' నిర్వహణ భారం వీర సావర్కర్ భుజస్కంధాల మీద పడింది. పట్టుమని పాతికేళ్లు నిండని వయసులోనే బ్రిటిష్ మ్యూజియం పత్రాల్లో అందుబాటులోని పరిమిత సమాచారం ఆధారంగా- 1857లో జరిగింది ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామమని నిర్ధారిస్తూ ఆయన వెలువరించిన అపురూప గ్రంథం ఆ తరం దేశభక్తులకు ఎనలేని స్ఫూర్తినిచ్చింది. వాసనపట్టి వెంటపడ్డ స్కాట్లండ్ యార్డ్ ఏజంట్ల కళ్లుకప్పి, మరాఠీ రాతప్రతిని మహారాష్ట్ర చేర్చి, అక్కడ ఏ ప్రెస్సూ దాన్ని ముద్రించడానికి సాహసించలేకపోవడంతో మళ్లీ లండన్ తెప్పించి, ఇంగ్లీషులోకి తర్జుమా చేయించి... ఫ్రాన్సులో ముద్రిస్తున్నట్టు భ్రమగొలిపి, హాలండులో దాన్ని రహస్యంగా అచ్చువేయించి... అక్కడినుంచి 'పిక్‌విక్ పేపర్ల' వంటి గ్రంథాల అట్టలతో చాటుమాటున కొద్ది కాపీలను ఇండియాకు చేరవేస్తే దేశ భక్తులు వాటిని 200-300 రూపాయల రేటుకు కొనుక్కుని పారాయణ చేసి నిషిద్ధ గ్రంథాన్ని పదుగురికీ పంచిన వైనాలను అప్పట్లో దేశమంతా అబ్బురంగా చెప్పుకునేవారు.

సావర్కర్ రగిలించిన విప్లవస్ఫూర్తితోనే లండన్‌లో మదన్‌లాల్ ధింగ్రా అనే పంజాబీ యువకుడు అక్కడి భారతీయ విద్యార్థులపై నిఘా పెట్టిన సర్ కర్జన్ వైలీ అనే ఉన్నతాధికారిని 1909 జులై 1న ఒక బహిరంగసభలో కాల్చిచంపాడు. భారతీయ విప్లవకారుల ఉరితీతలకు, కారాగార శిక్షలకు ప్రతీకారంగా తెల్లవాడి రక్తం చిందించటానికే తానాపని చేశానని నిర్భయంగా ప్రకటించి, చిరునవ్వు నవ్వుతూ ధీరోదాత్తంగా ఉరికంబమెక్కాడు. "*I believe that a nation held in bondage with the help of bayonets is in a state of perpetual war... Being a Hindu I believe that an insult to my country is an insult to God. My only prayer is that I may again return to the same Mother and die in the same cause till the Mother is freed. Vande Mataram*" (బాయినెట్ల సాయంతో బానిసత్వం రుద్దబడిన దేశం నిరంతరం యుద్ధం చేయక తప్పదు. నా దేశాన్ని అవమానించటమంటే దైవాన్ని అవమానించటమేనని హిందువుగా నా విశ్వాసం. మళ్లీ నా మాతృభూమికి తిరిగొచ్చి ఆ తల్లి విముక్తమయ్యే దాకా ఆమె సేవలో మళ్లీ మళ్లీ మరణిస్తుండాలనే నేను ప్రార్థించేది. వందేమాతరం) అన్న ధింగ్రా వాఙ్మూలాన్ని వినిపించేందుకు దొరల న్యాయస్థానం అనుమతి నిరాకరించినా, భారతదేశం దశదిశలా, దేశభక్తుల ఎదఎదనా అది చాలాకాలం మారుమోగుతూనే ఉంది.

ఖండాంతరంలోని లండన్‌లోనే భారతీయ యోధుల గుండె మంట అంత తీవ్రంగా ఉంటే- భారతదేశంలో పరిస్థితి చెప్పనే అక్కర్లేదు. అరవింద్ ఘోష్ తమ్ముడు బరీంద్రనాథ్ లాంటివారు 'యుగంతర్' వంటి విప్లవ పత్రికలను, రహస్య విప్లవ సంఘాలను స్థాపించి, ప్రజాకంటకులైన బ్రిటిషు అధికారులకు సింహ స్వప్నమయ్యారు. 1908 డిసెంబరు 6న బెంగాల్ గవర్నరు ప్రయాణిస్తున్న రైలుబండిని వారు పేల్చేశారు. గవర్నరు వెంట్రుకవాసిలో తప్పించుకున్నాడు. అది జరిగి మూడు వారాలు తిరక్కుండా జిల్లా మేజిస్ట్రేటుపై కాల్పులు జరిపారు. అదే సంవత్సరం ఏప్రిల్ 30న ఖుదీరాం బోస్, ప్రఫుల్లచాకిలనే విప్లవ యువకులు ముజఫర్‌పూర్‌లో కింగ్స్‌ఫోర్డ్ అనే కర్కోటకపు జడ్జి ప్రయాణిస్తున్నాడనుకున్న బగ్గీపై బాంబుదాడి చేశారు. ఆ సమయానికి అతడు బండిలో లేడు. ప్రఫుల్లచాకి ఎదురు కాల్పుల్లో మరణించగా, ఖుదీరాం బోస్ 1908 ఆగస్టు 11న ఉరి తీయబడ్డాడు. ఆ ఇద్దరి ఆత్మార్పణను దేశవాసులు చిరకాలం ఆత్మీయంగా స్మరిస్తూనే ఉన్నారు. (ఈ ఖుదీరాంబోస్ చేతలను 'కేసరి' పత్రికలో సమర్థించాడన్న అభియోగంపైనే లోకమాన్య తిలక్‌ను ఆరేళ్లు చెరసాలలో పెట్టారు). ముజఫర్‌పూర్ బాంబుదాడి జరిగిన రెండురోజులకే మురారిపుకూర్ తోటలో పోలీసులు రహస్య బాంబు ఫ్యాక్టరీని కనుగొని, బాంబులను, డైనమెట్లను, తూటాలను భారీ సంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు. అరవింద ఘోష్ సహా 34మందిపై కుట్ర కేసు పెట్టారు. అలీపూర్ కుట్ర కేసుగా ప్రఖ్యాతి చెందిన ఈ వ్యవహారం దేశంలో పెద్ద సంచలనం రేపింది. బ్రిటిషు ప్రభుత్వాన్ని కూలదోయటానికి ఈ రకంగా సాయుధ పోరాటం కూడా చేయవచ్చునన్న ఆలోచనే నవ యువకులను ఊపేసి, అపూర్వ ఉత్తేజం నింపింది. బ్రిటిష్ అధికారులపై దాడులు, బహిరంగ హత్యలు బెంగాల్, అస్సాం, బీహార్, పంజాబ్, యు.పి., మధ్యభారత్, పూనా తదితర ప్రాంతాల్లో ముమ్మరమై తెల్లదొరతనాన్ని ఎంతగా హడలగొట్టిందీ తరవాత కొన్నేళ్లకు రౌలత్ ఆధ్వర్యాన వెలువడిన Sedition Committee రిపోర్టులో వివరంగా పేర్కొన్నారు. దేశంకోసం ఆత్మార్పణ చేసిన విప్లవ యోధులకు స్థానిక జనం వేల సంఖ్యలో జోహారులర్పించిన తీరూ తెల్లదొరతనంపై అంతకంతకూ ప్రబలుతున్న భారత ప్రజల ధిక్కార వైఖరిని ప్రతిఫలించింది.

ఈ వరస చూసి తెల్ల సర్కారు నిర్ఘాంతపోయింది. అమోఘమైన తెలివితేటలతో కర్తవ్యమేమిటని బాగా ఆలోచించగా వారికేమి స్ఫురించిందంటే- అలజడి అంతటికీ మూలకారణం బెంగాల్ విభజన కదా? దాన్ని రద్దుచేసి పడేస్తే జనంలో అశాంతి దానికదే అణగిపోతుందని! ఆ ప్రకారమే బెంగాలీ మాట్లాడే ప్రాంతాలను తిరిగి ఒకే రాష్ట్రంగా వ్యవస్థీకరిస్తున్నట్టు ఐదో జార్జి మహారాజు, మేరీ రాణి ఇండియా వేంచేసిన సందర్భాన్ని పురస్కరించుకుని అట్టహాసంగా జరిగిన ఢిల్లీ దర్బారులో 1911 డిసెంబరు

12న ప్రకటించారు. (బ్రిటిష్ ఇండియా రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి అదే సందర్భంలో మార్చారు.) ఆరేళ్ల కింద బెంగాల్‌ను నిలువునా చీల్చిన కర్జన్ కుత్సితాన్ని బ్రిటిషు సర్కారుచేత వమ్ముచేయించటం భారత ప్రజాభీష్టానికి, చరితార్థమైన జాతీయ ప్రతిఘటనకు ఘన విజయం. చేసిన తప్పిదాన్ని ఆరేళ్లు ఆలస్యంగానైనా దిద్దుకోవటం మంచిదే. కానీ అదే తమకు మరవలేని మహోపకారమైనట్టుగా భారతీయులు- దొరలు ఆశించిన ప్రకారం మురిసి ముప్పందుమేమీ కాలేదు. బెంగాల్ విభజనతో రగిలిన జాతీయ సంఘర్షణ జ్వాల విభజన రద్దుతో సమసిపోలేదు.

అది సమసి పోయిందనుకోవటం పగటి కలేనన్న చేదు నిజం కొత్త వైస్రాయి హార్డింజ్ ప్రభువుకు సంవత్సరానికల్లా దిమ్మతిరిగేలా అర్థమైంది. 1912 డిసెంబరు 23న కొత్త ఇంపీరియల్ రాజధాని ఢిల్లీలో ఆయన సకల రాజ లాంఛనాలతో వైభవంగా అడుగు పెడుతుండగా దిక్కులదిరేలా భయానక విస్ఫోటంతో బాంబు పేలింది. వైస్రాయి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు గొడుగుపట్టి వెనక నడుస్తున్న ఛత్రదారి మరణించాడు. సంవత్సరంగా ఎలాంటి దుర్ఘటనా లేక పరిస్థితి ప్రశాంతంగా ఉండటంతో అలజడి అణగిపోయిందనీ, సమస్యలన్నీ తీరాయనీ దొరలు పెంచుకున్న భ్రమలు బాంబు దెబ్బకు పటాపంచలయ్యాయి. *"I literally wept, with disappointment, feeling that all the improvement I had noted in the general situation had disappeared through the wanton act of the miscreants"* (పరిస్థితిలో నాకు కనిపించిన మెరుగుదల యావత్తూ ఈ దుండగుల దుష్కృత్యంతో అంతరించి పోయిందన్న నిరాశతో నేను అక్షరాలా ఏడ్చాను) అని లార్డ్ హార్డింజ్ ఆక్రోశించాడు.

ఈ ఆశాభంగానికి సర్కారువారి అవగాహన లోపమే కారణం. దేశంలో విడవకుండా చెలరేగుతున్న టెర్రరిస్టు దాడులు కేవలం కొద్దిమంది దుండగుల దుష్కృత్యాలు కావనీ, కోట్లాది భారతీయుల గుండెల్లో భగభగమండుతున్న స్వాతంత్ర్యకాంక్షకు అవి చిన్నపాటి సంకేతాలనీ ఆంగ్ల పాలకులు గ్రహించలేకపోయారు. మీ సర్కారును మేము వ్యతిరేకించం, విధేయంగా నడచుకుంటాం అని గోఖలే అండ్ పార్టీ ఇచ్చిన హామీల మెరమెచ్చులకు మెచ్చి, జాతీయోద్యమం తిరిగి తమ గుప్పిట్లోకి వచ్చిందని మురిశారే గానీ, అసలు - గోఖలే అండ్ పార్టీయే జాతీయోద్యమం నుంచి వేరుపడి జనానికి దూరమయ్యారన్న కఠోర సత్యాన్ని హార్డింజ్ లాంటి లార్డులు పోల్చుకోలేకపోయారు.

అతి తెలివిగా వేసిన తమ లెక్కలు ఎక్కడ తప్పాయి, తెప్పరిల్లటానికి ఏమిచేయాలి అని ఆంగ్ల ప్రభువులు కిందుమీదవుతూండగా... లోకమాన్య తిలక్ ఆరేళ్ల కారాగార వాసం తరవాత 1914 జూన్‌లో బయటకి వచ్చాడు. ఆయన రాకతో జాతీయోద్యమాన్ని ఆరేళ్లుగా ఆవహించిన నిస్తబ్ధత వదిలింది. సరిగా అదే సమయంలో మొదటి ప్రపంచ

యుద్ధం మొదలైంది. ఇండియాను నెత్తురోడుతూ బలవంతంగా అందులోకి ఈడ్వటంపై దేశమంతటా ఆగ్రహావేశాలు వ్యక్తమవసాగాయి. రాజకీయాలు వేడెక్కాయి. అప్పుడే రాజకీయ రంగంలోకి అడుగిడిన అనీబిసెంట్ తిలక్‌కు బాసటగా నిలిచింది. ఇరువురు కలిసి ఐరిష్ తరహాలో హోంరూల్ ఉద్యమాన్ని ప్రారంభించారు. అది ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కాంగ్రెసును దాని కర్మానికి వదిలేసి జాతీయ స్రవంతి హోంరూల్ దిశగా ముందుకు సాగుతున్నది. దాంతో కాంగ్రెసుకు పూర్వ ప్రాముఖ్యం తెచ్చిపెట్టటంకోసం తిలక్‌ను ఆయన నేతృత్వంలోని జాతీయవాదులను తిరిగి కాంగ్రెసులోకి చేర్చుకోవాలన్న కోరిక ఇరువర్గాల్లోనూ రేకెత్తింది. జాతీయ ప్రయోజనాలకోసం అందరితో కలిసి కాంగ్రెసులో పనిచేయటానికి తిలక్ ఏనాడూ కాదనలేదు. ఈ మారూ అభ్యంతరం తెలపలేదు.

ఉన్న అభ్యంతరమల్లా గోఖలేకూ, ఫిరోజ్‌షా మోహతా వంటి ఇతర మితవాద నేతలకే. తిలక్‌ను తిరిగి రానిస్తే కాంగ్రెసు పుట్టి ముంచేస్తాడని వారు భీష్మించారు. వారిని ఎలాగైనా ఒప్పించి కాంగ్రెసును మళ్లీ జాతీయ ఐక్యవేదికగా మార్చాలని అనీబిసెంట్ వంటివారు తంటాలు పడుతున్నారు. ఇదంతా ఎటు తిరిగి ఎక్కడికి దారి తీస్తుందోనని- కాంగ్రెసును తెర వెనక నుంచి ఆడించటానికి అలవాటుపడ్డ బ్రిటిషు సూత్రధారులు కంగారు పడుతున్నారు.

ఇదీ 1914 చివర్లో మోహన్‌దాస్ కరంచంద్ గాంధీగారు దక్షిణాఫ్రికాను శాశ్వతంగా వదిలి, ఇంటి ముఖం పట్టేనాటికి ఇండియాలోని రాజకీయ స్థితి.

దొరల సౌజన్యం

***గాం**ధీగారు మహాత్ముడు ఎలా అయ్యాడు? ఎవరు చేస్తే అయ్యాడు ? ఆయనను తొలుదొలుత 'మహాత్మా' అని ప్రస్తుతించి ఆ బిరుదుకు ఆద్యుడయింది విశ్వకవి రవీంద్రుడు. కాని ఒక పద్ధతి ప్రకారం, ఆయనను తమ సామ్రాజ్య ప్రయోజనాలకు తెలివిగా ఉపయోగించుకుని, ఒక పథకం ప్రకారం ఆయన రాజకీయ స్థాయిని, ప్రాముఖ్యాన్ని పెంచి, ఏరికోరి మహాత్ముడిని చేసింది - లేక - మహాత్ముడయేందుకు దోహదం చేసింది మాత్రం మహా ఘనత వహించిన బ్రిటిషు ప్రభుత్వం.*

జీవితమంతా గాంధీగారు పోరాడిందే బ్రిటిషు ప్రభుత్వ దుర్విధానాల మీద అనుకుంటున్నప్పుడు అదే బ్రిటిషు ప్రభుత్వానికి అంతటి మహాత్ముడు తెలిసో, తెలియకో ఏజంటుగా పనిచేశాడంటే సహజంగానే ఎవరికీ నమ్మశక్యం కాదు. మనం చదివిన చరిత్ర గ్రంథాల్లో ఆ సంగతి ఎక్కడా లేదు. లోతుగా పరిశీలిస్తే అక్కడక్కడ 'క్లూ'లు మాత్రమే దొరుకుతాయి. ఆ 'క్లూ'లు ఎంతవరకు నిజం, అవి కానవచ్చే గ్రంథాలు ఏమేరకు ప్రామాణికం, వాటిని రాసిన వారు ఎంత విశ్వసనీయులు- అన్న అనుమానాలు ఉండనే ఉంటాయి. కాబట్టి, అనుమానానికి ఆస్కారంలేని, ప్రామాణికతను ప్రశ్నించడానికి వీలులేని గ్రంథాన్ని మాత్రమే మన పరిశీలనకు కరదీపికగా ఎంచుకుందాం.

గాంధీపై అనేక భాషల్లో వెలువడిన జీవిత చరిత్రలు వెయ్యికి పైనే ఉన్నా, అన్నిటిలోకి ప్రామాణికంగా ఎన్నదగ్గవాటిలో మొదట పేర్కొనదగ్గది **డి.జి. తెండుల్కర్** రాసిన ఏడు సంపుటాల Mahatma ఉద్గ్రంథాన్ని. దాన్ని ప్రచురించింది స్వతంత్ర భారత ప్రభుత్వ సమాచార మంత్రిత్వశాఖ. ముందుమాట రాసింది నాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ. "It brings together more facts and data about Gandhi than any book that I know." *(నాకు తెలిసి గాంధీ గురించి వచ్చిన ఏ గ్రంథంలోనూ ఇన్ని వాస్తవాలు, ఇంత సమాచారం ఒక్కచోట లేదు)* అని నెహ్రూ పండితుడంతటి వాడు మెచ్చుకోవటం ఒక్కటే కాదు. అనేక సంవత్సరాలు పరిశ్రమించి, ఎన్నో చారిత్రక ఆధారాలను మథించి, తెండుల్కర్ తయారుచేసిన రాతప్రతిని స్వయంగా గాంధీజీయే సరిచూశారు. *In*

doubtful cases my final authority was Gandhiji himself. When I met him last on January 22, 1948, we discussed the smallest details- the format, type, illustrations, spelling, quotation marks and even hyphens... Gandhiji being my chief guide took keen interest in my work" (అనుమానం వచ్చిన సందర్భాల్లో నాకు అంతిమ అథారిటీ గాంధీజీయే. (మరణించడానికి వారం ముందు) 1948 జనవరి 22న ఆయనను చివరిసారి కలిసినప్పుడు మేము గ్రంథ ప్రణాళిక, అక్షరాల కూర్పు, బొమ్మలు, స్పెల్లింగులు, కొటేషను మార్కులు, ఆఖరికి హైఫన్లను కూడా చర్చించాము. నాకు ప్రధాన మార్గదర్శకుడిగా గాంధీజీ నా పనిలో చాలా శ్రద్ధ చూపారు) అని పీఠికలో గ్రంథకర్త పేర్కొన్నారు. ఆయన గాంధీగారికి భక్తుడు, ఆరాధకుడే తప్ప విమర్శకుడు కాడు. కాబట్టి గాంధీ అంటే గిట్టక, వాస్తవాలు నిర్ధారించుకోకుండా తెలిసీ తెలియక రాశాడేమో అన్న సంశయానికి తావు లేదు. అంతటి ప్రామాణిక గ్రంథంలో 'దక్షిణాఫ్రికాకు వీడ్కోలు' అధ్యాయం ఇలా మొదలవుతుంది

Gokhale, hearing that a fresh march was under contemplation, sent a long cablegram to Gandhi, stating that such a step would land Lord Hardinge and himself in an awkward position. He strongly advised that the march should be given up.

[*Mahatma*, D.G. Tendulkar, Vol.I. P. 146]

(మళ్ళీ ఇంకో 'మార్చ్' తలపెట్టారని తెలిసి, గోఖలేగారు గాంధీకి సుదీర్ఘమైన కేబుల్‌గ్రాం పంపారు. అటువంటి చర్య లార్డ్ హార్డింజ్‌నూ, తననూ ఇబ్బందికరమైన ఇరకాటంలో పెడుతుందని అందులో చెప్పారు. కొత్త యాత్రను విడనాడాలని గట్టిగా కోరారు.)

గోఖలే గారంటే గాంధీజీకి గురువు. చిరకాలంగా ఆయనతో సలహా సంప్రదింపులు చేస్తూ, దక్షిణాఫ్రికాకు వస్తూపోతూ, అక్కడి పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలిస్తూ వచ్చిన మనిషి. కాబట్టి 1914లో తలపెట్టిన మలి 'మార్చ్'ను విరమించమని గాంధీకి గోఖలే సలహా ఇవ్వటంలో అనౌచిత్యంలేదు. తన శిష్యుడు దక్షిణాఫ్రికా శ్వేత ప్రభుత్వాన్ని మరీ చిక్కునపెడితే తెల్లదొరతనంతో స్నేహంగా మెలిగే తాను మొగం చెల్లక ఇరుకున పడతానని ఆయన భావించటమూ, ఆ సంగతి శిష్యుడికి చెప్పటమూ కూడా అర్థం చేసుకోదగ్గదే. కానీ తనతోబాటు ఇండియాకు వైస్రాయి అయిన లార్డ్ హార్డింజ్ కూడా ఇరకాటంలో పడతాడని ఆయన అనటమేమిటి?

గాంధీ మహామొండి. ఒక నిశ్చయానికి వచ్చాక గురువు చెప్పినా, దేవుడు చెప్పినా వినడు. ప్రతిజ్ఞల మీద నిర్మించుకుంటూ వచ్చిన సత్యాగ్రహ పోరాటాన్ని ప్రతిజ్ఞా భంగం

చేసి ఆపటం బాగుండదని, అన్యథా భావించక తమను ఆశీర్వదించవలసిందని గోఖలే గారికి జవాబు పంపాడు. ఆ ప్రశస్తమైన ప్రత్యుత్తరంలో ఇంకో విశేషం ఉంది.

Gandhi sent a long cablegram to Gokhale costing $ 100 with a request to show it also to Lord Hardinge.

[Ibid P. 146]

(గాంధీ వంద పౌండ్లు ఖర్చుపెట్టి గోఖలేకు పెద్ద కేబుల్‌గ్రాం పంపి దాన్ని లార్డ్ హార్డింజ్‌కి కూడా చూపించవలసిందని రిక్వెస్టు చేశాడు.) అంతే కాదు.

Gokhale did not agree with Gandhi. ... He wired to Lord Hardinge on the matter. The Viceroy, while strongly upholding the Indian Cause, was at variance with Gandhi as to the course to pursue. It was Gokhale's task to bring about agreement. The Viceroy at last sent Sir Benjamin Robertson to South Africa to plead on behalf of the Indian settlers.

[Ibid P. 146]

(గాంధీ వాదనకు గోఖలే అంగీకరించలేదు... ఆయన ఈ విషయంలో లార్డ్ హార్డింజ్‌కి వైరు ఇచ్చాడు. ఇండియన్ల కోర్కెలను గట్టిగా బలపరుస్తూనే, ఏ దారిన వెళ్ళాలన్న దానిపై వైస్రాయి గాంధీతో విభేదించాడు. గోఖలే పూనుకుని అగ్రిమెంటు కుదిర్చాడు. చివరికి భారతీయ సెట్లర్ల తరపున వాదించటానికి సర్ బెంజమిన్ రాబర్ట్‌సన్‌ని వైస్రాయి దక్షిణాఫ్రికా పంపించాడు.)

దీన్నిబట్టి ఏమి అర్థమవుతుంది? దక్షిణాఫ్రికాలో బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతీయుల హక్కుల పోరాటాన్ని బ్రిటిషు వైస్రాయి సలహా సంప్రదింపులతోటే గాంధీజీ నడిపించారనే కదా ? ఇండియాలోపలా, వెలుపలా బ్రిటిషు సామ్రాజ్యంపై రాజీలేని భీకర సమరం సాగిస్తున్న జాతీయవాదులతోనూ, పోరాట సంస్థలతోనూ కాకుండా బ్రిటిషు రాజప్రతినిధితోటే గాంధీ ఎక్కువ సంపర్కం పెట్టుకున్నారనే కదా?

సరే! బయటి దేశాల పోరాట సంస్థలతో సంబంధం పెట్టుకున్నా దక్షిణాఫ్రికా వారికి ఒరిగేది లేదు. వారు ఆర్చేవారూ కాదు. తీర్చేవారూ కాదు. అవసరానికి ఏమైనా సహాయం చేయగలిగిన సావకాశం వైస్రాయికే ఉంటుంది. పైగా లార్డ్ హార్డింజ్ వ్యక్తిగతంగా సజ్జనుడు. భారతదేశమన్నా, భారతీయులన్నా సానుభూతి, సుహృద్భావం కలిగిన పెద్దమనిషి. అలాంటి జంటిల్మనుతో గోఖలేగారికున్న చనువును ఉపయోగించుకుని, దక్షిణాఫ్రికాలో భారతీయుల పోరాటానికి తన పలుకుబడిని వెచ్చించి సహాయ పడవలసిందిగా కోరటంలో తప్పేముంది... అందామా ? ఒకవేళ వ్యక్తిగా సజ్జనుడే అయినా బ్రిటిషు రాజప్రతినిధి హోదాలో ఉన్నవ్యక్తి ప్రధానంగా బ్రిటిషు పాలక వర్గాల ప్రయోజనాలనే సదా కావలి

కాస్తుంటాడు. ఎప్పటికప్పుడు లండన్‌కు విషయాలను నివేదించే, అక్కడి నుంచి ఆదేశాలు తీసుకునే, సామ్రాజ్య ప్రయోజనాల నిమిత్తమే గోఖలేతో అయినా, గాంధీతో అయినా, మరొకరితో అయినా వ్యవహారం సాగిస్తాడు. తమ సామ్రాజ్య విశాల వ్యూహానికి వారిని పావుల్లా ఎలా ఉపయోగించుకోవాలా అనే చూస్తాడు. ఈ సంగతి బ్రిటిషు వారి తత్త్వం ఎరిగిన ప్రతి ఒక్కరికీ తెలిసిందే. ఈ రాజధర్మ ప్రాథమిక సత్యాన్ని విస్మరించి, వ్యక్తులు వారి మంచితనాలు, మన మంచి తనంతో వారిని స్నేహ పూర్వకంగా ఆకట్టుకోగలగడాలు అంటూ అమాయకంగా కబుర్లాడితే దొరలు ఫక్కున నవ్వరా?

భారతదేశంలో వైస్రాయిగా ఉన్నాడు కాబట్టి దక్షిణాఫ్రికాలోని భారతీయుల పక్షాన నిలబడి, హార్డింజ్ ప్రభువు ఏదో మేలు చేయబూనినట్టు పైకి కనిపిస్తుంది. వాస్తవానికి లండన్‌లో జాగ్రత్తగా పన్నిన బృహత్ వ్యూహం ప్రకారమే కథ నడిచింది. గాంధీని హీరోనిచేసి, ఉత్తరోత్తరా సామ్రాజ్య అవసరాలకు అనువుగా ఉపయోగించుకోవాలన్న నిగూఢ రాజకీయ ప్రణాళిక మేరకే చివరి రోజుల్లో గాంధీ పట్ల దక్షిణాఫ్రికా దొరతనం వైఖరి అనూహ్యంగా మారింది. గాంధీ 1893 నుంచీ దక్షిణాఫ్రికాలో ఉన్నా అక్కడ భారతీయులెదుర్కొంటున్న జాతి వివక్షకు వ్యతిరేకంగా యథాశక్తి గళమెత్తి, చేతనైన మేరకు ప్రచార సమరం... 1906 నుంచీ సత్యాగ్రహ పోరాటం సాగిస్తూ వచ్చినా శ్వేత జాతి ప్రభుత్వం పెద్దగా పట్టించుకోలేదు. బోయర్ యుద్ధం, జులూ తిరుగుబాటు సందర్భాల్లో రాజును మించిన రాజభక్తిని కనపరిచి, అహింసా వ్రతాన్ని తీసి గట్టునపెట్టి సామ్రాజ్యం పనుపున యుద్ధ సేవలు చేసి ఎంతగా తరించినా ఏలినవారు మురిసి ముప్పందుమవలేదు. జులూలను అమానుషంగా వేటాడటంలో భాగం పంచుకుని విధంచెడ్డ తరవాత కూడా గాంధీ సత్యాగ్రహానికి దిగినప్పుడల్లా మొగమాటం లేకుండా అరెస్టుచేసి, సంకెళ్ళువేసి, మామూలు నేరస్థుడిలాగే జైల్లో పడేస్తూ వచ్చారే తప్ప అనంతర కాలంలో ఇండియాలోని బ్రిటిషు దొరతనంవలె గాంధీకి వి.ఐ.పి. ఖైదీగా ప్రత్యేక మర్యాదలేవీ చేయలేదు. సమావేశాలు, తీర్మానాలు, పత్రికా ప్రచారాలు, సత్యాగ్రహాలు ఇత్యాదిగా హడావుడి ఎంత చేసినా దక్షిణాఫ్రికాలో భారతీయుల పక్షాన గాంధీ నికరంగా సాధించిన విజయం అంటూ ఏదీ లేదు. వ్యవహారం దగ్గర మొగమాటం లేకుండా గాంధీని నిష్కర్షగా నిరాదరిస్తూ... ఇచ్చిన మాట కూడా తప్పుతూ వచ్చిన దక్షిణాఫ్రికా పాలకుల వైఖరి 1914 వచ్చేసరికి అదృశ్య ప్రభావం నిమంత్రించినట్టు హఠాత్తుగా మారింది. తెండుల్కర్ కృతమైన Mahatma గ్రంథంలో ఆయా ఘట్టాలను చదివితే ఈ సంగతి బాగా అవగతమవుతుంది.

దక్షిణాఫ్రికాలో గాంధీ సత్యాగ్రహ సమరానికి పతాక సన్నివేశం 'మూడు పౌండ్ల పన్ను'కు వ్యతిరేకంగా భారత జాతీయులను సమీకరించి న్యూకాజిల్ నుంచి ట్రాన్స్‌వాల్‌కు

ఆయన వేల మందితో నడిపించిన చరిత్రాత్మక యాత్ర ! దానికి అన్ని సన్నాహాలూ పూర్తయ్యాక పరిష్కారం కోసం ఆయన ఆఖరి ప్రయత్నం చేశాడు.

From Charlestown be telephoned to General Smuts who was in Pretoria. His secretary replied: "General Smuts will have nothing to do with you. You may do just as you please"

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I. P. 140]

(ప్రిటోరియాలో ఉన్న దక్షిణాఫ్రికా ప్రభుత్వాధినేత జనరల్ స్మట్స్‌కి చార్లెస్ టౌన్ నుంచి గాంధీ టెలిఫోన్ చేశాడు. "జనరల్ స్మట్స్‌కి మీతో పనిలేదు. మీరు మీ ఇష్టం వచ్చింది చేసుకోవచ్చు" అని ఆయన సెక్రటరీ బదులిచ్చాడు.)

ఇదీ - 1913 నవంబరు ఆరంభంనాటికి గాంధీ పట్ల దక్షిణాఫ్రికా ప్రభుత్వ వైఖరి. ఇక చేయగలిగింది లేక, సమ్మెకట్టి తన చెంత చేరిన వేల జనాన్ని ఏమి చేయాలో తెలియక, ప్రభుత్వం వారిని అరెస్టుచేసి జైల్లో వేస్తుందనుకుంటే అదీ జరగక, అంతమందినీ మేపడానికి సొమ్ముల్లేక గాంధీ వారిని తీసుకుని 1913 నవంబర్ 6న ట్రాన్స్‌వాల్‌కు బయలుదేరాడు. ఆయన ఆశించినట్టు ప్రభుత్వం జనాన్నయితే జైళ్ళలో వేయలేదు. ఆయనను మాత్రం నాలుగురోజుల్లో మూడుసార్లు అరెస్టుచేశారు. మొదటి రెండు మార్లూ జామీను మీద వదిలారు. మూడోసారి '60 పౌండ్ల జరిమానా లేక 9 నెలల ఖైదు' అన్నారు. గాంధీ జైలునే ఎంచుకున్నాడు. తమ నాయకుణ్ని ఖైదు చేశారన్న వార్త విని నేటాల్‌లో 20 వేల మంది భారతీయ కార్మికులు సమ్మె కట్టారు. ప్రభుత్వం మిలిటరీ పోలీసులచేత వారిని కొరడాలతో కొట్టించి, కాల్పులు జరిపించి భయానక దమనకాండకు పాల్పడింది. అలా శ్వేతజాతి ప్రభుత్వం పంతంపట్టి ఉక్కుపాదంతో సత్యాగ్రహులను అణచేస్తూ, గాంధీని, ఆయన అనుచరులను వోక్‌స్రస్ట్ జైలులో కుక్కిన సమయాన పరిస్థితి అనూహ్యంగా మారింది. ఇండియాలోనూ, లండన్‌లోనూ పావులు చకచకా కదిలాయి.

It fell to Lord Hardinge's lot to express the unanimous sentiment of India when, giving his blessings in November to the mission of Gokhale, he voiced " the sympathy of India... for their compatriots in South Africa in their resistance to invidious and unjust laws"... The secretary of State for India too became active, and the Union Government, anxious to save their face, appointed on December 11 a Commission, to inquire into the causes of the Natal Indian strike. The commission... recommended the release of Gandhi.

[Ibid.P. 145]

(ఇండియా ఏకగ్రీవాభిప్రాయాన్ని వ్యక్తపరిచేపని లార్డ్ హార్డింజ్ పాలపడింది. అంత వరకూగోఖలే నెరపుతూ వస్తున్న దౌత్య యత్నాలను ప్రసిద్ధ ప్రసంగంలో ఆశీర్వదిస్తూ, ఆయన "అసహ్యకరమైన, అన్యాయమైన శాసనాలపై తమ సోదర జాతీయుల వ్యతిరేకతకు భారతీయుల సానుభూతి"ని ప్రకటించాడు. ఇండియాకు విదేశాంగమంత్రి కూడా చురుకుగా కదిలాడు. దక్షిణాఫ్రికా కేంద్ర ప్రభుత్వం మొగందామకునే ఆత్రంలో డిసెంబరు 11న నేటాల్ భారతీయుల సమ్మెకు కారణాలను విచారించటానికి ఒక కమిషను నియమించింది. ఆ కమిషను గాంధీ విడుదలను సిఫారసు చేసింది.)

అలా 1914 డిసెంబరు 18న గాంధీ విడుదలయ్యాడు. సత్యాగ్రహుల డిమాండ్లలో దేన్నీ ప్రభుత్వం తీర్చలేదుకనక పోరాటం ఆపేది లేదని ఆయన అన్నాడు. కొత్త కమిషనులో భారతీయులకు ప్రాతినిధ్యం లేకపోగా, భారత వ్యతిరేకులకు అందులో చోటు ఇచ్చినందున ఆ కమిషనును తాము బహిష్కరిస్తున్నట్లు గాంధీ ప్రకటించాడు. కొత్త సంవత్సరం తొలి రోజు నుంచీ పోరాటానికీ, ఖైదుకూ సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చాడు. దాంతో గోఖలే గొంతులో వెలక్కాయ పడినట్టయింది. తాను పూనుకుని వైస్రాయ్‌ని రంగంలోకి దింపి, దక్షిణాఫ్రికాలో భారతీయుల పోరాటానికి బాహాటంగా మద్దతు ప్రకటింపజేసి, ఆయన పలుకుబడితో కమిషన్ వేయించిన తరువాత కూడా పోరాటాన్ని ఆపకుండా కొత్త 'మార్చ్' తలపెడితే అది తనకూ, హార్డింజ్ దొరకూ ఇరకాటం అవుతుందంటూ ఆయన గాంధికి కేబుల్ పంపాడు. దాన్నే ఇంతకుముందు చూశాం.

తన ధోరణి వైస్రాయ్‌కి నచ్చలేదని తెలిసాక గాంధీ వైఖరి అనూహ్యంగా మారింది. అప్పటిదాకా తరువాయి పోరాటానికి సత్యాగ్రహపు కత్తులు నూరినవాడు కాస్తా ప్రిటోరియా వెళ్లి జనరల్ స్మట్స్‌ని కలిశాడు. సరిగ్గా అదే సమయానికి దక్షిణాఫ్రికాలోని యూరోపియన్ కార్మికులు రైల్వే సమ్మెకు దిగారు. అది సర్కారువారికి ఆందోళన కలిగిస్తున్నదని తెలియగానే వారిని ఇంకా కష్టపెట్టడం ఇష్టంలేక, ప్రత్యర్థి కష్టాన్ని స్వార్థానికి వాడుకోవటం సత్యాగ్రహి లక్షణం కాదు కనక గాంధీ గారి హృదయం ద్రవించి, ఎవరూ అడగకుండానే తాను తలపెట్టిన 'మార్చ్'ని విరమిస్తున్నట్టు ప్రకటించాడు. ఆ మంచితనానికి కరిగిపోయో, తెరవెనక రాజకీయ శక్తుల ప్రోద్బలంవల్లో కాని – కరకు జనరల్ స్మట్స్‌కూడా అకస్మాత్తుగా బహుమంచివాడు అయిపోయాడు. Satyagraha in South Africa గ్రంథం 297వ పేజీలో స్వయంగా గాంధీజీయే రాసినట్టు "మొదటి ఇంటర్వ్యూను అతి క్లుప్తంగా ముగించిన జనరల్ గారిలో 'గ్రేట్‌మార్చ్'కు ముందున్న దూకుడేదీ ఇవాళ కనిపించలేదు. అప్పుడైతే ఆయన నాతో మాట్లాడటానికే ఇష్టపడలేదు. సత్యాగ్రహం తీవ్రత అప్పుడెంత ఉండేదో ఇప్పుడూ అంతే ఉంది. అయినా అప్పుడు నాతో చర్చించటానికి తిరస్కరించినవాడు ఇప్పుడు నాతో సమావేశానికి రడీగా ఉన్నాడు."

రాజు తలచుకుంటే వరాలకు కొదవా? మునుపటివరకూ గాంధీపై కారాలు మిరియాలు నూరిన స్మట్స్ అదే గాంధీతో పలుమార్లు భేటీ అయి బహు సౌమ్యత చూపాడు. 1914 జనవరి 21న ఇరువురి మధ్య అగ్రిమెంటు కుదిరింది. నడుమ వచ్చిన ఎంక్వయిరీ కమిషనూ దానికి వల్లె అంది. మూడు పౌండ్ల పన్నును రద్దు చేస్తూ, సాంప్రదాయిక వివాహాల చట్టబద్ధత గుర్తించడం వగైరా భారతీయ డిమాండ్లను మంజూరు చేస్తూ దక్షిణాఫ్రికా పార్లమెంటు ఐదునెలలకల్లా శాసనం చేసి పడేసింది.

ఆ విధంగా ఆఖరిఘట్టంలో అదృశ్యశక్తుల చలవవల్ల అన్నీ కలిసివచ్చి గాంధీ సత్యాగ్రహం జయప్రదంగా ముగిసింది. దక్షిణాఫ్రికా సర్కారు దమన నీతిని బ్రిటిష్ మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, పత్రికలు గళమెత్తటంవల్ల, తాను తెల్లవాడై ఉండీ వైస్రాయ్ హార్డింజ్ భారతీయుల పక్షం వహించి, బాహటంగా నైతిక మద్దతు ఇచ్చినందు వల్ల,(జాతీయోద్యమ ప్రధాన స్రవంతినుంచి ఏనాడో వేరైన) గోఖలేగారు యావద్భారతాన్నీ సమీకరించి కొండంత అండగా నిలబడినందువల్ల, అన్నిటికీ మించి గాంధీగారి సత్యాగ్రహాయుధ అమోఘశక్తివల్ల, కథ అలా సుఖాంతమైందని గాంధీ భక్తులు అనేది వినడానికి ఇంపుగానే ఉంటుంది. కాని బ్రిటిష్ రాజనీతి ఎలా నడుస్తుందో, అందరినీ, అన్నిటినీ తెలివిగా ఉపయోగించుకుని, సామ్రాజ్య ప్రయోజనాలే పరమావధిగా బృహత్ వ్యూహంతో ఎలా అడుగువేస్తుందో ఎరిగిన వారెవరూ ఈ కబుర్లను నమ్మలేరు. పరిణామక్రమం వెనుక తెల్లవాడి అదృశ్యహస్తాన్ని పోల్చుకోకుండా ఉండలేరు.

ఇంతకీ తెల్లదొరతనం ఇదంతా చేసింది గాంధీ మహిమను లోకానికి చాటడానికా? సత్యాగ్రహానిదే అంతిమ విజయమని నిరూపించడానికా ? కాదు. దక్షిణాఫ్రికా రంగస్థలిపై తెరవాల్చింది – అంతకంటే పెద్ద రంగస్థలంపై అంతకంటె పెద్ద నాటకానికి అర్జంటుగా తెరలేపటానికి.

ఆయన తీరే వేరు

భారత ప్రజలకు బహిరంగ లేఖ

ప్రియమిత్రులారా,

బ్రిటిషువాళ్ళు మనదేశాన్ని ఆక్రమించారు. మన వ్యాపారాలను, పరిశ్రమలను నాశనం చేశారు. మన సంపదను కొల్లగొట్టారు. మూడు కోట్ల మందిని కరవులకు, ప్లేగుకు బలి ఇచ్చారు బ్రిటిషు పాలనలో మనమెన్ని బాధలు పడుతున్నదీ మేము గుర్తుచేయాల్సిన పనిలేదు. మీకే బాగా తెలుసు. మన నెత్తురోడుస్తున్న విదేశీ నియంతృత్వాన్ని అంతమొందించాలని మనందరం చిరకాలంగా కోరుకుంటున్నాము. దురాక్రమణదారులు మన మెడకు తగిలించిన కాడిని లాగి అవతల పారేసేందుకు సరైన సమయం ఇప్పుడు వచ్చింది.

ప్రపంచ యుద్ధం దగ్గర పడింది. ఇంగ్లండు ఇందులోకి కచ్చితంగా దిగుతుంది. ఈ అరుదైన అవకాశాన్ని మనం తెలివిగా ఉపయోగించుకోవాలి. తనను తాను రక్షించుకోవాలంటే బ్రిటన్‌కు ఇండియా తోడ్పాటు అత్యవసరం. మన శత్రువైన బ్రిటిష సామ్రాజ్య వాదం జీవన్మరణ సంఘర్షణలో చిక్కుకున్నప్పుడే మనం సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని డిమాండు చేయాలి. ఇండియా సహాయం పొందాలంటే అది ఇచ్చి తీరాలని పట్టుబట్టాలి. సంపూర్ణ స్వాతంత్ర్యమంటే అర్థం ఆర్థిక, విదేశీ, సైనిక వ్యవహారాలతో సహా అన్నీ మన చేతుల్లోకి రావాలి. ఇందుకు బ్రిటన్ ఒప్పుకోకపోతే ఇండియా నుంచి వారికి ఎటువంటి సహాయం అందకుండా మనం అడ్డుకోవాలి. ఇప్పటి ప్రపంచ పరిస్థితిలో మన డిమాండును తోసిపుచ్చటం బ్రిటిషువారి తరం కాదు. ఈ స్వర్ణావకాశాన్ని మనం వదులుకోకూడదు. స్వాతంత్ర్యం కోసం పాటుపడుతున్న హిందూస్తానీలందరూ ఏకమై బలమైన యునైటెడు ఫ్రంటుగా ఏర్పడాలి. వ్యక్తిగత విభేదాలను మరచి ఉమ్మడి ధ్యేయానికి అంకితమవ్వాలి. యుద్ధం ఏ రోజైనా మొదలవవచ్చు. మనం ఒక్క క్షణం కూడా వృథా చెయ్యటానికి వీల్లేదు. భారత ప్రజలందరినీ జాగృతపరచి పోరాటానికి సంఘటితం చెయ్యాలి.

స్వాతంత్ర్యం - లేదా - పోరాటం !... సంపూర్ణ స్వాతంత్ర్యం - లేదా - సహాయ నిరాకరణ ! స్వాతంత్ర్యం లేదా... ఇండియా నుంచి సైనికులూ రారు ! స్వాతంత్ర్యం రాదా... ఇండియా నుంచీ డబ్బూ రాదు ! ఇవీ మన నినాదాలు.

అమెరికాలోని ప్రవాస భారతీయులు స్థాపించిన 'గదర్' పార్టీ 1913 డిసెంబరులో కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో మహాసభ జరిపిన అనంతరం భారత ప్రజలనుద్దేశించి వెలువరించిన బహిరంగ లేఖ ఇది. ఆ పార్టీకి ప్రచార సాధనంగా ఉర్దూ, పంజాబీ, హిందీ, ఇతర భారతీయ భాషల్లో కొత్తగా ప్రారంభించిన 'గదర్' పత్రికలో ఇది ప్రముఖంగా అచ్చయింది. దీని కాపీలు లక్షల సంఖ్యలో ప్రపంచం నలుమూలలకూ, భారతదేశ మంతటికీ అనతికాలంలో చేరి ప్రజల్లో పెద్ద సంచలనం రేకెత్తించాయి.

'గదర్' పార్టీ అమెరికాలో స్థిరపడ్డ సంపన్న భారతీయులెవరో ఉబుసుపోక, తిన్నది అరగక పెట్టిన రాజకీయ సంస్థ కాదు. 19వ శతాబ్దంలో పంజాబు నుంచి పొట్టచేత పట్టుకుని దేశాంతరాలకు వలసపోయిన పేద కుటుంబీకులు అమెరికాలో దారుణ దుర్విచక్షణకుగురయ్యారు. శ్వేత జాత్యహంకారుల వేధింపుల నుంచి తమను అటు అమెరికా ప్రభుత్వమూ కాపాడక, ఇండియాలోని బ్రిటిషు దొరతనమూ పట్టించుకోక... ఆదుకునే దిక్కులేక... బానిసల్లా బతుకుతూ దీర్ఘకాలం దుస్సహక్లేశాలను అనుభవించిన మీదట నిస్పృహనుంచే వారికి కర్తవ్యం స్ఫురించింది. తమ మాతృభూమి విముక్తమవుతే తప్ప పరాయిగడ్డన తమకూ గౌరవం దక్కదని వారికి క్రమంగా అర్థమైంది. 1857 భారత స్వాతంత్ర్య సంగ్రామ ప్రేరణతో, నాటి గదర్ (తిరుగుబాటు) లాగే మళ్ళీ భారతదేశ విముక్తికి విప్లవాత్మకంగా తిరుగుబాటు తేవాలన్న లక్ష్యంతో శాన్‌ఫ్రాన్సిస్కో ప్రధాన కేంద్రంగా 1913లో సోహన్‌సింగ్ భఖ్నా, లాలా హర్‌దయాళ్ వంటి దేశభక్తులు 'గదర్' పార్టీని స్థాపించారు. "ఇండియాలో బ్రిటిషు పాలనకు శత్రువు"గా తనను తాను బాహాటంగా ప్రకటించుకుని, సాయుధ పోరాటం ద్వారా భారతదేశాన్ని విముక్తి చేసి సర్వస్వతంత్ర సెక్యులర్ ప్రభుత్వాన్ని ఏర్పరచాలన్నది లక్ష్యంగా ఎంచుకుని, వట్టి మాటలతో సరిపెట్టక గట్టి చేతలతో తెల్లదొరతనాన్ని హడలెత్తించిన ఘనత ఈ విప్లవ సంస్థకి దక్కింది. ఆ వివరాల్లోకి తరవాత వెళదాం.

అటు గదర్ పార్టీలాంటి ప్రవాస భారతీయ సంస్థలు, ఇటు భారతదేశంలోని జాతీయ వాదులు ఆశించినట్టే భారత స్వాతంత్ర్యాన్ని పట్టుబట్టి సాధించటానికి సరైన అదను వచ్చింది. కొన్ని నెలలుగా కమ్ముకున్న యుద్ధమేఘాలు వర్షించి, పెళపెళార్భాటంతో ప్రథమ ప్రపంచ మహా సంగ్రామం మొదలైంది. సెర్బియాపై ఆస్ట్రియా యుద్ధానికి దిగిన వెనువెంటనే రష్యా, ఫ్రాన్సులపై జర్మనీ యుద్ధం ప్రకటించింది. ఇంగ్లండుతో రక్షణ ఒప్పందం చేసుకున్న బెల్జియంపై జర్మనీ దాడి చేయడంతో 1914 ఆగస్టు 4న

జర్మనీపై ఇంగ్లండు యుద్ధం మొదలు పెట్టింది. నేలమీద, నీటిపైన, గాలిలోనూ ప్రపంచ చరిత్రలో అంతవరకూ కనీవిని ఎరుగనంతటి మహాయుద్ధం నాలుగేళ్ళు భయంకరంగా చెలరేగింది. జర్మనీపై తాను యుద్ధం ప్రకటించటంతోటే తన కబ్జాలోని ఇండియానూ బ్రిటన్ ఏకపక్షంగా, ఆటోమెటిక్‌గా సంఘర్షణలోకి లాగింది. యుద్ధ ప్రకటనలో గాని, బ్రిటిష్ సామ్రాజ్యానికి సైనిక, ఆర్థిక సహాయంలో గాని భారతీయులకు ఎటువంటి ప్రమేయం లేకపోయింది.

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి బ్రిటిషు కాలనీలూ యుద్ధ అవసరాల నిమిత్తం బ్రిటన్‌కు ఐచ్ఛికంగా తోడ్పడకపోలేదు. కాని వాటికున్న స్వయం నిర్ణయాధికారం ఇండియాకు లేదు. భారత ప్రజలు ఇష్టపూర్వకంగా, మిత్రధర్మంగా ఇంగ్లండుకు భూరి సహాయాలను వారంతటవారే ఉదారంగా చేస్తున్నారని తెల్లదొరలు ఎన్ని కల్లలాడినా... ఔనౌను నిజమేనంటూ దేశంలోని వారి భజంత్రీలు ఎన్ని ఇచ్చకాలాడినా... నిజానికి అందులో తమ ప్రమేయం ఎంతమాత్రం లేదని భారత ప్రజలకు తెలుసు. ప్రతిదీ బలవంతంగా లాక్కుపోయిందే తప్ప. ఏ ఒక్కటీ తాము స్వచ్ఛందంగా ఇచ్చిందీ కాదు. వద్దంటే ఆగేదీ కాదు అని భారతీయ ప్రముఖులందరూ ఎరుగుదురు. ఎలాగూ తాము వద్దన్నా వినరుకాబట్టి 'గాలికిపోయే పేలపిండి కృష్ణార్పణం' అన్నట్టు బ్రిటిష్ సామ్రాజ్యం మీది ప్రేమతో తామే ఇష్టపడి యుద్ధావసరాలకు తోడ్పడినట్టు బతకనేర్చిన కాంగ్రెసు నాయకుల్లాంటివారు మెరమెచ్చులు పలికారు. మీ అవసరానికి మేము ఇంత సాయ పడ్డాము కనుక సంస్కరణలకోసం మా డిమాండ్లను మీరు కాస్త తీర్చండి అంటూ కాంగ్రెసు వేదిక నుంచి బేరాలూ సాగించారు. ఎవరేమన్నా, ఎన్ని నాటకాలాడినప్పటికీ చరిత్రకారుడు **ఆర్. సి. మజుందార్** చెప్పినట్టు-

"There was no real and genuine war enthusiasm or even loyalty among the people of India. Indeed there can be hardly any doubt that the pious platitudes uttered by Indian leaders indicating the support of, and sympathy with the British during the First World War, did not represent the real feelings of India. The nationalists, and, to a large extent, the general people did not feel any genuine sympathy for the British in their great trial... On the whole, the general feeling of the Indians may be summed up in the wellknown dictum: England's necessity is India's opportunity"

[*History of the Freedom Movement in India*, R.C. Majundar, Vol. II P. 327]

(యుద్ధం మీద ఆసక్తి, ఇంగ్లీషు వారి పట్ల విధేయత భారత ప్రజల్లో నిజంగా ఎవరికీ లేవు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఆంగ్లేయులకు సహాయాన్ని సానుభూతిని

ప్రకటిస్తూ భారతీయ నాయకులు చేసిన శుష్కాలాపాలు భారతదేశ వాస్తవ అభిప్రాయాలను ప్రతిబింబించవు. జాతీయవాదులకు, చాలావరకు సాధారణ ప్రజలకు ఆపత్కాలంలో బ్రిటన్‌ను ఆదుకోవాలన్న సానుభూతి లేదు. మొత్తం మీద 'ఇంగ్లండు అవసరం ఇండియాకు అవకాశం' అన్నదే భారతీయుల ఆలోచనల్లా).

ప్రవాస భారతీయులకు లేకపోవచ్చు. జాతీయవాదులకు లేకపోవచ్చు. భారత ప్రజలకు లేకపోవచ్చు. కాని ఒకానొక భారతీయుడికి మాత్రం బ్రిటిషు వారంటే భక్తి; ఆపత్కాలంలో అన్నీ పక్కనపెట్టి, ఎలాంటి షరతులూ లేకుండా తెల్లదొరలను శాయశక్తులా సేవించాలన్న అనురక్తి; అంతలేసి కష్టాలు పడుతున్న దొరల జాతిమీద ఎనలేని సానుభూతి నిలువెల్లా, నరనరానా ఉప్పొంగుతున్నాయి. దొరలు మనకు ఏమి చేస్తారన్నది కాక, దొరలకు మనం ఏమి చేయగలమన్నదే అందరం ఆలోచించాలనీ, అంత గొప్ప జాతికి కష్టకాలంలో చేతనైన మేరకు సహాయపడటమే భారతీయుల పవిత్ర కర్తవ్యమనీ ఆయన గట్టిగా నమ్మాడు. దొరల సేవలోనే తరించాడు.

మొదటి ప్రపంచ యుద్ధం మొదలయ్యే సమయానికి మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ సముద్రం మధ్య నౌకలో ఉన్నాడు. 21 ఏళ్ల దక్షిణాఫ్రికా వాసాన్ని ముగించి ఆయన సామాన్లు సర్దుకుని సతీసమేతంగా ఇండియాకు తిరిగొస్తున్నాడు. 24వ ఏట నిండు యౌవనంలో దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టేనాటికీ, 45 ఏళ్ల నడి వయసులో వెనక్కి మరలే నాటికీ మధ్య గాంధీ గుర్తుపట్టలేనంతగా మారాడు. ఆయన వ్యక్తిత్వంలో, ఆలోచనా విధానాల్లో, రాజకీయ, ఆధ్యాత్మిక, సామాజిక విశ్వాసాల్లో మౌలికమైన మార్పులొచ్చాయి. బిడియపడే బారిష్టరు స్థితి నుంచి అనర్గళంగా మాట్లాడి, వేల మందిని సమీకరించి, వినూత్న పంథాలో చరిత్రాత్మక పోరాటాలను నడిపి ఖండాంతర ఖ్యాతి గడించే స్థాయికి ఆయన ఎదిగాడు. గడచిన రెండు దశాబ్దాల్లో ఆయనలో మార్పులేకుండా స్థిరంగా ఉన్నదేదైనా ఉంటే అది ఇంగ్లీషు దొరల జాతి పట్ల మేరలేని భక్తి ఒక్కటే.

దక్షిణాఫ్రికాలో శ్వేత జాత్యహంకారాన్ని పదమూడేళ్ళు ప్రత్యక్షంగా తిలకించి, స్వయంగా తానే ఎన్నో అవమానాలకు లోనై, ఒళ్ళు హూనమయ్యేలా దెబ్బలు కూడా తిన్నాక... ఆసియన్లను, భారతీయులను దారుణమైన ఆంక్షలకు గురిచేసిన 'బ్లాక్ ఆర్డినెన్స్'ను రద్దుపరచమని బ్రిటిషు ప్రభుత్వాన్ని ప్రార్థించటానికి లండన్‌కి రాయబారం పోతూ... 1906 అక్టోబరులో ఇలాగే నౌకా ప్రయాణం చేసినప్పుడు ఇంగ్లీషు వారి గురించి తన అభిప్రాయాన్ని గాంధీజీ ఇలా రాసుకున్నాడు:

I find that the Englishman is not only full five cubits tall, match for five hundred but is capable in every other way... He alone knows how to give orders; and he knows how to take them.

In his behaviour he is great with the great and small with the small... Like the sea he can contain all within himself... Why indeed should such a people not rule ?

[*The Collected Works of Mahatma Gandhi,* Vol 5, # 348, PP 391-92]

(ఇంగ్లీషువాడు ఐదు మూరలు పైన పొడుగుండటమే కాదు. ఐదొందల మందికి సమ ఉజ్జీ కాగలడు. అన్ని విధాలా అతడు కడు సమర్థుడు... ఆర్డర్లు ఇవ్వటం ఎలాగో అతడికే తెలుసు. ఆర్డర్లను పాటించటమూ అతడికి తెలుసు. పెద్దల్లో పెద్దగా, చిన్నల్లో చిన్నగా అతడు ప్రవర్తిస్తాడు. సముద్రంలాగే అతడు ప్రతిదాన్నీ తనలో ఇముడ్చుకోగలడు. అటువంటివాళ్ళు ఎందుకు రాజ్యమేలకూడదు?)

ఆ తరువాత ఇంకో ఎనిమిదేళ్ళు మరిన్ని విషాదానుభవాలను చవిచూసి, శ్వేత ప్రభుత్వ ముష్కరత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహాలను నడిపి, సమ్మెలూ, మార్చ్‌లూ సాగించి చరిత్రాత్మక విజయం సాధించిన మీదట దక్షిణాఫ్రికా నుంచి శాశ్వతంగా సెలవు తీసుకుంటూ 1914 జులై 18న కేప్‌టౌన్‌లో గాంధీజీ ఇచ్చిన వీడ్కోలు సందేశం ఇది:

"Rightly or wrongly, for good or for evil, Englishmen and Indians have been knit together, and it behooves both the races so to mould themselves as to leave a splendid legacy... and to show that though Empires have gone and fallen, this Empire perhaps may be an exception and that this is an Empire not founded on material but on spiritual foundations."

[CWMG, Vol, 14, # 213, P.261]

(మంచికో చెడుకో ఆంగ్లేయులూ, భారతీయులూ ఒక దగ్గర కలిశారు. చరిత్రలో ఎన్నో సామ్రాజ్యాలు వచ్చాయి, కూలాయి. అయినా ఈ సామ్రాజ్యం ఇందుకు మినహాయింపనీ, భౌతికత మీద కాక ఆధ్యాత్మిక పునాదులపై ఇది స్థాపించబడిందనీ లోకానికి చాటి, రమ్యమైన వారసత్వాన్ని వదిలి వెళ్లే విధంగా ఈ రెండు జాతులూ కలగలసిపోవాలి.)

యావద్భారత జాతినీ తరతరాలుగా పిశాచంలా పీడిస్తూ, దుర్భర క్లేశాలకు గురిచేస్తున్న... సభ్య ప్రపంచమంతా ఏవగించుకుంటున్న బ్రిటిషు సామ్రాజ్యంలో "ఆధ్యాత్మిక పునాదుల"ను దర్శించిన మహనీయుడు కాబట్టే - అంతటి ఆధ్యాత్మిక సామ్రాజ్యానికి యుద్ధపు కష్టం వచ్చిందని తెలియగానే గాంధీగారి హృదయం ద్రవించింది. ఎప్పుడెప్పుడు వెళ్లి ఆ మహాసామ్రాజ్యానికి ఉడతాభక్తిగా ఓపినంత సేవను చేద్దామా అని ఆయన మనసు తహతహలాడింది.

మామూలుగా అయితే దక్షిణాఫ్రికా నుంచి ఇండియాకు ప్రయాణానికి లండన్ మీదుగా వెళ్లనక్కరలేదు. అయితే లండన్‌లో గాంధీ రాజకీయ గురువు గోపాలకృష్ణ గోఖలేగారు మకాంచేసి ఉన్నారు. ఇండియా తిరిగి వెళ్లే ముందు తనను కలిసి వెళ్లమని ఆయన "ఆదేశించా"రట. (దీని వెనకాల ఒక మతలబు ఉంది. ఆ సంగతి తరవాత) గురువు ఆజ్ఞను శిరసావహించి లండన్ దాపున ఇంగ్లీషు ఛానల్‌లో ప్రవేశించిన రోజే (1914 ఆగస్టు 14న) యుద్ధ ప్రకటన వార్త గాంధీగారి చెవిన పడింది. తీరా వెళ్లేసరికి గురువుగారు లండన్‌లో లేరు. వైద్య చికిత్స నిమిత్తం పారిస్ వెళ్లి అక్కడే చిక్కుబడిపోయారు. యుద్ధంవల్ల కమ్యూనికేషన్లు విచ్ఛిన్నమైనందున ఎలా ఉన్నారో, ఎప్పుడొస్తారో కబురందే వీలు లేదు. ఆయన వచ్చేదాకా ఖాళీగా ఉండకుండా యుద్ధ సమయంలో భారత పౌరుడిగా తనవంతు పవిత్ర కర్తవ్యాన్ని నెరవేర్చటానికి గాంధీ తక్షణమే నడుము బిగించాడు.

అమెరికాలోని గదర్ పార్టీ విప్లవకారుల లాగా, ఇండియాలో తిలక్ వంటి ప్రముఖ జాతీయ నేతల లాగా గాంధీగారూ ప్రపంచ యుద్ధాన్ని అపురూపమైన అవకాశంగా భావించారు. ఎటొచ్చీ ఒకటే తేడా. మిగతా వారేమో భారతదేశ చిరకాల వాంఛితమైన స్వరాజ్యాన్ని సాధించటానికి యుద్ధాన్ని సదవకాశంగా తలిచారు. గాంధీగారేమో బ్రిటిషు సామ్రాజ్యం పట్ల తన విధేయతను నిరూపించుకుని, బేషరతు సేవల ద్వారా తెల్లదొరల మెప్పుపొంది వారిని ప్రసన్నం చేసుకోవటానికి బంగారం లాంటి అవకాశం వచ్చిందని సంబరపడ్డారు. అర్జంటుగా గ్రేట్ బ్రిటన్, ఐర్లండులలోని భారత జాతీయులను మిత్రుల సాయంతో సమావేశపరచి కర్తవ్యబోధ చేశారు. తరవాత ఏమైందీ గాంధీగారి మాటల్లోనే చదవండి :

ఇంగ్లండులో నివసిస్తున్న భారతీయులు, తమ వంతు పనిచేయాలని నేనన్నాను. ఇంగ్లీషు విద్యార్థులు ఆర్మీలో చేరడానికి అప్పటికే ముందుకొచ్చినందున ఇండియన్లూ వారికి తీసిపోకూడదన్నాను. దీని మీద చాలా అభ్యంతరాలొచ్చాయి. ఇంగ్లీషు వారికీ భారతీయులకూ చాలా తేడా ఉంది. వారు యజమానులు, మనం బానిసలం; యజమాని అవసరానికి బానిస ఎందుకు సాయపడాలి? యజమాని అవసరాన్ని అవకాశంగా తీసుకోవటమే స్వేచ్ఛకోరే బానిసల కర్తవ్యం కదా - అని ! ఈ వాదన నాకు నచ్చలేదు. ఇంగ్లీషువాడికీ భారతీయుడికీ మధ్య హోదాలో అంతరం నాకు తెలియనిది కాదు. మనం మరీ బానిసత్వ స్థాయికి దిగజార్చబడ్డామంటే మాత్రం నేను ఒప్పుకోలేకపోయాను. తప్పంతా కొంతమంది బ్రిటిషు అధికారులదే తప్ప బ్రిటిషు వ్యవస్థది కాదనీ, వారిలో కూడా ప్రేమతో పరివర్తన తేవచ్చునీ నేను భావించాను. బ్రిటిషు వారి సహాయ సహకారాలతో మన పరిస్థితిని మెరుగుపరచుకోదలచినప్పుడు, కష్టకాలంలో వెంట నిలవటం ద్వారా వారి సుహృద్భావాన్ని పొందటం మన విధి. వ్యవస్థ లోపభూయిష్టమైనా మరీ

ఇప్పుడున్నంత దుర్భరంగా నాకు అప్పుడు కనిపించలేదు. భారతీయుల ప్రతిపత్తిని పెంచే డిమాండ్లను ఇదే అదనులో ధైర్యంగా ప్రకటించాలని నన్ను వ్యతిరేకించిన మిత్రులు అభిప్రాయపడ్డారు. ఈ సంకటాన్ని అవకాశంగా తీసుకొనరాదనీ, యుద్ధం నడిచినంత కాలమూ మన డిమాండ్లపై ఒత్తిడి చేయకుండా ఉండటమే భావ్యమనీ నేనన్నాను. ఈ వైఖరికే దృఢంగా కట్టుబడి యుద్ధానికి వలంటీర్లుగా ఎవరొస్తారో రండి అన్నాను. మంచి రెస్పాన్సే వచ్చింది. తరవాత లార్డ్ క్రెవీకి ఇదంతా తెలుపుతూ ఉత్తరం రాశాను. అంబులెన్సు పనిలో మాకు శిక్షణ ఇప్పించమన్నాను. కష్టకాలంలో సామ్రాజ్యానికి సేవ చేయదలిచినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఆయన మా ఆఫరును స్వీకరించాడు.

[*My Experiments with Truth,* M.K. Gandhi, PP 289 - 290]

అక్షర లక్షలు విలువచేసే రత్నాల్లాంటి మాటలివి ! భారతదేశంపై తెల్లవారి దారుణ దురాక్రమణను, భారతీయులకు వారు చేసిన నమ్మక ద్రోహాలకు, పెట్టిన క్షోభలకు, సాగించిన నికృష్టపు దోపిడీలకు, అమానుష ఘాతుకాలకు ధైర్యంగా ఎదురు నిలిచి, వీరోచితంగా తరాల తరబడి పోరాడిన వీరపాండ్య కట్టబ్రహ్మన, టిప్పుసుల్తాన్, సిరాజుద్దౌలా, రాణి లక్ష్మీబాయి, హజరత్ మహల్ వంటి ఎందరో జాతీయవీరుల ఆత్మలు అభినవ మహాత్ముడు వెలిబుచ్చిన ఈ బ్రిటిష్‌భక్తిపూర్వక అమూల్యాభిప్రాయాలను ఆలకించి ఉంటే పట్టరాని సంతోషంతో గంతులేసి ఉంటాయనటంలో సందేహమా ?

చరిత్రకెక్కని చీకటికోణం

మనమెరిగిన గాంధీ వ్యక్తి కాదు - మహాశక్తి, రాజీపడని పోరాటమూర్తి. ఆపన్నుల అదృష్టం కొద్దీ ఆయన దక్షిణాఫ్రికా వెళ్లాడు. కరుడుగట్టిన శ్వేత ప్రభుత్వం చేతుల్లో అక్కడి భారతీయులు అనుభవిస్తున్న దారుణ వర్ణ వివక్షను చూశాడు. సత్యాగ్రహశంఖం పూరించి, ధర్మయుద్ధం సాగించి, అహింసాయుతంగా, నియమబద్ధంగా ఎన్నో ఉద్యమాలు నడిపి, దక్షిణాఫ్రికా దొరతనాన్ని మెడలు వంచి దారికి తెచ్చాడు. అక్కడి భారతీయులను ఉద్ధరించే పని జయప్రదంగా పూర్తి కాగానే భారతదేశానికి మరలాడు. వెళుతూ వెళుతూ ఇంపీరియల్ రాజధాని లండన్‌లో ఆగాడు.

అలాంటప్పుడు అంతటి ఉద్యమ నాయకుడిని చూసి సామ్రాజ్యవాదుల గుండెలదరాలి కదా ? ఖండాంతరాన దక్షిణాఫ్రికాలోనే తమ విధానాలను ఎండగట్టి నానా యాగీ చేసి, తమ పరువు పీకి పాకం పెట్టినవాడు తమ సామ్రాజ్యానికి గుండె కాయ వంటి భారతదేశానికే మరలిపోతున్నాడంటే అక్కడ ఇంకేమి ఆగంచేస్తాడో, తమ పెత్తనపు పుట్టి ఎక్కడ ముంచుతాడోనని తెల్లదొరతనం చిరచిరలాడాలి కదా ? అందునా ప్రపంచ యుద్ధం ముంచుకొచ్చి, బ్రిటిష్ సామ్రాజ్య భవితవ్యమూ, ఆఖరికి గ్రేట్ బ్రిటన్ భద్రత కూడా పెను ప్రమాదంలో పడిన విపత్కాలంలో తమ రాజధానిలోకి ఇతడెందుకు దాపురించాడా అని మామూలుగా అయితే మహాచిరాకు పడాలికదా ? అతడెక్కడికి వెళతాడు; ఎవరిని కలుస్తాడు; ఏ ప్రయత్నాలమీద ఉన్నాడు అన్నవి ఆరాతీయటానికి అతడిమీద గట్టి నిఘా పెట్టాలి కదా? కారల్ మార్క్స్ నుంచి కృష్ణవర్మల వరకూ ఎక్కడెక్కడి దేశాలనుంచో వచ్చిన "అనుమానాస్పద వ్యక్తుల" కార్యకలాపాలను ఎల్లవేళలా ఒక కంట కనిపెట్టి... సావర్కార్ లాంటి విప్లవకారులను నీడలా వెంటాడిన ఆంగ్ల ప్రభువులు అంతకంటే కూడా ప్రమాదకరమైన - మెత్తని కత్తిలాంటి గాంధీ విషయంలో ఇంకా జాగ్రత్తపడి, ఇంకా ఎక్కువ ప్రతికూల వైఖరి కనపరచి ఉండాలి కదా ?

ఆశ్చర్యం ! బ్రిటిషు ప్రభుత్వానికి గాంధీ పట్ల ఎలాంటి వ్యాకులతా లేదు. ఈషణ్మాత్రం ప్రతికూలతా లేదు. అంతేకాదు. సామ్రాజ్యానికి శ్రేయోభిలాషి, గొప్ప మిత్రుడు సమయానికి ఆపద్బాంధవుడిలా వచ్చినట్టు గౌరవ మర్యాదలూ జరిగాయి. మచ్చుకు తెండుల్కర్ Mahatma గ్రంథంలోని ఈ వాక్యాలను చిత్తగించండి.

On August 8 a reception was given to Gandhi at Cecil Hotel by his British and Indian admirers... Letters of regret for their unavoidable absence were received from the Premier, Secretary of State for India, Gladstone, Curzon, Ampthill, Ramsay MacDonald and Gokhale. Gandhi, returning thanks, referred to the great crisis and hoped his Indian friends would "think imperially... and do their duty"

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I P 155]

(ఆగష్టు 8న గాంధీకి సెసిల్ హోటల్లో, బ్రిటిష్, భారతీయ అభిమానులు రిసెప్షను ఇచ్చారు. అనివార్య కారణాలవల్ల ఆ కార్యక్రమానికి హాజరుకాలేకపోయినందుకు విచారాన్ని వ్యక్త పరుస్తూ బ్రిటిష్ ప్రధాని, భారత విదేశాంగ మంత్రి, గ్లాడ్‌స్టోన్, కర్జన్ ఆంప్థిల్, రామ్‌సే మెక్‌డోనాల్డ్, గోఖలేల నుంచి లేఖలందాయి. తనకు జరిగిన గౌరవానికి ధన్యవాదాలు తెలుపుతూ గాంధీ మహాసంక్షోభాన్ని ప్రస్తావించాడు. ఈ తరుణంలో తన భారతీయ మిత్రులు సామ్రాజ్య దృక్కోణంనుంచి ఆలోచించి, తమ విధి నిర్వర్తించగలరన్న ఆశాభావం వ్యక్తంచేశాడు.)

1914 ఆగస్టు 6న లండన్‌లో అడుగుపెట్టాక మూడోరోజునే ప్రభుత్వాధినేతలను, బ్రిటిష్ రాజకీయ ప్రముఖులను ఆహ్వానించి, గాంధీ గౌరవార్థం పెద్ద రిసెప్షను ఏర్పాటు చేశారంటే దానికి సంబంధించిన సన్నాహాలు ఆయన ఓడలో ఉండగానో, ఓడెక్కటానికి ముందో మొదలై ఉండాలి. ప్రధాన మంత్రి, విదేశాంగమంత్రి అంతటివారే ఆ ఆహ్వానాన్ని ఆషామాషీగా తీసిపడెయ్యకుండా, రాలేకపోతున్నందుకు విచారం ప్రకటిస్తూ జాబు రాశారంటే ఆ కార్యక్రమానికి బ్రిటిషు పాలకవర్గం ఇచ్చిన ప్రాధాన్యాన్ని అర్థంచేసుకోవచ్చు, ప్రపంచ యుద్ధం మొదలై, జర్మనీ మీద స్వయానా బ్రిటనే యుద్ధం ప్రకటించి హోరాహోరీగా పోరాడుతున్న సమయం కాబట్టి తీరిక చిక్కక రాలేకపోయారుగాని మామూలు రోజుల్లో అయితే ప్రధానమంత్రి సహా ఆహూతులందరూ బహుశా విచ్చేసేవారే. హాజరుకాలేక విచారపడ్డ ప్రముఖుల పేర్లను బట్టే రిసెప్షనుకు ఏస్థాయివారు హాజరై ఉంటారో ఊహించవచ్చు.

దక్షిణాఫ్రికా ఉద్యమ నాయకుడి హోదాలో గాంధీ లండన్‌కు వెళ్లటం ఇది మూడోసారి. 1906 అక్టోబరు 20న తొలిసారి అక్కడికి వెళ్లినప్పుడు దాదాభాయ్ నౌరోజీని, ఆయన

ద్వారా భారత జాతీయ కాంగ్రెసు వారి బ్రిటిష్ కమిటీని పట్టుకుని తంటాలుపడి, వారిని కూడా వెంట తీసుకువెళితే గాని విజ్ఞాపన పత్రం దాఖలు చేసుకోవడానికి బ్రిటిష్ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రుల దర్శనం దొరకలేదు. 1908 జులై 10న రెండో పర్యాయం వెళ్లి నాలుగు నెలలున్నా దక్షిణాఫ్రికా జాతి వివక్ష దుర్విధానాలపై ఆయన చెప్పేది బ్రిటిష్ బ్యూరోక్రాట్లు గాని, రాజకీయ ప్రముఖులు గాని, బొత్తిగా పట్టించుకోలేదని ఆయనే చికాకు పడ్డాడు. అలాంటిది 1914 కల్లా గాంధీ పట్ల బ్రిటిషు పాలకుల వైఖరి పూర్తిగా మారి, ఆయనకు అసాధారణ ప్రాధాన్యం ఇవ్వటం భారతీయులుగా మనకి గర్వకారణమే. అయితే సత్యాగ్రహతత్వాన్నీ, గాంధీ బోధల ప్రాశస్త్యాన్ని నెమ్మది మీద గుర్తించటం వల్లే... దక్షిణాఫ్రికా ధర్మపోరాటంలో ఘన విజయంతో ఆయన గొప్పతనం అవగతం కావటంవల్లే గాంధీ పట్ల ఆంగ్లేయుల వైఖరి మారిందా? బ్రిటిషు పౌర సమాజంలో గాంధీకి పెరిగిన మన్ననే బ్రిటిషు పాలకవర్గం కొత్త ధోరణిలో ప్రతి ఫలించిందా?

గాంధీ యుద్ధానికి తన సేవలందించటానికి సిద్ధపడ్డాడన్న వార్త ఆయన అభిమానులను నిశ్చేష్టులను చేసింది. దక్షిణాఫ్రికాలో పోలక్ వంటి చిరకాల సహచరులకైతే నెత్తిన పిడుగుపడినట్టయింది. ఇంతవరకూ అహింసే పరమధర్మమని పలికి, ఇప్పుడు పోయి పోయి హింసాత్మక యుద్ధానికి సేవలందించటమేమిటని గాంధీని నిలదీస్తూ వారు ఎన్నో కేబుల్సు పంపారు. యుద్ధ హింసను నిరోధించే శక్తి తనకు లేదు కనుక... ఇంతకాలమూ తాను రక్షణ పొందుతున్న సామ్రాజ్యం పక్షాన యుద్ధంలో సేవలందించ టంలో తప్పులేదన్న గాంధీ సమర్థింపు ఎవరినీ తృప్తిపరచలేదు. తన అభిమానులకు, అనుచరులకు తీవ్ర మనస్తాపం కలిగిస్తున్నానని తెలిసినా, తాను అభిమానించే బ్రిటిషు మహాసామ్రాజ్యానికి విధేయతను నిరూపించుకునే సావకాశాన్ని గాంధీ వదులుకో దలచలేదు. ఎవరేమనుకున్నా సరే మిగతా యూరోపియన్లలా మనమూ యుద్ధంలో సేవచేద్దాం అని గాంధీ ప్రేరేపిస్తే లండన్లో 80 మంది భారత జాతీయులు ముందు కొచ్చారు. ఆ వైనాన్ని విన్నవించి అంబులెన్సు పనికి మమ్మల్ని వినియోగించుకోండి అని గాంధీ కోరగా ప్రభుత్వం సరేనని వారికి శిక్షణ ఇచ్చే పని ఒక సైనిక అధికారికి అప్పగించింది. అతడేమో మామూలు పద్ధతి ప్రకారం శిక్షణార్థులందరినీ సమానంగా పరిగణించి ట్రెయినింగు మొదలెట్టాడు. అది గాంధీకి నచ్చలేదు. 80 మందినీ తాను పట్టుకొచ్చాడు కనక వారికి లీడరుగా తనను గుర్తించి, అన్నీ తన ద్వారానే జరిపించాలని ఆయన కమాండింగు ఆఫీసరుతో తగవు పెట్టుకున్నాడు. రూల్సు ప్రకారం అది కుదరదు పొమ్మని ఆఫీసరు అన్నాడు. దానిమీద తనకుందని తాననుకునే నాయకత్వ హక్కును

నిలబెట్టుకోవటానికి గాంధీగారు ఆయనే ఆత్మకథలో అభివర్ణించినట్టు "మినీ సత్యాగ్రహానికి" దిగాడు.

సత్యాగ్రహ ఆయుధాన్ని వ్యక్తిగత అహాల కోసం ఈ రకంగా కూడా వాడుకోవచ్చుని మహాత్ముడు జగతికి బోధించడం బాగే. కాని - ఈ శషభిషలకు తెల్లవాళ్లు బెసగలేదు. ఏకంగా ఇండియా వ్యవహారాల విదేశాంగ మంత్రికి గాంధీ పితూరీ చేసినా ప్రయోజనం లేకపోయింది. కమాండింగు ఆఫీసరు చేసింది కరక్టేనని మంత్రికూడా చెప్పటంతో చేసేదిలేక గాంధీ మిన్నకుండిపోయాడు. అంతలో ప్లూరసీ వచ్చి ఆయన జబ్బుపడ్డాడు. ఇదీ లండన్ మకాం విశేషాల గురించి గాంధీ స్వయంగా చెప్పుకున్నది. ఇందులో బ్రిటిష్ ప్రజలను ఆయన సమ్మోహితం చేసి ఘన నీరాజనాలందుకున్న దృశ్యమేదీ కనిపించదు. యుద్ధ సేవలో కూడా అహానికి, స్వాతిశయానికి పోయి నలుగురిలో నగుబాటుపాలైన సాధారణ మానవుడిగానే ఆయన మన కంటికి అగుపిస్తాడు.

పతాక సన్నివేశంలో ఇండియా వైస్రాయ్ లార్డ్ హార్డింజ్ చొరవ తీసుకున్నాకే దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమం చక చకా సుఖాంతం అయిన సంగతీ... గోఖలే ద్వారా వైస్రాయికీ గాంధీకీ నడుమ సలహా సంప్రదింపులు ఆ ఘట్టంలో జోరుగా నడిచిన వైనాన్నీ గుర్తుంచుకుంటే గాంధీ చేత ఇండియాకు తిరుగు ప్రయాణం కట్టించటం వెనుకా బ్రిటిషు వైస్రాయ్ ప్రమేయం ఉందన్న అనుమానం సహజంగానే కలుగుతుంది.

"At the conclusion of the Satyagraha struggle in 1914. I received Gokhale's instruction to return home via London"

(1914లో సత్యాగ్రహ పోరాటం ముగిశాక నాకు లండన్ మీదుగా ఇండియాకు తిరిగి వెళ్లనున్న ఆదేశం గోఖలేనుంచి అందింది) అని **'ఆత్మకథ'**లో గాంధీ రాశారు. గోఖలేకీ వైస్రాయికీ నడుమ అరమరికలు లేని సన్నిహిత సంబంధాలను, గతంలో గోఖలే ద్వారా తన మనోగతాన్ని గాంధీకి వైస్రాయి తెలియపరచిన విధాన్ని గుర్తుంచుకుంటే వెనక్కి రమ్మన్న ఈ 'ఆదేశం' కూడా గోఖలే ద్వారా హార్డింజ్ దొర పంపిందేనని ఊహించవచ్చు. గాంధీ లండన్ చేరిన మూడో రోజే ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి స్థాయి వాళ్లను ఆహ్వానించి భారీ రిసెప్షను ఏర్పాటు చేయటాన్నిబట్టి అక్కడ గడిపిన మిగతా రోజుల్లో ఆయన ఖాళీగా ఉన్నాడని అనుకోలేము. ఇంపీరియల్ మహానగరంలో ఉన్న నాలుగు నెలల పైచిలుకు కాలంలోనూ గాంధీకీ, బ్రిటిష్ పాలక ప్రముఖులకూ నడుమ సమాలోచనలు జరిగి ఉండాలి. వాటి గురించి గాంధీ చెప్పలేదు. పుంఖాను పుంఖాలుగా వెలువడిన గాంధీ జీవిత చరిత్రల్లోనూ ఆ ప్రస్తావన లేదు. 1914 ఆగస్టు 6న లండన్‌లో కాలు మోపింది మొదలుకుని డిసెంబరు 19న ఇండియాకు

ఓడెక్కినంతవరకూ గాంధీ కార్యకలాపాల గురించి అక్కర్లేని విషయాలెన్నో ఏకరువు పెట్టిన The Collected Works of Mahatma Gandhi గ్రంథావళిలో ఇందుకు సంబంధించిన సమాచారం కళ్లుపొడుచుకుని వెదికినా దొరకదు. తననక్కడికి పిలిచిన గురువు గోఖలే దేశాంతరంలో చిక్కుకుపోయినందున ఆయనకోసం ప్రతీక్షిస్తూ, ఆధిపత్య హక్కులకోసం మినీ సత్యాగ్రహం వంటి పిడకల వేటలాడుతూ, గోఖలేగారొచ్చాక ఆయనతో ప్లూరసీకి చికిత్స, పథ్యాపథ్యాల గురించి ముచ్చటిస్తూ గడిపినట్టు గాంధీగారు చెప్పుకున్నారు. ఆయనను ప్రత్యేకంగా అక్కడికి పిలిపించినవారు రిసెప్షనుకు గైర్హాజరయ్యాక ఆయనను కలవకుండా, కనీసం మధ్యవర్తుల ద్వారా సంభాషించకుండా, ఎలాంటి సందేశాలు పంపకుండా మిన్నకుండి పోయారంటే నమ్మటం కష్టమే.

ఇదమిత్థమైన రుజువు, ఆధారం ఏదీ లేనప్పుడు ఊహాగానాలు చేయటం సరికాదు. చరిత్రకారులు, పరిశోధకులు ఎవరూ ఇటుకేసి దృష్టిసారించక, తెలిసిన సమాచారాన్నే చర్వితచర్వణం చేసినంత మాత్రాన బ్రిటిషు పాలకులు లండన్‌లో ఉన్నంతకాలమూ గాంధీ ఊసే పట్టించుకోలేదని విశ్వసించలేము. వైస్రాయి ద్వారానో, గోఖలే ద్వారానో కబురంపి గాంధీని ప్రత్యేకంగా లండనుకు పిలిపించింది బ్రిటిషు ప్రభువులే అనటానికి తిరుగులేని రుజువైతే లేదు కాని ఆయనను లండన్ నుంచి ఇండియాకు బయలుదేరతీసింది మాత్రం కచ్చితంగా వారే. ఆ సంగతి **తెండుల్కర్** గ్రంథంలో స్పష్టంగా ఉంది.

For many days Gandhi was obliged to keep mostly in bed. Mr. Roberts, Under-Secretary of State, visited Gandhi and said "I would strongly advise you to get back to India for it is only there that you can be completely cured. If, after your recovery, you should find the war still going on, you will have many opportunities there of rendering help...

Owing to deterioration in his condition and relapses in Kasturbai's health Gandhi accepted Mr. Roberts' advice and began to make preparations to return to India.

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I P 156]

(గాంధి చాలారోజులు జబ్బుతో మంచానపడ్డాడు. ఉప విదేశాంగ మంత్రి మిస్టర్ రాబర్ట్స్ ఆయనను దర్శించి "మిమ్మల్ని ఇండియాకు మరలిపొమ్మని గట్టిగా సలహా ఇస్తున్నాను. అక్కడైతేనే మీకు జబ్బు పూర్తిగా నయమవుతుంది. కోలుకున్నాక కూడా ఇంకా యుద్ధం నడుస్తూంటే, అక్కడ ఉండే సహాయం చేయటానికి మీకు చాలా అవకాశాలు వస్తాయి" అని చెప్పాడు.

తన పరిస్థితి క్షీణించినందువల్ల, కస్తూరిబాయికీ జబ్బు తిరగబెట్టినందువల్ల, మిస్టర్

రాబర్ట్స్ సలహాకు సమ్మతించి, ఇండియాకు తిరుగు ప్రయాణానికి గాంధీ ఏర్పాట్లు మొదలెట్టాడు.)

వైద్య సదుపాయాలు పరాధీన భారతదేశంలోకంటే లండన్ మహానగరంలోనే ఎక్కువ. లండన్‌నుంచి ఇండియాకు ప్రయాణమంటే ఇప్పటిలా జెట్ విమానంలో ఐదారు గంటల్లో ఎగిరిపోగలిగింది కాదు. సముద్రంలో ఉప్పుగాలులు పీలుస్తూ ఓడమీద మూడు వారాలు గడపాలి. మధ్య దారిలో జబ్బు విషమిస్తే సరైన వైద్య సహాయం అందుబాటులో ఉంటుందన్న నమ్మకంలేదు. ఐనా - రోజుల తరబడి మంచాన పడి ఉన్న గాంధీని వెంటనే ఇండియా వెళ్లిపొమ్మని బ్రిటిషు మంత్రి (ఆదేశం లాంటి) సలహా ఇచ్చాడు. తానే లేవలేని స్థితిలో ఉన్నా, ప్రయాణంలో భార్యయినా ఆసరాగా ఉంటుందన్న ఆశ కూడా లేకుండా ఆమెకు సైతం రోగం తిరగబెట్టినా గాంధీగారు లక్ష్యపెట్టలేదు. తన క్షేమం, ఇల్లాలి కుశలం కంటే సామ్రాజ్య క్షేమమే మిన్నగా తలిచి, ఛోటా మంత్రి వచ్చి పొమ్మనగానే దిగ్గున కదిలి, "పక్కటెముకలకు బాండేజి కట్టుకుని" హుటాహుటిన ఇండియాకు స్టీమరెక్కాడు. శభాష్ ! తెల్లదొరల సామ్రాజ్యానికి విధేయత అంటే అది !

ఏమాటకామాటే చెప్పుకోవాలి. అంత రిస్కు తీసుకుని ఎక్కమనగానే మారు మాట్లాడక నౌక ఎక్కినందుకు తెల్లదొరలూ గాంధీగారిని బాగానే చూసుకున్నారు. ఇవ్వవలసిన దానికంటే ఎక్కువ గౌరవమే ఇచ్చారు. సామ్రాజ్య విధేయుడిగా, సామ్రాజ్య సేవచేసి, సామ్రాజ్య సేవకోసమే ఇండియాకు తిరిగి వచ్చిన గాంధీకి బొంబాయి చేరగానే ఎవరూ ఊహించనంత, అంతకుముందు బహుశా ఏ భారత రాజకీయ నాయకుడికీ జరగనంత రాచమర్యాద చేసి, చూచువారలకు అచ్చెరువుగొలిపారు. ఆ అపూర్వ సత్కారం ఎంత ఘనమైనదో **డి.జి.తెండుల్కర్** చెబుతాడు వినండి.

Gandhi landed in Bombay on January 9, 1915. The Indian leaders met him on the steamer upon its arrival, and his landing took place, by the permission of the authorities, at the Apollo Bunder an honour shared with the Royalty, by the Viceroys and India's most distinguished sons.

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I P 157]

(గాంధీ 1915 జనవరి 9న బొంబాయిలో దిగాడు. రాగానే స్టీమర్ మీదే భారతీయ నాయకులు ఆయనను కలిశారు. అధికారుల అనుమతితో అపోలో బందర్ రేవులో ఆయన స్టీమరును దిగనిచ్చారు. అది బ్రిటిషు రాజ కుటుంబీకులకు, వైస్రాయిలకు, అత్యంత విశిష్టత పొందిన భారత పుత్రులకు మాత్రమే దక్కే గొప్పగౌరవం.)

'విశిష్ట భారతీయులకు కూడా' అని తెండుల్కర్ ఎందుకైనా మంచిదని జోడించినప్పటికీ ఆయన పేర్కొన్న గౌరవం అంతకుముందు దాదాభాయ్ నౌరోజికి గాని, సురేంద్రనాథ్ బెనర్జీకి గాని, విశిష్ట భారత పుత్రులు ఇంకెవరికి గాని దక్కిన దాఖలాలు లేవు. బ్రిటిష్ రాజ కుటుంబీకులు, వైస్రాయిలు వంటి అత్యున్నత స్థాయి వారికి దక్కే ప్రత్యేక ప్రివిలేజిని గాంధీకి సమకూర్చడాన్నిబట్టి ఇండియాలో అడుగుపెట్టిన క్షణంనుంచీ ఆయనను రాజబంధువుగానే, ఆంగ్ల సామ్రాజ్యంలో అత్యున్నత ప్రాధాన్యం కలిగిన బ్రిటిషు మిత్రుడిగానే తెల్లదొరతనం సంభావించిందని స్పష్టం. అన్నట్టు- ఇండియాకు వచ్చిన ఐదునెలలకే బ్రిటిష్ సామ్రాజ్యానికి అందించిన విశిష్ట సేవలకుగాను 'ప్రతిష్ఠాత్మకమైన' కైజర్ ఎ - హింద్ స్వర్ణ పతకాన్ని కూడా సర్కారువారు బహూకరించారు.

దేశాన్ని చెరబట్టి చిరకాలంగా కాల్చుకు తింటున్న బ్రిటిషు పాలకులకూ గాంధీకీ నడుమ ఆదినుంచీ విరాజిల్లిన ఈ అసాధారణ సుహృద్భావాన్ని దృష్టిలో ఉంచుకుంటే తప్ప అనంతర కాలంలో భారత రాజకీయాల్లో గాంధీ పోషించిన పాత్ర అర్థం కాదు.

ద్వితీయ స్వాతంత్ర్య సంగ్రామం

1857లో జరిగింది భారత స్వాతంత్ర్య తొలి సంగ్రామమైతే... మలి సంగ్రామం ఎప్పుడు జరిగింది? మూడో సంగ్రామం కూడా ఉందా ? చాలా మంది మేధావులు దీనికి జవాబుకోసం క్షణం కూడా తుడుము కోరు. 1, 2, 3 అంటూ స్వాతంత్ర్య పోరాటానికి నెంబర్లేవీ లేవు; జరిగింది ఒకే ఒక సంగ్రామం; అది మహాత్మాగాంధీ సారథ్యంలో జరిగింది; 1857లో ఫ్యూడల్ శక్తులు ప్రేరేపించిన సిపాయిల తిరుగుబాటుకు సావర్కార్ లాంటి వాళ్ళు ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామమని పెద్ద పేరు పెట్టినా దానికి స్వాతంత్ర్య యుద్ధ లక్షణాలేమీ లేవు - అనడంలో వారికి ఎంతమాత్రం సందేహం లేదు.

1857లో జరిగిన దాన్ని మొదటి జాతీయ సమరంగా అంగీకరించేవారు కూడా రెండోది ఏదంటే - గాంధీగారు నడిపించిన సత్యాగ్రహ ఉద్యమాన్నే చూపిస్తారు. మూడోదాన్ని కూడా ఎంచుకోక తప్పదంటే - సుభాస్‌చంద్రబోస్ దేశాంతరంలో చేసిన యుద్ధాన్ని తటపటాయిస్తూ పేర్కొంటారు.

చాలామందికి తెలియని, తెలిసినా చాలామంది మేధావులు గుర్తించని వాస్తవ మేమిటంటే... గాంధీగారు జాతీయోద్యమ రంగప్రవేశం చేయడానికి సంవత్సరం పూర్వమే మన దేశంలో ద్వితీయ స్వాతంత్ర్య మహాసంగ్రామం మొదలైంది. 1857 నాటి తొలి యుద్ధంకంటే పకడ్బందీగా, 1940ల్లో నేతాజీ సాగించిన దానికంటే విస్తృతంగా అది రెండేళ్ళకు పైగా మహోద్ధృతంగా సాగింది. ఆ రెండింటిలాగే ఇదీ కర్మంచాలక విఫలమైంది. కాబట్టి వాటిలాగే మరపున పడింది. ఇంకా చెప్పాలంటే - ఆ రెండు చరిత్రాత్మక సంగ్రామాలను గుర్తుపెట్టుకుని, భక్తితో తలిచేవారికి కూడా నడుమ జరిగిన అంతర్జాతీయ స్థాయి మహాపోరాటం గురించి ఏమంత తెలియదు.

భారత జాతీయోద్యమ చరిత్ర తెలుసుననుకునేవారు సాధారణంగా అనుకునేది ఏమిటంటే... దక్షిణాఫ్రికాను ఉద్ధరించే పని ముగించుకుని గాంధీగారు 1915 మొదట్లో

ఇండియాకు తిరిగి వచ్చింది మొదలుకుని 1920లో ఆయన సమరశంఖం పూరించి సహకార నిరాకరణ మహోద్యమాన్ని మొదలెట్టేదాకా ఐదేళ్లపాటు జాతీయ పోరాటం స్తబ్ధంగా ఉంది. చంపారన్, ఖేదాజిల్లాల్లో పరిమిత స్థాయిలో భారత స్వాతంత్ర్యానికి బాలశిక్షగా మహాత్ముడు జయప్రదంగా సాగించిన సత్యాగ్రహ, పన్ను నిరాకరణ పోరాటాలే ఈమధ్య కాలంలో చెప్పుకోదగ్గవిశేషాలు- అని! నిజానికి దేశ దేశాల్లోని ప్రవాస భారతీయులు వేల సంఖ్యలో సంఘటితమై, ఇతర దేశాల మద్ధతుతో, విదేశీ ప్రభుత్వాల క్రియాశీల సహకారంతో బృహత్ వ్యూహం ప్రకారం భారతదేశం లోపలా వెలుపలా ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో సాగించిన మహా సమరంతో పోల్చితే పైన పేర్కొన్న గాంధీ విజయాలు చిన్న టుమ్రీలు !

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో జర్మనీ కంటే, శత్రు కూటమిలోని మరే దేశం కంటే ఎక్కువగా ఇంగ్లిషు వారిని హడలగొట్టింది 'గదర్' అనే మూడక్షరాల మాట. అది ఏమిటి? ఎందుకు పుట్టింది? దేనికోసం ఎలా పనిచేసింది? వీటికి జవాబులను గజగజలాడిన ఇంగ్లీషువారినే అడుగుదాం. న్యూఢిల్లీలోని ఇంటలిజెన్స్ బ్యూరో డైరెక్టరు బ్రిటిషు సర్కారుకు ఇచ్చిన రహస్య నివేదికలో గదర్ గురించి చెప్పిందిది:

The word Ghadar means mutiny... It is aimed at bringing about a revolution in India in order to secure liberation from British control. The headquarters of the Ghadar party were established in San Fransisco and the party published their own paper known as Ghadar... ... the object being to instil patriotic feelings in young Indians and train them for a rising in India.

('గదర్' మాటకు అర్థం మ్యూటినీ (సైనిక తిరుగుబాటు)... బ్రిటిషు కంట్రోలు నుంచి విముక్తికోసం ఇండియాలో విప్లవాన్ని తేవటం ఈ సంస్థ లక్ష్యం. గదర్ పార్టీ హెడ్ క్వార్టర్సు శాన్‌ఫ్రాన్సిస్కో. 'గదర్' అనే పేరుతోటే సొంత పత్రికను కూడా పార్టీ ప్రచురించింది. భారతీయ యువతలో దేశభక్తిభావాలను రగిలించి, ఇండియాలో తిరుగుబాటుకు తర్ఫీదు ఇవ్వటం ఈ సంస్థ ఆశయం.)

ఇదే విషయాన్ని 1913 నవంబరు 1న గదర్ పత్రిక తొట్టతొలి సంచికలో మొట్టమొదటే సూటిగా తేటగా ఇలా ప్రకటించారు.

మా పేరేమిటి? మ్యూటినీ ! మా పనేమిటి ? మ్యూటినీ ! అది ఎక్కడ జరుగుతుంది? ఇండియాలో, ఎప్పుడు ? ఇంకొన్ని సంవత్సరాల్లో. ఎందుకు ? బ్రిటిష్ పాలనలోని క్రౌర్యాన్ని అణచివేతనూ ప్రజలు ఇంకే మాత్రమూ భరించలేరు కనుక !

మాతృభూమి బానిసత్వ విముక్తి ధ్యేయంగా అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో కొంతమంది భారతీయులు 1913 నవంబరు 1న ప్రారంభించిన గదర్ ఉద్యమం కొద్దికాలంలోనే ఖండాంతరాల్లోని ప్రవాస భారతీయులను విశేషంగా ఆకట్టుకుంటుంది. 1913 డిసెంబరు 30న కాలిపోర్నియాలోని శాక్రమెంటోలో జరిగిన గదర్ మహాసభకు సిక్కులు, ముస్లిములు, బెంగాలీలు, మద్రాసీలు, మరాఠీలు వేల సంఖ్యలో హాజరయ్యారు. మనిలా, బ్రెజిల్ లాంటి దూర ప్రాంతాల నుంచి కూడాప్రతినిధులు వచ్చారు. అనేక దేశాల్లోని ప్రవాస భారతీయులు అంత విస్తృత స్థాయిలో అటువంటి రాజకీయ సమావేశం జరపడం చరిత్రలో బహుశా అదే ప్రథమం.

పార్టీ పెట్టి, సభలు నడిపి, పత్రిక ద్వారా తాము ఎంత ప్రచారం చేసి జనంలో ఎంత చైతన్యం తెచ్చినా, నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక లేనిదే నాడు ప్రపంచంలో కెల్లా శక్తివంతమైన బ్రిటిష్ మహాసామ్రాజ్యంతో తలపడలేమని లాలా హర్‌దయాళ్ వంటి గదర్ స్థాపకులు మొదటే గ్రహించారు. సమగ్ర వ్యూహం, సరైన సమన్వయం లేనందువల్లే 1857లో ప్రజావిప్లవం మహోగ్రంగా చెలరేగినా చివరికి విఫలమైంది. 1857 తరవాత అర్ధశతాబ్దంలో తెల్లదొరతనం పట్టు మరింత బిగిసింది. వేయి తలలతో, వేయి చేతులతో మదించి వికటాట్టహాసం చేస్తున్న భయంకర శత్రువును ఎదుర్కోవడం మామూలుగా అయితే అసాధ్యమే. కాని - ఒకటే ఆశ ! అంతటి బలవంతుడైన శత్రువు కూడా త్వరలో చిక్కుల్లో పడబోతున్నాడు. ప్రపంచ యుద్ధపు సుడిగుండంలో చిక్కుకుని, సైనిక బలగాలనన్నిటినీ దేశం వెలుపల మోహరించి మనుగడకోసం హోరాహోరీగా పోరాడేటప్పుడే దేశంలోపల అతడిని చావుదెబ్బతీయాలి. ఈ స్వర్ణావకాశం మళ్లీరాదు. శత్రువుకు శత్రువులైన వారందరినీ మిత్రులుగా పరిగణించి, అన్నివైపులనుంచీ సహాయం పొంది, తెలివిగా, ఒడుపుగా కదిలితే గానీ లక్ష్యం సిద్ధించదు. అందుకే బ్రిటన్‌కి ప్రధాన శత్రువైన జర్మనీతో గదర్ నాయకులు రహస్య దౌత్యం నెరపారు. పైన పేర్కొన్న శాక్రమెంటో సభలో అమెరికాలోని జర్మన్ దౌత్యాధికారి వేదిక మీద కూచుని, భారతీయుల విముక్తి పోరాటానికి జర్మనీ సకల విధాల సహాయం చేస్తుందని ప్రకటించాడు. మెక్సికో, కాబూల్ ప్రభుత్వాలు కూడా గదర్లకు మద్దతు తెలిపాయి. చైనాలో సన్‌యట్‌సెన్ నాయకత్వంలోని విప్లవ పక్షం సైతం వారికి బాసటగా నిలిచింది.

సైనిక బలంతోనే ఇండియాను అణచి పెట్టగలిగిన బ్రిటన్‌ను దేశంలో దాని సైనిక శక్తి బలహీనపడి ఉన్నప్పుడే దెబ్బకొట్టాలి. ఇంత కాలమూ దానికి వజ్రాయుధంలా ఉపయోగపడ్డ సైనికులనే దానిపై తుది పోరుకు ప్రయోగించాలి. 1857లో వలె సైనిక తిరుగుబాటు తీరూతెన్నూ లేకుండా సాగి నిరర్థకం కాకుండా నిర్ణీత వ్యూహం ప్రకారం

జాగ్రత్తగా అడుగువెయ్యాలి. అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల, అన్ని మతాల వారినీ సమీకరించి విప్లవానికి కూడగట్టాలి. ఇదంతా పరాయి దేశంలో కూచుంటే అయ్యే పనికాదు. కాబట్టి ప్రవాస భారతీయులు అందరూ మాతృదేశానికి మరలి, సర్వశక్తులూ ధారపోసి ప్రజల తోడ్పాటుతో విముక్తి పోరాటం సాగించాలని గదర్ నాయకులు పిలుపునిచ్చారు. స్వదేశం వెళ్లగానే చేయవలసిన కార్యక్రమాన్ని కూడా వారు ఇలా రూపొందించారు.

1. ఇండియాలో పనిచేస్తున్న విప్లవ సంస్థలను కాంటాక్ట్ చేసి కలుపుకు వెళ్లాలి.

2. గదర్ కార్యకర్తలు గ్రామగ్రామానికీ వెళ్లి బ్రిటిష్ పాలనపై తిరుగుబాటుకు ప్రజలను సమాయత్తం చేయాలి.

3. కంటోన్మెంట్లకు వెళ్లి సైనికులను తిరుగుబాటుకు సిద్ధం చేయాలి.

4. విప్లవ సాహిత్యాన్ని విరివిగా ముద్రించి ప్రజలకు, సైనికులకు అందించాలి.

5. పెద్ద ఎత్తున ఆయుధాలను సేకరించాలి.

6. ఇతర దేశాల్లో బ్రిటిష్ పెత్తనంపై పోరాడుతున్న విప్లవ సంస్థలతో, ఇంగ్లండుకు శత్రు దేశాలతో సంబంధాలు పెంచుకుని వీలైన మేరకు సహాయాలు పొందాలి.

ఆ ప్రకారమే అమెరికాలో బర్కిలీ యూనివర్సిటీ విద్యార్థి అయిన కర్తార్‌సింగ్, జపాన్ నుంచి గదర్ పార్టీ అధ్యక్షుడు సోహన్‌సింగ్ భక్నా, ఇంకా ఎందరో యోధానుయోధులు ఎన్నో దేశాల నుంచి స్వదేశానికి మరలారు. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి ఎస్. ఎస్. కొరియా నౌక వందల సంఖ్యలో ప్రవాస భారతీయులను తీసుకుని 1914 ఆగస్టున హాంగ్‌కాంగ్‌కు బయలుదేరింది. శాన్‌ఫ్రాన్సిస్కో రేవునుంచి కదిలే ముందు మౌల్వీ బర్కతుల్లా, రాంసింగ్, భగవాన్‌సింగ్‌లు నౌకలోకి వచ్చి దేశభక్తులకు ఉత్తేజ భరితంగా వీడ్కోలు ఇచ్చారు.

"Your duty is clear. Go to India and stir up rebellion in every corner of the country. Arms will be provided to you on your arrival in India" (మీ కర్తవ్యం స్పష్టం, మన దేశానికి వెళ్లి ప్రతి మూలనా తిరుగుబాటు ప్రేరేపించండి. ఇండియాకు చేరగానే మీకు ఆయుధాలు అందుతాయి.) అని వారు ఉద్బోధించారు. దఫాల వారీగా, రకరకాల మార్గాల్లో 1916 నాటికి కనీసం 8 వేల మంది గదర్లు వివిధ దేశాల నుంచి ఇండియా చేరుకున్నారు. చరిత్రకెక్కిన **కొమగత మారు** ఘోర దురంతం ఈ సందర్భంలో జరిగిందే.

యుద్ధంలో తలమునకలైన పరిస్థితిని అదనుగా తీసుకుని ఇండియాలో తమ సామ్రాజ్యపు పుట్టి ముంచడానికి అమెరికానుంచి గదర్లు చేస్తున్న సన్నాహాలను బ్రిటిషు

సర్కారు ఉపేక్షించలేదు. వారి సవాలును తీవ్రంగా పరిగణించి, ప్రతిఘటనను మొగ్గలోనే కాలరాచివేయటానికి యుక్తాయుక్తాల గుంజాటన లేకుండా శాయశక్తులా విరుచుకు పడింది. అమెరికా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 1914 మార్చి 26న లాలా హర్ దయాళ్‌ని అరెస్టు చేయించింది. విప్లవ కార్యక్రమాలకు కేంద్ర స్థానమైన శాన్‌ఫ్రాన్సిస్కోలోని యుగంతర్ ఆశ్రమంపై గట్టి నిఘా పెట్టింది. గదర్ ముఖ్యుల కదలికలను వెయ్యి కళ్లతో కనిపెట్టి, అక్కడ ఉత్పత్తి అయ్యే విప్లవ సాహిత్యాన్ని ముఖ్యంగా 'గదర్' పత్రికను బ్రిటిషు సామ్రాజ్యంలోకి చొరనీయకుండా శాయశక్తులా అడ్డుకుంది. అణచి పెట్టే కొద్దీ విప్లవం బలం పుంజు కుంటూ ప్రభంజనంలా వ్యాప్తిచెందింది. యూరఫ్, ఫిలిప్పీన్స్, పనామా, అర్జంటీనా, బ్రెజిల్, ఇరాన్, ఆఫ్ఘానిస్థాన్, జపాన్, హాంగ్‌కాంగ్, చైనా, మలయా, సయాం, సింగపూర్, రష్యాలలో భారతీయులు ఉన్నచోట్లల్లా గదర్ శాఖలు వెలిశాయి. గదర్ పత్రిక వారం వారం ఇంగ్లీషులో అనేక భారతీయ భాషల్లో పది లక్షల కాపీలు అచ్చుపడి, బ్రిటిషు గూఢచారుల, కస్టమ్స్, భద్రత అధికారుల కళ్లుగప్పి ప్రపంచ వ్యాప్తంగా అన్ని శాఖలకూ, ముఖ్యంగా భారతదేశం నలుమూలలకూ చేరేది.

వివిధ దేశాల్లోని భారతీయులు ఏకమై, అంతర్జాతీయంగా సంఘటితమై, ఇండియాలో తమ రాక్షస పాలన నిజస్వరూపాన్ని బట్టబయలు చేస్తూ ప్రజావిప్లవాన్ని ప్రేరేపిస్తున్నందుకే తెల్లదొరతనం ఆగ్రహోదగ్రమైంది. ప్రవాస విప్లవకారులు తనపై ఏకంగా యుద్ధప్రకటనే చేసి పెద్ద సంఖ్యలో సమరానికి కదిలి రాదలచారని తెలియడంతో ఇంకా గంగవెర్రులెత్తి దారుణ దమనకాండకు పాల్పడింది. భారతీయ విప్లవకారులుగా అనుమానించదగిన వారిని తీసుకుని వెళ్లే ఏ నౌకనూ మీ రేవులోకి అడుగుపెట్టనివ్వవద్దు, ఎటువంటి సహాయాన్ని చేయవద్దు. ఎదురు తిరిగితే కాల్చి పారెయ్యటానికి సందేహించవద్దు - అని ప్రత్యక్షంగా తన పెత్తనంలోనో, పరోక్షంగా తన పలుకుబడి కిందనో ఉన్న దేశాల ప్రభుత్వాలను కట్టడి చేసింది. ఇండియాలోకి వచ్చిన భారతీయులను వచ్చినట్లు ఓడలోనే నిర్బంధించి, జైళ్లలో కుక్కమని రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశించింది.

విప్లవ రవాణానూ, విప్లవకారుల రాకపోకలను, దేనికైనా వెనకాడక అరికట్టితీరాలని బ్రిటిషు పాలకులు కంకణం కట్టుకుని, కెనడా వంటి దేశాల్లో తమ తైనాతీ ప్రభుత్వాలకు గట్టి హెచ్చరికలు చేసిన సమయంలో స్వదేశంలో పొట్టగడవక బతుకుతెరువు వెతుక్కుంటూ దేశాంతరానికి పోదలచిన వందలాది భారతీయులను మోసుకుని ఎస్. ఎస్. కొమగత మారు అనే నౌక హాంగ్‌కాంగ్‌లో బయలుదేరి 1914 మే 22న కెనడాలోని వాంకువర్ రేవు సమీపించింది. అందులో 351 మంది సిక్కులు, 21 మంది ముసల్మాన్లు ఉన్నారు. పొట్టచేతపట్టుకుని ఇండియానుంచి విప్లవం అంటించడానికి ఇండియా

పోతున్నవారు కాదు కాబట్టి వారిని శత్రువులుగా పరిగణించి సతాయించవలసిన అవసరం తెల్లదొరతనానికి ఎంత మాత్రం లేదు. వారిలో పలువురు విద్యార్థులు, చిన్న వ్యాపారులు, మత బోధకులు ఉన్నారు. కెనడా ఇమిగ్రేషను చట్టం ప్రకారం వారిని అనుమతించడానికి అభ్యంతరం ఉండకూడదు. అయినా - ఓడలోని పురుగును కూడా తమ భూభాగం మీదికి రానిచ్చేది లేదని కెనడా ప్రభుత్వం తెగేసి చెప్పింది. ఆఖరికి ఆ రేవులో సరకులను దింపటానికి కూడా అనుమతి నిరాకరించింది. కావాలంటే ఓడలోకి మీ అధికారులను పంపించి, అభ్యంతరకరమైన వ్యక్తులెవరైనా ఉంటే తనిఖీ చేసి పట్టుకొని మిగతా వారిని అనుమతించండి అని షిప్పింగ్ కంపెనీ యజమాని బాబా గుర్దిత్‌సింగ్ వేడుకున్నా వినలేదు. ప్రయాణికులకు తిండి, నీరు ఏర్పాటుచేయటానికి కనీసం తానొక్కడినైనా బయటికి వెళ్లనివ్వండి అని అతడు ప్రాధేయపడ్డా ససేమిరా కుదరదు పొమ్మంది.

ఈ ప్రతిష్టంభన ఒక రోజూ రెండు రోజులూ కాదు - ఏకంగా రెండు నెలలు కొనసాగింది. రేవు దరిచేరేందుకు నోచుకోక అన్ని నెలలూ దూరంగా సముద్రంలోనే ఓడ నిలచిపోయింది. ఆహారపు నిల్వలు, మంచినీరు హరించుకుపోయి ఆకలిదప్పులతో వందలాది ప్రయాణికులు హాహాకారాలు చేసినా, మందులకోసం రోగార్తులు ఆక్రందించినా తెల్లదొరల గుండెలు కరగలేదు. విషయం తెలుసుకున్న స్థానిక భారతీయులు కెనడా ప్రభుత్వానికి, దానికి అధినాథులైన బ్రిటిషు ప్రభువులకు ఇండియాలోని వైస్రాయ్‌కి ఎన్ని విజ్ఞాపనలంపినా ఎవరూపట్టించుకోలేదు. గదర్ విప్లవాన్ని ఉక్కుపాదంతో తొక్కివేయా లన్న కసిలో కనీస మానవతా ధర్మాన్ని కూడా తెల్లవారు విస్మరించారు.

అలా రెండు నెలలపాటు వందలాది ప్రయాణికులను క్రూరంగా, అమానుషంగా వేధించిన తరవాత 1914 జూలై 14న కెనడా పోలీసు బృందం మోటారులాంచిలో 'కొమగత మారు' ఓడ దగ్గరికి పోయింది. ఎందుకు ? హింసించింది చాలు, కాస్త తిండి, ఇన్ని నీళ్లు వాళ్ల మొగాన కొట్టి, కక్షకట్టిన ప్రాణాలను నిలుపుదామన్న దయతోనా? కాదు. అలాచేస్తే వారు దొరలెందుకు అవుతారు? సేదతీర్చే మంచినీరుకాక సలసలమరిగే వేడినీటిని గొట్టాలతో డెక్‌మీది ప్రయాణికుల మీదికి చిమ్మారు.

అది పైశాచికత్వానికి పరాకాష్ఠ. ✻ ఊహించని ఈ దాడికి బెంబేలెత్తిన జనం తమను ప్రాణాలతోనైనా నిలవనిచ్చేలా లేరన్న సంగతి గ్రహించి, ఆత్మరక్షణ ఎలాగా అని చుట్టూ చూస్తే బొగ్గు ముక్కలు తప్ప ఏ ఆయుధమూ కనిపించలేదు. వాటినే గురిపెట్టి లాంచీమీదికి విసిరారు. మండిపడ్డ అధికారులు 'శత్రువు'పై దాడికి రెండు

✻ ఇది జరిగిన *94* ఏళ్లకు *2008* మేలో కొమగతమారు దుస్సంఘటనకు కెనడా భారత ప్రజలకు క్షమాపణ చెప్పింది.

సాయుధ నౌకలను పిలిపించారు. అవి రావటాన్ని చూసి, చిక్కుపడ్డ ప్రయాణికులు, చావు తెగింపుతో స్టీము కోలుకు నిప్పంటించి లాంచీ మీదికి విసరసాగారు.

ఓడలోని వారితోపాటు తామూ మంటలకు ఆహుతి అయేట్టున్నామని గ్రహించాక అధికారులు దాడిని ఆపారు. ప్రయాణికులకు మంచినీరు, ఆహారం సరఫరా చేయించారు. రేవులో దిగడానికి మాత్రం వీల్లేదు పొమ్మన్నారు.

ఇక చేసేది లేక రెండు నెలలు దయనీయంగా గాలిలో వేలాడిన తరవాత, అడంగు చేరే అదృష్టం లేదని రూఢి అయ్యాక, చేసేది లేక ఓడ వెనక్కి మరలింది. పగబట్టిన తెల్ల దయ్యాలు తిరుగు ప్రయాణంలో కూడా వారిని సుఖంగా ఉండనియ్యక వెంటాడాయి. మొదట బయలుదేరిన హాంగ్‌కాంగ్ పోర్టులోకి కూడా నౌకను ప్రవేశించనివ్వలేదు. అటునుంచి సింగపూర్ పోతే అక్కడా అడుగుపెట్టనివ్వలేదు. ఇలా ఎక్కడా నేలమీదికి రానివ్వకుండా ప్రతిచోటా అడ్డుకుని, ఆకలిదప్పులతో ఆక్రోశించే అభాగ్య జనాన్ని క్రూరాతిక్రూరంగా సతాయించగా, చిట్టచివరికి 1914 సెప్టెంబరు 29న **కొమగత మారు** నౌక కలకత్తా దగ్గరికి వచ్చింది.

ఎట్టకేలకు మాతృదేశానికి తిరిగివచ్చిన తరువాతైనా ఓడ బాధితుల కష్టాలు తీరాయా? లేదు. అసలు కష్టాలు అప్పుడే మొదలయ్యాయి.

విఫలమైన విప్లవం

***'చ**రిత్రలో పుట్టి గిట్టిన మిగతా సామ్రాజ్యాల్లాకాక, ఆధ్యాత్మిక పునాదిగల ఈ మహా సామ్రాజ్యం కలకాలం నిలుస్తుంది' అని మహాత్మాగాంధీగారు మనసారా ఆకాంక్షించి... 'ప్రపంచ సంక్షేమం కోసమే పనిచేస్తున్న' బ్రిటిష్ సామ్రాజ్యానికి ప్రపంచ యుద్ధంలో తాను ఏమి సేవలు అందించగలనా అని లండన్ మకాంలో తహతహలాడుతున్న సమయాన...*

అదే మహా సామ్రాజ్యంలో భాగమైన భారతదేశంలో కలకత్తాకు 17 మైళ్ల దూరంలోని బుజ్‌బుజ్ హార్బరులోకి 1914 సెప్టెంబరు 29న 'ఎస్.ఎస్. కొమగత మారు' ఓడ వచ్చింది.

అందులో ఉన్నవారంతా భారతీయులే. తమ దేశానికి తాము తిరిగొచ్చారు కాబట్టి రానివ్వాలా వద్దా అని వారిని ఇమిగ్రేషన్ శల్య పరీక్షలతో శోధించాల్సిన అవసరం లేదు. వారివద్ద బాంబులు, భయంకర మారణాయుధాలు ఏవీ లేవని పోలీసు తనిఖీల్లో రూఢి అయింది. కనుక వారు వచ్చింది దాడి చేయడానికని భయపడవలసిన పనిలేదు. నెలల తరబడి మహా సముద్రాల నడుమ ముందుగతి కానక మహా క్షోభపడి, కాల్చే ఆకలితో, కూల్చే వేదనతో యమ యాతనలు పడిన ఆ అభాగ్యులను చూస్తేనే రాతి గుండె మనుషులకు కూడా కనికరం కలుగుతుంది.

మరి మానవ సంక్షేమం కోసమే మనుగడ సాగిస్తున్నదని గాంధీజీ కీర్తించిన ఆధ్యాత్మిక మహాసామ్రాజ్యం ఆ విధివంచితులను ఎలా చూసింది? ఏమి చేసింది ?

బుజ్‌బుజ్ హార్బరులోకి కొమగత మారు నౌక వస్తోందని తెలియగానే స్పెషల్ రైలును తెచ్చి బయట సిద్ధంగా ఉంచారు. ఓడకి లంగరు వేసీ వేయగానే సాయుధ పోలీసులు బిల బిల చొరబడి ప్రయాణికుల రెక్కలు పట్టి గుంజుకొచ్చి రైల్లో పడేశారు. వెంట తెచ్చుకున్న సామాన్లను తీసుకోవడానికేకాదు... చేతి సంచిలను తీసుకునేందుకు

కూడా వారికి వ్యవధి ఇవ్వకుండా ముఖ్యమైన కాగితాలను కూడా ముట్టుకోనివ్వకుండా బిర బిర లాక్కుపోయారు. ఓడలోని నగానట్రా, సామాన్లాగట్రా మొత్తం జప్తు చేశారు.

ఈ దాష్టీకానికి, తమ దేశంలోనే తమను అవాంఛనీయమైన చొరబాటుదారులుగా పరిగణించి, పశువుల్లా బంధించుకుపోతున్న తీరుకు ఓరిమి నశించి ఉడుకు రక్తపు ప్రయాణికులు ఎదురుతిరిగారు. వారికీ, పోలీసులకు నడుమ హార్బరులోనే పెద్ద ఘర్షణ జరిగింది. యథేచ్ఛగా కాల్పులు జరిగాయి. పోలీసు తూటాలకు సర్కారీ రికార్డుల ప్రకారమే 18 మంది సిక్కు యోధులు నేలకొరిగారు. గందరగోళంలో బాబాగుర్దిత్‌సింగ్, ఇంకా 28 మంది తప్పించుకుని పారిపోయారు. చేతికి చిక్కిన మిగతా ప్రయాణికులను రైల్లో పట్టుకుపోయి జైల్లో కుక్కారు.

ఓడలో వచ్చిన ప్రయాణికుల్లో 351 మంది సిక్కులు; 22 మంది ముస్లింలు, మొత్తం 373 మంది. వీరిలో 29 మంది తప్పించుకుపోయారు. 60 మందిని బంధించి రైల్లో వేసుకుపోయారు. 18 మంది కాల్పుల్లో మరణించారు - అని బ్రిటిషు ప్రభుత్వ రికార్డులు చెబుతాయి. 29+60+18+=107 పోతే 373 మందిలో ఇంకా 266 మంది మిగలాలికదా? వారంతా ఏమైనట్టు? వందల సంఖ్యలో మోహరించిన సాయుధ పోలీసులు చూస్తుండగానే అంతమందీ గాలిలో మాయమయ్యారా ? ప్రయాణికుల దగ్గర 40 అమెరికన్ రివాల్వర్లున్నాయని, వాటితో భద్రతా బలగాలపై కాల్పులు జరిపి, ఆరుగురు అధికారులను బలిగొన్నారని, రెచ్చిపోయిన మూకనుంచి తప్పించుకోవటానికే ఆత్మరక్షణార్థం పోలీసులు కాల్చాల్సివచ్చిందనీ షరా మామూలుగా సర్కారువారు కథ అల్లారు సరే ! నౌకలో నుంచి దిగకముందే ప్రయాణికుల ఒళ్లంతా సోదాచేసి, చిన్న చాకులనుకూడా లాగేసుకుని, బయటికి ఈడ్చుకొచ్చిన తరవాత అదే ప్రయాణికుల జేబుల్లోకి రివాల్వర్లు ఎక్కడినుంచి పుట్టుకొచ్చాయి?

ఘర్షణలో సర్కారు పక్షాన ఆరుగురు మరణించినమాట యదార్థమే. కాని వారి ప్రాణాలు తీసింది ప్రయాణికుల రివాల్వర్లు కాదు. ఇందులో కనీసం ఇద్దరికి తగిలిన తూటాలూ, సాయుధ పోలీసులు పేల్చిన రైఫిల్ తూటాలూ ఒకే కేలిబరువని సాక్షాత్తూ బ్రిటిషు సర్కారువారు నియమించిన 'సెడిషన్ కమిటి' రిపోర్టే చల్లగా బయటపెట్టింది. తమవైపువారికి తమ తూటాలు తగలకుండానైనా జాగ్రత్తపడలేదంటే తెల్లవారి పోలీసులు ఎంత విచ్చలవిడిగా కాల్పులు జరిపి ఉంటారో, ఒప్పుకున్న 18కి మించి ఇంకా ఎన్నిరెట్లు ఎక్కువగా అభాగ్యుల ప్రాణాలు ఆరోజు బలిగొని ఉంటారో ఊహించవచ్చు. తిమ్మిని బమ్మిచేసి, యధార్థాలకు అబద్ధాల వెల్లవెయ్యాలని "ఆధ్యాత్మిక పునాదుల" సర్కారువారు ఎంతగా బుకాయించినా, 1914 సెప్టెంబరు 29న బుజ్‌బుజ్ హార్బరులో జరిగింది

నిస్సహాయుల ఊచకోత. **ఆర్.సి.మజుందార్** అన్నట్లు - *Perhaps when all the facts are known, the Budge-Budge massacre would be placed in the same category as that of Jallianwala Bagh.*

[*History of the Freedom Movement in India*, R. C. Majumdar, Vol. II. P. 434].

(బహుశా వాస్తవాలన్నీ బయటపడ్డ తరువాత బుజ్‌బుజ్ ఊచకోతను కూడా జలియన్ వాలాబాగ్ కోవలోనే చేర్చాల్సివుంటుంది)

తెల్లదొరతనం ఇంత రాక్షసంగా ఊచకోతకు పాల్పడింది కొమగతమారు నౌకలో వచ్చినవారిమీద వ్యక్తిగతమైన కక్షతో కాదు. వారి శివాలన్నీ గదర్లమీద. తమపై గదర్ పార్టీ చేసిన యుద్ధ ప్రకటనను, తమ శత్రువులైన జర్మన్ల సాయంతో ఇండియాలో తమ భరతం పట్టడానికి అంతర్జాతీయంగా జరుగుతున్న విస్తృత సన్నాహాలను తెలుసుకున్నాక ఆంగ్ల ప్రభువులకు కన్నుమూసినా తెరిచినా గదర్లే కనిపించసాగారు. వారిని అడ్డుకోవడం కోసమే - భారత పౌరులనైనా సరే దేశంలోకి రానివ్వకుండా నిరోధించి, నిర్బంధించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారమిస్తూ 1914 సెప్టెంబర్‌లో కరకు ఆర్డినెన్సు తెచ్చారు. గదర్ తిరుగుబాటుదారులు కలకత్తా రేవులో దిగే ఆస్కారం ఎక్కువ కనుక బెంగాల్ ప్రభుత్వాన్నీ, వారిలో ఎక్కువమంది పంజాబీ సిక్కులు కనుక పంజాబ్ ప్రభుత్వాన్నీ అప్రమత్తంగా ఉండి, ఆగంతకులను నిర్దాక్షిణ్యంగా అణచెయ్యమని ఆనతిచ్చారు. వారిని నిర్బంధించటానికి లూధియానాలో ప్రత్యేకంగా డిటెన్షను సెంటరు పెట్టారు. అమెరికానుంచి, ఇండియాదాకా సముద్ర మార్గాన తమ ఆధిపత్యంలోని రేవులన్నిటినీ గదర్లకు నిలువనీడ లేకుండా ముందే బందోబస్తు చేశారు. మొట్టమొదట కొమగత మారు నౌకపై ఆర్డినెన్సు ప్రతాపం చూపినట్టే, 'తొషామారు', 'నామ్‌సింగ్' నౌకల్లో వచ్చిన గదర్ అధ్యక్షుడు సోహన్‌సింగ్ భఖ్నాను, ఇతరులను ఓడలోనే బంధించి లూధియానాకు చేర్చారు. 'తొషామారు' నౌక ఎక్కినవారిని మధ్యలోనే నిర్బంధించి ముల్తాన్, మౌంట్ తదితర చెరసాలలకు తరలించారు.

ఏం లాభం ? బ్రిటిషు సామ్రాజ్యం ఎంత భీకరంగా గాండ్రించి, ఎన్ని ఆర్డినెన్సుల ఆయుధాలు ఝుళిపించినా వచ్చేవారు రానే వచ్చారు. అమెరికాలాంటి దేశాల్లో రెండు చేతులా ఆర్జించిన సొమ్ముతో కాలు మీద కాలు వేసుకుని సుఖంగా ఉండాలనుకోకుండా, ప్రాణాలకు తెగించి, సర్వస్వం కోల్పోయి, సర్వనాశనమవటానికి సిద్ధపడి, మాతృదేశ దాస్య విముక్తికోసం వేలాది ప్రవాసులు దబ్బు దస్కం చేతపట్టుకుని ప్రవాహంలా తరలివచ్చారు. సముద్రంలో ప్రయాణం చేసినన్ని రోజులూ గదర్ నాయకులు వారిచేత విప్లవ సాహిత్యాన్ని చదివించి, ఉత్తేజకరమైన ఉపన్యాసాలిచ్చి, మునుముందు చేయవలసిన పనులను వివరించి పోరాటానికి సన్నద్ధం చేసేవారు. హాంగ్‌కాంగ్,

సింగపూర్, రంగూన్ లాంటి చోట్ల దారిలో స్టీమర్లు గంటల తరబడి ఆగిన చోటల్లా స్థానిక రెజిమెంట్ల భారతీయ సైనికులను ఏ గురుద్వారాల్లోనో కలిసి తిరుగుబాటుకు పురికొల్పేవారు. సింగపూర్‌లో ఒక రెజిమెంటు విప్లవకారుల ప్రభావంతో బాహాటంగా తిరగబడి యుద్ధ రంగానికి కదలేది లేదని మొరాయించింది. ధిక్కారాన్ని సహించని అధికారులు వారిని నిర్బంధించ బోవడంతో పెద్ద ఘర్షణ జరిగింది. అటూఇటూ వందల ప్రాణాలు పోయాయి.

ఈ ఘటనతో బ్రిటిష ప్రభుత్వానికి గదర్ల సవాలు తీవ్రత అర్థమైంది. అమెరికానుంచి వచ్చే ప్రతి నౌకనూ సర్కారువారు వెయ్యి కళ్లతో గాలించసాగారు. అయినా వచ్చేవారు సర్కారు కళ్లుగప్పి రానే వచ్చారు. షాంఘై, హాంగ్‌కాంగ్, సయాం, స్ట్రెయిట్స్ సెటిల్‌మెంట్స్ వగైరా ప్రాంతాల్లో ఇండియాదారిపొడవునా భారతీయుల సెటిల్మెంట్లు ఉండటం వారికి బాగా ఉపకరించింది. ఎకాఎకి ఇండియాకు రాకుండా మధ్యలో ఏ బర్మాలోనో దిగి అటునుంచి చాటు మాటుగా బెంగాల్, పంజాబ్, యు.పి.లకు చాలా మంది చేరుకున్నారు. డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్టుల్లాంటి శాసనాల విచ్చుకత్తులను సర్కారువారు ఎన్ని ప్రయోగించినా ఏదో ఒక విధంగా అధికారుల కళ్లుగప్పి విప్లవకారులు ఏదో ఒక మూల నుంచి దేశంలోకి చొరబడేవారు.

రికార్డులకు ఎక్కినదాని ప్రకారమే 1915 ఫిబ్రవరి ఒక్క నెలలోనే 3125 మంది పంజాబీలు ఇండియాకు తిరిగొచ్చి పంజాబ్‌లో పల్లెపల్లెకూ వ్యాపించి వివిధ వర్గాల ప్రజలను విప్లవానికి సమాయత్తం చేశారు. 1916 కల్లా తక్కువలో తక్కువగా 8 వేలమంది గదర్లు హిందుస్తాన్‌కు తిరిగొచ్చారు. విష్ణుపింగ్లే, కర్తార్‌సింగ్ సరాభా, భాయి పరమానంద్, హాఫీజ్ అబ్దుల్లా వంటి గదర్ నేతలు బెంగాల్, పంజాబ్, యు.పి.ల్లో అప్పటికే చురుకుగా పనిచేస్తున్న విప్లవ సంస్థలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకుని పనిచేశారు. బెంగాల్‌లో జతిన్ ముఖర్జీ, బెనారస్‌లో సచీంద్ర సన్యాల్, ఢిల్లీలో రాస్ బిహారీ బసు అప్పట్లో దేశంలోని రహస్య విప్లవ కార్యకలాపాల్లో ప్రముఖ పాత్ర వహిస్తుండేవారు.

ముగ్గురిలోకీ గండరగండడు రాస్‌బిహారీ బసు. ఆయన డెహ్రాడూన్‌లో ప్రభుత్వ అధికారిగా పనిచేస్తూనే ఉత్తరభారత మంతటా విప్లవకారులను సమన్వయపరచి నడిపిస్తూండేవాడు. ఆయన ఎంత అసాధ్యుడంటే 1912 డిసెంబరులో వైస్రాయ్ లార్డ్ హార్డింజ్‌పై ఢిల్లీలో ఊరేగుతుండగా ప్రత్యక్షంగా రంగంలో వుండి బాంబు వేయించాడు. పోలీసుల కళ్లుగప్పి తప్పించుకుపోయి డెహ్రాడూన్‌లో సభ పెట్టి వైస్రాయ్‌పై విద్రోహుల దాడిని మళ్లీ ఆయనే తీవ్రంగా ఖండించి, ప్రభువుల మెప్పు పొందాడు ! మొదట్లో

మోసపోయినా కొన్నాళ్లకు బాంబు కుట్రలో బసు పాత్రను పోలీసులు పసిగట్టగలిగారు. ఆ సంగతి తెలియగానే బసు డెహ్రాడూన్ వదలి అండర్ గ్రవుండుకు వెళ్లాడు. ఆయనను పట్టిచ్చినవారికి పెద్ద బహుమతి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఐనా ఎప్పటికప్పుడు వేషాలు మారుస్తూ, క్రైం థ్రిల్లర్ నవల్లోవలె ఎత్తుకు పైఎత్తు వేస్తూ సాహసంతో తప్పించుకుంటూ విప్లవ కార్యకలాపాలను నిరాఘాటంగా సాగించాడు. వారణాశిలో వుండి 'అనుశీలన సమితి' పక్షాన విప్లవ కార్యక్రమాలు సాగిస్తున్న బెంగాలీ విద్యార్థి సచీంద్రనాథ్ సన్యాల్ పట్టుబట్టి, రాస్ బిహారీ బసు కార్యస్థానాన్ని వారణాశికి మార్పించాడు.

అది బ్రిటిషు సర్కారు కలనైనా ఊహించని ఎత్తు, ఇరుకు సందులతో కొత్తవారికి దారీ తెన్నూ అంతుబట్టని కాశీ క్షేత్రంలో అద్భుతమైన రహస్య వ్యవస్థను రూపొందించి దేశం వివిధ ప్రాంతాల్లోని విప్లవకారులతో, అమెరికా నుంచి వచ్చిన గదర్ యోధులతో నిరంతర సంబంధాలు పెట్టుకుని బ్రిటిషు గూఢచారులు ఏమాత్రం వాసన పట్టలేని రీతిలో బసు సాయుధ తిరుగుబాటుకు రంగం సిద్ధం చేశాడు. బెనారస్‌కు మకాం మార్చిన కొద్దిరోజులకే గదర్ ముఖ్యుడు విష్ణుగణేశ్ పింగ్లే ఆయనను కలిసి "అమెరికా నుంచి ఇప్పటికి 4 వేలమందిమి అన్నిటికి సిద్ధపడి వచ్చాం. పోరాటం మొదలయ్యాక ఇంకో 20వేల మంది వస్తారు. మేము ఏమి చేయాలో మీరు చెప్పండి" అన్నాడు. రాస్ బిహారీ చక్కటి దక్షతతో వ్యూహరచన చేసి అందరికి బాధ్యతలు పంచాడు.

అంతర్జాతీయ పరిస్థితి ఆ సమయాన అన్ని విధాలా అనుకూలంగా ఉంది. బ్రిటన్ అప్పుడున్నంత బలహీనంగా దాని సామ్రాజ్య చరిత్రలో ఎన్నడూ లేదు. దాదాపుగా ఉన్న సైన్యాన్నంతా ఆసియా, ఆఫ్రికా, యూరప్‌లలో యుద్ధ రంగాలకి తరలించినందువల్ల దేశంలోపల భద్రతా వ్యవస్థ దుర్బలంగా ఉంది. యుద్ధం తొలిదశలో జర్మనీ వరసగా విజయాలు సాధిస్తూ ఇంగ్లండును గడ గడ లాడిస్తున్నది. ఇండియాలో తిరుగుబాటుకు జర్మనీ, టర్కీ, ఆఫ్ఘనిస్తాన్‌లు అన్ని విధాలా సహాయపడటానికి సిద్ధంగా ఉన్నాయి. జర్మనీ పెద్ద ఎత్తున ఆయుధాలను, మందుగుండు సామగ్రిని అందించడానికి అంగీకరించింది. టర్కీ సహకారం ఇండియాలోని ముస్లింల మద్దతు కూడగట్టటానికి బాగా పనికొస్తుంది. ఇక ఆఫ్ఘనిస్తాన్ నేరుగా ఇండియాపై దాడిచేసో... వాయువ్య సరిహద్దుల్లో ఘర్షణలకు దిగి, భారీ సైన్యాన్ని అటుకేసి మోహరించక తప్పని పరిస్థితి తెచ్చిపెట్టి, దేశంలోపల సైనిక వ్యవస్థను మరింత బలహీనపరిచో - విప్లవానికి చేయూతనివ్వబోతున్నది. ఇటువంటి సావకాశం మళ్లీ రాదు. అదను చూసుకుని, సైనికుల సహకారంతో ఉవ్వెత్తున ప్రజా తిరుగుబాటు లేవదీసి బ్రిటిష్ పెత్తనం పీడ విరగడ చెయ్యటమే ఇప్పుడు జరగాల్సింది.

దీనికి సైనిక దళాల తోడ్పాటు అతిముఖ్యం. దేశంలోపలా, వెలుపలా ఉన్న అన్ని రెజిమెంట్లలో భారతీయ సిపాయిలను రహస్యంగా కూడగట్టే పనికి తక్షణం ఉపక్రమించాలి. ఆ పనిమీదే రాస్‌బిహారీ ముఖ్యులందరినీ తలా ఒక్క దిక్కూపంపాడు. ఒక్కో కంటోన్మెంటు లోని సైనికులతో వారు సంబంధం ఎలా పెట్టుకొన్నారు, వారి విశ్వాసం ఎలా చూర గొన్నారు. మెల్లిగా వ్యూహాన్ని వెల్లడించి తిరుగుబాటుకు ఎలా ఒప్పించారు. నిఘా కళ్లను తప్పించుకుని విప్లవ సన్నాహాలు ఎలా చేసారు అన్నవి సచీంద్ర సన్యాల్ 'ఆత్మకథ'లో చదివితే ఒళ్లు గగుర్పొడుస్తుంది.

సన్యాల్ చెప్పినదాని ప్రకారం దీనాపూర్ నుంచి జలంధర్ దాకా ఉత్తర భారతంలోని సైనిక కంటోన్మెంట్లన్నిటిలోకీ విప్లవకారులు చొచ్చుకు వెళ్లగలిగారు. మొదలయ్యీ కాగానే తిరుగుబాటులో చేరటానికి దాదాపుగా అన్ని రెజిమెంట్ల సైనికులూ ఒప్పుకున్నారు. పంజాబ్‌లోని రెండు రెజిమెంట్ల వారైతే ముందుగా తామే తిరుగుబాటు ప్రకటించడానికి ముందుకొచ్చారు. అప్పట్లో ఉత్తరాదిన భారతీయ సైన్యంలో సిక్కులు, గూర్ఖాలు, పంజాబీ ముస్లింలే ఎక్కువ. అమెరికా నుంచి వచ్చిన గదర్ యోధుల్లోనూ ఎక్కువ మంది ఈ వర్గాలకు చెందిన వారే. కనుక సైనికులతో కలిసి మెలిసి, తిరుగుబాటుకు పురికొల్పటం సులభమైంది.

సైనికదళాల మీద కొంతమంది దృష్టి పెట్టినట్టే ఇంకొందరు ప్రవాసులు పంజాబ్, బెంగాల్, యు.పి. రాష్ట్రాల జనపదాల్లో కలిసిపోయి సామాన్య ప్రజలనూ విప్లవ పోరాటానికి సమాయత్తపరిచారు. అమృత్‌సర్, లూధియానా, జాబెవాల్, లోహత్‌వడి తదితరప్రాంతాల్లో బాంబు ఫ్యాక్టరీలు తెరిచి రహస్యంగా రేయింబవళ్లు పనిచేయించారు. 'గదర్' పత్రికను అమెరికా నుంచి చేరవేయటం కష్టమవటంతో పంజాబ్‌లో రహస్యంగా ప్రెస్సు పెట్టి లక్షల సంఖ్యలోఆ పత్రిక కాపీలు ముద్రించి ప్రజలకు పంచారు. బెంగాల్ విప్లవ సంస్థల, గదర్ విప్లవ దళాల పూనికతో ఉత్తర భారత మంతటా 1857 తరవాత మళ్లీ అంతటి స్థాయిలో విప్లవోత్సాహం ఉప్పొంగింది. తిరుగుబాటులో కలవటానికి వందల సంఖ్యలో చిన్నా పెద్దా గ్రామాలు ముందుకొచ్చాయి. అడవుల్లో ఆయుధ శిక్షణ, సైనిక తర్ఫీదు శిబిరాలు ముమ్మరంగా పనిచేశాయి. రైతులతో ప్రత్యేక రెజిమెంట్లు ఏర్పరచటానికి సన్నాహాలు జరిగాయి. భారీ ఎత్తున తిరుగుబాటు తేవటానికి ఖర్చూ భారీగానే జరిగింది. దానిని తట్టు కోవటానికి వేరే దారి లేక ట్రెజరీలను కొల్లగొట్టటం, సంపన్నుల దోపిడీలు కూడా బాగానే జరిగాయి. వందలాది నాయకులు, వేలాది కార్యకర్తలు వేలమైళ్ల పొడవున సాయుధ తిరుగుబాటుకు విస్తృత సన్నాహాలు చేసినా ఎల్లెడలా ఉండే సర్కారీ గూఢచారులు వాసన పసిగట్టలేకపోయారంటే విప్లవ ఏర్పాట్లు ఎంత పకడ్బందీగా జరిగాయో ఊహించవచ్చు.

తిరుగుబాటు వ్యూహం స్థూలంగా ఇది. అన్ని కంటోన్మెంట్లలోని సిపాయిలు ఒకే రోజున హఠాత్తుగా తిరగబడతారు. ఇంగ్లీషు సైనికులను లొంగిపోతే బంధిస్తారు. లొంగని వారిని చంపేస్తారు. ఎక్కడి టెలిగ్రాఫ్ లైన్లను అక్కడి ప్రజలు తెంపేస్తారు. సైనిక, సివిలియన్ బ్రిటిషు అధికారులను ఎక్కడికక్కడ నిర్బంధిస్తారు. ట్రెజరీలను దోచుకుంటారు. జైళ్లను తెరిచి ఖైదీలను విడిపిస్తారు. పోలీసు ఠాణాలోని ఆయుధాలను స్వాధీన పరచుకుంటారు. ఈ ప్రకారం ఢాకా నుంచి లాహోర్ దాకా, పెషావర్ నుంచి హాంగ్‌కాంగ్ వరకూ తిరుగుబాటు ఉప్పెన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ముంచి వేయటానికి అద్భుతమైన పథకం రూపొందింది. బెంగాల్ నుంచి బెనారస్‌కు, అక్కడి నుంచి లాహోర్‌కు బాంబులు సరిపడా చేరాయి. బెనారసులో రాసబిహారీ బసు అధ్వర్యంలో విప్లవ ప్రధాన కేంద్రం, అమృత్‌సర్‌లో చిచ్చరపిడుగు కర్తార్‌సింగ్ నేతృత్వంలో కంట్రోలు సెంటరు నిర్విరామంగా పనిచేశాయి. 1915 ఫిబ్రవరి 21న అన్ని చోట్లా ఏకకాలంలో సాయుధ తిరుగుబాటు మొదలవ్వాలని ముహూర్త నిర్ణయం కూడా అయింది. ఫిరోజ్‌పూర్, మియామిర్, మీరట్, లాహోర్, ఢిల్లీ కంటోన్మెంట్లను కోహత్, దినాపూర్ ఆయుధాగారాలను అదే రోజు వశపరచుకుని స్వతంత్ర భారత రిపబ్లికు ఆవిర్భవించినట్టు ప్రకటించటమే తరువాయి.

అన్నీ అనుకున్నట్టు జరిగితే చరిత్రగతి మారిపోయేదే. దేశం లోపలా, వెలుపలా అడకత్తెరలో నలిగి బ్రిటిషు మహాసామ్రాజ్యం ఫెళ ఫెళ కూలి, భారతదేశానికి తరతరాల బానిసత్వం పీడ శాశ్వతంగా వదిలిపోయేదే. విప్లవకారుల వీరగాథ సువర్ణాక్షరాలతో చరిత్ర పుటలకెక్కి జాతి జనులకు నిరంతర స్ఫూర్తినిచ్చేదే. కాని విధి వక్రించింది.

తెల్లవారికి అదృష్టం కలిసి వచ్చింది. తిరుగుబాటు కథ అడ్డం తిరిగింది. నెలల పర్యంతం ముందస్తు ఏర్పాట్లు గోప్యంగా జరిగినా, ఫలానా తేదీన తిరుగుబాటు జరగబోతోందని కృపాల్‌సింగ్ అనే పోలీసు ఇన్ఫార్మరు ద్వారా బ్రిటిషు సర్కారుకి ఉప్పందింది. ఆ సంగతి తెలియగానే తిరుగుబాటు తేదీని 1915 ఫిబ్రవరి 21 నుంచి 19వ తేదీకి మార్చారు. ద్రోహి అని తెలిశాక కూడా కృపాల్‌సింగ్‌ను హతమార్చకుండా కేవలం బంధించి ఉంచడంతో అతగాడు కాపలావాళ్లను ఏమార్చి తప్పించుకుని, మారిన ముహూర్తాన్నీ సర్కారు చెవిన వేశాడు.

అప్పటికే అప్రమత్తమైన బ్రిటిషు సర్కారు మెరుపులా కదిలింది. అనుమానం తోచిన సిపాయిలనల్లా ఆయుధాలు లాక్కుని, అరెస్టు చేసింది. యుద్ధానికి బయటికి వెళ్లిన బ్రిటిషు సైనికులను యుద్ధప్రాతిపదికన వెనక్కి రప్పించింది. కృపాల్‌సింగును బంధించి ఉంచిన రహస్య కేంద్రం మీద పోలీసు దాడిలో తిరుగుబాటు వ్యూహాలూ, సన్నాహాల ఆరాలూ బయటపడ్డాయి. ప్రభుత్వ యంత్రాంగం క్షణం ఆలస్యం చెయ్యకుండా

విరుచుకుపడింది. బెనారస్, ఢిల్లీ ఇతర కేంద్రాల్లో, దాడులు, అరెస్టులు, ప్రతీకార చర్యలు ముమ్మరంగా సాగాయి. ప్లాటూన్లకు ప్లాటూన్లనే రద్దుచేసి, సిపాయిల యూనిఫాంలు లాక్కుని వెళ్లగొట్టారు. గదర్ పార్టీ ప్రముఖులను, విప్లవ గ్రూపుల నాయకులను వెంటాడి వేటాడారు. 82 మంది ముఖ్యులపై లాహోర్ కుట్ర కేసు మోపి... కర్తార్‌సింగ్, విష్ణుపింగ్లే సహా మొత్తం 24 మందికి మరణశిక్ష విధించారు. మిగతావారికి దీర్ఘకాల కారాగార శిక్ష వేశారు. ఇవిగాక ఇంకో ఆరు కుట్ర కేసుల్లో 20 మందిని ఉరి తీశారు. సచింద్ర సన్యాల్ లాంటి వారెందరినో అండమాన్ యమకూపానికి తరలించారు.

వ్యూహం భగ్నమైనా విప్లవకారులు అధైర్యపడక దారుణ దమనకాండను ఎదుర్కొంటూ తమ కార్యకలాపాలను సాగించారు. ప్రభుత్వం వారిని పగబట్టి వెంటాడింది. లాహోర్ కుట్ర కేసులు ఐదింటిలో కలిపి మొత్తం 145 మంది గదర్ ఉద్యమకారులను ఉరితీశారు. 308 మందికి 14 ఏళ్లకు పైగా జైలు శిక్ష వేశారు. ఎంత వీరోచితంగా పోరాడినా బ్రిటిషు సామ్రాజ్య మత్త గజానికి ఎదురొడ్డి నిలవటం విప్లవకారులవల్ల కాలేదు. బయట ప్రపంచ యుద్ధంలోనూ బలాబలాలు తారుమారై జర్మనీ క్రమేణా డీలా పడటంతో అంతర్జాతీయంగానూ చుక్కెదురైంది. మహోద్ధృతంగా లేవబోయిన తిరుగుబాటుకు పురిట్లోనే సంధికొట్టింది. స్వాతంత్ర్యంకోసం, బంధ విముక్తికోసం తహతహలాడిన కోట్లాది దేశభక్తుల ఆశలు జాతి దౌర్భాగ్యంకొద్దీ అడియాసలయ్యాయి.

గురువును మించిన శిష్యుడు

... There was a great outcry all over India, but the Moderates who dominated the Legislative Assembly meekly submitted to the dictates of the Viceroy who was assured, after the bomb outrage, by the Moderate leader, Gokhale, that he would never oppose any measure which the Viceroy wished to be carried in the Legislative Assembly. This is a painful revelation, but not surprising; for on one occassion when Hardinge asked Gokhale what he would do, if he (Viceroy) left India with all the British officials, Gokhale promptly replied that he would be telegraphing to them, before they reached Aden, to come back.

***[Struggle for freedom, Ed.* R.C. Majumdar, PP 189-190]**

మొదటి ప్రపంచ యుద్ధం మొదలైన కాలంలో దేశం లోపలా, వెలుపలా టెర్రరిస్టు దాడులతో, విప్లవ కార్యకలాపాలతో ఇండియా అట్టుడికి పోతున్నది. మాతృభూమి కోసం ప్రాణాలు ధారవోస్తున్న దేశభక్తుల పట్ల ప్రజల్లో ఆదరాభిమానాలు ఉప్పొంగుతున్నాయి. దేశాన్ని దారుణంగా పీడిస్తున్న బ్రిటిషు సర్కారు పేరు చెబితేనే జనం మండిపడుతున్నారు. విప్లవకారుల ధాటికి, ప్రజాగ్రహ తీవ్రతకు బెంబేలెత్తిన తెల్లదొరతనం తనకు పక్కలో బల్లెంలాంటి విప్లవ పోరాటాన్ని ఉక్కు పాదంతో అణచి వేయబూనింది.

యుద్ధం మొదలవటానికి సంవత్సరం ముందే 1913లో ఇండియన్ క్రిమినల్ లా సవరణ చట్టాన్ని తెచ్చి 'కుట్ర'లను అణచే మిషతో అసమ్మతిని క్రూరాతిక్రూరంగా కాలరాచి వేయసాగారు. వైస్రాయి హార్డింజ్‌పై బాంబు విసిరారన్న అభియోగంపై 'ఢిల్లీ కుట్రకేసు'లో

నలుగురిని ఉరితీసింది ఈ చట్టం కిందే. ప్రజా వ్యతిరేకతను తట్టుకోవటానికి దానికంటే భయంకరమైన డిఫెన్స్ ఆఫ్ ఇండియా చట్టాన్ని యుద్ధం వచ్చీరాగానే దేశంమీద రుద్దారు. దాని ముసాయిదా బిల్లును చూసి యావద్భారతంలో నిరసన వెల్లువెత్తింది. జాతి మొత్తం అసహ్యించుకుంటేనేమి? దుర్మార్గపు శాసనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని విజ్ఞులందరూ ఎంతగా హెచ్చరిస్తేనేమి? అడ్డగోలు బిల్లు సునాయాసంగా లెజిస్లేటివ్ అసెంబ్లీ (అప్పటి పార్లమెంటు) లో పాసయింది.

ఎందువల్లంటే ఆ చట్ట సభలో మితవాదుల సంఖ్య ఎక్కువ. వారేమో బ్రిటిషు తొత్తులు. మితవాదులకు నాయకుడు గోపాలకృష్ణ గోఖలే. ఆయన ప్రభు భక్తి, బానిస బుద్ధి ఎంత ప్రశస్తమైనవో ఇంతకుముందు అధ్యాయాల్లో చూశాం. వైస్రాయి లార్డ్ హార్డింజ్‌పై బాంబుదాడికి విఫలయత్నం జరిగాక ఆయన సున్నిత హృదయం మరీ తల్లడిల్లింది. స్వామిభక్తి ఇంకా అతిశయించింది. ఆ ఊపులో - తమరు ఎటువంటి చర్య తలపెట్టినా లెజిస్లేటివ్ అసెంబ్లీలో వ్యతిరేకించకుండా తప్పక సహకరించగలమని గోఖలే మహాశయుడు వైస్రాయికి అడక్కుండానే హామీ ఇచ్చేశాడు. అన్నమాటకు కట్టుబడి జాతి హితానికి తీరని హానిచేసే డిఫెన్స్ ఆఫ్ ఇండియా రాక్షస చట్టానికి - లాంఛనంగా నామమాత్రపు అభ్యంతరాలను మాత్రం లేవదీసి - చట్టసభ ఆమోదముద్రకు మితవాదులు సాయం పట్టారు.

జాతీయ మహానాయకుడనుకునే గోఖలే ఇంతగా విదేశీ ప్రభువులకు పాదాక్రాంతుడై దాసోహమన్నాడంటే ఎవరికైనా బాధగానే ఉంటుంది. అయినా ఇందులో విస్తుపోవలసింది ఏమీలేదు. గోఖలే తీరు మొదటినుంచీ అంతే. ఒక సందర్భంలో హార్డింజ్ ప్రభువు ఆయనకో ప్రశ్న వేశాడట. దేశంలోని బ్రిటిష్ అధికారులందరినీ తీసుకుని ఒక వేళ నేను ఇండియా వదిలిపోతే మీరేం చేస్తారు. అని ! మీరో నేనో అయితే “అంతకంటే కావలసింది ఏముంది? పీడ విరగడైందని దేశమంతటా పండగ చేసుకుంటాం” అనే వాళ్లం. మహానుభావుడు గోఖలే ఏమని బదులిచ్చాడో తెలుసా ? “మీరు వెళతామంటే మాత్రం ఊరుకుంటామా ? మీరు ఏడెన్ చేరేసరికే దయచేసి వెంటనే తిరిగి రావలసిందని ప్రార్థిస్తూ నేను టెలిగ్రాం ఇవ్వనూ? ! అని- విదేశీ దొరతనానికి వీర విధేయతను చాటుకున్నారట. **“భారత చరిత్ర సంస్కృతి”** వరుసలో 11వ సంపుటిగా ఆర్.సి. మజుందార్ సంపాదకత్వంలో భారతీయ విద్యాభవన్ వెలువరించిన Struggle for Freedom గ్రంథం 189-190 పేజీల్లో పేర్కొన్న ముచ్చట ఇది.

ఇది విని - బానిస మనస్తత్వానికి ఇది పరాకాష్ఠ; దేశాన్ని దోచుకుంటున్న పరాయి పెత్తందారుల మ్రోల ఇంతగా సాగిలపడే జాతీయ నాయకుడు ప్రపంచంలో ఇంకెక్కడా

ఉండదు – అని త్వరపడి నిర్ధారించకండి. బ్రిటిషు సామ్రాజ్యభక్తిలో గోఖలేను తలదన్నినవాడు ఎక్కడో కాదు మనదేశంలోనే ఉన్నాడు. ఆయనా గోఖలేగారి ప్రియశిష్యుడే! పేరు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ !

1915 మొదట్లో గాంధీజీ ఇండియాకి తిరిగొచ్చేసరికి దేశం మొత్తం పెద్ద బందీ ఖానాలా ఉంది. అసలే జర్మనీతో ప్రపంచ యుద్ధం స్థాయిలో జీవన్మరణ పోరాటం! దానికితోడు దేశంలోపల తెల్లదొరతనానికి తిరుగుబాట్ల బెడద ! అమెరికాలాంటి దేశాలనుంచి వేల సంఖ్యలో వచ్చిన భారతీయ యోధులు అప్పటికే దేశంలో చురుకుగా పనిచేస్తున్న విప్లవకారులతో చేతులు కలిపి ముఖ్యంగా బెంగాల్, పంజాబ్, యు.పి. రాష్ట్రాల్లో బ్రిటిషు పాలనను తుదముట్టించటానికి భారీ ఎత్తున సమాయత్తమవటంతో తెల్లవారికి గంగవెర్రులెత్తాయి. వారి బెదురు కళ్లకు ఎటు చూస్తే అటు కుట్రే కనిపించింది. దేశభక్తుడైన ప్రతి భారతీయుడిలోనూ ప్రమాదకరమైన విప్లవకారుడే వారికి కానవచ్చాడు. తమ పెత్తనానికి పెను సవాలును ఎదుర్కోవడానికి ఇంతకు ముందు పేర్కొన్న కర్రి మొర్రి చట్టాలను తెచ్చి వారు దారుణదమనకాండకు మహా క్రూరంగా పాల్పడ్డారు. రాజద్రోహానికి పాల్పడ్డారనో, పాల్పడతారనో అనుమానం వస్తే చాలు. దేశంలో ఏ పౌరుడినైనా నిర్బంధించి, కోర్టులూ విచారణతో నిమిత్తం లేకుండా ఎంత కాలమైనా జైళ్లలో పడేసి చిత్రహింసలు పెట్టసాగారు. అనుమానాస్పద వ్యక్తుల కల్లబొల్లి సాక్ష్యాల ఆధారంగా స్పెషల్ ట్రిబ్యునళ్లు కుట్ర కేసుల్లో ఒక లెక్కాపత్రం లేకుండా మరణశిక్షలూ, యావజ్జీవ ఖైదులూ విచ్చలవిడిగా విధించసాగాయి. ఆ అడ్డగోలు తీర్పుల మీద కనీసం పై కోర్టుకు అపీలు చేసుకునే ఆస్కారం కూడా లేదు. న్యాయాన్ని అపహాస్యం చేసి, చట్టాన్ని చాపచుట్టి, ప్రజలనూ, ప్రజల స్వాతంత్ర్యకాంక్షనూ అమానుషంగా అణచివేయటం ఎంత ఘోరంగా సాగిందో... ఆ సమయాన బ్రిటిషు రాజప్రతినిధిగా యావద్భారతాన్ని ఏలిన వైస్రాయి లార్డ్ హార్డింజే అనంతరం తన 'ఆత్మకథ'లో లాహోర్ కుట్రకేసు గురించిరాసిన ఈ మాటలు చెబుతాయి:

"No less than twenty-four men were condemned to death by a Special Tribunal. I went to Lahore to see the Lieutenant-Governor Sir M.O'Dwyer, and told him categorically that I absolutely declined to allow a holocaust of victims in a case where only six men had been proved to be actually guilty of murder and dacoity... ... As there was no appeal from the Special Tribunal except to the Viceroy I had to assume the responsibility of commuting the sentences of eighteen of the twentyfour condemned to death,"

[*My Indian Years*, Lord Hardinge, P 130]

(లాహోర్ కుట్ర కేసులో ఏకంగా 24 మందికి స్పెషల్ ట్రిబ్యునల్ మరణశిక్ష విధించింది. వాస్తవంగా ఆరుగురిపై మాత్రమే హత్య,దోపిడీ అభియోగాలు రుజువైనాయి. ఇలాంటి కేసులో వరసబెట్టి ఇంతమందిని వధించటాన్ని అనుమతించనని లాహోర్‌కు వెళ్లి లెఫ్టినెంట్ గవర్నర్ సర్ మైకేల్ ఓడ్వయర్‌కి స్పష్టంగా చెప్పాను... స్పెషల్ ట్రిబ్యునల్ పై అపీలుకు వైస్రాయి మినహా వేరే కోర్టుకూ వెళ్లేందుకు అవకాశంలేదు. అందువల్ల 24 మందిలో 18 మందికి మరణశిక్ష తప్పించటానికి నేనే బాధ్యత తీసుకోవలసివచ్చింది.)

ఇది అదృష్టవశాత్తూ వైస్రాయికే వెగటు పుట్టించిన ఒక కేసు సంగతి. ఆయన దాకా రానివీ, తెలిసి కూడా పట్టించుకోనివీ, పిసరంత సాక్ష్యం లేకుండా కేవలం చెప్పుడు మాటల ఆధారంగా స్పెషల్ ట్రిబ్యునళ్లు విచ్చలవిడిగా ఎందరో నిరపరాధులను ఉరికంబం ఎక్కించినవీ ఇంకా చాలా కేసులే ఉన్నాయి. విచారణ ఏదీ లేకుండా రాజద్రోహపు అనుమానం మీద దీర్ఘకాలం నరక కూపాల్లాంటి చీకటి కొట్లలో నిర్బంధించి అమానుషంగా హింసించిన వేలాది డిటెన్యూల క్షోభలకైతే అంతేలేదు. ఇలాంటి చిత్రహింసలవల్లే దౌలత్‌పూర్ కాలేజి వైస్ ప్రిన్సిపాలు ప్రొఫెసర్ మహేంద్రనాథ్ సేన్‌కి నెలరోజుల్లో పిచ్చెత్తింది. ఐనా ఒంటరి చెర తప్పలేదు. ఉన్మాదంలోనే రెండు నెలలు నానాయాతనపడి చివరికి ఖైదులోనే కన్నుమూశాడు. హుగ్లీకి చెందిన ఇంకో ప్రొఫెసరు జ్యోతిశ్చంద్ర ఘోష్ కూడా రెణ్నెల్ల కారాగార నరకంతో ఉన్మాద లక్షణాలు కనిపించి, అలాగే కోమాలోకి వెళ్లాడు. ఒళ్లంతా చచ్చుపడి, బిగుసుకుపోయి, స్తంభంలా పడి ఉంటే ఆహారాన్ని ముక్కులోంచి గొట్టాల ద్వారా ఎక్కించాల్సి వచ్చేది. జీవచ్ఛవంలా మారిన ఆ అభాగ్యుడిని తనకు ఒప్పగించి, తన ఒడిలో ప్రశాంతంగా కన్నుమూసేందుకు అనుమతించవలసిందని కన్నతల్లి కచేరీల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి చిన్న అధికారినుంచి వైస్రాయి వరకూ అందరితోనూ గుండెలవిసేలా మొరపెట్టుకుంది. ఐనా దొరతనానికి దయ కలగలేదు. ఆ స్థితిలో అతడిని వదిలిపెట్టటం కూడా తమ మహాసామ్రాజ్యపు మనుగడకు ముప్పుగానే ఆ ధర్మాత్ములు భావించారు.

అనంతర కాలపు జర్మనీలో నాజీల అత్యాచారాలను గుర్తుచేసే రీతితో విశృంఖలంగా సాగిన అమానుష దమనకాండపై దేశమంతటా పెద్ద దుమారం లేచింది. ప్రజాస్వామ్య విలువల మీద మానవ హక్కుల మీద విశ్వాసం కలిగిన ఎందరో దేశభక్తులు, పర్యవసానాలకు లెక్కచెయ్యక ఈ దారుణాలను ధైర్యంగా తెగనాడారు...

– ఆ సమయంలో దేశంలోనే ఉండి అన్నీ తెలిసిన ఒక్క గాంధీ మహాత్ముడు తప్ప!

విదేశాల నుంచి వచ్చిన గదర్ ప్రవాసులైనా... దేశంలోపలి విప్లవకారులైనా వీర హింసావాదులు. సాయుధ పోరాటంతో బ్రిటిషు ప్రభుత్వాన్ని కూల్చాలనుకునేవారు.

వారి దౌర్జన్య విధానాలు, హింసాత్మక పద్ధతులు గాంధీ తత్వానికి పూర్తిగా విరుద్ధం. కాబట్టి అలాంటి వారిని ప్రభుత్వం పట్టుకుని రాజద్రోహ నేరం కింద ఉరి తీస్తేనో, వారివల్ల ప్రభావితులైన వారిమీద డిఫెన్సు ఆఫ్ ఇండియా యాక్టు కింద కేసులు పెట్టి ఖైదు చేస్తేనో... వారికి బాసటగా నిలవలేదని అహింసాప్రవక్త అయిన గాంధీగారిని ఎవరూ తప్పుపట్టకూడదు. విప్లవకారుల సంగతి అలా ఉంచితే కనీసం హింసాత్మక రాజకీయంలో ఎలాంటి ప్రమేయం లేని మిగతా దేశం నిష్కారణంగా పడుతున్న ఘోర దురవస్థలనైనా గాంధీగారు పట్టించుకున్నారా?

గాంధీజీ తిరిగొచ్చే సమయానికి మొదటి ప్రపంచ యుద్ధం హోరాహోరీగా సాగుతున్నది. జర్మనీపై యుద్ధం ప్రకటించగానే తనతోబాటు ఇండియానూ యుద్ధగుండంలోకి బ్రిటన్ బలవంతంగా దింపింది. ఎవరినీ అడగాపెట్టకుండా, ప్రజల ఇష్టానిష్టాలతో నిమిత్తం లేకుండా తనకు సంబంధంలేని యుద్ధంలోకి నిరంకుశంగా లాగడమేకాదు. భారతదేశం చేత పది కోట్ల పౌండ్ల 'ఉచిత బహుమతి'ని కూడా సామ్రాజ్య యుద్ధావసరాలకు గాను గ్రేట్ బ్రిటన్ ఉదారంగా ఇప్పించేసుకుంది. ఆ రోజుల్లో పది కోట్ల పౌండ్లంటే భారత సర్కారుకు ఏటా వచ్చే అన్ని బాపతుల రెవిన్యూకంటే ఎక్కువ. ఈ ఒక్క "నిర్బంధ బహుమానం" దెబ్బకే ఇండియా జాతీయ ఋణభారం 30 శాతం పెరిగింది. దేశాన్ని దొంగదారిన దుర్మార్గంగా ఆక్రమించింది లగాయతు విచ్చలవిడిగా ఇండియాను నిలువుదోపిడీ చేసి ఓడలకెత్తించుకుపోయిన అపార ధనరాశులతో పోల్చితే ఈ యుద్ధపు బాదుడు ఎంతలెమ్మని నిస్సహాయంగా నిట్టూర్చి సరిపెట్టుకోవటానికీ వీల్లేకపోయింది. చేజిక్కిన అధికారాన్ని అడ్డంగా వాడేసుకుని తమ యుద్ధపు ఖర్చులను ఇండియానుండే ఎక్కువగా వెళ్లదీయడంతో ఆగకుండా సైనిక మందీమార్బలం కోసమూ తెల్లదొరతనం జనాన్ని పిశాచంలా పీడించసాగింది.

యుద్ధానికి ముందు సైన్యంలోకి కొత్త నియామకాలు సాలుకు సగటున 15వేలుగా ఉండేది. అది కాస్తా ఒక్క 1917 సంవత్సరంలోనే 1,21,000కి చేరింది. మరుసటి సంవత్సరం ఏకంగా 3 లక్షలకు పెరిగింది. మొత్తంమీద మొదటి ప్రపంచ యుద్ధం నాలుగేళ్లలో 11 లక్షల 62 వేల మందిని ఇండియాలో కొత్తగా సైన్యంలోకి తీసుకున్నారు. మొత్తం 12 లక్షల 15 వేల మంది భారతీయ సైనికులను విదేశాల్లో యుద్ధానికి పంపారు. అందులో లక్ష మందికి పైగా అసువులు బాసారు. ఫ్రాన్సు, తూర్పు ఆఫ్రికా, మెసపొటేమియా, ఈజిప్టు, పాలస్తీనా, ఏడెన్, పర్షియన్ గల్ఫ్‌ల్లో భారత సైనికుల శౌర్యప్రతాపాలు యుద్ధ ఫలితంపై నిర్ణాయక ప్రభావం చూపి, ప్రపంచ ప్రశంసలందుకున్నాయి. ఒక రకంగా బ్రిటిష్ మహాసామ్రాజ్యాన్ని ప్రపంచ యుద్ధంలో చావుదెబ్బ తినకుండా గట్టెక్కించింది మన వీర సైనికులే. ఐనా – మిగతా స్వతంత్ర దేశాలవలె

ఇండియాకు తన సేనల పరాక్రమం గురించి ఘనంగా చెప్పుకుని గర్వించే ఆస్కారం లేదు. ఎందుకంటే అన్ని లక్షల మంది వీరోచితంగా పోరాడిందీ, లక్ష మందికి పైగా వీరస్వర్గం పొందిందీ కిరాయి సైనికుల హోదాలోనే ! విదేశీ పెత్తందారులు ఎలా ఆజ్ఞాపిస్తే అలా కిమ్మనక నడుచుకోవలసిన బానిసల ప్రతిపత్తితోనే ! ప్రపంచ యుద్ధం ముంచుకొచ్చి తమ సామ్రాజ్యపు పుట్టి మునుగుతుందో తేలుతుందో తెలియక గజ గజ వణికిన స్థితిలో ఇండియా తమకు ఎంతవరకూ సహకరిస్తుందోనని తెల్లవారు చాలా కలవరపడ్డారు. ఈ విశాల దేశాన్ని ఎలాగైనా తమ గుప్పిట్లో, నిలుపుకోవడానికి విశ్వ ప్రయత్నం చేశారు. అందుకు తమ తైనాతీలైన సంస్థానాధీశులనూ, జమీందార్లనూ, తాము ప్రాణంపోసి ఆడిస్తున్న కాంగ్రెసు బొమ్మనూ యథేచ్ఛగా వాడుకున్నారు. దొరల దయాధర్మంపై ఆధారపడి బతికే మాజీ రాజులనూ, ఫ్యూడల్ ప్రముఖులనూ బెల్లించి కోట్లకు కోట్ల రూపాయలను యుద్ధనిధికి విరాళాల కింద సమర్పింపజేసుకున్నారు. యావద్భారత జాతి యుద్ధ సమయంలో తెల్లసామ్రాట్టులను శాయశక్తులా సేవించి, తరించడానికి తహతహలాడుతున్నట్టు వారిచేతా, కాంగ్రెసు మహానాయకుల చేతా దిక్కులదిరేలా అబద్ధ ప్రచారాలూ చేయించారు.

ఇది ఎంతదాకా వెళ్లిందంటే - భారత జాతీయ కాంగ్రెసు అనేది భారతీయుల ప్రయోజనాలకై పాటుపడేందుకు పుట్టిన స్వతంత్ర రాజకీయ సంస్థ అంటూ అప్పటిదాకా తాము అల్లిన అబద్ధపు తెరను కూడా లాగిపారేశారు. ఏకంగా మద్రాసు గవర్నరే 1915 కాంగ్రెసు మహాసభకు వచ్చి కూచుని బ్రిటిషు సింహాసనానికి వీరవిధేయతను ప్రకటించే తీర్మానాన్ని దగ్గరుండి చేయించాడు ! అప్పుడు కాంగ్రెసు అధ్యక్ష స్థానం అలంకరించిన సర్. ఎస్.పి. సిన్హాగారు గవర్నరు మెహర్బానీకోసం మరీ రెచ్చిపోయి "ఈ ప్రమాద ఘడియలో ఇండియాలోని ప్రతి భాగం, ప్రతి ప్రాంతం, ప్రతి వర్గం యుద్ధరంగానికి ఉరికి వెళ్లాలని ఉవ్విళ్లూరుతున్నది. బెంగాలీలూ, సిక్కులూ, పఠాన్లూ భుజం భుజం కలిపి బ్రిటిషు చక్రవర్తి బావుటా కింద పోరాడాలని మహా ఆరాటపడుతున్నారు" అని పరవశించి ఉపన్యసించాడు.

కవిత్వం బాగానే ఉంది. కాని వాస్తవ స్థితి వేరు. బెంగాలీలూ, సిక్కులూ, ఆంగ్లేయుల సేవకు పోటీలు పడుతున్నారని కాంగ్రెసు అధ్యక్షులవారు వర్ణిస్తున్న సమయంలోనే బెంగాల్‌లో, పంజాబ్‌లో యువకుల వెంట పడి, వారికి ఎంతమాత్రం ఇష్టంలేకున్నా బలవంతంగా నిర్బంధించి సైన్యంలో చేర్చేందుకు బ్రిటిషు ప్రభుత్వం రాక్షసంగా పేట్రేగుతున్నది. ఇతర రాష్ట్రాల్లోనూ ఇంచుమించుగా అదే పరిస్థితి. ఎంత మందిని సైన్యంలో చేర్చాలి. యుద్ధ నిధికి ఎంత విరాళం పోగెయ్యాలి అని ప్రతి జిల్లాకూ టార్గెట్లు నిర్ణయించి, వాటిని సాధిస్తారా చస్తారా అని జిల్లా అధికారుల గొంతుమీద

కూర్చునేవారు. వారేమో ఉద్యోగాలు నిలబెట్టుకునేందుకో, ప్రమోషన్లు కొట్టేందుకో ఊళ్లమీద పడి జనాన్ని శతవిధాల పీడించేవారు. మామూలు బెదిరింపులకు, వేధింపులకు పని జరగకపోతే క్రూరంగా శిక్షించి, అమానుషంగా అవమానించైనా సరే అనుకున్నది సాధించేవారు. పూర్వం కొందరు నియంతలు సైన్యంలో చేరడాన్ని నిర్బంధం చేసి, అలా చేరని వారిపై పన్నులు వేసి, అస్తులు లాక్కుని సతాయించేవారని విన్నాము. అలాంటి బలవంతపు Conscriptions కి పంజాబ్‌లో తాము చేసిందేమి తీసిపోదని పంజాబ్‌ను చెండుకుతిన్న లెఫ్టినెంట్ గవర్నర్ ఓడ్వయరే సగర్వంగా చెప్పుకున్నాడంటే ఆ కాలంలో దేశవాసులకు కలిగిన క్లేశం ఎంత భయంకరమైనదో ఊహించవచ్చు.

మరి ఆ సమయాన మహాత్మాగాంధీగారు అదృష్టవశాత్తూ దేశంలోనే ఉన్నారు కదా? ఈ క్లేశాన్ని బాపి, దొరల దాష్టీకాన్ని అరికట్టటానికి ఆయన ఏమి చేశారు ? దారుణ దురాగతాలకు ఎలా స్పందించారు?

యుద్ధానికి రా, కదలిరా !

"If I could make my countrymen retrace their steps, I would make them withdraw all the Congress resolutions, and not whisper 'Home Rule', or 'Responsible Government' during the pendency of the war, I would make India offer all her able - bodied sons as a sacrifice to the Empire at its critical moment, and I know that India, by this very act, would become the most favoured partner in the Empire... ... it is clear to me that we should give to the Empire every available man for its defence ... ... I write this, because I love the English Nation, and I wish to evoke in every Indian the loyalty of Englishmen."

[*My Experiments with Truth,* M.K. Gandhi. PP 373-74)

(నా దేశవాసులు వేసిన అడుగులను వెనక్కు తీసుకునేట్లు చేయగల శక్తి నాకే కనుక ఉంటే వారిచేత మొత్తం కాంగ్రెసు తీర్మానాలన్నిటినీ ఉపసంహరింపజేస్తాను. 'స్వరాజ్యం' 'బాధ్యతాయుత ప్రభుత్వం' అన్న మాటలే యుద్ధం నడిచినంత కాలమూ వినపడకుండా చేస్తాను.. ఆపత్కాలంలో సామ్రాజ్యంకోసం కాయపుష్టి గల తన బిడ్డలందరినీ భారతదేశం బలిదానం ఇచ్చేట్లు చేస్తాను. ఎందుకంటే ఈ పని చెయ్యటం ద్వారానే ఇండియా బ్రిటిష్ సామ్రాజ్యంలో అత్యంత ఆదరణకు నోచుకునే భాగస్వామి అవుతుందని నాకు తెలుసు... సామ్రాజ్య రక్షణకోసం అందుబాటులో ఉన్న ప్రతి మనుష్యుడినీ సామ్రాజ్యానికి సమర్పించాలన్నది నాకు స్పష్టం.. ఇది నేనెందుకు రాస్తున్నానంటే నేను బ్రిటిషు జాతిని ప్రేమిస్తాను కనుక. ప్రతి భారతీయుడిలోనూ ఇంగ్లిషువాడి పట్ల విధేయతను కలిగించాలని నేను కోరుతున్నాను కనుక)

నమ్మకద్రోహంతో దేశాన్ని దౌర్జన్యంగా ఆక్రమించి, దేశ సంపదను విశృంఖలంగా దోచుకుంటూ, తరతరాలుగా భారత జాతిని బానిసత్వపు సంకెళ్లతో బంధించి, అన్ని వర్గాల ప్రజలనూ క్రూరంగా కాల్చుకు తింటున్న బ్రిటిష్ సామ్రాజ్యానికి రాజప్రతినిధి అయిన వైస్రాయికి మొదటి ప్రపంచ యుద్ధకాలంలో మన 'జాతిపిత' గాంధీ మహాత్ముడు పంపిన ప్రేమ సందేశం ఇది. దక్షిణాఫ్రికాలో ఉండగా బోయర్, జులు యుద్ధాల్లో ఆంగ్ల సామ్రాజ్యానికి గాంధీగారు ఉడతాభక్తిగా సేవలందించారంటే అప్పట్లో ఆయన సామ్రాజ్య భక్తి అలాంటిదని సరిపుచ్చుకోవచ్చు. దక్షిణాఫ్రికా వదిలి ఇండియా తిరిగొస్తూ చుట్టుదారిన లండన్‌లో మకాం చేసినప్పుడు మొదలైన మొదటి ప్రపంచ యుద్ధానికి అమూల్య సేవలందించడానికి ఉత్సాహపడ్డారంటేనూ అప్పటికింకా సామ్రాజ్య నిజ స్వరూపం, భారతదేశంపై దాని భయానక దుష్ప్రభావం ఆయనకు అవగతమై ఉండవని సంశయ లాభం ఇవ్వవచ్చు. కాని, ఇండియాకు వచ్చి, తన గురువు గోఖలేగారు ఆదేశించిన ప్రకారం "కళ్లు తెరచి, నోరు మూసుకుని" సంవత్సరంపాటు దేశమంతటా తిరిగాకయినా ఇక్కడి పరిస్థితులు గాంధీజీకి సాకల్యంగా అంతుబట్టి ఉండాలి కదా?

యుద్ధావసరాలకోసం ఇండియా నుంచి మనుషులను, నిధులను, సాధన సామగ్రిని తెల్లవారు ఎంత ఘోరంగా పిండేశారంటే... యుద్ధం మొదలైనప్పుడు వైస్రాయిగా ఉన్న లార్డ్ హార్డింజ్ "వార్ ఆఫీసువారు ఇండియా నెత్తురు మొత్తం ఓడ్చేశార"ని ఆ దరిమిలా బ్రిటిష్ కామన్స్ సభలో చెప్పాడు. తన 'ఆత్మకథ'లోనూ ఆయన అదేమాట రాశాడు. బొట్టు మిగలకుండా ఇండియా రక్తమంతా పీల్చామన్న అభిప్రాయం పరాయివాడూ, పరాయి పాలకుల ప్రతినిధీ అయిన వైస్రాయికే కలిగినప్పుడు, సదరు నెత్తురోడ్చే దారుణాన్ని కళ్లారా చూసి, యుద్ధపు గత్తరలో దేశవాసుల విలవిలను దగ్గరగా గమనించిన జాతీయ నాయకుడికి రక్తం మరిగి ఉండాలి కదా ?

యుద్ధానికి మనుషుల్ని రిక్రూట్ చేసేందుకు, యుద్ధ రుణానికి డబ్బు గుంజేందుకు అధికారులు అనుసరించిన పద్ధతులు "అక్రమం: అభ్యంతరకరం; ప్రజలకు దుర్భరం" అని ముజాఫర్‌గడ్‌లో సెషన్సు జడ్జిగా ఉన్న మిస్టర్ కోల్‌స్ట్రీమ్ అనే బ్రిటిషు న్యాయాధికారి లిఖితపూర్వక తీర్పులో నిష్కర్షగా అభిశంసించాడు. సైన్యంలో చేరమని, యుద్ధానికి నిధులివ్వమని పిశాచాల్లా పీడించే అధికారుల బారినుంచి తప్పించుకోవడానికి వాళ్లొస్తున్నారని తెలియగానే జనం ఊళ్లొదిలి పారిపోయేవారు. వెనక్కి రాక పోతే మీ కొంపలూ, పంటలూ నాశనం చేస్తామని బెదిరించి, కొంతమంది కర్కోటకులు నిజంగానే అంతపనీ చేసేవారు. సైన్యంలో చేరనిచ్చగించనివాళ్లను పట్టి ముళ్లకంపల మీద విసిరి, ఒప్పుకునేదాకా అలాగే అదిమిపట్టేవారు. వారి ఆడవాళ్లను అవమానించేవారు. ఒక తాసిల్దారయితే ఊళ్లో ఆడామగా అందరినీ సమావేశపరచి, సైన్యంలో చేరడానికి ఒప్పుకోని

మగవాళ్లను దిగంబరంగా అందరిముందూ నిలబెట్టేవాడు. ఒక ఊరి వారికి ఓరిమి నశించి, పాపిష్టి తాసిల్దారును అంతా కలిసి చంపేశారు. పీడించే అధికారులపై చెయ్యెత్తే ధైర్యంలేని వాళ్లు లంచాలిచ్చి నిర్బంధపు రిక్రూట్‌మెంటును తప్పించుకునేవారు. ఈ సంగతులన్నీ తరవాత కొద్ది కాలానికి కాంగ్రెసు నియమించిన పంజాబ్ ఎంక్వయిరీ కమిటీ రిపోర్టు (వాల్యూం 1) లో వివరంగా ఉన్నాయి.

కాంగ్రెసువారు నియమించిన కమిటీకి తెలిశాయంటే – దేశమంతటినీ నిర్ఘాంత పరిచిన తెల్ల సర్కారు దుశ్చర్యలు కాంగ్రెసుకు కొత్తగా మార్గదర్శి, జాతీయోద్యమానికి భాగ్యవిధాత అయిన గాంధీగారికి కూడా బాగా తెలిసే ఉండాలి. తమది కాని యుద్ధంలో పరాయి పాలకులకోసం బలి అయ్యేందుకు సైన్యంలో చేరి తీరాలని ఇష్టంలేని వారిని నిర్బంధిస్తూ, జనం గోళ్లూడగొట్టి యుద్ధ నిధులు వసూలుచేస్తూ జన జీవనాన్ని విదేశీ దొరతనం సతాయిస్తున్నప్పుడు ప్రజా నాయకుడన్నవాడు ప్రజల పక్షాన నిలబడి, వారిని పీడించేవారిని శాయశక్తులా ఎదిరించాలి కదా ? యుద్ధ సన్నాహాలకు సహకరించమని సర్కారు తనను కోరినా ఖండితంగా తిరస్కరించాలి కదా ? మరి మన మహాత్ముడు ఏమి చేశారు?

చంపారన్, ఖేదా జిల్లాల్లో రైతుల సమస్యలను చేపట్టి, వారిని తిప్పలు పెడుతున్న నిరంకుశ యంత్రాంగంపై గాంధీజీ చరిత్రాత్మక పోరాటాలు నడిపి, ఘన విజయాలు సాధించిన రోజులవి. విలక్షణమైన సత్యాగ్రహ ఆయుధాన్ని పరిమిత కార్యక్షేత్రంలో ప్రయోగించి దాని అద్భుతశక్తిని నిరూపించిన మహనీయుడు ఇక మొత్తం దేశానికి ఎటువంటి మార్గదర్శనం చేస్తాడు, జాతీయ విమోచన సంగ్రామాన్ని ఎలా నడుపుతాడు అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఘట్టమది. అదిగో ఆ సమయంలో "ఒకసారి వైస్రాయిని కలవమని మిస్టర్ గాంధీని అడగటం మంచిదా కాదా అని వైస్రాయిగారు మిమ్మల్ని కనుక్కోమన్నారు. అశాంతిని రేకెత్తిస్తున్న అతడి కార్యకలాపాలను ప్రయోజనకరమైన మార్గంలోకి మళ్లించడం సాధ్యమని అనిపిస్తున్నది. అతణ్ని అలాగే వదిలేస్తే అతడి శక్తిసామర్థ్యాలు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేట్టున్నాయి." అని 1918 ఏప్రిల్ 17న వైస్రాయి ప్రైవేటు సెక్రటరీ జాన్‌మాఫే హోంమెంబరుకు ఒక లేఖ రాశాడు.

"The Home Member replied:" "I notice that Mr. Gandhi is anxious to be employed on war service in Mesopotamia or France, and if he could be sent out to Mesopotamia in any capacity, it would save a lot of trouble."

(*Mahatma*, D.G. Tendulkar, Vol. I. P. 226)

(దీనికి హోంమెంబరు ఇలా జవాబిచ్చాడు. "మెసపొటేమియాలో గాని, ఫ్రాన్సులోగాని యుద్ధ సేవకు తాను నియోగించబడాలని మిస్టర్ గాంధీ తహతహలాడుతున్నాడు. ఏదో ఒక హోదాలో అతణ్ని మెసపొటేమియాకు పంపించగలిగితే చాలా గొడవలు తీరుతాయి.")

ఈ మాటలు మనకు ఒక పట్టాన నమ్మబుద్ధికాదు. అహింసా ప్రవక్త గాంధీగారేమిటి? అంతులేని హింసకు, బీభత్సానికి నెలవైన యుద్ధంలో తుపాకి పట్టి యుద్ధం చేస్తాననడమేమిటి? అసంభవం ! ఆ తెల్లవాడేదో తెలిసీ తెలియక అలా వదిలి ఉంటాడు. ఐనా - జాతీయ నాయకుడి మనసులో ఏమున్నదో పరాయి ప్రభుత్వ ప్రముఖుడికి ఎలా తెలుస్తుంది - అని సహజంగానే మనకు అనుమానం వస్తుంది. ఐతే - గాంధీగారు అహింస వ్రతం తీసి గట్టున పెట్టి తుపాకీ పట్టి యుద్ధానికి పోదలిచాడన్న సంగతి బ్రిటిష్ అధికారే కాదు - ఆయనను సన్నిహితంగా ఎరిగిన అంతేవాసులూ ధ్రువీకరించారు. ఉదాహరణకు 1917-18 ప్రాంతాల్లో పోలక్ దంపతులు ఇండియాకు వచ్చి, తమ దక్షిణాఫ్రికా నేస్తుడిని కలిశారు. "ఇతరులకు ఆదర్శంగా ఉండటం కోసం యుద్ధ సైనికుడిగా మిమ్మల్ని మీరు సమర్పించుకోవద్దని నా భర్త, మిగతా స్నేహితులు అతి కష్టం మీద గాంధీని ఒప్పించారు" అని మిసెస్ మిల్లీ పోలక్ ఆ దరిమిలా Mr. Gandhi: The Man గ్రంథంలో వెల్లడించింది.

ఐనా - వారినీ వీరినీ సాక్ష్యం అడగటమెందుకు ? వైస్రాయి కార్యదర్శి జాన్‌మాఫేకు 1918 ఏప్రిల్ 30న రాసిన లేఖలో సైన్యానికి రిక్రూటింగు ఏజంటుగా పనిచేయడానికి తనకున్న అర్హతలను వివరిస్తూ స్వయంగా గాంధీగారే ఇలా చెప్పుకున్నారు:

I suppose I must give you something of my past record... I raised the Ambulance Corps in London consisting of nearly 100 students on the outbreak of the present war, and I returned to India in 1915 only because I was suffering from a bad attack of pleurisy... on my being restored to health, I offered my services to Lord Hardinge, and it was then felt that I should not be sent out to Mesopotamia or France, but that I should remain in India.

[*Collected Works of Mahatma Gandhi*, Vol. 17, #8, P.12]

(నా పాత రికార్డు గురించి మీకు చెప్పటం మంచిదనుకుంటా... ప్రస్తుత యుద్ధం మొదలవగానే నేను లండన్‌లో వంద మంది విద్యార్థులతో అంబులెన్స్ కోర్‌ని తయారు చేశా. ప్లూరసీ జబ్బు బాగా బాధించటంవల్ల నేను 1915లో ఇండియాకు తిరిగొచ్చాను... నా ఆరోగ్యం కుదుట పడ్డాక లార్డ్ హార్డింజ్‌కి నా సేవలను ఆఫర్ చేశాను. అదిగో

అప్పుడు మెసొపొటేమియాకో, ఫ్రాన్సుకో పంపించకుండా నన్ను ఇండియాలోనే ఉంచాలని అనుకున్నారు)

అలా అనుకోవటం కరెక్టే. 46 ఏళ్ల నడివయసు గాంధీని తుపాకి ఇచ్చి యుద్ధ రంగానికి పంపించేకంటే ఇండియాలోనే ఉంచితే వేలూ, లక్షల మందిని సైన్యంలోకి చేర్పించటానికి బాగా ఉపయోగపడతాడు. మెడ మీద కత్తిపెట్టి, జనాన్ని బలవంతంగా సైన్యంలోకి చేర్చటంకంటే వారిని ఆకట్టుకునేలా మంచిమాటలు చెప్పి ఆ కార్యాన్ని సాధించగల గాంధీలాంటి వారిని వాడుకోవటం మేలు. అదే తెల్లవారి ఆలోచన. గాంధీ కూడా వారి ఆశను వమ్ముచేయలేదు. 1918 ఏప్రిల్ 29న జరిగిన వార్ కాన్ఫరెన్స్‌కు వైస్రాయి తనను ఆహ్వానించినప్పుడు తిలక్, అనీబిసెంట్, అలీ సోదరుల వంటి జాతీయ నాయకులను కూడా దానికి ఎందుకు పిలవలేదని, ఇటలీతో ఇంగ్లండు లోపాయకారీ ఒప్పందం కుదుర్చుకోవటమేమిటని గాంధీగారు కొంచెం గుణవటమైతే గుణిశారు. మా సామ్రాజ్యం మొత్తంమీద మంచిదనీ, మావల్ల ఇండియాకు మేలే జరిగిందనీ అంగీకరించే పక్షంలో సామ్రాజ్యానికి అవసరమైనప్పుడు సహాయపడటం ప్రతి భారత పౌరుడి విధి కాదా? పత్రికలేవో రాశాయని మీరు మాకు సహాయం మానేస్తారా ? నైతికపరమైన అంశాలు ఏవైనా ఉంటే యుద్ధం ముగిసిన తర్వాత లేవనెత్తవచ్చు. మమ్మల్ని సవాలు చేయవచ్చు. ఆ పని ఇప్పుడు కాదు." అని వైస్రాయ్ చెమ్స్‌ఫోర్డ్ లార్డుగారు తన ప్రైవేటు సెక్రటరీ ద్వారా చెప్పించారట. ఔను, నిజమేకదా అనిపించి గాంధీగారూ శషభిషలను పక్కనపెట్టి వార్ కాన్ఫరెన్సుకు హాజరై, హిందీలో ఝుమాయించి మాట్లాడారు. తీర్మానాన్ని తాను పూర్తి బాధ్యతతో బలపరుస్తున్నట్టు ప్రకటించడమేగాక బయటికి వచ్చినది మొదలుకుని యుద్ధం ముగిసేదాకా సైన్యానికి మనుషుల్ని రిక్రూట్ చేయించే పనిలో నిద్రాహారాలు మాని ఆయన నిమగ్నమయ్యారు.

I have an idea that, If I became your recruiting agent -in-chief, I might rain men on you (నేనే కనక మీకు ముఖ్య రిక్రూటింగ్ ఏజంటును అయితే మీమీద మనుషుల వర్షం కురిపించేవాణ్ని) అని మిస్టర్ జాన్‌మాఫేను (CWMG, Vol. 17, # 9, P. 12) ఆయన మురిపించారు. చీఫ్ రిక్రూటింగ్ ఏజంటుగా ఆయనను సర్కారువారు పెట్టుకున్నారో లేదో తెలియదు. ఆయన మాత్రం మనుషుల వాన నిజంగానే కురిపించి చూపించటానికి శాయశక్తులా పాటుపడ్డారు. ఇందుకు ఆయన పడిన తపన, ప్రజలకు చేసిన బోధ ఎంత గాఢమైందో 1918 జూన్23న నాదియాడ్ నుంచి ఖేదావాసులకు ఆయన పంపిన ఈ సందేశమే చెబుతుంది:

"అతి త్వరగా ఆయుధాల శిక్షణ పొందాలని మనం అనుకుంటే సైన్యంలో చేరటమే తక్షణ కర్తవ్యం. మనం పిరికివాళ్లమని అందరూ అనుకుంటున్నారు. ఈ నింద పోవాలంటే

ఆయుధాలు పట్టటం మనం నేర్వాలి. స్వరాజ్యం పొందాలంటే సులభమైన సూటి దారి ఏమిటంటే సామ్రాజ్య రక్షణలో పాలుపంచుకోవటమే. సామ్రాజ్యం నాశనమైతే మన సురుచిర లక్ష్యాలూ నాశనమవుతాయి. ఖేదా జిల్లాలో 600 గ్రామాలున్నాయి. ఒక్కో ఊళ్లో సగటున వెయ్యి జనాభా ఉంది. ఊరికి ఇరవై మందిని చొప్పున ఇచ్చినా ఖేదా జిల్లా 12 వేల మందిని సైన్యానికి పంపగలుగుతుంది. జిల్లా మొత్తం జనాభా 7 లక్షలలో ఇది కేవలం 17 శాతం. ఏటా మరణాల శాతం కంటే తక్కువ. సామ్రాజ్యం కోసం, స్వరాజ్యంకోసం ఈ మాత్రం త్యాగాన్నయినా చెయ్యలేకపోతే స్వరాజ్యానికి మనం యోగ్యులం కాదు..."

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I, PP. 229-30]

ఆయుధాలు పట్టటం, యుద్ధానికి వెళ్లటం, చంపటం లేదా చావటం ! ఇంకే నాయకుడి నుంచి ఈ మాటలు వెలువడ్డా విశేషంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఏ రూపంలోనూ హింసకు తావులేదని, ఒక మనిషిని ఇంకోమనిషి గాయపరిచేందుకు ససేమిరా సమ్మతించబోనని లోకానికి సుద్దులు చెప్పిన అహింసా ప్రవక్తగారినోటి నుంచి రణోత్సాహపు దివ్యప్రబోధం జాలువారటమే వింతల్లోకెల్లా వింత. సైన్యంలోకి బలవంతంగా చేర్పించడానికి అధికారులు అమాయక జనాన్ని నానా విధాల వేధిస్తున్నారని, మాట వినని వారిపై భయంకరంగా కక్ష తీర్చుకుంటూ భయోత్పాతం రేకెత్తిస్తున్నారని జనం గగ్గోలు పెడుతున్న సంగతి అధికార వర్గంతో ఎడతెగని సంభాషణల్లో గాంధీగారు ఎక్కడా ప్రసావించిన దాఖలాల్లేవు. బ్రిటిషు సామ్రాజ్యాన్ని యుద్ధపు అదనులో సేవించి, దొరల మెహర్బానీ పొందాలన్న ఆత్రంలో జనంగోడు ఏదీ మహాత్ముడి చెవికి సోకలేదు. ఏకదీక్షతో ఊరూరూ తిరిగి యుద్ధాగ్నిగుండానికి మనుషుల సమిధలను విరివిగా పోగుచేసే పనిలో తాను తలమునకలవటమేగాక మిగతా జాతీయ నాయకులనూ అదే విధంగా తలమునకలవ్వమని ఆయన పిలుపు ఇచ్చారు. ఆ ప్రకారం దొరలను సేవించటానికి ఇచ్చగించని నాయకులను తనదైన శైలిలో మందలించారు. ఉదాహరణకు 1918 జులై 4న రాసిన లేఖలో ఆయన అనీబిసెంట్‌ను పట్టుకుని ఇలా దులిపారు.

I search New India in vain for an emphatic declaration from you in favour of unconditional recruting. Surely it must be plain that if every Home Rule leaguer became an active recruiting depot, we would ensure the passing of the Congress - League Scheme... I think this is the time when we must give the people the lead and not await their opinion.

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I, P. 230)

(బేషరతుగా సైన్యంలో చేరవలసిందిగా మీరు దృఢంగా ప్రకటిస్తారని ఆశించి నేను 'న్యూ ఇండియా' పత్రిక అంతా వెతికాను. ఎక్కడా కనిపించలేదు. హోంరూల్ లీగ్‌లో ప్రతి కార్యకర్త రిక్రూటింగ్ డిపోగా మారే పక్షంలో కాంగ్రెస్-లీగ్ పథకాన్ని మనం ఆమోదింపజేసుకోగలుగుతామన్నది స్పష్టం... ప్రజల అభిప్రాయంకోసం ఆగకుండా మనమే నాయకత్వం వహించాల్సిన తరుణమిది).

సరిగ్గా ఇదే వాదనను పునరుద్ఘాటిస్తూ అదే రోజు మహమ్మదాలీకి రాసిన ఇంకో లేఖ లోనూ I do wish you would make an emphatic declaration regarding recruitment (సైన్యానికి రిక్రూట్‌మెంటు గురించి మీరు దృఢంగా ప్రకటన చేయాలి) అని గాంధీజీ ఆకాంక్షించారు.

మరి - ఇంత ఏకదీక్షగా మహాత్ముడు ఉద్యమించి తాను సైతం ప్రపంచాగ్నికి అనేక సమిధలను ఆహుతి చెయ్యాలని ప్రబోధిస్తే దానికి దేశం ఎలా స్పందించింది ?

గాంధీకి వెలి

సైన్యానికి మనుషుల్ని రిక్రూట్ చేసే పనొకటి నేను పైన వేసుకున్నానుకదా. ఖేదా జిల్లాలో కాకపోతే దాన్ని ఇంకెక్కడ మొదలు పెట్టగలను? ఇటీవలి పన్నుల నిరాకరణ ఉద్యమంలో నాతో కలిసి పనిచేసిన వారిని కాకపోతే ఇంకెవరిని రిక్రూట్ చేయగలను? అందుకే ఎకాఎకి నాదియాడ్ వెళ్ళి వల్లభ్‌భాయ్‌తోనూ, మిగతా మిత్రులతోనూ మాట్లాడాను. కొందరికైతే నా ప్రతిపాదన బొత్తిగా నచ్చలేదు. నచ్చిన వారికి కూడా అది ఎంతవరకు నెరవేరుతుందన్న విషయంలో అనుమానాలున్నాయి. నేను అడుగుదామనుకుంటున్న జనానికీ, ప్రభుత్వానికీ మధ్య సుహృద్భావం అస్సలు లేదు. ఐనా మనం చేయాల్సింది చేద్దామనుకున్నాం.

పని మొదలు పెట్టీపెట్టగానే నా కళ్లు తెరచుకున్నాయి. నా ఆశావాదానికి షాక్ తగిలింది. ఇంతకుముందు రెవిన్యూ ఉద్యమంలో జనం కిరాయి కూడా తీసుకోకుండా మాకు అడక్కుండానే బండ్లు ఇచ్చేవారు. వలంటీరుగా ఒక్క మనిషి కావాలని అడిగితే ఇద్దరు ముందుకొచ్చేవారు. ఇప్పుడో ? డబ్బు ఇస్తామని చెప్పినా మాకు ఎవరూ బండి కట్టలేదు. వలంటీర్ల సంగతైతే చెప్పనే అక్కర్లేదు. ఐనా మేము డీలాపడలేదు. తిరగటానికి బండ్లే కావాలా ఏమిటి ? దొరకనప్పుడు బండే అక్కర్లేదనుకుని ఎంతదూరమైనా కాలి నడకనే వెళదాం అనుకున్నాం. అలా రోజుకు ఇరవైమెళ్లు నడవాల్సి వచ్చేది. బండే ఇవ్వనివారు తిండి పెడతారని అపేక్షించటమూ అత్యాశే. ఇష్టంలేని వారిని అన్నం పెట్టమని అడగటమూ బాగుండదు. కాబట్టి మా వెంట వచ్చే ప్రతివాడూ సంచిలో ఆహారం తెచ్చుకోవాలని నిర్ణయించాం. (అది వేసవి కాబట్టి దుప్పట్ల అవసరం లేకపోయింది.)

వెళ్లినచోటల్లా మీటింగులు పెట్టేవాళ్లం. జనం వచ్చేవాళ్లు. కాని ఒకరిద్దరు కూడా సైన్యంలో చేరటానికి ఒప్పుకునేవారు కారు. " మీరు అహింసకు కట్టుబడ్డ మనిషి కదా? ఆయుధాలను పట్టమని మమ్మల్నెలా అడుగుతున్నారు?", మేము సహకరించటానికి ఈ సర్కారు భారతదేశానికి ఏమి చేసింది? "అంటూ మమ్మల్నే ఎదురుప్రశ్నలు వేసేవారు.

My Experiments with Truth అనే గాంధీజీ ఆత్మకథ 371వ పేజీలోని వాక్యాలివి. స్వయానా గాంధీగారే చెప్పిన ఈ మాటలను విన్న తరవాత యుద్ధ సమయంలో బ్రిటిషు సర్కారు కొమ్ముగాసి, సైన్యంలోకి జనాన్ని రిక్రూట్ చేసే బాధ్యతను గాంధీగారు భుజాన వేసుకోవడానికి దేశం ఎలా స్పందించిందని ఇంకెవరినీ అడగాల్సిన పనిలేదు. రిక్రూటింగు పనిమీద గాంధీ, వల్లభ్‌భాయ్‌పటేల్ రోజుకు 20 మైళ్లు కాలి నడకన తిరిగి, సంచిలో తెచ్చుకున్న తిండి తిని, ధర్మశాలల్లో పడుకునేవారనీ... పబ్లిక్ మీటింగుల్లోనే తప్ప మమూలు సమయాల్లో వారిని ఎవరూ పలకరించనంతగా ప్రజల్లో అభాసుపాలయ్యారనీ డి.జి.తెందుల్కర్ రాసిన **'మహాత్మా'** మొదటి సంపుటం 230వ పేజీలో ఉంది. గాంధీజీ బహుజాగ్రత్తగా సరిచూసి ఆమోదించిన జీవిత గ్రంథం కాబట్టి వాటిని కూడా గాంధీగారు స్వయంగా చెప్పిన మాటలుగానే స్వీకరించవచ్చు.

అంతర్జాతీయ ఖ్యాతిగడించిన ఒక ప్రముఖ వ్యక్తి దేశానికీ, ప్రజలకూ, సామ్రాజ్యానికీ గొప్ప సేవ చేసే పెద్ద కార్యంమీద జనంలోకి వెళ్లినప్పుడు... అడిగిన కిరాయి ఇస్తానన్నా ఒక్కరూ ఆయనకు బండికట్టలేదు; తిండిపెట్టలేదు; ఇళ్లలోకి రానివ్వలేదు; ఎదురుపడ్డా మాట్లాడలేదు. అంటే ఏమని అర్థం? ప్రజలు ఆయనను సాంఘికంగా బహిష్కరించారనే కదా?

దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహ ప్రయోగాలు చేస్తుండగానే గాంధీగారి పేరు ఇండియాలో మారుమోగిపోయిందనీ... మధ్య మధ్యలో ఆయన దేశానికి వచ్చినప్పుడల్లా ఆయనను చూసేందుకు జనం విరగబడేవారనీ... సామాన్లు సర్దుకుని శాశ్వతంగా ఇండియాలో తిరిగి అడుగుపెట్టిన క్షణంనుంచీ ప్రజలు, ప్రజానాయకులు ఆయనకు బ్రహ్మరథం పట్టారనీ గాంధీ భక్తులు రాసిన పుస్తకాల్లో మనం చదువుతుంటాం. వాస్తవానికి ఇదీ పరిస్థితి ! యుద్ధంలో వరస పరాజయాల తరవాత, నేరుగా ఇండియా మీదే జర్మనీ దాడికి దిగే సూచనలు కనిపించడంతో బ్రిటిష్ సర్కారు బెంబేలెత్తి వైస్రాయి చేత వార్ కాన్ఫరెన్సు పెట్టించింది. 1918 ఏప్రిల్ చివర్లో, దానికి హాజరై, సైన్యానికి రిక్రూటింగు ఏజంటుగా పనిచేయాలని గాంధీజీ ఉపక్రమించింది 1918 మేలో. అప్పటికి ఆయన ఇండియా తిరిగొచ్చి మూడేళ్లమీద మూణ్నెల్లు తిరిగాయి. ఈ మధ్య కాలంలో ఆయన సంవత్సరంపాటు దేశమంతా తిరిగాడు. ఎన్నో మీటింగుల్లో మాట్లాడాడు. ఐనా - సైన్యానికి రిక్రూటింగు దగ్గరికి వచ్చేసరికి... దేశమంతా నాదే కదా, నేను పిలిస్తే ఎవరు కాదనగలరు - అని అనుకోలేదు. కొద్దికాలం కింద తాను స్థానిక సమస్యపై ఆందోళన నడిపిన ఖేదా జిల్లాకు తప్పితే తాను ఎక్కడికి పోగలననే ఆయన భావించాడు. ఆయన రాసి పెట్టిన మాటలనుబట్టే - వచ్చిన మూడేళ్ల తరవాత 1918 మే నాటికి కూడా దేశంలో తన పలుకుబడి బహుపరిమితమన్న విషయంలో ఆయన భ్రమలు లేవని స్పష్టం.

ఆఖరికి ఆయనను బాగా ఎరిగి, నిన్న మొన్న పెద్ద ఉద్యమంలో ఆయన వెంట నడిచిన ఖేదా ప్రజలు కూడా సైన్యంలో చేరిక దగ్గరికి వచ్చేసరికి నీ మాట వినము పొమ్మన్నారు. పుట్టిన గడ్డనూ, భార్యాబిడ్డలనూ విడిచి పటాలంలో చేరి, అవిటితనాన్నో చావునో కొనితెచ్చుకొనేందుకు సాధారణంగా ఎవరూ ఇష్టపడరు. ఐనా అడుగుతున్నవాడు ఈ మధ్యే తమ తరపున పోరాడిన మహాత్ముడు అయినప్పుడు గౌరవ మర్యాదలు చేసి, చెప్పేది ఆలకించి, లౌక్యంగా తప్పించుకోవటమే మామూలుగా జరిగేది. తమకోసం ఆందోళన చేశాడన్న మొగమాటం కూడా లేకుండా, కనీస సహకారంకూడా ఇవ్వకుండా బండ్లవాళ్ల దగ్గరినుంచి ఇండ్లవాళ్ల వరకూ ప్రతి ఒక్కరూ సాంఘికంగా వెలివేశారంటేనే.. ఆ సమయంలో గాంధీగారి సామ్రాజ్యభక్తిని ఈ దేశం ఎంత ఏవగించుకుందో అర్థం చేసుకోవచ్చు.

గాంధీ వచ్చింది సొంత పనిమీద కాదు. దేశాన్నేలే సర్కారు పనుపున ! ప్రభుత్వానికి ప్రాణావసరమైన పనిమీద వచ్చినవాడిని నిరాదరిస్తే వెలివేస్తే, కర్కోటకులైన బ్రిటిషు పాలకులు ఊరుకోరనీ, పగబట్టి వేధిస్తారనీ, అందరికీ తెలుసు, ఐనా నిర్భయంగా అన్ని గ్రామాల్లో, అన్ని వర్గాలవారూ గాంధీని తూష్ణీకరించారంటే ఆ సమయాన దేశమంతటా ప్రజల్లో బ్రిటిషు వ్యతిరేకత, తెల్లదొరల తైనాతీల మీద జుగుప్స ఎంత ప్రచండంగా ఉన్నదో స్పష్టమవుతుంది.

ఐనా తమ శ్రమ మెల్లిగా ఫలించి, చాలామందే పేర్లు నమోదుచేసుకున్నారనీ, మొదటి బ్యాచిని పంపించాక రిక్రూట్ల సరఫరా రెగ్యులర్‌గా అయేట్టు చూడగలమన్న ఆశ తమకు కలిగిందనీ గాంధీగారు **'ఆత్మకథ'** లో చెప్పకపోలేదు. రిక్రూట్లను ఎక్కడికి పంపించాలన్న విషయం ఆయన కమిషనరుతో చర్చించారట కూడా. అంతకుమించి వివరాలేమీ ఇవ్వలేదు. మొదటి బ్యాచికి పేర్లు నమోదుచేయటానికి ఊరూరూ కాళ్లరిగేలా తిరగడంలో ఆయన కొద్దిరోజుల్లో తీవ్రంగా జబ్బుపడ్డాడు. చాలాకాలం మంచంమీదే ఉండి అతి కష్టంమీద మృత్యుముఖం నుంచి బయటపడ్డాడు. ఆయన కోలుకునేలోగా జర్మనీ ఓడి, ప్రపంచ యుద్ధమే ముగిసింది. ఇక రిక్రూటింగు అవసరమే లేదని వల్లభ్‌భాయ్ ద్వారా ప్రభుత్వం గాంధీకి కబురు పెట్టింది.

ఎక్కడో ఐర్లండులో పుట్టిన అనీబిసెంటమ్మ ఇండియాకు వచ్చి స్థిరపడి, ఈ దేశంతో తాదాత్మ్యం చెంది భారత స్వరాజ్యంకోసం రాజీలేని పోరాటం సాగించింది. ఇండియా మద్దతు బ్రిటన్‌కి కావాలంటే దానికి మూల్యంగా స్వరాజ్యం ఇవ్వాల్సిందేనని ప్రపంచ యుద్ధం మొదలవగానే ఆమె లండన్‌కి వెళ్లి మరీ ప్రకటించింది. తాను నడిపే 'న్యూ ఇండియా' పత్రికలో స్వపరిపాలన కోసం ఉద్యమించాల్సిన అవసరాన్ని వివరిస్తూ ఆమె

వరసగా వ్యాసాలు రాసింది. 1915 చివర్లో కాంగ్రెసు మహాసభల్లో ఇదే అంశం మీద పెద్ద కాంపెయిన్ నడిపి, ఎవరేమన్నా ఎంతగా అడ్డుపడ్డా లెక్కచెయ్యక సెప్టెంబర్ 16లో హోంరూలు లీగు స్థాపించి తిలక్ సహకారంతో పెద్ద ఉద్యమం సాగించింది.

చిత్రమేమిటంటే విదేశీ వనితే ఇండియాకోసం ఇంతగా విరామమెరుగక పోరాడు తూంటే, జన్మతః భారతీయుడైన గాంధీగారు ఆమె రమ్మని పిలిచినా ఉద్యమంలో చేరలేదు. కనీసం సహకరించనైనా లేదు. యుద్ధం నడుస్తుండగా ఉద్యమం నడిపి బ్రిటిషు ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టటం భావ్యంకాదనీ, రాజ్యాంగ సంస్కరణల గురించి యుద్ధం తరవాతే మాట్లాడాలనీ ఆయన గట్టిగా వాదించాడు. యుద్ధం ముగిసీముగియగానే తనవంటి వారి సామ్రాజ్యభక్తికి మెచ్చి బ్రిటిషు సర్కారు స్వరాజ్యాన్ని తప్పక ఇచ్చేస్తుందని గాంధీ తనతో అమాయకంగా అంటూంటే దొరల తత్వాన్ని కాచివడబోసిన అనిబిసెంటమ్మకు నవ్వొచ్చేది. యుద్ధంలో చిక్కుకుని, మనతో వారికి అవసరం పడ్డప్పుడే కావలసింది రాబట్టుకోవాలయ్యా నాయనా అని అక్కడికీ ఆమె నచ్చచెప్పబోయింది. "మిసెస్ బిసెంట్! మీకు బ్రిటిషువారంటే అపనమ్మకం, నాకు అది లేదు. యుద్ధకాలంలో వారికి వ్యతిరేకంగా ఏ ఆందోళనకూ నేను సహాయపడను". అని గాంధీ పుల్ల విరిచినట్టు బదులిచ్చాడు.

[*Mahatma Gandhi,* B.R. Nanda, P.97]

గాంధీ కలవనంత మాత్రాన ఉద్యమం ఆగలేదు. అనీబిసెంట్, తిలక్‌ల 'హోంరూల్' పోరాటాలు బ్రిటిషు సార్వభౌమత్వానికి లోబడ్డ రాజ్యాంగ సంస్కరణలను ఉద్దేశించినవే అయినా ఆ కాలానికి అదే విప్లవాత్మకం ! మితవాదుల చేతుల్లో పూర్తిగా చిక్కి బ్రిటిషు సర్కారుకు వీర విధేయతా ప్రకటనలతో జాతీయ కాంగ్రెసు నిస్తేజం, నిర్వీర్యం కాగా హోంరూల్ లీగ్ జాతి ఆకాంక్షలను ప్రతిబింబించి, జాతీయ వాదులకు ఆకరమైంది. దేశభక్తిగల విద్యావంతులు యావన్మందీ 'హోంరూల్' కోసం గళం కలిపారు. బ్రిటిషు పాలకులు ఎన్నో ఆశలు పెట్టుకుని, ఇండియాకు పంపించిన గాంధీ సర్కారువారు ఎన్ని రాచమర్యాదలు చేసి, ఎంత ప్రాముఖ్యం ఇచ్చినా భారత రాజకీయాల్లో కాలూన లేకపోయాడు. యుద్ధకాలంలో సర్కారీ జులుంపై ప్రజల్లో పెరుగుతున్న క్రోధాగ్నిని నిలువరించలేకపోయాడు. At the moment, probably the most powerful Man in India is Tilak... *(ఈ సమయాన ఇండియాలో కెల్లా శక్తిమంతుడైన వ్యక్తి తిలక్)* అని 1917లో అప్పటి బ్రిటిష్ విదేశాంగ మంత్రి మాంటేగు డైరీలో రాసుకున్న సంగతి ఈ సందర్భంలో గమనార్హం, ఊరంతా ఒకదారి అయితే ఉలిపికట్టెది ఇంకో దారి అన్న సామెతలా దేశమంతా తెల్లదొరతనాన్ని అసహ్యించుకుంటూంటే ఆ దొరతనానికి భక్తాగ్రేసరుడై, 'హోంరూల్'కి సమాంతరంగా 'రిక్రూటింగు ఉద్యమం' చేపట్టినందువల్ల గాంధీ సహజంగానే భారత రాజకీయాల్లో ఏకాకి అయ్యాడు.

ఇక్కడో ప్రశ్న తలెత్తుతుంది. 'హోంరూల్' హోరులోఅనీబిసెంట్, తిలక్‌ల ప్రాబల్యం దుర్నిరీక్షమై, తిలక్ నాయకత్వంలోని అతివాదులది దేశ రాజకీయాల్లో పైచేయి అయితే అయి ఉండొచ్చు. కాని నాటి రాజకీయ రంగంలో ఉన్నవారంతా అతి వాదులేకాదు. మితవాదులూ గణనీయ సంఖ్యలో ఉన్నారు. జాతీయ కాంగ్రెసయితే పూర్తిగా వారి చేతుల్లోనే ఉంది. మితవాదులకు తిరుగులేని నాయకుడైన గోఖలేకి గాంధీ అంటే శిష్యవాత్సల్యంబాటు, అపారమైన గౌరవం ఉండేది. గాంధీ తిరిగొచ్చిన కొద్ది నెలలకే గోఖలే కన్నుమూసిన మాట నిజమే. కానీ తరవాత కూడా గోఖలే అనుయాయులూ, అభిమానులే మితవాద వర్గానికి నాయకులు. గోఖలేకి మహా ఇష్టుడైన గాంధీని నెత్తిన పెట్టుకుని నాయకత్వాన్ని అప్పగించకపోయినా కనీసం తమలో ఒకడిగానైనా మితవాదులు కలుపుకొని ఉండాలి కదా? మరి వారుండగా గాంధీ ఏకాకి ఎలా అయ్యాడు?

ఎలాగ అంటే – గోఖలేజీ పట్ల ఎంత భక్తి విధేయత ఉన్నప్పటికీ ఆయన శిష్యుడు గాంధీ పేరు చెబితే మాత్రం మితవాదులు ఆమడదూరం పరిగెత్తారు. ఆయన పద్ధతులూ, సిద్ధాంతాలూ ఏమిటో వారికి బొత్తిగా అంతుబట్టలేదు. ఆంగ్ల సామ్రాజ్యమంటే ఆయనలాగే తమకూ ఎనలేని ఆరాధనాభావం ఉన్నప్పటికీ ఆయన కోరినట్టు పటాలంలో మనుషుల్ని చేర్చే పనిని మెడకు తగిలించుకుని జనం దగ్గరికి వెళ్లేందుకు వారికి ధైర్యం చాలలేదు. గాంధీని భరించటం తమవల్ల కాదని వారు ఆయనను దూరం పెట్టారు. అటు అతివాదులకూ, ఇటు మితవాదులకూ కూడా తాను కంటగింపు కావటంతో చేసేదిలేక గాంధీ 1915 చివర్లో కాంగ్రెసు మహాసభకు అసలు పోనే లేదు.

సరే ! కాంగ్రెసులోని మితవాదులకు గాంధీ అంటే ఇష్టం లేకపోయింది. ఆయనను దగ్గరికి రానివ్వలేదు. కానీ, స్వయంగా గోఖలేయే స్థాపించిన 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ' అనేది ఉండాలి కదా? కనీసం అదైనా గాంధీని ఆదరించి ఉండాలి కదా? ఆయన కార్యకలాపాలకు అక్కడైనా కాస్తంత నెలవు సమకూరలేదా?

చెప్పుకుంటే సిగ్గుచేటు. ఆ విషయం ఇంకా దారుణం. కాంగ్రెసులోని మితవాదులు గోఖలే కాలం చేశాక గాంధీని దూరం ఉంచారు. 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ' వారయితే గోఖలే బతికుండగానే, స్వయంగా ఆయనే సిఫారసు చేసినా వినకుండా, గాంధీని రానిచ్చేది లేదని మొహమ్మీదే తలుపులు మూశారు. గాంధీ ఎన్ని విధాల అడిగినా, ఎన్ని తీర్ల దువ్వినా వారు ససేమిరా బెసగలేదు. వేరెవరో చెబితే, ఇంకేదో పుస్తకంలోనో చదివితే అబద్ధం అనిపిస్తుంది. కాబట్టి ఈ ముచ్చటను **'ఆత్మకథ'**లో నేరుగా గాంధీగారి మాటల్లోనే విందాం.

బొంబాయిలో ఓడ దిగిన మరుక్షణమే గోఖలేగారి నుంచి కబురొచ్చింది. గవర్నరుగారు మిమ్మల్ని చూడాలనుకుంటున్నారు. ఆయనను కలిసిన తర్వాతే నా దగ్గరికి

రావలసింది - అని. ఆ ప్రకారమే గవర్నర్‌గారిని దర్శించాను. "నేను అడిగేదొక్కటే గవర్నమెంటుకు సంబంధించి మీరు ఏమి చేయతలపెట్టినా ముందుగా నాకు చెప్పండి" అన్నారాయన. "అందుకు అభ్యంతరమేముంది ? నా పద్ధతే అంత. తప్పక చెబుతాను" అని మాట ఇచ్చి సెలవు తీసుకున్నాను. అటునుంచి పూనా వెళ్లాను. అక్కడ గోఖలే గారు, సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సభ్యులు నన్ను అభిమానంతో ముంచెత్తారు. నన్ను కలవటంకోసం గోఖలే వారందరినీ పిలిపించినట్టు జ్ఞాపకం. అన్ని విషయాల మీదా అరమరికలు లేకుండా వారితో చర్చించాను.

నేను వారి సొసైటీలో చేరాలని గోఖలేగారు చాలా పట్టుదలతో ఉన్నారు. నేనూ అంతే. కాని మెంబర్లు ఒప్పుకోలేదు. ఆదర్శాల్లో, పని విధానాల్లో నాకూ వారికీ మధ్య పెద్ద వ్యత్యాసం ఉన్నందున నేను సొసైటీలో చేరటం బాగుండదని వారు అభిప్రాయ పడ్డారు. నా నియమాల విషయంలో ఎంత నిక్కచ్చిగా ఉన్నా వారి నియమాలనూ సహించటానికి నేను సిద్ధమన్న నమ్మకం గోఖలేకి ఉంది.

"కాని.. నిన్ను వారింకా అర్థంచేసుకోలేదు. తమ ప్రిన్సిపుల్సు మీద బిర్రబిగిసి కూర్చున్నారు. ఈ విషయంలో వారు స్వతంత్రులు. వారు నిన్ను ఆమోదించగలరని ఆశిస్తున్నాను. ఒకవేళ ఒప్పుకోకపోయినా వారికి నీమీద గౌరవం, ప్రేమ లేవనుకోకు. తమకు నీ పట్ల ఉన్న అపార గౌరవానికి ఎక్కడ భంగం కలుగుతుందోనన్న తటపటాయింపు తోనే రిస్కు తీసుకోలేక పోతున్నారు. సభ్యత్వ లాంఛనం జరిగినా, జరగకున్నా నిన్ను మా మెంబరుగానే నేను పరిగణిస్తాను" అన్నారు ఆయన.

[*My Experiments with Truth,* M.K. Gandhi, P.313]

గోఖలేగారు కన్నుమూసినట్టు టెలిగ్రాం రాగానే నేను పూనా వెళ్లాను. శ్రాద్ధకర్మలు పూర్తయ్యాక 'సొసైటీ' భవితవ్యం ఏమిటి, అందులో నేను చేరాలా వద్దా అన్నది చర్చకొచ్చింది. ఇది నాకు చాలా డెలికేట్ వ్యవహారం. సభ్యత్వం కోరటం నా విధి; అప్పుడే గోఖలే ఆత్మ సంతసిస్తుందని నాకు అనిపించింది. దాంతో నిస్సంకోచంగా నేను సొసైటీవారిని దువ్వసాగాను. ఆ సమయంలో సొసైటీ మెంబర్లలో అత్యధికులు పూనాలోనే ఉన్నారు. వాళ్లను కలిసి, నా పట్ల వారికున్న భయాలను తొలగించాలని గట్టిగా ప్రయత్నించాను. నా విషయంలో వారు చీలి ఉన్నట్లు నాకు తోచింది. ఒక వర్గం నా ప్రవేశానికి అనుకూలంగా ఉంది. ఇంకో వర్గం గట్టిగా వ్యతిరేకిస్తున్నది. నా మీద అనుకూల వర్గానికి ఉన్నంత అభిమానం ప్రతికూల వర్గానికీ ఉంది. ఐతే సొసైటీ పట్ల వారికున్న విధేయత బహుశా ఇంకా పెద్దది. లేదా నాపై ఎంత ప్రేమ ఉందో సొసైటీపై అంత విధేయతా ఉందనుకుంటా. కాబట్టి మా చర్చలన్నీ అరమరికలు లేకుండా కేవలం

ప్రిన్సిపుల్స్‌కి పరిమితమయ్యాయి. అనేక ముఖ్య విషయాల్లో వారూ, నేనూ భిన్నధ్రువాల్లా ఉన్నాం కనుక నాకు సభ్యత్వం ఇస్తే సొసైటీ మూల లక్ష్యాలకే భంగం వాటిల్లుతుందని నా వ్యతిరేకులు భావించారు. సుదీర్ఘ చర్చల అనంతరం తుది నిర్ణయాన్ని ఇంకో రోజుకు వాయిదా వేశారు.

ఇంటికొచ్చాక నేను చాలా వ్యాకులపడ్డాను. నన్ను చేర్చుకునే విషయంలో మెంబర్ల మధ్యే అంత గాఢమైన చీలిక ఉన్నప్పుడు నా దరఖాస్తును వెనక్కి తీసుకోవడమే ఉత్తమ మనిపించింది. మనసులో మెరపులా ఈ ఆలోచన రాగానే- వాయిదాపడ్డ మీటింగును మళ్లీ పిలవొద్దని శాస్త్రికి రాశాను. నా అర్జీని వ్యతిరేకించినవారు నా ఈ నిర్ణయాన్ని మెచ్చుకున్నారు. దానివల్ల వారికి ఇరకాటం తప్పి మా స్నేహబంధం ఇంకా బిగిసింది.

(అదే గ్రంథం పుటలు 321, 322)

స్వయానా మహాత్ముడే రాసిన తరువాత ఇందులో అతియోశక్తి ఉండదు. వ్యక్తిగతంగా గాంధీగారిని అమితంగా ప్రేమించినవారు, ఆయన పట్ల గౌరవం ఉన్నవారు కూడా సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సభ్యత్వం దగ్గరికి వచ్చేసరికి ఆయన తమలో చేర్చుకోవటానికి ఎంతమాత్రం తగడని ఎందుకు భావించారు? తమ సంస్థను స్థాపించి, స్ఫూర్తిదాయకంగా నడిపించిన గోఖలే అంతటివాడే మహాపురుషుడని కీర్తించి, గట్టిగా సిఫారసు చేసినప్పటికీ గాంధీని లోపలికి రానిస్తే సంస్థ మౌలిక లక్ష్యాలే దెబ్బతింటాయని సొసైటీవారు భయపడటానికి కారణమేమిటి? ఇటు గోఖలే సొంత సంస్థనూ, అటు గోఖలే నియంత్రణ లోని కాంగ్రెసు మితవాద వర్గాన్నీ కూడా హడలగొట్టిన గాంధీ సిద్ధాంతాలు, నమ్మకాలు ఎటువంటివి?

'పార్లమెంటు పడుపుగత్తె'

***"పా**పిష్టి రైళ్లొచ్చి జనాల్ని పాడుచేశాయి. పూర్వం మనవాళ్లు ఎంత దూరమైనా కాలి నడకనే వెళ్లేవారు. మహాఅయితే ఎడ్లబండ్ల మీద ! కాళ్లు, చేతులు ఎంతదూరం తీసుకువెళితే అంతవరకే వెళ్లాలి; నీ చలనం అక్కడిదాకానేరా అబ్బీ అని ప్రకృతి ముందే శాసించింది. ఆ ప్రకారమే మనిషి శరీరాన్ని నిర్మించింది. ప్రకృతి సిద్ధంగా నడచుకుని, పరిమితంగా మాత్రమే కదిలి ఎక్కడివారక్కడ సహజ రీతిలో వేరువేరుగా జీవించినంతకాలం ఏ గొడవా ఉండేదికాదు.*

"మాయదారి రైళ్లొచ్చాక జనం ఎక్కడికి పడితే అక్కడికి విచ్చలవిడిగా తిరుగుతున్నారు. దానివల్ల ఇండియాలోని పవిత్ర స్థలాలు అపవిత్రమయ్యాయి. వెనకటి రోజుల్లో అతికష్టంమీద గానీ వాటిని చేరలేనప్పుడు ఆ పుణ్యక్షేత్రాలు బాగానే ఉండేవి. నిజమైన భక్తులు మాత్రమే వాటిని దర్శించేవారు. రైళ్లొచ్చాక దగుల్బాజీలు కూడా పోతున్నారు. రైల్వేలు ప్లేగు లాంటివి. వాటిల్లో తిరిగే జనం ప్లేగులా ఇతర ప్రాంతాలకు వ్యాపించి అక్కడివారిని చెడగొడుతున్నారు. ఈ రైళ్లొచ్చాకే మనలో మనకు ఇన్ని తేడాలొచ్చాయి. మన కష్టాలన్నీ మనం సృష్టించుకున్నవే. మనిషి తన సృష్టికర్తఅయిన దేవుణ్ని మరచిపోయేట్టు చేసిన రైల్వేలు మహాప్రమాదకరమైన వ్యవస్థ."

ఇది వింటే మీకేమనిపిస్తోంది? ఈ మాటలన్నవాడు ఆధునిక నాగరిక జీవనాన్ని, శాస్త్ర సాంకేతిక పురోగతిని అర్థంచేసుకోలేని మధ్యయుగపు మహామూర్ఖుడనా? తొందరపడి అంత మాట అనెయ్యకండి. కళ్లు పోతాయి. ఇలవేలుపుగా మనం కొలిచే గాంధీ మహాత్ముడు వెలిబుచ్చిన అమోఘ అభిప్రాయాలివి !

ఇంగ్లిషువాళ్ల పాలనవల్ల దేశానికి ఒనగూడిన మేళ్లలో రైల్వే వ్యవస్థ ప్రధానమైనదని కదా మనందరం అనుకునేది? మేలు కాదు - అది తీరని కీడని మహాత్ములవారు అంటారేమిటి? దేవుడిచ్చిన కాళ్లతో వెళ్లగలిగినంత దూరమే వెళ్లి ఎవరి ఊళ్లోవారు.

ఎవరి మానానవారు బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా బతికినప్పుడే దేశం బాగుండేదని; నడమంత్రపు రైళ్లొచ్చి జనం తిరుగుడు మరిగాక పాపం పెరిగి దేశం పాడైందని మెటికలు విరుస్తారేమిటి? రైల్వేలవల్ల కలుషితం కాని చోటెక్కడుందో వెదుక్కుని అక్కడికి వెళ్లి జీవిస్తేనే దేశభక్తులుగా మనగలుగుతామని శిష్యగణానికి ఉపదేశించారేమిటి?

లండన్‌లో చదువుకుని, ఓడలెక్కి దేశాలు తిరిగి, ఆలిండియా అంతటా లెక్కలేనన్నిసార్లు రైళ్లలో ప్రయాణించి జాతిని నడిపించిన గాంధీగారేమిటి? రైలు ఒక ప్లేగు, రైలు ప్రయాణం పాపం అనడం ఏమిటి? నిజంగా ఆయన అలా అని ఉండరు. ఆయన ఒకటంటే గిట్టనివాళ్లు ఇంకోలాగా పెడ అర్థాలు తీశారేమో - అని మీ అనుమానమా? పైన ఉటంకించినవి కిట్టనివారెవరో పుట్టించిన మాటలు కావు. Hind Swaraj or Indian Home Rule గ్రంథంలో నేరుగా ఎం.కె. గాంధీగారి కలం నుంచే జాలువారిన అమూల్య అభిప్రాయలివి. పోనీ - రైళ్ల గురించి ఏదో సందర్భంలో వేరేదో ఉద్దేశంతో అలా అన్నప్పటికీ, అంత మాత్రాన ఆయనవన్నీ బూజుపట్టిన అభిప్రాయాలని ఎలా చెప్పగలమని మీకు సందేహమా? ఇటువంటి ప్రశస్తమైన భావాలను గాంధీగారు ఈ గ్రంథంలో ప్రకటించింది ఒక్క రైల్వేల మీదే కాదు. ఉదాహరణకు డాక్టర్ల గురించి గాంధీ బోధను ఆయన మాటల్లోనే ఆలకించండి:

Sometimes I think that quacks are better than highly qualified doctors... Hospitals are institutions for propagating sin. Men take less care of their bodies and immorality increases... These doctors violate our religious instinct. Most of their medical preparations contain either animal fat or spirituous liquors; both of these are tabooed by Hindus and Mahomedans... To study European Medicine is to deepen our slavery.... We become doctors so that we may obtain honours and riches... There is no real service of humanity in the profession and it is injurious to mankind.

[*Hind Swaraj*, M.K. Gandhi, PP 51-52]

(పెద్ద క్వాలిఫైడ్ డాక్టర్ కంటే నాటు వైద్యులు మేలని ఒక్కోసారి నేను అనుకుంటాను... అస్పత్రులు పాపాన్ని వ్యాప్తిచేసే సంస్థలు. వాటివల్ల మనుషులకు శరీరాలపై జాగ్రత్తపోయి, నీతిమాలిన తనం హెచ్చువుతుంది.. ఈ డాక్టర్లు మన మతాన్ని కూడా దెబ్బతీస్తారు... వీరు వైద్యానికి వాడే మందుల్లో చాల వరకూ జంతువుకొవ్వో, మద్యపు దినుసులో ఉంటాయి. ఈ రెండూ హిందువులకూ, మహమ్మదీయులకూ నిషిద్ధం.. యూరోపియన్ వైద్యాన్ని నేర్వడమంటే మన బానిసత్వాన్ని ఇంకా పెంచటమే... మనం డాక్టర్లయ్యేది గౌరవాలకోసం, సంపదకోసం... ఈ వృత్తిలో నిజమైన మానవసేవ ఏదీ లేదు. మానవ జాతికి దీనివల్ల కలిగేది హానే)

ఇదేమిటి? 'వైద్యోనారాయణోహరిః' అని కదా మన మతం చెప్పింది? అలాంటిది వైద్యం మత విరుద్ధం ఎప్పుడయింది? కడు పవిత్రమైనదని ఇంతవరకూ మనం భావిస్తున్న వైద్య వృత్తి పాపిష్టి వృత్తుల చిట్టాలో ఎలా చేరింది? వైద్యులవల్ల మానవజాతికి కలిగేది హానేనని గాంధీగారు అంత కచ్చితంగా ఎందుకు చెప్పారు? ఇలాంటి చచ్చు సందేహాలు మనకొస్తాయని ఆయనకి తెలుసు. అందుకే తన చల్లని తీర్పుకు చక్కని వివరణ కూడా ఆ పేజీల్లోనే ఇచ్చారు ఇలా:

"డాక్టరు పని ఏమిటి? శరీరాన్ని సంరక్షించటం, సరిగా చెప్పాలంటే – అది కూడా కాదు. వాళ్ల పని శరీరాన్ని బాధించే వ్యాధులను తొలగించటం. వ్యాధులు ఎలా పుడతాయి? మన నిర్లక్ష్యం వల్ల; మన వ్యసనాల వల్లనే ! నేను తెగ తింటాను, నాకు అజీర్తి వస్తుంది. డాక్టరు దగ్గరికి వెళతాను. అతడు మందిస్తాడు. నాకు నయమవుతుంది. నేను మళ్లీ అతిగా తింటాను. మళ్లీ అతడి మాత్రలు మింగుతాను. మొదటే నేను మాత్రలు పుచ్చుకోకపోయి ఉంటే నా జిహ్వ చాపల్యానికి తగిన శిక్ష అనుభవించేవాడిని. మళ్లీ అలా అతిగా తినేవాణ్నికాను. కాని డాక్టరు మధ్యలో అడ్డుపడి, నేను అదే చాపల్యాన్ని కొనసాగించేట్టు చేశాడు. అతడి వల్ల నా ఒళ్లు తేలికపడింది. కాని నా మనసు బలహీనమైంది. కాబట్టి ఔషధాల కోర్సును తీసుకుంటే మనసుపై మనకు కంట్రోలు పోతుందన్నమాట.

"నేను పాపం చేస్తాను. నాకు జబ్బు వస్తుంది. డాక్టరు నయం చేస్తాడు. దాంతో అదే పాపం మళ్లీ చేస్తాను. డాక్టరు కనుక జోక్యం చేసుకోకుండా ఉంటే ప్రకృతి తన పని తాను చేసేది. నామీద నాకు అదుపు ఉండేది. పాపం నుంచి బయటపడి నేను సుఖంగా ఉండేవాడిని".

ఔను కాబోలు! మరి వైద్య వృత్తి ఇంత పాపిష్టిదని తెలియక ఇప్పటికే ఇందులో దిగబడ్డవారు ఏమిచేయాలి? గాంధీమార్గంలోకి రావాలంటే వారి తక్షణ కర్తవ్యమేమిటి? అది కూడా 'ముగింపు' అధ్యాయంలో గాంధీగారు స్పష్టంగా చెప్పారు.

If a doctor, he will give up medicine, and understand that rather than mending bodies, he should mend souls. He will understand that it is better that bodies remain diseased rather than that they are cured through the instrumentality of the diabolical vivisection... Although a doctor, he will take up a handloom and if any patient comes to him, will tell them the cause of their diseases, and will advise them to remove the cause rather than pamper them by giving useless drugs; hi will understand

that if by not taking drugs, the patient dies, the world will not come to grief and that he will have been really merciful to him.
[**Ibid**, P 88]

(అతడు వైద్యుడయిన పక్షంలో, వైద్యాన్ని మానెయ్యాలి. శరీరాన్ని సరిచెయ్యటం గాక తాను మనసుల్ని సరిచేయాలని అర్థం చేసుకోవాలి. రాక్షసమైన కత్తికోతలవల్ల నయమవటం కంటే శరీరంలో జబ్బు ఉండటమే మంచిదని గుర్తించాలి. తాను డాక్టరైనప్పటికీ ఒక నేతమగ్గం చేతపట్టుకోవాలి. ఎవరైనా రోగి తన దగ్గరికి వస్తే పనికిమాలిన మందులివ్వటం కాకుండా వారి జబ్బులకు కారణాలను వివరించి, వాటిని తొలగించుకోండని చెప్పి పంపాలి. మందు తీసుకోని కారణంగా ఒకవేళ రోగి మరణించినా ప్రపంచానికి విచారమేమీ లేదు. ఆ విధంగా రోగి మీద వైద్యుడు నిజమైన దయ చూపించినట్టు!)

దేశాన్ని నిలువుదోపిడీ చేసి, దుర్మార్గంగా, దౌర్జన్యంగా జులుం చేసిన బ్రిటిష్ సర్కారు వల్లే భారతదేశం దారుణంగా అణగారిపోయిందని చాలామంది అంటుంటారు కదా? అది శుద్ధ తప్పు! వట్టి అపోహ! గాంధీగారికి కలిగిన శుద్ధ జ్ఞానం ప్రకారం – ఇండియాను నేలకు తొక్కిపెట్టింది బ్రిటిషు సర్కారు మడమ కాదట! ఆధునిక నాగరికత దుర్భర పదఘట్టన కిందే అభాగ్య దేశం విలవిలలాడుతున్నదట ! బాబోయ్ ! ఇంతకీ ఆధునిక నాగరికతవల్ల దాపురించిన అంత తీరని హాని ఏమిటో ? అది కూడా మహాత్ముడి మాటల్లో వింటేనే బాగుంటుంది.

"... పూర్వం కొద్దిమంది మాత్రమే విలువైన గ్రంథాలు రచించేవారు. ఇప్పుడు ఎవడైనా ఇష్టం వచ్చినట్టు రాసి అచ్చువేసి, ప్రజల మనసుల్ని విష కలుషితం చేస్తున్నాడు. వెనకటి కాలంలో జనం బండ్లమీద ప్రయాణించేవారు. ఇప్పుడు రోజుకు నాలుగొందల మైళ్లు, అంతకంటే ఎక్కువ దూరం రైళ్లలో దూసుకుపోతున్నారు. ఇది నాగరికతకు ***శిఖరాయమానమట!*** *మునుముందు ప్రయాణానికి విమానాలొచ్చి, ప్రపంచంలో ఏ మూలకైనా కొద్ది గంటల్లో చేరటం సాధ్యమవుతుందంటున్నారు. ఇలాగైతే మనుషుల కాళ్లకు, చేతులకు పనుండదు. ఓ బటన్ నొక్కుతారు. వేసుకోవలసిన దుస్తులు చేతిలోకి వస్తాయి. ఇంకో మీట నొక్కుతారు. న్యూస్‌పేపరు ఒళ్లో పడుతుంది. ఇంకో మీట ! మోటారుకారు రెడీగా ఉంటుంది. ఇలా ప్రతి పనీ యంత్రాలే చేస్తాయి. పూర్వం మనుషులు ఎంతసేపు ఇష్టపడితే అంతవరకే ఆరుబయట స్వేచ్ఛగా పనిచేసేవారు. ఇప్పుడు వేలాది కార్మికులు గుమికూడి, ఫ్యాక్టరీల్లో, గనుల్లో పశువుల కంటే హీనంగా పనిచేస్తున్నారు... గతంలో జాబులు పంపించాలంటే ప్రత్యేకంగా మెసెంజర్లను నియమించి, బోలెడు ఖర్చుపెట్టాల్సి వచ్చేది. ఇప్పుడో! పెన్నీ ఖర్చుతో ఎవడైనా లెటరు రాసి తోటివాడిని తిట్టిపోయగలడు..."* **(అదే గ్రంథం, 32వ పేజీ)**

సరే ! నాగరికత చెడ్డది. అది తెచ్చిన యంత్రాలు ఇంకా చెడ్డవి. కాని, ఇప్పటికే ఎన్నో వస్తువులు యంత్రాలమీద తయారవుతున్నాయి కదా? అవి మనకూ కావాలంటే దేశంలో ఆ యంత్రాలను మనమూ సమకూర్చుకోవాలా? లేక – ఇతర దేశాల్లో ఉత్పత్తి అయిన సరుకులను దిగుమతి చేసుకోవాలా? ఈ ప్రశ్న కూడా గాంధీజీ తనకుతానే వేసుకుని సమాధానం ఇలా చెబుతారు.

"ఈ వస్తువులేవీ లేక ముందు ఇండియా ఏమి చేసేది? అదే ఇప్పుడూ చెయ్యాలి. యంత్రాలు లేకుండా గుండుసూదులను తయారుచెయ్యలేకపోతే మనకు గుండు సూదులే వద్దు. ధగధగలాడే గాజు దీపాలంకారాలు మనకు అక్కర్లేదు. ఇంట్లో పండించిన పత్తితో, పూర్వంలాగే వత్తులు చేసుకుని, మట్టి ప్రమిదలో వేసి దీపాలు వెలిగించుకుందాం. దానివల్ల మన కళ్లకు చలవ; డబ్బు ఆదా; స్వదేశీ ఉద్యమానికి ఆసరా. ఆ రకంగా మనకు స్వరాజ్యం వస్తుందన్నమాట" **(పేజి 32)**

భలే స్వరాజ్యం ! ఇంతకీ యంత్రాలంటే బాపూజీకి ఎందుకు ద్వేషం ?

"మెషినరీ అనేది పాములపుట్ట. అందులో ఒకటినుంచి వంద దాకా ఎన్ని పాములైనా ఉండవచ్చు. మెషినరీ ఎక్కడుంటే అక్కడ పెద్ద నగరాలు వెలుస్తాయి. పెద్ద నగరాలున్నచోట ట్రాముకార్లు ఉంటాయి. రైళ్లుంటాయి. ఎక్కడ చూసినా ఎలక్ట్రిక్ లైట్లే కనబడతాయి. ఈ మెషినరీ గురించి చెప్పడానికి నాకు ఒక్క మంచి పాయింటూ గుర్తురావటం లేదు. ఇవి చేసే చెడుపు గురించి పుస్తకాలు రాయవచ్చు." **(పేజి 83)**

"సంపదకూ, సంతోషానికీ సంబంధంలేదని గుర్తించి మన పూర్వీకులు సుఖాలకు, భోగాలకు దూరంగా ఉన్నారు. వేల సంవత్సరాల కిందటి నాగలితోనే మనం ఇప్పటిదాకా నెట్టుకొచ్చాం. పూర్వకాలపు గుడిసెలనే ఇంకా వాడుకుంటున్నాం. దేశవాళీ విద్య కూడా పూర్వం ఉన్నట్టే ఇప్పుడూ ఉంది. బతుకును తుప్పుపట్టించే పోటీని మన వ్యవస్థలో ఎరుగం. మెషినరీని కనిపెట్టటం ఎలాగో మనకు తెలియకకాదు. కాని అలాంటి వాటిపై మనసులు లగ్నంచేస్తే మనం వాటికి బానిసలమై నైతిక ధృతిని కోల్పోతామని మన ముత్తాతలకు తెలుసు. అందుకేవారు బాగా ఆలోచించినమీదట మనం కాళ్లతో చేతులతో చెయ్యగలిగిన దానిని మాత్రమే చేయాలని నిర్ణయించారు". **(పేజి 53)**

ఈ మాటలు ఏ మామూలు సంప్రదాయవాదో అంటే "కళ్లున్న కబోది", "నేటి జీవిత వాస్తవాన్ని అర్థం చేసుకోలేని తిరోగమనవాది", "అభివృద్ధివిరోధి" వగైరా విశేషణాలతో కసితీరా దూషిస్తాం. అవే 'జాతిపితగారి నోట జాలు వారే సరికి జగతికి మార్గదర్శి, గ్రామస్వరాజ్య స్రష్ట, లోకోత్తర ద్రష్ట అంటూ ప్రస్తుతిస్తున్నాం.

ఇంతవరకూ పునశ్చరణ చేసిన దివ్య భావజాలం ఒక ఎత్తయితే... ప్రజాస్వామ్యం గురించి, దానికి మకుటం వంటి పార్లమెంటరీ వ్యవస్థ గురించి మన జాతిపితగారి ఉపదేశామృతం ఇంకో ఎత్తు. తర్జుమా కంటే మూలంలో చదివినప్పుడే దానికి సొగసు.

That which you consider to be the Mother of parliaments is like a sterile woman and a prostitute. Both these are harsh terms, but exactly fit the case. That parliament has not yet, of its own accord, done a single good thing. Hence I have compared it to a sterile woman... It is like a prostitute because it is under the control of Ministers who change from time to time. Today it is under Mr. Asquith, tomorrow it may be under Mr. Balfour... ... If the money and time wasted by parliament were entrusted to a few good men, the English nation would be occupying today a much higher platform. Parliament is simply a costly toy of the nation.

[Ibid. P 28]

(పార్లమెంటుకు మాతృక అని మీరు అనుకునేది నిజానికి ఒక గొడ్రాలు! ఒక పడుపు గత్తె! రెండూ పరుషపదాలే కాని వాస్తవ స్థితికి అతికినట్టు సరిపోతాయి. పార్లమెంటు దానంతట అది ఇంతవరకూ ఒక్క మంచిపని చెయ్యలేదు. అందుకే దాన్ని గొడ్రాలితో పోల్చాను... తడవకొకరుచొప్పున మారే మంత్రుల కంట్రోల్లో ఉంటుంది కాబట్టి అది పడుపుగత్తె లాంటిది. ఇవాళ అది మిస్టర్ యాస్క్విత్ చేతుల్లో ఉంటే రేపు మిస్టర్ బాల్ఫోర్ కిందికి వెళుతుంది.. పార్లమెంటు వృధాచేస్తున్న డబ్బునీ, కాలాన్నీ కొద్దిమంది మంచిమనుషులకు అప్పగిస్తే ఇంగ్లిషు జాతి ఇవాళ ఇంకా ఎంతో ఉన్నత స్థితిలో ఉండేది. పార్లమెంటు అనేది జాతికి ఖరీదైన ఆటబొమ్మ. అంతే.)

ప్రజాస్వామ్యంలో ఎప్పటికప్పుడు ప్రజల తీర్పుమేరకు ప్రభుత్వాలు మారటం మన నాగరికతకు, రాజకీయ పరిణతికి గర్వకారణమని ఇప్పటిదాకా అనుకుంటున్నాం. నిజానికి, అది తల నేలకు కొట్టుకోవలసినంతటి సిగ్గుచేటు విషయమని మన 'జాతిపిత' ఉవాచ. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారే పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికీ, తడవకో విటుడి కింద ఉండే వ్యభిచారిణికీ తేడాలేదన్న మహాత్ముడి మహితోక్తి పటంగట్టి ప్రతి పూజ గదిలోనూ, ప్రతి చట్టసభ ప్రాంగణంలోనూ కళ్లకద్దుకోదగ్గదనటంలో సందేహమా? డాక్టర్లు, లాయర్లు మొదలుకుని రైళ్లు, పార్లమెంట్ల వరకూ ఆధునిక జన జీవనానికి సంబంధించిన అనేక ముఖ్య విషయాల్లో గాంధీగారికిగల నిశ్చితాభిప్రాయాలు ఇంత అమోఘమైనవైనప్పుడు ఆయన తమలో చేరుతానంటేనే 'సర్వెంట్సాఫ్ ఇండియా' సొసైటీవారు హడలిపోయి 'వద్దు బాబోయ్' అని పరుగెత్తారంటే విడ్డూరమా ?

ఇప్పటిదాకా చెప్పుకున్న భలేభావాలను సంపుటీకరించిన Hind Swaraj గ్రంథాన్ని గాంధీగారు రచించింది లండన్ నుంచి దక్షిణాఫ్రికాకు ఓడలో తిరిగివస్తూ 1908లో! అప్పటికింకా ఆయనకి అంతర్జాతీయ ఖ్యాతిరాలేదు. ఆ తరవాత ఆయన జీవితంలో ఎన్నో మార్పులొచ్చాయి. ఆలోచనా ధోరణీ మారింది. కాలంతోబాటు ఆయన అభిప్రాయాలూ మారి ఉండవచ్చు కదా? ఎప్పుడో 1908లో ఆయన రాసిన పుస్తకాన్ని పట్టుకుని ఆ తరవాత 40 ఏళ్లలో ఆయన మహాత్మ్యాన్ని తక్కువ చేయడమెందుకు? కరెక్టే. కాని అలా సరిపుచ్చుకునేందుకూ గాంధీగారు ఆస్కారం వదల లేదు. ఈ గ్రంథరాజాన్ని రాసిన 30 ఏళ్ల తరవాత 1938 జులై 14న 'ఆర్యన్‌పాత్' పత్రిక వెలువరించిన హింద్ స్వరాజ్ ప్రత్యేక సంచికకు రాసిచ్చిన సందేశంలో ఆయన తేల్చి చెప్పిందిది:

After the stormy thirty years through which, I have since passed, I have seen nothing to make me alter the views expounded in it.

(ఈ రచన తరవాత గడచిన ముప్ఫైఏళ్ల గాలివానల తరవాత కూడా నాకు ఇందులో ప్రకటించిన అభిప్రాయాల్లో మార్చవలసింది ఏమీ కనిపించలేదు.)

దటీజ్ గాంధీ !

భారతీయులకు... ప్రేమతో...!

యుద్ధం తరవాత విజయోత్సవం. సహకరించిన వారికి భూరి బహుమానం. సంతోష సూచకంగా ప్రజలకు అడక్కుండానే పెద్ద ఉపకారం. వేల సంవత్సరాల చరిత్రలో చిన్నా పెద్దా యుద్ధాలు గెలిచిన ప్రతిసారీ మన రాజులకు ఇది మామూలే. బుల్లి రాజ్యాల చిన్న రాజులే అంత ఔదార్యం చూపితే రవి అస్తమించదనుకునే మహాసామ్రాజ్యాన్నేలే ఆంగ్ల సార్వభౌములు ఏకంగా ప్రపంచ యుద్ధాన్నే గెలిచిన మహదానందంలో దిగ్విజయానికి గొప్ప దోహదం చేసిన భారతదేశానికి ఇంకెంత మహోపకారం చెయ్యాలి? ఎన్నెన్ని వరాల వానలు కురిపించాలి?

చేస్తారనే, కురిపిస్తారనే మన అమాయక చక్రవర్తులు ఆశించారు. బ్రిటిషువారి కర్కశత్వాన్ని అనుదినం అనుభవిస్తూ... యుద్ధకాలంలో మనుషులకోసం, నిధులకోసం తెల్ల సర్కారు పెట్టిన యమబాధలకు ఊరూరా గురిఅయిన సామాన్య జనానికైతే భ్రమలు లేవు. కాని తెల్లవారి జాతి లక్షణాల మీద, వారి ధర్మనిరతి మీద, ఉదార స్వభావం మీద అంతులేని విశ్వాసం పెంచుకున్న మితవాద రాజకీయ నాయకులు రంగుల కలలు కన్నారు. వారి అవసరానికి మనం బేషరతుగా సాయపడితే యుద్ధం తరవాత మన అవసరాలూ వారూ పెద్దమనసుతో తప్పక తీరుస్తారు... మన విధేయతకు మనసు కరిగితే మెల్లిగా స్వరాజ్యమే ఇచ్చేస్తారు - అని నమ్మకంగా చెబుతూ వచ్చిన గాంధీగారైతే మరీనూ.

ఇందుకు తగ్గట్టే బ్రిటిష ప్రభువులూ యుద్ధం ముగిశాక ఇండియాకు రాజ్యాంగ సంస్కరణల వరాల గురించి మాట్లాడటం ఎక్కువ చేశారు. విదేశాంగ మంత్రి మాంటేగు ప్రభువుగారూ, వైస్రాయ్ చెమ్స్‌ఫోర్డ్ దొరగారూ జమిలిగా అల్లుతున్న జిగిబిగి సంస్కరణలు ఎంత త్వరగా తెములుతాయా అని అందరూ ఎదురుచూస్తున్నారు. ఆ సమయాన ఎరుకపడని చేదు నిజమేమిటంటే - దేశాన్ని ఎలా పైకి తెస్తారోనని దేశ నాయకులు

లొట్టలు వేస్తూంటే ఈ దేశాన్ని ఎలా అణగదొక్కాలా అని విదేశీ పాలకులు పథకాలు వేస్తున్నారు. ఒక చెంప మాంటేగుతో కలిసి రాజ్యాంగ సంస్కరణల అల్లికపు పనిని ఆర్భాటంగా కానిస్తూనే ఇంకో వంక (1917 డిసెంబరులో) వైస్రాయి చెమ్స్‌ఫోర్డ్ భారతీయులను తొక్కేసేందుకు సలహాలివ్వటానికి జస్టిస్ సిడ్నీ రౌలత్ పెద్దరికంలో ఉన్నట్టుండి ఓ కమిటీ వేశాడు. ఇండియాలో విప్లవకారులు సాగిస్తున్న క్రిమినల్ కుట్రలు ఏ తీరున ఎంత విస్తృతంగా సాగుతున్నాయి... వాటిని ఎదుర్కోవటంలో ప్రభుత్వానికి వస్తున్న శాసనపరమైన చిక్కులేమిటి.. వాటిని ఎలా సరిచేయాలి అన్నవి ఆ కమిటీని పరిశీలించి చెప్పమన్నారు.

'సెడిషన్ (రాజద్రోహం)కమిటీ'గా ప్రసిద్ధిచెందిన రౌలత్ సంఘం ఆ ప్రకారమే కడు రహస్యంగా సమావేశాలు జరిపి... విప్లవ కార్యకలాపాలకు సంబంధించి బ్రిటిషు ప్రభుత్వం అందించిన సమాచారాన్ని, చూపించిన పత్రాలను మాత్రమే పరిశీలించి... సర్కారు చెప్పిందంతా అక్షరసత్యంగా నమ్మేసి... సర్కారువారు అంతకుముందే ఆలోచించి ఉంచిన ప్రత్యేక శాసనాల పథకాన్ని ఔదల దాల్చి... దాని రుచులకు తగ్గట్టుగా సిఫారసులను వండి తన వంతు పాత్రను యథావిధిగా పోషించింది. యుద్ధకాలంలో మామూలు చట్టాలను పక్కనపెట్టి, పౌరహక్కులను, స్వేచ్ఛలను ఎలాపడితే అలా హరించేందుకు ప్రయోగించిన డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్టును యుద్ధం తరవాత కూడా ఇంకో రూపంలో ఎల్లకాలం కొనసాగించేందుకు రంగం సిద్ధమైంది. 1918 ఏప్రిల్‌లో రౌలత్ కమిటి 226 పేజీల రడీమేడ్ నివేదిక చేతికందగానే ప్రభుత్వం శీఘ్రంగా కదిలి అందులో సూచించిన నమూనా ప్రకారం కరకుకోరల బిల్లులు రెండిటిని తెచ్చింది. వాటి ప్రకారం సర్కారు తలచుకుంటే రాజద్రోహం పేరుపెట్టి హింసాయుతమా, అహింసాయుతమా అన్న తారతమ్యం లేకుండా అన్ని రకాల రాజకీయ కార్యకలాపాలనూ అణచివేయవచ్చు. తనకు అనుమానం కలిగించిన ఏ పౌరుడినైనా వారంటు లేకుండా అరెస్టు చేయవచ్చు. ఇళ్లు సోదా చేయవచ్చు. అరెస్టు చేసి విచారణ లేకుండా ఎంత కాలమైనా నిర్బంధించవచ్చు. ఎక్కడ ఉండాలో, ఏమి చేయాలో, ఏమి చేయకూడదో ఆజ్ఞాపించవచ్చు. వినకపోతే శత విధాల సతాయించవచ్చు. ఏమి చేసినా అడిగే దిక్కుండదు. న్యాయవాదిని పెట్టుకునేందుకు, అపీలు చేసుకునేందుకు వీలే ఉండదు. మామూలు కోర్టుల్లో నిందితులకు ఉండే అవకాశాలు, సౌలభ్యాలు ఏవీ కొత్త చట్టాల్లో మిగలవు, ఒక్కమాటలో.. పౌర హక్కులను, వ్యక్తి స్వేచ్ఛను కాలరాచే కర్కోటకపు శాసనాలవి. యుద్ధంలో భారతీయుల చేత చేయించుకున్న భారీసహాయానికి బ్రిటిషు సామ్రాజ్యం ఇచ్చిన ప్రేమ కానుక ఇది !

ఈ దుర్మార్గాన్ని దేశం యావత్తూ గర్హించింది. మేలు మరచిన తెల్లవారి కృతఘ్నుతపై సర్వత్రా తీవ్ర వ్యతిరేకత ప్రబలింది. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో మదన్‌మోహన్

మాలవ్యా వంటి నాన్ అఫీషియల్ సభ్యులు శాయశక్తులా ప్రతిఘటించారు. వారిలో నలుగురు ఏకంగా రాజీనామాయే చేశారు. ఒక్క ప్రభుత్వ చర్యపై అంత తీవ్ర స్థాయిలో భారతీయుల నిరసన వెల్లువెత్తడం పుష్కరం కిందటి బెంగాల్ విభజన తరవాత ఇదే ప్రథమం. ఐనా తమ స్వార్థంకోసం దేన్నీ లెక్కచెయ్యని బ్రిటిషు దొరతనం మొండిగా బండగా అభ్యంతరాలను తోసిపుచ్చింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న పౌర స్వేచ్ఛకు దాంతో పెను ప్రమాదం దాపురించింది.

ఊహించని ఈ ఉపద్రవానికి దేశమంతా తల్లడిల్లింది. కలనైనా అనుకోని ఈ ఆశాభంగానికి గాంధీగారూ చప్పున స్పందించారు. 1919 ఫిబ్రవరిలో రౌలత్ బిల్లులను ప్రభుత్వం పెట్టగానే వాటిని ఉపసంహరించుకోమని ఆయన వైస్రాయికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఆలకించలేదు. ఆ బిల్లులు శాసన రూపం దాల్చితే వాటినీ, వాటికి తోడు బోయే నల్లచట్టాలనూ అహింసాయుతంగా ధిక్కరించి తీరుతాం; శాంతియుతంగా, సత్యబద్ధంగా, ఎవరి ప్రాణాలకూ, ఆస్తులకూ హాని లేని రీతిలో సత్యాగ్రహ పోరాటం సాగిస్తాం' అని గాంధీజీ 24 మంది ప్రముఖ సహచరుల సంతకాలతో సత్యాగ్రహ ప్రతిజ్ఞ ప్రకటించారు.

సాధారణంగా వెన్నపూసకంటే మెత్తగా సర్కారు వారితో వ్యవహరించే కాంగ్రెసు నాయకత్వం కూడా రౌలత్ బిల్లులు ప్రజల ప్రాథమిక హక్కులకు గొడ్డలిపెట్టు అని బాహాటంగా నిరసించింది. ఐనా సత్యాగ్రహ ఆయుధం పట్టి, జాతీయ పోరాటం నడిపే స్థితిలో అప్పటి మితవాద కాంగ్రెసూ లేదు; ఇంకో రాజకీయ సంస్థా కనపడలేదు. కాబట్టి గాంధీగారే తన అధ్యక్షతన బొంబాయి ప్రధాన కేంద్రంగా 'సత్యాగ్రహ సభ' స్థాపించారు. వందల సంఖ్యలో కార్యకర్తలు అందులో చేరి 'సత్యాగ్రహ ప్రతిజ్ఞ'పై సంతకం చేయసాగారు. ఉద్యమం ఏ తీరున నడపాలా అని ఆలోచిస్తూండగా గాంధీజీకి మద్రాసు రమ్మని మిత్రుల ఆహ్వానం అందింది. అక్కడ రాజగోపాలాచారి అతిథిగా ఉండగానే రౌలత్ బిల్లుకు సర్కారు ఆమోద ముద్ర పడినట్టు వార్త అందింది. అదే రాత్రి తెల్లవారుఝామున గాంధీగారికి అఖిల భారతమంతటా హర్తాళ్ చేసినట్టు కలవచ్చింది. ఇంకేం? కర్తవ్యం స్ఫురించింది. సత్యాగ్రహ సమరంలో తొలి అస్త్రంగా ఒక రోజున అఖిల భారత 'హర్తాళ్' జరపాలని, ఆ రోజున ఎక్కడివారక్కడ పనులు నిలిపేసి, వ్యాపారాలు కట్టేసి, ఉపవాసం, ప్రార్థనలతో పొద్దుపుచ్చాలని మహాత్ముడు పిలుపునిచ్చాడు.

ఇండియాలో బ్రిటిషు గవర్నమెంటుకు వ్యతిరేకంగా గాంధీ వేసిన మొట్టమొదటి అడుగు ఇది. చంపారన్, ఖేదా వంటి కార్యక్షేత్రాల్లో స్థానిక అధికారులతో స్థానిక సమస్యపై ఘర్షణ పడకపోలేదు. కాని అఖిలభారత స్థాయిలో బ్రిటిషు సర్కారుపై తిరగబడటం గాంధీ రాజకీయ చరిత్రలో అదే మొదలు. దుకాణాలు, విద్యాసంస్థలు మూసెయ్యటం

బెంగాల్ విభజన నాటి వెనుకటి ఆందోళనల్లోనూ జరిగినా, దేశవ్యాప్తంగా ఒకే రోజున ప్రజా జీవనాన్ని స్తంభింపజేయటం అన్నది మున్నెన్నడూ కనీవినీ ఎరుగనిది. జాతీయ హర్తాళ్ ఆలోచన మొత్తం దేశంలో అపూర్వ సంచలనం తెచ్చింది. కోట్లాది జనాన్ని కుల మత విభేదాలకు అతీతంగా ఉమ్మడి చర్యకు ఏకోన్ముఖం చేసి, నిస్సహాయంగా లోలోన కుత కుతలాడుతున్న ప్రజలకు కొత్త ఆయుధాన్ని, కొత్తశక్తిని ఇచ్చింది. అనేక నగరాల్లో, వందలాది గ్రామాల్లో యువతీ యువకులు పెద్దసంఖ్యలో ముందు కొచ్చి సత్యాగ్రహ ప్రతిజ్ఞ చేశారు.

ఆలిండియా హర్తాళ్‌ను 1919 మార్చి 30న జరపాలని తొలుత నిశ్చయించారు. తరవాత ఏ కారణంచేతో దాన్ని ఏప్రిల్ 6కి మార్చారు. తేదీ మార్పు నిర్ణయం ఆలస్యంగా జరిగినందువల్ల చాలా ప్రాంతాలకు సకాలంలో సమాచారం అందలేదు. ఢిల్లీ నగరం సహా అనేక కేంద్రాల్లో ముందు అనుకున్నట్టు మార్చి 30నే ప్రశాంతంగా, సంపూర్ణంగా హర్తాళ్ జరిగింది. బొంబాయి, పంజాబ్ తదితర ప్రాంతాల్లో అది 6న జరిగింది.

ఢిల్లీలో ప్రజాప్రదర్శనకు నాయకత్వం వహించిన స్వామి శ్రద్ధానందపై దుడుకు పోలీసు ఒకడు తుపాకిని ఎక్కుపెడితే ఆయన ధైర్యంగా గుండె చూపించి దమ్ముంటే కాల్చుమన్నాడు. పోలీసులు తుపాకులు దించారు. ప్రతిచోటా ఆర్థిక జీవనం స్తంభించింది. దుకాణాలు, విద్యాలయాలు, కార్ఖానాలు, కర్మాగారాలు మూతపడి సర్వత్రా ఆవరించిన నిశ్శబ్దం భారతీయుల అంతర్నిహిత శక్తిని దొరల గుండెలదిరేలా లోకానికి చాటింది. చెన్నపట్నంలో భారీ ఊరేగింపు, బహిరంగ సభలో లక్షకు పైగా జనం పాల్గొన్నారు. ఢిల్లీలో స్వామి శ్రద్ధానంద, హకీం అజ్మల్‌ఖాన్‌ల అధ్వర్యంలో సాగిన హర్తాళ్‌లో హిందూ, ముస్లిం ఐక్యత ఎంత గొప్పగా వెల్లివిరిసిందంటే జుమ్మామసీదులో ముస్లిం సోదరులనుద్దేశించి ప్రసంగించడానికి స్వామి శ్రద్ధానందను ముస్లిం పెద్దలు సాదరంగా ఆహ్వానించారు. 'వందేమాతరం', 'అల్లాహో అక్బర్' నినాదాలతో మసీదు గోడలు ప్రతిధ్వనించాయి. ఏప్రిల్ 6న బొంబాయిలో పెద్ద ఊరేగింపులో ముందున్న గాంధీ, సరోజినీనాయుడులనూ మహమ్మదీయ మిత్రులు మసీదుకు తీసుకువెళ్ళి మాట్లాడించారు. హిందువులూ, ముస్లిములూ సంఘీబావ సూచకంగా ఒకే గ్లాసునుంచి నీళ్లు తాగారు. ఇలాంటి అపురూప దృశ్యాలు లాహోర్, అమృత్‌సర్, ఇంకా అనేక ఇతర ప్రాంతాల్లోనూ కానవచ్చాయి. పాత గొడవలు మరచి ఇరు మతాలవారూ దేశంకోసం మళ్లీ ఏకమైనందుకు జాతీయవాదు లందరూ సంతోషించారు.

తెల్లవాళ్లు మాత్రం సహజంగానే ఏడ్చుకున్నారు. పథకం ప్రకారం అతి జాగ్రత్తగా తాము ఎన్నో దశాబ్దాలుగా అమలు జరుపుతున్న 'విభజించి పాలించు' నీతికి చెంప

పెట్టులా, చెప్పుదెబ్బలా హిందువులూ ముసల్మాన్లూ, అన్నదమ్ముల్లా కలిసిపోయి, కట్టగట్టుకుని తమపైకే ధ్వజమెత్తడం బ్రిటిషు సామ్రాజ్యవాదుల గుండెల్లో రైళ్లు పరిగెట్టించింది. ఆ ఐక్యతను ఎలాగైనా చెడగొట్టి, జాతీయ ప్రజాఘటనను ఏదో ఒక విధంగా నీరుగార్చాలని వారు కంకణం కట్టుకున్నారు. యుక్తాయుక్తాల జంజాటం విడిచి సామ్రాజ్య స్వార్థంకోసం ఏ నీచానికైనా ఒడిగట్టారు. ఢిల్లీ, పంజాబ్‌ల్లో శాంతియుతంగా సాగుతున్న హర్తాళ్‌లపై పోలీసులు నిష్కారణంగా ప్రతాపం చూపి, పథకం ప్రకారం అశాంతిని రెచ్చగొట్టారు.

ఢిల్లీలో ప్రశాంతంగా సాగుతున్న ఊరేగింపును నిష్కారణంగా కవ్వించి, కాల్పులు జరిపి చాందినీ చౌక్‌వద్ద ఇద్దరు కుర్రవాళ్ల ప్రాణాలు బలిగొన్నారు. ఢిల్లీ రైల్వేస్టేషను వద్ద పోలీసుకాల్పుల్లో ఐదుగురు నేలకొరిగారు. బొంబాయి, యు.పి., బీహార్ తదితర ప్రాంతాల్లో హర్తాళ్ అద్భుతంగా విజయవంతమైందన్న ఆనందం నిలవకుండా పోలీసు జులుంతో పంజాబ్ రక్తసిక్తమైంది. ముందు ఢిల్లీకి, అటునుంచి అమృత్‌సర్‌కూ వెళ్లి బాధితులను పరామర్శిద్దామని, గాంధీజీ బొంబాయి నుంచి రైల్లో బయలుదేరారు. సంవత్సరాంతంలో జరగాల్సి ఉన్న అమృత్‌సర్ కాంగ్రెసుకు ఏర్పాట్లు చర్చించడానికి ఒకసారి వచ్చిపొమ్మని పంజాబ్ కాంగ్రెసు ప్రముఖులు సత్యపాల్, కిచ్లూలు అడిగినందున పనిలోపనిగా అదీ చూసుకోవచ్చునని గాంధీ అనుకున్నారు. ఆయనొకటి తలిస్తే తెల్ల సర్కారు వేరొకటి తలిచింది. రైలు ఢిల్లీదాకా చేరకుండానే పోలీసులు మధ్యలో అటకాయించి, గాంధీని అరెస్టు చేసి బొంబాయికి వెనక్కి పంపారు.

అరెస్టన్న పేరేగాని గాంధీగారిని నిర్బంధించిందీ లేదు. కేసు పెట్టిందీ లేదు. జైలుకు పంపిందీ లేదు. మర్యాదగా రైల్లో తీసుకువెళ్లి బొంబాయి దగ్గర్లోకి వచ్చాక మిమ్మల్ని వదిలేస్తున్నాం. మీ దారిన మీరు వెళ్లవచ్చు అన్నారు. ఇంతోటి దానికి బిల్డప్ మాత్రం బ్రహ్మాండంగా ఇవ్వటంతో తమ నాయకుడిని తమను చేరనివ్వకుండా తెల్ల ప్రభుత్వం అడ్డుపడి ఎక్కడికో తీసుకుపోయి ఏమో చేసేస్తున్నదన్న అనుమానం జనానికి కలిగింది. సహజంగానే వారు రెచ్చిపోయారు. అటువంటి పరిస్థితుల్లో ప్రపంచంలో ఎక్కడైనా జరిగే విధంగానే అక్కడక్కడ ఘర్షణలు, విధ్వంసాలు, అవాంఛనీయ ఘటనలు తటస్థించాయి. ముఖ్యంగా గాంధీ సొంత గడ్డ గుజరాత్‌లో, అందునా ఆయన సత్యాగ్రహ ఆశ్రమం స్థాపించి స్థిరపడ్డ అహ్మదాబాద్‌లో గాంధీ అరెస్టు వార్త కార్చిచ్చులా వ్యాపించింది. మండిపడ్డ మూకలు రైల్వేస్టేషన్లు ధ్వంసం చేశారు. టెలిగ్రాఫ్ లైన్లు తెంపేశారు. దుకాణాలు లూటీ చేశారు. ఒక పోలీసు సార్జంటును కొట్టి చంపారు. ఒక మేజిస్ట్రేటును సజీవదహనం చేశారు. బొంబాయిలోనూ హింసాత్మక ఘటనలు, విధ్వంసక చర్యలు అక్కడక్కడ జరిగాయి.

గాంధీని నిర్బందించారని తెలిసి సహజంగా అవేశపరులైన పంజాబీలూ కోపోద్రిక్తులయ్యారు. ఐనా ఏప్రిల్ 10వ తేదీ వరకూ పంజాబ్ మొత్తం మీద ప్రశాంతంగానే ఉంది. 9వ తేదీన శ్రీరామనవమి ఊరేగింపూ హిందూ - ముస్లిం సఖ్యతతో సజావుగా సాగింది. 10వ తేదీ ఉదయం అమృతసర్‌లో ప్రముఖ కాంగ్రెసు నాయకులు డాక్టర్ సత్యపాల్, డాక్టర్ కిచ్లూలు కాంగ్రెస్ మహాసభల ఏర్పాట్లలో తలమునకలై ఉండగా జిల్లా మేజిస్ట్రేటు వారిని మాట్లాడాలని చెప్పి తన ఇంటికి పిలిపించాడు. అరెస్టు చేస్తున్నామని ప్రకటించి అటునుంచి అటే వారిని చెరసాలకు పంపాడు. ఈ సంగతి తెలిసి అమృతసర్ అట్టుడికిపోయింది. సరిగా అదే సమయానికి గాంధీ అరెస్టు వార్తా తెలిసింది. జనం ఇంకా రెచ్చిపోయారు. ఉన్న పళాన హర్తాళ్ జరిగింది. దుకాణాలు మూసేయించి జనం ఊరేగింపుగా వెళ్లి తమ నాయకులను వదిలిపెట్టమని అడగటానికి జిల్లామేజిస్ట్రేటు బంగళాకు బయలుదేరారు. నిర్బంధంలోని నాయకులను బలవంతంగా విడిపించుకుపోతారేమోనని అధికారులు భయపడ్డారు.

అలాంటిదేమీ జరగలేదు. కాని పోలీసులు అతిగా స్పందించి హాల్‌గేట్ బ్రిడ్జి అనే రైల్వే క్రాసింగువద్ద గుంపును అటకాయించి నిరాయుధులైన గుంపుపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. నేలకొరిగిన మృతులను, క్షతగాత్రులను చూసి ప్రదర్శకులు రెచ్చిపోయి రోడ్డుమీదపడి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. యూరోపియన్లపై దాడి చేశారు. నేషనల్ బ్యాంకు మేనేజరును, అసిస్టెంటు మేనేజరును తెల్లవారైన నేరానికి కొట్టి చంపారు. అలయెన్సు బ్యాంకు మేనేజరు థామ్సన్ తుపాకితో ఆత్మరక్షణ చేసుకోబోతే గుంపు మీద పడి నరికేసింది. తెల్లవారిపై హింసాత్మక దౌర్జన్యాలు ఇంకా చాలా జరిగాయి. మొత్తం ఐదుగురు యూరోపియన్లను చంపేశారు. టెలిఫోన్ ఎక్స్చేంజి, చర్చి, బ్యాంకులు ధ్వంసం చేశారు. పట్టణం వెలుపల రెండు రైల్వేస్టేషన్లను తగులబెట్టారు. టెలిగ్రాఫ్ స్తంభాలు పీకేశారు. మిస్ షెర్‌వుడ్ అనే మిషనరీ డాక్టరు మూకల చేతిలో దెబ్బలు తిని రోడ్డుమీద స్పృహ లేకుండా ఉంటే ఎవరో చూసి ఇంటికి చేర్చారు.

మూకలను అదుపు చేయగలిగిన నాయకులు అమృత్‌సర్‌లో ఇద్దరే ఇద్దరు. ఆ ఇద్దరినీ ప్రభుత్వం నిష్కారణంగా నిర్బంధించి రంగం నుంచి తొలగించడంతో జనాల వెర్రి ఆవేశాన్ని అదుపుచేయటం ఎవరి శక్యమూ కాలేదు. అల్లకల్లోలం చెలరేగిన మరునాడు మృతుల శవయాత్రల ఊరేగింపు ప్రభుత్వ అనుమతితో అవాంఛనీయ ఘటనలు లేకుండా సాఫీగా సాగింది.

పైన ప్రస్తావించిన ఘటనాక్రమాన్ని గమనించిన వారెవరికైనా దురదృష్టకర పరిణామాలన్నీ తెల్లదొరల తొందరబాటు చర్యలవల్ల.. అనవసరపు కవ్వింపులవల్ల...

సర్వత్రా భయవిహ్వాల స్థితి అలుముకున్న పర్యవసానంగానేనని స్పష్టం. బ్రిటిషు సర్కారును కూలదోయాలని కంకణం కట్టుకుని, పథకం ప్రకారం కుట్ర జరిగిన దాఖలాలు ఎక్కడా కనపడవు. పాలకులు కొంచెం సంయమనం చూపి, ప్రజల ఉద్విగ్నతను, అనర్థక ఉద్రిక్తతను శాంతింపజేసేందుకు జాగ్రత్తగా కదిలితే ఎలా ఉండేదో. కాని అసలే కల్లు తాగిన కోతి, పైగా నిప్పు తొక్కింది అన్న చందాన అసలే దురహంకారులైన తెల్లదొరలు మూకల హింసాకాండతో ఇంకా రెచ్చిపోయారు. అల్లర్లను అణచి అమృతసర్‌ను దారికి తెచ్చే పనిని బ్రిగేడియర్ జనరల్ డయ్యర్‌కి ఏరికోరి అప్పగించారు.

ధూమకేతువులా అతడు రానేవచ్చాడు. మానవాళి మరవలేని మహా నరమేధానికి తెర లేపాడు.

జలియన్‌వాలాబాగ్

***1**919 ఏప్రిల్ 13. ఆదివారం. ఆరోజు వైశాఖి. పంజాబీలకు పెద్ద పండుగ. ప్రతి సంవత్సరంలాగే ఈసారీ చుట్టుపట్ల ఊళ్లనుంచి బండ్లు కట్టుకుని వేల జనం ఉదయం నుంచీ అమృత్‌సర్‌కు రాసాగారు. సంతలూ, తిరునాళ్లూ, ఆటల పోటీలూ, పూజా కార్యక్రమాలతో మహాసందడిగా ఏటా కళకళలాడే ఆ పవిత్ర నగరంలో ఈమారు పండుగ సంబరం పెద్దగా కనిపించటం లేదు. ఎవరి మొహంలో చూసినా భయం; తెలియని ఆందోళన; చెప్పరాని వ్యాకులత.*

అందుకు కారణం లేకపోలేదు. అందరూ అభిమానించే పెద్ద నాయకులిద్దరిని మూడు రోజులకింద చెప్పాపెట్టకుండా అరెస్టుచేసి ఎక్కడికో పట్టుకుపోయారు. అది తెలియగానే పట్నమంతటా హర్తాళ్ జరిపించి, జిల్లా మేజిస్ట్రేటు బంగళాకు వారిని విడిపించమని అడగటానికి జనం వెళ్లబోయారు. మధ్యలోనే పోలీసులు అటకాయించి, విచ్చలవిడిగా కాల్పులు జరిపి ఎంతో మందిని చంపేశారు. దాంతో రెచ్చిపోయిన గుంపు యూరోపియన్ బ్యాంకుల మీద, సర్కారీ అస్తుల మీద పడి ధ్వంసం చేసి తెల్ల తోలువాళ్లను ఐదుగురిని చంపారు. దాంతో సర్కారువారు తోకతొక్కిన తాచుల్లా బుసలు కొడుతున్నారు. ఆ కోపంలో ఏమి చేస్తారో, ఎక్కడ విరుచుకుపడతారోనని అందరికీ భయం.

రకరకాల పుకార్లతో ఊరంతా అట్టుడికిపోతున్నది. లాహోర్ కంటోన్మెంటులో సైనికులు తిరుగుబాటు చేశారట. నాలుగువేల మంది రైల్వే కార్మికులు సమ్మెకట్టారట. జార్జిరాజు నశించాలంటూ పంజాబ్‌లో చాలాచోట్లా, అమృత్‌సర్‌లోనూ విద్యార్థులూ, "దండా ఫౌజ్" (కర్రసేన) ముస్లిం కుర్రాళ్లూ కర్రలు పట్టుకుని పెద్దసంఖ్యలో వీధుల వెంట తిరుగుతున్నారు. ఎక్కడ ఏమి జరుగుతున్నదో ఎవరికీ తెలియడంలేదు. దీనికి తోడు పులిమీద పుట్రలా గాంధీ మహాత్ముడిని పంజాబ్ రానివ్వకుండా అడ్డుకుని అరెస్టు చేశారన్న దుర్వార్త.

ప్రతి సంవత్సరంలాగే వైశాఖి వేడుకలైతే అట్టహాసంగా జరగడంలేదు. కాని ఈసారి కొత్త కార్యక్రమం. సాయంత్రం నాలుగున్నరకు జలియన్‌వాలాబాగ్‌లో మీటింగేదో జరగబోతున్నదట. ఇద్దరు కుర్రాళ్లు సీనారేకు డబ్బాలతో చప్పుడు చేస్తూ వీధుల్లో తిరిగి ఈ సంగతి చాటుతున్నారు. నాయకుల అరెస్టును నిరసించటానికి, కాల్పుల్లో మరణించినవారికి సంతాపం ప్రకటించటానికీ, సిటీ కాంగ్రెసు వాళ్లు ఆ సభ పెట్టారట. పెద్ద సంఖ్యలో అక్కడికి జనం పోతూంటే, మనమూ వెళ్లి ఏమి జరుగుతుందో చూద్దామన్న కుతూహలంతో బయటి ఊళ్లవారు కూడా పిల్లాజెల్లతో ఉబుసుపోక అటుకేసి కదిలారు.

పేరులో 'బాగ్' ఉన్నా జలియన్‌వాలాబాగ్‌లో ఇప్పుడు తోట ఏమీ లేదు. ఒకప్పుడక్కడ ఉద్యానవనం ఉండేదంటారు. ప్రస్తుతం అది విశాలమైన ఖాళీ స్థలం. చుట్టూ ఎత్తయిన భవనాలు. వాటికి పెద్దగోడలు. లోపలికి వెళ్లేందుకు, బయటికి వచ్చేందుకు ఒకటే దారి. అదీ చాలా ఇరుకు. సాధారణంగా ఊళ్లో పశువుల సంతలు, బహిరంగ సభలు అక్కడే జరుగుతాయి. ఈరోజు సాయంత్రమయ్యేసరికి మైదానమంతా జనంతో నిండిపోయింది. ఎంతలేదన్నా కనీసం 20వేల మంది.

అక్కడ చేరిన జనంలో చాలామందికి ఒక సంగతి తెలియదు. బ్రిటిషు సర్కారు మూకల ఆగడానికి మండిపడి ఊరుకోలేదు. మొత్తం అమృత్‌సర్ కాపలా బాధ్యతను బ్రిగేడియర్ జనరల్ రెజినాల్డ్ ఎడ్వర్డ్ హెన్రీ డయ్యర్ అనేవాడికి అప్పగించింది. ప్రపంచ యుద్ధంలో పాల్గొని అతడి బ్రిగేడ్ ఈ మధ్యే జలంధర్‌కి తిరిగి వచ్చింది. ఏప్రిల్ 11న అల్లర్లు చెలరేగగానే లెఫ్టినెంటు గవర్నరు అతడిని హుటాహుటిన పిలిపించాడు. ఆ సాయంత్రం వచ్చీరాగానే జనరల్ డయ్యర్ నగరమంతటా సభలూ, సమావేశాలను నిషేధిస్తూ, చీకటి పడ్డాక ఎవరూ వీధుల్లో తిరగరాదని శాసిస్తూ ఉత్తర్వులు జారీచేశాడు.

నిజానికి ఆ అధికారం అతడికి లేదు. పంజాబ్‌లో మార్షల్‌లా పెట్టాలని నిర్ణయమైతే ఐంది. కాని అందుకు సంబంధించిన ఉత్తర్వు ఏప్రిల్ 15న కాని వెలువడలేదు. ఏప్రిల్ 11 నాటికి మార్షల్‌లా లేదు. కనక సైనిక అధికారికి పౌర పాలనపై అజమాయిషీ అధికారం ఉండదు. సమావేశాల నిషేధం లాంటి ఉత్తర్వులను సంబంధిత సివిల్ అధికారులే ఇవ్వాలి. పోనీ అల్లర్లకు మతులు దిమ్మెరపోయి సివిల్ యంత్రాంగం చచ్చుపడిందనుకున్నా... తన అధికార పరిధికి చెందని ఉత్తర్వును జారీచేసిన సైన్యాధికారి కనీసం ఆ సంగతి ప్రజలందరికీ తెలిసేలా చెయ్యాలి. నిషేధం దేనిమీదో, అతిక్రమిస్తే పర్యవసానం ఏమిటో ఊరంతా చాటింపు వేయించాలి. డయ్యర్ దొర అడ్డగోలు ఆర్డరు అయితే వేశాడు. దాన్ని ప్రజలకు ఎరుకపరిచేపని స్థానిక పోలీసుల మీద వదిలేశాడు. వారేమో మొక్కుబడిగా ఏదో కొద్ది చోట్ల మాత్రం చాటింపు వేయించి ఊరకున్నారు.


దరిమిలా హంటర్ కమిషను ముందు ఇచ్చిన సాక్ష్యంలో నగరమంతటా తానే దగ్గరుండి చాటింపు వేయించానని డయ్యర్ బుకాయించాడు. ఏదీ, ఏఏ స్థలాల్లో చాటించారో ఈ మ్యాపు మీద గుర్తుపెట్టి చూపించమని కమిషన్ నిలదీసేసరికి నగరంలో చాలా భాగానికి నిషేధ ఉత్తర్వుల హెచ్చరిక అందలేదని డయ్యరే ఒప్పుకోకతప్పలేదు.

సరే ! ఆర్డరు వేశాడు. దాన్ని ప్రజలకు తెలియజేయాలన్న బాధ్యత మరిచాడు. ఊళ్లో ఫలానాచోట ఏదో సభ జరగబోతోందని విన్నాకైనా అలాంటిది నిషిద్ధమన్న సంగతి జనానికి ముందుగా ఎరుకపరిచాడా ? సభా నిర్వాహకులను పిలిపించి హెచ్చరించాడా? జనం గుమికూడకుండా సభా స్థలంలో గట్టి కాపలా పెట్టి, నిషేధించిన సభను నిరోధించే ప్రయత్నం చేశాడా? లేదు. మధ్యాహ్నం 12 గంటలకల్లా మీటింగు భోగట్టా డయ్యర్‌కి ఉప్పందింది. ఐనా చిటికెన వేలును కదిలించలేదు. చిరు హెచ్చరికనూ చెయ్యలేదు. జలియన్‌వాలాబాగ్ ఆవరణలోకి జనాన్ని వెళ్లనియ్యకుండా ఒక్క పోలీసునూ కాపలా పెట్టలేదు. వేల మంది పోగయ్యేదాకా పొంచి ఉన్నాడు. ముందుగా ఒక విమానాన్ని తక్కువ ఎత్తులో చక్కర్లు కొట్టించి ఆనుపానులను రాబట్టాడు. సభాస్థలమంతా నిండిపోయి జనం గువ్వపిట్టల్లా ఆదమరచి ఉన్నారని నిర్ధారించుకున్నాక వేటగాడిలా లంఘించాడు.

బ్రిగ్స్, అండర్సన్ అనే ఇద్దరు యూరోపియన్ ఆఫీసర్లను, యాభై మంది ఇంగ్లీషు ఇండియన్ రైఫిల్‌మెన్‌ను, నలభైమంది గూర్ఖా సిపాయిలను, మిషిన్‌గన్లు అమర్చిన రెండు సాయుధ శకటాలను వెంట తీసుకుని జనరల్ డయ్యర్ సభా స్థలానికి చేరేసరికి సూర్యాస్తమయం కావొస్తున్నది. ప్రవేశద్వారం మరీ ఇరుకుగా ఉండటంతో సాయుధ శకటాలను లోపలికి తీసుకెళ్లటం కుదరలేదు. వాటిని బయటే వదలివెళ్లి సైనికులు పొజిషన్లు తీసుకున్నారు. ముందు స్థలం మెరకమీద ఉండటం వల్ల పల్లంలో నడుస్తున్న సభ మొత్తం డయ్యర్‌కి స్పష్టంగా కనిపిస్తుంది. అతడు నిలబడ్డచోటుకు నూరునూటయాభై గజాల దూరంలోనే సభావేదిక. రౌలత్ శాసనాలను, ఇటీవలి అరెస్టులను, పోలీసు కాల్పులను ఖండిస్తూ ఎవరో గడగడ మాట్లాడుతున్నారు. చుట్టూతా జనం కొంతమంది శ్రద్ధగా వింటున్నారు. కొంతమంది చెరకుగడలు నములుతూ దిక్కులు చూస్తున్నారు. పల్లెటూరి రైతులు ఉబుసుపోక కబుర్లాడుతున్నారు. చిన్నపిల్లలు సంతలో కొనుక్కున్న బొమ్మలతో ఆడుకుంటూ మైమరచి ఉన్నారు. సర్కారును కూల్చెయ్యాలి, రాజద్రోహానికి కుట్ర చెయ్యాలి అన్న ఆలోచన అక్కడ ఎవరికీ లేదు. వాళ్లను చెదరగొట్టటానికి బలప్రయోగం అక్కర్లేదు. పొమ్మని చెబితే చాలు. ప్రశాంతంగా అంతా వెళ్లిపోయేవాళ్లే.

కాని, అవతలివాడు డయ్యర్. పొమ్మనీ అనలేదు. చెదరగొట్టే ప్రయత్నమూ చెయ్యలేదు. అటు పాతిక మందినీ, ఇటు పాతిక మందినీ మెరకమీద బారుగా నిలబెట్టి ఎలాంటి

ముందస్తు హెచ్చరికా లేకుండా తుపాకులు ఎక్కుపెట్టించి "ఫైర్" అన్నాడు. తూటాలు దూసుకువెళ్ళాయి. యాభై రైఫిళ్లు తెరపి లేకుండా గర్జిస్తూనే ఉన్నాయి. అమాయక జనం పిట్టల్లా రాలుతూనే ఉన్నారు.


jalianwalabagh

ఎవరిలోకంలో వారు మునిగి సైనికుల రాకను మొదట గమనించనే లేదు. కాంగ్రెసు నాయకుడు దుర్గాదాస్ లాంటి వాళ్లు తుపాకి మోత విని ముందస్తు హెచ్చరికగా గాలిలోకి కాలుస్తున్నారే మోనను కున్నాడు. కన్ను మూసి తెరిచేంతలో ఎటుచూసినా హాహాకారాలు, ఎక్కడి వారక్కడ నేలకొరుగుతున్న దృశ్యాలు! భయ విహ్వాలతతో జనం పరుగులు పెట్టారు. తొక్కిసలాటలో ఎందరో చిన్న పిల్లలు, బిడ్డ తల్లులు నలిగిపోయారు. తలదాచుకునేందుకు చోటులేదు. అంతా ఖాళీస్థలం. తప్పించుకునే తెరువులేదు. మూడు వైపులా ఎత్తుగోడలు. బయటికి ఒకటే దారి. అక్కడ యములాళ్లలా డయ్యర్ మనుషులు నిలబడి గురిచూసి కాల్పులు జరుపుతున్నారు. ఎటుపోవాలో తోచక కకావికలైన అభాగ్యులకు ఒక చోట గోడ కొంచెం తక్కువ ఎత్తులో కనబడింది. పొలోమంటూ జనం అటు పరిగెత్తారు. సరిగా అటువైపే డయ్యర్ రైఫిళ్లను గురిపెట్టించాడు. కొంతమంది కంగారులో దగ్గర్లోని బావిలో పడ్డారు. వారిని చూసి ఇంకొందరూ దూకారు. ఒకరిపై ఒకరు పడటంతో ఊపిరాడక చాలామంది చనిపోయారు. కేకలు పెట్టినా ఆదుకునేవారు లేకపోయారు.

సుమారు వంద గజాలలోపు 'లక్ష్యాల' మీద సూర్యాస్తమయానికి ఆరు నిమిషాల ముందు మొదలుపెట్టి పది నిమిషాలపాటు తూటాల జడివాన కురిసింది. అప్పుడైనా ఎందుకు ఆపారంటే ఉన్న తూటాలన్నీ ఖర్చయ్యాయి కనుక.

మొత్తం 1650 రవుండ్లు కాల్పులు జరిగాయి. ఎంతమంది మరణించారో ఈనాటికీ కచ్చితంగా తెలియదు. పంజాబ్ ప్రభుత్వం మృతులు 291 మంది అని మొదట ప్రకటించింది. మేము అంత్యక్రియలు చేసిన దేహాలే 500 పైచిలుకు అని స్థానిక సేవా సమితి పేర్లతో సహా ప్రకటించేసరికి అధికారిక లెక్కను 379కి పెంచారు. భారత జాతీయ కాంగ్రెసు నియమించిన కమిటీ మృతులు కనీసం వెయ్యి అని లెక్కవేసింది.

జలియన్ వాలాబాగ్ దురంతం జరిగిన కొత్తలోనే బ్రిటిషు సర్కారీ బుకాయింపులను ఎండగట్టిన British Administration And the Amritsar Massacre గ్రంథంలో బ్రిటిష్ జర్నలిస్టు B.G. Horniman అంచనా ప్రకారం - మృతులు, క్షతగాత్రులు కలిపి రెండువేలు. అందులో చాలామంది చిన్నపిల్లలు.

ప్రభుత్వంపై తిరగబడిన వారిపై, రెచ్చిపోయిన అందోళనకారులపై, నిరసన ప్రదర్శిస్తున్న ఉద్యమకారులపై ప్రభుత్వాలు విరుచుకుపడి, పెద్ద సంఖ్యలో ప్రాణాలు తీసిన దారుణాలు చరిత్రలో చాలానే ఉన్నాయి. కాని శాంతియుతంగా సంతాప సభలో పాల్గొంటున్న అన్నెం పున్నెమెరుగని అమాయక జనంపై నిష్కారణంగా కాల్పులు జరిపి వందల మందిని బలిగొన్న ఘోరం నాగరిక ప్రపంచ చరిత్రలో అరుదు. సభలో ఉన్న జనం పది నుంచి ఇరవై వేలు అని రకరకాల అంచనాలు. పుణ్యాత్ముడు డయ్యర్ వీలయితే మొత్తం అందరినీ గురిచూసి మట్టుపెట్టేదాకా తన ప్రతాపాన్ని కొనసాగించేవాడే. అదృష్టం బాగుండి మిషిన్ గన్లను లోపలికి తేవడం సాధ్యమవలేదు. కాబట్టి కొన్ని వేలమంది బతికిపోయారు. అతడి వరకూ కంటికి కనపడ్డ ప్రతి మానవుడినీ కాల్చి పారెయ్యటానికే కంకణం కట్టుకుని ఉన్నాడు. ఆ సంగతి సర్కారీ విచారణలో అతడికీ హంటర్ కమిషన్ సభ్యులకూ నడుమ ఈ సంవాదాన్ని చూస్తే అర్థమవుతుంది.

ప్రశ్న : ఇలా అడుగుతున్నందుకు క్షమించండి జనరల్! మరీ భయపడిపోయి గత్యంతరం తోచని స్థితిలో మీరు కాల్పులు జరిపారా ?

***జవాబు** : కాదు. అది నాకు హారిబుల్ డ్యూటీ. వాళ్లమీద దయతోనే నేను చెదరిపోయేందుకు అవకాశం ఇచ్చాను. నామీద బాధ్యత చాలా గొప్పది. కాల్చటమంటూ జరిగితే బాగా కాల్చాలి. బలంగా కాల్చాలి. అప్పుడే ఎఫెక్టు పూర్తిగా పడుతుంది - అని నేను ముందే నిశ్చయించుకున్నాను.*

ప్ర : మీరు తలచుకుంటే కాల్పులు లేకుండానే జనాన్ని చెదరగొట్టగలిగేవారా ?

***జ** : ఆహా ! అది సాధ్యమే కాల్చకుండానే నేను గుంపును చెదరగొట్టగలను. కాని వాళ్లు మళ్లీ అక్కడికి వచ్చి నన్ను చూసి నవ్వేవాళ్లు. నేను ఫూల్ అయ్యేవాణ్ని.*

ప్ర : కాల్పుల్లో ఎంతమంది చనిపోయి ఉండవచ్చు ?

***జ** : నాలుగైదువందలదాకా ఉండొచ్చు. గాయపడ్డవారి సంఖ్య అంతకు మూడింతలు ఉండొచ్చు.*

ప్ర : సాయుధ శకటాలను లోపలికి తెచ్చే వీలు కనుక ఉంటే మీరు మిషన్ గన్లను కూడా ఉపయోగించేవారా?

***జ** : అందుబాటులో ఉన్నట్లయితే వాటితోనూ కాల్పులు జరిపే వాళ్లమే.*

ప్ర : గుంపులో ఏ ఒక్కడి దగ్గరైనా తుపాకి ఉన్నట్టు మీకు సమాచారం అందిందా?

జ : లేదు, లాఠీలు మాత్రం చాలానే ఉన్నాయి.

ప్ర : జనం భయపడి చెదిరిపోసాగాకయినా కాల్పులు ఎందుకు ఆపలేదు?

జ : మొత్తం గుంపు చెదిరిపోయేదాకా కాలుస్తూనే పోవటం నా డ్యూటీ. కొంచెం కాల్పులతో అయ్యేపని కాదది.

ప్ర : అంటే మీ ఉద్దేశం ప్రజలను హడలగొట్టటమా ?

జ : నా ఆర్డర్లు వాళ్లు ధిక్కరించారు కనుక వారిని శిక్షించి గుణపాఠం నేర్పాలనుకున్నాను. మీటింగులు పెట్టకూడదన్న నా ఉత్తర్వులను ఉల్లంఘిస్తే మొత్తం అందరినీ చంపెయ్యాలని మోటారు కారులో అక్కడికి వెళుతున్నప్పుడే నేను నిశ్చయించు కున్నాను. మిలిటరీ దృక్కోణంనుంచి మొత్తం పంజాబ్‌పై దాని ప్రభావం బాగా పడుతుందని నా ఐడియా. దానికోసం చాలానే చెయ్యాల్సి వచ్చింది. అదంతా దయతో చేసిందే.

ప్ర : ఎప్పటికప్పుడు ఫైరింగు దిశ మార్చిస్తూ గుంపు ఎక్కడ ఎక్కువ ఉంటే అటుకేసి మీరు కాల్పులు కేంద్రీకరించారా ?

జ : ఔను

సరే ! శత్రురంగంలో శత్రుసేనపై వీరవిహారం చేసినట్టు వీరాధివీరుడు డయ్యర్ నిస్సహాయులూ, నిరాయుధులూ అయిన స్త్రీలూ, పిల్లలూ, వృద్ధుల మీద, ఏ పాపమెరుగని సామాన్య ప్రజానీకం మీద సైనిక పరాక్రమం ప్రదర్శించి, లక్ష్యాల దిశను మార్చి మార్చి, ప్రాణభయంతో భయ విహ్వలులైన జనం ఎటువైపు పరుగెడితే అటు ఫైరింగును కేంద్రీకరించి పది నిమిషాల్లో విశాల మైదానాన్ని పీనుగుల పోగులతో నింపేశాడు. వందల మంది చనిపోగా ఇంకా ఎన్నో వందల మంది తూటాలు తగిలి, తొక్కిసలాటలో నలిగి, తీవ్రంగా గాయపడి దయనీయంగా ఆక్రందించారు. శిక్షించే పుణ్యకార్యం ముగిశాక కనీసం క్షతగాత్రులకైనా తక్షణ సహాయం అందించాడా ? చావు బతుకుల్లో కొట్టుకులాడుతున్న వారిని మోసుకుపోయి ఆస్పత్రిలో పడెయ్యమనైనా సిపాయిలకు చెప్పాడా? ప్రాణాలు నిలబెట్టటానికి వైద్య సిబ్బందినైనా పిలిపించాడా ?

లేదు. ఎందుకని ?

"అది నా పని కాదు. ఆస్పత్రులు తెరిచే ఉన్నాయి. కావాలనుకుంటే వాళ్లే వెళ్లిపోయే వాళ్లు" అని డయ్యర్ ఉవాచ !

విచ్చలవిడిగా పిచ్చెత్తినట్టు కాల్పులు జరపడంవరకే అతడి పని ! కాళ్లు విరిగి,

తలలు పగిలి, తూటాల గాయాలకు రక్తం ఏకధారగా కారుతూంటే ప్రాణాలు కడబట్టి నేలకూలిన వందలాది అభాగ్యులను లేవదీసి, అస్పత్రికి పంపించే పని మాత్రం అతడిదికాదట. తనది కాని పనిమీద శ్రద్ధ చూపలేదు సరే. చావుబతుకుల్లో కొట్టు మిట్టాడుతున్న వారిని ఆదుకుని, ఆస్పత్రులకు తీసుకుపోయేందుకు కనీసం వారి బంధువులనైనా అనుమతించాడా?

లేదు. ఎవరూ ఆ దరిదాపులకు పోలేకుండా ఊరంతా కర్ఫ్యూ పెట్టాడు. రాత్రి 8 గంటల తరవాత ఎవరైనా వీధుల్లో కనిపిస్తే కాల్చేస్తామని ప్రకటించాడు. ఇక ప్రాణం మీద తీపి ఉన్నవారెవరు ఇల్లు కదిలి వెళతారు? తమ ఆత్మ బంధువులు జలియన్‌వాలాబాగ్ మీటింగుకు వెళ్లారని, అక్కడ కాల్పుల్లో ఎంతోమంది హతమయ్యారని తెలిసినా... తమ వాళ్లు ఇంటికి చేరకపోవడంతో ఏమైపోయారోనని గుండె తల్లడిల్లుతున్నా ఎవరూ కాలు బయట పెట్టకుండా విచ్చు తుపాకులతో దయ్యర్ సైనికులు ! మండు వేసవి తాపంతో గొంతెండుకు పోతున్నా గుక్కెడు నీళ్లు పోసే దిక్కులేక వందల మంది క్షతగాత్రులు రాత్రంతా పొగిలి పొగిలి ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లారు. వారి చుట్టూ ఎటుచూసినా కుళ్లుతున్న శవాల గుట్టలు. వాసననుబట్టి వచ్చి పీనుగులను పీక్కుతినే కుక్కలు. రాబందులు. అది అమృత్‌సర్‌కు జన్మలో మరచిపోలేని భయానక కాళరాత్రి.

మంచిపని చేశావ్!

వ్యక్తులు చేసే తప్పులకు వ్యవస్థను నిందించటం తప్పు. బ్రిటిషు అధికారులలో కొంతమంది చెడ్డవారున్నా బ్రిటిషు వ్యవస్థ మొత్తంమీద మంచిదని, దయగలదని, అన్యాయాన్ని సహించేది కాదని గాంధీగారు ఎప్పుడూ చెప్పేవారు. ఎక్కడో పంజాబ్‌లో ఒక డయ్యర్ పిచ్చిపట్టినట్టు పేట్రేగితే అదంతా బ్రిటిషు ప్రభుత్వమే పనిగట్టుకుని చేయించిందని త్వరపడి నిర్ధారించటం పొరపాటే కావచ్చు. కాని అదంతా కేవలం ఒక అధికారి పుర్రెకు పుట్టిన బుద్ధే అయితే... దయగల బ్రిటిషు సర్కారుకు ఆ పాపంలో ఎలాంటి ప్రమేయం లేకపోతే... జరగరాని ఘోరం జరిగిపోయిందని తెలిసిన వెంటనే చప్పున కదిలి, నాగరిక ప్రపంచంలో తనకు శాశ్వత అపకీర్తి తెచ్చి పెట్టిన నరరూప రాక్షసుడిని కఠినంగా శిక్షించి ఉండాలి కదా ?

జలియన్‌వాలాబాగ్‌లో వేల మందిని నిష్కారణంగా పిట్టల్లా కాల్చిన తన పైశాచికత్వాన్ని జనరల్ డయ్యర్ దాచుకునే ప్రయత్నం చెయ్యలేదు. పొగలు కక్కే తుపాకులను కిందికి దింపగానే తనపై అధికారికి పంపిన రిపోర్టులో తన ఘన నిర్వాకాన్ని ఆ దయామయుడు ఇలా వర్ణించాడు :

I fired and continued to fire until the crowd dispersed and I consider this the least amount of firing which could produce the necessary effect... It was no longer a question of merely dispersing the crowd, but one of producing a sufficient moral effect from a military point of view not only on those who were present, but more especially throughout the Punjab. There could be no question of undue severity.

[*The Life of Mahatma Gandhi*, Louis Fisher, P 232]

(నేను ఫైర్ చేశాను. గుంపు చెదిరిపోయేదాకా ఫైర్ చేస్తూనే ఉన్నాను. కావలసిన ఎఫెక్టు తేవటానికి ఈ మాత్రం ఫైరింగు అవసరమని నేను అనుకున్నాను... గుంపును

చెదరగొట్టటం ఎలాగన్నది సమస్యకాదు; అక్కడున్న వారిమీదేకాక పంజాబ్ అంతటా మిలిటరీ దృక్కోణంనుంచి సరిపడా నైతిక ప్రభావం పడేట్టు చేయటం ఎలాగన్నదే నా ముందున్న ప్రశ్న. ఇందులో తగని కాఠిన్యం చూపడమనే సమస్యే లేదు.)

"మొత్తం పంజాబు మీద తాను కోరే స్పెషల్ ఎఫెక్టు రాబట్టాలంటే చాలా దయగా జస్ట్ ఓ వెయ్యి మందిని చంపితే సరిపోతుందని డయ్యర్ దొరవారు భావించారు సరే. అంతపనీ నిజంగానే చేసినట్టు జంకులేకుండా అతడే స్వయంగా రిపోర్టు చేసినప్పుడైనా – మిలిటరీ ఎఫెక్టుకోసం వందల జనాన్ని కాల్చటమేమిటి నీ పిండాకూడు; అసలు మార్షల్‌లా ఏదీ పెట్టకుండానే జనానికి మిలిటరీ ఆర్డర్లివ్వటానికి నీకెవడిచ్చాడు అధికారం? చెప్పాపెట్టకుండా అన్నివేల మంది నిరాయుధులపైన విచ్చల విడిగా కాల్పులు జరిపేందుకు నీకు చేతులెలా వచ్చాయి? యుద్ధంలో శత్రుసేనల మీద చూపాల్సిన ప్రతాపాన్ని అమాయకప్రజల మీద చూపి అంతలేసి ఊచకోతకు పాల్పడినందుకు నిన్ను ఏమి చేసినా పాపం ఉందా" అని సర్కారువారు మండిపడ్డారా? నాగరిక సమాజంలో నీతికి, న్యాయపాలనకు కట్టుబడ్డానని చెప్పుకునే ఏ ప్రభుత్వమైనా తక్షణం చేసి తీరాల్సిన విధంగా వందల ప్రాణాలు తీసిన నర పిశాచిని కఠినాతి కఠినంగా శిక్షించారా? కనీసం మానవులుగానైనా స్పందించారా?

ఎలా స్పందించారో సుప్రసిద్ధ ఆంగ్ల జర్నలిస్టు B.G. Horniman చెబుతాడు వినండి. *No less than 2,000 people, including a number of mere boys, and even children in arms, were shot down by this British General without warning, and left by him where they fell. And his action was immediately approved by the Lieutenant-Governor, Sir Michael O'Dwyer, in a telegram sent to him by his military superior after he had obtained Sir Michael's assent, which ran: "Your action corect; Lieutenant -Governor approves."*

[British Administration And the Amritsar Massacre, B.G. Horniman, P 120]

(చిన్న పిల్లలు, తల్లుల చేతుల్లోని పసిబిడ్డలు సహా తక్కువలో తక్కువగా రెండువేల మందిని ఈ బ్రిటిషు జనరల్ కాల్చి వేశాడు. కూలినచోటే వారిని వదిలివేశాడు. అతడు చేసినదాన్ని లెఫ్టినెంటు గవర్నరు సర్ మైకేల్ ఓడ్వయర్ ఆమోదించాడు. సర్ మైకేల్ అంగీకారం పొందిన తర్వాత మిలిటరీలో డయ్యర్ పై అధికారి అతడికి ఇలా టెలిగ్రాం పంపాడు; "నువ్వు చేసింది కరెక్టు; లెఫ్టినెంటు గవర్నర్ ఆమోదించారు.")

ఇప్పటిలా ఆ కాలంలో కమ్యూనికేషన్లు అభివృద్ధి చెందలేదు. కనుక ఏప్రిల్ 13 సాయంత్రం అమృత్‌సర్‌లో వాస్తవంగా ఏమి జరిగిందో బ్రిటిష ప్రభుత్వానికి వెంటనే తెలియలేదేమోననుకుందాం. జనరల్ డయ్యర్ పంపిన రిపోర్టును నమ్మి, భయంకర మారణకాండ యావత్తూ తప్పనిసరి పరిస్థితుల్లో జరిగిందని మొదట పొరబడ్డా, నివ్వెరపరిచే నిజాలు మెల్లిగా బయటపడిన తరవాతైనా ఘోర దురంతానికి తెల్లదొరతనం తగురీతిలో స్పందించి ఉండాలి కదా? పంజాబ్‌లో ప్రజలు కట్టకట్టుకుని బ్రిటిష ప్రభుత్వంపై తిరగబడ్డారనీ, 1857 తరవాత మళ్లీ అంతటి స్థాయిలో లేచిన తిరుగుబాటును అణచి, బ్రిటిష సామ్రాజ్యాన్ని సంరక్షించేందుకే డయ్యర్ అంత కరకుగా వ్యవహరించాడని జరిగిన ప్రచారం పచ్చి బూటకమని ప్రభుత్వ పక్షపాతులతో ఏరి కోరి నియమించిన హంటర్ కమిషన్ నివేదికే కుండబద్దలు కొట్టింది. ప్రజలనుంచి ఎటువంటి ప్రతిఘటనా లేకపోయినా, పరిస్థితి మొత్తం మీద ప్రశాంతంగా ఉన్నా పిచ్చెత్తినట్టు రెచ్చిపోయి, విచ్చలవిడి కాల్పులతో విశేష జన సంహారానికి కారకుడయ్యాడని తేటతెల్లమయ్యాక కూడా విధిలేక విధులనుంచి తప్పించారే తప్ప చేసిన ఘోరానికి శిక్షించాలన్న ఆలోచనే దయగల దొరలకు రాలేదు. దరిమిలా కామన్స్ సభ ప్రపంచ ప్రజాగ్రహాన్ని మన్నించి డయ్యర్‌ను అభిశంసిస్తూ తీర్మానమైతే చేసింది. ఏం లాభం? కామన్లు చేసిన దాన్ని లార్డులు తిరగగొట్టారు. డయ్యర్‌ని ఆర్మీనుంచి తప్పించటం అన్యాయమని, దానివల్ల ప్రమాదకరమైన ప్రమాణాన్ని నెలకొల్పినట్టయిందని గర్జిస్తూ ప్రభువుల సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్) గొప్ప తీర్మానం చేసి చరితార్థమైంది. అంతేకాదు. డయ్యర్‌ని ఆంగ్ల సామ్రాజ్యాన్ని కాపాడిన వీరుడిగా కీర్తించి, బ్రిటిష ప్రముఖులు విరాళాలు పోగుచేసి అతడికి పెద్ద పర్సు కూడా బహూకరించారు. ఒక్క మాటలో చెప్పాలంటే బ్రిటిష సామ్రాజ్యం యావత్తూ జనరల్ డయ్యర్‌ను నెత్తిన పెట్టుకుని వీర పూజ చేసింది. అడ్డగోలు అధికారంతో తానిచ్చిన ఆజ్ఞలను అతిక్రమించారన్న ఆగ్రహంతోటే, తప్పు చేసిన వారిని శిక్షించాలన్న మిలిటరీ పట్టుదలతోనే డయ్యర్ జలియన్‌వాలాబాగ్‌లో క్షణికోన్మాదానికి పాల్పడ్డాడని ఎంతటి సామ్రాజ్య భక్తులూ సమర్థించలేరు. అతడి పైశాచిక ప్రతాపం అతడి దృష్టిలో అక్రమంగా గుమికూడిన గుంపును తన ఫక్కీలో చెదరగొట్టేంత వరకే పరిమితం కాలేదు. వందల ప్రాణాలు బలిగొన్న తరవాత కూడా అతడి రాక్షసత్వం నెమ్మదించలేదు. పిశాచంలా వెంటపడి ప్రజలను డయ్యర్ ఎంతలా పీడించాడో **హార్నిమాన్** తన గ్రంథంలో కళ్లకు కట్టినట్టు ఇలా వర్ణించాడు:

"అమృతసర్‌లో కర్ఫ్యూ ఆర్డరును వారాల తరబడి మహాకఠినంగా అమలు చేశారు. జనరల్ డయ్యర్ మొత్తం నగరానికి నీటి సరఫరాను ఆపేశాడు. కరంటు కట్

చేశాడు. బ్రిటిష్ రాజ్ శక్తిముందు ఎవరైనా పాదాక్రాంతం కావలసిందేనని చాటి చెప్పటానికి "పాకుడు ఉత్తర్వు" వేశాడు. జనాన్ని బహిరంగంగా కొరడాలతో కొట్టించాడు. మిస్ షెర్వుడ్ అనే లేడీ డాక్టరుపై దాడి జరిగిన వీధిలో ఎవరూ నడవటానికి వీల్లేదు. అక్కడ అడుగుపెట్టేవారెవరైనా ముక్కు నేలకానించి పాకుకుంటూ వెళ్లాల్సిందేనని డయ్యర్ ఆజ్ఞ. ఆ వీధిలో గౌరవంగా బ్రతికే బ్రిటిషు సామ్రాజ్య పౌరులు ఎందరో ఉన్నారు. మిస్ షెర్వుడ్‌పై దాడి జరిగిన ఆ వీధిలోనే ఆమెను ఆదుకుని, తమ ఇంటికి తీసుకుపోయి, ప్రేమగా సపర్యలు చేసిన పుణ్యాత్ములూ ఉన్నారు. అయినా వారూ వీరన్న తేడా లేకుండా అందరూ ఇంట్లోంచి బయట అడుగుపెట్టాలన్నా, బయటినుంచి ఇంటికి రావాలన్నా డయ్యర్ నికృష్టపు ఉత్తర్వు ప్రకారం ఏ వేళైనా, ఎన్నిసార్లయినా వీధిలో పాకుకుంటూ వెళ్లాల్సిందే. అలా పాకించటం బాగా లేదని ఎవరో అంటే... "వీధిలో పాక కూడదనుకుంటే వాళ్లను ఇళ్ల కప్పుల మీదుగా నడిచి వెళ్లమనండి" అన్న దయాళువు డయ్యర్ !

"అమృతసర్‌లోనూ, మార్షల్‌లా పెట్టిన ఇతర ప్రాంతాల్లోనూ కొరడాలతో కొట్టటం సాధారణ దృశ్యం. స్వల్ప అపరాధాలకు కూడా సరైన సాక్ష్యం లేకున్నా ఈ శిక్షలు వేసేవారు. ఒక్కోసారి ముందు శిక్షవేసి తరవాత విచారణ సాగించేవారు ! మిస్ షెర్వుడ్‌పై దాడి జరిగిన వీధిలో డయ్యర్ ప్రత్యేకంగా ఒక త్రిభుజాకారపు దిమ్మె పెట్టించాడు. దాడి కేసు విచారణ నడుస్తుండగానే నిందితులను ఖైదునుంచి అక్కడికి లాక్కొచ్చి జనం చూస్తుండగా కొరడాదెబ్బలు కొట్టించాడు. పాకుడు ఆజ్ఞలను అతిక్రమించే వారికీ అదే శిక్ష.

"రైల్వేల్లో థర్డ్ క్లాస్ టిక్కెట్ల అమ్మకాన్ని మార్షల్‌లా కింద నిషేధించారు. దాంతో సామాన్యజనం ప్రయాణానికి తీవ్ర అంతరాయం కలిగింది. దారి పక్క పేవ్‌మెంట్ల మీద ఇద్దరి కంటే ఎక్కువ మంది కలిసి తిరగటానికి వీల్లేదన్నారు. యూరోపియన్లు వాడేవి మినహా బైసికిళ్లన్నిటినీ ప్రభుత్వానికి అవసరమని చెప్పి గుంజుకున్నారు. బండ్లనూ లాక్కున్నారు. అర్ధరాత్రి 2 గంటలకు దుకాణాలు తెరవాలన్నారు. ఏ సరుకులను ఏ ధరకు అమ్మాలో తామే నిర్ణయిస్తామన్నారు. ఇళ్లలో జొరబడి సైనికులకు ఏ వస్తువు కావలసి వస్తే అది దౌర్జన్యంగా లాక్కుపోయేవారు. మార్షల్‌లా కమిషన్ల ముందు 298 మందిపై కేసులు పెట్టారు. చట్టబద్ధమైన ప్రొసిజర్లతో, సాక్ష్యాలతో నిమిత్తం లేకుండా ఇష్టానుసారం విచారణ చేసి 51 మందికి మరణశిక్ష వేశారు. 46 మందికి యావజ్జీవ కారాగారం. మిగతా వారికి 3 ఏళ్ల నుంచి 10 ఏళ్ల వరకూ ఖైదు !

[**B.G. Horniman,** P.124-130]

ఇది విని డయ్యర్ అంత కర్కోటకుడు ఎక్కడా ఉండడని తొందరపడి అనకండి ! మేము తక్కువ తిన్నామా అని పంజాబ్‌లోని ఇతర ప్రాంతాల మార్షల్‌లా అడ్మినిస్ట్రేటర్లు గింజుకుంటారు ! డయ్యర్ వలె ఒక్క విడతలో పది పదిహేను నిమిషాలలోనే వెయ్యి మందికి పైగా కాల్చి చంపలేకపోవచ్చు. కాని జనాన్ని నానావిధాల వేధించి, వేయించి, కాల్చుకు తినడంలో మిగతా మారాజులవీ అందెవేసినచేతులే.

చిన్న పట్టణమైన అమృతసర్‌లోనే డయ్యర్ అనేవాడు 'ఓ వెయ్యి మందిని వేసేశాను సర్' అని రిపోర్టు చేయగానే 'శభాష్ మంచిపని చేశావ్' అని మెచ్చుకున్న లెఫ్టినెంటు గవర్నరు దొరవారు స్వయానా తానే కొలువుదీరిన (అప్పటి) పంజాబ్ రాజధాని లాహోర్‌లో విజృంభించి ప్రతాపం చూపకుండా ఉంటాడా? అన్నీ స్వయంగా పర్యవేక్షించి, జనాన్ని సతాయించే పనిలో మిలటరీ అధికారులను అజమాయిషీ చేయడమేగాక అణచివేత కళలో సూపర్ స్పెషలిస్టు అయిన కల్నల్ ఫ్రాంక్ జాన్సన్‌ను స్పెషలార్డరు మీద లాహోర్‌కు పిలిపించాడు. అతగాడు సైనిక దళాలతో దండెత్తి వస్తూ వస్తూనే విమానాలను వెంట బెట్టుకు వచ్చాడు. తక్కువ ఎత్తులో ఎగురుతూ దారిలో ఎక్కడైనా గుంపులు, మీటింగులు కనిపిస్తే బాంబులు వేసెయ్యమని వాటికి చెప్పాడు. జనానికి లేచినవేళ బాగుండి ఎక్కడా సభలూ, గుంపులూ పెద్దగా లేకపోవడంతో ఆరోజు బతికిపోయారు. కల్నల్ జాన్సన్ లాహోర్‌లో ఎడమకాలు మోపగానే కర్ఫ్యూ ఆర్డరు వేశాడు. రాత్రి 8 తరవాత వీధిలో ఎవడైనా కనిపిస్తే కాల్చెయ్యమన్నాడు. లేదా కొరడాలతో కొట్టి కొట్లో వెయ్యమన్నాడు. దుకాణాలు మూసినవారిని కాల్చి, షాపులోని సరుకులు లూటీ చెయ్యమన్నాడు. గోడల మీద అంటించిన మార్షల్‌లా నోటీసులను ఎవరూ చించకుండా, పాడుచెయ్యకుండా గోడల యజమానులే కాపలా కాయాలి, కాగితం చినిగిందా మీ వీపు చిట్లిందే అని బెదిరించాడు. ఒక కాలేజి గోడమీద నోటీసు చినిగేసరికి ఆ కాలేజీ ప్రిన్సిపాలునూ, మొత్తం సిబ్బందినీ అరెస్టు చేసి మూడు రోజులు జైల్లో బంధించాడు. చిన్న పిల్లలూ, యూనివర్సిటీ స్టూడెంట్లూ అన్న తేడా లేకుండా విద్యార్థు లందరినీ రోజుకు నాలుగుసార్లు మండుటెండలో పదహారుమైళ్లు పరుగెత్తించి తారెత్తించాడు. ఊళ్లోని సైకిళ్లూ, మోటారు సైకిళ్లూ, కార్లూ అన్నీ పట్టుకొచ్చి సైన్యానికి ఒప్పగించి పోవాలన్నాడు. సైన్యానికి కావలసిన ఫాన్లూ, లైట్లూగట్రా అన్నిటినీ ఇళ్లమీద పడి లాక్కోమని సోల్జర్లను పురమాయించాడు. పెళ్లికో, చావుకో ఒకచోట చేరిన 'గుంపు'లను కొరడాలతో కొట్టించాడు. వధూవరులను, పురోహితులనూ కూడా నిర్బంధించాడు.

లాహోర్‌లో కల్నల్ జాన్సన్ 'ఇండియన్ డాగ్స్' ని వేటాడటంలో పెద్ద పేరు ఎక్కడ తెచ్చుకుంటాడోనన్న ఆత్రంలో గుజ్రన్‌వాలాలో కల్నల్ ఓబ్రియన్, కసూర్‌లో కెప్టెన్ డోవ్‌టన్, షేర్‌కుపురాలో మిస్టర్ బోస్వర్త్ స్మిత్‌లు చెలరేగి తమ తమ ఇలాకాల్లో స్వైరవిహారం సాగించారు. ప్రజల మీద పెట్టిన కర్ఫ్యూ ఆంక్షలన్నీ భారతీయులకే తప్ప తెల్లతోలు యూరోపియన్లకు వర్తించవన్న మినహాయింపు ఎక్కడైనా షరామామూలే. ఓబ్రియన్‌గారు దీనికో స్పెషల్ టచ్ ఇచ్చారు. బ్రిటిష్ అధికారి ఎక్కడ ఎప్పుడు ఎదురుపడినా భారతీయులు వాహనం దిగి, గొడుగు ముడిచి, వినయంగా ఒదిగి శాల్యూట్ చేయ్యాలని దొరవారి ఆజ్ఞ. దాన్ని అతిక్రమించేవాడు ఎవడైనా, ఎంతటి వాడైనా బహిరంగంగా కొరడా దెబ్బలు తప్పవు. ఏదో ఊళ్లో పరువుగల పెద్ద మనుషులు అవమానకరమైన ఈ ఆజ్ఞను అతిక్రమించడంతో మండువేసవిలో ఎన్నో మైళ్లు శోష వచ్చేదాకా నడిపించి, సంకెళ్లు వేసి, గొలుసులతో కట్టి, ట్రక్కులో పడేసి లాహోర్ జైలుకు పంపించారు. యుద్ధ నిధికి లక్ష రూపాయల విరాళం ఇచ్చి బ్రిటిషు సామ్రాజ్యానికి భక్తి చాటుకున్న ఒక మహమ్మదీయ ప్రముఖుడిని ఇలాంటి అపరాధానికే ఇంకో హిందువుతో కలిపి గొలుసులతో కట్టేసి అదే 'హిందూ - ముస్లిం ఐక్యత' అని అవహేళన చేశారు. ఇటు వంటి ఉదంతాలు కొల్లలు.

జలియన్‌వాలాబాగ్‌లో డయ్యర్ మిషన్‌గన్లను పట్టుకొచ్చే వీలులేక మామూలు రైఫిళ్లనే వాడాడు. గుజ్రన్‌వాలాలో ఓబ్రియన్ మిషన్ గన్లనూ ధారాళంగా ఉపయోగించాడు. లాహోర్‌లో జాన్సన్ విమానాలను తెచ్చినా బాంబులు వెయ్యలేదు. ఓబ్రియన్ ఆ పుణ్యం కూడా కట్టుకున్నాడు. ఆ లీలా విశేషాన్ని హంటర్ కమిషనుకు సమర్పించిన అధికారిక నివేదికనుంచే మచ్చుకు ఒకటి ఆలకించండి.

Two bombs were first dropped, being aimed at a large party of people at a village Dhulla outside Gujranwalla... Fifty rounds from the machine-gun were also fired into the party. Shortly after, another bomb was dropped at about a mile south of this place, another crowd being observed... At 3.35 the officer attacked a crowd of some size near the Khalsa High School...; One bomb was dropped and thirty rounds fired from the machine - gun... At 3.40 p.m. two bombs were dropped near a mosque... A hundred and fifty rounds were fired from the machine-gun at crowds in the street... ...

[B.G. Horniman, PP. 145-146]

(గుజ్రన్‌వాలా వెలుపల ధుల్లా అనే గ్రామంలో పెద్ద గుంపుమీద రెండు బాంబులు విమానంనుంచి వేశారు... మిషన్‌గన్‌తో యాభై రవుండ్లు కాల్చారు. కాసేపటికి అక్కడికి దక్షిణంగా మైలు దూరంలో ఇంకో గుంపు కనిపించింది. ఇంకో బాంబు పడింది... మధ్యాహ్నం 3-35కి ఖాల్సా హైస్కూలు దగ్గర ఒక మోస్తరు గుంపు ఆఫీసరు కంట పడింది. దానిపై ఒక బాంబు వేసి 35 రౌండ్లు మిషన్‌గన్‌తో కాల్చాడు... 340కి మసీదు సమీపాన రెండు బాంబులు విడిచారు... వీధిలో గుంపుల మీద నూటయాభై రవుండ్లు ఫైర్ చేశారు.

ఈ ఒక్క 'ఆపరేషను'కు సంబంధించి ఒక్క పేరాలో సర్కారు చెప్పిన వివరాలను లెక్కవేస్తేనే మొత్తం 9 బాంబులు, 255 రవుండ్ల మిషన్‌గన్ కాల్పులు లెక్క తేలాయి. వీధుల్లో తిరిగే జనంమీద, స్కూలు పిల్లల మీద, మసీదులో ప్రార్థనకు వెళ్లేవారి మీద పొలాల్లో పనిచేసుకునే వారిమీద చాలా తక్కువ ఎత్తులో విమానం నుంచి మిలిటరీ ఆఫీసర్లు గురిచూసి బాంబులు విసిరి, మిషన్‌గన్‌తో కాల్చితే మృతులు, క్షతగాత్రులు ఎన్నో వందల సంఖ్యలో ఉండాలి కదా? బ్రిటిషు సర్కారువారు చెప్పిందెంతో తెలుసా? కేవలం 9 మంది మరణించారట. 16 మంది మాత్రమే గాయపడ్డారట.

అదీ ఇంగ్లిషువాడి సెన్సాఫ్ హ్యూమర్ !

ఫస్ట్ షాక్

లోకాన్ని మూసేందుకు మూకుడెక్కడ తేగలరు? పంజాబ్‌లో తెల్లరాకాసుల ఘోరాలు మార్షల్‌లా మడమతో ఎంత మరగుపరచజూసినా మెల్లిగా దేశ మంతటికీ తెలిశాయి. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ యావద్భారతం ఆగ్రహావేశాలతో అట్టుడికిపోయింది. విశ్వకవి రవీంద్రుడంతటి ఋషితుల్యుడు కూడా ధర్మాగ్రహంతో భగ్గుమని బ్రిటిషు ప్రభుత్వం తనకిచ్చిన 'సర్' బిరుదును వదిలివేస్తూ వైస్రాయికి ఘాటైన లేఖ రాశాడు.

పంజాబ్‌ను శత్రు భూభాగం కంటే హీనంగా పరిగణించి బ్రిటిషు మిలటరీ బాంబులతో, విమానాలతో దాడికి దిగి వేల మంది సామాన్య ప్రజలను ఊచకోత కోసిన ఘాతుకానికి దేశం లోపలా వెలుపలా ఉన్న మేధావులు, రాజకీయ ప్రముఖులు ఇంకా ఎందరో మహా తీవ్రంగా స్పందించారు. పంజాబ్‌లో సైనిక అఘాయిత్యాలకు సంబంధించిన వివరాలన్నీ ఓపికగా సేకరించి పండిట్ మదన్ మోహన్ మాలవ్యా సర్కారీ దుర్మార్గాన్ని ఎండగడుతూ సెంట్రల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో 92 ప్రశ్నాస్త్రాలను సంధించాడు. జవాబు చెప్పే ధైర్యం లేక వైస్రాయి చర్చకు అనుమతించకుండానే వాటన్నిటికీ మోకాలడ్డాడు. అయినా మాలవ్యాగారి సూటి సవాళ్లు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించి జరిగిన దురాగతాలను జనానికి విశదపరిచాయి. ప్రజా వ్యతిరేకతకు వెరచి వైస్రాయే దిగివచ్చి పంజాబ్ ఘటనలపై హంటర్ అధ్వర్యంలో విచారణ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించాడు.

మరి యావద్దేశం మహాక్రోధంతో దహించుకుపోతున్న సమయాన జాతి నాయకుడైన మహాత్మాగాంధీ ఏమి చేశారు? వేలమంది నిరపరాధులను, నిరాయుధులను, నిస్సహాయులను క్రూరాతి క్రూరంగా ఊచకోత కోసిన తెల్లవారి కిరాతకాన్ని గర్హిస్తూ, సింహంలా గర్జించారా ? ప్రపంచ యుద్ధంలో తాను, తనవంటి ఎందరో సామ్రాజ్య భక్తులు సామ్రాజ్యానికి చేసిన మేలు మరచి, మాట తప్పి, యుద్ధపు అక్కర తీరగానే

కరకు కోరలు సాచి ప్రజలను నుగ్గుచేస్తున్న తెల్లవారి దాష్టీకానికి మనసు విరిగి ఆయన సమరభేరి మోగించారా? సత్యాగ్రహ శంఖం పూరించారా? అప్పటికే మొదలెట్టిన సత్యాగ్రహ దీక్షనైనా ముమ్మరం చేసి ప్రజాగ్రహానికి కార్యరూపం ఇచ్చారా? పంజాబ్‌లో జరిగిన దారుణ దురాగతాలకు నిరసనగా కనీసం నిరాహారదీక్ష సాగించారా?

లేదు, ఇలాంటి ప్రతిచర్య ఏదీ అవసరమని గాంధీజీ అనుకోలేదు. కొత్త ఉద్యమాన్ని చేపట్టనేలేదు సరికదా... నమ్ముతారో లేదో... అప్పటికే మొదలెట్టిన ఉద్యమాన్ని కూడా ఆయన అర్ధాంతరంగా ఆపేశారు !

జలియన్‌వాలాబాగ్‌లో జనరల్ డయ్యర్ ఏకంగా వెయ్యిమందిని ఊచకోత కోసిన మరునాడు గాంధీగారు అహ్మదాబాద్‌లో సభపెట్టి హింసాత్మక ప్రవృత్తిని చాలా తీవ్రంగా ఖండించారు. ఏ హింసను? పంజాబ్‌లో డయ్యర్ అండ్ కో సాగించిన పైశాచిక హింసనా? కాదు అహ్మదాబాద్‌లో గుంపులు నిగ్రహం కోల్పోయి సాగించిన చెదురుమదురు హింసను! "నన్ను అరెస్టు చేశారని తెలిస్తే ఆవేశంతో ఊగిపోయి ఆస్తులు తగలబెట్టి, టెలిగ్రాఫ్ లైన్లు తెంపేసి, రైలుపట్టాలు పీకేసి, మనుషుల్ని చంపేస్తారా ? ఇళ్లూ దుకాణాలు దోచుకుంటారా? మీకెన్నిసార్లు చెప్పాను సత్యాగ్రహంలో హింసకు తావులేదని? విధ్వంసాలూ, దహనకాండలూ దాని తత్వానికి విరుద్ధమని? ఇటువంటి దుశ్చర్యలవల్లే నేను జైలునుంచి విడుదల కాగలిగిన పక్షంలో అలాంటి విడుదల నాకు వద్దేవద్దు" అని ఆయన చాలా క్షోభ పడ్డారు. అటునుంచి నాదియాడ్‌కి రివ్వునవెళ్లి సత్యాగ్రహంవల్ల జరిగిన హింసకు ప్రాయశ్చిత్తంగా మూడురోజులు ఉపవాసం పట్టారు. అది కాగానే 1919 ఏప్రిల్ 19న సత్యాగ్రహ ఉద్యమాన్ని తక్షణం ఆపేస్తున్నట్టు ప్రకటించారు. శాంతియుతంగా పోరాడటం ప్రజలకు నేర్పకుండా సత్యాగ్రహాన్ని తాను ప్రారంభించటం "హిమాలయాలంత పెద్ద తప్పిదమని" అభివర్ణించి, హింసకు పాల్పడకుండా బుద్ధిగా మెలగటం అందరికీ అలవాటయ్యేదాకా ప్రజా ఉద్యమం ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు.

అంతే! నడుస్తున్న ఉద్యమం నిలువునా నీరుగారి ఆవిరైపోయింది. తెల్లవాడు చేసిన దుర్మార్గానికి దహించుకుపోతున్న దేశానికి నిరసన తెలిపేందుకు ఉన్న మార్గం కూడా మూసుకుపోయింది. జలియన్‌వాలాబాగ్‌లో డయ్యర్ చేసిన జనసంహారానికి భగ్గున స్పందించి, తెల్లదొరతనపు కండకావరానికి ఎలా బుద్ధిచెప్పాలా అన్నది ఆలోచించాల్సిన తరుణంలో అహ్మదాబాద్‌లో ఎవరో కొద్దిమంది దౌర్జన్యకారులు చేసిన కొన్ని ఆగడాలకు తల్లడిల్లి, సొమ్మసిల్లి చేష్టలుడిగి చేతులు ముడుచుకు కూచోవలసిన దుర్గతి ! నమ్మశక్యంకాని ఈ నిష్క్రియా పరత్వానికి పైగా నీతిబోధల వడ్డివాటు ! భారతదేశానికి గాంధీగారు ఇచ్చిన షాక్‌ట్రీటుమెంటులో ఇది మొట్టమొదటి షాకు.

సత్యాగ్రహాన్ని తనకు హక్కు భుక్తంగా తలిచి, సత్యాగ్రహ పోరాటానికి ప్రయోగ ఉపసంహారాల సర్వహక్కులూ తనకే చెందుతాయని భావించి, కొద్దిమంది ఆందోళన కారులు క్షణికావేశంలో చేసిన ఆగడాలకు మొత్తం ఉద్యమకారులందరినీ బడి పిల్లల్లా మందలించి, బుద్ధి తెచ్చుకునేదాకా మళ్లీ క్లాసు లేదని గాంధీ మాస్టారు భీష్మించటం ఆయన నుడివిన సత్యాగ్రహ సిద్ధాంతపు విలక్షణ దృక్కోణం నుంచి బహుశా సరైనదే కావచ్చు. ఈ కాలంలోనూ శాంతి, అహింస, నైతిక నిబద్ధతకు ఇంతటి విలువిచ్చే మహాత్ములు ప్రపంచంలో ఇంకెవరుంటారని గాంధేయవాదులు పరవశించి ప్రస్తుతించ వచ్చు. కాని - అసలైన అదనులో ప్రజాప్రతిఘటనను స్తంభింపజేయటంవల్ల జాతి విమోచన ఉద్యమానికి, బ్రిటిషు వారిపై భారతీయుల జాతీయ పోరాటానికి రాజకీయంగా వాటిల్లిన తీవ్ర విఘాతం మాటేమిటి?

గాంధీగారు మామూలు రాజకీయ నాయకుల వంటివాడు కాదు. నిజమే. తనకోసం బజార్నపడి, బస్సులూ రైళ్లూ కాల్చి, సమాజానికి అగ్గిపెట్టేవారిని మనకాలపు నేతాశ్రీల్లా వెనకేసుకురాకపోవటం నిస్సందేహంగా ఆయన గొప్పతనమే. స్వ పర భేదాలు లేకుండా చెడును చెడు అని గర్హించినందుకు ఆయనను తప్పక మెచ్చుకోవలసిందే. అయితే స్వపక్షంలోని చెడును గుర్తించినట్టే ఆవలిపక్షంలోని చెడును కూడా అదే నియమ నిబద్ధత ప్రకారం అంతే తీవ్రంగా ఆయన గర్హించాలికదా? అహ్మదాబాద్‌లో ఏ అధికార బాధ్యత లేని అల్లరిమూకలు చేసిన హింస, విధ్వంసాన్ని లెంపలేసుకుని మొత్తం ఉద్యమాన్నే తక్షణం నిలిపి వేయాల్సినంతటి తీవ్రంగా పరిగణించిన మహాత్ముడు పంజాబ్‌లో ప్రజలను రక్షించే బాధ్యతగల డయ్యర్ లాంటి అధికార రాకాసులు అసాంఘిక శక్తులకంటే అమానుషంగా బరితెగించి అమాయక ప్రజలను భక్షించిన ఘాతుకాన్ని కూడా అంతే తీవ్రంగా నిరసించి ఉండాలి కదా? సర్కారుకు వ్యతిరేకంగా శాంతియుత సత్యాగ్రహాన్ని సాగించగలరన్న విశ్వాసం ఇటీవలి దుర్ఘటనలతో పోయింది కాబట్టి ప్రజలను సమీకరించి ఉద్యమం నడిపేందుకు గాంధీగారు ఇచ్ఛగించక పోవటం సహృదయంతో అర్థంచేసుకో దగ్గదే. జనాన్ని ఇన్వాల్వు చేయకపోతే మానె... కనీసం తనమీద తనకు నమ్మకం ఉంది కదా... తానొక్కడైనా బ్రిటిషు సర్కారు దురాగతాలపై నియమబద్ధంగా, సత్యాగ్రహ శాస్త్రోక్తంగా ఏ వ్యష్టి సత్యాగ్రహానికో ఉపక్రమించవచ్చుగదా? సత్యాగ్రహాలూ, నిరాహారదీక్షలూ, వ్యక్తిగత ఆందోళనలూ చేయకపోతే మానె. కనీసం పంజాబ్‌లో బ్రిటిషు ప్రభుత్వం చేసింది తప్పు అని మాటమాత్రంగానైనా ఖండించారా? బహిరంగంగా ఖండన మండనలు చేయకపోతే మానె. కనీసం వారు చేసింది నిష్కృతిలేని నేరమని తనవరకూ తాను, తనలో తానయినా తీవ్రంగా నొచ్చుకున్న దాఖలాలున్నాయా?

లేవు. లేనే లేవు. ఏప్రిల్ 18న మూకల హింస దృష్ట్యా సత్యాగ్రహ ఉద్యమాన్ని సస్పెండు చేసిన మహాత్ముడు మూడురోజుల తరవాత (1919 జులై 21న) ఇంకో

ప్రశస్తమైన ప్రకటన చేశాడు. సర్కారువారి నుంచి సుహృద్భావ సంకేతాలు అందినందువల్ల తన మిత్రులు చాలామంది సలహా ఇచ్చినందువల్ల శాసనోల్లంఘనోద్యమాన్ని తాను పునఃప్రారంభించేది లేదని అందులో ఆయన సెలవిచ్చారు. ఎందుకంటే ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టే ఆలోచన ఆయనకు ఎంతమాత్రమూ లేదట.

అంటే.. ఏమిటి అర్థం? సభ్య ప్రపంచం యావత్తూ ఏవగించుకున్న దారుణ మారణ హోమాన్ని సత్యపూర్వకంగా, నియమబద్ధంగా నిరసించటానికీ సర్కారువారితో మొగమాటాలు అడ్డొచ్చాయా? తప్పుచేసేది ఎవరైనా నిష్కర్షగా నిర్భయంగా నిరసించాలన్నది సత్యాగ్రహ విద్యలో మొదటి పాఠం కాదా? జనాన్ని కాల్చుకుతినే సర్కారునుంచి సుహృద్భావ సంకేతం అందగానే, వారూ వీరూ సలహా ఇవ్వగానే జనానికి జరిగిన అపచారాన్ని మరిచిపోయి ప్రజాకంటకుల ముంజేతిని ఎగబడి ముద్దాడవలసిందేనా? ప్రజలను తిప్పలుపెట్టే ప్రభుత్వం ఎక్కడ ఇరకాటంలో పడుతుందోనన్న ఆరాటం ప్రజల పక్షాన నిలిచి పోరాడవలసిన జాతీయ నాయకుడిలో ఇంతలా ఉండటం భావ్యమేనా?

పోనీ – ఈ అద్భుత ప్రకటన చేసే సమయానికి పంజాబ్‌లో ఘోరాలు, జలియన్‌వాలా బాగ్ దురంతాలు గాంధీగారికి తెలియలేదు కాబోలనుకుందామా? ఇప్పటిలా 24 గంటల న్యూస్ చానెళ్లు, ఇంటర్నెట్లు లేవు కాబట్టి, మార్షల్‌లా ఆంక్షలతో సమాచారం బయటికి పొక్కటం మరీ కష్టమైంది కాబట్టి పూర్తి వివరాలు ఆయనకు అంది ఉండకపోవచ్చు. కాని – ఆయన మరీ ఆడవిలో ఏమీ లేడు. బాహ్య ప్రపంచంతో సంబంధం ఉండని ఒంటరి చెరలోనూ లేడు. ఏప్రిల్ 9న ఆయనను ఢిల్లీ దగ్గర రైల్లో అరెస్టు చేసి అటునుంచి అటే బొంబాయి పట్టుకుపోతే, ఆయన బొంబాయి పొలిమేరలకు చేరకుండానే ఆ వార్త కార్చిచ్చులా దేశమంతటా పాకింది. ఆ మర్నాడే అహ్మదాబాద్, అమృత్‌సర్‌లాంటి దూర ప్రాంతాల్లోనూ దానిపై గొడవలు, అల్లర్లు చెలరేగాయి. మామూలు జనానికే ఎక్కడ ఏమి జరిగిందీ అంత త్వరగా తెలుస్తూ వచ్చిన రోజుల్లో తన అరెస్టుకు నిరసనగా ఏప్రిల్ 13న జరిగిన సభ మీద సైనికులు తూటాల వర్షం కురిపించి వందల మందిని కర్కోటకంగా పొట్టనపెట్టుకున్న సంగతి వారం తరవాత ప్రభుత్వ సుహృద్భావం గురించి వింత ప్రకటన చేసే నాటికైనా గాంధీజీకి తెలియలేదనుకుందామా?

లేదు. ఆయనకు అన్నీ తెలుసు. ఆ సంగతి **'ఆత్మకథ'**లో ఆయనే చెప్పారిలా:

...Government's policy of lawless repression was... manifesting itself in the Punjab in all its nakedness... I was pressed to proceed to Punjab immediately in disregard of consequences. I wrote and also telegraphed to the Viceroy asking for permission

to go there, but in vain... For me, therefore, to offer civil disobedience at such a time. would have been like fanning the flame. I therefore decided not to proceed to the Punjab... It was a bitter pill for me to swallow. Tales of rank injustice and oppression came pouring in daily from the Punjab, but all I could do was to sit helplessly by and gnash my teeth.

[*My Experiments with Truth*, M.K. Gandhi, P. 393]

(ప్రభుత్వపు అన్యాయమైన అణచివేత విధానం పంజాబ్‌లో నగ్నంగా నర్తిస్తోంది... పర్యవసానాలను లక్ష్యపెట్టకుండా నేను వెంటనే పంజాబ్ వెళ్ళాలని నాపై గట్టి వత్తిడే వచ్చింది. అక్కడికి వెళ్లేందుకు అనుమతించమని నేను వైస్రాయికి రాశాను. టెలిగ్రాం కూడా ఇచ్చాను. కాని ప్రయోజనం లేకపోయింది.. అనుమతి లేకుండా అడుగుపెడితే నన్ను అరెస్టుచేస్తారు. ఆ సమయంలో నేను శాసనోల్లంఘనకు దిగితే మంటను ఎగదోసినట్లు అవుతుంది. కాబట్టి నేను పంజాబ్‌కు వెళ్లరాదని నిర్ణయించుకున్నాను. అది చేదు మాత్ర మింగటం లాంటిది. దారుణమైన అన్యాయాలకు దమనకాండకు సంబంధించిన గాథలు పంజాబ్ నుంచి రోజూ ఎన్నో వస్తున్నా నేను చేయగలిగిందల్లా నిస్సహాయంగా పళ్లు కొరుకుతూ కూచోవటమే.)

వైస్రాయి దొరగారు పంజాబు వెళ్లటానికి పర్మిషను ఇవ్వలేదు. అనుమతి లేకుండా వెళితే గొడవలైపోతాయి. కాబట్టి ఘోరాలు జరిగిపోతున్నాయని తెలిసీ ఏమీ చేయలేక నిస్సహాయంగా పళ్లు కొరుకుతూ ఇంటిపట్టున కూచుండిపోయానంటున్నారు మహాత్ములవారు.

పళ్లు పటపటలాడిస్తూ గాంధీగారు ఊరుకున్నా పంజాబ్ ఘోరాలపై కాంగ్రెస్ ఊరుకోలేదు. ప్రజాభిప్రాయ తీవ్రతను గుర్తించి ఆలిండియా కాంగ్రెస్ కమిటీ "పంజాబ్‌లో ఇటీవలి ఘటనలను" దర్యాప్తు చేయటానికి తొమ్మిది మందితో ఓ సబ్ కమిటీని వేసింది. ఆ తొమ్మిది మందిలో మోతీలాల్ నెహ్రూ, సి.ఆర్. దాస్, ఎమ్.ఆర్. జయకర్‌లతోబాటు ఎమ్.కె. గాంధీగారు కూడా ఉన్నారు. కల్లోలిత ప్రాంతాలన్నీ తిరిగి 1700 మంది సాక్షులను విచారించి 600 మంది నుంచి స్టేట్‌మెంట్లు తీసుకుని ఆ సబ్ కమిటి సవిస్తరమైన నివేదికను ఏకగ్రీవంగా సమర్పించింది. సుమారు 1200 ప్రాణాలు పోయాయి. 3600 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. మార్షల్‌లా కింద తీసుకున్న చర్యలు ఎలాంటివంటే నాగరికమని చెప్పుకునే ఏ ప్రభుత్వమూ కలనైనా తలపెట్టజాలనివి. ప్రజలపై సాగించిన ప్రతీకారాత్మక హింసాకాండ ఏ విధంగానూ సహించరానిది. జలియన్‌వాలాబాగ్‌లో ఊచకోత అమానుషత్వానికి మచ్చుతునక. ఆధునిక బ్రిటిష్

పరిపాలనలో కనీవినీ ఎరుగని క్రౌర్యం ఇది" అంటూ తెల్లదొరతనం ఆడిన కల్లలను, తిమ్మిని బమ్మి చేసే కుయత్నాలను ఎండగడుతూ పంజాబ్ ఘోరకలిని తథాతథంగా ఆ నివేదిక ప్రపంచానికి చూపెట్టింది. కమిటీలోని 9 మందిలో ఒకడిగా ఉన్నారే తప్ప ఆయా వివరాల లోతులోకి గాంధీగారు వెళ్లలేదేమో; వాటిపై దృష్టి పెట్టలేదేమో - అని అనలేము. ఎందుకంటే - ఆ కమిటీ పనిని చక్కబెట్టిందీ, సదరు చరిత్రాత్మక నివేదికను కాంగ్రెస్ కమిటీ తరపున స్వహస్తాలతో రచించిందీ మన గాంధీగారే !

పోనీలే ! బెటర్ లేట్ దాన్ నెవర్ అని ఇంగ్లీషు వాడన్నట్లు అసలు లేనిదానికంటే ఆలస్యంగా అయ్యేది మేలు ! ఎట్టకేలకు పూర్తి వివరాలు తనకు అంతుబట్టి, పంజాబ్‌లో సైనిక పాలన కిరాతకాల నిజస్వరూపం తేటతెల్లమైన తరవాత, తాను రాసిన ఎంక్వయిరీ రిపోర్టు దేశమంతటినీ కదిలించి దిగ్భ్రాంత పరచిన మీదటైనా గాంధీ ధోరణి మారిందా? బాధిత జనానికి భూలోకంలో యమలోకం చూపిస్తున్న పాపిష్టి బ్రిటిషు పాలనపై దృఢ దీక్షతో ధర్మపోరాటం సాగించారా ?

నిస్సహాయంగా పళ్లు కొరుకుతూ మిన్నకుండాల్సిన బాధ గాంధీగారికి త్వరగానే తప్పింది. మార్షల్‌లా ఇనుపతెర కొద్దినెలల్లో తొలగి జలియన్‌వాలాబాగ్ దురంతం సాగిన అమృత్‌సర్‌లోనే 1919 డిసెంబర్ 27న భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక మహాసభ జరిగింది. గాంధీజీకి బ్రిటిషు ప్రభుత్వంపై ధ్వజమెత్తి ధర్మపోరాటానికి పిలుపివ్వాలన్న ఆలోచన ఏ కోశాన ఉన్నా అంతకు మించిన అదను మరొకటి దొరకదు. అప్పటికే కాంగ్రెసు వాదులందరూ కాక మీద ఉన్నారు. మాంటేంగు - చెమ్స్ ఫర్డ్ అరకొర సంస్కరణలలో భాగంగా బ్రిటిషు సర్కారు కొత్తగా తెచ్చిన గవర్నమెంట్ అఫ్ ఇండియా యాక్టును ఖండితంగా తిరస్కరించి, పూర్తి స్వరాజ్యాన్ని డిమాండ్ చేయాలని చిత్తరంజన్‌దాస్ తీర్మానం కూడా ప్రవేశపెట్టారు. దానిని సమర్థిస్తున్నట్టు గాంధీజీ ఒక్కమాట అని పంజాబ్ మారణకాండకు నిరసనగా నిర్దిష్ట కార్యాచరణ పథకాన్ని సూచిస్తే చాలు... నిప్పుల్లో దూకటానికి కాంగ్రెస్‌వారు, దేశప్రజలు సిద్ధంగా ఉన్నారు. మరి ఆ వేదికపై గాంధీజీ ఏమి చేశారు? అందివచ్చిన అవకాశాన్ని ఎలా ఉపయోగించుకున్నారు?

సంస్కరణలను వ్యతిరేకించిన సి.ఆర్.దాస్ తీర్మానాన్నే గాంధీగారు గట్టిగా వ్యతిరేకించారు. ఇండియాకు న్యాయం చేయాలన్న బ్రిటిష్ వారి చిత్తశుద్ధికి ఆ సంస్కరణల చట్టమే గొప్ప దృష్టాంతమని ఆయన నిస్సంకోచంగా కొనియాడారు. సంస్కరణలను విమర్శించటం కాక వాటిని విజయవంతమెలా చెయ్యాలన్నదే అందరమూ ఆలోచించాలని ఉద్బోధించి, కాంగ్రెసును మెడలు వంచి తన దారికి తెచ్చుకున్నాడు. కిందటి మహాసభలో మాంటేగు - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలను ఖండితంగా తిరస్కరించిన కాంగ్రెస్

చేతే అదే సంస్కరణలను నాలుక మడతవేసి స్వాగతం పలికించాడు. ఆ మధ్య తాను ఇంటిపట్టున కూచొని పళ్లు నూరింది దేనికోసమన్న సంగతి ఆ సమయంలో ఆయనకు గుర్తేలేదు ! అలాగని - అమృత్‌సర్ కాంగ్రెస్‌లో గాంధీగారు పంజాబ్ ఘోరాలను అసలు ప్రస్తావించనే లేదా ? విచ్చలవిడి హింసాకాండను గర్హించనేలేదా? ఎందుకు లేదు ? భేషుగ్గా ప్రస్తావించారు. మహానిశితంగా గర్హించారు. దేన్ని ? ఓడ్వయర్లు, డయ్యర్లు, డోవ్‌టన్లు, కొరివిదయ్యాల్లా చెలరేగి సాగించిన దారుణహింసనా? కాదండి.కాదు. సర్కారీ ఘాతుకాలకు ఓరిమి నశించి, ఒక దశలో స్థానిక ప్రజలు పరిమితంగా సాగించిన హింసాకాండను.

Gandhi moved a resolution blaming the people: "Real manlinesss consists in not retaliating even when under a shower of bullets, to suffer evil patiently... That is the spirit of real heroes. That is why I want you to condemn the excess of mobs"

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I, P. 277]

(ప్రజలను నిందిస్తూ గాంధీ ఒక తీర్మానం ప్రతిపాదించారు. "నిజమైన మగటిమి అంటే బుల్లెట్ల వర్షం కురిసినా ప్రతిఘటించకుండా ఉండటం, చెడుగును ఓపికగా భరించటం... అదీ సిసలైన వీరుల దమ్ము. అందుకే నేను మూకల అఘాయిత్యాలను మిమ్మల్ని ఖండించమంటున్నాను".)

అంటే - జలియన్‌వాలాబాగ్ దారుణ దురంతం వివరాలు ఎరుకపడనప్పుడూ... ఏదీ బీరుపోకుండా అన్నీ ఎరుకపడినప్పుడూ గాంధీగారిది ఒకటే ధోరణి. ఊచకోతల డయ్యర్లను పూలచెండ్లతోనూ, భయోద్విగ్న జనాన్ని కొరడాలతోనూ కొట్టటమే ఆయన స్పెషాలిటీ.

సహాయ నిరాకరణ దేనికోసం ?

1920, నాన్ కోఆపరేషన్ మూవ్‌మెంటు. ఆ పేరు చెబితేనే స్వాతంత్ర్యయోధులకు ఒళ్లు పులకరిస్తుంది. గాంధీ మహాత్ముడి పిలుపు నందుకుని విద్యార్థులు చదువులనూ, ప్లీడర్లు కోర్టులనూ, లెజిస్లేటర్లు చట్టసభలనూ విడిచిపెట్టి, దేశమాత సేవకోసం ఉరకలెత్తి, లాఠీ దెబ్బలు తిని జైళ్లకెళ్లి, గొప్ప త్యాగాలు చేసిన మహనీయ దృశ్యం కళ్లకు కడుతుంది. అనంతర కాలంలో మత వైషమ్యాలు జాతీయతకు పెను శాపమైన తీరును గుర్తుంచుకుంటే... హిందువులూ ముసల్మాన్లూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి దేశసేవలో తరించిన సహాయ నిరాకరణోద్యమ ప్రాశస్త్యం అవగతమవుతుంది.

ఉద్యమం ఉత్కృష్టమైనదన్నంతవరకూ రెండో మాటకు తావులేదు. ఎటొచ్చీ ఆ ఉద్యమం ఎందుకు జరిగిందన్న విషయంలోనే ఎన్నో అపోహలున్నాయి. సాధారణంగా అందరూ అనుకునేది ఏమిటంటే... రౌలత్ చట్టం, జలియన్‌వాలాబాగ్ దురంతాల తరవాత తెల్లవారి ధర్మబుద్ధి పట్ల భ్రమలు తొలగిన మహాత్ముడు సత్యాగ్రహ శంఖం పూరించి, స్వరాజ్యంకోసం జాతీయస్థాయిలో నాన్ కోఆపరేషన్ మహోద్యమం మొదలెట్టారని ! జాతీయ కాంగ్రెస్ అధికారిక చరిత్ర సహా మనం చదివే స్వాతంత్ర్య పోరాట చరిత్ర గ్రంథాలన్నీ స్థూలంగా ఇదే అభిప్రాయం కలిగిస్తాయి. చరిత్ర పుస్తకాలదాకా ఎందుకు? సాక్షాత్తూ గాంధీ మహాత్ముడూ ఇంచుమించుగా అదే మాట అన్నాడు. 1922 మార్చిలో రాజద్రోహ అభియోగంపై తనను విచారించిన బ్రిటిషు జడ్జి బ్రూమ్‌ఫీల్డ్ ఎదుట చేసిన చిరస్మరణీయ ప్రకటనలో – జీవితమంతా బ్రిటిషు సర్కారుకు సహకరిస్తూ వచ్చిన తాను దానికి ఎందువల్ల ఎదురుతిరిగిందీ వివరిస్తూ బాపూ ఇలా అన్నారు :

"The first shock came in the shape of Rowlatt Act, a law designed to rob the people of all freedom. I felt called upon to lead an intensive agitation against it. Then followed the Punjab horrors beginning with the massacre at Jallianwalla Bagh... ... I

discovered too that the plighted word of the Prime Minister to the Mussalmans of India regarding the integrity of Turkey and the holy places of Islam was not likely to be fulfilled... I saw too, that not only did the reforms not mark a change of heart, but they were only a method of further draining India of her wealth... ..."

[*Collected worksof Mahatma Gandhi*, Vol 26, #168, PP 382-383]

(మొదటి షాకు రౌలత్ చట్టం రూపంలో వచ్చింది. ప్రజల స్వేచ్ఛను పూర్తిగా హరించేందుకు ఉద్దేశించిన శాసనమది. దానికి వ్యతిరేకంగా ఉధృత ఉద్యమం నడపాలని నా కనిపించింది. తరవాత జలియన్‌వాలాబాగ్ ఊచకోతతో మొదలుపెట్టి పంజాబ్ ఘాతుకాలు జరిగాయి. ఇస్లాం పవిత్ర క్షేత్రాల సమగ్రత, టర్కీల గురించి భారతీయ ముసల్మాన్లకు ప్రధానమంత్రి ఇచ్చిన హామీ కూడా నెరవేరేటట్టు లేదని నేను గ్రహించాను. రాజ్యాంగ సంస్కరణలనేవి హృదయ పరివర్తనకు సూచన కాదని భారతదేశ సంపదను మరింతగా కొల్లగొట్టేందుకు అవి సాధనం మాత్రమే నని నాకు అర్థమయింది... ...)

ప్రజల స్వేచ్ఛను హరించిన రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా ఉధృత ఉద్యమం నడపాలని గాంధీగారికి అనిపించి ఉండవచ్చు. కాని ఆయన ఉధృత ఉద్యమాన్ని నడిపింది మాత్రం రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా కాదు. జలియన్‌వాలాబాగ్‌తో మొదలెట్టి పంజాబ్‌లో నిరాఘాటంగా సాగిన ఘాతుకాలకు నిరసనగానూ దాన్ని సంకల్పించలేదు. పంజాబ్ ఘోరాలన్నీ జరిగిపోయాక జలియన్‌వాలాబాగ్ ఘోరకలికి నెలవైన అమృత్‌సర్‌లో కాంగ్రెస్ మహాసభను గాంధీగారు పట్టుబట్టి అతికష్టం మీద ఒప్పించి కొత్త సంస్కరణలకు జై కొట్టించారు కనుక మరికొద్ది నెలలకు ఉద్యమం తలపెట్టింది అదే సంస్కరణలకు వ్యతిరేకంగా అంటేనూ నమ్మశక్యం కాదు. పోనీ – ఫలానా ఫలానా డిమాండ్ల మీద అని కాదు. మొత్తంగా బ్రిటిషు వారిని వెళ్లగొట్టి దేశానికి స్వరాజ్యం సాధించటానికే గాంధీగారు నాకో ఆపరేషను మూవ్‌మెంటు తెచ్చారని చెబుదామా? దానికీ వీలులేదు. స్వరాజ్య పోరాటంలో సహాయనిరాకరణోద్యమం ఒక ఉజ్వల ఘట్టమన్నది నిజమేకాని సహాయ నిరాకరణోద్యమాన్ని తలపెట్టింది స్వరాజ్యం కోసం కాదు ! మరెందుకోసం ?

ఎందుకో – 1920 మార్చి 20న గాంధీగారు స్వయంగా వెలువరించిన చరిత్రాత్మక మేనిఫెస్టో చూస్తే తెలుస్తుంది. ఇది మామూలు ప్రకటన కాదు. భవిష్యత్తులో దేశ రాజకీయాల గతిపై నిర్ణాయక ప్రభావం చూపబోయే “అహింసాత్మక సహాయ నిరాకరణ” లోని సిద్ధాంతాన్ని, విధి విధానాలను తేట పరుస్తూ మహాత్ముడు ప్రకటించిన కీలకపత్రమది అందులో చెప్పిందిది:

"The Khilafat has now become a question of questions... Now a word as to what may be done if the demands are not granted. The barbarous method is warfare, open or secret. This must be ruled out, if only it is impracticable... Non - co-operation is therefore the only remedy left open to us... It becomes a duty when co-operation means degradation or humiliation, or an injury to one's cherished religious sentiment. England cannot expect a meek submission by us to an unjust usurpation of rights which to Muslims mean a matter of life and death... Those who are holding office of honour or emoluments ought to give them up; those who belong to menial services under Government should do likewise... ... Advice to the soldiers to refuse to serve is premature... We should be entitled to take that step when the Viceroy and the Premier leave us..."

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I, P. 284-285]

(ఖిలాఫత్ ఇప్పుడు ప్రశ్నల్లోకెల్లా ప్రశ్నగా మారింది. మన డిమాండ్లను మంజూరు చేయకపోతే ఏమి చేయాలన్న దానిపై ఇక్కడో మాట. ఆటవిక పద్ధతేమిటంటే బాహాటంగానో, రహస్యంగానో యుద్ధం చేయడం. అది కుదిరేది కాదన్న కారణంతోనైనా దాన్ని తోసిపుచ్చాలి. మనకున్న పరిష్కారం సహాయ నిరాకరణ ఒక్కటే. ప్రభుత్వంతో సహకరించటమంటే మనల్ని మనం దిగజార్చుకోవటం, అవమానం, మత సెంటిమెంటుకు గాయం ఐనప్పుడు సహకార నిరాకరణేమనకు కర్తవ్యం. మహమ్మదీయులకు జీవన్మరణ సమస్య అయిన విషయంలో వారి హక్కులను తాను అన్యాయంగా లాగేసుకోవటాన్ని మనం చూస్తూ ఊరుకుంటామని ఇంగ్లండు భావించజాలదు. గౌరవ చిహ్నమైనవో, జీతభత్యాలతో కూడినవో అయిన పదవుల్లో ఉన్నవారు వాటిని వదిలిపెట్టాలి. ప్రభుత్వంలో చిన్న ఉద్యోగాలు చేసేవారు కూడా అలాగే చేయాలి. కొలువు చేయరాదని సైన్యాన్ని కోరే సమయం ఇంకా రాలేదు. వైస్రాయి, ప్రధానమంత్రి మనల్ని వదిలి పోయాక ఆ చర్య మనం ఆలోచించవచ్చు.)

ప్రభుత్వ ఉత్తర్వులు పాలించరాదని సైన్యానికి ఎప్పుడు పిలుపివ్వాలో ఆలోచించేంత దూరం గాంధీజీ వెళ్లడాన్ని బట్టే తాను ప్రతిపాదించిన నాన్-కోఆపరేషన్‌ను ఆయన ఎంత సీరియస్‌గా తీసుకున్నదీ అర్థచేసుకోవచ్చు. గౌరవ పదవుల్లో ఉన్నవారు వాటిని వదిలిపెట్టడంతో మొదలయ్యే పోరాటం చివరికి వైస్రాయి, ప్రధానమంత్రుల నిష్క్రమణకు దారితీయగలదని మహాత్ముడు భావించడం అప్పటి దాకా ఆయన అనుసరిస్తూ వచ్చిన

బ్రిటిషు విధేయతకు పూర్తిగా వ్యతిరేకం. అంతటి తీవ్రాతితీవ్ర వైఖరికి ఆయనను పురికొల్పింది ఖిలాఫత్ సమస్య.

భారతీయ ముస్లింకు జీవన్మరణ సమస్య అని తాను అనుకున్న దానిమీద బ్రిటిషువారితో అమీతుమీ తేల్చుకోవటానికి గాంధీగారు సంసిద్ధమైనందుకు తప్పక సంతోషించవలసిందే. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే, భారతదేశాన్ని తెల్లవారు దుర్మార్గంగా ఆక్రమించి నూరేళ్లకుపైగా దారుణ దురాగతాలకు పాల్పడటం మహాత్ముడికి సహించరాని అవమానంగా కనపడలేదు. దేశాన్ని అన్నన్ని ఇక్కట్లు పెట్టిన విదేశీ రాకాసులతో సహకరించడమంటే మనల్ని మనం దిగజార్చుకోవడమేనని ఆయన భావించలేదు. మొదటి ప్రపంచయుద్ధంలో నిధుల కోసం, మనుషుల కోసం ఊళ్లమీద పడి, జనాన్ని నిర్బంధించి, ముళ్ళ కంపల మీద పడేసి, దిగంబరంగా నిలబెట్టి చిత్రహింసలు పెట్టి జాతిని ఘోరంగా అవమానించిన తెల్ల సర్కారుతో చేతులుకలిపి సహకరించటం మనల్ని మనం దిగజార్చు కోవడమేనని ఆయన అనుకోలేదు. పంజాబ్‌లో వీధివెంట వెళ్ళే ప్రతివారినీ నేలమీద పాకించి, ముక్కు నేలకు రాయించి... తెల్లతోలువాడు ఎదుటపడితే ప్రతి భారతీయుడూ వాహనం దిగి, గొడుగు ముడిచి, వినయంగా ఒదిగి దండం పెట్టాలని కట్టడి చేసిన జాత్యహంకారపూరిత ప్రభుత్వానికి ప్రభుత్వానికి దోసిలి ఒగ్గి సహకరించడం తీరని అవమానమనీ ఆయనకు తట్టలేదు. ప్రపంచంలో ఒక్క ఖిలాఫత్ సమస్య ఒక్కటే తెగబడి కడదాకా పోరాడాల్సినంతటి తీవ్ర సమస్యగా ఆయన బుద్ధికి పొడగట్టింది.

పోనీ ఇంగ్లీషు సామెత చెప్పినట్టు 'ఒంటె మూపున చివరిమోపు' లా ఖిలాఫత్ సమస్య గాంధీజీ ఓరిమిని పూర్తిగా నశింపజేశాయనుకుందామా? మిగతా సమస్యలూ ఆయనను ఇదే స్థాయిలో కలిచివేశాయనీ... ఒక పట్టుపట్టాల్సిందేనని నిశ్చయించుకున్నాక దానికి ఇచ్చినంత ప్రాముఖ్యం మిగతా జాతీయ సమస్యలకూ ఆయన ఇచ్చారని సరిపుచ్చు కుందామా? వీల్లేదు. ఖిలాఫత్‌తో మిగతా సమస్యలను కలపటానికి గాంధీగారు సుతరామూ ఇష్టపడలేదు. దానికిచ్చినంత ప్రాధాన్యం మిగతా సమస్యలకు ఇవ్వటానికి ఆయన ససేమిరా సమ్మతించలేదు. ఆ సంగతి 1919 నవంబర్ 24న ఆలిండియా ఖిలాఫత్ కాన్ఫరెన్సుకు అధ్యక్షత వహిస్తూ గాంధీజీ చేసిన ప్రసంగంలో ఈ పలుకులనుబట్టి స్పష్టమవుతుంది.

"... ... It has been contended that the Punjab grievance too is a good reason for refraining from the Peace Celebrations. I differ from that view. However grievous the wrong done in the Punjab, it is afterall a domestic affair and it would show on our

part a want of sense of proportion to bring in the Punjab grievance to justify our non-co-operation in the Imperial Celebration... In my opinion it is not open to us to refuse to share the Peace Celebration on grounds other than those arise directly out of the peace and that touch the vital parts of our national existence. The Khilafat Question alone satisfies these two tests.

[*Mahatma*, D.G. Tendulkar, Vol. I, P. 273]

(శాంతి ఉత్సవాలను బహిష్కరించటానికి పంజాబ్ అన్యాయం కూడా ఒక మంచి కారణమేనని కొందరు అంటున్నారు. నేను దానికి ఒప్పుకోను. పంజాబ్‌లో జరిగిన తప్పు ఎంత తీవ్రమైనదైనా అది ఆఫ్టరాల్ దేశీయ వ్యవహారం. సామ్రాజ్యం వేడుకల్లో మన సహకార నిరాకరణను సమర్థించుకోవటానికి దానిని పట్టుకురావటం సరికాదు. నా ఉద్దేశంలో శాంతితో నేరుగా సంబంధం ఉన్నవి... మన జాతీయ అస్తిత్వానికి కీలకమైనవి అయిన అంశాలను మాత్రమే శాంతి వేడుకలలో పాల్గొనకపోవటానికి హేతువుగా మనం చూపించగలం. ఖిలాఫత్ సమస్య ఒక్కటే ఈ రెండు పరీక్షలకూ నిలబడుతుంది.)

అంటే వెయ్యి మంది అమాయకులను పిట్టల్లా కాల్చి, వేలాది బతుకుల్లో నిష్కారణంగా నిప్పులేపోసిన సామ్రాజ్యవాదుల ఘాతుకం సామ్రాజ్య సంబరాలను బహిష్కరించటానికి బలమైన కారణం కాదు. యుద్ధంలో అడ్డమైన ఊడిగం చేయించుకుని, యుద్ధం తరవాత మాట తప్పి, సంస్కరణల పేర కరకు కత్తిని జాతి మెడపై ఉంచటం జాతీయ అస్తిత్వానికి కీలక ప్రాధాన్యంగల అంశం కాదు. 'ప్రశ్నల్లోకెల్లా ప్రశ్న' అయిన ఖిలాఫత్ ఒక్కటే గాంధీగారి దృష్టిలో సామ్రాజ్యానికి ఎదురు తిరగదగ్గ ఏకైక జాతీయ సమస్య. 1920 ఆగస్టు 1న ఆలిండియా హర్తాళ్‌తో సహకార నిరాకరణోద్యమం మొదలైన రోజునే... గతంలో యుద్ధసేవలకు గుర్తింపుగా బ్రిటిష ప్రభుత్వం తనకిచ్చిన మెడల్స్‌ను వెనక్కి ఇస్తూ వైస్రాయ్‌కి పంపిన లేఖలో...

I venture to return these medals, in pursuance of the scheme of Non-Co-Operation inagurated today in connection with Khilafat Movement (ఖిలాఫత్ ఉద్యమానికి సంబంధించి ఈ రోజు ప్రారంభమైన సహకార నిరాకరణ పథకంమేరకు ఈ మెడల్సును నేను వాపసు ఇవ్వదలిచాను) అని గాంధీజీ రాసినదాన్ని చూస్తే ఆయన తన అమ్ములపొదిలో కెల్లా శక్తివంతమైన నాన్-కో ఆపరేషన్ బ్రహ్మాస్త్రాన్ని బ్రిటిషు వారిపై సంధించింది స్వరాజ్య సాధనకోసం కాదనీ, ఖిలాఫత్ కోసమేననీ ఎవరికైనా తేటతెల్లమవుతుంది.

అంతేకాదు. ఖిలాఫత్ సమస్యను సాధించటంకోసం స్వరాజ్యాన్ని కూడా వాయిదా వేసుకుంటానని *(I would, in order to achieve success in the Khilafat issue, even postpone the issue of Swaraj")* ప్రశస్తమైన ప్రకటన చేసి స్వరాజ్యం కంటే తనకు ఖిలాఫతే ఎక్కువ అని కుండబద్దలు కొట్టినట్టు లోకానికి చాటిన లోకోత్తర దేశభక్తుడు మహాత్మాగాంధీగారు.

దానికోసం దీన్ని వాయిదా వేసుకోవటం గురించి బాపూజీ మాట్లాడారంటే దానికి ఇది అడ్డమా? దానికీ దీనికీ మధ్య పెద్ద వైరుధ్యమేమైనా ఉందా ? ఖిలాఫత్‌ను గాంధీజీ తలకెత్తుకున్నది ముసల్మాన్ల హక్కులను, మత సెంటిమెంటును నిలబెట్టటం కోసం. దానిమీద పోరాడదలచుకుంటే స్వరాజ్యం ఊసు ఎత్తడానికి వీల్లేదని ఒకవేళ భారత ముస్లింలు షరతు పెట్టి ఉంటే వేరేసంగతి. ముస్లిం సోదరులకు తాననుకున్న మంచి చెయ్యడంకోసం అసలైన స్వరాజ్యాన్ని కూడా మన మహాత్ముడు తప్పనిసరయి పక్కనపెట్టారు లెమ్మని అర్థంచేసుకునేవాళ్లం. కాని - అలాంటి ఆంక్ష ఏదీ ముస్లిం వర్గాలు పెట్టినట్టు మనం ఎక్కడా కనలేదు, వినలేదు. ఇంకా చెప్పాలంటే - ఖిలాఫత్‌తో బాటు స్వరాజ్యాన్నీ సహాయ నిరాకరణ ఉద్యమ లక్ష్యాల్లో చేర్చాలని ముస్లిం ప్రముఖులే చొరవ తీసుకుని కోరారు. గాంధీగారే దాన్ని పడనివ్వలేదు. ఆ మేరకు తెచ్చిన తీర్మానాన్ని తుంగలో తొక్కించేదాకా ఆయన విశ్రమించలేదు.

నమ్మలేకపోతున్నారా ? 1921లో ఏమి జరిగిందో చిత్తగించండి.

ఆ సంవత్సరం భారత జాతీయ కాంగ్రెసు, ఆలిండియా ఖిలాఫత్ కాన్ఫరెన్సు, ఆలిండియా ముస్లిం లీగులు మూడింటి వార్షిక మహాసభలూ అహ్మదాబాద్‌లో జరిగాయి. మూడిటిలోనూ స్వాతంత్ర్యాన్ని డిమాండు చేస్తూ తీర్మానాలు ప్రతిపాదించబడ్డాయి. కాంగ్రెసు మహాసభకు అధ్యక్షత వహించింది హకీం అజ్మల్‌ఖాన్ అనే మహమ్మదీయుడు. స్వరాజ్యం లేక సంపూర్ణ స్వాతంత్ర్యం కాంగ్రెసు లక్ష్యమని ప్రకటించే తీర్మానాన్ని ప్రవేశపెట్టినవాడు మౌలానా హస్రత్ మొహానీ అనే ఇంకో మహమ్మదీయుడు. దానికి ఆ సభలో అనుకూలంగా పలువురు మాట్లాడిన తరవాత గాంధీగారు లేచి కరాఖండిగా ఆ తీర్మానాన్ని తోసిపుచ్చమని సభికులను ఇలా ఉద్బోధించారు.

"Friends,... the proposition of Mr. Hasrat Mohani... has grieved me. It has grieved me because it shows lack of responsibility... by raising a false issue and by throwing a bombshell in the midst of the Indian atmosphere... Let us not go into waters whose depths we do not know, and this proposition of Mr. Hasrat

Mohani lands you into depths unfathomable . I ask you to reject that proposition."

[*The Indian Annual Register 1922 Appendix* PP 64-66]

(మిత్రులారా - హస్రత్ మొహనీగారి ప్రతిపాదన నాకు బాధ కలిగించింది. ఎందుకంటే అది బాధ్యత లేకుండా ఒక తప్పుడు అంశాన్ని లేవనెత్తి. భారతీయ పర్యావరణంలో ఒక బాంబును వేసింది... మనకు లోతు తెలియని జలాల్లోకి మనం వెళ్లవద్దు. మిస్టర్ హస్రత్ మొహానీ ప్రతిపాదన మిమ్మల్ని అంతుబట్టని జలాల్లోకి నెట్టిపారేస్తుంది. ఈ ప్రతిపాదనను తిరస్కరించమని మిమ్మల్ని కోరుతున్నాను.)

అంటే - పాత విధేయతలను, మొగమాటాలను పక్కనపెట్టి బ్రిటిషువారిపై సహాయ నిరాకరణ రణభేరిని మోగించాక సంవత్సరం తరవాత కూడా గాంధీ మహాత్ముడి దృష్టిలో స్వరాజ్యం లేక సంపూర్ణ స్వాతంత్ర్యం అనేది ఒక తప్పుడు అంశం. ఒక సుడిగుండం. దాని గురించి మాట్లాడటం బాధాకరం మరియు బాధ్యతా రాహిత్యం ! శభాష్ !!

ఖిలాఫత్ మెహర్బానీ

మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజున చాలా ఇస్లామిక్ రాజ్యాలే సెలవు పాటించవు. సెక్యులర్ ఇండియాలో అది నేషనల్ హాలీడే ! ఒక పుస్తకమో, సినిమానో, కార్టూనో, మరొకటో ముస్లింల మత సెంటిమెంటును గాయపరుస్తుందని లేశమంత అనుమానం కలిగితే చాలు - ముస్లిం దేశాల కన్నా ముందు మనమే దాన్ని నిషేధించి పడేస్తాం. హాజ్ యాత్రకు వెళ్లేవారి విమాన ప్రయాణానికి, ఇతర వసతులకు ఏ ఇస్లామిక్ రాజ్యంలోనూ లేని రీతిలో భారీ రాయితీలివ్వటంలోనూ మనకు మనమే సాటి.

ముస్లిం సమాజంలో మహిళలో, మేధావులో, మరో వర్గమో సమానత్వం, సామాజిక న్యాయం, అభ్యుదయం నిమిత్తం గళమెత్తినా... ఆ సమాజానికి సంబంధించి న్యాయస్థానాలు ప్రగతిశీలక నిర్ణయాలు ప్రకటించినా వాటిని వమ్ముచేసి, ముస్లిం మత ఛాందసానికి కొమ్ము కాయటం ఎలాగా అని ముల్లాలు... మౌల్వీలకంటే ఎక్కువగా మన సోకాల్డ్ సెక్యులర్ రాజకీయ శక్తులే మహా ఆరాటపడతాయి. మైనారిటీల మెహర్బానీ కోసం చొక్కాలు చించుకుని, ఓవరాక్షను చేసే మనకాలపు సూడో సెక్యులర్ పైత్యానికి మూలమేమిటో అర్థమవాలంటే తొంభైఏళ్లు వెనక్కి వెళ్లాలి. మొదటి ప్రపంచయుద్ధం ముగిశాక మూలపడ్డ టర్కీ సుల్తానును నెత్తికెత్తుకుని, మన మహానాయకులు నడిపిన ఖిలాఫత్ రాజకీయ ప్రహసనాన్ని గుర్తుచేసుకోవాలి.

ఖిలాఫత్ అనేది అలాంటిలాంటి యవ్వారం కాదు. జలియన్‌వాలాబాగ్ కూడా చలింపజేయలేని గాంధీజీని దిగ్గున కదిలించి, బ్రిటిషు మహా సామ్రాజ్యంపై సహాయ నిరాకరణ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించేట్లు చేసిన తీవ్ర సమస్య అది. జాతికి స్వరాజ్యం సాధించి పెట్టినట్టుగా ఖ్యాతి గడించిన 'జాతిపిత'నే అవసరమైతే స్వరాజ్యాన్ని వాయిదా వేసుకుందుకు కూడా సిద్ధమని ప్రకటింపజేయగలిగిన గొప్ప విషయమది !

ఇంతకీ ఏమిటా ఖిలాఫత్ ?

ఖిలాఫత్ అనేది టర్కీ సుల్తాను సర్వంసహాధిపత్యాన్ని, విశాల టర్కిష్ సామ్రాజ్య సమగ్రతను విచ్ఛిన్నం కాకుండా నిలబెట్టటానికి భారతదేశంలోని మహమ్మదీయులు లేవనెత్తిన ఉద్యమం. టర్కీ మీద వారికి అంత శ్రద్ధ ఎందుకంటే - వంశ పారంపర్యంగా టర్కీకి సుల్తాను అయినవాడే ఖలీఫాగా కూడా వ్యవహరిస్తాడు. ఆ కాలంలో ఖలీఫాను భూమిమీద అల్లా ప్రతినిధిగా చాలామంది మహమ్మదీయులు భావించేవారు. ఇస్లామిక్ ప్రపంచమంతటికీ మత విషయాలలో ఆయనే పెద్ద దిక్కు. అంతటివాడి ఆధిపత్యాన్ని ఇంగ్లిషువాళ్లు కత్తిరించబూనడమంటే మతపరంగా తమకు తీరని అపచారం చేయటమేననీ, ఆ ధిక్కారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించి ఊరుకోరాదనీ ముస్లిం పెద్దలు పిడికిలి బిగించారు.

వారి మతాభినివేశం అర్థంచేసుకోదగ్గదే. ఇండియాలో "విభజించి పాలించే" రాజనీతితో తాము జాగ్రత్తగా మచ్చిక చేసుకుంటూ వస్తున్న ముస్లింలను తమకు దూరం కాకుండా చూసుకుని యుద్ధపు అక్కర తీర్చుకోవటం కోసం ప్రపంచయుద్ధ సమయంలో బ్రిటిషు ప్రభువులు కొన్ని వాగ్దానాలు చేసిన మాట నిజమే. యుద్ధం ముగిశాక టర్కీ విషయాన్ని సానుభూతితో పరిశీలిస్తామనీ, ఆసియాలో టర్కిష్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయటానికి తామేమీ కంకణం కట్టుకోలేదనీ బ్రిటిష్ ప్రధాని లాయడ్‌జార్జి బహిరంగంగా ఇచ్చిన హామీని గాలికి వదిలేశారన్న మహమ్మదీయుల మనస్తాపమూ సమంజసమే.

భారతీయ ముస్లింలన్న దానిలో పాయింటు ఎంత ఉన్నా, అది ఏ రకంగా చూసినా భారతదేశంతో ముడిపడిన సమస్యకాదు. ప్రపంచంలోని ముస్లింలందరితోబాటు భారతీయ ముస్లింలనూ కలవరపరచిందే తప్ప ప్రధానంగా భారతీయ ముస్లింలే కత్తులు దూసి పోరాడాల్సిన విషయం కాదు. అది మొత్తం ముస్లిం ప్రపంచానికి సంబంధించిన... ప్రపంచ ముస్లింలందరూ తేల్చుకోవలసిన వ్యవహారం. ఇండియాలో తమ సామ్రాజ్య స్వార్థంకోసం ఇక్కడి ముస్లిములతో తెల్లదొరలు టర్కీ గురించి ఆడిన ఇచ్చకాలన్నిటినీ హామీలకిందో, ఒప్పందాలకిందో భావించి వాటిని తు.చ. తప్పక అమలు చేసి తీరాలని, లేకపోతే వాగ్దాన భంగం కింద పరిగణిస్తామని భీష్మించడం వాస్తవిక వైఖరికాదు. ప్రపంచంలో ఇస్లాంకు నిజమైన వారసులు, హక్కుదారులు ఇండియాలోని ముస్లింలు మాత్రమే అని ఎవరూ అనలేరు.

అదీగాక - టర్కీ భవిష్యత్తును నిర్ణయించేది గ్రేట్ బ్రిటన్ ఒక్కటే కాదు. ప్రపంచ యుద్ధంలో జర్మనీ పక్షాన చేరి అమెరికా - బ్రిటన్ - ఫ్రాన్స్ తదితర దేశాల కూటమిపై కత్తి ఎత్తి భంగపడ్డ టర్కీ, ఆ దుస్సాహసానికి పర్యవసానాలనూ అనుభవించక తప్పదు. దాని సంగతి ఏమిచేయాలన్నది యుద్ధంలో గెలిచిన మిత్రమండలి మొత్తం కలిసి -

తేల్చవలసిన విషయం. చేసిన తప్పులను మరచి పాపులను క్షమించెయ్యటానికి అందరూ మహాత్ములుకారు. యుద్ధంలో ఒకవేళ జర్మనీ - టర్కీ కూటమి గెలిచి ఉంటే అమెరికా కూటమిని ఏమిచేసి ఉండేదో - అదే పనిని అమెరికా కూటమి పరాజితులైన జర్మనీ కూటమికి చేసింది. తనతో తలపడ్డ టర్కీ సామ్రాజ్యాన్ని ముక్కలుచేసి, టర్కీ సుల్తాను అధికారాలను కత్తిరించి కసి తీర్చుకుంది.

అది ముమ్మాటికీ కక్షసాధింపు దుర్మార్గమని చెప్పడానికి వీలులేదు. ఎందుకంటే రెండు ఖండాలకు విస్తరించిన టర్కీ సామ్రాజ్యం అనేక జాతుల సముదాయం. టర్కిష్ నియంతృత్వంలో నలిగి తరతరాలుగా విముక్తికోసం అలమటిస్తున్న దేశాలు, ముఖ్యంగా అరబ్ జాతులు ఎన్నో ఉన్నాయి. యుద్ధంలో గెలిస్తే వాటికి స్వాతంత్ర్యం ఇస్తామని యుద్ధ కాలంలో బ్రిటన్ వాగ్దానాలు చేసింది. మరి వాటినీ నిలబెట్టుకోవాలి కదా? పైగా శాంతి పరిష్కారంలో జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని అందరూ అంగీకరించారు. ఆ ప్రకారమే - అంతవరకూ టర్కీ సామ్రాజ్యంలో భాగమైన అరేబియా, జోర్డాన్, సిరియా, లెబనాన్, ఇరాక్ వగైరాలకు శాంతి ఒప్పందంలో స్వతంత్ర రాజ్యాల ప్రతిపత్తి ఇచ్చారు. వాటికీ దాస్య శృంఖలాలు తొలగినందుకు ఎవరైనా సంతోషించాలే తప్ప వాటిని అణచిపెట్టిన పాత సామ్రాజ్యం విచ్ఛిన్నమైందే అని వగచాల్సిన పనిలేదు.

అలాగే - టర్కీ సుల్తాను పవర్లుపోయి మూలపడ్డాడే అనీ ఎవరూ కన్నీరు పెట్టక్కర్లేదు. ఎందుకంటే టర్కీ ప్రజలే తమకు సుల్తాన్ అవసరం లేదనుకున్నారు. నిరంకుశ రాచరికాన్ని కూలదోసి రిపబ్లిక్‌ను స్థాపించుకోవాలని అక్కడి జనమే నిశ్చయించుకున్నారు. యుద్ధానంతరం బ్రిటిషువారు సుల్తాన్ అధికారాలను తగుమాత్రంగానే కుదించారు. తరవాత ఐదేళ్లలో టర్కీలోని ముస్లింలే కెమాల్ పాషా నాయకత్వాన తిరగబడి ఖలీఫాగారి అధికారాల వలువలను మొత్తంగా వొలిచి మూలకు గిరవాటు వేశారు. ఖలీఫా అల్లా ప్రతినిధి కదా, అంతటివాడిని అలాచేశారేమిటని ప్రపంచంలో ఏ ముస్లిం రాజ్యమూ ఆక్షేపించలేదు. ఎక్కడా ఆకు అయినా కదలలేదు. టర్కీలోని ముస్లిం ప్రజలకూ, ప్రపంచ ముస్లిం రాజ్యాలకూ లేని అభ్యంతరం హిందుస్థాన్‌లోని మహమ్మదీయులకు మాత్రమే పొడుచుకొచ్చి... ఖలీఫా, అతడి సామ్రాజ్యం చరిత్ర చెత్తకుండీలో పడటాన్ని ఇస్లాంకూ, ముస్లింల మనుగడకూ పెను ముప్పుగా చిత్రించడం హాస్యాస్పదం.

గాంధీగారు మాత్రం అలా అనుకోలేదు. ముస్లింలకు సంబంధించినంతవరకూ తన వివేకాన్ని విజ్ఞతను, కామన్‌సెన్సును ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించరాదని ఆయన ఒట్టేసుకున్నాడు. ఇస్లాంలాగే తనదీ ఒక మతమనీ, దానికి తానే ప్రవక్తననీ,

తీరూతెన్నూ లేని సనాతన ధర్మపు అయోమయంలో పడి అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న భారతీయులను నెత్తిన మొట్టి, మెడలు వంచి తన దారికి తీసుకురావటానికే తాను అవతరించాననీ ఆయనకు గట్టి నమ్మకం. తన మతాన్ని స్థాపించి, భారతదేశానికి నియంత కావాలన్న తన లోకోద్ధరణ సంకల్పానికి చిక్కల్లా ముసల్మాన్లతోనేనని ఆయన ముందే గ్రహించాడు. బతిమిలాడో, లొంగిపోయో... అడక్కుండానే వారికి అడ్డమైన సేవ చేసో.. వారు నంది అంటే నంది అని వంత పాడో... ఫీజు లేకుండా వకాల్తా తీసుకుని వారి పక్షాన వాదించో... ప్రతిఫలం కోరకుండా భూరి ఉపకారాలు చేసో ఎలాగైనా మహమ్మదీయుల్ని మచ్చికచేసుకుని, తన పక్షాన నిలుపుకుంటే దేశంలో తన ధాటికి ఎదురు ఉండదని ఆయన ఆశించాడు. ఆ ప్రకారమే ముస్లింల మెహర్బానీకోసం జీవితమంతా తపించాడు. యుక్తాయుక్తాలను పక్కన బెట్టి వారు అన్నదల్లా రైటు అన్నాడు. వారి మెరమెచ్చులకోసం ఏమైనా చేశాడు. ఎంతకైనా తెగించాడు.

దక్షిణాఫ్రికాలో ఉన్నప్పటినుంచే హిందూ – ముస్లింల మధ్య అనైక్యతే భారత ప్రధాన సమస్యగా గాంధీ తలిచాడు. స్వరాజ్యం సాధించటం ఎలాగన్నదానికంటే ముసల్మాన్లను ఎలాగైనా ప్రసన్నం చేసుకుని, మెప్పు పొందడానికే ఆయన తన శక్తి యుక్తులన్నీ వెచ్చించాడు. ఆ తహతహతోనే ఇండియాకు తిరిగి రాగానే మహమ్మదీయ అగ్రనేతలైన ఆలీ సోదరులతో సంపర్కం పెట్టుకున్నాడు. ఇండియాలో సంఖ్యాధిక్యం కలిగిన హిందూ కాఫిర్ల బారినుంచి తమను కాచుకోవటానికి అంతర్జాతీయ ఇస్లామిక్ ఐక్య సంఘటనను కవచంగా వాడుకోవాలని తలచి, దానికి టర్కీ ఖలీఫాను చోదకశక్తిగా భావిస్తూ వచ్చిన భారత ముస్లింలకు ప్రపంచయుద్ధంలో టర్కీ భంగపాటు ఆశనిపాతమైంది. భారతదేశంలో తమ మనుగడకూ, ప్రాబల్యానికి లంకెపడి ఉన్న ఖలీఫాగిరీని రక్షించుకోవటానికి ముస్లింలు ఆరాటపడగా... వారి మెరమెచ్చులను ఆశించి వారికంటే గట్టిగా గాంధీగారు ఖిలాఫత్ డిమాండును లంకించుకున్నారు. (ఇంతకుముందు అధ్యాయంలో ప్రస్తావించిన) 1918 వార్ కాన్ఫరెన్సు సందర్భంలోనూ హోంరూల్ కంటే ఎక్కువగా ముస్లిం సెంటిమెంట్‌ను, ముస్లిం ప్రార్థనాస్థలాల పవిత్రతను కాపాడటం గురించి ఆయన నొక్కి చెప్పారు.

గాంధీగారు ఒకందుకు ముస్లిం డిమాండ్లకు వకాల్తా తీసుకుంటే ముస్లింలు మరొకందుకు ఆయనను వాటంగా వాడుకున్నారు. బహుళ సంఖ్యాకులైన హిందువుల మద్దతు ఉంటేగానీ వారి పోరాటం ఫలించదు. వారి వాదం తెల్లవారి చెవికెక్కదు. కీలకమైన హిందూ మద్దతును కూడగట్టటానికి గాంధీ బాగా పనికొస్తాడని వారి భావన ఆ ఉద్దేశంతోటే 1919 నవంబరు 19న ఢిల్లీ మహాసభలో ఆలిండియా ఖిలాఫత్ కాన్ఫరెన్సుకు గాంధీగారినే ఏకంగా ప్రెసిడెంటుగా ఎన్నుకున్నారు. టర్కీ సమస్యను

మహమ్మదీయులకు సంతృప్తికరంగా పరిష్కరించనంతవరకూ శాంతి సంబరాల్లో పాల్గొనరాదనీ, బ్రిటిషు సర్కారుతో సహాయ నిరాకరణ సాగించాలనీ గాంధీ మహాత్ముడి అగ్రాసనాధిపత్యంలో ఆ మహాసభ ప్రశస్తమైన తీర్మానం చేసింది. మరుసటి నెల అమృత్‌సర్‌లో జరిగిన కాంగ్రెసు మహాసభల్లోనూ కాంగ్రెసువాదులు, ఖిలాఫత్‌వాలాలు విస్తృత సమాలోచనలు జరిపి, గాంధీజీ నేతృత్వంలో ఖిలాఫత్ కార్యకలాపాలను కొనసాగించాలని నిశ్చయించారు. ఆ రకంగా కాంగ్రెసు సంస్థ పేరు, ప్రతిష్ఠ, బలం అన్నీ ఖిలాఫత్‌కు వత్తాసుగా నిలిచాయి.

అమృత్‌సర్ సభలు ముగిసిన వెంటనే ఖిలాఫత్ కాన్ఫరెన్సువారు వైస్రాయి దగ్గరికీ, బ్రిటిష్ ప్రధానమంత్రి చెంతకూ హిందూ-ముస్లిం ప్రముఖులతో 1920 మొదట్లో రాయబారాలు పంపారు. ఐనా పని కాలేదు. పూర్వపు టర్కీ సామ్రాజ్యాన్ని ఛిన్నాభిన్నంచేస్తూ 1920 మే 15న శాంతి షరతుల అధికారిక ప్రకటన వెలువడటంతో సంఘర్షణ అనివార్యమై, గాంధీగారు సహాయ నిరాకరణ మహాశంఖం పూరించారు. హిందువుల మద్దతు కూడగట్టటంకోసం పంజాబ్ నేరాలు, స్వరాజ్యం వంటి డిమాండ్లను అనంతరం – అదీ కాంగ్రెస్ నేతల వత్తిడి మీద – జోడించినా సహాయ నిరాకరణోద్యమాన్ని తలపెట్టింది ఖిలాఫత్ కోసమేనన్నది దాగని వాస్తవం. ఎక్కడో టర్కీలో ముస్లిం సుల్తాను మతాధిపత్యాన్ని నిలబెట్టటంకోసం ఇక్కడ ఇండియాలో గుండెలు బాదుకోవటమేమిటి... శతాబ్దాల తరబడి హిందువులను నిరంకుశంగా అణచి నానా బాధలకు గురిచేసి, ఇప్పటికీ వారిని కాఫిర్లుగా, తమకు శత్రువులుగా పరిగణించే ముసల్మాన్లకోసం మనమింత హైరాణ పడటమెందుకు... స్వరాజ్యం కంటే కూడా వారి కొమ్ముగాయడమే అతిముఖ్య తక్షణ కర్తవ్యమైనట్టు చొక్కాలు చించుకోవడమెందుకు అన్న సంశయం చాలా మందికి వచ్చింది. దానికి గాంధీగారి సమాధానం ఇది.

"The test of friendship is true assistance in adversity. We talk of the Hindu - Mohamedan Unity. It would be an empty phrase if the Hindus hold aloof from the Mahomedans when their vital interests are at stake... The Khilafat question gave the two communities the opportunity of a life-time to unite. If the Hindus wish to cultivate eternal friendship with Mussalmans. they must perish with them in the attempt to vindicate the honour of Islam... In laying down my life for the Khilafat. I ensure the safety of the cow, that is my religion from the mussaalman knife."

**[*Quoted in History of Freedom Movement,*
R.C. Majumdar, Vol. III, PP 50, 54]**

(కష్టాల్లో సహాయపడటమే స్నేహానికి పరీక్ష... హిందూ... ముస్లిం ఐక్యత గురించి మనం మాట్లాడతాం. మహమ్మదీయుల కీలక ప్రయోజనాలకు ప్రమాదం వచ్చిన సమయంలో హిందువులు తమకేమీ పట్టనట్టు దూరంగా ఉంటే ఐక్యత అనేది శుష్క పదమే అవుతుంది... ఖిలాఫత్ వ్యవహారం ఇరు మతాలవారికీ కలిసిపోయేందుకు జీవిత కాలపు అవకాశాన్నిచ్చింది. ముసల్మానులతో శాశ్వతమైత్రి హిందువులు కోరు తున్నట్లయితే ఇస్లాం గౌరవాన్ని నిలిపే యత్నంలో వారితో కలిసి మరణించేందుకు సిద్ధపడాలి... ఖిలాఫత్ కోసం నా ప్రాణం ఒడ్డటం ద్వారా నేను నా మతాన్ని, నా గోవును ముసల్మాన్ కత్తివేటు నుంచి తప్పించుకోగలను.)

ఆవుల్ని చంపుకుని తినే ముసల్మాన్ల అండ ఉంటే తప్ప ఆవుకు రక్షణ ఉండదన్న గాంధీగారి వితండ వాదాన్ని వింటే ఎవరికైనా తల గిర్రున తిరుగుతుంది. పోనీ - ఖిలాఫత్ విషయంలో ముసల్మాన్ల కొమ్ముకాసినందుకు ప్రతిగా గోవధ ఆపుతామన్న హామీనైనా ఆయనగారు ముస్లిం నుంచి రాబట్టారా? లేదు. పైగా - ఖిలాఫత్ పోరాటంలో తమతో కలిసి వచ్చేలా హిందువులను ప్రసన్నులను చేసుకోవటం కోసం ఇక నుంచి గోవధ విరమిస్తున్నట్టు ప్రకటిస్తామని ముస్లిం నాయకులు కొందరు ముందుకు వచ్చినా "అక్కర్లేదు. మేము అలాంటి షరతులేమీ కోరం. గోవధ ఆపినా ఆపకున్నా బేషరతుగానే మీకు మద్దతిస్తాం" అని బడాయికి పోయిన ఘనత మన మహాత్ముడిది. మంచి తరుణము మించిన దొరకదని, ముసల్మాన్ల స్నేహం పొందాలంటే వెంటనే తొందరపడాలని ఆయన ఎంత వెంపర్లాడినా, అవతలివారు మాత్రం మొదటినుంచీ కరాఖండిగానే ఉన్నారు. ఎలాంటి భ్రమలూ పెట్టుకోకుండా, ఏ నసుగుడూ హిందువుల పట్ల తమ వైఖరిని స్పష్టంగానే ప్రకటిస్తూ వచ్చారు. ఎక్కడిదాకానో ఎందుకు? ఖిలాఫత్ ఉద్యమ నాయకుడు.... "నా ప్రియసోదరులు" అంటూ గాంధీగారు కౌగిలించుకుని నెత్తిన పెట్టుకు తిరిగిన ఆలీ సోదరుల్లో ఒకడు అయిన మహమ్మదాలీయే - ఖిలాఫత్ గురించి, హిందువులు - ముస్లింలు కలిసి పోరాడటం గురించి తన Comrade పత్రికలో రాసిన వ్యాసంలో ఏమన్నాడో చూడండి.

"People talk sometimes of the need of the Muslims joining hands with the Hindus... What has the Muslim situation abroad to do with the conditions of the Indian Muslims? Have the questions that really divide the two communities lost their force and meaning? If not, then the problem remains exactly where it was at any time in recent Indian History."

(హిందువులతో చేతులు కలపాల్సిన అవసరం ముస్లింలకు వచ్చిందని కొంతమంది మాట్లాడుతున్నారు... దేశాంతరంలో ముస్లిం సమస్యకూ, భారతదేశంలో ముస్లింల

పరిస్థితికీ సంబంధం ఏమిటి? రెండు మతాలనీ విడదీస్తున్న ప్రశ్నలు ఇప్పుడు అర్థంలేనివై చచ్చుపడ్డాయా ? లేదు. అంటే... సమస్య ఇటీవలి భారత చరిత్రలో ఎక్కడ ఉండినదో ఇప్పుడూ అక్కడే ఉంది)

హిందువులకూ, తమకూ సఖ్యత కుదిరేది కాదని ఇంత ఖచ్చితంగా చెప్పిన మహమ్మదాలీయే అనంతర కాలంలో ప్లేటు మార్చి. ఖిలాఫత్ రథంమీద గాంధీతో కలిసి ఊరేగటం విధి వైచిత్రి ! అవసరార్థం హిందువుల పట్ల ఎంత సుహృద్భావం కనపరిచినా... ముస్లిం నాయకులెవరూ హిందూ నేతల్లా ఒళ్లు తెలియకుండా ఓవరైపోలేదు. అంతర్జాతీయంగా ఇస్లామిక్ అండను పదిలపరచుకోవడం ద్వారా ఇండియాలో సంఖ్యాపరమైన తన బలహీనతను అధిగమించాలన్న అంతర్యాన్ని మరుగుపరిచే ప్రయత్నమూ చెయ్యలేదు. ఖిలాఫత్ సమయంలో ముస్లిం నేతలు కనపరిచిన ఆపద్ధర్మ సుహృద్భావం ఖిలాఫత్‌తోటే ఇగిరిపోయింది. హిందూ-ముస్లిం సఖ్యతకు దీర్ఘకాలంలో ఎంతమాత్రం ఉపయోగపడనైతే లేదు కాని - అయినదానికీ కాని దానికీ ముస్లింలకు వంతపాడి, వారి మెహర్బానీలకోసం వెంపర్లాడే విచిత్ర మనస్తత్వం గాంధీగారి ద్వారా కాంగ్రెసు వారికీ, వారి ద్వారా మొత్తం హిందూ సమాజానికీ అబ్బింది. అది ఈనాటికీ పరిపరి విధాలుగా ఎలా వర్ధిల్లుతున్నదో చూస్తూనే ఉన్నాం.

ఈయనా 'జాతిపిత'?

"Howsoever Gandhi might justify himself there can be no question that the Pan Islamic Movement, based on the extra-territorial allegience of the Indian Muslims, cut at the very root of the nascent Indian Nationalism. Any support, direct or indirect, to the Khilafat movement, not to speak of active participation as its leader, must therefore be regarded as anti-national. The conduct of Gandhi, a great political leader, in assuming the leadership of the Khilafat movement, was certainly reprehensible, and judged in this context, the epithet "Father of the Indian Nation" given him by his devotees, seems to be singularly inappropriate. How far Gandhi had forsaken the ideal of Indian nationalism may be judged from his observation on the report of Afghan invasionof India..."

**[*History of the Freedom Movement in India*,
R.C. Majumder, Vol. III. PP. 54-55]**

(గాంధీ తనను తాను ఎలా సమర్థించుకున్నా... దేశం బయటి శక్తులకు భారతీయ ముస్లింల విధేయత మీద ఆధారపడ్డ పాన్-ఇస్లామిక్ ఉద్యమం భారత జాతీయత మూలాలకే గొడ్డలిపెట్టు. ఖిలాఫత్ ఉద్యమానికి ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గాని ఇచ్చే ఏ మద్దతయినా జాతి వ్యతిరేకమనే భావించాలి. ఇక ఏకంగా నాయకుడిగానే ఆ ఉద్యమంలో పాల్గొనడం ఎలాంటిదో చెప్పక్కర్లేదు. గొప్ప రాజకీయ నాయకుడైన గాంధీ ఖిలాఫత్ ఉద్యమానికి నాయకత్వాన్ని స్వీకరించడం కచ్చితంగా గర్హనీయం. ఈ

సందర్భంలో బేరీజు వేస్తే.. ఆయనకు భక్తులిచ్చిన "భారత జాతిపిత" బిరుదు బొత్తిగా అనుచితం. భారత జాతీయత ఆదర్శాన్ని గాంధీ ఎంతగా వదిలేశాడో భారత్‌పై ఆఫ్ఘన్లదాడి వార్తకు ఆయన స్పందించిన తీరునుబట్టే నిర్ణయించవచ్చు...)

గాంధీ అంటే గిట్టని ఏ హిందూ మతోన్మాదో అన్న మాటలు కావివి. చారిత్రక ఆధారాలను సాకల్యంగా శోధించి వాస్తవాల నిగ్గుతేల్చిన మీదట విఖ్యాత భారతీయ చరిత్రకారుడు ఆర్.సి. మజుందార్ బాధ్యత గుర్తెరిగి చేసిన నిజ నిర్ధారణ ఇది. ప్రసిద్ధ చరిత్రకారుడైతే కావొచ్చు. కాని ఆయన గాంధీ విరోధి, ముస్లిం ద్వేషి, అందుకే మన పరమపూజ్య జాతిపిత మీద ఇంతలేసి అభాండం వేశాడు.. అని ఎవరూ అక్షేపించలేరు. ఎందుకంటే ఆయనకు అలాంటి అవలక్షణాలు ఉన్నట్టయితే... నిజానిజాలను నిష్పాక్షికంగా నిర్ధారించలేనంతగా విద్వేషపు పొరలు కమ్మిన కుహనా మేధావి అయి ఉంటే... స్వాతంత్ర్య పోరాట చరిత్రను గ్రంథస్థం చేసే బాధ్యతను స్వతంత్ర భారత సర్కారువారు తొలుదొలుత ఆయనకే ఏరికోరి అప్పగించేవారు కారు.

నిద్రాణమైన జాతిని మేల్కొలిపి, జాతీయోద్యమాన్ని నడిపి, భారతమాతకు దాస్య విమోచన చేసిన మహానాయకుడిని పట్టుకుని ఆయన 'జాతిపిత' కాదు – 'జాతి వ్యతిరేకి' అనడం తెంపరితనం, క్షమించరాని అపచారం అనే సాధారణంగా ఎవరికైనా అనిపిస్తుంది. దేశానికి ద్రోహం చేయాలన్న దుర్బుద్ధి గాంధీగారికి ఉందని ఆయన బద్ధ విరోధులు కూడా ఆరోపించలేరు. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ప్రవర్తించాలన్న సంకల్పంగాని, అలా ప్రవర్తిస్తున్నానన్న తెలివిడిగాని బాపూజీకి ఏ కోశానా లేవని గట్టిగా చెప్పవచ్చు. కాని దురదృష్టమేమిటంటే దేశానికి, జాతికి, జాతి జనులకు మేలే చేయాలన్న సదుద్దేశంతోనే అంతా చేసినప్పటికీ... ఖిలాఫత్ పూనకంలో ఆయన మాటలు, చేతలు ఏ రకంగా చూసినా జాతి వ్యతిరేకమైనవే. జాతీయత మౌలిక భావనకే విఘాతకరమైనవే.

అసలు – జాతి అంటే ఏమిటి? జాతీయత లక్షణమేమిటి? జాతీయ భావమని దేన్ని అనాలి? వీటికి విజ్ఞులు రకరకాల జవాబులు చెబుతారు. వాటిపై అభిప్రాయ భేదాలూ ఉన్నాయి. నిర్వచనాలు వేరైనా, వివరాల్లో తేడాలున్నప్పటికీ మొత్తం మీద ఒక విషయం అందరూ అంగీకరిస్తారు. ఒక దేశంలోని వివిధ సమూహాల మధ్య ఆత్మీయత, అనుబంధం, సమష్టి ప్రయోజనం ఉన్నప్పుడే... ఇందులో ఏ ఒక వర్గానికీ దేశానికి వెలుపల ఏ సమూహంతోనూ అటువంటి అనుబంధం, సమష్టి ప్రయోజనం లేకుండా ఉన్నప్పుడే... అటువంటి సమూహాలూ, వర్గాలూ అన్నీ కలిసి ఒక జాతి అనిపించు కుంటాయి. ఒక జాతిలో అంతర్భాగమనుకునే ఒక వర్గానికి ఆ జాతికి వెలుపల మరేదైనా వర్గం పట్ల వల్లమాలిన విధేయత, హద్దులు దాటిన ఆత్మీయత ఉంటే అది జాతీయత మౌలిక భావనకే విఘాతమవుతుంది.

భారత జాతిలో అంతర్భాగమనుకునే పది కోట్ల మంది ముస్లింల కీలక ప్రయోజనాలు భారతదేశంతో కాకుండా... భారతదేశానికి వెలుపల టర్కీతోనో, ఇతర ముస్లిం జాతులతోనో ముడిపడి ఉన్నాయని భావించే పక్షంలో... ఇండియా భవిష్యత్తు కంటే ఏ టర్కీ భవిష్యత్తుకో వారు ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చేటట్టయితే... వారిని భారత జాతిలో అంతర్భాగంగా పరిగణించటానికి వీలుండదు. ఖిలాఫత్ ప్రశ్న భారత ముస్లింల కీలక ప్రయోజనాలకు సంబంధించినదనీ, వారికి జీవన్మరణ సమస్యలాంటిదనీ గాంధీగారు స్వయంగా అంగీకరించటం ద్వారా భారత ముస్లింలది ప్రత్యేక జాతి అని చెప్పకనే చెప్పినట్టయింది. వారు ఇండియాలో ఉన్నప్పటికీ ఇండియాకు చెందరని ఆయనే ఒప్పుకున్నట్టయింది.

భారతీయ ముస్లింలు ఖలీఫాను తమ ప్రభువుగా పరిగణించే వారని, మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఇండియాలోని మసీదులన్నిటిలో శుక్రవారం ఖుత్‌బా పఠనంలో టర్కీ సుల్తానును పేర్కొనేవారని ప్రఖ్యాత ముస్లిం చరిత్రకారుడు ఐ. హెచ్. ఖురేషి రాశాడు. ఒకే దేశంలో పుట్టిన వారము కనుక తాము, హిందువులు అన్నదమ్ములమని, బయటి దేశపు ముసల్మాన్లకంటే స్వదేశపు హిందూ సోదరులే తమకు ఆత్మీయులని భారతీయ ముస్లిం పెద్దలు ఏనాడూ భావించలేదు. "మేము మొదట ముసల్మాన్లం, ఆ తరువాతే భారతీయులం" అన్న సంగతి ముస్లింల అగ్రనాయకులనుకునే అలీ సోదరులు ఏనాడూ దాచలేదు. "మన అసలు పోరాటం బ్రిటిషు వారితో కాదు. మన తగువల్లా ఈ దేశంలో మెజారిటీ అయిన 22 కోట్ల హిందువులతోనే. వీళ్లకు కనుక బలం వస్తే మొత్తం ముస్లిం ఇండియాను మింగేస్తారు. క్రమంగా ఈజిప్టును, టర్కీని, కాబూల్‌ను, మక్కామదీనాలను కూడా ఆక్రమిస్తారు". అని మరో ముస్లిం పెద్ద నేత మౌలానా ఆజాద్ సుభాని హెచ్చరించాడు. "నా ప్రియమైన హిందూ సోదరులారా! జాగ్రత్తగా వినండి. మీరు మా ఉద్యమానికి అడ్డమొచ్చి, మా హక్కులు మాకు ఇవ్వకపోతే మేము ఆఫ్ఘనిస్తాన్‌తోనో మరో ముస్లిం శక్తితోనో చేతులు కలిపి ఈ దేశంలో మా రాజ్యాన్ని స్థాపించుకుంటాం" అని పంజాబ్ కాంగ్రెస్ అగ్రనాయకుడు డాక్టర్ కిచ్లూ లాహోర్ బహిరంగ సభలో పబ్లిగ్గా చెప్పాడు.

ఐనా, గాంధీగారు ఇలాంటివేవీ పట్టించుకోలేదు. తమ మతానికేదో ఆపదవచ్చిందని ముసల్మాన్లు తల్లడిల్లుతున్న సమయంలోనే వారికి తోడుగా ఉంటే వారి మనసు కరిగి, కలతలు తొలిగి, హిందూ సోదరులతో శాశ్వతంగా కలిసిపోతారనీ... ఇలాంటి సదవకాశం ఇంకో వందేళ్లకు కూడా మళ్లీ రాదని ఆయన పదే పదే నొక్కి చెప్పారు. శతాబ్దాల తరబడి ముస్లిం ఏలుబడిలో ఉన్న ఇండియాలో దరిమిలా తాము కోల్పోయిన ప్రాభవాన్నీ, ప్రాధాన్యాన్నీ తిరిగి పొందాలన్న తహతహతోనే అంతర్జాతీయ

ముస్లిం సంఘటనకోసం ముసల్మాన్లు ఉవ్విళ్లూరుతున్నారనీ... ఖిలాఫత్ పోరు వెనుక అసలు ఉద్దేశం కూడా అదేననీ– అందరికీ కనపడ్డ 'గోడమీద రాత'ను గాంధీ మహాత్ముడు గుర్తించటానికి నిరాకరించాడు. ఆయన ధోరణి ఉష్ట్రపక్షిని తలపించినా... ఆ కాలంలోని మిగతా జాతీయ నాయకులు రాగల ప్రమాదాన్ని ముందే ఊహించారు. ఉదాహరణకు – 'దేశబంధు' చిత్తరంజన్‌దాస్‌కు రాసిన లేఖలో 'పంజాబ్ కేసరి' లాలా లజపతిరాయ్ ఏమన్నాడో చూడండి.

There is one point which has been troubling me very much... I am not afraid of seven crores in Hindusthan, but I think the seven crores of Hindusthan plus the armed hordes of Afghanistan, Central Asia, Arabia, Mesopotamia and Turkey will be irresistible".

[Quoted by B.R. Ambedkar, *in Thoughts on Pakistan,* P.274]

(ఒక విషయం నన్ను బాగా కలవరపెడుతున్నది. హిందుస్థాన్‌లోని ఏడుకోట్ల ముసల్మాన్లంటే నాకు భయం లేదు. కాని హిందుస్థాన్‌లోని ఏడుకోట్లకు ఆఫ్ఘానిస్థాన్, మధ్య ఆసియా, అరేబియా, మెసపొటేమియా, టర్కీలలోని సాయుధ మూకలు తోడయితే నిరోధించటం అసాధ్యం.)

లజపత్‌రాయ్ జాతీయ నాయకుడైనా హిందువు కనక ఆ దృష్టితోనే ఆలోచించి, ముస్లింల జాతీయ నిబద్ధత మీద అనవసరపు భయాలు పెంచుకున్నాడేమోనని శంకిద్దామా? హిందువు కాని... అసలు భారత జాతీయురాలేకాని ఐరిష్ మహిళ **అనీబిసెంట్** నిశ్చితాభిప్రాయాన్ని గమనించండి :

Since the Khilafat agitation, things have changed and it has been one of the main injuries inflicted on India by the encouragement of the Khilafat crusade, that the inner Muslim feeling of hatred against "unbelievers" has sprung up naked, and unashamed... we have heard Muslim leaders declare that if the Afghans invaded India, they would join their fellow believers, and would slay the Hindus who defended their motherland against the foe; we have been forced to see that the primary allegiance of Mussalmans is to Islamic countries, not to our motherland."

[*The Future of Indian Politics,* Annie Besant, P.301]

(ఖిలాఫత్ ఆందోళన తరవాత పరిస్థితులు మారాయి. ఖిలాఫత్ క్రూసేడును ప్రోత్సహించటం వల్ల ఇండియాకు తగిలిన పెద్ద దెబ్బల్లో ఒకటి ఏమిటంటే –

"అవిశ్వాసుల"పట్ల ముస్లింల మనసుల్లో ద్వేషం నగ్నంగా, నిర్లజ్జగా ఉప్పొంగింది... ఆఫ్ఘాన్లు ఇండియా మీద దాడి చేస్తే తాము మాతృభూమిని రక్షించబోయే హిందువులను నరికేస్తామని ముస్లిం నాయకులు ప్రకటించటం మనం విన్నాం. ముసల్మాన్ల ప్రాథమిక విధేయత ఇస్లామిక్ దేశాలకే తప్ప మాతృభూమి మీద కాదని మనం చూశాం.)

ఇలాంటి భయాలు, అనుమానాలు గాంధీగారు ఆలకించారు. కాని తేలికగా కొట్టేశారు. ముస్లిములతో చేతులు కలిపితే వారు ఏ ఆఫ్ఘాన్లచేతో ఇండియాపై దాడిచేయిస్తారేమో, వారూ వీరూ కలిసి ఏ అఘాయిత్యం చేస్తారోనన్న సంకోచం అక్కర్లేదు. బ్రిటిషు సర్కారు అంత శక్తి హీనంగా ఏమీ లేదు. సాయుధ యుద్ధంతో దాన్ని గెలవటం కల్ల. కాబట్టి అహింసాయుత అసహాయోద్యమం మినహా ముసల్మాన్లకు గత్యంతరం లేదు. ఆ సంగతి గ్రహించి వారు నిగ్రహంతో మెలిగి సహాయ నిరాకరణలో ఏకదీక్షగా నిమగ్నమైతే సంవత్సరంలో స్వరాజ్యం వస్తుంది. అప్పుడు అన్ని సమస్యలూ తీరతాయి- అని ఆయన శతవిధాల నూరిపోశారు.

ఆ హితవును పాటించి, అహింసను నమ్ముకుని ఎప్పుడో స్వరాజ్యం వచ్చేదాకా వేచి ఉండే ఓపిక, ముస్లింలకు లేకపోయింది. తమ పవిత్ర సామ్రాజ్యాన్ని ముక్కచెక్కలు చేసిన పాపిష్టి బ్రిటిషు సర్కారు పెత్తనం కింద - అదీ హిందూ కాఫిర్ల సరసన దార్-ఉల్-హర్బ్ అయిన ఇండియాలో బతకటం వారికి దుస్సహమైంది. ఆ మతావేశంలో ఈ పాపుల నీడ తమపై పడకుండా ఇస్లాం విలసిల్లే సీమకు సామూహికంగా వలస (హిజరత్) వెళ్లాలనీ చాలామంది సంకల్పించారు. సింధ్‌లో మొదలైన ఈ కదలిక క్రమంగా వాయవ్య సరిహద్దు రాష్ట్రానికి విస్తరించి, 1920 ఆగస్టుకల్లా సుమారు 18వేల మంది ఆఫ్ఘానిస్తాన్ దారి పట్టారు. వారిని కుదిపి, కదిపిన ఎల్లలెరుగని ముస్లిం సౌభ్రాతృత్వం దురదృష్టవశాత్తూ ఆఫ్ఘాన్ పాలకులను కదిలించలేకపోయింది. మత సెంటిమెంటు కంటే తమ జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చి వారు వలసొచ్చిన భారత ముహాజిర్లకు తలుపులు మూసేశారు. అష్టకష్టాలూ, నానా నష్టాలూ పడి అంత మందీ వెనక్కి వచ్చారు.

ఆ భంగపాటు తరవాతైనా ముసల్మాన్లు తమ తప్పును గుర్తించారా? ఆఫ్ఘాన్ భాయీలు తెలియజెప్పాకైనా మతంకంటే జాతీయత ముఖ్యమని గ్రహించి, భారత జాతీయులుగా తమ కర్తవ్యాన్ని, బాధ్యతను సజావుగా నిర్వర్తించారా ? హిందువులు, తాము ఒకే భారతమాత బిడ్డలమనీ, ఉమ్మడి శత్రువు అయిన బ్రిటిషు పాలనపై అందరూ అన్నదమ్ముల్లా కలిసి పోరాడాలనీ తలిచారా ? లేదు. గాంధీ బోధించినట్టుగా అహింసకు కట్టుబడేదీ లేదు. హిందువులను సోదరులుగా పరిగణించేదీ లేదు. స్వరాజ్యంకోసం అంగలార్చేదీలేదు, మాకు కావలసింది మా ఖిలాఫత్, దానికోసం ఏమైనా చేస్తాం ! మా

మతానికింతటి అన్యాయం చేసిన బ్రిటిష సైతాను ప్రభుత్వాన్ని ఎలాగైనా సతాయిస్తాం అని పళ్లు కొరికారు వారు. ఆ ఊపులో చాలా దూరమే వెళ్లారు. వారు ఏమి చేస్తారని హిందువులు భయపడుతూ వచ్చారో సరిగ్గా ఆపనే చేశారు. ఇండియాపై దండయాత్ర చేయమని ఆఫ్ఘాన్లను ఆహ్వానించారు.

ఇది ఏ స్థాయిలో జరిగింది. అవతలివారు దానికి ఏమన్నారు, పర్యవసానం ఏమిటి- అన్నవి ఇతమిత్థంగా తెలియదు. వదంతులు మాత్రం జోరుగా లేచాయి. రేపో మాపో ఆఫ్ఘాన్లు దేశంమీద పడబోతున్నారు. వారూ, ఇక్కడి ముస్లింలూ కలిసి కనపడ్డ కాఫిరును కనపడ్డట్టు చంపేస్తారు- అని ఎక్కడ విన్నా పుకార్లే. దాంతో ఉద్రిక్తత హెచ్చింది. మత వైషమ్యాలు పెరిగాయి. అపోహలకు, అపార్థాలకు అంతే లేదు.

వచ్చినవన్నీ నిరాధారమే కావచ్చు. దేశంలోని ముస్లింలకు ఎలాంటి ద్రోహ చింతా ఉండకపోవచ్చు. ముస్లిం అగ్రనాయకులు ఏ పాపమూ ఎరుగకపోవచ్చు. అలాగైతే అవమానాలను నివృత్తి చేయవలసిన బాధ్యత వారిదే. ఎవరూ అపార్థం చేసుకోకుండా తమ దేశభక్తిని, జాతీయ నిబద్ధతను శంకించే ఆస్కారం ఎవరికీ చిక్కకుండా వ్యవహరించటం వారి విధి. ఆ పని వారు చేశారా? లేదు పైగా వచ్చిన అభియోగాలను, అనుమానాలను ధ్రువీకరించే రీతిలో అడ్డగోలుగా స్టేట్‌మెంట్లిచ్చారు. అదీ బాధ్యత లేని కోన్‌కిస్కా తురకలు కాదు. దేశంలోని ముస్లిం ప్రముఖుల్లోకెల్లా ప్రముఖుడూ, ముస్లిం లీగుకూ, ఖిలాఫత్ ఉద్యమానికీ అగ్రనాయకుడూ అయిన మౌలానా మహమ్మదాలీయే ఆఫ్ఘాన్ అమీరు ఇండియాపైకి దాడి చేస్తే తాను తప్పక సహాయ పడతాననీ ఒకవేళ హిందువులు ఆ దాడిని ఎదిరించి దేశం తరపున పోరాడితే తాము వారి పీచమణచటానికి వెనకాడమనీ పబ్లిగ్గా ప్రకటించాడు. అంతేకాదు. దాడికి వత్తాసు పలుకుతూ ఆఫ్ఘాన్ అమీర్‌కి ఆయన ఏకంగా టెలిగ్రామే పంపాడు.

దానిమీద కావలసినంత రభస అయింది. దేశమంతటా గగ్గోలు పుట్టింది. ఈ గడ్డమీద పుట్టి, ఇక్కడ పెరిగిన ఏ భారతీయుడూ కలనైనా అనకూడని చెడుమాటలివి. విన్నవారు అవాక్కయ్యారు. ఏ విధంగా భాష్యం చెప్పినా క్షమించరాని పక్కా దేశద్రోహ మిది. బ్రిటిషు సర్కారూ అలాగే భావించింది. మహమ్మదాలీని ఏ క్షణమైనా అరెస్టు చేయవచ్చునని వార్తలు గుప్పుమన్నాయి. కనీసం అప్పుడైనా గాంధీ మహాత్ముడు ఆలీ సోదరుల, ఖిలాఫత్ ఉద్యమ అసలు స్వరూపాన్ని గుర్తుపట్టి, అప్పటిదాకా ఖిలాఫత్‌ను తలకెత్తుకున్నందుకు బహిరంగంగా చెంపలు వాయించుకున్నాడా? మహమ్మదాలీ అన్నది చాలా తప్పు అని చెప్పి అతడితో పూర్తిగా తెగతెంపులు చేసుకున్నాడా? లేదు. పైగా - మహమ్మదాలీనే జంకూ గొంకూ లేకుండా వెనకేసుకు వచ్చాడు. 1921 మే 10న అలహాబాద్ జిల్లా మహాసభలో ప్రసంగిస్తూ మన మహాత్ముడన్న మాటలివి :

I cannot understand why the Ali Brothers are going to be arrested as the rumour goes, and why I am to remain free. They have done nothing which I would not do. If they had sent a message to the Amir, I also send one to inform the Amir, that if he came no Indian, so long as I can help it, would help the Government to drive him back... I would, in a sense, certainly assist the Amir if he waged war against the British Government. That is to say, I would openly tell my countrymen that it would be a crime to help a government which had lost the confidence of the nation to remain in power.

(పుకారు పుట్టినట్టు - ఆలీ సోదరులు ఎందుకు అరెస్టు అవుతారో, నేను ఎందుకు స్వేచ్ఛగా ఉంటానో నాకు అర్థం కావటంలేదు. నేను చేయబోని పని ఏదీ వారు చేయలేదు. వారు కనుక అమీర్‌కు సందేశం పంపించి ఉంటే... నేనూ అదే అమీర్‌కు కబురు పంపుతా. ఏమనంటే - అతడు వస్తే ఏ భారతీయుడూ అతణ్ణి వెనక్కి నెట్టటంలో ప్రభుత్వానికి సహాయపడకుండా నేను శాయశక్తులా చూస్తానని !... బ్రిటిష్ ప్రభుత్వంపై యుద్ధం చేస్తే నేను తప్పకుండా అమీర్‌కి సహాయపడతా ! ఎలాగంటే - జాతి విశ్వాసం కోల్పోయిన ప్రభుత్వానికి మద్దతివ్వటం నేరమని నేను బహిరంగంగా నా దేశవాసులకు చెబుతా.)

విన్నారా ? ఆఫ్ఘాన్ దేశపు పాలకుడు మన దేశం మీదికి దండెత్తి వస్తే మన మహాత్ముడు అతడికే సహాయం చేస్తాడట ! దేశ రక్షణకోసం బ్రిటిష ప్రభుత్వానికి ప్రజలు ఏమాత్రం సాయపడ్డా అది ఘోరమైన నేరమే అవుతుందట. ఎందుకంటే ఆ ప్రభుత్వం జాతి విశ్వాసం కోల్పోయింది కనుకట! అంటే... ఒక ప్రభుత్వం ప్రజావిశ్వాసం కోల్పోయిన పక్షంలో అది రాజ్యమేలుతుండగా ఏ శత్రుదేశం దండెత్తి వచ్చినా ప్రభుత్వం మీది కోపంతో ప్రజలు శత్రువుకే సాయపడాలన్నమాట.

ఇది 'జాతిపిత' అనాల్సిన మాటేనా?

ఏమిటీ పిచ్చిపని ?

Not only did Mr. Gandhi advise the Amir not to enter into any treaty with the British Government, but declared "I would in a sense, certainly assist the Amir of Afghanistan, if he waged the war against the British Government... ..." Can any sane man go so far, for the sake of Hindu-Moslem Unity? But Mr. Gandhi was so attached to Hindu-Moslem Unity that he did not stop to enquire what he was really doing in this mad endeavour.

[Pakistan or the Partition of India, B.R. Ambedkar, P.145]

(బ్రిటిష ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవద్దని అమీర్‌కి సలహా ఇవ్వటం ఒకటే కాదు. ఇండియాపై యుద్ధంచేస్తే ఆఫ్ఘాన్ అమీరుకు తాను తప్పక సహాయ పడతానని కూడా మిస్టర్ గాంధీ ప్రకటించాడు. మతి సరిగా ఉన్నవాడెవడైనా ఇంత దూరం వెళతాడా? ఈ పిచ్చిపనిలో తాను నిజంగా చేస్తున్నదేమిటి అని ఒక క్షణం ఆగి ఆలోచించలేనంతగా హిందూ ముస్లిం ఐక్యతకు గాంధీ హత్తుకుపోయాడు.)

భారత రిపబ్లిక్ రాజ్యాంగ రచయితల్లో ఒకడైన బాబాసాహెబ్ బి.ఆర్. అంబేద్కర్ మాటలు గాంధీ భక్తులకు కటువుగా ఉండవచ్చు. కాని అక్షరాలా నిజం. అంబేద్కర్ అన్నట్టు భారతదేశంపై విదేశీయుల దాడిని స్వాగతించటమనేది ఏ భారతీయుడూ కలలో కూడా తలపెట్టకూడని ప్రమాదభరితమైనపని. ఏ పాకిస్తానో మనపై యుద్ధానికి వస్తే తాము తప్పక సహాయపడతామనీ, పాలించే హక్కు కోల్పోయిన భారత సర్కారుకు తోడ్పడటం నేరమంటూ ప్రజలను ఉద్బోదిస్తామనీ ఇవాళ ఏ ముస్లిం తీవ్రవాద నాయకుడో తెగబడి ప్రకటిస్తే ఊరుకుంటామా? అది క్షమించరాని దేశద్రోహం అని కరాఖండిగా ఖండించమా? ఈ దేశంలో ఉండి, ఈ దేశంపై దురాక్రమణ చేయమని

పరాయి పాలకుడిని ప్రేరేపించే ద్రోహిని కఠినంగా శిక్షించాలని కోరమా? ముస్లింల మెహర్బానీ కోసం ఆఫ్ఘాన్లతో సరాగంలో గాంధీగారు చేసింది మాత్రం తక్కువ అపరాధమా?

"ఇండియా మీదికి దండెత్తి వస్తే ఆఫ్ఘాన్ అమీరుకు నేను తప్పక సహాయపడతాను. జాతి విశ్వాసం కోల్పోయిన సర్కారుకు తోడ్పడటం నేరమని ప్రజలకు చెబుతాను. విదేశీ దాడిని సైనికంగా ఎదుర్కోవటానికీ మనం సహకరించకూడదు. ఎందుకంటే-ఖిలాఫత్, పంజాబ్, స్వరాజ్యం నిమిత్తం హిందువులు, ముస్లిములు ఎంచుకున్న అహింసా విధానానికి అది విరుద్ధం" - అని 1921 మే4న **'యంగ్ ఇండియా'** పత్రికలో ప్రియ సోదరుడు మహమ్మదాలీని వెనకేసుకొస్తూ గాంధీగారి ఉవాచ! గుర్తుందా? దక్షిణాఫ్రికాలో జులూ ఆదివాసుల తిరుగుబాటును కర్కశంగా అణచడంలో తానూ యథాశక్తి తెల్లదొరతనానికి సేవచేసి ధన్యుడైన సందర్భంలో ఆ నిర్వాకాన్ని సమర్థించుకుంటూ ఇదే మహాత్ముడు ఏమన్నాడో? ప్రభుత్వంనుంచి తాను రక్షణ పొందుతున్నప్పుడు... యుద్ధ సమయాన ఆ ప్రభుత్వానికి తోడ్పడటం బ్రిటిషు సామ్రాజ్య పౌరుడిగా తన కనీస విధి అని కదా అప్పుడు ఆయన వాదన? ఆ తర్వాత మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనూ అహింసా నియమాన్ని తీసి గట్టునపెట్టి రక్తపుటేరులు పారే యుద్ధరంగానికి వేల సంఖ్యలో సైనికులను రిక్రూట్ చేసి పంపే పనిలో తలమునకలై... అదేమి పని మహానుభావా అంటే బ్రిటిషు సామ్రాజ్య పౌరుడిగా అది నా కనీస కర్తవ్యమని డబాయించిందీ ఈ మహాత్ముడే కదా ? ఎక్కడో వేరే దేశాల్లో జరుగుతున్న యుద్ధానికే సైనికులను సమర్పించి, బ్రిటిషు ప్రభుత్వానికి విధేయత చాటుకోవటం తన విధి అని తలచినవాడు... నేరుగా మన దేశం మీదికే విదేశీయుడెవడో దండెత్తి వచ్చినప్పుడు దేశాన్ని రక్షించుకోవటంలో అదే బ్రిటిషు ప్రభుత్వానికి సాయపడటం మాత్రం తన పనికాదని అంటాడేమిటి? పైగా దాడికి దిగే శత్రువుకే సాయపడతానంటాడేమిటి? శత్రువును ఎదుర్కొని దేశాన్ని కాపాడుకునేందుకు సాగే సైనిక సన్నాహాలకు సహకరించటం కూడా అహింసా వ్రతానికి నిషిద్ధమంటూ సమయానుకూలంగా కొత్త నీతిని కనిపెడతాడేమిటి?

It is no part of the duty of a non-violent non-co-operator to assist the Government against war made upon it by others. He may not take part directly or indirectlyin it. But it is no part of his duty to help the Government to end the war. On the contrary, his prayer must be, for the defeat of that power which he seeks to destroy.

[*Collected Works of Mahatma Gandhi*, Vol. 23, #71, P. 162]

(ఇతరులు యుద్ధానికి వచ్చినప్పుడు ప్రభుత్వానికి సాయపడటం అసహాయోద్యమ అహింసావాది కర్తవ్యం కానే కాదు. ఆ యుద్ధంలో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని అతడు పాలుపంచుకోకూడదు. యుద్ధాన్ని ముగించటంలో ప్రభుత్వానికి అతడు సహాయపడక పోవటమే గాక... తాను నాశనం చేయగోరే శక్తి యుద్ధంలో ఓడిపోవాలనే అతడు ప్రార్థించి తీరాలి.)

'యంగ్ ఇండియా' పత్రిక 1921 మే 18 సంచికలో గాంధీగారి ఉద్బోధ ఇది. విన్న వారికి మతిపోతుంది. అంతర్గతంగా ప్రభుత్వంతో ఎన్ని గొడవలున్నా, బయటివారు దాడి చేసినప్పుడు అంతా కలిసి, విభేదాలను మరిచి, శత్రువును ఉమ్మడిగా ఎదుర్కోవటానికి ప్రభుత్వంతో సహకరించి తీరాలనే పామరులమైన మనం ఇప్పటిదాకా అనుకుంటున్నాం. అది శుద్ధ తప్పు అన్నమాట. గాంధీగారి దివ్య ప్రబోధాన్ని అనుసరిస్తే... యుద్ధం వచ్చినప్పుడు ప్రభుత్వమంటే సరిపడని వారు తమ దేశం ఓడిపోవాలనే దేవుణ్ణి ప్రార్థించాలి!

ఇది రాస్తున్న సమయానికి కేంద్రంలో రాజ్యమేలుతున్న యు.పి.ఎ. ప్రభుత్వమంటే ఎన్.డి.ఎ. కూటమికి గిట్టదు. ఈ ప్రభుత్వం జాతి విశ్వాసాన్ని కోల్పోయింది; దీనికి అధికారంలో ఉండే హక్కు ఎంతమాత్రం లేదు. అనే విపక్షం నమ్ముతోంది. కాబట్టి రేపు ఏ పాకిస్తానో దేశం మీదికి దండెత్తి వస్తే మన ప్రభుత్వం ఓడిపోవాలి, మన శత్రువు గెలవాలి, మన దేశం నాశనంకావాలి అనే... యు.పి.ఎ. సర్కారును రాజకీయంగా వ్యతిరేకించే పార్టీలు, వర్గాలు, ప్రజలు కోరుకోవాలన్నమాట. దేశాన్ని రక్షించే యత్నాల్లో ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని పాలుపంచుకోకపోవడమేకాక, దురాక్రమణకు దిగే పాకిస్తాన్ వాడికే శాయశక్తులా సహాయపడాలన్నమాట ! అలాగని మామూలు వాడెవడైనా అంటే ఈడ్చుకెళ్ళి జైల్లో వేస్తారు. మామూలు మనిషి అంటే దేశద్రోహం. మహాత్ముడు చెబితే అది దివ్య ప్రబోధం !!

కాని– ప్రభుత్వంమీది కోపంతో మనం మిన్నకుంటే దేశం శత్రువు వశం కాదా? జాతి హితం మంటగలసిపోదా ? ఈ ఆక్షేపణ వస్తుందని ముందే ఊహించి గాంధీగారు దానికీ అదే పత్రికా వ్యాసంలో సమాధానం చెప్పారిలా:

I can contemplate an Afghan invasion with perfect equanimity... so far as India's safety is concerned. The Afghans have no quarrel with India. They are a god-fearing prople... It is a superstition to suppose that they will overrun India if the British post at the frontier was withdrawn."

[Young India 18-5-1921]

(ఆఫ్ఘాన్లు దాడిచేసినా భారతదేశ భద్రత గురించి నాకు ఎంతమాత్రం చింతలేదు. ఆఫ్ఘాన్లకు భారతదేశంతో తగవు ఏమీలేదు. వాళ్లు దేవుడంటే భయం ఉన్నవాళ్లు... సరిహద్దులో బ్రిటిషు కాపలాను తీసేస్తే వాళ్లు ఇండియాను ఆక్రమిస్తారనుకోవటం మూఢ నమ్మకం)

భలే ! ఆఫ్ఘాన్లతో మనకు తగవు లేదు కాబట్టి దండయాత్ర చేసినా... గాంధీగారి దయవల్ల యుద్ధంలో గెలిచినా... సరిహద్దులో సైనిక కాపలాను మొత్తంగా ఎత్తేసినా సరే... దేవుడికి భయపడే మామంచి ఆఫ్ఘాన్లు దండంపెట్టి అటునుంచి అటే వెనక్కిపోతారని గాంధీగారు నమ్మమంటారు. వారు మనల్నేదో చేసి, చేజిక్కిన దేశాన్ని ఆక్రమిస్తారనుకోవటం మూఢ నమ్మకమనీ ఆయన ఉపదేశిస్తారు. చాలా బాగుంది. కాని - ప్రాచీన కాలం నుంచీ అనేకమార్లు ఖైబర్ కనుమగుండా భారతదేశపు సంపన్న మైదానాలలోకి మనతో తగవు ఉండే ఆఫ్ఘాన్లు చొచ్చుకు వచ్చి నానా ఆగం చేశారా? అలాగే - దైవభక్తుడు మనకు హాని చెయ్యడనుకుంటే - పూర్వం మనపైకి డజనుకిపైగా దండయాత్రలు చేసిన గజనీ మహమ్మద్ కూడా దేవుడికి భయపడేవాడేకదా? దైవద్రోహులైన భారతీయులకు సిసలైన దైవమార్గాన్ని చూపించటానికే తాను అంత శ్రమ పడ్డానని అతడు చెప్పుకోలేదా? చరిత్ర తెలియకుండా, కనీసపు కామన్ సెన్సు లేకుండా, పరుల మంచి తనాన్ని అతిగా నమ్మేసి దేశాన్ని రాబందులపాలు చేసే గాంధీ విచిత్ర విన్యాసమే అసలైన మూఢ నమ్మకం కాదా?

ఈ మాటే చాలామంది అడిగారు. మహమ్మదాలీ తరపున వకాల్తా తీసుకుని ఆఫ్ఘాన్ దాడిని తాను సైతం ఆహ్వానించిన తీరుపై గాంధీగారి మీద పెద్ద దుమారమే లేచింది. దాంతో నరంలేని నాలుకను ఇంకో రకం మడతవేసి ఆయన ఓసోస్! అలాంటిదేం లేదు. నేనన్నదానికి విపరీతార్థాలు తీయకండి. నేనలా రాసింది అతి భయాలు పెట్టుకున్న మనవాళ్లను దృష్టిలో పెట్టుకునే తప్ప ఆఫ్ఘాన్లను ఉద్దేశించి కాదు. అయినా... నేను రాసినంత మాత్రాన ఆఫ్ఘాన్లు యుద్ధానికి వచ్చేస్తారా ఏమిటి? నా వ్యాసాలు చదివి వాళ్లు యుద్ధవ్యూహాలను నిర్ణయించుకుంటారా ఎక్కడన్నా? !- అని తేలిగ్గా కొట్టిపారేశారు. వింటే మనకూ నిజమేనేమో అనిపిస్తుంది. అనుంగు సోదరుడు మహమ్మదాలీ ఆఫ్ఘాన్లను దాడికి రమ్మని ప్రేరేపించి, చిక్కుల్లో ఇరుక్కునే సరికి అతడిని బయట వేయటంకోసమే గాంధీగారు అలా మాట్లాడేరేమో ! మహమ్మదాలీ అన్నమాటే తానూ అంటాను. దాడికి వస్తే అమీరుకు తానూ సహకరిస్తాను - అని మహాత్ముడన్నది ఏదో మాటవరసకు, వాదనకోసమే తప్ప - దేశం మీద దాడిచెయ్యమని విదేశీయుడిని ఆహ్వానించే ద్రోహ

చింతనగాని, శత్రువుతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని దెబ్బతీసి జాతికి చెరుపుచేసే దుర్బుద్ధిగాని, ఆయనకు ఏ కోశానా లేవనే మనకు నమ్మబుద్ధేస్తుంది.

కాని - అలా సమాధానపడేందుకూ వీలు లేదు. ఖిలాఫత్ తమకంతో ముసల్మాన్ల ప్రాపకాన్ని ఆశించి గాంధీగారు చాలా దూరమే వెళ్లారు. చేయకూడని పనే చేశారు.

ఆఫ్ఘనిస్తాన్‌కూ, బ్రిటన్‌కూ మధ్య మూడో యుద్ధం 1919లో ముగిసి సంధి కుదిరినా వైషమ్యాలు సమసిపోలేదు. సమయం దొరికితే బ్రిటిషువారిని చావుదెబ్బ తీయాలని ఆఫ్ఘాన్ నాయకులు దారులు వెదుకుతూనే ఉన్నారు. బ్రిటన్ కబ్జాలో ఉన్న భారతదేశం మీద ప్రేమ ఒలకబోసి, ఉమ్మడి శత్రువును పరిమార్చే పేర భారతీయ ప్రముఖులను తమ వైపు తిప్పుకుని, పావుల్లా ఉపయోగించుకోవాలని వారు చాలా ప్రయత్నాలు చేశారు. అనంతర కాలంలో ఆఫ్ఘాన్ సుల్తాన్ అమానుల్లాకు ఇండియా వైస్రాయ్ ఒక లేఖలో ఏమి రాశాడో చూడండి :

Letter dated 29-4-1919, written by the Foreign Minister of your Majesty, has been discovered in the papers of your Majesty's envoy at simla. It instructs the envoy to make treaties of friendship with the leaders of Hindus and Muslims in India. It also contained instructions that he should incite them to write articles in the news papers calculated to create disaffection in the minds of the people....

[***Parliamentary papers, III Afghan War***]

(29-4-1919 తేదీతో తమరి విదేశాంగ మంత్రిగారు రాసిన ఉత్తరం సిమ్లాలోని తమరి దౌత్యాధికారి కాగితాల్లో మాకు కనబడింది. హిందూ దేశంలోని హిందూ, ముస్లిం నాయకులతో మైత్రీ ఒప్పందాలు కుదుర్చుకోవలసిందని ఆ లేఖలో సదరు అధికారిని ఆదేశించారు. ప్రజల మనసులను విరిచే విధంగా పత్రికలలో వ్యాసాలు రాసేట్టు వారిని రెచ్చగొట్టాలన్న ఆదేశాలు కూడా అందులో ఉన్నాయి..)

ఆఫ్ఘాన్లకు, ఇంగ్లీషువారికి బద్ధవైరం కనుక ఇంగ్లీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారతీయ నాయకులను పథకం ప్రకారం రెచ్చగొట్టాలని ఆఫ్ఘాన్ పాలకులు తలచడం మంచి రాజకీయ వ్యూహమే. యుద్ధ నీతిలో అలాంటివి మామూలే. నిజంగా అలా జరిగిందా, లేక ఇంగ్లీషువాళ్లే తమ కౌటిల్యంలో భాగంగా ఆ లేఖను బనాయించారా అని సందేహించాల్సిన పని లేదు. ఆఫ్ఘాన్ పాలకులు పురమాయించిన ప్రకారం ఆఫ్ఘాన్ గూఢచారులు దేశంలోని హిందూ, ముస్లిం పెద్దతలకాయలను నిజంగానే కలిశారు.

వారిలో ఒకడు పండిత మదన్ మోహన్ మాలవ్యా దగ్గరికి వెళ్లాడు. ఆ సంగతి మాలవ్యాగారే ఇలా ధ్రువీకరించారు:

"About a year ago... an Afghan came to me at Benares. He said... that the Amir Sahib and the leading men of Afghanistan closely watched our fight with the British Government and deeply sympathised with us; that the Afghans were willing to come to India to help us against the British Government, but that they wanted to know whether and how the Hindus of this country would support the Afghans...."

(సుమారు సంవత్సరం కిందట... ఒక ఆఫ్ఘను బెనారస్‌కు వచ్చి నన్ను కలిశాడు. అమీర్ సాహెబ్, ఇతర ఆఫ్ఘాన్ నాయకులు బ్రిటిషు ప్రభుత్వంతో మన పోరాటాన్ని సన్నిహితంగా గమనిస్తూ, మన పట్ల ప్రగాఢ సానుభూతి చూపుతున్నారని అతడన్నాడు. మనకు సహాయంగా ఇండియాపై దండెత్తి రావటానికి అఫ్ఘాన్లు ఇష్టపడుతున్నారని, ఈ దేశంలోని హిందువులు తమకు మద్దతు ఇస్తారా, ఇస్తే ఏ విధంగా ఇస్తారు అన్నది వారు తెలుసుకోగోరుతున్నారనీ ఆ దూత చెప్పాడు.)

తరవాత ఏమైందో - అన్ని విషయాలూ తెలిసినవాడూ, గాంధీగారికి అత్యంత సన్నిహితుడూ, ఋషితుల్యుడని, మహాత్ముడని సాక్షాత్తు గాంధీగారే ప్రస్తుతించినవాడూ అయిన స్వామి శ్రద్ధానందను అడుగుదాం. 1921 మే మొదటి వారంలో తన "శ్రద్ధ" పత్రికలో ఆఫ్ఘాన్ దూతల వ్యవహారాన్ని వివరించే వ్యాసంలో శ్రద్ధానంద రాసిందిది:

About 3 or 4 months back, an emissary of the Afghan Government came to Pandit Madan Mohan Malaviya and asked him if the Hindus would welcome the Amir in case the latter invaded the country. Pandit Malaviya, to put him off, referred him to Mahatma Gandhi, who in his turn, asked him to go to the Ali Brothers. After a good deal of talk with him, Mr. Mahomed Ali gave him a letter addressed to the Amir saying that both the Hindus and Mahamedans would be with him in case of any invasion. The letter further said; "The army has not yet come under our control; The invasion should take place only when we are assured of its support."

(మూడు నాలుగు నెలల కింద ఆఫ్ఘాన్ ప్రభుత్వపు దూత ఒకడు పండిట్ మదన్ మోహన్ మాలవ్యా వద్దకు వెళ్లి - దేశంమీద దాడిచేస్తే అమీరును హిందువులు

స్వాగతిస్తారా అని అడిగాడు. మాలవ్యాగారు అతణ్ణి వదిలించుకోవటానికి మహాత్మాగాంధి దగ్గరికి పంపించారు. ఆయనేమో అలీ సోదరుల దగ్గరికి పంపారు. అతడితో చాలాసేపు మాట్లాడిన తరవాత మహమ్మదాలీ అతడికి ఓ ఉత్తరం ఇచ్చాడు. అమీరుకు ఉద్దేశించిన ఆ జాబులో దేశంపై దాడిచేస్తే హిందువులు, ముస్లిములు అమీరు వెంట ఉంటారని హామీ ఇచ్చారు. "సైన్యం ఇంకా మా చేతుల్లోకి రాలేదు. దాని మద్దతు మనకుంటుందని నమ్మకం కుదిరాకే దాడి జరగాలి" అని కూడా ఆ జాబులో ఉంది.)

అంటే - సైన్యాన్ని ఆకట్టుకుని, ఆఫ్ఘన్లతో కుమ్మక్కయి ఇండియాలో బ్రిటిషు ప్రభుత్వాన్ని కూల్చెయ్యటానికి ఒకటోరకం కుట్ర జరిగిందన్నమాట. గాంధీ మహాత్ముడికీ దానిలో పరోక్షంగానైనా భాగం ఉందన్నమాట. అంతా అనుకున్న ప్రకారం జరిగితే ఎలా ఉండేదో, కాని ఇంగ్లీషువాళ్లు ఆఫ్ఘన్లకంటే తెలివైనవాళ్లు. దేశంలోకి వచ్చిన ఆఫ్ఘాన్ గూఢచారులను బ్రిటిషు గూఢచారులు వెంటాడారు. లంచమిచ్చో, భయపెట్టో, వచ్చిన దూతను లోబరుచుకున్నారు. అమీరుదాకా వెళ్లకముందే అలీగారి లేఖ బ్రిటిషు సర్కారు చేతుల్లో పడింది. దాన్ని చూపించి అలీ సోదరులను ప్రభుత్వం నొక్కాల్సిన చోట నొక్కింది. ఆఫ్ఘన్ల దాడికి సాయపడతానన్నందుకు, సైన్యాన్ని తిరుగుబాటుకు ప్రేరేపించినందుకు, ఆఫ్ఘాన్ అమీరుతో రాజద్రోహపూరిత సంపర్కం పెట్టుకున్నందుకు మహమ్మదాలీని అరెస్టుచేయబోయింది. గాంధీగారు అడ్డంపడి, వైస్రాయిని కలిసి నచ్చచెప్పి అలీచేత బహిరంగ క్షమాపణ చెప్పించి, నానా తంటాలు పడితే గానీ సంకటం నుంచి గట్టెక్కలేదు.

ఈ బాగోతమంతా బయటపడ్డాక చాలా గొడవైంది. ఇరుకునపడ్డ సోదరులు, గాంధీగారు అంతా అబద్ధమని, ఆఫ్ఘాన్ దూతలతోగాని, ఆఫ్ఘాన్ పాలకులతోగాని తమకు ఎలాంటి సంబంధం లేదని ఖండించారు. ఎవరు ఎంత బుకాయించినా చారిత్రక వాస్తవాలు చెరిగిపోవు. వేరే వాళ్ళెవరో చెబితే మనకు నమ్మకం కలగదు కనుక గాంధీగారికి "ప్రియసోదరుడు" షౌకత్‌అలీ 1923లో కాకినాడలో జరిగిన ఖిలాఫత్ కాన్ఫరెన్సులో మాట్లాడుతూ అంతకు పూర్వపు నాగపూర్ కాన్ఫరెన్సులో గాంధీగారి నిర్వాకం గురించి ఏమన్నాడో చూడండి.

In the Nagpur Khilafat Conference, Mahatma Gandhi had moved a resolution which was seconded by me, that His Majesty the Amir of Afghanistan should not make a treaty with that Government with which we had non-co-operated on the other hand should make treaty with the Hindus and Mussalmans of India, so that we may pass our days in peace in one another's neighbourhood.

(మేము సహాయ నిరాకరణ చేస్తున్న ప్రభుత్వంతో సంధి కుదుర్చుకోవద్దని ఆఫ్ఘన్ అమీరును కోరుతూ నాగపూర్ ఖిలాఫత్ కాన్ఫరెన్సులో మహాత్మాగాంధీ ఒక తీర్మానం పెట్టారు. నేను దాన్ని బలపరిచాను. బ్రిటిషు ప్రభుత్వంలోగాక ఇండియాలోని హిందువులతో, ముసల్మాన్లతో ఒప్పందం చేసుకుంటే మీరు మేము ఇరుగు పొరుగున ప్రశాంతంగా ఉండవచ్చని ఆ తీర్మానంలో చెప్పాము)

దేశాన్నేలే ప్రభుత్వంతో గాక దేశంలోని ప్రజలతో నేరుగా ఒప్పందం చేసుకోమని విదేశీ పాలకుడిని కోరడమేమిటి? మా ప్రభుత్వమంటే మీకూ పడదు. కాబట్టి మనం మనం మనం ఒకటి - అని విదేశీయులతో అనటం దేశద్రోహపూరితమైన విదేశీ కుట్రలో పాలుపంచుకోవటం కాకపోతే మరేమిటి? వివాదాస్పదమైన ఈ తీర్మానాన్ని నాగపూర్ ముస్లిం మహాసభలో ప్రవేశపెట్టటంలో గాంధీగారి ప్రమేయం ఉందన్నసంగతి ఈనాటికీ చాలామందికి తెలియదు. ఆ తీర్మానానికి అనుగుణంగానే తరవాత కొద్ది కాలానికి "Don't sign the treaty, Situation in India hopeful". *(ఒప్పందంపై సంతకం చెయ్యకండి, ఇండియాలో పరిస్థితి ఆశాజనకంగా ఉంది)* అంటూ మౌలానా మహమ్మదాలీ ఆఫ్ఘాన్ సుల్తాన్‌కు టెలిగ్రాం పంపాడు. దానిమీదా కావలసినంత అల్లరి అయింది. మహమ్మదాలీని నలుగురూ నానా మాటలూ అన్నారు. దేశద్రోహ అభియోగం మీద యావజ్జీవ శిక్షో మరొకటో పడకుండా తప్పించుకోవటానికి ఆలీగారు నానా గడ్డీ కరవాల్సివచ్చింది. తంతి ఇచ్చింది ఆయనే అయినా - ఇప్పించిన ఆసామీ వేరే ఉన్నాడు. అదెవరో తెలుసుకున్నాక స్వామి శ్రద్ధానంద తన కళ్లను తానే నమ్మలేక నోరెళ్లబెట్టాడు. ఆ ముచ్చటను శ్రద్ధానంద మాటల్లోనే ఆలకించండి :

"1921 మే మొదట్లో పండిట్ మోతీలాల్ నెహ్రూగారి అమ్మాయి పెళ్లి అలహాబాద్‌లో జరిగింది. హిందూ, ముస్లిం నాయకులందరూ దానికి హాజరయ్యారు. నేనూ వెళ్లాను. రైల్లో మహమ్మదాలీ కలిశాడు. బ్రిటిషు ప్రభుత్వంతో సంధి కుదుర్చుకోవద్దని ఆఫ్ఘాన్ అమీరుకు తంతి పంపినందుకు అందరూ నన్ను తప్పు పడుతున్నారని అతడు బాధపడ్డాడు. 'ఔను, అది చాలా తప్పు కదా ? ఎందుకు చేశారాపని?' అని నేనన్నాను. అప్పుడు అతడేమీ మాట్లాడక ఊరకున్నాడు. మోతీలాల్ నెహ్రూగారుండే ఆనందభవన్‌కి వెళ్లాక మహమ్మదాలీ నన్ను పక్కకు తీసుకెళ్లి, హాండ్‌బాగులోంచి ఒక కాగితం నా చేతిలో పెట్టి చూడమన్నాడు. అది ఆఫ్ఘాన్ అమీర్‌కు అతడు పంపిన తంతికి చిత్తుప్రతి. చూడగానే నిర్ఘాంతపోయాను. ఆ దస్తూరి నాకు బాగా పరిచయమైందే. టెలిగ్రాం ముసాయిదా రాసిచ్చింది వేరెవరో కాదు. అహింసాత్మక అసహాయోద్యమానికి తండ్రిగారైన గాంధీ మహాత్ముడే".

'The Liberator', 29-7-1926.

అదీ కథ ! బ్రిటిషు సామ్రాజ్యంలో 'ఆధ్యాత్మిక పునాది'ని దర్శించి, ప్రపంచ సంక్షేమం కోసమే అది అవతారమెత్తిందని తెగ పొగిడి, మొదటి ప్రపంచ యుద్ధకాలంలో "చీఫ్ రిక్రూటింగు ఏజంటు"గా "మనుషుల వాన" కురిపించి, సామ్రాజ్యానికి వీర విధేయత చాటుకోవాలని ఉబలాటపడిన మహాత్ముడే.... ఖిలాఫత్ కైపులో ఒళ్ళుమరచి, ఒక దశలో అదే బ్రిటిషు సర్కారుకు వ్యతిరేకంగా 'రాజద్రోహం' అనదగ్గ అపరాధానికి పాల్పడి, విదేశీ పాలకులతో అనుచిత సంబంధం పెట్టుకునేంత దూరంవెళ్లాడంటే ఎవరైనా నమ్ముతారా ? రుజువర్తనుడు, సత్యసంధుడు, నీతిమంతుడు అని ప్రపంచమంతా ఆకాశానికెత్తిన అహింసాప్రవక్తలో - ఇది లోకం గుర్తించని చీకటి కోణం.

మాప్లా ఘోరం

గాంధీగారి జీవితకథలో అందరి గుండెల్నీ పిండేసేది ఆయన అవసాన దశ. జీవితమంతా హిందూ ముస్లిం ఐక్యత కోసం తపించి, అహింసను పరమధర్మంగా ప్రబోధించిన ప్రేమమూర్తి తన కళ్లముందే మతోన్మాదం జడలు విప్పి, అన్నదమ్ముల్లా మెలగాల్సినవాళ్లు కుత్తుకలు, నరుక్కుంటూ, భయానక అత్యాచారాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతూంటే ఆ ఘోరకలిని నివారించలేక, వారించినా వినేవారు లేక ఎంత క్షోభించాడో అని మనసు చివుక్కుమంటుంది.

మహాత్ముడు ఉండీ దేశ విభజన కల్లోలాన్ని ఎందుకు ఆపలేకపోయాడని ఎవరైనా ఆక్షేపించినా... "పాపం ఆయన మాత్రం ఏమి చేస్తాడు. అప్పటికి ఆయన పండు ముదుసలి; స్వరాజ్యం రానంతవరకూ ఆయన్ని నెత్తిన పెట్టుకుని పూజించి, ఆయన గీచిన గీటు దాటమని చెప్పినవాళ్లే స్వరాజ్యం వచ్చాక ఆయనను మూలకు గిరవాటువేసి పదవుల రంధిలో పడ్డారు. ఆయన చెప్పినా కాంగ్రెసుగాని, కాంగ్రెసు ప్రభుత్వం గాని వినే పరిస్థితి లేదు,ఇక ఆయనొక్కడు ఏమి చేయగలడు ?" అని మనం చెమర్చిన కళ్లతో సమాధానం చెబుతాం.

కరక్టే. కాని – మనలోమాట. మాటవరసకు ఆ సమయానికి బాపూజీకి ముసలితనం మీదపడలేదనుకుందాం. స్వాతంత్ర్యపోరాటంలో లాగే స్వరాజ్యం వచ్చిన తరవాతా ఆయన మాట తిరుగులేకుండా చెల్లుబాటు అయిందనుకుందాం. అప్పుడైనా... విచ్చల విడి హింసను, మతం పేరిట మారణహోమాలను ఆయన నిష్పాక్షికంగా, నిష్కర్షగా ఖండించేవారా ? అందరినీ సమదృష్టితో చూసి తప్పును తప్పు అని... ఎవరుచేసినా తప్పు తప్పే అని తెగనాడేవారా? అమాయక జనంపై పడి వేలూ, లక్షల సంఖ్యలో ఊచకోతలు కోస్తూ, విశృంఖలంగా పేట్రేగిన రాక్షసశక్తులను గుర్తించి, జనజీవితంనుంచి ఏరివేసేందుకు మొగమాటం లేకుండా నడుంబిగించేవారా ?

అందులో దాటేముంది? సత్యంకోసం బతికి. నీతికి, నియమానికి ప్రాణం ఇచ్చిన మహాత్ముడు అలాకాకుండా ఇంకొకలా వ్యవహరిస్తాడని ఎలా అనుకోగలం? ఇదేమి పిచ్చి ప్రశ్న – అని తొందరపడి అనెయ్యకండి. మనల్ని కలచివేసిన దేశవిభజన కల్లోలానికి పావు శతాబ్దంముందు... దానికి డ్రస్ రిహార్సల్ లేక మీనియేచర్ నమూనా అనదగ్గ ఇంకో ఘోరకలి వైనాన్ని ఒకింత ఆలకించండి.

అది జరిగింది కేరళలోని మలబారులో. 1921 ఆగస్టు మాసాన. అప్పటికి గాంధీగారికి కేవలం 52 ఏళ్లు. నడివయసులో మాంచి 'ఫామ్'లో ఉన్నారు. ఆర్నెల్లకో సంవత్సరానికో గ్యారంటీగా వచ్చేస్తోందని ఆయన ఊరిస్తున్నారే గాని – అప్పటికి స్వరాజ్యం ఇంకా రాలేదు. కాంగ్రెసులో ఆయన మాట సుగ్రీవాజ్ఞ. ఒక్క కాంగ్రెసు అనే ఏమిటి, దేశంలోనే ఆయనకు ఎదురులేదు. జిన్నా ఇంకా తల్వారు తియ్యలేదు. హిందువులు, ముస్లిములు చెట్టపట్టాలు వేసుకుని ఖిలాఫత్ స్వర్గంకోసం తపస్సు చేస్తున్న సమయమది.

అదిగో – అలా దేశకాల పరిస్థితులు అన్ని విధాలా అనుకూలంగా ఉన్న తరుణంలో జరగకూడని ఘోరం జరిగింది. మలబారు మాప్లాలు తిరగబడ్డారు.

మాప్లాలు మహమ్మదీయ మతస్థులు. వారు కడు పేదలు విద్యాగంధం సోకనివారు. వారి నరనరానా నిండింది మతమౌఢ్యం ఒక్కటే. అరబ్బు దేశంనుంచి వచ్చి వారి పూర్వులు 1200 ఏళ్ల కింద మలబారులో స్థిరపడ్డారు. 20వ శతాబ్దానికల్లా వారి సంఖ్య పది లక్షలకు పెరిగింది. మతోన్మాదానికి, నేర మనస్తత్వానికి పేరుపడి, స్థానిక హిందువులతో అడపాదడపా ఘర్షణ పడుతూ, చిన్నాపెద్దా నేరాలు చేస్తూ ప్రభుత్వానికి తలనెప్పిగా మారారు. అన్నిటికంటె దారుణమైన ఘోరానికి ఖిలాఫత్ కైపులో పాల్పడ్డారు. ప్రభుత్వ అధికారిక రిపోర్టులో దాని గురించి పేర్కొన్న వివరాలివి:

"1921 ఆరంభంనుంచీ మసీదునుంచి మసీదుకు, గ్రామంనుంచి గ్రామానికి మతావేశం వ్యాపించింది. ఆలీ సోదరుల రెచ్చగొట్టే ప్రసంగాలు... అసహాయోద్యమాన్ని సమర్థించే పత్రికల్లో స్వరాజ్యం అతి త్వరలో వచ్చేస్తోందన్న రాతలు... ఖిలాఫత్ కాన్ఫరెన్సు తీర్మానాలు – అన్నీ కలిపి మందుపాతర వత్తిని అంటించాయి. జులై, ఆగస్టు నెలల పొడవునా లెక్కలేనన్ని ఖిలాఫత్ మీటింగులు నడిచాయి. కత్తులు, బాకులు, ఈటెలు భారీఎత్తున రహస్యంగా తయారయ్యాయి. దుస్సాహసిక దుండగుల దండును ముమ్మరంగా సమీకరించసాగారు. ఇస్లాం రాజ్యానికి ఆవిర్భావ ప్రకటన చెయ్యటానికి సన్నాహాలు జరిగాయి.

సాయుధ తిరుగుబాటుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న వాసనపట్టి ఆగస్టు 20న కాలికట్ జిల్లా మేజిస్ట్రేటు కొంతమంది గ్యాంగ్‌లీడర్లను అరెస్టు చెయ్యటానికి సైన్యాన్ని, పోలీసులను వెంటేసుకుని తిరురంగడికి వెళ్లాడు. అవతలివారు ప్రతిఘటించారు. హోరాహోరీగా

కాల్పులు జరిగాయి. అది తెలియగానే చుట్టుపక్కల ప్రాంతాల మాప్లాలు కత్తులు దూసి బ్రిటిషు సర్కారుపై యుద్ధం ప్రకటించారు. తిరుగుబాటు అలా మొదలైంది. మాప్లా మూకలు రోడ్లు మూసేశారు. టెలిగ్రాఫ్ లైన్లు తెంపేశారు. చాలా చోట్ల రైళ్లు ధ్వంసం చేశారు. పట్టాలు పీకేశారు. ఆకస్మిక దాడికి ప్రభుత్వం దిమ్మెరపోయింది. కొద్దిపాటి ఆఫీసులకూ, పోలీసు స్టేషన్లకూ మాత్రమే ప్రభుత్వాధికారం పరిమితమైంది. కనపడ్డ కాఫిర్నల్లా నరికేస్తామంటూ మాప్లాలు పేట్రేగారు. చాలామంది యూరోపియన్లు ప్రాణ భయంతో పారిపోయారు. చేతికి చిక్కిన వారిని మూకలు కిరాతకంగా చంపేశాయి. ప్రభుత్వ వ్యవస్థ చచ్చుబడగానే మాప్లాలు స్వరాజ్యాన్ని ప్రకటించారు. ఆలీ ముసలియార్ అనే వాడిని ప్రభువుగా నిలిపారు. ఖిలాఫత్ జండాలను ఎగురవేసి, ఎర్నాడ్, వళ్లువనాడు జిల్లాలను ఖిలాఫత్ రాజ్యంగా ప్రకటించారు. తమ రాజ్యం తాము స్థాపించుకున్నామనగానే హిందువులపై వారి కసి కట్టలు తెంచుకుంది. ప్రభుత్వమూ, యూరోపియన్లూగాక దురదృష్ట వంతులైన హిందువులే మాప్లా క్రౌర్యానికి ప్రధానంగా గురి అయ్యారు. జనావాసాల మీదపడి ఊచకోతలు, బలవంతపు మత మార్పిడులు, దేవాలయాలపై దుష్కృత్యాలు, హిందూ మహిళలపై అత్యాచారాలు, లూటీలు, దహనాలు, దొమ్మీలు విచ్చలవిడిగా జరిగాయి. సైనిక బలగాలొచ్చి అతికష్టంమీద పరిస్థితిని అదుపుచేసేలోగా అంతూపొంతూ లేకుండా నానారకాల అకృత్యాలు, అఘాయిత్యాలు సాగాయి."

[India in1921-22; I.A.R. 1921, P.41]

ఖిలాఫత్ కోసం చొక్కాలు చించుకుని, ముస్లింల మెహర్బానీకోసం వెంపర్లాడినందుకు ప్రతిఫలంగా మాప్లాలు హిందువులకు ఇచ్చిన బహుమానాలు, చేసిన ఘనసత్కారాలు ఏమిటో – మలబార్ మహిళలు వైస్రాయి సతి లేడీ రీడింగ్‌కి ఇచ్చిన విజ్ఞాపన పత్రంలో చిత్తగించండి.

"మా జిల్లా గడచిన వందేళ్లలో మాప్లాలనుంచి ఎన్నోదాడులకు లోనైనా, ప్రస్తుత తిరుగుబాటు క్రౌర్యంలో, విస్తృతిలో కనీవినీ ఎరుగనిది. ఇక్కడ జరిగిన దారుణాలు దొరసానివారికి పూర్తిగా తెలిసి ఉండకపోవచ్చు. తిరగబడ్డ పైశాచిక శక్తులు చేసిన అఘాయిత్యాలు అన్నీ ఇన్నీ కావు. మేము ప్రాణసమానంగా ప్రేమించే ఆప్తులెందరినో తాతల కాలం నుంచీ ఉంటున్న మతంనుంచి మారడానికి అంగీకరించలేదన్న కక్షతో కాళ్లుచేతులు నరికి, ప్రాణం పోకుండానే బావుల్లో, చెరువుల్లో విసిరేశారు. గర్భిణిస్త్రీలను నరికేసి రోడ్డుపక్క పారేస్తే నజ్జు అయిన మృతదేహం నుంచి గర్భస్థ శిశువు బయటపడ్డ ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. అన్నెంపున్నెమెరుగని పసిబిడ్డలను మా చేతుల్లోంచి లాక్కుని మా కళ్లముందే చంపేశారు. మా భర్తలను, మా తండ్రులను చిత్రహింసలు పెట్టి చర్మం వొలిచారు. సజీవ దహనం చేశారు. నిస్సహాయులైన మా అక్కచెల్లెళ్ళను ఇళ్లనుంచి

బలవంతంగా ఈడ్చుకుపోయి నికృష్ట నరపిశాచుల బుద్ధికి తోచిన వికృత చేష్టలన్నీ చేసి మానం మంట గలిపారు. రాక్షస మూకలు తెగబడి సాగించిన విధ్వంసానికి సర్వనాశనమై మా ఇళ్లు వేలసంఖ్యలో బుగ్గి అయ్యాయి. మేము పవిత్రంగా తలచే పూజాస్థలాలను నీచాతినీచంగా మైలపరిచారు. మా గుళ్లు కూల్చేశారు. మా దేవతా విగ్రహాలపై మేము అలంకరించిన పుష్పమాలలను లాగిపడేసి, ఆవు పేగులను వేలాడేశారు. పవిత్ర విగ్రహాలను ముక్కలు చేశారు. తరతరాలుగా కష్టపడి ఆర్జించుకున్న సంపదను లూటీచేసి, నిన్నటిదాకా సిరిసంపదలతో దర్జాగా బతికిన వారిని కాలికట్ వీధుల్లో దినవెచ్చాలకోసం అడుక్కునే స్థితికి తెచ్చారు.

"ఇవి కట్టు కథలు కావు కుళ్లిన శవాల అస్థిపంజరాలతో నిండిన బావులు, ఒకప్పుడు మాకు ప్రియనివాసాలైన ఇళ్ల శిథిలాలు, ఒకప్పటి మా పవిత్ర దేవాలయాల స్థానాల్లో రాళ్లదిబ్బలు... మేము విన్నవించిన దానికి రుజువులుగా నేటికీ ఉన్నాయి. కసాయి కత్తుల వేటుకు అసువులు బాసిన మా పిల్లల చావు కేకలు మా చెవుల్లో ఇంకా మారుమోగుతూనే ఉన్నాయి. మేము చచ్చేదాకా అవి మాకు వినిపిస్తూనే ఉంటాయి. నరరూప రాక్షసుల నుంచి తప్పించుకోవటానికి మా పల్లెల నుంచి పారిపోయి, అడవుల్లో ఒంటిమీద బట్టలు కూడా లేకుండా కాలే కడుపులతో మేము ఎన్ని అగచాట్లు పడ్డామో మేము ఎన్నటికీ మరచిపోలేము. మా వెంట పడి తరుముకొస్తున్న వారికి మేము దాక్కున్న చోటు ఎక్కడ తెలుస్తుందో నన్న భయంతో మా చంకలోని బిడ్డలను ఏడవనీయకుండా ఎలా నోరు నొక్కేశామో మాకు గుర్తుంది. రక్తదాహంతో అంగలార్చే కిరాతకుల మతంలోకి మెడమీద కత్తిపెట్టి బలవంతంగా మార్చినప్పుడు మావంటివారు వేలమంది ఎంత భయానక చిత్తక్షోభననుభవించారో మాకు తెలుసు. ఐదు నెలలుగా మాకు భీభత్సం చూడకుండా, దారుణ దుర్వార్తలు వినకుండా ఒక్కరోజూ గడవలేదు..."

[*Gandhi And Anarchy,* C. Sankaran Nair, PP 139-140]

ఇదంతా వింటే ఈ ఆధునిక కాలంలో కూడా ఇలాంటివి జరుగుతాయా ? మలబార్ మహిళల మొత్తుకోళ్లన్నీ నిజమని ఎలా నమ్మగలం? విజ్ఞాపన పత్రాల్లో అతిశయోక్తులు, అభూతకల్పనలు మామూలే కదా - అని కొంతమందికి అపనమ్మకం కలగవచ్చు. వట్టి మెమోరాండాలను నమ్మవద్దు. కాలికట్‌లో జమోరిన్ మహారాజా అధ్యక్షతన జరిగిన జన మహాసభలో ఆమోదించిన సుదీర్ఘ తీర్మానంలో ఈ భాగాన్ని చూడండి.

VI. మాప్లా తిరుగుబాటు దారులు సాగించిన ఘోర దురాగతాలను కప్పి పుచ్చటానికి, ఉపేక్షించటానికి కొన్ని స్వార్థపూరిత వర్గాలు చేస్తున్న యత్నాల పట్ల ఈ మహాసభ తీవ్ర ఆవేదననూ, ఆగ్రహాన్నీ ప్రకటిస్తున్నది. ఆ దురాగతాలు ఎటువంటివంటే -

(అ) పాశవికంగా మహిళల మానాన్ని హరించటం

(ఆ) బతికి ఉండగానే మనుషుల చర్మం ఒలచటం

(ఇ) పురుషులూ, స్త్రీలూ, పిల్లలను టోకున చంపెయ్యడం

(ఈ) మొత్తం కుటుంబాలను సజీవ దహనం చెయ్యటం

(ఉ) వేల సంఖ్యలో బలవంతంగా హతమార్పించటం - ఒప్పుకోని వారిని నరికెయ్యటం.

(ఊ) సగం చచ్చినవారిని బావుల్లో విసిరేసి, కొన ప్రాణాలతో గంటల తరబడి మరణయాతనకు గురిచెయ్యటం.

(ఎ) కల్లోల ప్రాంతంలోని ముస్లిమేతరుల ఇళ్లపై లూటీ చేసి తగలబెట్టటం. ఇందులో మాప్లా మహిళలు, పిల్లలు కూడా పాల్గొని బాధిత మహిళల ఒంటిమీది బట్టలను కూడా లాక్కున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మహమ్మదీయేతర జనాభానంతటినీ నిలువు దోపిడీ చేసి దుస్సహక్లేశాలకు గురిచేశారు.

(ఏ) కల్లోల ప్రాంతాల్లో అసంఖ్యాక దేవాలయాలను ధ్వంసం చేయటం, ఆలయాల్లో ఆవులను చంపటం, పవిత్ర విగ్రహాల మెడలో పేగుల దండలు వేయటం, గోడలకు, కప్పులకు ఖండితశిరసులను వేలాడదీయటం వగైరా దుశ్చర్యలతో హిందువుల మత సెంటిమెంట్లను క్రూరంగా అవమానించటం.

[*Gandhi And Anarchy,* C. Sankaran Nair, PP 138-139]

ఇంకా నమ్మకం కలగలేదా? ముస్లింల మీద కక్షతో హిందూమతోన్మాదులెవరో ఇలాంటి సత్యాలను వ్యాప్తిచేశారేమో, తెలిసీ తెలియక మిగతావారూ అవి నిజమని నమ్మేశారేమోనన్న సందేహం వస్తోందా? హిందువుకాని, జన్మతః అసలు భారతీయురాలే కాని శ్వేత జాతీయురాలు, భారతదేశాన్ని అమితంగా ప్రేమించి, హోంరూల్ ఉద్యమాన్ని ముందుండి నడిపించిన మహావ్యక్తి... తన నిజాయితీని, రుజువర్తనను ఎవరూ వంకపెట్టజాలని అనీబిసెంటమ్మగారు కల్లోలిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, వేలాది బాధితులను పరామర్శించి, నిజానిజాలను వాకబుచేసిన మీదట తన **'న్యూ ఇండియా'** పత్రికలో ఏమి రాశారో చదవండి :

The misery is beyond description... I have walked among thousands of them in the refugee camps... ... Can you conceive of a more ghastly and inhuman crime than the murders of babies and pregnant woman carrying 7 months was cut through the abdomen by a rebel and she was seen lying dead on the way with the dead child projecting out of the womb... a baby of six months was snatched away from the breast of his own mother and cut into two pieces. Are these rebels human beings or monsters? One refugee has given statement that he had seen with his own eyes that the heads of a dozen people were being shaved by the rebels

and afterwards they were asked to recite some passages from the Quran. This he witnessed from a tree... A respectable Nayar at Melatur lady was stripped naked by the rebels in the presence of her husband and brothers, who were made to stand close by with their hands tied behind. When they shut their eyes in abhorence they were compelled at the point of sword to open their eyes and witness the rape. I loathe even to write of such a mean action... ..."

[Annie Besant in "New India" 6-12-1921]

(అది వర్ణించనలవి కాని దారుణం. శరణార్థి శిబిరంలో నేను వేలాది బాధితులను కలిసి మాట్లాడాను... చంటి పిల్లలను, గర్భిణీ స్త్రీలను హత్య చెయ్యటాన్ని మించిన అమానుష ఘాతుకాన్ని మీరు ఊహించగలరా? ఏడు నెలల గర్భంతో ఉన్న మహిళను ఒకడు పొట్టకోస్తే రోడ్డు మీద చచ్చిపడి ఉందట. మృత శిశువు కడుపులోంచి వెళ్లుకొచ్చిందట... ఆరునెలల పసిబిడ్డను తల్లి రొమ్మునుంచి లాక్కొని రెండుముక్కలు చేశారట... ఈ తిరుగుబాటుదారులు మనుషులా రాక్షసులా ? డజను మందికి తలగొరిగి, వారి చేత ఖురాను వాక్యాలు బలవంతంగా చదివిస్తుంటే చెట్టు మీది నుంచి తాను కళ్ళారా చూశానని ఒక శరణార్థి వాఙ్మూలం ఇచ్చాడు... మేలతూరులో ఘరానా కుటుంబానికి చెందిన ఓ నాయర్ మహిళను ఆమె భర్త, సోదరుల కళ్లముందే ఒంటి మీద గుడ్డలన్నీ వొలిచి దారుణంగా చెరిచారట. చేతులు వెనక్కి కట్టెయ్యటంతో ఏమీ చెయ్యలేని భర్త, సోదరులు ఆ ఘోరాన్ని చూడలేక కళ్లు మూసుకుంటే కత్తితో బెదిరించి బలవంతంగా తెరిపించి, అత్యాచారాన్ని తిలకించమన్నారు. ఇటువంటి నీచాల గురించి రాయాలంటేనే నాకు అసహ్యం వేస్తోంది.)

ఇది చదివాకైనా ఎంతటి సంశయాత్ములకూ... మలబారులో జరిగింది. మహా ఘోరమనీ.. నిష్కారణంగా హిందూ ప్రజానీకంపై పడి, మాప్లా మతోన్మాదులు పైశాచికంగా సాగించినవి ఏ విధంగానూ సహించరాని, క్షమించరాని, నిష్కృతి లేని నేరాలనీ... మానవత్వమనేది ఉన్న ప్రతి ఒక్కరూ నిష్కర్షగా ఖండించవలసిన దురంతాలనీ... విశ్వాసం కలిగి తీరుతుంది కదా ? మరి మతభూతం కోరలు సాచి, భయానక హింస చెలరేగి, వందల సంఖ్యలో అమాయక ప్రజలను, స్త్రీ, బాల విచక్షణ లేకుండా ఊచకోతకోస్తూ, వేలాది కుటుంబాల్లో నిప్పులుపోసి... మధ్యయుగాల తరహాలో మత విశ్వాసాలను, పవిత్ర పూజా స్థలాలను మైలపరిచి నాశనం చేస్తుంటే... మన అహింసా ప్రవక్తగారు ఎలా స్పందించారు? ఏమి చేశారు?

సాహసవీరులకు జేజేలు

"Be the Moplahs ever so bad, they deserve to be treated as human beings. Their wives and children demand our sympathy... Forcible conversions are horrible things. But Moplah bravery must command admiration. These Malabaris are... fighting for what they consider is their Religion and in the manner they consider is religious."

[*Young India* 1-12-1921]
[*Collected works of Mahatma Gandhi*, Vol. 25, #66, P.151]

మాప్లాలు ఎంత చెడ్డవాళ్లయినప్పటికీ వారిని మనం మానవులుగా చూడాలి. వారి భార్యాబిడ్డల పట్ల సానుభూతి చూపాలి. బలవంతపు మత మార్పిళ్లు దారుణమైనవే. కాని మాప్లాల సాహసాన్ని మనం మెచ్చుకోవాలి. ఈ మలబారీలు తాము మతం అనుకున్నదానికోసం, మతబద్ధమని తాము అనుకున్న పద్ధతిలో పోరాడుతున్నారు.

– ఇదీ మాప్లా నరపిశాచాలకు గాంధీ మహాత్ముడిచ్చిన యోగ్యతాపత్రం. అనుమానం అక్కర్లేదు. మీరు సరిగానే చదివారు. మహాత్ముడు మానవతా దృక్పథంతో సానుభూతి చూపాలన్నది మతోన్మాదుల బారినపడ్డ అసంఖ్యాక బాధితుల మీద కాదు. వారిని అమానుషంగా హింసించి, చిత్రవధ చేసిన రాక్షస మూకలపైనే ఆయన మెచ్చుకోళ్లన్నీ.

గాంధీ గురువు గోఖలేగారు స్థాపించిన సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీవారు ఊరూరా తిరిగి, ఆరాలు తీసి వెలువరించిన విచారణ నివేదిక ప్రకారమే 1921 ఆగస్టులో మలబార్ మాప్లాలు 1500 మంది హిందువులను చంపారు. 20,000 మందిని మెడమీద కత్తిపెట్టి బలవంతంగా మతం మార్పించారు. ఆ కాలంలోనే 3 కోట్ల రూపాయల విలువచేసే ఆస్తిపాస్తులను లూటీచేశారు. మహిళల అపహరణలు,

బలాత్కారాలు, సామూహిక మానభంగాలకైతే అంతే లేదు. ఈ ఘనకార్యాలు చేసినవారు గాంధీగారి దృష్టిలో ధైర్యశాలురు; సాహసవంతులు; దైవభీతి గలవారూనూ! తల్లుల చేతుల్లోని పసిబిడ్డలను లాక్కుని ముక్కలు చెయ్యటం, గర్భవతుల పొట్టలు కోయటం, భర్తల ముందే భార్యలను చెరచటం, బతికుండగానే చర్మాలు వొలవటం, కొనప్రాణాలతో ఉన్నవారిని బావుల్లో విసిరెయ్యటం... మన మహాత్ములవారి దృష్టిలో – తాము మతం అనుకున్నదాని కోసం, ఘతబద్ధమని తాము అనుకున్న పద్ధతిలో సాహసవంతులైన మాప్లాలు జరిపిన మెచ్చుకోదగ్గ పోరాటాలు ! జనావాసాలపై రాకాసుల్లా పడి ఏ పాపమెరుగని అమాయక ప్రజలను స్త్రీ బాల విచక్షణ లేకుండా నరికి పోగులు పెట్టటం నిష్కర్షగా గర్హించవలసిన హింసోన్మాదమని ఖండించటానికి కూడా అహింస ప్రవక్తగారికి నోరు రాలేదు !

మాప్లాలు సాహసవంతులు సరే ! నిస్సహాయులను తెగనరికిన ఆ వీరుల ధైర్యాన్ని – ఆలయాలు కూల్చి, దేవతా విగ్రహాల మెళ్లో ఆవుపేగుల దండలు వేసిన ఆ శూరుల "దైవభీతి"ని, మతంకోసం మతబద్ధంగా పోరాడాలన్న వారి చిత్తశుద్ధిని మన అవతార పురుషుడుగారు శ్లాఘించడం చాలా బాగుంది. కాని ఆ "సాహసవీరుల" కత్తి కోతలకు గురి అయిన అభాగ్యుల మాటేమిటి? తమ మతంమీద కిరాతకంగా దాడిచేసిన ముష్కరత్వానికి వారు ఎలా స్పందించాలి? నిష్కారణంగా తమ బతుకుల్లో నిప్పులుపోసి తమ భార్యాబిడ్డలను పొట్టనపెట్టుకుని, తమ తోబుట్టువుల మానాన్ని హరించి, తమ ఆస్తులు లూటీచేసి, తమను సర్వనాశనంచేసిన నరాధముల పట్ల వారు ఎలా వ్యవహరించాలి? తమ మతం కోసం, మతబద్ధమని తాము అనుకున్న పద్ధతిలో ఆ సాంఘిక దుష్టశక్తులకు జన్మలో మరిచిపోలేని రీతిలో గట్టిశాస్తిచేసే హక్కునైనా బాధిత మతస్థులకు మహాత్మాజీ అనుమతిస్తారా ? మాప్లాలు అంతలా తమను వేటాడుతూంటే హిందువులు తిరగబడకుండా నిర్లిప్తంగా ఎందుకున్నారని పదే పదే యద్దేవాచేసిన మహానుభావుడు... కనీసం ఆలస్యంగానైనా బాధితవర్గం తెగువ తెచ్చుకుని తగిన ప్రతిక్రియ చేస్తే సమర్థిస్తారా? ధర్మానికి, సమాజానికి, అహింసా తత్వానికి బరితెగించి తీవ్ర విఘాతం కలిగించిన దుష్టశక్తులను ఏమిచేయాలని అహింసా మూర్తిగారు అంటారు? ఏ కర్తవ్యం ఉపదేశిస్తారు? అదీ ఆయన మాటల్లోనే వినండి.

"మాప్లాలు ఖిలాఫత్‌కు, తమ దేశానికి గొప్ప అపకారం చేసి పాపం మూటగట్టుకున్నారని నాకు తెలుసు. మనకెటువంటి ఇక్కట్లు ప్రాప్తమైనప్పటికీ మేరువువలె చలించక దౌర్జన్య రహితంగా ఉండవలె. ఇది ఆసేతు హిమాచలంలోని భారతీయులందరూ గమనించవలసిన సంగతి. ఇది వారి విధ్యుక్తధర్మము. దీనిని జవదాటరాదు.

"మాప్లాలు పిచ్చిగా ప్రవర్తించినారని నాకు తెలుసు. దీనికంతకు అహింసాయుత అసహాయోద్యమంలోని పవిత్రత వారికి తెలియక పోవటమే కారణము. అహింసా ప్రచారకులను మలబారుకు పోకుండా ప్రభుత్వంవారు అడ్డుతగిలినారు. అల్లర్లు జరిగిన మలబారు ప్రాంతానికి ప్రభుత్వంవారు నన్ను, ఆలీ సోదరులను ఆహ్వానించి పంపి ఉన్నట్లయితే అన్యాయంగా నిరపరాధులు, నిర్దోషులు అయినవారు మరణించవలసిన అవసరం ఉండేది కాదు. మాప్లాలు బలాత్కారంగా హిందువులను మహమ్మదీయ మతం స్వీకరించేటట్టు చేసినారని ప్రభుత్వంవారు ప్రకటించినారు. కాని అది సత్యం కాదని నా అభిప్రాయము. ఒకవేళ నిజమనుకున్నప్పటికీ ఇందువల్ల హిందూ, ముస్లిం ఐకమత్యానికి భంగం కలగడానికి మనము అవకాశమీయరాదు. బలాత్కారంగా మహమ్మదీయమతం అవలంభించిన వారిని రహస్యంగా గాని, బహిరంగంగా గాని మహమ్మదీయులుగా వివేకవంతులైన ముసల్మానులెవ్వరు అంగీకరించరు. అటువంటి పద్ధతులను వారు సహించరు. అది నాకు తెలుసు. కాబట్టి ఈ హైందవ సోదరులకు హిందూ మతంలో ఉండవలసిన అన్ని హక్కులు ఉన్నాయి. భ్రష్టులు కాలేదు"

- ***ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ*** (పే. 294-295)

మాప్లాల అమానుష దుష్కృత్యాలు తెలిసి యావద్దేశం తల్లడిల్లుతున్న సమయాన 1921 సెప్టెంబరు 15 సాయంత్రం మద్రాసు సముద్ర తీరంలో జరిగిన గొప్ప బహిరంగ సభలో గాంధీ మహాత్ముడు చేసిన గొప్ప ప్రసంగంలోని గొప్పభాగమిది!

మాప్లాలు అంత పిచ్చిగా ఎందుకు ప్రవర్తించారు?

గాంధీగారి అహింసాయుత అసహాయోద్యమం పవిత్రత వారికి తెలియక పోవటంవల్ల.

ఆ పవిత్రత వారికి ఎందువల్ల తెలియలేదు?

అహింసా ప్రచారకులను మలబారు ప్రాంతానికి పోకుండా బ్రిటిషు ప్రభుత్వం అడ్డుతగిలింది కనుక !

మలబారుల చేతుల్లో నిరపరాధులు, నిర్దోషులు అన్యాయంగా మరణించాల్సిన అవసరం ఎందుకొచ్చింది? మోప్లాల పైశాచిక మతోన్మాదంవల్లేనా?

కాదు. అల్లర్లు జరిగిన మలబారు ప్రాంతానికి సర్కారువారు గాంధీగారిని, ఆలీ సోదరులను ఆహ్వానించి పంపలేదు కనుక.

అహింసాయుత అసహాయోద్యమపు పవిత్రత మాప్లాల చెవిన పడలేదు కాబట్టి అది తెలియకుండా వారు చేసిన ఘోరాలకు వారి తప్పులేదు. బాధ్యత లేదు.

ఒప్పుకుందాం. కనీసం ఆ తెలియని స్థితిలో బరితెగించి బలవంతపు మత మార్పిళ్లు జరిపించడం వరకు అయినా తప్పేనా ?

కాదు. ప్రభుత్వమేదో అంటున్నదికాని అది సత్యంకాదు. అని బాపూజీ అభిప్రాయం. కాబట్టి చచ్చినట్టు నమ్మాల్సిందే.

ఒకవేళ నిజమైతే ? ముస్లిం మతోన్మాదంతో మాప్లాలు చేసిన దారుణ దుష్కృత్యాలన్నీ యథార్థమైతే వాటికి ఒడిగట్టిన వారిని హిందువులు ఏమిచేయాలి?

ఏమీ చెయ్యకుండా నోర్మూసుకుని హిందూ - ముస్లిం ఐక్యత జపంచేస్తూ కూర్చుండవలె! మేరువువలె చలించక దౌర్జన్య రహితంగా మిన్నకుండవలె ! ఇదీ మన ధర్మమూర్తిగారి ధర్మబోధ! ఎక్కడో మలబారులో ఒక వర్గం ముసల్మాన్లు పిచ్చెత్తినట్టు దారుణ హింసకు పాల్పడినంత మాత్రాన దేశంలోని ముసల్మాన్లందరూ మతోన్మాదులని, వారందరికీ ఆ పాపంలో భాగం ఉందని ఎవరూ అనరు. అనలేరు. బలవంతపు మత మార్పిళ్లను వివేకవంతులైన ముసల్మాన్లు ఎవరూ అంగీకరించరని, అటువంటి హింసాత్మక పద్ధతులను సహించరని గాంధీగారు చెప్పిందీ పాయింటే. కాని - తమలోనే కొందరు దుర్మార్గంగా హిందువులపై విషం కక్కి దారుణ మారణకాండకు పూనుకుంటే అది తప్పుఅని, అలాంటి దుశ్చర్యలను తాము ఎంతమాత్రం సహించబోమని బహిరంగంగా ఖండించవలసిన కనీస బాధ్యత సదరు వివేకవంతులకు లేదా ?

లేదనే అంటారు మహాత్ముడుగారు ! ఆ ముచ్చటనూ **'యంగ్ ఇండియా'** పత్రిక 20-10-1921 సంచికలో రాసిన వ్యాసంలో ఆయన మాటల్లోనే ఆలకించండి:

The Hindus must have the courage and the faith to feel that they can protect their religion in spite of such fanatical eruptions. A verbal disapproval by the Mussulmans of Moplah madness is no test of Mussulman friendship. The Mussulman must actually feel the shame and humiliation of the Moplah conduct about forcible conversions and looting, and that they must work away so silently and effectively that such things might become impossible... My belief is that the... cultured Mussulmans are sincerely sorry for the Moplah perversion.

[*Collected works of Mahatma Gandhi*, Vol. 24, # 217, P.448]

(ఇటువంటి మతోన్మాదపు దాడులు ఎన్ని జరిగినా తమ మతాన్ని తాము రక్షించుకోగలమన్న ధైర్యం, విశ్వాసం, హిందువులకు ఉండాలి. మాప్లాల ఉన్మాదాన్ని తాము ఆమోదించడం లేదని మాటల్లో పైకి చెప్పటమే ముసల్మాన్ల స్నేహశీలతకు పరీక్ష

కాదు. బలవంతపు మత మార్పిళ్లు, లూటీల పట్ల ముసల్మాన్లు సహజంగానే సిగ్గుపడతారు. అవమానంగా ఫీలవుతారు. మళ్లీ ఇలాంటివి ఎప్పుడూ జరగకుండా వారు నిశ్శబ్దంగా, సమర్థంగా పనిచేయాలి... మాప్లాల వికృతహేలకు సంస్కారవంతులైన ముసల్మాన్లు మనఃపూర్వకంగా విచారిస్తున్నారని నా నమ్మకం)

విచారిస్తూండవచ్చు. అది గాంధీగారు దివ్యదృష్టితో కనిపెట్టి ఉండవచ్చు, కాని - ఆ సంగతి ముసల్మాన్లు పైకి చెబితేనే కదా లోకానికి తెలిసేది? వివేకవంతులు, సంస్కారవంతులు అయిన వారు తప్పును తప్పు అని నిష్కర్షగా తెగనాడితేనే కదా - మొత్తం ముసల్మాన్లందరూ దుర్మార్గులుకారన్న నమ్మకం బాధిత వర్గానికి దృఢ పడేది? లోలోన అవమానం ఫీలవుతున్నారు కాబట్టి పబ్లిగ్గా ఖండించమంటే ఇంకా అవమానం ఫీలవుతారు - అని గాంధీగారి గుండె నీరయిపోవచ్చుగాక. కాని - మీకు జరిగిన అన్యాయాన్ని మేము సహించము; సమర్థించము అని ఆపత్కాలంలో భరోసా ఇవ్వని వారిని తమకు స్నేహితులుగా హిందువులు ఎలా పరిగణించగలరు? కనీసం అటువంటి సాంత్వన ప్రకటన చెయ్యాల్సిన అవసరం కూడా ముసల్మాన్లకు లేదు; అపురూపమైన వారి స్నేహానికి అలాంటి పరీక్షలేవీ మనం పెట్టకూడదు; మతోన్మాదపు దాడులు ఎన్ని జరిగినా మౌనంగా, ధైర్యంగా భరిస్తూ పోవటమే మన పని- అని మహాత్ముడు చెప్పటం ముస్లిం మత పక్షపాతం కాకపోతే మరేమిటి?

మాప్లాలు చేసిన పాపానికి సంస్కారవంతులైన ముసల్మాన్లు విచారిస్తున్నారని గాంధీగారి నమ్మకం కావచ్చు. నిజానికి ఆ సమయాన మహాత్ముడు మహా అభిమానించే ముసల్మాన్ మిత్రులు ఆయన అనుకుంటున్నట్టు విచార సాగరంలో ఏమీ మునిగిలేరు. మాప్లాల పట్ల వారి వైఖరి ఏమిటో - **బి.ఆర్. అంబేద్కర్** చెబుతారు వినండి.

The blood curdling atrocities committed by the Moplahs in Malabar were indescribable. All over Southern India, a wave of horrified feeling had spread among the Hindus of every shade of opinion, which was intensified when certain Khilafat leaders were so misguided as to pass resolutions of "Congratulations to Moplahs on the brave fight they were conducting for the sake of religion". Any person could have said that this was too heavy a price for Hindu - Moslem Unity. But Mr. Gandhi was so much obsessed by the necessity of establishing Hindu - Moslem Unity that he was prepared to make light of the doings of the Moplahs and the Khilafats who were congratulating them. He spoke of the Moplas as brave, God fearing... ...

[*Pakistan or the Partition by India*, B.R. Ambedkar, P. 148]

(మలబార్‌లో హిందువులపై మాప్లాలు సాగించిన రక్తం గడ్డకట్టించే అత్యాచారాలు వర్ణించనలవి కాదు. దక్షిణ భారతమంతటా అన్ని వర్గాల హిందువుల్లో తీవ్ర దిగ్భ్రాంతి కెరటంలా ఎగసింది. కొంతమంది ఖిలాఫత్ నాయకులు చేసిన పనితో అది ఇంకా ఉద్ధృతమైంది. వాళ్లు ఎంతగా పెడదారి పట్టారంటే - మతంకోసం సాహసించి ధైర్యంగా పోరాడుతున్నందుకు మాప్లాలను అభినందిస్తూ ఏకంగా తీర్మానాలే చేశారు. హిందూ-ముస్లిం ఐక్యతకు ఇది దుర్భరమైన మూల్యం అని ఎవరైనా అనగలరు. ఏది ఏమైనా హిందూ-ముస్లిం ఐకమత్యం సాధించాలన్న వల్లమాలిన ఆరాటంలో మిస్టర్ గాంధీ మాప్లాల దుశ్చర్యలను, వారికి ఖిలాఫత్‌వాదుల మెచ్చుకోళ్లను తేలిగ్గా తీసిపడేశాడు. పైగా మాప్లాలు ధైర్యశాలులు, దైవభీతి గలవారు, మతం కోసమే పాటుపడినవారంటూ మాట్లాడాడు).

గాంధీగారు, ఆయన్ని చూసి కాంగ్రెస్ సంస్థ కట్టెదుటి నిజాన్ని చూడనిచ్ఛగించక, అత్యాచారాల వార్తలన్నీ అబద్ధమనీ, బ్రిటిషు ప్రభుత్వం దుర్బుద్ధితో పుట్టించినవేననీ కొట్టిపారేసి, మాప్లాలు సాహసవీరులు అంటూ ఎన్ని కితాబులిచ్చినా యధార్థాన్ని మరుగునపరచటం వారి తరం కాలేదు. కల్లోల ప్రాంతాలనుంచి కట్టుబట్టలతో కాలికట్ చేరిన వందలాది శరణార్థుల ద్వారా - జరిగిందేమిటో మెల్లిమెల్లిగా బయటికొచ్చింది. దాంతో - అఘాయిత్యాలు అభూతకల్పనలన్న బాణీని మార్చి... అవి నిజమే; కాని - అహింస యొక్క పవిత్రత గురించి, అసహాయోద్యమ ప్రాశస్త్యం గురించి మాప్లాలకు తెలియకపోవటం వల్లే అకృత్యాలు జరిగాయి. కాంగ్రెసు వారిని ఖిలాఫత్ నాయకులను పరిస్థితిని చక్కదిద్దండంటూ సర్కారువారు పనిగట్టుకుని ఆహ్వానించి, మలబారుకు పంపించి ఉంటే అవాంఛనీయ దురంతాలేవీ జరిగేవికావని మహాత్ముడు కొత్త చరణం అందుకున్నాడు. కాంగ్రెసువారూ తు.చ. తప్పక దాన్నే చిలకల్లా పలకసాగారు.

"హిందూ-ముస్లిం ఐక్యతకన్నా, ఆమాటకొస్తే స్వరాజ్యంకన్నా కూడా సత్యం గొప్పది. మాప్లాలు చేసిన దుశ్చర్యల్లో అహింసాయుత అసహాయవాదులు అభినందించవలసింది ఏమీలేదు. హిందువులపై వారు సాగించిన హింసాత్మక దాడులు, ఆస్తుల విధ్వంసాలు, ఊచకోతలు, బలవంతపు మతమార్పిళ్లు, నాగరిక సమాజం నిష్కర్షగా గర్హించదగ్గవి. ఆ సంగతి మాప్లాలను మెచ్చుకుంటున్న మౌలానా మహమ్మదాలీ, మహాత్మాగాంధీలు గుర్తించాలి" అంటూ కేరళ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శి కె.సి. కేశవమీనన్, కాలికట్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కె. మాధవన్ నాయర్, ఎర్నాడ్ ఖిలాఫత్ కమిటీ కార్యదర్శి టి.వి. మొహమ్మద్‌లు ఒక సంయుక్త ప్రకటనలో కరాఖండిగా మందలించారు. ఏం లాభం? అదీ - చెవిటివాడి ముందు శంఖమూదినట్టే అయింది. కల్లోలిత మలబారుకు

చెందిన కాంగ్రెస్, ఖిలాఫత్ ముఖ్యులే వాస్తవ పరిస్థితిని స్వయంగా గమనించి తెలియపరిచినా గాంధీ పంథా మారలేదు. పైగా పోను పోను ఇంకా కరకు బారింది. 1921 సెప్టెంబరులో మద్రాసు బహిరంగ సభలో మాప్లాలు పిచ్చిగా ప్రవర్తించారన్నంత వరకైనా అంగీకరించిన మహాత్ముడు మూణ్నెల్లు తిరిగేసరికి అదే మాప్లాలను సాహసవీరులు, మతశూరులు అంటూ పొగడ్తలు లంకించుకున్నారు. ఈ వరస చూసి ఒళ్లుమండే అనీబిసెంట్ గాంధీ నైజాన్ని తన **న్యూ ఇండియా** పత్రిక 29-11-1921 సంచికలో ఇలా దులిపేసింది :

"It would be well if Mr. Gandhi could be taken into Malabar to see with his own eyes the ghastly horrors which have been created by the preaching of himself and his "loved brothers". Muhommed and Shaukat Ali. The Khilafat Raj is established there... Mr. Gandhi may talk as he pleases about N.C.O. accepting no responsibility. It is not what they accept; it is what facts demonstrate. He accepted responsibility for the trifling bloodshed of Bombay. The slaughter in Malabar cries out his responsibility."

[Gandhi and Anarchy, *C. Sankaran Nair*, PP 132-133]

(తాను, తన "ప్రియ సోదరులు" మహమ్మదాలీ, షౌకత్ ఆలీలు చేసిన బోధలు ఎంత ఘాతుకాలను సృష్టించాయో కళ్లారా చూడటానికి మిస్టర్ గాంధీని మలబార్ తీసుకువెళ్ల గలిగితే బాగుంటుంది. వీరు కోరే 'ఖిలాఫత్ రాజ్యం' అక్కడ ఏర్పడింది... జరిగిన దారుణాలకు అసహాయోద్యమం బాధ్యత అంగీకరించాల్సిన పని లేదని మిస్టర్ గాంధి ఇష్టమొచ్చినట్టు మాట్లాడవచ్చు. వారు ఏమి అంగీకరిస్తారన్నది కాదు; వాస్తవాలు ఏమి చెబుతాయన్నాయన్నదే ముఖ్యం. బొంబాయిలో అత్యల్పమైన రక్తపాతానికి గాంధీ బాధ్యత వహించాడు కదా ? మలబారులో ఊచకోతా ఆయనదే బాధ్యత అంటూ ఘోషిస్తున్నది.)

అనీబిసెంట్ లాంటివాళ్లు ఏమంటేనేమి? తన నమ్మకానికి సరిపడని నిజాన్ని ససేమిరా చూడరాదన్న గుర్రం నుంచి గాంధీగారు ససేమిరా దిగరు.

సంవత్సరంలో స్వరాజ్యం

ఎప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగువాడు ధన్యుడన్నాడు సుమతీ శతక కారుడు. అప్పడప్పడు ఒపీనియన్సు ఛేంజి చెయ్యనివాడు పొలిటీషియనే కాదన్నాడు గిరీశం పంతులు. ఆ రకంగా చూస్తే భారత రాజకీయాల్లో గాంధీ మహాత్ముడంతటి ధన్యజీవి లేడు. ఆయనను మించిన పొలిటీషియనూ ఆలిండియాలో లేడు.

ఉదాహరణకు - 1919లో మొదటి ప్రపంచ యుద్ధం ముగిసేటప్పటికీ, ఆ తరువాతా కూడా గాంధీగారు బ్రిటిషు సామ్రాజ్యానికి వీరాభిమాని. మానవాళి సంక్షేమం కోసం ఆంగ్ల సామ్రాజ్యం అవతారమెత్తిందని, ప్రపంచాన్ని పాలించే తాహతు తెల్లవాడికే ఉందని మనస్ఫూర్తిగా నమ్మిన భక్తాగ్రేసరుడు. అంతటి దివ్య ప్రభుత్వానికి శాయశక్తులా సేవచేసి సహకరించడమే తనబోటి పాలితుల పరమధర్మమని విశ్వసించిన విధేయపౌరుడు. యుద్ధం ముగిసిన సంవత్సరానికి ఖిలాఫత్ సమస్య వచ్చేసరికి అంతటి వీర విధేయుడు కాస్తా అదే ప్రభుత్వానికి ఎదురు తిరిగాడు. విజయోత్సవాల్లో ముసల్మాన్లెవరూ పాల్గొనరాదనీ, టర్కీ సమస్యను పరిష్కరించని పక్షంలో బ్రిటిషు ప్రభుత్వాన్ని బహిష్కరించి, సహాయ నిరాకరణ చెయ్యాలనీ 1919 నవంబరు 23న ఆలిండియా ఖిలాఫత్ కాన్ఫరెన్సు అధ్యక్షుడి హోదాలో ఆయన ప్రశస్తమైన పిలుపునిచ్చాడు.

ఊహించని రీతిలో సహాయవాది కాస్తా అసహాయవాదిగా మారాడుసరే. ఆ తరవాతైనా అదే వైఖరి మీద ఉన్నాడా? లేదు. మరుసటి నెలలో (1919 డిసెంబరు 31) అమృత్‌సర్ కాంగ్రెస్‌లో మళ్లీ సహాయవాది అయ్యాడు. బ్రిటిషు ప్రభుత్వానికి సహకార నిరాకరణ చెయ్యాల్సిందే, కొత్తగా దాపురించిన మాంటేగు - చెమ్స్‌ఫర్డ్ రాజ్యాంగ సంస్కరణలను తోసిపుచ్చాల్సిందేనని చిత్తరంజన్‌దాసువంటి ఎందరో నాయకులు గట్టిగా పట్టుబట్టినా- వద్దు, వద్దు అని అంతకంటే గట్టిగా గాంధీగారు అడ్డంపడ్డాడు. బ్రిటిషు

ప్రభుత్వం నిజాయితీని శంకించాల్సిన పనిలేదు. నమ్ముదాం, ప్రభుత్వానికి సహకరిద్దాం, కొత్త సంస్కరణలను స్వాగతిద్దాం అని, తన పలుకుబడినంతా వెచ్చించి కాంగ్రెసును ఒప్పించాడు.

నవంబరు నాటి అసహాయవాది డిసెంబరు తిరిగేసరికి మళ్లీ సహాయవాది అయిపోయాడు సరే. ఆ మాటమీదైనా నిలకడగా ఉన్నాడా? ఊహుఁ. నెల తిరక్కుండా ఇంకో పిల్లిమొగ్గవేశాడు. 1920 జనవరి 19న ఢిల్లీలో హిందూ-ముస్లిం నాయకులను సమావేశపరిచి ఖిలాఫత్ సమస్య మీద ఊరుకుంటే లాభం లేదని, తాడోపేడో తేల్చుకోవలసిందేనని ప్రబోధించి, బ్రిటిషు సర్కారుతో సహాయ నిరాకరణకు బృహత్ కార్యక్రమం రూపొందించాడు. 1919 డిసెంబరులో కాంగ్రెసు మెడలు వంచి కొత్త రాజ్యాంగ సంస్కరణలను స్వాగతించాలని, ప్రభుత్వంతో తీర్మానం చేయించిన మహాత్ముడు సదరు సంస్కరణల అమలుకు కనీసపు వ్యవధి ఇవ్వకుండానే ఐదు నెలలు తిరక్కుండా అదే కాంగ్రెసుచేత సహాయ నిరాకరణకు తెరచాప ఎత్తించాడు. పంజాబ్ అత్యాచారాలు, టర్కీ విచ్ఛిన్నం దృష్ట్యా సహాయ నిరాకరణను పరిశీలించడానికి ప్రత్యేక కాంగ్రెసు జరపాలని 1920 మే 30న ఎ.ఐ.సి.సి. చేత తీర్మానం చేయించాడు. తొమ్మిది నెలల కింద అమృత్‌సర్‌లో సహకార నిరాకరణను ఎంత తీవ్రంగా ప్రతిఘటించాడో అంతే తీవ్రతతో 1920 సెప్టెంబరు 4న కలకత్తా స్పెషల్ సెషనులో సహకార నిరాకరణను సమర్థించి అసహాయ శంఖం పూరించాడు.

ఈ పిల్లిమొగ్గకు గాంధీగారు చెప్పిన, కాంగ్రెసు చేత చెప్పించిన కారణమేమిటంటే... పంజాబ్ అత్యాచారాలకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం గట్టి చర్య తీసుకోలేదని; ప్రజాభిప్రాయాన్ని ఖాతరు చెయ్యక టర్కీని విచ్ఛిన్నం చేసిందని. అందుకే ప్రభుత్వం మీద విశ్వాసం పోయి సహాయ నిరాకరణ దారి పట్టాల్సి వచ్చిందని ! ఇది కుంటి సాకు. జలియన్‌వాలాబాగ్ ఘోర దురంతం తరవాత ఎనిమిది నెలలపాటు దోషుల మీద ఈగవాలకుండా, అరకొర విచారణతో, కంటి తుడుపు చర్యలతో దొరతనం కాలక్షేపం చేసిన తీరునుబట్టి కఠినచర్యలు తీసుకునే ఉద్దేశం సర్కారుకు ఎంతమాత్రం లేదని అమృత్‌సర్‌లో సభ చేసే సమయానికే మెడమీద తలకాయ ఉన్న ప్రతివాడూ గ్రహించాడు. అప్పటికీ కలకత్తా స్పెషల్‌కూ నడుమ తొమ్మిది నెలల్లో పరిస్థితిలోగాని, సర్కారీ వైఖరిలో గాని కొత్తగా వచ్చిన మార్పు అంటూ ఏదీ లేదు. ఈ పరిణామ క్రమాన్ని గమనిస్తే అర్థమయ్యేదొక్కటే. గాంధీ మహాత్ముడిది నమ్మశక్యంకానంత చపలచిత్తం. ఆయన ఎప్పుడు ఏమి చేస్తాడో, ఎందుకు చేస్తాడో బహుశా ఆయనకే తెలియదు.

సహాయ నిరాకరణను గాంధీగారు సంకల్పించింది ఖిలాఫత్ సమస్యమీదే తప్ప స్వరాజ్యం కోసం కాదు. కేవలం ఖిలాఫత్ అంటే హిందువులు పెద్దగా ఆసక్తి చూపరని వారూ వీరూ సలహా ఇచ్చిన మీదట పంజాబ్ దురంతాలనూ ఖిలాఫత్‌కు జోడించారు. అది కూడా ప్రజలకు సంతృప్తి కలిగించలేదు. అసలైన స్వరాజ్యం లేకుండా అసహాయోద్యమం ఏమిటని పత్రికలు, మేధావి వర్గాలు ఆక్షేపించాయి.

"గాంధీజీ ఖిలాఫత్ పంజాబు సమస్యల పరిష్కారానికి మాత్రమే అసహాయోద్యమం ప్రారంభించవలెనంటే ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, దేశాభిమాని, హితకారిణి, గోదావరి పత్రిక, 'నెల్లూరు పత్రిక'లు స్వరాజ్య సంపాదనకు సహితం అసహాయోద్యమం అవసరమని వ్రాసినాయి" – [**'ఆంధ్రప్రదేశ్ గాంధీజీ'**, పేజి 169]

ఈ రకంగా పత్రికలు, ఇతరులు ఒత్తిడి చేసిన మీదట గాని స్వరాజ్యం సంగతి గుర్తురాని మహాత్ముడు ఉద్యమ ఆశయాల్లో దాన్నీ ఆలస్యంగా చేర్చిన తరవాత హఠాత్తుగా స్వరాజ్యవాది అయిపోయాడు. అప్పటి నుంచీ స్వరాజ్యం గురించే తెగ మాట్లాడసాగాడు కాలం కలిసొచ్చి భవిష్యత్తులో ఎప్పుడో స్వరాజ్యం వచ్చేదాకా వేచి ఉండకుండా అర్జంటుగా సంవత్సరంలో స్వరాజ్యం సాధిస్తానని ప్రతినబూనాడు. తాను చెప్పిన పద్ధతిలో అహింసాత్మక అసహాయోద్యమాన్ని సాగిస్తే ఏడాది గడిచేసరికి స్వరాజ్యం వచ్చి తీరుతుందని 1920 డిసెంబరు చివర్లో నాగపూర్ కాంగ్రెసులో ఘంటాపథంగా ప్రకటించాడు. అది మొదలుకుని ఏడాదిపాటు దేశమంతా సుడిగాలిలా పర్యటించి నానా హడావుడి చేశాడు. గడువు దగ్గర పడుతోందని తొందరబట్టి, తాను చెప్పినట్టు జరగకపోతే స్వరాజ్యం ఆలస్యమవు తుందని భయపెట్టి తలుచుకుంటే గడువుకన్నా ముందే ఒక్కరోజులోనే స్వరాజ్యం సాధించవచ్చునని ఊరించి ఎడాపెడా స్టేట్‌మెంట్లు గుప్పించాడు.

విన్నవారు ఓహో అనుకున్నారు. కొంతమంది తెల్లబోయారు. అంత తొందరగా స్వరాజ్యం వస్తుందా? ఎలా? అని అనుమానంగా అడిగారు. ఓస్, దానిదేముంది, బెజవాడలో ఎఐసిసి తీర్మానించినట్టు కోటి రూపాయలు పోగేసి, కోటి మందిని కాంగ్రెసులోకి చేర్చి ఇరవై లక్షల రాట్నాలు ఆడిస్తేచాలు స్వరాజ్యం ఉరుక్కుంటూ వచ్చేస్తుంది అని గాంధీగారు సత్యప్రమాణంగా చెప్పారు.

మచ్చుకు – 1921 ఏప్రిల్ 5న బందరులోని ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో కొంత మంది ప్లీడర్లు మహాత్మునితో జరిపిన ఈ సంభాషణను చూడండి.

ప్లీడరు : *మహాత్మాజీ ! స్వరాజ్యం నిజంగా 6 మాసాలలో వస్తుందా ?*

గాంధీ : *అయితే ఒక సంగతి వినండి. కాంగ్రెసు కమిటీ తీర్మానం ప్రకారం ఒక కోటి మంది సభ్యులను, ఒక కోటి రూపాయల నిధిని, 20 లక్షల రాట్నాలను మనమందరమూ కష్టపడితే 3 నెలల్లో సమకూర్చలేమా ?*

ప్లీడరు : సమకూర్చగలము.

గాంధీజీ : *ఈ పని చేయటంలో స్వరాజ్యసిద్ధికి కావలసిన గుణాలు మనలో వికసించవా ? స్వరాజ్యానికి కావలసిందేమిటి? ఏకీభావము, త్యాగము, పట్టుదల, ధైర్యము, కార్యకౌశలమూ ఇవే కదా? ... నాకు స్వరాజ్యం సిద్ధించింది. కాని దానిని జాతిలో ప్రతిష్ఠించేందుకు ప్రయత్నిస్తున్నాను... 20 లక్షల రాట్నాలను స్థాపించి పనిచేస్తూన్నట్లయితే కలిగే ఫలితమేమిటో మీరూహించినారా ? ఇంగ్లాండ్ నుంచి ఒక్క అంగుళం గుడ్డగానీ,, దారం గానీ తెప్పించకుంటే ఏమి జరుగుతుందో ఆలోచించండి. లాంక్‌షైరులోకి పోయే 60 కోట్ల రూపాయలు ఇక్కడ నిలిచిపోతుంది... దేశీయులంతా తమ తమ వృత్తులను చాలించుకొని ఏకాగ్రచిత్తంతో, తదేక దీక్షతో ఈ 3 మాసాలు కాంగ్రెసు కమిటీ తీర్మానాలను ఆచరింపజేస్తే పై 3 మాసాలలో స్వరాజ్యం సిద్ధించి తీరుతుంది.*

[**ఆంధ్రప్రదేశ్‌లో *గాంధీజీ* - కొడాలి ఆంజనేయులు,** పే. 209, 210]

ఇది విన్నవారికి కళ్లు తిరుగుతాయి. ప్రజలలో ఏకీభావం, త్యాగం, ధైర్యం, కార్య కౌశలం వగైరా మంచి లక్షణాలు మహాత్ముడి దయవల్ల కలిగితేచాలు. కోటిరూపాయలు పోగేసి, 20 లక్షల రాట్నాలు ఆడిస్తేచాలు. బ్రిటిషు ప్రభుత్వం బెంబేలెత్తి శతాబ్దానికి పైనుంచి తేరగా సాగిస్తున్న దోపిడీని, దురాక్రమణను చాలించి, తట్టా బుట్టా సర్దుకుని, మనకు స్వరాజ్యం ఇచ్చేసి పరారవుతుందా? ఇది అయ్యేపనేనా? బందరు ప్లీడరుకూ ఆ సందేహం వచ్చే ఉంటుంది. మహాత్ముడంతటి వాడిని ఎదురు ప్రశ్నించే ధైర్యం లేక వారు మిన్నకుండవచ్చు.

కాని – సుభాస్ చంద్రబోస్ అలా మిన్నకుండేరకం కాదు. 1921 మేలో ఇండియన్ సివిల్ సర్వీస్‌కు గుడ్‌బై చెప్పి ఇంగ్లండులో ఓడెక్కి, జాతీయోద్యమంలో దూకడానికి ఇండియా తిరిగివచ్చిన వెంటనే సుభాస్‌బోసు బొంబాయి రేవు నుంచి ఎకాఎకి గాంధీజీ బసకువెళ్లి, తనకున్న సందేహాలను సూటిగా అడిగేశాడు. ఏడాదిలోనే స్వరాజ్యం తెస్తానని మీరు ఎలా హామీ ఇస్తున్నారు? ప్రజలు పన్నులు కట్టక, శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ చేసినంత మాత్రానే ప్రభుత్వం గోదానుంచి నిష్క్రమించి స్వరాజ్యం ఇచ్చేస్తుందా, లాంక్‌షైర్ మిల్లులు మూతపడితేచాలు– బ్రిటిష్ సర్కారు చేతులెత్తేస్తుందా– అని నేరుగా ప్రశ్నించాడు. దానికి గాంధీ సమాధానం గానీ, దానిపై ఇచ్చిన తలాతోకాలేని వివరణలు

గానీ బోసును సంతృప్తిపరచలేదు. గుచ్చి గుచ్చి అడిగినా నమ్మదగ్గ జవాబు ఏదీ రాలేదు. అప్పుడు బోసుకు కలిగిన అభిప్రాయమిది:

"there was a deplorable lack of clarity in the plan which the Mahatma had formulated and he himself did not have a clear idea of the successive stages of the campaign which would bring India to her cherished goal of freedom"

[*The Indian Struggle,* Subhas Chandra Bose, P. 59]

(మహాత్ముడు రూపొందించిన ప్రణాళికపై ఆయనకే స్పష్టత లేదు. ఇండియాను స్వరాజ్యం గమ్యానికి చేర్చే పోరాటంలోని వివిధ దశల గురించి ఆయనకు విస్పష్టమైన అవగాహన లేదు.)

మహాత్ముడి మీద భారం వేసి, ప్రజలు ఆయన చెప్పిందల్లా చేశారు. నిప్పుల్లో దూకమంటే దూకారు. అక్కడక్కడ స్వల్ప దుర్ఘటనలు మినహా దేశమంతటా అహింసాయుత అసహాయోద్యమం అద్భుతంగా సాగింది. ప్లీడర్లు పోక కోర్టులు వెలవెలపోయాయి. విద్యాసంస్థలు మూతపడ్డాయి. చట్టసభలు నిస్తేజమయ్యాయి. గాంధీగారు కోరినట్టు కోటి రూపాయలు గడువుకన్నా ముందే జమఅయ్యాయి. కాంగ్రెసులో కోటిమంది సభ్యులు చేరారు. 20 లక్షల రాట్నాలూ ఆడాయి. జనం ఖద్దరునే కట్టారు. స్వదేశీ వస్తువులే వాడారు. సర్కారుతో సంపర్కాలన్నీ సాధ్యమైనంతవరకూ మానుకున్నారు. గాంధీగారు పెట్టిన షరతులన్నీ నెరవేరాయి. ఆయన హామీ ఇచ్చిన స్వరాజ్యం మాత్రం సంవత్సరం గడువు తీరినా జాడలేదు.

"Swaraj was to arrive on September 30 or October 1; or December 31, at the congress, it is as far off as ever" (స్వరాజ్యం సెప్టెంబరు 30న వస్తుందన్నారు. అక్టోబరు 1న అన్నారు. డిసెంబరు 31న కాంగ్రెసు సభ నాటికి వచ్చేస్తుందన్నారు. ఏదీ? అది ఎప్పటిలాగే ఎంతో దూరంలో ఉంది.) అని **అనీబిసెంట్** బాహాటంగా ఎత్తిపొడిచింది.

నాయకుడన్నవాడికి అది తలవంచుకోవలసిని సంకట స్థితి! శుష్క వాగ్దానాలతో, డొల్ల హామీలతో జనాన్ని మభ్యపెట్టిన బండారం బయటపడినందుకు ఆ పరిస్థితిలో ఎవరున్నా మొగం చెల్లక, మాట పెగలక, దిక్కుతోచక తెల్లమొగం వేస్తారు. కాని గాంధీగారు మమూలు మనిషికాదు. ఇటువంటి ఇరకాటాలు ఆయనకోలెక్కకాదు. తన నిర్వాకాన్ని ఎలా సమర్థించుకున్నాడో చూడండి.

"I am unable to accept any blame for having set the time-limit... without the time-limit we would not have collected the crore nor would we have introduced so many charkhas..."

[*Mahatma*, D.G. Tendulkar, Vol. II, P. 74]

(టైము లిమిటు పెట్టినందుకు నన్ను నిందించాల్సిన పనిలేదు. ఆ లిమిటు కనుక లేక పోతే మనకు కోటి రూపాయలు వసూలయ్యేవికాదు. అన్ని చర్ఖాలను ప్రవేశపెట్ట గలిగేవాళ్లమూ కాదు...)

"సంవత్సరంలోగా స్వరాజ్యం రాకపోవటమన్న ప్రశ్నేలేదు. 1921 డిసెంబరు 31 తరవాత స్వరాజ్యం కళ్లజూడకుండా నేను జీవిస్తానని అనుకోను" అని బెంగాలీ విప్లవకారులతో జరిపిన సమావేశంలో మహాత్ముడు అన్నాడు. ఇలాంటి స్టేట్‌మెంట్లు వేరే సందర్భాల్లోనూ ఇచ్చాడు. అది విని... గడువులోగా స్వరాజ్యం తేలేకపోతే మహాత్ముడు ఎక్కడ ప్రాణత్యాగం చేస్తాడోనని కాంగ్రెసువారు హడలిపోయారు. గడువు దగ్గరపడ్డా స్వరాజ్యం వచ్చే సూచన లేకపోవడంతో గాంధీకీ, కాంగ్రెసుకూ అవమానకరమైన నగుబాటును ఎలా తప్పించాలా అని దేశబంధు చిత్తరంజన్‌దాసు లాంటివారు బుర్రలు బద్దలు కొట్టుకున్నారు. వేల్సు యువరాజు భారత పర్యటనకు ఆటంకం లేకుండా చూడటం కోసం కాంగ్రెసుతో రాజీకి వైస్రాయి సిద్ధపడి మదన్‌మోహన్ మాలవ్యా ద్వారా రాయబారం నడిపితే సి.ఆర్.దాసు కూడా అందుకు సహకరించాడు. ఆసహాయోద్యమాన్ని మధ్యలో ఆపేసి ప్రభుత్వంతో రాజీకి సిద్ధమవటమేమిటని సుభాస్‌బోస్ లాంటి సహచరులు నిలదీయగా... గాంధీకి, కాంగ్రెసుకు పరువు నిలిపి, గడువు తీరేలోగా స్వరాజ్యం దిశగా ఎంతో కొంత ముందడుగు పడిందన్న అభిప్రాయం జనానికి కలిగించటం కోసమే తానా పనిచేసినట్టు దాసుగారు చెప్పాడు. (ఆలీ సోదరులకు చెర వదిలితే గానీ ఎటువంటి రాజీకి అంగీకరించేది లేదని గాంధీగారు బిర్ర బిగియడంతో ఆ అవకాశమూ చేయి జారిపోవటం వేరే సంగతి.)

సంవత్సరంలోగా స్వరాజ్యం రాకపోతే మహాత్ముడిచ్చిన మాట ఏమయ్యేను? ఇక ప్రజలకు మొగం ఎలా చూపించగలం అని కాంగ్రెసు నాయకులు జుట్టు పీక్కున్నారు. కాని అసలు మనిషికి ఏ చింతా లేదు. సమయానుకూలంగా బాణీ మార్చి ఇబ్బందిని ఇట్టే దాటెయ్యగలనని ఆయన మీద ఆయనకు గొప్ప నమ్మకం.

తన వైఫల్యాన్ని చాలా తెలివిగా సమర్థించుకుని, లోకులను బురిడీ కొట్టించానని గాంధీగారు మురిశారేమో. కాని ఆయన నాయకత్వం మీద అచంచల విశ్వాసంతో ఆయన్నే నమ్ముకుని, కొండంత ఆశపెట్టుకున్న లక్షలాది దేశభక్తులకు మాత్రం తీవ్ర

మనస్తాపం కలిగింది. ఈ సందర్భంలో గాంధీగారి అసమర్థ నిర్వాకాన్ని సుభాస్‌చంద్రబోస్ నిష్కర్షగా ఇలా దులిపేశాడు :

The promise of "Swaraj" within one year was not only unwise but childish. It made the congress appear so foolish before all reasonable men. Nodoubt the Mahatma's disciples have tried subsequently to explain away the point by saying that the country did not fulfil the conditions and so Swaraj could not be won within one year. The explanation is as unsatisfactory as the original promise was un-wise because arguing in the same way, any leader can say that if you fulfil certain conditions you can be free in one hour. In making political forecasts, no leader worth the name should impose impossible conditions. He should estimate what conditions are likely to be achieved in a given set of circumstances.

[*The Indian Struggle,* Subhash Chandra Bose, P. 78]

('సంవత్సరంలోగా స్వరాజ్యం' అని హామీ ఇవ్వటం అవివేకం, చిన్న పిల్ల చేష్ట ! సహేతుకంగా ఆలోచించే వారందరి ముందు దానివల్ల కాంగ్రెసు బడుద్ధాయి అయింది. ఫలానా షరతులను దేశం నెరవేర్చలేకపోయింది కనుకే ఏడాదిలో స్వరాజ్యం సిద్ధించలేదని మహాత్ముడి శిష్యులు అనంతర కాలంలో సమర్థించుకోబోయారు. మొదటి హామీ ఎంత అవివేకమో ఈ సంజాయిషీ అంత అసంబద్ధం. ఎందుకంటే ఇదే రీతిన వాదించి ఇక ఏ నాయకుడైనా ఫలానా షరతులను తీర్చితే గంటలో స్వాతంత్ర్యం తెస్తానని చెప్పగలడు. రాజకీయ భవిష్యవాణిని పలికేముందు నాయకుడన్నవాడు అసాధ్యమైన షరతులను రుద్దకూడదు. ఫలానా పరిస్థితుల్లో ఎలాంటి కండిషన్లు ఆచరణ సాధ్యమో, ఎటువంటి ఫలితాలను సాధించేందుకు వీలుందో అంచనా వేసుకోవటం నాయకుడి విధి.)

డబ్బు... డబ్బు... డబ్బు!

మద్రాసులో 'శ్రీభాగ్' బస నుంచి గాంధీజీ కారులో బయలుదేరి వస్తూండగా ఒక యువకుడు జేబులోనుంచి నోటుబుక్కు తీసి దానిలో గాంధీజీని సంతకం చేయమని కోరినాడు. "నేను సంతకం చేస్తాను. కాని దాని ఖరీదు 100 రూపాయలు" అన్నారు గాంధీజీ నవ్వుతూ. "నా దగ్గర అంత డబ్బు లేదు" అన్నాడు ఆ యువకుడు జాలిగా. "పోనీ ఏమిస్తావో చెప్పు" అన్నారు మహాత్మాజీ. "5 రూపాయలు" అన్నాడా యువకుడు.

"అయితే ఇట్లాతే" అన్నారు గాంధీజీ.

ఆ యువకుడు జేబంతా దులిపి 5 రూపాయలు చేతిలో పుచ్చుకున్నాడు. గాంధీజీ ఎడం చేతితో ఆ పైకం తీసుకొని కుడి చేతితో తన పేరువ్రాసి ఇచ్చినారు. ఆ యువకుని ముఖం వికసించింది.

"నీవు చాలా అదృష్టవంతుడివి 5 రూపాయలకు నా సంతకం తీసుకోగలిగినావు. ఇతరచోట్ల ఒక్క సంతకానికి 100 రూపాయలకి తక్కువ తీసుకోలేదు" అని నవ్వుతూ అన్నారు గాంధీజీ.

[*ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ* - కొడాలి ఆంజనేయులు, పుట. 647]

చరిత్రాత్మకమైన నాగపూర్ కాంగ్రెసు తరవాత మొదటి ఎ.ఐ.సి.సి. సమావేశం 1921 మార్చి 31, ఏప్రిల్ 1 తేదీలలో బెజవాడలో జరిగింది. దిగ్గజాల్లాంటి జాతీయ నాయకులందరూ ఆ సభలకు హాజరయ్యారు. అప్పుడు జరిగిన ఏర్పాట్లను అయ్యదేవర కాళేశ్వరరావుగారు ***'నా జీవితకథ - నవ్యాంధ్రము'***లో ఇలా వివరించారు.

"... ఆ కాలంలో బెజవాడలో విద్యుద్దీపాలు లేవు పెట్రోమాక్స్ దీపాలే ఆధారం. బస్సులు కూడా లేవు. మోటారు కార్లు కూడా ఒకటి రెండు మాత్రమే ఉండేవి. ఒక్కొక్క రాష్ట్రం నుంచి వచ్చిన అఖిల భారత కాంగ్రెసు కమిటీ సభ్యులకు ఒక్కొక్క ప్రముఖుని

ఇంటిలో బస ఏర్పాటుచేసినాము. మా మేడ మీద దేశబంధు చిత్తరంజన్‌దాస్, వారితో వచ్చే బెంగాలీ నాయకులకు బస ఏర్పాటు చేసినాము. ఇట్లానే దాసు మధుసూదనరావుగారి ఇంటిలో మోతీలాల్ నెహ్రూగారికి, వారితోగూడా వచ్చే వారికి, సింగరాజు వెంకట సుబ్బారావుగారి ఇంటిలో లాలాలజపతిరాయ్ గారికి, వారితో వచ్చేవారికి, పెద్దిభొట్ల వీరయ్యగారి మేడమీద బాబూరాజేంద్రప్రసాద్‌గారికి, వారితో వచ్చేవారికి ఈ విధంగా తలా ఒకచోట విడుదులను ఏర్పరచినాము...'

మరి అసలు కథానాయకుడు వి.వి.ఐ.పి.ల్లో కెల్లా వి.వి.ఐ.పి. అయిన మహాత్మా గాంధీ గారు ఎక్కడ బస చేశారు? జాతి జనులందరూ ఆరాధ్యదైవంగా తలిచే ఆ మహానుభావుడికి ఆతిథ్యమిచ్చే మహద్భాగ్యం ఎవరికి దక్కింది? అయ్యదేవరవారు ఇంతవరకూ ఇచ్చిన వివరాలనుబట్టి– బెజవాడ స్థానిక కాంగ్రెసు నాయకులు అందరిలోకీ అతిముఖ్యుడైన పుర ప్రముఖుడికి ఆ అపురూప అవకాశం అంది ఉంటుందని మనం ఊహిస్తాం. కాని అది తప్పు. రాక రాక వచ్చిన మహాత్ముడు పురప్రముఖుల్లో తనకు చిరపరిచితులు, బాగా సన్నిహితులు పలువురు ఉన్నప్పటికీ తనకు ఆతిథ్యమిచ్చే ఛాన్సును ఏ ఒక్కరికీ ఉచితంగా ఇవ్వదలచలేదు. మరి ఏమి చేశారు? ఎక్కడున్నారు? అదీ అయ్యదేవరవారే చెబుతారు వినండి :

"మహాత్మాగాంధీగారిని, వారితో వచ్చిన కస్తూరిబాయి... మొదలైన ప్రముఖులను వర్తకులు తమకు అప్పగించవలసిందని కోరినందువల్ల వారిలో ఎక్కువ చందాలిచ్చిన గోల్ల నారాయణరావు మేడలో ఉంచినాము. భోజనపు ఏర్పాట్లను కూడా వారే చేసినారు."

ఆ ఒక్కసారే కాదు. మహాత్ముడు ఎప్పుడు ఆంధ్ర దేశానికి వచ్చినా అదే పద్ధతి. ఒకసారి రాజమండ్రి స్టేషనులో రైలులోనుంచి చేయిచాచగానే ఒకాయన నారింజ పండు చేతిలోపెడితే "పైసాకి బాత్‌హై అవుర్ దూస్‌రేకి బాత్ నహీం" అన్నారట బాపూజీ. జీవితాంతం అదే ఆయన పాలసీ. స్వరాజ్యం తేవడం మీదకన్నా పరధనం వీలైన మేరకు నొల్లుకోవటం మీదే ఆయనకు మక్కువ ఎక్కువ.

బెజవాడ గవర్నరుపేటలోని మ్యూజియం హాలులో జరిగిన ఎఐసిసి సభల్లో గాంధీ గారు ముచ్చటగా మూడు తీర్మానాలు దగ్గరుండి చేయించారు. మూడునెలలలోగా తిలక్ స్వరాజ్యనిధికి కోటి రూపాయలు వసూలు చేయాలి. కోటి మంది కాంగ్రెసు సభ్యులను చేర్పించాలి. 20 లక్షల రాట్నాలు ఊళ్లలో, ఇళ్లలో పనిచేసేట్టు చూడాలి అని! ఇలా తీర్మానం చెయ్యటమేమిటి, మహాత్ముడు దేశాటన మొదలెట్టి ఊరూరా నిధుల వసూళ్లకు యుద్ధప్రాతిపదికన ఉపక్రమించడమేమిటి – చకచకా జరిగాయి. బెజవాడ ఉన్నది ఆంధ్రదేశంలో కాబట్టి తాజా వసూళ్ల కార్యక్రమాన్ని కూడా అక్కడినుంచే

మొదలెట్టారు. ఆ పర్యటనలో ఆయన వెంట ఉన్న "దేశభక్త" కొండ వెంకటప్పయ్యగారు **స్వీయచరిత్ర**లో చెప్పిన అప్పటి విశేషాల్లో మచ్చుకు కొన్ని:

"రాజమహేంద్రవరము, కాకినాడ సభలలో మహాత్మాజీ ఉపన్యాసము ముగించి, తిలక్ స్వరాజ్యనిధికి కానుకలిండని కోరగానే స్త్రీలు వారి బంగారపు గాజులను, వడ్డాణములను, మెడలోని చంద్రహారములను గూడ నిచ్చిరి... ఏలూరిలో కాబోలు శ్రీ మాగంటి బాపినీడుగారి భార్య స్వరాజ్యనిధికి తాను ధరించిన సర్వాభరణములను అర్పణ జేసెను...

"మేము బాపట్ల చేరునప్పటికి చీకటి పడుచుండెను. వెంటనే దేశిరాజు బాపయ్యగారి ఇంటికి తోడ్కొనిపోయిరి... తివాచీ మీద కూర్చుండిన పిమ్మట పెద్ద వెండి పళ్లెరము నిండ బత్తాయి, నారింజ పండ్ల బద్దలు మహాత్మాజీ యెదుటనుంచి భుజింపుడని కోరిరి. తిలకు స్వరాజ్యనిధికి కట్నము చెల్లించిననేగాని తాము భుజించుట లేదని మహాత్మాజీ స్పష్టపరిచిరి. అంతట వెయ్యి రూపాయలను మరియొక వెండి పళ్లెరమున కాన్క సమర్పించిరి..."

"చీరాలలో వైశ్యవర్తకులు పలువురు ధనవంతులుండిరి. కాన మహాత్మాజీని ఎక్కువ మొత్తమును కానుకగానిచ్చినవారి యింటికి తీసుకొనిపోవునట్లు ఏర్పాటుచేసుకుని వారు పాట పాడి, పదమూడు వందల రూపాయల పాట పాడిన వర్తకుని యింటికి తీసుకొనిపోయిరి..."

[స్వీయ చరిత్ర, కొండ వెంకటప్పయ్య పుటలు 257, 261, 262]

మూడు మాసాల్లో కోటి రూపాయలు నిధి పోగుచేయాలని ఎ.ఐ.సి.సి. నిర్ణయించింది కనుకా, వ్యవధి తక్కువగా ఉన్నందుచేతా, ఆ నిర్ణీత లక్ష్యాన్ని సాధించడానికే పాపం మహాత్ముడు అంత ప్రయాస పడ్డారేమో అని అనుకోనక్కరలేదు. ఆ నిర్ణయం జరగడానికి ముందే, కాంగ్రెసు సభ నిమిత్తం బెజవాడల్లో అడుగుపెట్టినప్పుడే గాంధీగారు ఎవరు ఎక్కువ సొమ్మిస్తే వారి ఇంట బసచేసే ఆచారాన్ని పాటించిన సంగతి గుర్తుంచుకోవాలి.

ఒక మహా సంస్థ నిర్ణయం మేరకో, ఏదైనా ప్రజాహిత పవిత్రకార్యం నిమిత్తమో ప్రజల నుంచి నగదును, నగలను గాంధీ వంటి మహానాయకుడు వసూలు చేయటం తప్పుకాదు. అందులో తన స్వార్థం లేదుకాబట్టి గట్టిగా అడిగి సొమ్ము రాబట్టడాన్నీ ఆక్షేపించనవసరంలేదు. అయితే.. అడగవలసింది అడిగి, అవతలివారు ఐచ్ఛికంగా, సంతోషంగా ఇచ్చింది తీసుకోవటం వేరు. ఇచ్చినదానితో తృప్తి పడక ఇంకా తెమ్మని, ఒంటి మీద కనపడ్డ నగనల్లా ఒలుచుకోవాలని చూడటం వేరు. గాంధీగారిది రెండో పద్ధతి. ***"ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ"*** గ్రంథం నుంచి మచ్చుకు కొన్ని ముచ్చట్లు :

అనకాపల్లి పెద్ద మార్కెట్ స్క్వేర్‌లో (1933 డిసెంబరు 29 మధ్యాహ్నం) సభా ప్రారంభసమయంలో గాంధీజీకి ప్రీతికరమైన 'వైష్ణవ జనతో' కీర్తనను ఒక బాలిక పాడింది. గాంధీజీ ఆ బాలిక వంక తిరిగి 'ఈ పాట కంటే ఒక నగ ఇస్తే సంతోషిస్తా'నన్నారు. వెంటనే ఆమె చేతికున్న ఉంగరం తీసి గాంధీజీ చేతులలో ఉంచింది.

... ఒక బాలిక ఏదో కొద్దిగా ఇవ్వగా "నీవు లుబ్ధురాలివలె ఉన్నావు. నీకింత బంగారం ఎందుకు" అన్నారు గాంధీజీ. వెంటనే ఆమె చేతనున్న ఉంగరం తీసి ఇచ్చింది. **(పుట. 710)**

విశాఖపట్నం స్త్రీల సభలో ఒక బాలిక వచ్చి గాంధీజీకి ఖద్దరు మాల వేసి పోతూండగా గాంధీజీ ఆమె చేయి పట్టుకుని గాజులివ్వమన్నారు. ఆమె తండ్రి వచ్చి "మీరే తీసుకోండి" అన్నారు. అప్పుడు అన్ని గాజులు నావేనన్నారు గాంధీ. "ఒక్కటే" అన్నారు తండ్రి. గాంధీగారు ఒకటే గాజు తీసుకున్నారు. **(పుట 734)**

90 ఏళ్ల వృద్ధురాలు కండ్లు కనపడకపోయినా నడవలేక మహాత్ముని వద్ధకు వచ్చి ఒక గాజు జత సమర్పించి నమస్కరించింది. మళ్లీ ఆమె గాంధీజీని ఒక సందేశమివ్వ వలెనని కోరింది. గాంధీజీ డబ్బు కావలెనని కోరినారు. వెంటనే ఆమె మెడలో ఉన్న గొలుసు తీసి మహాత్మునికి ఇచ్చివేసింది. దానిని మెడలో వేసుకొని గాంధీజీ ఒక సందేశం వ్రాసి ఇచ్చినారు. **(పుట 735)**

సామర్లకోటలో ఒక స్త్రీని గాంధీజీ చూసి గాజులివ్వమని కోరినారు. దుర్గాబాయిగారు ఆ గాజులను తీయ ప్రయత్నించి "రావు" అన్నారు. "అయినా ప్రయత్నించి చూడు" అన్నారు గాంధీజీ. అప్పుడు ఆమె ఎట్లానో అతికష్టంమీద గాంధీజీకి ఆ గాజులు తీసి ఇచ్చింది. ఆ స్త్రీ బులుసు సాంబమూర్తిగారి గృహిణి. సాంబమూర్తిగారు "ఆమె వద్ద ఉన్న ఆఖరు నగలివే. తక్కినవన్నీ ఇదివరకే అమ్మివేసినా"నన్నారు. గాంధీజీ తరచు తెలుగులో "డబ్బు", "నగలు" అని మందహాసం చేస్తుంటే స్త్రీల నగలు కుప్పలు కుప్పలుగా పడుతుండేవి. **(పుట. 735)**

మద్రాసు మహిళా సమాజం ఏర్పాటుచేసిన సభలో... "ఇంతకూ మీరేమీ నాకు సొమ్ము ముట్టజెప్పలేదే" అన్నారు గాంధీజీ. వెంటనే డాక్టర్ ముత్తు లక్ష్మీరెడ్డి డబ్బు సంచీని ఆయన చేతిలో ఉంచి అందులో 430 రూపాయలు నగదు ఉన్నదని చెప్పినారు. ఈ సంచి తేలికగా ఉన్నది అన్నారు గాంధీజీ. తమలో చాలామంది తిలక్ ఘాట్‌వద్ద బహిరంగ సభలో గాంధీజీకి ఇవ్వనున్న విరాళానికి ఉదారంగా చందాలు వేసినట్టు లక్ష్మీరెడ్డి విన్నవించారు.

"మీరదొక కారణంగా చెబుతున్నారా? మంచిది. ఎట్లాగయినా స్త్రీలు హృదయ పూర్వకంగా తమ నగలు ఇచ్చినారు. కొందరు ఉంగరాలు, మరి కొందరు గాజులు, మరి కొందరు కంఠహారాలను కూడా సమర్పించినారు. మిమ్ములను కూడా అట్లా ఇవ్వమని కోరుతున్నాను అయితే మీరిప్పుడు నాకిచ్చే నగల వంటివి నగలను మళ్లీ తిరిగి చేయించుకో కూడదు". **(పుట. 637, 638)**

దబాయించి నగలను వొలుచుకోవడమేగాక మళ్లీ అట్లాంటివి చేయించుకోకూడదన్న షరతొకటి ! ఈ షరతే చెన్నపట్నంలో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారికి చిక్కు తెచ్చిపెట్టింది. 1925 మార్చి 7న పంతులుగారు తమ కుమార్తె కామాక్షమ్మను వెంట బెట్టుకుని గాంధీగారి బసకు వెళ్లారు. అప్పుడు-

"ఆ బాలిక చేతులకున్న బంగారు గాజుల జతలను చూసి మహాత్ముడు తనకిమ్మని అడిగినారు. ఆమె ఒక జత తీసి యిచ్చింది. తక్కిన వాటిని యివ్వవా అని మహాత్ముడు అడుగగా అన్నిటిని తీసి యిచ్చింది. తరువాత గాంధీజీ ఆమె మెడలో ఉన్న హారం అడిగినారు. దానిని కూడ తీసి యిచ్చింది. పట్టెడ తీయడానికి రాక ఆమె ఆలోచిస్తూండగా ఒకరు శ్రావణం తెచ్చి ఇచ్చినారు. దానితో సీలను తిప్పి దానిని కూడా తీసి ఇచ్చింది... ఇంకమీద బంగారు నగలను ఆ పిల్లచేత ధరింపచేయనని నా ఎదుట ప్రమాణం చేయవలసిందని మహాత్ముడు నాగేశ్వరరావుగారిని అడిగినారు. "స్త్రీలు అందుకు సమ్మతించరు కాబట్టి ఆ ప్రకారం ప్రమాణం చేయజాలను" అన్నారు నాగేశ్వరరావుగారు. "అట్లా అయితే నేను వీటిని పుచ్చుకోను. మీరు ధనవంతులు. మళ్లీ అట్లాంటి ఆభరణాలనే చేయించి పెడతారు" అని మహాత్ముడు నగలన్నిటిని అక్కడనే విడిచి అనిబిసెంటును చూడటానికి అడయారు వెళ్లినారు. అప్పుడు నాగేశ్వరరావుగారే మళ్లీ తీసుకొని వాటికి సరియైన విలువకట్టి ఆ సొమ్మును మహాత్మునకు అంటే 'ఆంధ్ర కాంగ్రెసు నిధికి' సమర్పించినారు. **(పుట. 353)**

స్త్రీలకు నగలున్నవి గాంధీగారికి సమర్పించుకోవడానికే తప్ప తాము పెట్టుకుని మురిసిపోవడానికి కాదని మహాత్ముడి సిద్ధాంతం ! స్త్రీ సహజమైన అలంకరణాపేక్షను కూడా ఆయన ససేమిరా ఒప్పుకోరు ! తాను నిలువుదోపిడీ చేశాక మళ్లీ అటువంటి నగలను వారు జన్మలో చేయించుకోరాదని ఆ దయామయుడి ఆంక్ష !

కాశీనాథునివారు శ్రీమంతులు కాబట్టి మళ్లీ అలాంటి ఆభరణాలను ఎక్కడ చేయిస్తారోనని గాంధీగారు శంకించారు. బాగుంది ! మరి శ్రీమంతులు కానివారి సంగతి ఏమిటని ఆయన ఆలోచిస్తారా? అవసరమైతే అమ్ముకోవడానికి ఏ ఆస్తీ లేని సామాన్య కుటుంబీకుల ఒంటి మీద తనకు కంటబడ్డ నగలన్నీ బలవంతపెట్టి తాను

వొలుచుకుంటే మునుముందు వారు ఎలా బతుకుతారన్న తలంపు ఆయనకు ఉన్నదా? లేదు. ఎంతసేపూ అందినకాడికి గుంజుకోవడమే తప్ప అవతలివారి బాధలు, అవస్థలు మహాత్మాజీకి పట్టవు. అందుకు సత్యవతే రుజువు.

సత్యవతికి నిండా ఇరవై ఏళ్లు ఉండవు. చిన్నప్పుడే పెళ్లిఅయింది. భర్త జాతీయవాది. శోభనం కాకుండానే చనిపోయాడు. ఏ ముచ్చటా తీరకుండానే వైధవ్యం దాపురించి సత్యవతి నాయుడుగూడెంలో పుట్టిల్లు చేరింది. ఆ దుఃఖంలో ఆమె ఉన్నప్పుడే ఖద్దరు నిధికి వసూళ్ల నిమిత్తం 1929 ఏప్రిల్‌లో ఆంధ్రదేశ సంచారం చేస్తూ గాంధీగారు ఆమె ఊరివైపు వెళ్లారు. ఆయన వస్తున్నారని తెలియగానే సత్యవతికి ప్రాణం లేచి వచ్చింది. తన ఒంటిమీద నగలన్నిటినీ ఆయనకు అర్పించుకుని ఆయన ఆశ్రమంలో చేరి శేష జీవితాన్ని దేశమాత సేవలో వెళ్లదీయాలనుకుంది. అప్పుడు ఏమైందో 2-5-1929 **యంగ్ ఇండియా** వ్యాసంలో గాంధీగారి మాటల్లో చదవండి :

మేము బెజవాడనుంచి ఏలూరు వెళుతుండగా నాకో బాలిక గురించి చెప్పారు. ఆమె ఈ మధ్యే వితంతువు అయిందట. 1400 రూపాయల కిమ్మతుచేసే తన సమస్తాభరణాలనూ ఆమె నాకు ఇవ్వదలిచిందట. అవి తీసుకోవటానికి నేను ఆమె ఇంటికి రావాలని కోరుతున్నదట. మేము వెళ్లాల్సిన పెదపాడుకు ఆమె ఉండే ఊరు రెండుమైళ్లే. నగలంటే నాకు వ్యామోహమేమీ లేదు. నిజానికి అంత ఖరీదైన జవహరీ మొత్తాన్ని ఆమె ఇచ్చేస్తుందంటే నాకు నమ్మబుద్ధికాలేదు. కాని ఏదో చిన్నమ్మాయి కదా, అందులో కొత్తగా వైధవ్యం వచ్చిందట కదా అని జాలిపడి నేను ఆమె ఇంటికి వెళ్లాను... ఆ అమ్మాయి పేరు సత్యవతీదేవి... వెళ్లగానే ఆమె సర్వాభరణాలనూ నా చేతుల్లో పెట్టింది. వాటిని చూస్తే పూరా 1400 రూపాయలు విలువచేసేటట్టే కనిపించాయి. వాటితోపాటు నా చేతికో చీటీ ఇచ్చింది. తనను నా వెంట ఆశ్రమానికి తీసుకుపోవలసిందని అందులో రాసింది... ఆమె తలిదండ్రులు ఒప్పుకుంటే ఆమెను సంతోషంగా ఆశ్రమానికి తీసుకుపోతానని నేను చెప్పాను. వారు కూడా నా టూరు పూర్తయ్యాక ఆమెను నా వెంట పంపుతాము లెమ్మని ఆమెకు భరోసా ఇచ్చారు. భారమైన గుండెతో ఆమెనుంచి నేను వీడ్కోలు తీసుకున్నాను.

[*Collected Works of Mahatma Gandhi*, Vol 45, PP 424, 425]

ఆ యువతి దైన్యానికి మహాత్ముడు చాలా బాధపడ్డారు. ఆమెను బయట తిరగనివ్వకుండా పరదా వెనుక ఉంచడమేమిటని ఆమె కన్నవాళ్లను కోప్పడ్డారు. ఆ తరవాత వెళ్లిన ప్రతి సభలోనూ సత్యవతి ఉపాఖ్యానం చెప్పారు. పరదా పద్ధతిని పారదోలి, వితంతువులకు పునర్వివాహం చేయాల్సిన అవసరాన్ని ప్రతిచోటా నొక్కిచెప్పారు. అలా చేయకుండా వితంతువులను క్రూరంగా అణచిపెట్టటంవల్లే హిందూ సమాజం ఇలా

అఘోరిస్తున్నదని తిరిగొచ్చాక **యంగ్ ఇండియా** పత్రికలోనూ చడామడా దులిపేశారు. బాగుంది. కాని - తనను అంతగా కదలించిన ఆ బాలికను మహాత్ముడు ఏమి చేశారు? ఆయన సలహా ఇచ్చినట్లు మళ్లీ పెళ్లికోసమేమీ ఆమె అంగలార్చలేదు కదా ? తనకు నగల మీద గాని, సంసార సుఖాలమీద గాని వ్యామోహం లేదు, మీ నీడన మీ ఆశ్రమంలో సేవ చేసుకుంటూ బతుకుతాననే కదా ఆమె ప్రార్థించింది? ఆమెను పంపటానికి తలిదండ్రులూ ఇష్టపడ్డారుకదా? అన్నమాట ప్రకారం ఆంధ్ర పర్యటన ముగించుకుని వస్తూ వస్తూ ఆ బాలికను కూడా ఆయన ఆశ్రమానికి తీసుకువెళ్లాలి కదా ? అలా చేశారా? 1400 రూపాయల నగలు వస్తాయంటే తన దారి కాకపోయినా రెండు మైళ్ల దూరం వెళ్లి విధివంచిత ఒంటి మీద ఆభరణాలన్నీ పట్టుకుపోయిన మహాత్ముడు తరువాత ఆమె అతీగతీ పట్టించుకున్నారా? చిన్నతనంలోనే అంతటి నిస్వార్థసేవా నిరతిని అలవరచుకున్న అభాగిని తనమీద కనపరచిన నిండైన భక్తికి, విశ్వాసానికి ప్రతిగా ఆయన కూడా ఆమె యోగక్షేమాలను కొంతలో కొంతయినా కనిపెట్టారా?

మనకు తెలిసినంతలో అలాంటిదేమీ జరగలేదు. సత్యవతిని కలిసి ఆరు రోజులయ్యాక 1929 ఏప్రిల్ 29న వసుమతి అనే ఆశ్రమ వాసినికి మహాత్ముడు రాసిన ఈ లేఖే సత్యవతికి ఆయన ఇచ్చిన విలువ ఏమిటో చెబుతుంది :

"You contributed money on the very day you adopted me as your father... Your contribution of money has no value in my eyes. In that way I have deprived several women of their possessions. I am not sorry for that, and do not even remember clearly many of these occassions. During this tour I took away from one Satyavati who had been recently widowed all her Jewellery, and I felt no compunction. But would she take a pledge and keep it? It would be good of she did... ..."

[Collected Works of Mahatma Gandhi, Vol 45, PP 412, 413]

(నన్ను నీ తండ్రిగా దత్తుచేసుకున్న రోజునే నువ్వు డబ్బు విరాళంగా ఇచ్చావు... నాదృష్టిలో నీ విరాళానికి విలువలేదు. ఆ రకంగా నేను చాలామంది మహిళల నగానట్రా లాగేశాను. అందుకు నేనేమీ విచారించడం లేదు. ఆ సందర్భాలేమిటో కూడా నాకు గుర్తుండవు. ఈ టూరులోనే నేను కొత్తగా వితంతువైన ఓ సత్యవతి దగ్గర నగలన్నీ తీసేసుకున్నాను. అందుకు నాకు చింతలేదు. కాని ఆమె సత్యాగ్రహ శపథం తీసుకుని నిలబడుతుందా ? నిలబడితే మంచిదే... ...)

నగల మీద, నగదు మీద వ్యామోహం లేదు లేదంటూనే ఎక్కడికి వెళ్లినా, ఎవరు కనపడ్డా 'ఏమిస్తావ్? ఇంకేమిస్తావ్? ఇంకా తే' అంటూ పీడించటం మహాత్ముడి ప్రత్యేకత.

ఎంత వసూలైనా తృప్తిపడక ఇంకా కావాలనటం, తనకు ఎవరో ప్రేమతో ఇచ్చిన ఫౌంటెన్ పెన్నులను, దండలను, భరిణెలను, ఆఖరికి సన్మాన పత్రాలను కూడా వేలం వేసి, స్వయంగా తానే పాటను నిర్వహించి, అందినంత రాబట్టటం ఆయన వెళ్లినచోటల్లా సర్వసాధారణం. ఇందాక మనం చెప్పుకున్నవి ఎక్కువగా 1920లలో గాంధీగారు నడివయసులో ఉన్నప్పటి ముచ్చట్లు. అలాగని ముదిమి మీద పడ్డాక వసూళ్ల రంధి ఆయనలో అణగిందీ లేదు. మరణించడానికి మూడునెలల ముందు గాంధీని సర్దార్‌పటేల్ ఆటపట్టించిన ఈ కింది ఉదంతమే అందుకు ఉదాహరణ.

1947 అక్టోబరు 11న పంచాంగం ప్రకారం గాంధీజీ పుట్టినరోజు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని గుజరాతీలు ఆయనకు పర్సు బహూకరించడానికి రిసెప్షను ఏర్పాటుచేశారు. గాంధీజీ అప్పటికింకా జలుబు, ఫ్లూతో బాధపడుతున్నారు. అయినా మీటింగుకు వస్తానని చెప్పారు. సర్దార్‌పటేల్ ఆయనను తీసుకువెళ్లడానికి వచ్చేటప్పటికి కూడా ఆయన తెరపి లేకుండా దగ్గుతూనే ఉన్నారు. అప్పుడు-

The Sardar chaffed him "There is no end to your greed ! To collect a purse you will leave even your deathbed! All things will take care of themselves, if only you take care of your cough. But you will not listen"

At the meeting the Sardar... with affectionate banter proceeded. "See, how quickly the old man has recovered his strength to relieve you of your money in spite of his illness. Now have some mercy on him and let him rest."

[Mahatma Gandhi : The Last Phase, Part - II, Pyarelal, P.P. 459-460]

(సర్దార్ ఆయనతో మేలమాడారు "మీ ఆశకు అంతులేదు. పర్సు వస్తుందంటే మీరు మరణశయ్య మీంచి కూడా లేచొస్తారు. మీ దగ్గు సంగతి మీరు చూసుకుంటే చాలు, అన్నీ బాగానే అవుతాయి కాని మీరు వినరు".

మీటింగులో కూడా సర్దారు ప్రేమ పూర్వకంగా హాస్యమాడుతూ "జబ్బును కూడా లెక్కచెయ్యక మీ నుంచి డబ్బును గుంజటంకోసం ముసలాయన ఎంత త్వరగా బలం పుంజుకున్నాడో చూడండి. ఇకనైనా ఆయనను దయతలచి కాస్త విశ్రాంతి తీసుకోనివ్వండి" అన్నారు.)

చీరాల - పేరాల

***ఊ**రొదిలి పోవాలనే నిర్ణయించుకున్నారు చీరాల ప్రజలు.*

రెండేళ్లనుంచీ వారికీ ప్రభుత్వానికీ మధ్య ఒక పంచాయతీ నడుస్తున్నది. చీరాల, పేరాల, జాండ్రపేట, వీరరాఘవపేట గ్రామాలు చిరకాలంగా చీరాల పంచాయతీ యూనియన్ పాలనలో ఉంటున్నాయి. వాటిలో చీరాల, పేరాల గ్రామాలను కలిపి ప్రత్యేక మున్సిపాలిటీలుగా ఏర్పాటుచేయాలని 1919లో మద్రాసు ప్రభుత్వం సంకల్పించింది. అది ఆ గ్రామాల ప్రజలకు ఇష్టం లేదు.

మున్సిపాలిటీ అయినందువల్ల ఊరికి ఒరిగేదేమీ ఉండదు. భరించలేని పన్నుల బాదుడే తప్ప జనానికి ఉపయోగం సున్న. పంచాయతీ యూనియన్‌లో నాలుగు గ్రామాలకూ కలిపి సాలీనా ఆదాయం నాలుగువేల రూపాయలు ఉండేది. మున్సిపాలిటీ చేశాక చీరాల - పేరాల సాలుసరి ఆదాయం ముప్ఫై వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. అందులో ప్రభుత్వం ఇచ్చేదేమీ ఉండదు. మొత్తమంతా ఊరివారి గోళ్లూడగొట్టి వసూలు చేసేదే. అప్పటికి చీరాల, పేరాల గ్రామాల జనాభా కేవలం పదిహేనువేల పైచిలుకు. వారిలో అత్యధికులు చేనేత కార్మికులు. వారి రోజువారి ఆదాయం నాలుగు, ఐదు అణాలకు మించదు. ఇల్లు గడవటమే కష్టం. ఎడాపెడా అడ్డగోలు పన్నుల బరువూ పైన పడే సరికి సామాన్య జనానికి వెన్ను విరిగినట్టయింది.

అక్కడికీ సర్కారువారిని పలుమార్లు ప్రార్థించారు. మోతబరువు మున్సిపాలిటీ మాకు వద్దు. పాత పంచాయతీలోనే మా మానాన మమ్మల్ని ఉండనీయండి అని వేడుకున్నారు. ఆ కాలంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో జస్టిస్ పార్టీ హవా ఎక్కువగా ఉండేది. ముఖ్యమంత్రిగా ఉన్న పానగల్‌రాజా పానుగంటి రామారాయణింగర్ కూడా ఆ పార్టీవాడే. స్థానిక స్వపరిపాలన శాఖ ఆయనదే. కాంగ్రెస్ పేరు చెబితే ఆయన చిరచిరలాడతారు. కాంగ్రెసు ఎలా చెబితే అలా నడుస్తూ సత్యాగ్రహాలూ, సహాయ నిరాకరణలూ జోరుగా చేస్తున్నందుకు చీరాల వారంటే రాజాగారికి మా చెడ్డ చిరాకు.

ముఖ్యమంత్రిగా ఉండీ తాను చీరాలలో కనీసం ఒక సభ కూడా పెట్టలేకపోయానని ఆయనకు కడుపు మంట. అందుకే కాబోలు - ఊరిజనమంతా వద్దుమొర్రో అంటున్నా పట్టుబట్టి 1920 జనవరి 12న కొత్త మునిసిపాలిటీ ఏర్పాటుచేశారు. పన్నులనుమాత్రం విపరీతంగా పెంచి పారిశుద్ధ్యాన్నీ, పౌర సౌకర్యాలనూ పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. చీరాల వాస్తవ్యుడైన దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు చొరవ తీసుకుని అనేక పర్యాయాలు సభలు చేసి పురపాలక సంఘాన్ని రద్దుచేయాలనీ, పాత పంచాయతీని పునరుద్ధరించాలనీ ఎన్నో తీర్మానాలు చేయించారు. సర్కారువారు అన్నిటినీ జాగ్రత్తగా బుట్టలో పడేశారు. చిన్న చిన్న చిల్లర దుకాణాల వారిమీద, ఆఖరికి వీధుల వెంబడి తిరిగే తోపుడుబండ్ల వ్యాపారాల మీదా భారీ సుంకాలు మోపి కడతావా చస్తావా అని నిర్బంధింపసాగారు. గోపాలకృష్ణయ్య ప్రేరణతో కొంతమంది తెగించి సుంకం కట్టమని మొరాయిస్తే వారంట్లు పట్టుకొచ్చి లాక్కుపోయి మాజిస్ట్రేటు కోర్టులో జైలుశిక్షలు వేయించేవారు. కాంగ్రెసు నియమానుసారం నిందితులెవరూ ప్రతివాదం చెయ్యకుండా శిక్షను మౌనంగా స్వీకరించేవారు. పోలీసులు పట్టుకొని కోర్టుకు తీసుకువెళ్లేప్పుడు వందలాది జనం వారివెంట వెళ్లేవారు.

ఇలా ఎంతమందిని జైల్లోవేసినా పౌరులు బెదరలేదు. వారి నైతిక ధృతి సడలలేదు. దాంతో పానుగంటి రాజావారే స్వయంగా వచ్చి - తమకు ఎదురు తిరిగితే చీరాలకు రైల్వేస్టేషను, పోస్టాఫీసు, ఆసుపత్రి వంటి సౌకర్యాలు లేకుండా చేస్తామని బెదిరించాడు. ప్రజలు ఇంకా ఉగ్రులయ్యారు. దుగ్గిరాల గోపాలకృష్ణయ్య రెట్టించిన పట్టుదలతో అహింసాయుతంగా ఉద్యమించాడు. బ్రిటిషు ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేయాలన్న చరిత్రాత్మక తీర్మానాన్ని కాంగ్రెసు చేసిన దరిమిలా దేశమంతటా ఉద్యమదీక్ష, పోరాటకాంక్ష పరవళ్లు తొక్కుతున్న రోజులవి. గాంధీని దైవంగా తలిచే గోపాలకృష్ణయ్య గాంధీ బోధనే ఆచరణలో పెట్టి పన్నులు చెల్లించవద్దని ప్రజలను కోరాడు. వారూ వల్లె అన్నారు. పన్నులు కట్టకపోతే ఆస్తులు జప్తు చేస్తామని అధికారులు అన్నారు. చేసుకోపొమ్మని జనం చెప్పారు. పన్ను కట్టని వారి ఆస్తులు స్వాధీనం చేసుకుని అధికారులు వేలంపాటలు పాడారు. వాటిలో ఎవరూ పాల్గొనలేదు. ఎంత ప్రయత్నించినా వేలం ఆస్తులు ఎవరూ కొనకపోవడంతో చీరాల, పేరాలలో స్వాధీనం చేసుకున్న చరాస్థిని బాపట్ల, గుంటూరు లాంటి ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి అక్కడ వేలం వేశారు.

ప్రజలు ఎంత శాంతంగా ఉన్నా ప్రభుత్వ దమనకాండ రోజు రోజుకూ పెరగ సాగింది. గోపాలకృష్ణయ్య ఏమిచేయాలో పాలుపోక గాంధీజీనే అడిగాడు. మున్సిపాలిటీ ఇష్టం లేకపోతే ఊళ్లో ఉండాలని ఏముంది? మున్సిపల్ సరిహద్దుల అవతలికి పోయి నివసించవచ్చు గదా - అని మహాత్ముడు ప్రశస్తమైన సలహా ఇచ్చాడు.

దానిమీద పెద్దలంతా కూడి ఆలోచించారు. మహాత్ముడు చూపిన మార్గం దివ్యంగా ఉంది. దానివల్ల ప్రభుత్వంతో రోజూ సంఘర్షణా మనకు తప్పుతుంది. పౌరులందరూ ఊరు విడిచిపోతే మున్సిపాలిటీ దానంతట అదే అంతరించిపోతుంది. ఎలాగూ సంవత్సరంలో స్వరాజ్యం సాధిస్తానని గాంధీగారు ప్రతిజ్ఞచేసి ఉన్నారాయె. స్వరాజ్యం వచ్చాక మనకు ఏ కష్టాలూ ఉండవు. ఈ లోపు కష్టాలూ, నష్టాలూ ఎన్ని వచ్చినా పళ్ల బిగువున భరిద్దాం – అని అంతా కలిసి ఒక నిశ్చయానికి వచ్చారు.

ఇంకేం? మున్సిపాలిటీ పరిధి అవతల పొలిమేరల్లో ఇసుక దిబ్బలపై పర్ణశాలలు వేసుకుని జీవితం గడపాలని స్థూలంగా అంగీకారం కుదిరింది. కొత్త జనావాసానికి 'రామనగర్' అని గోపాలకృష్ణయ్య పేరు పెట్టాడు. ఊళ్లోని కుర్రాళ్లతో రామదండు ఏర్పరచి, విరాళాలను, సాధన సామగ్రిని పోగుచేసి, తాటాకులతో కొత్త జనవాటికను కట్టేపనిలో పడ్డాడు. గాంధీ బోధ ఇచ్చిన ఉత్తేజంతో ఆ కార్యక్రమం నడుస్తూండగానే – అదృష్టం ! స్వయానా మహాత్ముడే చీరాలలో అడుగుపెట్టాడు. 1921 మార్చి 31న బెజవాడలో జరిగిన చరిత్రాత్మకమైన ఎ.ఐ.సి.సి. సభల్లో పాల్గొని ఆంధ్ర దేశ సంచారంచేస్తూ బాపట్లనుంచి ఏప్రిల్ 6 రాత్రి చీరాలలో గాంధీజీ అడుగుపెట్టాడు. ఆనాటి విశేషాలను 'దేశభక్త' కొండ వెంకటప్పయ్య మాటల్లో చిత్తగించండి:

"మేము చీరాల పోవునప్పటికి రాత్రి పదిగంటలు సమీపించుచుండెను. చీరాలలో వైశ్య వర్తకులు పలువురు ధనవంతులుండిరి. కాన మహాత్మాజీని ఎక్కువ మొత్తమును కానుకగా నిచ్చినవారి యింటికి తీసుకొని పోవునట్లు ఏర్పాటుచేసుకుని వారు పాట పాడి, పదమూడువందల రూపాయల పాట పాడిన వర్తకుని యింటికి తీసుకొనిపోయిరి. అచ్చట నా రూపాయలు తీసుకొని, పురమధ్యమున సమావేశమైన మహాసభకు వచ్చితిమి...

"... ఆ సభలో మహాత్మాజీ ఉపన్యాసము ముగించిన పిమ్మట పురపాలక సంఘ మును గూర్చి సాగించుచున్న సహాయ నిరాకరణ చర్యలను వివరించి, ప్రజలనందరిని మునిసిపలు మేరలు దాటించి, పురము వెలుపల కాపురములు పెట్టించవలెనను తన యుద్యమమును గూర్చి మహాత్మాజీ అభిప్రాయమును గోపాలకృష్ణయ్యగారు కోరిరి. "మీరు చేయు కార్యము జయప్రదమైన యెడల కాంగ్రెసు మిమ్ము అభినందించును. కాని మీరు అపజయమును పొందునెడల ఆ బాధ్యత కాంగ్రెసు తనపై పెట్టుకొన"దని యుక్తిగ జవాబు చెప్పిరి.

[స్వీయచరిత్ర, కొండ వెంకటప్పయ్య పంతులు పే. 262-264]

ఇది వింటే - ఈ కాలంలో మనకు ఆశ్చర్యం వేస్తుంది. జాతీయోద్యమాన్ని నిర్మించి, నడిపించాలనుకునే మహాత్ముడేమిటి? 'మీరు చేసేది మంచిదే. చెయ్యండి. గెలిస్తే ఆ కీర్తిలో మాకు వాటా ఇవ్వండి. ఓడితే మాత్రం ఆ అపకీర్తి మాకు అంటగట్టకండి అని గిరీశం తరహాలో మెలిక వెయ్యడమేమిటి? ఊరొదిలి పోవాలన్నది జనానికి వారంతట వారికి పుట్టిన బుద్ధికాదు. ఆపద వచ్చింది - ఎలా గట్టెక్కాలో సెలవిచ్చి మమ్మల్ని ఆదుకోవలసింది - అని వారు వేడుకుంటే మహాత్ముడే చేసిన ఉపదేశమది ! తన మీద అచంచలమైన భక్తి విశ్వాసాలతో తననే నమ్మి తాను దూకమంటే నిప్పుల్లో దూకడానికైనా సిద్ధపడ్డ ప్రజలతో నాయకుడన్నవాడు మాట్లాడాల్సిన తీరేనా ఇది? తనమీదే భారం వేసి, సొంతగడ్డ మీద సహజంగా ఉండే మమకారం కూడా చంపుకొని, కొంపాగోడూ వదిలి, ఊరిబయట పాకల్లో బతకడానికి తన మాట మీద సంసిద్ధమైన జనాన్ని చూసి సంతోషించి, 'మీకేమీ భయంలేదు, నేనుంటా మీ వెంట' అని భరోసా ఇవ్వాలికదా? అది మాని - 'గెలిస్తే మా గొప్ప; గెలవకుంటే మీ ఖర్మ' అనటం విశాల దేశంలో మహా జాతీయోద్యమానికి సారథ్యం వహించే సర్వసైన్యాధిపతికి భావ్యమేనా?

ముమ్మాటికీ కాదు. కాని - చీరాల వాసులు అలాంటి శంకలేమీ పెట్టుకోలేదు. ఎలాంటి అక్షేపణలూ చేయలేదు. మహాత్ముడి మీద నిండైన భక్తితో, ఆయనగారి అంటీముట్టని ఆశీర్వచనమే మహద్భాగ్యమని ఎంచి, వెనువెంటనే ఊరువిడిచే పనిలో పడ్డారు. ఇరవైరోజులు తిరక్కుండా మొత్తం ఊరు ఖాళీచేసి పోయారు. మొత్తం దేశంలోనే అంతకుముందు బహుశా ఎవరూ కనీవినీ ఎరుగని ఆ అపురూప ఘట్టాన్ని **బసవరాజు అప్పారావు** తన **'ఆంధ్రరత్నద్యుతులు'** గ్రంథంలో ఇలా వర్ణించారు:

"గాంధీ మహాత్ముని రాకకు పిమ్మట చీరాల, పేరాల వాసులు తమ లక్ష్యసిద్ధికై పురత్యాగమే మేలని నిశ్చయించుకొనిరి. అందుచే మునిసిపల్ సరిహద్దులకు బయట వేలవేలుగా తాటాకు పాకలు నిర్మించి, ఆబాలగోపాలమును ఊరు విడిచిపోవుటకు నిర్ణయించిరి. ఇందుకై 26-4-1921 తేదీ రాత్రి సుముహూర్తమేర్పరుపబడెను. మంగళవాద్యముల తోడను, 'శ్రీమద్రమారమణ గోవిందో హరి': 'మహాత్మాగాంధీకి జై' యను శంఖారావములతోను, తాత తండ్రులనుండి తాము నివసించుచున్న స్వగృహము లను వీడి చీరాల, పేరాల జనులు నూతన కుటీరములకు జనిరి. ఆనాటి రాత్రి వారి యుత్సాహమునకు మేరలేదు. గొప్పవారు, కొద్దివారు, భాగ్యవంతులు, పేదవారు, స్త్రీలు, పురుషులెల్లరు గ్రామములను వదిలిపెట్టిరి. ఆ నడి వేసవిలో నాటి రాత్రియు, మరుసటి మిట్ట మధ్యాహ్నమును అచ్చటి ప్రజానీకము తమ సామానులను నెత్తినపెట్టుకొని చేటలు, చాపలు, చీపుర్లు, రోలు రోకళ్లు, పిడకలు మోసికొనిపోవు పురుషులను జూచిన వారికెవరికి కంటినీరు కలుగదు? గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పసిబిడ్డ తల్లులు, ముదుసళ్లు, శిశువులు ఎల్లరు గ్రామమును త్యజించిరి... ...

"వేసవి గడచిపోయినను ప్రభుత్వం మునిసిపాలిటీని రద్దుచేయలేదు. ప్రజలూర లేనందున పన్నులు బాధ తప్పెను. అందుచే వారి పాకలలోనే వారు తమ పనులన్నిటిని నెరవేర్చుకొనుచు, అచ్చటనే పెండ్లి పేరంటములు జరుపుకొనుచు, అచ్చటనే హరికథలు, పాటకచేరీలు, భజనలు, భాగవతములు సాగించుకొనుచుండిరి. అటు చీరాల పేరాల గ్రామములు నిర్మానుష్యములై, భూత, ప్రేత పిశాచముల కాలవాలమై, విషసర్పములకు నివాస స్థానమై వెల వెల బోవుచు, భీకరము గొల్పుచుండెను. ఇండ్లు కూలిపోయినను, చోరులు తలుపుల నెత్తికొని పోయినను, ఎన్ని ఇక్కట్లు వచ్చినను ప్రజలు తమ దీక్షను వదలలేదు. అంతలో వర్షాకాలము వచ్చెను. అనేక కష్టములు సంప్రాప్తించినవి. కాని ప్రజలు పట్టు వీడలేదు."

[**గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం, మాదల వీరభద్రరావు.** పే. 44-45]

1921 ఏప్రిల్ 25వ తేది అర్ధరాత్రి పెట్టేబేడా సర్దుకుని తమనెత్తిన, లేదా ఎడ్లబండ్లపైన వేసుకుని జనం ఇళ్లను ఖాళీచేసిపోయాక చీరాల దాదాపుగా పాడుబడింది. కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘంవారు ప్రచురించిన ***'భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర'***లో ఇచ్చిన వివరాల ప్రకారం చీరాల - పేరాల జనాభా 15,326 మందిలో 13, 572 మంది ఈ విధంగా ప్రవాసోద్యమంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారట. ఆ వైనాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రిస్తూ విలేఖరి విలేఖరి డి.ఎస్.ఆర్.రావు పంపిన వార్త 'హిందూ' పత్రికలో ప్రముఖంగా ప్రచురితమైందట. పదకొండు నెలలపాటు చీరాల మున్సిపాలిటీ అనేది లేకుండాపోయి, చీరాల - పేరాల వీధులు నిర్మానుష్యంగా, పాడుపడిన పేటల వలె, స్మశాన వాటికల వలె గోచరించాయట.

నిస్సందేహంగా అది అపూర్వమే. అపురూపమే. సంఘటిత ప్రజాశక్తికి ఘన విజయమే. కాని - ఆ విజయాన్ని సాధించటానికి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. పర్ణశాలలు వేసుకుని జీవిస్తున్న జనం నరకయాతనలు అనుభవించారు. వారి వ్యాపారాలు దారుణంగా దెబ్బతిన్నాయి. వారి కుటుంబాలు ఆర్థికంగా చితికాయి. పైగా రోళ్లు పగిలే మండువేసవి. ఆ ఏడాది వడగాడ్పులు మహా తీవ్రంగా వీచాయి. ఉష్ణోగ్రత 120 డిగ్రీలకు పెరిగింది. వేసవిని వెంటాడుతూ వచ్చిన వర్షరుతువు కూడా వారికి మరిన్ని ఇక్కట్లు తెచ్చి పెట్టింది. కొద్ది రోజుల వ్యవధిలో కుండపోతగా 11 అంగుళాల వర్షం పడింది.

ప్రకృతి వైపరీత్యాలే దుర్భరమనుకుంటే వాటికి మించిన సర్కారీ పీడ. పన్నుల బాధ పడలేక జనం ఊరు విడిచిపోయినా కుళ్లుబోతు ప్రభుత్వం వారిని ప్రశాంతంగా బతకనివ్వలేదు. పగబట్టినట్టు వెంటపడి కొత్త పన్నుల కొరడాతో బాదింది. కొత్తగా వేసుకున్న పాకలు ప్రభుత్వ బంజరు భూమిలో ఉన్నాయనే కారణంచూపి అపరాధపు

పన్ను కట్టి తీరాలంది. పాక ఖరీదు పాతిక రూపాయలైతే అపరాధపుపన్ను పది రూపాయలు మించింది. అంత సొమ్ము మేమెక్కడనుంచి తేగలమంటే – కట్టకపోతే పాకలు ఖాళీచేసి పొమ్మని దొరతనం హుకుం !

'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అందుబాటులో ఉన్నంతకాలమూ చుట్టు ముట్టిన గడ్డు సమస్యలను ఏదో ఒక విధంగా తట్టుకుంటూ వచ్చాడు. ఎర్రచొక్కాల 'రామదండు' నేర్పరచి, వారికి కఠిన క్రమశిక్షణనలవరచి, గ్రామ పెద్దలతో పంచాయతీ తగాదాలను పరిష్కరింపజేసి, అన్ని కులాలకూ ప్రాతినిధ్యంతో గ్రామ పార్లమెంటు ఏర్పరచి, గ్రామస్థాయిలో సమాంతర ప్రభుత్వాన్ని గొప్పగా నడిపాడు. ఆంధ్రదేశంలో ఊరూరా తిరిగి తన ఉద్యమానికి నిధి వసూళ్లుచేసి అత్యవసర ఖర్చులను ఎలాగో వెళ్లదీశాడు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించి బరంపురం ఆంధ్ర మహాసభలకు హాజరు కాదలచిన అపరాధానికి దుగ్గిరాలను అరెస్టుచేసి, సంవత్సరం ఖైదు విధించటంతో పరిస్థితి విషమించింది. 'పదవే భద్రాద్రికి పాపిష్టి ఘటమా' అని పాడుకుంటూ 'ఆంధ్రరత్న' కటకటాల వెనక్కి వెళ్లాక చీరాల ప్రజలు ఆర్థిక చిక్కులతో నానా బాధలు పడవలసి వచ్చింది. అదే సమయంలో ప్రభుత్వ దమననీతీ పరాకాష్టనందుకుంది. రౌడీలను, సంఘ వ్యతిరేక శక్తులను చేరదీసి రామనగర్ ప్రజల గుడిసెలను తగులపెట్టించటం కూడా జరిగింది.

ఇలా అష్టకష్టాలు పడుతూనే 1921 ఏప్రిల్ నుంచి 1922 ఫిబ్రవరి వరకూ 11 నెలల పాటు రెండు గ్రామాల ప్రజలు ఇసుక దిబ్బలపై కాపురముండి, ప్రభుత్వాజ్ఞలను ధిక్కరించి, ధైర్యంగా పోరాడటం **'కృష్ణాపత్రిక'** సంపాదకీయంలో అభివర్ణించినట్టు 'మనోహరం, దుర్నిరీక్షం, అద్భుతం'. ఉన్న ఒక్క నాయకుడూ చెరసాలపాలై జనం దిక్కు తోచక విలవిలలాడుతున్న సమయంలో రాష్ట్ర కాంగ్రెసు నాయకులు గాని, కాంగ్రెసు జాతీయ నాయకత్వంగాని, గాంధీ మహాత్ముడుకాని, వారికి ధైర్యం ఇచ్చి అండగా నిలబడి ఉంటే చరిత్రగతి ఇంకో విధంగా ఉండేది. దేశంలోనే అపురూపమైన శాసనోల్లంఘ నోద్యమానికి దిగ్విజయం సాధించిన ఖ్యాతి కాంగ్రెసుకు దక్కేది. కాని – దురదృష్టం ! తన సలహామీద ఊరు విడిచి చీరాల వాసులు నానా సమస్యల్లో చిక్కుకుని అల్లాడసాగాకైనా మహాత్ముడి మనసు మారలేదు. వారికి చేయగలిగిన సహాయాన్ని చేయాలన్న ధ్యాసే ఆయనకు లేదు. మీ ఏడుపు మీరు ఏడవండి. మీ కష్టాలు మీరు పడండి. అన్యాయాలన్నిటినీ నోరెత్తక సహించండి – అన్నదే ఆయన చేసిన ఉపదేశమల్లా. పైగా – స్వరాజ్యమొచ్చేదాకా ఓపిక పట్టకుండా ఎందుకు తొందరపడ్డారన్న ఎకసెక్క మొకటి! మహాత్ముడు మరీ అంత దారుణంగా మాట్లాడాడా అని మీ అనుమానమా? 1921

ఆగస్టు 25న 'చీరాల-పేరాల' పేరిట **'యంగ్ ఇండియా'** పత్రికలో గాంధీజీ రాసిన వ్యాసంలో ఈ ముక్తాయింపును ఆలకించండి.

"The brave people of Chirala - Perala have challenged the Government to do its worst and refused to have a municipality. They need not have done so. They might have waited for Swaraj. But they chose to do otherwise. The responsibility is entirely theirs. They may not yield in any circumstance whatsoever... They must cheerfully let the Government subject them to any penalty... By their meek and unyielding suffering they will cover themselves and India with glory."

[*Collected Works of Mahatma Gandhi,* Vol. 24, # 80, P. 135]

(ధైర్యశాలురైన చీరాల-పేరాల ప్రజలు ప్రభుత్వాన్ని ఏమైనా చేసుకోమని సవాలుచేసి మునిసిపాలిటీని ప్రతిఘటించారు. వారు అట్లా చేసి ఉండనవసరం లేదు. స్వరాజ్యం వచ్చే వరకూ ఆగి ఉండవలసింది. కాని వారు అన్యథా నిశ్చయించుకున్నారు. అందుకు బాధ్యత పూర్తిగా వారిదే. ఇక వారు ఎట్టి పరిస్థితిలోనూ లొంగకుందురు గాక !... ప్రభుత్వం తమకు ఎలాంటి పెనాల్టీ వేసినా సంతోషంతో ఉండవలె... వారు లొంగిపోకుండా వినయంతో బాధలు అనుభవించడం వల్ల తమకూ ఇండియాకూ కూడా కీర్తి సంపాదిస్తారు.)

బాధపడేది తాను కాదు కనుక - ఎన్ని బాధలనైనా సంతోషంగా పడమని ప్రజలకు బోధించడం బాగానే ఉంది. కాని ప్రతిఘటనకు బాధ్యత యావత్తూ ప్రజలదేనని మహాత్ముడు తేల్చిపడేశాడేమిటి? వారినా ప్రతిఘటనకు పురికొల్పింది ఆయనేకదా? ఇష్టం లేకపోతే ఊరొదిలిపోవచ్చని సలహా ఇచ్చింది ఆయన కాదా?

ఔను. ఆయనే. ఆ సంగతి రెండేళ్ల తరవాత (24-4-1924) **'యంగ్ ఇండియా'** పత్రికలోనే రాసిన ఇంకో వ్యాసంలో గాంధీజీయే ఇలా ధ్రువీకరించారు:

Let me quote one case in which I had the honour of advising. I refer to the case of Chirala Perala. The Citizens claim was they were a united body and prepared to suffer... I said that I could not advise the congress or the public to give pecuniary support. I could not advise the Congress even to encourage them by passing resolutions. If they won, the Congress could claim credit for the success of the means adopted by it. If they failed the Congress will share no discredit. The people understood and accepted the advice.

[Ibid, Vol. 27, #269, P. 286]

(నాకు సలహా ఇచ్చిన గౌరవం దక్కిన ఒక ఉదంతాన్ని ఉదాహరిస్తాను. నేను చీరాల-పేరాలను ప్రస్తావిస్తున్నాను. అక్కడి పౌరులు చెప్పుకున్నదేమంటే తామంతా ఐక్యంగా ఉన్నామనీ, బాధలకు సిద్ధమయ్యామనీనూ !... మీకు ఆర్థికంగా తోడ్పడమని కాంగ్రెసుకు గాని, ప్రజలకు గాని చెప్పలేనని నేనన్నాను. వారిని ప్రోత్సహిస్తూ తీర్మానాలు చెయ్యమని కూడా కాంగ్రెసుకు చెప్పలేననీ అన్నాను. వారు కనుక గెలిస్తే, ఆ విజయానికి కాంగ్రెసు కీర్తి పొందుతుంది. విఫలమైతే మాత్రం ఆ అపకీర్తిని కాంగ్రెసు పంచుకోదు- అని చెప్పాను. ప్రజలు అర్థంచేసుకుని నా సలహాను స్వీకరించారు)

ఈ మాటల్లోని మెలికను, మహాత్ముడి పలాయన మనస్తత్వాన్ని అర్థంచేసుకోలేని వెర్రిజనం ఆయనమీద ఎనలేని భక్తితో, ఆయన ఆశీర్వాదం తమకుందన్న భరోసాతో నిప్పుల్లోకి దూకి ఒళ్లు కాల్చుకున్నారు. పదకొండు నెలలు ధీరోదాత్తంగా పోరాడినా ఎవరూ ఆదుకోక, ఎటునుంచీ సహాయం అందక, దారుణ దమనకాండను ఎదుర్కొని ఎదుర్కొని శక్తులుడిగి, నిస్పృహ చెంది చివరికి సామాన్లు సర్దుకుని పాత ఊరికే మళ్లీ తరలి వెళ్లారు. ప్రభుత్వ నిరంకుశ పీడనకు నిస్సహాయ దుస్థితిలో విధిలేక తలవంచారు.

అదే తప్పంటారు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు గారు.

"సంఘర్షణ ఇల్లా ఒకటి రెండు సంవత్సరాలపాటు సాగిన తర్వాత పాలకుల పట్టుదలకే ప్రజలు తల ఒగ్గవలసి వచ్చింది. ఇది అనుశ్రుతంగా వస్తూ వున్న హైందవ దుర్బలతా పరిణామం, ఇంకా కొంతకాలం యీ పోరాటం ప్రజలు సాగించగలిగి ఉంటే, ప్రభుత్వం వారు కాళ్లబేరానికి దిగకుండా ఉండగలిగేవారు కారు. ప్రజలలో రవ్వంత ఆత్మశక్తి లోపించిన కారణంగా విజయం సాధించలేకపోయారు"

[నా *జీవిత యాత్ర*, టంగుటూరి ప్రకాశం, పేజి 190]

ప్రజలకు ఆత్మశక్తి లోపించటానికి తమ బాధ్యత ఎంతన్నది ప్రకాశంగారు ఆలోచించినట్టు లేదు. ఒకటి రెండేళ్లపాటు సాగించిన పోరాటాన్ని విధి లేక విరమించి, పాలకుల పట్టుదలకు ప్రజలు తల ఒగ్గవలసి వచ్చింది 'ఆంధ్రకేసరి' గారన్నట్టు 'హైందవ దుర్బలత' వల్లకాదు. ఆపత్కాలంలో ప్రజలు వెన్నంటి నిలిచి ముందుకు నడిపించలేని ఆంధ్ర కాంగ్రెసు నాయకుల దౌర్బల్యంవల్ల ! దానికి మించి - వారు నమ్ముకున్న మహానాయకుడి మహా రాజకీయ దౌర్బల్యంవల్ల !

పల్నాటి యుద్ధం

ఒక్క సుముహూర్తాన ఉప్పొంగి భరతోర్వి
స్వాతంత్ర్య శంఖము సింహనాదము చేయ
మేరువై నిలిచిందిరా - పలనాడు
ముందుండి పోరిందిరా!
కనెగంటి హనుమంతు కోరమీసముద్రిప్పి
పలనాటి ప్రజలచే పన్నులెగబెట్టించె
బలి ఇచ్చె హనుమంతునూ పలనాడు
పర ప్రభుత్వపు గుండ్లకూ ! **- పి. వి. శివయ్య**

పలనాడు సీమ వీరులకు జన్మభూమి. పౌరుషానికి పెట్టింది పేరు. ఎటొచ్చీ బతుకుతెరువుకే లోటు.

చిన్న చిన్న రాళ్లు చిల్లర దేవుళ్లు నాగులేటి నీళ్లు నాపరాళ్లు
సజ్జజొన్న కూళ్లు సర్పంబులును తేళ్లు పల్లెనాటి సీమ పల్లెటూళ్లు

–అని ప్రసిద్ధ చాటువులో వర్ణించిన శ్రీనాధుడు ఐదు శతాబ్దాల తరవాత 1920ల్లో పలనాడును దర్శించినా అదే మాట అనేవాడు. లేదా - ఇంకా దారుణమైన దృశ్యాన్ని కళ్లకు కట్టించి ఉండేవాడు. ఎందుకంటే ఫ్యూడల్ రాజుల కాలంపోయి పరాయి దేశస్థుల పెత్తనం వచ్చాక పల్నాడు పరిస్థితి పెనం మీంచి పొయ్యిలో పడ్డట్టయింది.

అసలే నీటి పారుదల వసతులు తక్కువ. ఎక్కడ చూసినా రాళ్లగుట్టలు, గులకరాళ్లు, బీడు భూములే దర్శనమిస్తుంటాయి. 1876-78 నాటి కరువులో మల మల మాడి వందల ప్రాణాలు పోయాయి. ఆ పీడకల మరపున పడకుండానే 1919 నుంచి వరసగా మూడేళ్లు తీవ్ర దుర్భిక్షం తాండవించింది. తినడానికి తిండి లేక పల్నాటి ప్రజలు ఆకులూ, అలాలూ, బెరడూ, దుంపలూ, రేగిపండ్లు తిని పొట్టపోసుకున్నారు. దారుణ దురవస్థలకు

లోనైన జనానికి, వారి పశువులకు చుట్టుపట్ల అడవులు కొంతవరకు ఆదుకున్నాయి. కీకారణ్యాలు కాకపోయినా వాటిలో సరిపడినంత పశుగ్రాసం దొరికేది. అలా పశుపోషణ చేసుకుని జీవయాత్ర సాగించడానికి కూడా బ్రిటిషు ప్రభుత్వం అడ్డుతగిలింది. అడవుల్లో చాలా భాగాన్ని రిజర్వు ఫారెస్టుగా ప్రకటించి, వాటిలోకి పశువులను తోలుకోవడానికి 'పుల్లరి' సుంకాన్ని విపరీతంగా విధించింది. ప్రకృతిసిద్ధమైన అటవీ సంపదను ప్రజలు అనుభవించకుండా అడ్డమైన ఆంక్షలు పెట్టింది.

అడవుల్లో పశువుల్ని మేపుకోవడానికి వీల్లేదు. వంట పుల్లలు ఏరుకోవడానికి వీల్లేదు. వ్యవసాయ పనిముట్లకు అవసరమైన కలపకొయ్యలను కొట్టి తెచ్చుకోవడానికి వీల్లేదు. అడవుల్లోని నీటి వనరులను వాడుకోవటానికి వీల్లేదు. ఒక ఆవును అడవిలో మేపుకోవాలంటే 12 అణాల ఫీజు చెల్లించి పర్మిటు పొందాలి. అది కూడా ఫలానా అటవీ ప్రాంతానికి మాత్రమే చెల్లుతుంది. అక్కడ గడ్డిగాదం బాగోలేక వేరే ప్రాంతంలో గొడ్డును మేపాలంటే ఇంకో 12 అణాల రుసుము కట్టి ఇంకో పర్మిటు పొందాలి. ఈ నిబంధనలు సడలించాలని, ఒక్కో పశువుకు మూడణాల చొప్పున వసూలు చేయాలని, ఒకే పర్మిటుపై జిల్లాలోని ఏ అడవిలోనైనా మేపుకోనివ్వాలని, మోపెడు కట్టె పుల్లల చార్జిని అర్ధణాకు తగ్గించాలని పల్నాడు రైతులు పదే పదే ప్రార్థించారు. సర్కారువారు దయతలచలేదు. పైగా లంచగొండులైన ఉద్యోగులు ప్రజల్ని పిశాచాల్లా పీడించేవారు. లంచాలు ఇవ్వకపోతే కేసులుపెట్టి వేధించేవారు. పొట్ట గడవక పస్తులుంటున్నా సరే రకరకాల పన్నులు కడతారా చస్తారా అని గొంతు మీద కూచునేవారు. కట్టకపోతే ఇంట్లోని చెంబూ, తప్పాలా కూడా వదలకుండా గుంజుకుపోయేవారు. నోరెత్తితే తిట్టి, కొట్టి జైల్లో వేసేవారు.

ఇలా అడుగడుగునా అగచాట్లు పడుతూ, సర్కారీ సతాయింపులకు విసిగి వేసారిన ప్రజలకు నాగపూర్ కాంగ్రెసులో మహాత్ముడు పూరించిన సహాయ నిరాకరణ శంఖం వీనుల విందు చేసింది. కష్టాలు గట్టెక్కేందుకు దారితోచక కొట్టుమిట్టాడుతున్న వారికి ఆశాదీపం కనిపించింది. కొత్త ఉత్సాహం ఉబికింది. గోలి మల్లికార్జునశాస్త్రి, నాళం మట్టుపల్లి శ్రేష్ఠి, చినగాంధి తదితర కాంగ్రెసు ప్రముఖులు సహాయ నిరాకరణ ప్రాశస్త్యాన్ని నలుదిశలా వ్యాప్తి చేశారు. గుంటూరు మండల కాంగ్రెసు కమిటీ కూడా పలనాటి సమస్యలపై శ్రద్ధ చూపించసాగింది. ఇక నుంచి పుల్లరి వ్యతిరేకోద్యమాన్ని కాంగ్రెసు నాయకత్వం కింద సాగించాలని గుంటూరు మండల కాంగ్రెసు సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. పలనాడులో శాసనోల్లంఘనానికి ప్రజలను సమాయత్తపరచడానికి ముప్ఫై మంది కార్యకర్తలనక్కడికి పంపాలని గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీ నిశ్చయించింది.

ఈ పరిణామాలను గమనించాక బ్రిటిషు ప్రభుత్వ వైఖరి మరింత కరకుబారింది. కట్టగల స్తోమత ఉందా లేదా అన్నది చూడకుండా సుంకాలను గోళ్లూడగొట్టి వసూలు చేయసాగడంతో చాలామంది పేదలు పుల్లరి చెల్లించలేక పశువులను కారుచవకగా తెగ నమ్ముకుని, భిక్షాటనకు దిగారు. అటవీ శాఖ అధికారులు పగబట్టినట్టు పెట్టిన కేసుల నుంచి బయటపడటానికి చాలా ఊళ్లవాళ్లు ఉన్న సొమ్మునంతా ప్లీడర్ల ఫీజులకు సమర్పించుకున్నారు. రెవిన్యూ అధికారులు పోలీసు బలగంతో ఊళ్లమీద పడి పన్ను బకాయిలను పన్నెండు గంటల్లోగా కట్టాలని, లేని పక్షంలో పొలాలను, గొడ్లను వేలం వేస్తామని బెదరించారు. ఇలా రకరకాల వేధింపులతో జనానికి సహనం నశించిన స్థితిలో 1921 ఆగస్టు 15, 16, 17 తేదీలలో కారెంపూడిలో పలనాడు రాజకీయ సదస్సు జరిగింది. అన్ని గ్రామాల నుంచి వేలాది జనం హాజరయ్యారు. సాధకబాధకాలను చర్చించిన మీదట ప్రభుత్వం దిగిరావాలంటే ప్రభుత్వాధికారులను సాంఘిక బహిష్కరణ చేయడమే మార్గమని సమావేశం నిర్ణయించింది. చిరకాలంగా పడుతున్న పాట్లకు పల్నాటివాసులకో పరిష్కారం దొరికింది.

ఫలితం? మాచర్లలోనూ చుట్టుపట్ల గ్రామాల్లోనూ సర్కారీ ఉద్యోగులకు క్షురకులు, రజకులు సేవచేయలేదు. దుకాణాలవారు వెచ్చాలు ఇవ్వలేదు. మాచర్ల తాసిల్దారు ఎంత ప్రయత్నించినా తన పిల్లలకు పాలు సంపాదించలేకపోయాడు. ఊరంతా నౌకర్లని పరుగెత్తించినా కలెక్టరు దొరవారికి కప్పెడు కాఫీ తెప్పించలేకపోయాడు. మాచర్ల ఊరి బయట క్యాంపు చేసిన జిల్లా కలెక్టరుకు ఎక్కడా గుడ్లు దొరకక, జవానులను పంపి గుంటూరు నుంచి తెప్పించుకున్నాడు. పూటకూళ్లవాళ్లు కట్టు కట్టినందువల్ల మాచర్లలో ఎక్కడా రెవిన్యూ, అటవీ శాఖ ఉద్యోగులకు తిండి దొరకలేదు. సామాన్లతో గుంటూరుకు తిరిగి వెళ్లటానికి బండ్లు దొరకలేదు. కలెక్టరుకు, జిల్లా పోలీసు సూపర్నెంటుకు నిత్యావసర వస్తువులను సరఫరాలు జరగడం, బండ్లు దొరకడం అసాధ్యమైందని మద్రాసు గవర్నమెంటు చీఫ్ సెక్రటరీకి 1922 ఫిబ్రవరి 25న పంపిన రిపోర్టులో జిల్లా కలెక్టరు మొత్తుకున్నాడు. సాంఘిక వెలి ఎంత గట్టిగా అమలైందో దీన్నిబట్టే ఊహించవచ్చు.

చుట్టుపట్ల పల్లెల్లోనూ ఇదే పరిస్థితి. ప్రభుత్వోద్యోగులెవరికీ ఊళ్లలో ఉప్పు పుట్టలేదు. మహాత్ముడి ఆజ్ఞ అయిందా లేదా, కాంగ్రెసు అనుమతి ఇచ్చిందా లేదా అని తటపటాయించకుండా పలనాటి జనం తామే చొరవ తీసుకుని అధికారుల వెలితోబాటు పన్నుల నిరాకరణ ఉద్యమం మొదలెట్టారు. (అదే సమయంలో అదే జిల్లాలోని పెదనందిపాడు ఫిర్కాలో పన్నుల నిరాకరణ అప్పటికే ఉద్ధృతంగా సాగుతున్నది.) పల్నాడు పల్లెల్లో జనం పుల్లరి కట్టడం పూర్తిగా మానేశారు. అడవులలోకి వదిలిన పశువులను అధికారులు అడ్డగించి బందెలకు తోలితే గ్రామస్థులు బలప్రయోగంతో వాటిని

విడిపించుకున్నారు. జట్టిపాలెం, జంగమేశ్వరపురం మూతుకూరు వగైరా గ్రామాల్లో ఇలాంటి ఘర్షణలు చాలా జరిగాయి. అటవీ నిబంధనలను జనం యథేచ్ఛగా ఉల్లంఘించారు. "పల్నాడులో చాల్లా గ్రామాలు స్వరాజ్యాన్ని ప్రకటించుకున్నాయ"ని జిల్లా కలెక్టరే అంగీకరించాడు. అప్పుడే కాదు. అంతకుముందు ఇంకో సందర్భంలోనూ అదే కలెక్టరు దొరవారికి దిమ్మతిరిగేలా "స్వరాజ్యం" కళ్లముందు సాక్షాత్కరించింది. ఆ ముచ్చటను 'దేశభక్త' కొండ వెంకటప్పయ్య గారు ఇలా వివరించారు :

మాచర్లలో దండోరా వేయించుటకు కలెక్టరు గ్రామ మునసబును పిలిపించి, తప్పెటను తెప్పించుమని కోరగా, ఆయన కొంత తడవు ఆగి, మరల కలెక్టరుగారి యొద్దకు వచ్చి, తప్పెటలు చినిగిపోయినవని తప్పెటల వాండ్రు చెప్పుచున్నారుగాన తప్పెట దొరకలేదని మనవి చేసెనట. కాని శ్రీ లక్ష్మీనారాయణ పంతులుగారు హాజరైననాడు వారిని గజ్జెలగుర్రము మీద నెక్కించుకొని, తప్పెటలు మోగించుచు, ఊరేగింపుతో ప్రజలు కలెక్టరుగారి దేరా యొద్ద దింపిరి, తాను ఒక తప్పెట కావలెననిన లేదని, నేడు ఇన్ని తప్పెటలతో ఊరేగించుచు వచ్చుట తలపోసి, ఆ ప్రజల యుత్సాహోద్రేకములు చూచి, *(They say that Swaraj will come someday, but now I see Swaraj around me)* "ఎప్పుడో స్వరాజ్యము వచ్చునందురు. ఇదుగో ! ఇప్పుడేనా చుట్టును స్వరాజ్యము కన్పించుచున్న"దని బిగ్గరగ పల్కెనట.

[స్వీయచరిత్ర - కొండ వెంకటప్పయ్య పంతులు, పేజి 232]

ఈ ఘట్టంలో పేర్కొన్న లక్ష్మీనారాయణ పంతులు ఎవరోకాదు. 'మాలపల్లి' రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు ఉన్నవ లక్ష్మీనారాయణగారే. మహోద్ధృతంగా సాగుతున్న పుల్లరి సత్యాగ్రహాన్ని పలనాడులో పరిస్థితిని కూలంకషంగా పరిశీలించి, నివేదికను సమర్పించడానికి ఆయనను, మాడభూషి వేదాంతం నరసింహాచారిని రాష్ట్ర కాంగ్రెసు కమిటీ నియోగించింది. ఇద్దరు పెద్దలు పలనాడులో విస్తృతంగా పర్యటించి, ప్రజల ఇబ్బందుల గురించి విచారణ జరిపారు. అదే సమయంలో గుంటూరు జిల్లా కలెక్టర్ మాచర్ల మకాంలో ఉన్నాడని విని, ప్రజల కష్టాలు ఆయనకు విన్నవిద్దామని లక్ష్మీనారాయణగారు మాచర్ల వెళ్లారు. ఆయన చెప్పేది విని కలెక్టరు న్యాయం చెయ్యకపోగా, అసలు మీరే జనాన్ని రెచ్చగొడుతున్నారు. గొడవకంతటికీ మీరే కారణం, అని గయ్యిమన్నాడు. ఇకనుంచీ బుద్ధిగా మెలగుతామని పూచీకత్తు ఇస్తారా, జైల్లో వెయ్యమంటారా అని ఇద్దరు నాయకులకు తాఖీదు పంపాడు. హామీలు, జామీన్లు ఇవ్వటం కాంగ్రెసు పద్ధతి కాదని వారు నిరాకరించారు. దానిమీద సమన్లు పంపించి, కోర్టుకు పిలిపించినప్పుడు జరిగిందే పై ముచ్చట.

సత్ప్రవర్తనకు పూచీకత్తు ఇవ్వనిరాకరించిన ఇద్దరు దేశభక్తులను బ్రిటిషు దొరతనం చెరి సంవత్సరం కారాగారశిక్ష విధించింది. ఆ సంగతి తెలిసి జనం ఉగ్రులయ్యారు. దుర్మార్గపు అరెస్టులను ఖండిస్తూ గుంటూరు జిల్లా అంతటా సభలు జరిగాయి. నరసరావుపేట, బాపట్ల, ఒంగోలు, ఇంకా అనేక పట్టణాల్లో అన్ని కొట్లు కట్టేశారు. కోర్టులు, స్కూళ్లు నిర్మానుష్యమయ్యాయి. గుంటూరు పట్టణంలోనైతే వరసగా ఆరు రోజులపాటు పూర్తి హర్తాళ్ జరిగింది. కొండ వెంకటప్పయ్య, గొల్లపూడి సీతారామశాస్త్రి, నడింపల్లి నరసింహారావు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య తదితర పెద్దలు ఆరు రోజులూ ఊరంతా తిరిగి చక్కని క్రమశిక్షణతో సంపూర్ణ హర్తాళ్ చేయించారు. ఈ పనిలో ఉండగానే కొండ వెంకటప్పయ్యను తప్పుడు అభియోగంపై అరెస్టు చేశారు. గుంటూరు పట్టణంలో డిప్యూటీ కలెక్టరు మీద దాడి జరగకుండా ఉద్రిక్తులైన గుంపులను ఆయన అడ్డుకుని, రక్తంకారేలా రాళ్లదెబ్బలు తినగా... ఆయన కాపాడిన అధికారే ఆయన మీద దొమ్మీ కేసు పెట్టి ఖైదులో వేయించాడు. దాంతో ఆంధ్రదేశమంతటా సంచలనం బయలుదేరిందని, న్యాయస్థానాలు చీకటికొట్లు అయ్యాయని, అరెస్టయిన నలుగురికోసం నలభైవేలమంది జైలుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని 'కృష్ణాపత్రిక' పెద్ద వ్యాసం ప్రచురించింది.

దేశమంతా అట్టుడికి పోయింది. సరే, అందరికీ గురువు, మార్గదర్శి, పోరాటానికి మూల స్ఫూర్తి అయిన గాంధీగారు ఈ పరిణామాలకు ఎలా స్పందించారు? అదీ - వెంకటప్పయ్య మాటల్లోనే వినండి.

"ఈ సంఘటనలు పట్టణములోన, దేశమంతట మితిలేని కలవరము కలగజేసెను. ప్రజలలో ఆవేశము ప్రబలమయ్యెను. మహాత్ములు కార్యవర్గ సభలో కూర్చుండియుండగా నన్ను జయిలులో పెట్టిరనువార్త వినిరట. వెంటనే ఉత్సాహముతో యించుక లేచి "I wish he were shot down" అని పల్కెనట. (ఈ విషయం శ్రీ టంగుటూరి ప్రకాశము పంతులుగారు బొంబాయి సభలో నుండినందున, వారు చెప్పిరి)

[స్వీయ చరిత్ర, పేజి 245]

తననే నమ్ముకున్న తన శిష్యుడు తాను బోధించిన పద్ధతిలో ప్రజలను కూడగట్టి, అహింసాత్మకంగా పోరాడి, జైలుకెళ్లాడంటే ఏ నాయకుడైనా బాధపడాలికదా? అతడి వెనుక నిలిచిన కార్యకర్తలకు ధైర్యం చెప్పి ప్రభుత్వ దమనకాండపై ధర్మాగ్రహం వెలిబుచ్చాలికదా? మరి మన బాపూజీ అలా చేయకపోగా "భలే భలే! బాగా అయింది, అతణ్ని కాల్చేసి ఉంటే ఇంకా బాగుండేది" అని ఉత్సాహపడ్డారేమిటి?

దీనికి అయ్యదేవర కాళేశ్వరరావుగారు (**నా జీవిత కథ,** పుట 338) ఇచ్చిన టిప్పణి ఏమిటంటే - వెంకటప్పయ్య ఆత్మార్పణతో దేశ స్వాతంత్ర్యం కోసం కనివిని ఎరుగని రాజకీయ సంచలనం, మహత్తర చైతన్యం బయలుదేరుతుందన్న ఉద్దేశంతోటే గాంధీజీ ఆ విధంగా అన్నారని !

అంటే - జనంలో కనివిని ఎరుగని రాజకీయ సంచలనం వస్తే చాలు - ఆప్త సహచరుడు చచ్చినా చింత లేదన్నమాట. అయ్యో! అరెస్టు మాత్రమే అయ్యావా ? కాల్పుల్లో అమరవీరుడివైతే ఇంకా బాగుండేదే... అని దీవించటమే నాయకుడి లక్షణమన్నమాట! మహాత్ముడంతటివాడు అన్నాడు కనక అదే కరక్టని నమ్ముదాం. వెంకటప్పయ్యకు 'అమరవీరుడ'య్యే అదృష్టం లేకపోయింది. కాని - ఆ భాగ్యం పల్నాటివీరుడు కన్నెగంటి హనుమంతుకు దక్కింది. గాంధీగారి 'దీవెన' అతడి విషయంలో నిజమైంది.

హనుమంతు కోలగట్ల గ్రామ పెద్ద. చుట్టుపక్కల పది ఊళ్లలో మంచి పలుకుబడి ఉన్న సంపన్న రైతు. పుల్లరి సత్యాగ్రహంలో ప్రముఖపాత్ర వహించాడు. పుల్లరి ఎగగొట్టాలని తమను సాంఘికంగా వెలివేశారని ప్రజలపై కక్షగట్టిన ఫారెస్టు, రెవిన్యూ అధికారులు పలనాడు అంతటా చెలరేగి నానా బీభత్సం సాగిస్తూ ఒక రోజు కోలగట్ల శివారులోని మించాలపాడు మీద పడ్డారు. అది 1922 ఫిబ్రవరి 26. అమావాశ్య. అసిస్టెంటు కన్సర్వేటరు, రేంజరు, 14 మంది ఫారెస్టు గార్డులు, 20 మంది రిజర్వు పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టారు. ఊరిబయట బావిదగ్గరికి జనాన్ని పిలిపించి 'మీరు పుల్లరి కట్టలేదు. మీ పశువులను బందెలకు తోలుతాం, మీ ఆస్తులు జప్తు చేస్తాం' అని బెదరించారు. ఊరిపెద్ద హనుమంతు 'ఆ పని చేయొద్దు. ఊరి పుల్లరి యావత్తూ నేనే మీకు కడతాను. పశువుల్ని మాత్రం పట్టుకోకండి' అని పరి పరి విధాల వేడుకున్నాడు. అధికారులు వినలేదు. సర్కారునే ధిక్కరిస్తారా మీకెన్ని గుండెలు అని రంకెలు వేస్తూ జనాన్ని హడలగొట్టి నానా ఆగం చేశారు. 120 గేదెలను, 50 మేకలను బంధించి దుర్గి బందెల దొడ్డికి సాయంత్రం తరలించుకుపోతుండగా ఊరిజనం వద్దని ప్రాధేయపడుతూ వెంటపడ్డారు.

ఆ తరువాత ఏమి జరిగిందో - అనంతర కాలంలో కాంగ్రెసు తరఫున గద్దె రంగయ్య నాయుడి దర్యాప్తులో ఐదుగురు ప్రత్యక్ష సాక్షులిచ్చిన వాఙ్మూలంలో చదవండి:

"ఇంతలో పశువులను తోలుకొని మా వూరి తూర్పున వున్న పీతిరివాగువద్దకు పోలీసు వారు చేరిరి. హనుమంతు అల్లుడు పసుపులేటి చెన్నయ్య 'నా పాడిగేదెనైనా విడిచిపెట్టుడు' అని తన గేదె కొమ్ము పట్టి లాగెను. అందుపై ఒక పోలీసు కానిస్టేబుల్ అతడిని తుపాకి మడిమెతో రెండుపోట్లు పొడిచెను. అచ్చటనున్న ఒక ఆడమనిషి 'ఓ

హనుమంతు ! నీ అల్లుడిని చంపిర'ని కేకవేసెను. అంతట బజారులో చింతచెట్టువద్ద నిలిచివున్న హనుమంతు ఆ స్థలమునకు పోయి 'మీరు ఆ పసివానిని ఎందుకు కొట్టితిరి? పుల్లరి అంతయు నేనే కట్టెదను. పశువులను విడువుడు' అని కుడిచేయి ఎత్తి చెప్పుచుండగా యిరువది ముప్పది తుపాకులు పోలీసులు కాల్చిరి. వానిలో ఒక గుండుబారు కుడి చేతికి తగిలి చెయ్యిదండ విరిగినది. 'అయ్యా, యికనైనా కాల్చవద్దు' అని యెడమ చెయ్యి ఎత్తి చెప్పుచుండగా మరియొక రవ్వలబారు యెడమ డొక్కలో తగిలెను. అంతట ఆయనకింద పడిపోయెను. దాహము, దాహమని అరచెను... హనుమంతుగారి భార్య గంగమ్మగారు చంటిబిడ్డను చంకన వుంచుకొని చెంబుతో నీళ్లుతీసుకొని వెళ్లగా నీవు వచ్చిన యెడల కాల్చెదమని పోలీసులు బెదిరించిరి... తెల్లవారుసరికి కలెక్టర్, సూపర్నెంటు మొదలగువారు గుర్రపు సిపాయిలతో గ్రామమును ముట్టడివేసి వూరులో వుండు వారందరిని పిలిపించి కూర్చుండబెట్టిరి. అంతట పోలీసువారు గ్రామములోనికి ప్రవేశించి దోపిడీలు చేసిరి..."

[గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం - మాదల వీరభద్రరావు పుటలు 71-72]

సాయంత్రం 6 గంటలకు కాల్పులు జరిగితే అర్ధరాత్రి 12 గంటలకు గానీ కన్నెగంటి హనుమంతు ప్రాణంపోలేదు. శరీరంలో 26 బుల్లెట్లు దూరి యమయాతన పడుతూ నెత్తురు మడుగులో 'దాహం దాహం' అని ఎంత అరచినా అధికారులు దయతలచ లేదు. వైద్య సహాయం అందించే ప్రయత్నం చెయ్యలేదు. నోట్లో గుక్కెడు నీళ్లు కూడా ఎవరినీ పోయనివ్వలేదు.

హనుమంతు తాగుబోతు అనీ, విధి నిర్వహణ చేస్తున్న అధికారిపై తాగి, దొమ్మీకి వస్తే ఆత్మ రక్షణార్థం అతడిని పోలీసులు కాల్చవలసి వచ్చిందని జిల్లా కలెక్టరు షరామామూలుగా చెప్పుకున్నాడు. అది పచ్చి అబద్ధం. హనుమంతు దగ్గరకాని, ఇతర గ్రామస్థుల దగ్గర కాని ఏ ఆయుధమూ లేదు, కనీసం కర్రలు కూడా లేవు. హనుమంతు చివరిదాకా శాంతంగా, సౌమ్యంగా వ్యవహరించి, నిష్కారణంగా ప్రాణాలు కోల్పోయాడు. ఆ సంగతి కాంగ్రెసు వారి విచారణలోనే తేలింది. మరి స్వాతంత్ర్య పోరాటానికి ఊపురావటం కోసం కొండ వెంకటప్పయ్య ఆత్మార్పణ చేసి ఉండాల్సిందని ఉత్సాహపడ్డ మహాత్ముడు... సరిగ్గా తాను కోరుకున్న రీతిలో కన్నెగంటి హనుమంతు చేసిన ఆత్మబలిదానానికి ఎలా స్పందించాడు? ఎంత ఘనంగా నివాళి నర్పించాడు?

ఘన నివాళి సంగతి దేవుడెరుగు. గాంధీగారి మాటల్లోగాని, రాతల్లోగాని ఎక్కడా హనుమంతు ఊసే కానరాదు. ఆ పేరుగల వాడొకడు ఉన్నాడన్న సంగతే బహుశా ఆయనకు తెలిసి ఉండదు. అంతటి జాతీయ మహానాయకుడికి ఓ మారుమూల తెలుగుపల్లెలో తూటాలకు నేలకొరిగిన సామాన్యుడి పేరు తెలిసి ఉండకపోతే

విస్తుపోనక్కరలేదు. కాని - పల్నాడు యుద్ధం గురించీ, పుల్లరి సత్యాగ్రహం గురించీ, కన్నెగంటి హనుమంతు ఆత్మార్పణ గురించీ ప్రత్యేక విచారణ జరిపించి మరీ తెలుసుకున్న ఆంధ్ర కాంగ్రెసువారు ఏమి చేశారు? అమర వీరుడికి ఎటువంటి జోహారు అర్పించారు?

శవపరీక్ష అనంతరం హనుమంతు భౌతికకాయాన్ని పోలీసులు కొలగట్ల గ్రామశివారులో పూడ్చివేస్తే నాలుగురోజుల తరువాత కుటుంబీకులు శవాన్ని తవ్వితీసి, ఉత్తరక్రియల అనంతరం దొంతలవాగు ఒడ్డున ఖననం చేశారు. సమాధివద్ద స్మారక శిలాశాసనాన్ని వేశారు. ఆ శాసనం పత్రికల్లో ప్రకటించబడి విస్తృత ప్రచారం పొందటంతో 1923 జనవరి 22న సర్కారీభటులు ఆ శాసనాన్ని ముక్కలుచేసి తుప్పల్లో వేశారు. ఆ దుశ్చర్యను ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు యథావిధిగా ఖండించింది. పాతఫలకాన్ని అధికారులు ఏవిధంగా ధ్వంసం చేసిందీ ఉటంకిస్తూ సమాధిపై కొత్త ఫలకాన్ని తిరిగి వేయించాలనీ... దాన్నీ అధికారులు అడ్డుకుంటే సత్యాగ్రహం చేసైనా ప్రజాహక్కుల్ని కాపాడుకోవాలనీ రాష్ట్ర కమిటీని కోరుతూ 1923 డిసెంబరు 16న కాకినాడలో చక్కని తీర్మానమైతే చేసింది. దాన్ని అమలుచేయటం మాత్రం ఎంచక్కా మరచిపోయింది.

'పలనాటి వీరహనుమంతు'గా బుర్రకథలలోకి, జంగం కథలలోకి ఎక్కి జానపదుల నోళ్లలో అమరత్వాన్ని ఆర్జించుకున్న హనుమంతు తన సమాధి మీద శిలాఫలకానికి మాత్రం నోచుకోలేకపోయాడు. అతడితోబాటే పల్నాడు పోరాటమూ కాంగ్రెస్ పెద్దల 'సహాయనిరాకరణ' కారణంగా నీరసించి, నీరుగారింది. కాంగ్రెసువారూ, జాతీయ నాయకులూ మీనమేషాలు లెక్కిస్తూ కూచుంటే ప్రజలే చొరవతీసుకుని విదేశీ దొరతనపు కర్కశపాలనపై సంఘటితంగా పోరాడటం ఏ రకంగా చూసినా అపురూప ఘటన. తమకు కొరవడిన పోరాట పటిమను పలనాడు వాసులు కనపరచిన తరవాతైనా కలసివచ్చి వారి పోరుకు బాసటగా నిలవడం కాంగ్రెసు నేతల కనీస బాధ్యత. అలా చేయవలసింది పోయి, మహాత్ముడి నుంచి అనుమతి రాలేదు; కాంగ్రెసు అధికారికంగా నిర్ణయంచేయలేదు కాబట్టి మీరు పన్నుల నిరాకరణను సాగించటం మంచిదికాదు, మానండి, మానండి - అని వారించి, ఉద్యమాన్ని నీరుగార్చటానికి కాంగ్రెసు పెద్దలు ఎనలేని శ్రద్ధ చూపారు. పైపై ఇచ్చకాలకైతే కొదవలేదు గానీ- ప్రజాపోరాటానికి వారు మనస్ఫూర్తిగా సహకరించారనటానికి గట్టి దాఖలా ఒక్కటీ లేదు. బార్డోలీ ప్రహసనం దరిమిలా దేశమంతటా సహాయ నిరాకరణోద్యమాన్ని ఆపివేయమని మహాత్ముడు శాసించటంతో పుల్లరి సత్యాగ్రహం అర్ధంతరంగా అకాలమృత్యువు పాలైంది. పల్నాడు ప్రజల పోరాటపటిమ ఉజ్వల స్మృతిగా మిగిలింది.

పెదనందిపాడు విప్లవం

***పొ**లిమేరలకు చేరేసరికే అర్థమైంది రూథర్‌ఫర్డుకు - అది మామూలు ఊరుకాదనీ; వారు సామాన్య పల్లెజనమూ కారనీ ! థామస్ రూథర్‌ఫర్డు అల్లాటప్పా అధికారికాదు. గుంటూరు జిల్లాకు అడిషనల్ కలెక్టరు. చండ శాసనుడు. మన్యంలో అల్లూరి సీతారామరాజు విప్లవాన్ని అణచడానికి బ్రిటిషు సర్కారు రెండేళ్ల తరవాత స్పెషలాఫీసరుగా నియమించబోయేది అతడినే !*

ప్రస్తుతం పన్నుల నిరాకరణోద్యమం ఉధృతంగా సాగుతున్న గుంటూరు జిల్లాలో, ముఖ్యంగా ఆ ఉద్యమానికి కేంద్ర బిందువైన పెదనందిపాడు ఫిర్కాలో జనం గోళ్లూడగొట్టి పన్నులు వసూలు చేయడానికి స్పెషల్ డూటీ మీద ఉన్నాడు.

అంత పెద్ద దొర మందీ మార్బలంతో ఆర్భాటంగా వచ్చినా ఎవరూ లక్ష్యపెట్టలేదు. 'పెదనందిపాడు ఇదేనా' అని ఊరి బయట కనపడ్డవారిని అడిగితే 'ఏమో, మాకు తెలియదు' అన్నారు. 'మిలిటరీ దండు ఎక్కడ మకాం చేసిందయ్యా' అంటే 'మేమెరుగ'మని జవాబు. 'మునసబు ఇల్లు ఎక్కడ' అంటే ముందుకెళ్లి విచారించుకోమంటారే తప్ప ఎవరూ గుర్తులు చెప్పరు. అంతా గప్‌చుప్. సర్కారీ అధికారులు పిలిచినా ఎవరూ పోరు. పలకరించినా పలకరు. సర్కారుకు సంబంధించిన వారెవరికీ అప్పు కూడా పుట్టనివ్వరు. మొగాన కాసిని మంచినీళ్లయినా పొయ్యరు.

వీళ్లతో లెక్కేమిటి, తల ఎగరేసేవారి పొగరు ఎలా దించాలో నాకు తెలుసు అనుకున్నాడు రూథర్‌ఫర్డ్. అది అంత తేలిక కాదని కాసేపటికే అతడికి బోధపడింది. వచ్చిన పని పన్ను బకాయిలు వసూలు చేయడం. అది చేయాలంటే ముందు ఎవరి బకాయి ఎంతో తెలియాలి. ఆ లెక్కలు గ్రామ మునసబు దగ్గర ఉంటాయి. లేదా కరణాన్ని అడగాలి. మునసబూ, కరణమూ ఇద్దరూ జాడలేరు. ఇరుగుపొరుగు గ్రామాల ఉద్యోగుల సహాయం తీసుకుందామా అంటే అన్ని ఊళ్లలో అదే పరిస్థితి. పెదనందిపాడు

ఫిర్కాలోని మొత్తం గ్రామాల కరణాలూ, మునసబులూ సహాయ నిరాకరణోద్యమంలో చేరిపోయారు. చందవోలు గ్రామకరణం మాచిరాజు రామమూర్తి చొరవ తీసుకుని, పన్నుల నిరాకరణోద్యమం నడిపిస్తున్న పర్వతనేని వీరయ్య చౌదరితో కలిసి ఫిర్కా అంతా తిరిగి గ్రామాధికారులచేత కాడికింద పారేయించాడు. బాపట్ల తాలూకాలోని మిగతా ఫిర్కాల్లోనూ, సమీపాన ఒంగోలు తాలూకాలో కూడా గ్రామాధికారుల సమ్మె చాలా చోట్లకు పాకింది. మొత్తం గుంటూరు జిల్లాలో జమాబందీ పెద్ద సమస్యగా మారింది. శిస్తులు, పన్నులు లెక్కవేసి, వసూలుచేయవలసిన గ్రామాధికారులే వాటిని ఎగవేయమని చెప్పటంతో గవర్నమెంటుకు ఆదాయం బాగా తగ్గిపోయింది. మరీ ముఖ్యంగా పెదనందిపాడు ఫిర్కా తెల్ల సర్కారుకు పెద్ద సవాలుగా మారింది. జిల్లా కలెక్టరు, పోలీసు సూపర్నెంటు సైనికాధికారులు పెదనందిపాడులో తిష్టవేసి ఫిర్కాలోని రైతులను అదిలించి, బెదిరించి ఎంత ప్రయత్నించినా చిల్లిగవ్వకూడా వసూలు చేయలేకపోయారు. అందుకే గండరగండడైన రూథర్‌ఫర్డును ఉద్యమం వెన్ను విరిచి, జనాన్ని లొంగదీయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా పంపించింది.

ఆ దొరగారు ఆలస్యం చెయ్యకుండా తన ప్రతాపం చూపించే పనిలో దిగాడు. కరణాలు, మునసబులు సమ్మెకట్టి, జనాన్ని రెచ్చగొట్టినంతమాత్రాన మనం భయపడ తామా? వాళ్ల వత్తాసుతో పన్నులు ఎగ్గొట్టిన జనాన్ని మనమెందుకు వదులుతాం? వెంటనే ఎగవేతదారుల ఇళ్లమీద పడండి. వాళ్ల స్థిరచరాస్తులన్నీ జప్తుచేయండి- అని తన కింది అధికారులకు ఆనతిచ్చాడు.

వారు 'కుదరదండి' అన్నారు. "ఇంతకుముందు సబ్ కలెక్టర్ అక్బర్ హైదరీగారు, తాసీల్దారు సోమయాజులుగారు, ఈ మధ్య మదరాసు నుంచి వచ్చిన హారిస్ దొరవారు కూడా ఇలాగే చెప్పారండి. కాని ఏమీ చేయలేకపోయాం. ఆస్తులు స్వాధీనం చేసుకోవాలంటే అసలు ఆ ఇల్లు ఎవరిదో ముందు తెలియాలి కదండి? ఇక్కడ ఇళ్ల నెంబర్లన్నీ చెరిపేశారు. వాకబుచేస్తే ఎవరూ ఏమీ చెప్పరండి. మాకేమీ తెలియదనే ప్రతివారూ చెబుతారు. ఇళ్ల తలుపులు తట్టినా ఎవరూ పలకరు. లోపల మనుషులు ఉన్న అలికిడీ కనిపించదండి. చాలా ఇళ్లకు గొళ్లాలు పెట్టి ఉంటాయండి..." అంటూ చాలా చెప్పుకొచ్చారు.

రూథర్‌ఫర్డుకు చిర్రెత్తింది. 'పదండి చెబుతా'అన్నాడు. తరవాత అతడు ఏమి చెప్పాడో, ఏమి చూశాడో అతడి మాటల్లోనే వింటే బాగుంటుంది. ఆనక మద్రాసు గవర్నమెంటు చీఫ్ సెక్రటరీకి 1922 జనవరి 26న పంపిన రిపోర్టులో రూథర్‌ఫర్డు ఇలా రాశాడు :

"...The village Munsifs have resigned and the karanam is the leader of the movement. The village menials were absent... A crowd of volunteers in uniform and with lathis hung in the background and if anyone was seen speaking to me or the peon there were shouts of don't say anything and a volunteer would come lounging up... Nobody would say where the defaulters were living... All doors were closed. The first house was empty and on the door being opened, nothing was found. In the next house the women marched out and the owner refused to appear. Grain had to be attached, and the measuring of it, tying up and marking of bags, writing attachment lists took two hours. The Reserve Police had to do all the coolie work."

(గ్రామ మునసబు రాజీనామా చేశారు. కరణమే ఉద్యమానికి నాయకుడు. వెట్టి మోతాదులు కూడా ఎక్కడా కనబడలేదు. ఎక్కడకెళ్లినా వలంటీర్లు తప్ప ఎవరూ కనిపించలేదు... యూనిఫాం వేసుకుని లాఠీలు పట్టిన వలంటీర్ల గుంపు దూరంగా ఉండి అంతా కనిపెడుతుండేది. నాతో గాని, బంట్రోతుతోగాని ఎవరైనా మాట్లాడబోతే 'ఏమీ చెప్పవద్దు' అని వెనకనుంచి కేకలు వినిపించేవి. వెంటనే ఒక వలంటీరు పరుగెత్తుకు వచ్చేవాడు. పన్నులు ఎగ్గొట్టినవాళ్లు ఎక్కడుంటారని అడిగితే ఎవరూ చెప్పరు... ఇళ్ల తలుపులన్నీమూసి ఉన్నాయి. మొదటి ఇల్లు ఖాళీగా ఉంది. తలుపు తెరచి చూస్తే లోపల ఏమీ దొరకలేదు. తరవాతి ఇంట్లో మేము అడుగుపెట్టగానే స్త్రీలు బిల బిల మంటూ బయటికి వచ్చారు. ఇంటి యజమాని కబురు పెట్టినా రాను పొమ్మన్నాడు. గాదెల్లోని ధాన్యం జప్తు చేశాం. దాన్ని కొలవటానికి, బస్తాలకెత్తి మూతులు కట్టటానికి, జప్తు జాబితా తయారుచేయటానికి రెండు గంటలు పట్టింది. గ్రామ నౌకర్లు లేనందున రిజర్వు పోలీసులే కూలి పనులన్నీ చేయాల్సి వచ్చింది.)

పై వారికిచ్చిన రిపోర్టులో రాసుకోలేదు గాని - జప్తులు చేయటంలో రూథర్‌ఫర్డు మహా కర్కశంగా వ్యవహరించాడు. పోలీసులను వెంటేసుకుని ఇళ్లమీద పడి, దౌర్జన్యంగా ధాన్యం బస్తాలు బయట వేయించి, పశువులను కట్టుతాళ్లు విప్పి తోలేసి, బండబూతులు తిట్టి, భయపెట్టి, అవమానించి నానావిధాల వేధించాడు. శిస్తులు కట్టలేదని మోతుబరిరైతుల ఆస్తులు జప్తు చేశారు. కాని వాటిని కొనే దిక్కులేకపోయింది. జిల్లా బయటివారిచేత, ఉద్యోగుల చేత వేలంపాటలో కొట్టేయించుకోవలసి వచ్చింది. జప్తు చేసిన చరాస్థులను చేరవేయడానికి కూలీలెవరూ రాలేదు. ఎవరూ బండ్లు కట్టలేదు. పోలీసులూ, రెవిన్యూ సిబ్బందే వాటిని నెత్తిన మోసుకుని పోవాల్సి వచ్చేది. అధికారుల దాడుల్లో, భూములు, ధాన్యం, వంట పాత్రలు, కలప, పశువులు... ఇలా ఒకటేమిటి...

అధికారుల కళ్లబడినవన్నీ జప్తు అవుతుండేవి. ఇది గమనించి... రొక్కం, ఆభరణాలు, విలువైన వస్తువులు ఏదీ ఇళ్లలో పెట్టవద్దు. వంట పాత్రలు మినహా ఏవీ దగ్గర ఉంచుకోవద్దు అని చుట్టుపట్ల గ్రామస్థులకు శాంతిసేన వలంటీర్లు సూచనలిచ్చారు. ఇంట్లో ఏమీ దొరకక కోట సుందరమ్మ అనే మహిళ మెడలో మంగళ సూత్రాలను గుంజుకోబోతే ఆ ఇల్లాలు రెండడుగులు వెనక్కివేసి, తానే ఆ దండను తీసి తాసిల్దారు మొహాన విసిరింది.

ఇళ్లలో ధాన్యం, సామాన్లు జప్తుచేసినా జనం బెదరక పోయేసరికి రూథర్‌ఫర్డు భూములు లాక్కుని వేలం వేయసాగాడు. శిస్తు బకాయిలను వసూలుచేయటానికి భూములు వేలం వేయటం అంతకుముందు కనీ వినీ ఎరుగనిది. తరతరాలుగా తాము అనుబంధం పెంచుకున్న భూములను తమ కళ్లముందే అమ్మివేస్తుంటే తట్టుకోలేక ఎగవేతదారులు తోకముడిచి దారికి వస్తారని దొరల ఎత్తుగడ. అదీ పారలేదు. కారుచవకగా అమ్ముతామన్నా ఆ భూములను కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. దాంతో దొరలు తాము ఆరితేరిన 'విభజించు పాలించే' నీతిని అమల్లో పెట్టారు. జప్తు చేసిన భూములను వేలంలో కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోతే ప్రభుత్వమే నామమాత్రపు ధరకు కొని ఆ భూములను బడుగువర్గాల వారికి పంచి పెడుతుందన్నారు. తేరగా భూములిస్తాం తరలిరండని ఊరూరా దండోరా వేశారు. ఆశ్చర్యం! ఉచితంగా ఇస్తామన్నా పొలాలను, పశువులను స్వీకరించడానికి దళితులు, నిరుపేదలు ఎక్కడో తప్ప ముందుకు రాలేదు.

పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని నీరుగార్చడానికి రూథర్‌ఫర్డు సామదాన భేద దండోపాయాలన్నీ ప్రయోగించాడు. సమ్మెకట్టిన కరణాలు, మునసబులను టోకున బర్తరఫ్ చేశాడు. వారి వంశపారంపర్య హక్కులను రద్దుచేశాడు. వారిస్థానే తమకు తాబేదారులుగా ఉండే కొందరు మహమ్మదీయులను, హరిజనులను మునసబులుగా నియమించాడు. ముస్లింలు ఉద్యమంలో పాల్గొనకుండా చూడటానికి తురక పోలీసు సబ్ ఇన్స్‌పెక్టరును ఆ ప్రాంతంలో నియమించాడు. ఉద్యమాన్ని నడిపిస్తున్న వీరయ్యచౌదరి కమ్మ కాబట్టి... రెవిన్యూ ఇన్స్‌స్పెక్టరుగా ఉన్న ఒక కమ్మ వాడికి అమాంతం డిప్యూటీ కలెక్టరుగా ప్రమోషనిచ్చి ఆ ప్రాంతంలో పన్ను వసూళ్లకు పురమాయించాడు. తాగుడుకు బానిసలైన కొంతమంది రైతులను లోబరుచుకుని, వారి శిస్తు బకాయిలను సర్కారీ సొమ్ముతో కట్టించాడు. వాళ్లు తమంతట తామే వచ్చి పన్ను కట్టినట్టు ప్రచారం చేయించి ప్రజల నిబ్బరం చెడగొట్ట జూశాడు. ఇలాంటి వేషాలు ఎన్ని వేసినా నెల రోజులు కష్టపడ్డా ఉద్యమ స్ఫూర్తి సన్నగిల్లలేదు. 5 శాతం పన్ను బకాయిలు కూడా వసూలు కాలేదు.

రూథర్‌ఫర్డు ఇంకా రెచ్చిపోయి నిర్బంధకాండను ఇంకా తీవ్రతరం చేశాడు. మరఫిరంగులను తెచ్చి పెదనందిపాడు ఫిర్కాలో మోహరించాడు. పన్నులు కట్టకపోతే ఆ ప్రాంతమంతటినీ భస్మీపటలం చేస్తానని బెదిరించాడు. సైన్యాన్ని రంగంలోకి దింపి జనం హడలిపోయేలా సైనిక కవాతులు జరిపించాడు. ప్రజల ప్రతిఘటన మరీ ఎక్కువగా ఉన్నచోట్ల మర తుపాకులకు తోడు శతఘ్నిదళాలనూ తరలించాడు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడకపోయినా, శాంతి భద్రతలకు ఎలాంటి భంగం కలిగించక పోయినా శాంతి సేనను నిషేధించాడు. కనపడ్డవారిని కనపడ్డట్టు అరెస్టుచేసి, దూర ప్రాంతాలకు తరలించాడు. పోలీసు బలగాలను భారీ ఎత్తున దింపాడు. ఊళ్లమీద, ఇళ్లమీద పడి అడ్డమైన జబర్దస్తీ చేయమని సైనికులను, పోలీసులను ఉసిగొలిపాడు. అరెస్టులూ, లారీచార్జీలూ, అమాయకుల చిత్రహింసలు పిచ్చెత్తినట్టు సాగించాడు. జనాన్ని కాల్చుకు తినే బలగాలను మేపడానికయ్యే ఖర్చంతా జనమే భరించాలని ఉత్తర్వు చేశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే రెండేళ్ల తరవాత మన్యంలో అల్లూరి సీతారామరాజు ఉద్యమాన్ని అణచడానికి తాను అనుసరించబోయే దమన నీతినంతటినీ రూథర్‌ఫర్డు పరిమిత స్థాయిలో పెదనందిపాడు పోరాటంపై ప్రయోగించాడు. అయినా విఫలమయ్యాడు.

సాధారణంగా ఏ ఉద్యమాన్నయినా కార్యకర్తలు నడిపిస్తారు. ప్రజలు సాక్షీభూతంగా ఉంటారు. ఉద్యమానికి జనం నైతిక మద్దతు, సానుభూతి ఎంత ఉన్నప్పటికీ రంగంలో ఉండి బాహాటంగా పోరాడేది ముఖ్య కార్యకర్తలే. పెదనందిపాడు పోరాటం ఇందుకు భిన్నం. అక్కడ కార్యకర్తలు తెరవెనక ఉండగా తెరముందు పాత్రధారులై పోరాటాన్ని నడిపించింది సామాన్య ప్రజలు. నాలుగు వేలమంది శాంతిసేన వలంటీర్లు కావలసిన హంగులను సమకూర్చి సూత్రధారులుగా వ్యవహరించినా రంగంలో నిలిచి, సర్కారీ దమనకాండను తట్టుకుని సర్వస్వం పణంపెట్టి సాధారణ కుటుంబీకులు ధైర్యంగా పోరాడారు. శాంతియుతంగా, సంపూర్ణంగా సాగిపోతున్న పన్నుల నిరాకరణోద్యమాన్ని దెబ్బతీయటానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను చూసి, ప్రజలు హడలిపోలేదు. వారి పోరాట దీక్ష సన్నగిల్లలేదు. ప్రభుత్వం మిలిటరీ, అశ్వికదళం, శతఘ్ని శకటాలు, జప్తులు, వేలాలు, అరెస్టులు ఇత్యాది దమన విధానాలు ఎన్ని ప్రయోగించినా ప్రజల ప్రతిఘటన భగ్నంకాలేదు. తుపాకుల అట్టహాసాలకు, అధికారుల ఆర్భాటాలకు వారి గుండె జారలేదు. దుద్దుకూరులో ఉద్యమం తీవ్రంగా నడుస్తున్న కాలంలో ఒంగోలు సబ్ కలెక్టరు ముప్పాళ్ల గ్రామానికి వెళ్లి ఒక రైతునుంచి స్వాధీనపరచుకున్న వస్తువులను పెట్టెలో పెట్టి బండిలోకెక్కించి తిరిగిపోతుండగా చిగురుపాటి చిన్నమ్మి అనే ఇల్లాలు వెంటపడి, బండిని అడ్డుకుంది. తమ పెట్టెను తనకు అప్పగిస్తే గానీ కదలనిచ్చేది లేదంది. ఆమె రౌద్రాన్ని, ఆవేశాన్ని చూసి సబ్ కలెక్టరు నివ్వెరపోయి పెట్టెను ఆమెకు ఇచ్చి వట్టి

చేతులతో తిరిగిపోయాడు. ఒక సాధారణ పల్లె ఇల్లాలి ధర్మాగ్రహానికి మహాశక్తివంతమైన బ్రిటిషు ప్రభుత్వాధికారమే గజగజలాడిన ఈ సంఘటనను బట్టే నాటి పోరాట పటిమ ఎలాంటిదో అర్థంచేసుకోవచ్చు.

గుంటూరు జిల్లాను ఊపేసిన పన్నుల నిరాకరణ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు మనస్ఫూర్తిగా పాల్గొన్నారు. వారిలో వారికి కులభేదాలు లేవు. మతాల తారతమ్యం లేదు. చదువుసంధ్యలు లేని సామాన్య ప్రజలు, నిరుపేదలు, స్వాతంత్ర్యంకోసం కష్టనష్టాలు లెక్కచెయ్యక రవి అస్తమించడనే మహాసామ్రాజ్యాన్ని నిర్భయంగా ఎదిరించారు. ఉద్యమానికి దారిచూపిన పుణ్యం కొండ వెంకటప్పయ్యది అయినా నడిపించిన చేయి పాశ్చాత్య విద్య అబ్బని పక్కా గ్రామీణుడు, రైతుబిడ్డ పర్వతనేని వీరయ్యచౌదరిది. 'ఆంధ్రా శివాజీ'గా పేరుపడ్డ ఆ మహనీయుడి కార్యదక్షత గొప్పది. మామూలు మట్టిమనుషులతో గట్టి సేనను నిర్మించి అహింసే ఆయుధంగా వీరయ్యచౌదరి గొప్పపోరు సాగించాడు. గ్రామాల్లో వంద గజాల కొకరు చొప్పున ఆయన నిలబెట్టిన శాంతి సైనికులే ఉద్యమానికి కళ్లు, చెవులు అయ్యారు. కొట్టినా, తిట్టినా, ఆఖరికి మిలిటరీ మదాంధులు మొగంమీద ఉమ్మినా, ఎన్ని బాధలు పెట్టినా ఓరిమి కోల్పోక నిశ్చలంగా నిలబడి అహర్నిశలూ కాపలాకాసే ధీరత్వాన్ని వారికి, ప్రజలకు అలవరిచాడు. పొద్దున్నే గుర్రమెక్కి రోజుకు ఐదారు గ్రామాలు తిరుగుతూ, ఎక్కడా సంఘర్షణలు లేకుండా జాగ్రత్త పడుతూ, శాంతి సైనికుల ద్వారా ఎప్పటికప్పుడు వర్తమానాలు అందుకుంటూ, ప్రజలు సహనం కోల్పోయి గొడవపడ్డ చోట ప్రత్యక్షమై సకాలంలో ఘర్షణను నివారిస్తూ, అధికారులకు, సర్కారీఉద్యోగులకు ఎవరూ సహకరించ కుండా సాంఘిక బహిష్కరణను అత్యద్భుతంగా అమలుపరుస్తూ వీరయ్యచౌదరి చూపిన నాయకత్వ ప్రజ్ఞ జాతీయోద్యమంలో కలకాలం గుర్తుండే ఉజ్జ్వలగాథ.

ప్రభుత్వం పశుబలం ప్రయోగించి ఎంత రెచ్చగొట్టినా ఎక్కడా ప్రతిహింసకు పాల్పడకుండా అద్భుత సంయమనం చూపి, అహింసా వ్రతానికి నిశ్చలంగా కట్టుబడ్డ ఈ ప్రజా ఉద్యమ ఉద్ధృతి బ్రిటిషు సామ్రాజ్యం పునాదులనే ఊపేసింది.

At present the Collector of Guntur considers the situation in Guntur District very serious and likely to develop rapidly unless strong measures are taken very quickly. The collector of Kistna realises that if the movement is not suppressed in Guntur, the infection will very soon affect Kistna. The movement is usually referred to as non-co-operation or civil disobedience, it would be more appropriately described as attempted revolution; its express object is to subvert the existing Government.

(ప్రస్తుతం గుంటూరు జిల్లాలో పరిస్థితి మహా తీవ్రంగా ఉన్నదని, అవశ్యం గట్టి చర్యలు తీసుకోకపోతే త్వరితగతిన విషమిస్తుందని గుంటూరు కలెక్టరు భావిస్తున్నాడు. గుంటూరులో ఉద్యమాన్ని అణచివెయ్యకపోతే ఆ జాడ్యం అతి త్వరలో కృష్ణాకు సోకుతుందని కృష్ణా కలెక్టరు గుర్తించాడు. సహాయ నిరాకరణ అని, శాసనోల్లంఘనమని ఈ ఉద్యమాన్ని సాధారణంగా పరిగణిస్తున్నా దీన్ని విప్లవం తెచ్చే ప్రయత్నంగానే భావించటం సముచితం. ఇప్పుడున్న ప్రభుత్వానికి విద్రోహం తలపెట్టడమే దీనిధ్యేయం) - అని రెవిన్యూ బోర్డు మెంబర్ హారిస్ మద్రాసు ప్రభుత్వానికి 1922 ఆరంభంలో ఇచ్చిన నివేదికే పన్నుల నిరాకరణ పోరాట తీవ్రతకు కితాబు.

ఇంచుమించు ప్రజా విప్లవంగానే గుర్తించి, ఎలాగైనా అణచివెయ్యాలని ఎంతగా తహతహలాడినా ప్రజల కృతనిశ్చయాన్ని నీరుగార్చటం రూథర్‌ఫర్డువల్ల కాలేదు. కలెక్టరు వల్ల కాలేదు. గవర్నరువల్ల, వైస్రాయివల్ల, ఆఖరికి లండనులోని ఇంపీరియల్ గవర్నమెంటు వల్లా కాలేదు. పరాయి ప్రభుత్వానికి ఎన్ని తంటాలు పడ్డా సాధ్యంకాని పనిని - నమ్ముతారో లేదో - మన జాతీయ మహానాయకుడే అవలీలగా సుసాధ్యం చేశాడు. మహోద్ధృతంగా, ధర్మబద్ధంగా, నిఖిల ప్రపంచానికి స్ఫూర్తిదాయకంగా సాగిన మహా పోరాటాన్ని పాపభీతి లేకుండా బలవంతంగా చంపేశాడు. ఆ మహానుభావుడి పేరు ఎం.కె. గాంధీ. ఆయనా, పరమానందయ్య శిష్యుల్లాంటి ఆంధ్ర కాంగ్రెసు నాయకులూ కలిసి ఈ ఘనకార్యాన్ని సాధించిన తీరు పరమాద్భుతం.

వద్దొద్దు! ఆపెయ్యండి !!

***గాం**ధీ గారంటే అనుచరులకు, సహచరులకు ఎంత భక్తో అంత భయం ! భయమెందుకంటే ఎప్పుడు ఏ మెరపు నిర్ణయం చేసి కొంపముంచు తాడో... ఉవ్వెత్తున సాగుతున్న ఉద్యమాన్ని ఉన్నట్టుండి ఎక్కడ ఆపేస్తాడోనని! ఆయన బుద్ధి ఎప్పుడు ఎలా పనిచేసి ఆయనను, తమను ఎక్కడికి తీసుకు పోతుందోనని అయనకు అత్యంత ఆప్తులైన మహానాయకులే లోలోన హడలి పోయేవారు. జవహర్లాల్ నెహ్రూ ఐతే "మిమ్మల్ని చూస్తే భయం వేస్తుంది. ఇన్నేళ్ల సాహచర్యంలో కూడా మీ తత్వాన్ని అర్థం చేసుకోలేక పోతున్నా. మీ ఆకస్మిక నిర్ణయాల తీరును తలచుకుంటేనే నాకు నిలువెల్లా ఆందోళన కలుతుతోంది" అని గాంధీగారి మొగంమీదే అనేశాడు.*

గాంధీజీని ఎరిగినవారు, ఆయన తత్వం తెలిసినవారు, ఆయన జీవిత చరిత్రలు రాసిన వారు అందరూ ఆయన వైరుధ్యాల పుట్ట; మెరపు నిర్ణయాల్లో దిట్ట అన్న విషయంలో ఏకీభవిస్తారు. నిజానికి ఆయన పోకడలో అంతుబట్టనిదీ, నివ్వెరపోవలసిందీ ఏమీలేదు. గాంధీజీ చపలచిత్తుడని చాలామంది అనుకుంటారు కాని - కాదు ! కళ్లు మిరుమిట్లు గొలిపేలా ఆయన చుట్టూ ఆవరించిన మహాత్మా తేజో వలయాన్ని దాటి నిశితంగా గమనిస్తే జీవితంలో ఆయన వేసిన ప్రతి అడుగులోనూ, చేసిన ప్రతి నిర్ణయంలోనూ గొప్ప నిలకడ కనబడుతుంది. అసలు మనిషిని గుర్తుపడితే ఒళ్లు జలదరిస్తుంది. గాంధీ యథార్థతత్వం అర్థమైతే... ఆయన అప్పుడు అలా ఎందుకు చేశాడా అని ఆశ్చర్యం కలగకపోగా... ఆయన అలాగే చేస్తాడు. ఆ సందర్భంలో అలాకాక ఇంకో విధంగా ఆయన వ్యవహరించే వీలే లేదు... అని మనమే గ్రహిస్తాం.

గాంధీగారు దేశాన్ని ఉద్ధరించటానికే ఉద్భవించాడు; స్వరాజ్యం కోసమే తపించాడు; స్వాతంత్ర్యం సాధించటానికే తహతహలాడాడు; రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యంపై అహింసే ఆయుధంగా అకుంఠిత దీక్షతో నిజాయతీగా, నియమబద్ధంగా ధర్మపోరాటం సాగించాడు. ఇదీ సాధారణంగా దేశవాసులందరూ అనుకున్నది; ఇప్పటికీ అనుకుంటు

న్నది. అందుకే – అంతటి జాతీయోద్యమ సారథి, స్వాతంత్ర్య సేనాధిపతి... ప్రతిసారీ యుద్ధం మధ్యలో పోరాటం ఎందుకు ఆపేశాడా అని అందరికీ ఆశ్చర్యం! జన చైతన్యం వెల్లువెత్తి, ప్రచండ ప్రజా ఉద్యమం ధాటికి తెల్లవాడు గిజగిజలాడుతుంటే... అదే పట్టును ఇంకొంతకాలం అలాగే బిగించి ఉంచితే ప్రజలకు అద్భుత విజయం తథ్యమనుకుంటున్న సమయంలో మన సర్వ సైన్యాధ్యక్షుడే చేతులెత్తేసి, పట్టు సడలించి, శత్రువును సంకటం నుంచి బయట వేయించటం ఎందుకు జరిగిందా అని మనకు తికమక! అందుకు మహాత్ముడు చెప్పిన కారణాలు అపౌరుషేయంగా, మహోదాత్తంగా మనకు కనిపించినా, ధ్వనించినా... ఆయనంతటివాడు అన్నాడు కాబట్టి అదే కరక్టు, మనకే అర్థంచేసుకునే స్థాయి లేదు అని ఎంత సరిపుచ్చుకున్నా... మనసు కుదుట పడక ఏదో తెలియని వ్యాకులత ! సరికాదనిపించినా... మహాత్ముడి నడవడిని కలనైనా శంకించలేని భక్తితత్పరత! ఈ ద్వైధీభావాన్ని వివరించలేకే గాంధీజీ గొప్ప మిస్టరీ అని పెద్దలందరూ చెప్పేది.

కాని– ఒకసారి భక్తిపారవశ్యాన్ని ప్రక్కనపెట్టి... గాంధీ కూడా మామూలు మనిషే, ఆయనా అందరిలాంటి రాజకీయ నాయకుడే అనుకుని చూడండి. ఇంతకాలమూ మనం అనుకుంటున్నది వేరు; గాంధీగారి అసలు అజండా వేరు; ఆయన బ్రిటిషువారికి వీరాభిమాని; వారి సామ్రాజ్యాన్ని సంరక్షించడానికే, వారి ప్రయోజనాలను కాపాడటానికే జీవితాంతం పాటుపడ్డాడు... అని మాటవరసకు ఒక్కమారు అనుకుని చరిత్ర సింహావలోకనం చెయ్యండి. కొత్త గాంధీ మీకు పొడగడతాడు. ప్రజా కంటక విదేశీ ప్రభుత్వంపై ప్రజలు ఉద్యమించినప్పుడు జాతీయోద్యమ నాయకుడికి ప్రాథమిక విధేయత ప్రజల పక్షాన ఉంటే ఉద్యమాన్ని సాధ్యమైనంత తీవ్రతరం చేసి పాలకుల పీచమణుస్తాడు. అదే పాలకులకు విధేయుడైతే ఉద్యమం తీవ్రతరం కాకుండా ఎప్పటికప్పుడు చన్నీళ్లు చల్లి చల్లార్చి, పాలకవర్గాన్ని శాయశక్తులా సంకటంనుంచి బయటవేస్తూ వట్టిమాటలతో కాలక్షేపం చేస్తూ జనాన్ని మభ్యపెడుతుంటాడు. గాంధీగారు ఇందులో రెండోరకం. అసలైన అదనులో తన ఉద్యమాన్ని తానే హఠాత్తుగా ఆపేసి, ప్రజాప్రతిఘటనను నిష్కారణంగా నీరుగార్చి, పాలకుల నెత్తిన పాలు పొయ్యటంలో ఆయనకు ఆయనే సాటి. నమ్మిన జనాన్ని నట్టేట ముంచటంలో ఆయనది విలక్షణ శైలి! ఈ విద్యలో ఆయనది ఎప్పుడూ ఒకటే పద్ధతి.

ఆ పద్ధతి ఏమిటో తెలుసుకోవాలంటే ఎక్కడిదాకానో ఎందుకు? మన పెద నందిపాడు పోరాటాన్ని గాంధీగారు పట్టుబట్టి, పనిగట్టుకుని ఎలా గుటుక్కు మనిపించిందీ జాగ్రత్తగా గమనిస్తే చాలు. చేసేది చేస్తూనే చిక్కకుండా దొరక్కుండా పాదరసంలా తప్పించుకోవటం గాంధీ ప్రత్యేకత. ఆయన నిర్వాకంవల్ల దేశానికి, ఉద్యమానికి ఎంత అనర్థం వాటిల్లినా ఆయన అధిష్ఠించిన హిమాలయ సమాన సత్యపీఠం నుంచి అవలోకిస్తే

ఆయన చేసిందే కరక్టు- అని గాంధీ భక్తులు విసుగు లేకుండా వాదించగలరు... ఒక్క పెదనందిపాడు విషయంలో తప్ప! సంశయలాభానికి రవ్వంతయినా ఆస్కారం లేకుండా ఆయన రెడ్ హాండెడ్‌గా దొరికిపోయేది జాతీయోద్యమం మొత్తంమీద ఇక్కడ ఒక్కచోటే. మహామేధావులకే మతులు పోగొట్టిన 'గాంధీ మిస్టరీ' తాళాన్ని విడదీయడానికి పెదనందిపాడే తాళం చెవి. ఇంతటి ప్రాధాన్యం ఉంది కనుకే దీన్నే కేస్‌స్టడీగా తీసుకుని కీలక ఘట్టాల్లో గాంధీ గారి భూమికను కొంచెం వివరంగా పరిశీలిద్దాం.

1922 మొదట్లో పెదనందిపాడు ఫిర్కాలో పన్నుల నిరాకరణ సాగిన కాలంలోనే అదే గుంటూరు జిల్లాలో చీరాల పుర బహిష్కరణోద్యమమూ, పల్నాడు పుల్లరి సత్యాగ్రహమూ సహాయ నిరాకరణోద్యమంలో భాగంగా కొద్దిమాసాల తేడాలో నడిచాయి. అవి కూడా గాంధీ, ఆయన అనుయాయుల సహాయ నిరాకరణవల్లే ఘోరవైఫల్యం చెందాయి. వాటి విషయంలో తమ సహాయ నిరాకరణను సమర్థించుకోవడానికి కాంగ్రెసువారికి ఎంతో కొంత వీలుంది. అవి అసహాయోద్యమమిచ్చిన ఉత్తేజంతో స్థానిక కాంగ్రెసు వాదులు చొరవ తీసుకుని మొదలెట్టినవే తప్ప కాంగ్రెసు పార్టీ పరంగా జరిగిన పోరాటాలు కావు. తమ ప్రమేయం లేకుండా ఆరంభించినప్పుడు వాటిని కొనసాగించడంలో మాత్రం తమ ప్రమేయం ఎందుకు ఉండాలనీ... వాటి బాగోగులకూ, పర్యవసానాలకూ తామెందుకు బాధ్యత వహించాలనీ కాంగ్రెసువారు ప్రశ్నిస్తే తప్పులేదు. మీ పోరాటం ఫలిస్తే కాంగ్రెసుకు కీర్తి వస్తుంది. విఫలమైతే మాత్రం ఆ అపకీర్తి కాంగ్రెసుకు చెందదు- అని చీరాలవారికి గాంధీ మహాత్ముడు తెలివిగా మెలిక పెట్టింది కూడా స్థానిక వర్గాల అత్యుత్సాహపు ప్రతికూల ప్రభావమేదీ కాంగ్రెసు సంస్థపై పడనీయరాదన్న అతి జాగ్రత్తతోనేనని సరిపుచ్చుకోవచ్చు. పెదనందిపాడు వ్యవహారం అందుకుభిన్నం. అక్కడ జరిగింది కాంగ్రెసే తలపెట్టి, మహాత్ముడి అనుమతితో కాంగ్రెసే నడిపించిన నూటికి నూరుపాళ్ల గాంధీయ ఉద్యమం.

1921 సంవత్సరమంతా దేశవ్యాప్తంగా సహాయ నిరాకరణోద్యమం చాలా బాగా నడిచింది. దాదాపు 20 వేల మంది వ్యష్టిశాసనోల్లంఘన జరిపి జైళ్లకెళ్లారు. వారి సంఖ్య అతి త్వరలో 30 వేలకు పెరుగుతుందని అనుకుంటున్నారు. గాంధీ మినహా జాతీయ నాయకులందరూ ఖైదులో ఉన్నారు. ప్రజల ఉత్సాహం పోరాట పాటవం అద్భుతంగా ఉన్నా తరువాత ఏమిటి, ఏమి చేయాలి, ఎక్కడికి చేరాలి అన్న విషయంలో ఎవరికీ స్పష్టతలేదు. సంవత్సరంలో వచ్చి తీరుతుందని గాంధీగారు హామీఇచ్చిన స్వరాజ్యం ఆయన పెట్టిన గడువు మరికొద్ది వారాల్లో ముగియవచ్చినా కనుచూపు మేరలో లేదు. ఆ నగుబాటును ఎలా తప్పించుకోవాలి? ప్రజల్లో పొంగులెత్తిన స్వాతంత్ర్య దీక్షకు ఏ దారి చూపించాలి అని అందరూ మథనపడుతున్న సమయాన 1921 నవంబరు

5న ఎ.ఐ.సి.సి. ఢిల్లీలో సమావేశమైంది. పన్నుల నిరాకరణోద్యమం చేపట్టే విషయాన్ని విస్తృతంగా చర్చించి ఎన్నో నియమ నిబంధనలను రూపొందించింది. వాటికి లోబడి పన్నుల నిరాకరణతో సహా సమష్టి శాసనోల్లంఘనం చేపట్టటానికి రాష్ట్రాల కాంగ్రెసు కమిటీలకు అధికారం ఇచ్చింది.

ఆ నిబంధనలేమిటంటే – శాసనోల్లంఘనం చేయదలచిన వ్యక్తి సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని పాటించి ఉండాలి. నూలు వడకటం చేతనయి ఉండాలి. విదేశీ దుస్తులను వదిలేసి ఖద్దరునే ధరిస్తుండాలి. హిందూ–ముస్లిం ఐక్యతలో విశ్వాసం కలిగి ఉండాలి. అహింసకు కట్టుబడాలి. హిందువు అయినట్లయితే తాను అంటరానితనాన్ని జాతికి కళంకంగా భావిస్తున్నానని ఆచరణ ద్వారా రుజువు చేసుకోవాలి. సమష్టి శాసనోల్లంఘన విషయంలో ఒక జిల్లాను లేక తహసీల్‌ను యూనిటుగా భావించాలి. ఆ యూనిట్‌లోని జనాభాలో ఎక్కువ శాతం సహాయ నిరాకరణోద్యమ సిద్ధాంతాలలో పూర్తి విశ్వాసం కలిగి ఉండాలి.

ఈ తీర్మానం చేసే సమయంలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు 'దేశభక్త' కొండ వెంకటప్పయ్యగారు ఎఐసిసి సభావేదిక మీద గాంధీగారి పక్కనే కూర్చుని ఉన్నారు. కొంతమంది సభ్యులు లేవనెత్తిన ఆక్షేపణలను, అనుమానాలను నివృత్తి చేసి తీర్మానం ఆమోదింపజేయటానికి ఆయన చొరవ తీసుకుని సహాయపడ్డాడు. వెనక్కి తిరిగి రాగానే ఆయనా, ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి గొల్లపూడి సీతారామశాస్త్రిగారూ మాట్లాడుకుని తమ సొంత జిల్లా గుంటూరును పన్నుల నిరాకరణకు సిద్ధపరచాలని నిశ్చయించారు.

ఉద్యమం మొదలెట్టాలంటే ముందుగా మహాత్ముడు పెట్టించిన కండిషన్లు నెరవేరితీరాలి. ఉద్యమంలో పాల్గొనే అర్హతను కార్యకర్తలు, ప్రజలు సంపాదించుకోవాలి. జిల్లాలోనో, తహసీల్‌లోనో మెజారిటీ జనాభాకు సహాయ నిరాకరణ సిద్ధాంతాల్లో నమ్మకం కలిగించాలి. దానికోసం ఇద్దరు పెద్దలూ కాళ్లరిగేలా తిరిగారు. రోజూ పొద్దున్నే 7 గంటలకే భోజనం చేసి గుంటూరులో చెరో మోటారుకారు ఎక్కి తూర్పు తాలూకాలకు ఒకరు, పశ్చిమ తాలూకాలకు ఒకరు బయలుదేరి పక్షంరోజులపాటు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. లక్షలు కురిపించే ప్లీడరు ప్రాక్టీసును స్వచ్ఛందంగా వదిలేసుకుని, దేశంకోసం ఉద్యమించిన, ఆ ఇద్దరు నాయకుల వాగ్ధాటికి, సేవాదీక్షకూ జనం ముగ్ధులై మీరు చెప్పినట్టే చేస్తాం; మీ మాటే వింటాం అని బాసచేశారు. ముఖ్యంగా పెదనందిపాడు ఫిర్కాలో స్థానిక నాయకుడు పర్వతనేని వీరయ్యచౌదరి పూనికవల్ల జనంలో అద్భుత స్పందన వచ్చింది. పన్నుల నిరాకరణకు కాంగ్రెసు అనుమతి దొరికిందే తడవుగా రంగంలోకి దూకడానికి గుంటూరు జిల్లావాసులు ఉత్సాహంతో ఉరకలేయసాగారు.

అంతలో (1921 డిసెంబరు ఆఖరులో) జాతీయ కాంగ్రెసు వార్షిక సమావేశం అహమ్మదాబాదులో జరిగింది. దేశభక్తులందరూ ఆశించినట్టే ఆ సభ ఢిల్లీ ఎఐసిసి తీర్మానాన్ని ధ్రువీకరించి, నిర్దిష్ట షరతులకు లోబడి పన్నుల నిరాకరణోద్యమం చేపట్టడానికి రాష్ట్రాలకు అధికారం ఇచ్చింది. ఇక కార్యకర్తల ఉత్సాహానికి అంతే లేదు.

అహమ్మదాబాదు కాంగ్రెసులో ఇంకో విశేషం కూడా జరిగింది. గాంధీ మహాత్ముడు రాష్ట్రాల ప్రతినిధి వర్గాలు బసచేసిన ప్రతి క్యాంపుకూ స్వయంగా వెళ్లి శాసనోల్లంఘన విధానాలను విడమర్చి చెప్పాడు. అదే క్రమంలో ఆంధ్రుల శిబిరానికి వచ్చాడు. ఉద్బోధ అయ్యాక మీకేమైనా సందేహాలుంటే అడగండి సమాధానమిస్తానన్నాడు. అప్పుడు ఒంగోలు నుంచి వచ్చిన ప్రతినిధి చెరువు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి ఇలా ప్రశ్నించాడు:

"సహాయ నిరాకరణ కార్యక్రమంలో భాగంగా పన్నులను చెల్లించడానికి నిరాకరించాలి. మద్రాసు ప్రెసిడెన్సీలో పన్నుల వసూలు కార్యక్రమం జనవరి నెలలో ప్రారంభమవుతుంది. ఇప్పుడు ఇళ్లకు వెళ్లగానే మేము ఎదుర్కొనబోయే పన్నుల చెల్లింపు నిరాకరణ విషయంలో మీరు మాకు ఏమి సలహా ఇస్తారు?"

"హిందూ - ముస్లిం ఐక్యత, అంటరానితనం నిర్మూలన, ఖద్దరు ప్రచారం, అహింసలో విశ్వాసం మొదలైన ఢిల్లీ నిబంధనలను ప్రజలు సాధించగలిగినట్టు చెప్పదగిన ప్రాంతాలలో పన్నుల నిరాకరణ సహా శాసనోల్లంఘన కార్యక్రమాన్ని చేపట్టవచ్చు" అని గాంధీ గారి జవాబు.

[గుంటూరు జిల్లాలో స్వాతంత్ర్యోద్యమం - తెలుగు అకాడమీ, పే. 87]

సాక్షాత్తూ గాంధీ మహాత్ముడే అంత స్పష్టంగా లైన్‌క్లియర్ చేశాక ఇంకేమి కావాలి? ఈ జవాబుతో మరింత ఉత్తేజితమైన ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ అహమ్మదాబాద్ కాంగ్రెసు ముగిసిన వారానికే (1922 జనవరి 7న) బెజవాడలో సమావేశమైంది. శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా గుంటూరు, గోదావరి, కృష్ణా జిల్లాల్లో పన్నుల నిరాకరణోద్యమం నడపాలని తీర్మానించింది. ఆయా జిల్లాల్లో ఏ ఏ ప్రాంతాలు సమష్టి శాసనోల్లంఘనం జరపడానికి తగివున్నవో ఎంచుకునే స్వేచ్ఛను జిల్లా కాంగ్రెసు కమిటీలకు ఇవ్వాలని కూడా ఆ సమావేశం నిర్ణయించింది. దాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీ జనవరి 12న పొన్నూరులో సమావేశమై తెనాలి, గుంటూరు, ఒంగోలు, రేపల్లె తాలూకాలోని కొన్ని ఫిర్కాలలో తప్ప గుంటూరు జిల్లా అంతటా పన్నుల నిరాకరణోద్యమం సాగించాలని ఏకగ్రీవంగా నిశ్చయించింది.

జాతీయ కాంగ్రెసు ఆజ్ఞ అయింది. రాష్ట్ర కాంగ్రెసు అనుమతి దొరికింది. జిల్లా కాంగ్రెసు ఆమోదముద్ర వేసింది. అన్నిటికీ మించి గాంధీ మహాత్ముడి ఆశీర్వాదమూ

లభించింది. అది అధికారిక ముద్రపడిన కాంగ్రెసు ఉద్యమమనడానికి ఇక సందేహం ఏముంది? విదేశీ పాలకుల చేతిలో దేశానికి పట్టిన దుర్గతికి తల్లడిల్లి, దేశమాత దాస్య శృంఖలాలు తెంచటానికి ఉద్యమించాలని చిరకాలంగా ఆవురావురుమంటున్న లక్షలాది దేశభక్తులకు అంతకంటే ఏమికావాలి? క్షణం ఆలస్యం చేయకుండా అందరూ రంగంలోకి ఉరికారు. జనవరి వాయిదా భూమిశిస్తును దాదాపుగా జిల్లా అంతటా ఎగవేశారు. శిస్తులు వసూలుచేయాల్సిన గ్రామాధికారులు కాడికింద పారేసి సర్కారీ కొలువుకు సలాం కొట్టారు.

రెచ్చిపోయిన ప్రభుత్వం ఉద్యమ నాయకులను అరెస్టుచేసి, నిషేధాజ్ఞలు, విధించి, దారుణ దమనకాండకు పాల్పడింది. ఐనా కార్యకర్తలు జంక లేదు. జన సామాన్యం బెదరలేదు. గుంటూరులో ఉద్ధృతమైన పన్నుల నిరాకరణ సెగ సముద్రాల అవతల సీమకు సోకి బ్రిటిషు పార్లమెంటు సభ్యులనే నిశ్చేష్టులను చేసింది. అప్పట్లో మద్రాసు గవర్నరుగా ఉన్న లార్డ్ విల్లింగ్‌డన్ ఐతే - బ్రిటిషు రాజ్యాంగ విధానపు పునాదులనే గుంటూరు పోరాటం కదిలించి వేసిందని పదవీ విరమణ చేశాక బాహాటంగా ఒప్పుకున్నాడు.

తాను దీవించిన ఉద్యమం అంతలా విజయవంతమైనందుకు గాంధీ మహాత్ముడు ఎంతో సంతోషిస్తాడని కాంగ్రెసు వారు, సాధారణ ప్రజలు సహజంగానే విశ్వసించారు. తన శిష్యులు తాను చెప్పిన ప్రకారం నడిచి యావద్భారత దృష్టిని ఆకర్షించేలా, అంతర్జాతీయ ఖ్యాతి పొందేలా గొప్ప పోరాటం సాగిస్తున్నందుకు ఆయన మురిసి, మరింత శ్రద్ధ తీసుకుని, లోటుపాట్లేవైనా ఉంటే సరిదిద్ది ఉద్యమం ఇంకా బాగా నడిచేలా సహాయ పడతాడని వారు అమాయకంగా ఆశపెట్టుకున్నారు. అక్కడే పప్పులో కాలేశారు.

గాంధీగారు ఉద్యమం ముమ్మరమయ్యేంత దాకా ఆగలేదు. ఎలా నడుస్తోందో గమనించి, పూర్తి సమాచారం తెప్పించుకుని పరిస్థితిని బాగా అర్థంచేసుకున్నాకే మంచిచెడ్డల తీర్పు చెప్పాలనీ వేచి ఉండలేదు. తానేదో అహమ్మదాబాదులో యథాలాపంగా అంటే ఆంధ్రావాళ్లు దాన్ని సీరియస్‌గా పట్టుకుని ఏకంగా పెద్ద ఉద్యమమే మొదలెట్టేస్తారని ఆయన అనుకోలేదు. అంతపనీ జరిగిందని తెలిశాక ఆయన కంగారుపడ్డాడు. ధిక్కారం కొరివి దేశమంతటా అంటుకుని బ్రిటిషు సర్కారుకు కొంపలు ముంచే లోపే ఆంధ్రా అగ్గిని ఎలా ఆర్పెయ్యాలా అని తెగ ఆరాటపడ్డాడు. గుంటూరు జిల్లాలో పన్నుల నిరాకరణ ఇలా మొదలైందో లేదో అలా రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడికి (1922 జనవరి 17న) బొంబాయి నుంచి రాసిన జాబులో గాంధీ ఇలా అన్నాడు:

... I think that you are not ready for non-payment of taxes. Fifty percent of population of the area of experiment has not yet,

I apprehend, got rid of untouchability, nor is that proportion of population accustomed to ways of non-violence, nor to khaddar... I therefore strongly suggest that you advise the ryots in all the districts to pay up at least the first instalment and devote the whole of the time and energy of all the workers to acquiring the necessary qualifications.

[*Collected Works of Mahatma Gandhi*, Vol. 25, #212, PP 462-463]

(పన్నుల నిరాకరణ చేసేందుకు మీరింకా రడీ కాలేదని నేను భావిస్తున్నాను. ప్రయోగం జరుగుతున్న ప్రాంతాల్లో 50 శాతం జనాభా ఇంకా అంటరానితనాన్ని విడనాడలేదని నా అనుమానం. అలాగే ప్రజల్లో సగం మంది అహింసా విధానానికి గాని ఖద్దరుకు గాని అలవాటు పడినట్టు లేదు... కాబట్టి నేను మీకు గట్టిగా చెబుతున్నాను. కనీసం మొదటి కిస్తీ శిస్తులను చెల్లించమని అన్ని జిల్లాల రైతులకు సలహా ఇవ్వండి. కార్యకర్తల సమయాన్ని, శక్తిని అంతటినీ అవసరమైన అర్హతలను సమకూర్చుకోడానికి వెచ్చించమనండి.)

మూడు జిల్లాల్లో పన్నుల నిరాకరణోద్యమం ప్రారంభించాలని ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ తీర్మానించి నిండా పదిరోజులు కాలేదు. ఫలానా తాలూకాల్లో ఆ ఉద్యమానికి అనువైన పరిస్థితులు ఉన్నాయని గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీ నిశ్చయించి ఇంకా వారం కూడా తిరగలేదు. ఎక్కడో బొంబాయిలో కూచున్న మహాత్ముడు మాత్రం సంగతి సందర్భాలన్నీ క్షుణ్ణంగా ఎరిగిన రాష్ట్ర జిల్లా కమిటీలు చేసిన నిర్ణయాలు శుద్ధ తప్పని దివ్య దృష్టితో కనిపెట్టాడు. అప్పుడప్పుడే మొదలవుతున్న ఉద్యమం ఎలా సాగేదీ నింపాదిగా గమనించకుండానే ఆయా జిల్లాల్లో సగం జనాభాకు అస్పృశ్యత జబ్బు పోలేదనీ, అహింసలో నమ్మకం కలగలేదనీ తుది తీర్పు ఇచ్చేశాడు. తన బుద్ధికి అలా తోచింది కాబట్టి అదే కరక్టనీ, తనకు అనుమానం పుట్టింది కాబట్టి ఎక్కడి ఉద్యమాన్ని అక్కడే ఆపేసి, అర్జంటుగా సర్కారుకు పన్నులు, శిస్తులు కట్టాలనీ ఫర్మానా జారీచేశాడు.

కానీ - అవతలివాళ్లు మరీ బుద్ధిహీనులు కారు. ప్లీడరుగా గాంధీకంటే గొప్ప ప్రాక్టీసు కలిగివున్నా, దేశంకోసం అన్నీ వదులుకొని జాతీయోద్యమంలోకి దూకిన ధీరులు; మహామేధావులు. గాంధీమీద ఎంత భక్తి ఉన్నా ఆయన ఆదేశించగానే పండంటి ఉద్యమాన్ని పాడుబెట్టి, జనాన్ని దగా చెయ్యటానికి వారు సిద్ధంగా లేరు. బహుశా ఇక్కడి సంగతులు పూర్తిగా తెలియకపోవటం వల్లే మహాత్ముడు అలా అభిప్రాయపడి ఉండవచ్చుననీ, అపోహలను తొలగిస్తే ఆయనే మనసు మార్చుకుంటాడనీ వారు ఆశించారు. అందుకే జాబు అందిన వెంటనే రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు వెంకటప్పయ్య, ప్రధాన కార్యదర్శి నడింపల్లి లక్ష్మీనరసింహారావు కలిసి గాంధీకి ఇలా టెలిగ్రాం పంపారు:

"మీరు నాయకులద్వారా పంపిన లేఖ చూశాము. గుంటూరు జిల్లాలో ఉద్యమం బాగా వ్యాపించింది. గ్రామోద్యోగులు, వెట్టివాళ్లతో సహా చాలామంది రాజీనామాలు పెడుతున్నారు. ప్రచారకులు అనేకచోట్ల జట్లుజట్లుగా అరెస్టులవుతున్నారు. చాలా గ్రామాలలో పంచములు, క్రిస్టియన్లు కూడా స్వచ్ఛంద సేవకులుగా చేరుతున్నారు. బావుల దగ్గర మినహా అస్పృశ్యత తొలగిపోయింది. ఆస్తులను జప్తు చేసినందుకు ఆగ్రహం కలుగుతున్నప్పటికీ ప్రజలు శాంతముగ క్రైస్తవోద్యోగులనైనను వంట ఇండ్లలోనికి కూడా నిరాక్షేపణీయముగా రానిచ్చి అన్నము వండిన పాత్రలను తీసుకొని పోనిచ్చుచున్నారు. ఇప్పుడు పన్నులు నిరాకరించిన తాలూకాలో ఖద్దరు కావలసినంతవుంది. స్త్రీలతోసహా నూటికి 60 మంది గ్రామాలలో ఖద్దరునే ధరిస్తున్నారు. ఢిల్లీ తీర్మాన షరతులు పూర్తి అయినవని మేము విన్నవిస్తున్నాము. గుంటూరుకు మిలిటరీ సాయుధ శకటములలోను, మోటారు లారీలలోను వచ్చి మకాం చేసివున్నారు. ఇట్టి పరిస్థితులలో పన్నులు మరలనీయ మన్నచో మా జిల్లాలో ఉద్యమమును త్రోసిపుచ్చడమే అవుతుంది. అప్పుడు మరీ ఘోరంగా వుంటుంది. ఇతర జిల్లాలవారు కూడా మీ అంగీకారమునకై యెదురు చూచుచున్నారు."

[**గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం, మాదల వీరభద్రరావు** పే. 102, 103]

"మీరు నాయకులద్వారా పంపిన ఉత్తరం అందింది" అన్న మొదటి వాక్యాన్నిబట్టే జరిగినదేమిటో ఊహించవచ్చు. ఉద్యమం మొదలవగానే ఉద్యమ నాయకులంటే పడని మహానుభావులెవరో బొంబాయి పోయి గాంధీజీకి ఎక్కేసి ఉంటారు. వారి చెప్పుడు మాటలు నమ్మేసి, అదే సందుగా భావించి, ఉద్యమాన్ని ఆపెయ్యమని గాంధీ టెలిగ్రాం ఇచ్చాడనుకోవచ్చు. ఇలాంటి చెవి కొరుకుడుగాళ్లు కాంగ్రెసులో ఎప్పుడూ వుంటారు. ఏమైనా రాష్ట్ర నాయకులిచ్చిన వివరణ తర్వాత ఎవరికైనా అనుమానాలన్నీ పటాపంచలు కావాలి. అది చూశాకైనా తనకు అందిన తొలి సమాచారం తప్పని గాంధీకి అర్థమై వుండాలి. తంతి అందగానే జవాబుగా గాంధీజీ పంపిన తిరుగు టెలిగ్రాం ఇది:

YOU ARE THE BEST JUDGES OF THE SITUATION. IF DELHI CONDITIONS ARE SATISFIED AND IF YOU FEEL CONFIDENT, I HAVE NO RIGHT TO INTERFERE. GODSPEED. HE WILL BLESS ALL HONEST HUMBLE EFFORTS. KEEP ME DAILY INFORMED.

-GANDHI

[*CWMG*, Vol, 25, 220, P. 479]

(అక్కడి పరిస్థితి మీకే బాగా తెలుస్తుంది. ఢిల్లీ షరతులు నెరవేరాయని మీకు నమ్మకం ఉంటే నాకు జోక్యం చేసుకునే హక్కులేదు. దేవుడు అనుగ్రహించుగాక.

నిజాయితీగా, వినమ్రంగా చేసే ప్రయత్నాలన్నిటినీ ఆయన దీవిస్తాడు. అక్కడి సంగతులు నాకు రోజూ తెలుపుతుండండి. - గాంధీ)

ఇది చూస్తే ఎవరికైనా గాంధీగారిమీద గౌరవం పెరుగుతుంది. పోన్లే గిట్టనివాళ్లు చెప్పుడు మాటలను మొదట్లో తెలియక విశ్వసించినా, వాస్తవ పరిస్థితిని స్థానిక నాయకులు వివరించాక ఎంతో హుందాగా 'సరే' అన్నారు కదా అని సంతోషం వేస్తుంది. తొలి సందేహాలు నివృత్తి అయ్యాక, తాను చెప్పిన పద్ధతిలోనే ఉద్యమం సాగుతూ కీలక దశకు చేరుకున్నదని అర్థం అయ్యాకయినా మహాత్ముడు మనస్ఫూర్తిగా ఉద్యమానికి సహకరించి, సజావుగా సాగేందుకు శాయశక్తులా సహాయపడి ఉండాలి కదా? పూర్తి నమ్మకం కలగకపోయినా సంశయలాభం ఇచ్చి కనీసం కొంతకాలం పాటు దానిదారిన దాన్ని సాఫీగా సాగనిచ్చి ఉండాలికదా? అలా జరిగిందా?

లేదు. అసలు కుతంత్రం అప్పుడే మొదలైంది.

చీటీ రాజకీయం

"ఎవరైనా సత్యాగ్రహం మొదలెట్టిన ప్రతిసారీ నేను ఏదో పేచీ పెడుతుంటానని కొంతమంది పత్రికల్లో ఆక్షేపిస్తున్నారు. ప్రతి ఉద్యమాన్నీ నడిపించటానికి నేనే స్వయంగా అక్కడ ఉండి తీరాలా - అని వారు అడుగుతున్నారు. ఇది అన్యాయమైన ఆరోపణ. బొర్సాద్‌లో, నాగ్‌పూర్‌లో, చీరాల పేరాలల్లో సత్యాగ్రహాలు జరిగాయి. అక్కడ నేను లేను. కనీసం నన్ను సంప్రదించాలని కూడా ఒక్కడూ అనుకోలేదు. మరి ఈ సత్యాగ్రహ ఉద్యమాలు ఎలా నడిచాయి?

"... సొంత బాధ్యతపై ఎవరైనా సత్యాగ్రహాన్ని ప్రారంభించగలిగిన దశకు మనం ఇప్పుడు చేరుకున్నాం. ఒకవేళ నన్ను సంప్రదిస్తే నాకు తోచిన సలహా చెబుతాను. దాని అర్థం ముందుగా నన్ను సంప్రదించకుండా ఎవరూ సత్యాగ్రహం మొదలు పెట్టనే కూడదని ఎంతమాత్రం కాదు. అలాంటి షరతు పెడితే సత్యాగ్రహం పనికిరాని ఆయుధమైపోతుంది. నేను ఎన్ని సమస్యలని చూడగలను? ఇంకా ఎంత కాలం బతుకుతాను? ఏ కాలంలోనైనా ఎక్కడైనా సమర్థులైన స్త్రీలు పురుషులూ విరివిగా ఉపయోగించుకున్నప్పుడే సత్యాగ్రహ ఆయుధానికి సార్థకత."

1924 జూన్ 15వ తేదీ 'నవజీవన్' పత్రికలో మహాత్మాగాంధీ ప్రకటన ఇది. (*CWMG*, Vol. 28, P. 161) దీన్ని చూస్తే 'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య తల గోడకు కొట్టుకుని ఉండేవాడు. లేదా- గాంధీని వెక్కిరిస్తూ కొక్కిరాయి పద్యమొకటి రాసేవాడు. ఎందుకంటే చీరాల - పేరాల సత్యాగ్రహానికి ఐడియా ఇచ్చిందే గాంధీ మహాత్ముడు! మీకిష్టమైతే సొంత బాధ్యతమీద సత్యాగ్రహం ప్రారంభించవచ్చునని - చీరాలలో వేల మంది హాజరైన సభలో తనను సంప్రదించిన నాయకులకు అంగీకారం తెలిపిందీ ఆయనే. మళ్లీ ఆ మహానుభావుడే అడ్డం తిరిగి ఒక్కడు కూడా నన్ను ముందుగా సంప్రదించలేదని బుకాయించటం ఎంత విడ్డూరం? !

జరిగింది గుర్తులేక ఏదో మతిమరుపున చీరాల విషయంలో అలా పొరబడ్డారేమో ననుకోవటానికి వీలులేదు. అది పొరపాటు కాదు. చేసేదంతా చేసి... అన్నీ తనకు చెప్పే తీరాలని, తాను చెప్పినట్టే అంతా జరగాలని చెప్పకనే చెప్పి... అంతా అయ్యాక నాకేమి తెలుసు, నాకెవరు చెప్పారు అని సణగటం గాంధీగారికి అలవాటు ! ఒక్క చీరాల అనే ఏమిటి? పెదనందిపాడు విషయంలో మాత్రం ? అహమ్మదాబాదు కాంగ్రెసులో ఆంధ్రా ప్రతినిధుల శిబిరానికి వెళ్లి, చర్చించి, పన్నుల నిరాకరణకు షరతులతో కూడిన అంగీకారం తెలిపిందెవరు? గాంధీయే! "సామూహిక శాసనోల్లంఘన *ప్రారంభించమని ఆంధ్రులకు నేనేమీ సలహా ఇవ్వలేదు!"* అని 2-2-1922 తేదీ యంగ్ ఇండియాలో పిల్లి మొగ్గ వేసిందీ గాంధీయే !

ఆ సంగతి అలా ఉంచండి. నన్ను సంప్రదించాల్సిన పనిలేదు. సత్యాగ్రహాన్ని సొంత బాధ్యతపై ఎవరైనా ప్రారంభించవచ్చు. సమర్థులైన స్త్రీలూ, పురుషులూ విరివిగా ఉపయోగించినప్పుడే ఆ ఆయుధానికి సార్థకత - అని పైన 'నవజీవన్' ప్రకటనలో మహాత్ములవారు ధర్మనిర్ణయం చేశారు కదా? కనీసం దానికైనా ఆయన కట్టుబడాలి కదా? గుంటూరు జిల్లాలో పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని సాగిస్తున్నవారు అల్లాటప్పా మనుషులు కారు. దేశభక్త కొండ వెంకటప్పయ్య, గొల్లపూడి సీతారామశాస్త్రి లాంటి ఉద్దండులు. వారి దీక్షా దక్షతలను స్వయానా గాంధీగారే పలు సందర్భాల్లో మెచ్చుకున్నారు. అలాంటి నిష్కళంక దేశభక్తులు కాంగ్రెసు నిర్ణయంమేరకు సొంత బాధ్యతపై ఉద్యమం మొదలెడితే అడ్డం పడకుండా దాని మానాన దాన్ని సజావుగా సాగనివ్వాల్సిన బాధ్యత మహాత్మాజీకి లేదా ?

"అక్కడి పరిస్థితులు మీకే బాగా తెలుస్తాయి. మీకు నమ్మకం ఉంటే నేనేమీ జోక్యం చేసుకోను. దేవుడు మీకు మేలు చేయుగాక" అని విధిలేక సరే అన్నా ఆంధ్రావాళ్లు తన మాట వినలేదే, వద్దని చెప్పినా తనకే ఎదురు సమాధానం చెప్పారే అన్న ఉక్రోషం గాంధీని సలిపింది. పన్నుల నిరాకరణ ముమ్మరమై తనకు ప్రియమైన బ్రిటిషు సర్కారు గిజగిజలాడేకొద్దీ వారిని ఆ సంకటం నుంచి ఎలా తప్పించాలా... ఉద్ధృతమైన ఉద్యమాన్ని ఎలా ఆపెయ్యాలా అని ఆ మహానుభావుడు మహా ఆరాటపడ్డాడు. అంతా బాగేనని స్థానికనాయకులిచ్చిన వివరణను తిరస్కరించేందుకు తన దగ్గర ఒక కారణమూ లేకపోయినా... తానిచ్చిన ఉత్తేజంతో తన శిష్యులు సాగిస్తున్న పోరాటానికి బాసటగా నిలవాల్సిన బాధ్యత నాయకుడిగా తనపైన ఉన్నా... బాధ్యతకంటే దొరల సామ్రాజ్యం పట్ల విధేయతకే గాంధీ విలువిచ్చాడు. 'Godspeed' అని తన నోటితో తాను ఆశీర్వదించిన ప్రజా ఉద్యమం మీదే నీళ్లు చల్లి నీరుగార్చడానికి నానా తంటాలు పడ్డాడు. అనేక రకాలుగా ఒత్తిడి తెచ్చాడు. "మీ ఇష్టం. నేనేమీ జోక్యం చేసుకోను" అని తిరుగు

టెలిగ్రాం ఇచ్చి రెండు వారాలు కూడా కాకుండా (1922 ఫిబ్రవరి 2న) **'యంగ్ ఇండియా'**లో గాంధీ ఏమి రాశాడో చూడండి :

"Andhra people are shrewd and I hope they know the art of humility. In spite of the Government provocation, I have every hope that they will be humble enough not to undertake mass civil disobedience... I would certainly be better pleased if no other part of India, not excluding Andhra, was to try the experiment till the result of mine was definitely known."

[*Collected Works of Mahatma Gandhi*, Vol. 26, #29, P.74]

(ఆంధ్రులు తెలివైనవారు, వినయవంతులు, ప్రభుత్వం రెచ్చగొట్టినప్పటికీ సామూహిక శాసనోల్లంఘనకు పూనుకోకుండా ఉండేంత వినమ్రత వారికి ఉందని నేను ఆశిస్తున్నాను. నేను చేయబోయే ప్రయోగపు ఫలితం కచ్చితంగా తెలిసేంతవరకూ ఆంధ్ర సహా ఇండియాలో వేరే ప్రాంతమూ ఈ ప్రయోగాన్ని చెయ్యకుండా ఉంటే నేనెంతో సంతోషిస్తాను.)

చూశారా, ప్లేటు ఎలా మార్చేశారో? ! ప్రతి ఉద్యమమూ నేనే స్వయంగా రంగంలో ఉండి నడిపించటం ఎలా కుదురుతుంది? నేనెంత కాలం బతుకుతాను? సమర్థులైన కార్యకర్తలు సొంత బాధ్యతపై సత్యాగ్రహాలు మొదలెట్టవచ్చునని చెప్పే మహాత్ముడు ఈయనే కదా? మొదలెట్టిన ఉద్యమం అర్జెంటుగా ఆపెయ్యమని మళ్లీ ఈయనే - ఆంధ్రుల గొంతు మీద కూచున్నాడు. అదీ ఆపి తీరాల్సినంత అగత్యం ఏదో దాపురించి నందువల్ల కాదు. మహాత్మాజీకి ఇష్టంలేదు. ఉద్యమం జరగకూడదని ఆయన అను కున్నాడు- కాబట్టి ఎక్కడి ఉద్యమం అక్కడ స్తంభించాల్సిందే! బార్డోలీలో సత్యాగ్రహ ప్రయోగం చేస్తా, చేస్తా అనడమే తప్ప ఇంకా మొదలు పెట్టనేలేదు. తానెప్పుడో ఏదో ప్రయోగం చేయాలని అనుకుంటున్నాడు కనుక దానికి కాలం కర్మం కలిసొచ్చి, అదృష్టం బాగుంటే మొదలై, దాని ఫలితం ఏమిటో తెలిసేంతవరకూ అప్పటికే మొదలైన ప్రయోగా లన్నిటినీ మధ్యలోనే ఆపేసి, వెర్రిమొగాలేసుకుని చూస్తూ కూచోవలసిందేనట ! ఇది అడ్డగోలు రుబాబు కాదా?

సాధారణంగా బలమైన కారణం కనపడితేనే ఏ ఉద్యమాన్నయినా నిలిపేసే నిర్ణయం జరుగుతుంది. గాంధీగారి విషయం వేరు. ముందు నిర్ణయం! తరవాత కారణాల వెదుకులాట! పన్నుల నిరాకరణ సత్యాగ్రహం చెయ్యమని ఆంధ్రావాళ్లకు నేను చెప్పలేదు. పెట్టిన కండిషన్లు అక్కడ తీరలేదు. జనం రడీకాకముందే ఉద్యమం మొదలెట్టేశారు - అని గాంధీగారు అదే పనిగా సన్నాయి నొక్కులు నొక్కే కొద్దీ ఆంధ్రా కాంగ్రెసుకు కూడా

డొటు లేనిచోట డొట్లు మొదలయ్యాయి. తెగించి ముందుకెళితే పెద్దాయనతో ఏ తగులాటం వస్తుందో, తామెక్కడ మాటపడతామోనని భయం పట్టుకుంది. దాంతో ఎందుకైనా మంచిదని గుంటూరు జిల్లా కాంగ్రెసు కమిటీ 1922 జనవరి 26న కొండ వెంకటప్పయ్య ఇంట్లో సమావేశమై ఓ సబ్ కమిటీని వేసింది. పన్నుల నిరాకరణ జరుగుతున్న ప్రాంతాల్లో పర్యటించి అక్కడ ఢిల్లీ నిబంధనలు సరిపోయిందీ లేనిదీ నిర్ణయించి, ఇకపై ఉద్యమాన్ని నిలపాలో కొనసాగించాలో తేల్చే పనిని ఆ ఉప సంఘం మీద మోపి, రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని పురమాయించింది. టంగుటూరి ప్రకాశం, కాశీనాథుని నాగేశ్వరరావు, దండు నారాయణరాజులు అందులో సభ్యులు.

త్రిసభ్య సంఘం జనవరి 31 నుంచి ఫిబ్రవరి 7 వరకు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి ఏమి కనుగొన్నదో దాని మాటల్లోనే వినండి:

"చాలా గ్రామాలలో 20 నుండి 200 మంది వాలంటీర్ల సంఘాల నేర్పరిచారు. వీరు 4 వేల మందికి పైగా వుంటారు. అందరూ ఖద్దరు యూనిఫారములు, బాడ్జీలు ధరించి వున్నారు. 60-65 సంవత్సరాల వయోవృద్ధులు సైతం చురుకుగా పనిచేయడం మాకు కనిపించింది. కొన్ని గ్రామాలలో పంచమ కులానికి చెందిన వాలంటీర్లు గూడా ఇతరులతో కలిసిమెలిసి చురుకుగా పనిచేస్తున్నారు. అహింసను పరమధర్మంగా పాటిస్తూ విధినిర్వహణలో పాల్గొనటం వాలంటీర్ల సంఘాల విశిష్టతకు తార్కాణంగా వుంది. కొన్ని గ్రామాలలో ముఖ్యంగా పెదనందిపాడు ఫిర్కాలో తమ స్వంత తపాలాను గూడా ఏర్పరుచు కొని వారు నడుపుకుంటున్నారు.

"చాలా గ్రామాలు ఖద్దరు ఉత్పత్తిలో స్వయం సంపూర్ణత గలిగివున్నవి. కొన్నిచోట్ల ప్రతి ఇంటిలోనూ ఒకటి రెండు రాట్నాలు పనిచేస్తున్నవి. గ్రామంలో తయారుచేసిన నూలుతోనే సాధారణంగా గ్రామ పంచములు ఖద్దరు వస్త్రములు నేయుచున్నారు. పంచమ సోదరులు నేసిన నేత వస్త్రములనే సనాతనాచారపరులైన బ్రాహ్మణులు గూడా ధరిస్తున్నారు. విదేశీ వస్త్రాల అమ్మకమంటూ చాలా గ్రామాలలో లేదు. చాలా గ్రామాలలో 50 శాతం పైగా వారే స్వయంగా తయారుచేసుకున్న నూలుతో నేసిన ఖద్దరు బట్టలనే ధరిస్తున్నారు. కొన్నిచోట్ల 95 శాతం మంది కూడా ఖద్దరునే వాడుతున్నారు.

"ఇంత స్వల్పకాలంలోనే అంటరానితనాన్ని నివారించుటలో కొన్ని గ్రామాలు సాధించిన అసాధారణమైన అభివృద్ధిని చూచి మాకు ఆశ్చర్యంగలిగింది మన ప్రజల మనస్సులలో అంతటి విప్లవం సాధ్యమా అని మేము విశ్వసించజాలకపోతున్నాము... కొన్నిచోట్ల సనాతనాచారం గలవారు కూడా పంచములతో చేయి చేయి కలిపి తమ మధ్యనే వారిని కూర్చోబెట్టుకుంటున్నారు. తోటి పంచమ సోదరుల కోసం తమ ఆదాయాన్నంతా వెచ్చించదలిచితిమని ఒక ధనిక బ్రాహ్మణుడు మాతో చెప్పారు.

ఎవ్విధంగానైనా ఈ అస్పృశ్యతా దోషాన్ని నివారించదలచితిమని చాలామంది గ్రామస్థులు ప్రకటించారు. పంచమ సోదరులకు తమ పొలాలను ఇచ్చి వేయడానికి గూడా ఇచ్ఛాపూర్వకంగా సిద్ధంగా వున్నారని చాలమంది మాతో అన్నారు.

"వాలంటీర్లు ప్రజలు గూడా గత 2 వారాలలోనే తమ అహింసా దీక్షను, త్యాగాన్ని అనేక రీతుల రుజువు చేశారు. తమకు అతి ప్రేమ పాత్రమయిన పశుగణాన్ని దౌర్జన్యంగా అధికార్లు తోలుకొని పోతుంటే అతి శాంతంగా వుంటున్నారు. అన్నం వండి వడ్డించబోవు సమయాన ఆ వంట పాత్ర సామగ్రిని తీసుకొని వెళ్లి జప్తు చేస్తుంటే ఎంతో సహనం వహించారు. తమ విలువైన వస్తువులను జప్తుచేసి అతి చౌకగా అమ్మివేస్తుంటే, కోళ్లను, కోడి గ్రుడ్లను దౌర్జన్యంగా పోలీసులు ఎత్తుకుని పోతుంటే కడకు కొందరు వాలంటీర్ల ముఖాలపైన సైనికులు ఉమ్మివేసి కవ్విస్తుంటే, ఇలా అనేక దౌర్జన్యకృత్యాలు సాగిస్తున్నప్పటికీ వాలంటీర్లు శాంతిని నెలకొల్పగలిగారు..."

[గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం, మాదల వీరభద్రరావు, పుటలు 96-98]

ఇది చదువుతుంటే ప్రతి దేశభక్తుడికీ హృదయం ద్రవిస్తుంది. ఉద్వేగం ఉప్పొంగుతుంది. అంత తక్కువ వ్యవధిలో గ్రామసీమల్లో అంతటి సామాజిక విప్లవం ఎలా సాధ్యమైందా, అని ఆశ్చర్యం వేస్తుంది. ఖద్దరు ధారణ, అస్పృశ్యత నివారణ, అహింస ఆచరణలపై ఢిల్లీ ఎఐసిసి దేశం మీద విధించిన కండిషన్లు ఇంతకంటే బాగా ఎక్కడ అమలవుతాయి? నూటికి 95 మంది ఖద్దరు ధరించటం, అంటరానితనం కంటపడకుండా పోవటం, మొగాన ఉమ్మివేసినా తిరగబడక శాంతంగా ఉండగలగటం కంటే సాంఘిక పరివర్తన ఏముంటుంది? ఇదంతా వెళ్లిన చోటల్లా కళ్లారా చూశాక కాంగ్రెసు సబ్ కమిటీవారు "షరతులన్నీ చక్కగా నెరవేరాయి. ఉద్యమం అద్భుతంగా సాగుతున్నది. దీన్ని ఇలాగే ముందుకు పోనిద్దాం" అని తీరాలి కదా?

న్యాయంగా ఐతే అంతే. అందునా 'ఆంధ్రకేసరి' ప్రకాశం, 'దేశోద్ధారక' నాగేశ్వరరావు వంటి మహా పురుషులు సబ్ కమిటీలో సభ్యులాయె ! స్వేచ్ఛగా ఆలోచించి, తోచిన నిర్ణయాన్ని నిర్మొహమాటంగా ప్రకటించగల వెసులుబాటు ఉన్నట్టయితే... ఎటునుంచీ గట్టి ఒత్తిడి లేకపోతే వారూ విధ్యుక్తధర్మాన్ని నిజాయతీగా నిర్వర్తించి ఉండేవారే. కాని - వేరెవరో కాదు, సాక్షాత్తూ గాంధీ మహాత్ముడే అదృశ్యరూపంలో వారి నెత్తిన కూచుని ఉద్యమం సాగటానికి వీల్లేదు; ఆపాల్సిందే - ఆపి తీరాల్సిందే అని వారి కాళ్లకూ చేతులకూ, బుద్ధికీ అడ్డంపడ్డాడు. అసలైన మహాత్ముడికే ఉద్యమం నడపటం సుతరామూ ఇష్టం లేనప్పుడు ఆయన భక్తాగ్రేసరులైన ఉప సంఘ సభ్యులు స్వతంత్రించి, వాస్తవ పరిస్థితికి తగ్గట్టుగా ఉద్యమం కొనసాగింపును ఎలా సమర్థించగలరు? అందుకే నాలుక మడతవేసి చివర్లో ఎవరూ ఊహించలేని ట్విస్టు ఇలా ఇచ్చారు:

"ఇది మంచి కృషి అనుటకు ఏమాత్రం సందేహం లేదు. కాని ఇంకా అతి క్రూరమైన అనాగరిక పద్ధతులకు ప్రభుత్వం పూనుకున్నట్లయితే ప్రజానీకం ఎంతవరకూ శాంతి యుతంగా ఉండగలరా అనేది చెప్పడం కష్టం. క్రమ శిక్షణ అలవరచుకోవడానికి వారికి గల వ్యవధి చాలా స్వల్పం. అన్ని దారుణ నిర్బంధ చర్యలకు వ్యతిరేకంగా తమ హృదయాలను యింకా గట్టిపరచుకొనుటకు అనువుగా ప్రజలకు తగిన వ్యవధి యిచ్చేవరకు ప్రస్తుత ఆందోళనను వాయిదా వేయడం మంచిదని మేము అభిప్రాయపడుతున్నాము. అదియును గాక, కనీసం మహాత్మాగాంధీ బార్డోలీలో తాను ప్రయత్నించేవరకు ఈ ఆందోళనను వాయిదా వేయడం అవసరమని భావిస్తున్నాము. అందుచేత ఇతర కారణాలెలా వున్నప్పటికీ, కనీసం మహాత్ముని అభిమతానుగుణ్యంగానైనా ప్రస్తుత పన్నుల నిరాకరణ ఆందోళనాన్ని విధిగా ఆపివేయవలసి వుంది."

[అదే గ్రంథం పుట. 98, 99]

అదీ సంగతి! ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టే ఉద్యమం మహాత్ముడికి ఇష్టంలేదు కాబట్టి అది ఎంత అద్భుతంగా నడుస్తున్నాసరే అర్జంటుగా దాన్ని ఆపెయ్యాల్సిందేనని కాంగ్రెసు సబ్ కమిటీ తలకాయ జేబులో దాచుకుని బలవంతపు సిఫారసు చేసింది. "ఎక్కువ గ్రామాలలో పన్నుల నిరాకరణోద్యమాన్ని కొనసాగించాలని ఎంత కృత నిశ్చయంతో వున్నప్పటికీ, ఢిల్లీ తీర్మాన షరతులను ఎంత ఎక్కువ సంతృప్తికరంగా అమలు పరిచినప్పటికీ, పైన పేర్కొన్న కారణములవలన ఢిల్లీ షరతులు మొత్తం ప్రాంతంలో పూర్తిగా సంతృప్తిపరచలేదనియే చెప్పవలసి వుంటుంది" అన్న నివేదికలోని అర్థం పర్థం, తలాతోకాలేని వెర్రి వాక్యాన్ని బట్టే గాంధీ భయానికి శీర్షాసనం వేయడంలో ప్రకాశం పంతులు, నాగేశ్వరరావు పంతులు ఎంత అవస్థ పడ్డారో అర్థమవుతుంది.

అన్నట్టు ఆ పెద్దమనుషులు అంతలా విధంచెడటానికి ఇంకో కారణమూ ఉంది. ఉద్యమం కొనసాగించాలా వద్దా అనేది ఉపసంఘం పరిశీలిస్తున్న సమయంలోనే వారి మీద గట్టి ఒత్తిడి తెచ్చి, తమకు కావలసిన రీతిలో సిఫారసు రాబట్టటానికి గాంధీగారు, ఆయన అంతేవాసులు ఇంకో మతలబు కూడా చేశారు ! అదేమిటో ప్రకాశంపంతులే చెబుతారు వినండి :

"ఉద్యమం ఒక వంద గ్రామాలలోనే ప్రారంభించబడ్డా, జిల్లా అంతా పెద్ద ఎత్తున హర్తాళ్ ఆరంభమయింది. నాలుగు మాసాలు దాటినా జిల్లా మొత్తంమీద నాలుగు పైసలయినా పన్నుల రూపంగా వసూలు కాలేదు...

"క్లిష్ట సమయంలో గుంటూరులో ప్రారంభించబడిన యీ పన్నుల నిరాకరణ ఉద్యమం గాంధీగారి అభిప్రాయానికి భిన్నంగా ఆరంభింపబడ్డది అంటూ డాక్టరు

భోగరాజు పట్టాభి సీతారామయ్య గారిచే వ్రాయబడిన ఉత్తరం ఒకటి 'జన్మభూమి' పత్రిక ప్రచురించింది. దరిమిలా 'సర్' కూడా అయిన థామస్ రూథర్‌ఫర్డు యీ 'జన్మభూమి' ప్రతులను విరివిగా కొని, జిల్లా కేంద్ర స్థానాలలో పెక్కుచోట్ల తానే స్వయంగా ఆ కాపీలను పంచిపెట్టడం ఆరంభించాడు.

"ఈ పరిస్థితులనన్నింటినీ గమనించే మేము ఉద్యమ విరమణకు సలహా ఇచ్చాం..."

[నా జీవనయాత్ర, టంగుటూరి ప్రకాశం, పుట 170]

సరే! గాంధీగారు వ్యక్తావ్యక్తంగా పరిపరి విధాల తెచ్చిన ఒత్తిళ్ల మూలంగా ఆయన, బ్రిటిషు ప్రభువులు కోరుకున్న రీతిలో - ఉద్యమం నిలిపేయాలన్న రడీమేడ్ సిఫారసు సబ్ కమిటీనుంచి వెలువడింది. కాని దాన్ని జిల్లా కాంగ్రెసు కమిటీ ఆమోదించాలి కదా? ఉద్యమదీక్ష, పోరాట కాంక్ష అప్పుడున్న తీవ్ర స్థితిలో గాంధీ వద్దన్నా జనం ఆగేట్టు లేరు. ముగ్గురు సభ్యుల ఉప సంఘం గాంధీ బుట్టలో పడ్డంత మాత్రాన దానిచేత చెప్పించిందల్లా కళ్లుమూసుకుని శిరసున దాల్చి, పండంటి ఉద్యమాన్ని నిలువునా చంపేసి ప్రజాద్రోహం చెయ్యటానికి జిల్లానాయకులు సిద్ధంగా లేరు.

అయితేనేం? పొట్టనిండా పుట్టెడు రాజకీయ తంత్రాలున్న గాంధీ మహాత్ముడికి అదొక లెక్కా? శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు ! వారిచేతా వీరిచేతా చెప్పిస్తే పని అయ్యేట్టు లేదని గ్రహించి మనవాడు పతాక సన్నివేశంలో డైరెక్టుగా తానే బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. ఆ ముచ్చటను నాటి ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడు కొండ వెంకటప్పయ్య చెబుతాడు ఆలకించండి :

"జిల్లా కాంగ్రెసు కార్యవర్గము మా యింటిలోనే సమావేశమై ఆ నివేదిక విషయమై విమర్శ చేయు సమయముననే మహాత్ములు వ్రాసిన చిన్న కాగితపు ముక్కనొకటి ఎవ్వరో అందిచ్చిరి. అందులో తాము బార్డోలిలో ఉద్యమము ఆ కాలములోనే సాగించుచున్నందున గుంటూరు ఉద్యమమెట్లు సాగుచున్నదోయను యోచన సహితము ఎప్పుడును మనస్సును కలత నొందించుచుండును గాన అచ్చట యుద్యమమును ఆపివేయవలసిందని వ్రాయబడి యుండెను. అది చదువుకొనిన తోడనే నా హృదయము మిక్కిలి విచారముచే క్రుంగిపోయెను. అంత చక్కగ సాగుచున్న ఉద్యమమును బుద్ధిపూర్వకముగ ఆపివేయుట నాకు ఇష్టము లేకపోయెను. అయినను గాంధీగారే తాము చేయు ఉద్యమమున కిది అడ్డము వచ్చుచున్నదను భావము వెలిబుచ్చినప్పుడు నేనింక ముందుకు సాగించుట అవ్యక్తమనినాకు తోచెను. తక్కిన సభ్యులును ఆపివేయుటయే సమంజనమని అభిప్రాయపడిరి. కాన ఆపివేయక తప్పినది కాదు.

"గాంధీగారి యొద్దనుండి ఆ చిన్న కాగితపు ముక్కనెవరు తెచ్చిరో, నాకే వారేల యుత్తరము వ్రాయలేదో నేను విచారించలేదు. వారు రహస్యముగ నుండవలెనని

యుద్దేశించి, అట్లు వ్రాసి యుందురని తలంచితిని. వారిట్లు వ్రాసిరను విషయము ఇతరులకు చెప్పినవాడను కాదు. అది రహస్య విషయముగనే గ్రహించి, బయలుపరచుట యుక్తము కాదని తలంచితిని"

[**స్వీయచరిత్ర, కొండ వెంకటప్పయ్య,** పుట 297, 298]

'మహాత్మా' మేలిముసుగు పక్కకు జరిగి, గాంధీ నిజస్వరూపం పై రెండు పేరాల్లోనే బట్టబయలు కాలేదా ? తెల్లవారిది సైతాను ప్రభుత్వమనీ, సత్యాగ్రహంతో దాన్ని పారదోలాలనీ వట్టి కబుర్లు టన్నులకొద్దీ చెప్పడమే తప్ప... ఆ సైతాను సర్కారుకు ఆపద వస్తే మళ్లీ ఈ మహాత్ముడే చక్రం అడ్డంవేసి ఆదుకుంటాడనటానికి ఇంతకంటే దృష్టాంతం ఏమికావాలి? "ఏమి చెప్పినా, ఏమి చేసినా పారదర్శకంగానే ఉండవలెను. చాటు పనులు కూడవు, ధర్మము తప్పరాదు" అని లోకానికి విసుగు లేకుండా నీతులు చెప్పే మహానుభావుడు కదా? మళ్లీ ఆయనే రహస్యంగా చీటీలు పంపించి, జిల్లా కమిటీ కాళ్లకు అడ్డం పడి, తట్టుకోలేని ఒత్తిడి పెట్టి, చక్కగా నడిచే ప్రజా ఉద్యమాన్ని నిలువునా పాడెయ్యటాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? కుటిల రాజకీయపు గూడుపుఠాణీలు నడిపే మన కాలపు పొలిటీషియన్లకంటే గాంధీ ఏ విధంగా మెరుగు?

ఆరంభ శూరుడు

Deshabandhu Chittaranjan Das used frequently to say about the virtues and failings of Mahatma Gandhi's leadership. According to him, the Mahatma opens a campaign in a brilliant fashion, he works it up with unerring skill; he moves from success to success till he reaches the zenith of his campaign- but after that he loses his nerve and begins to falter.

[Subhas Chandra Bose in "The Indian Struggle," P.77]

మహాత్మాగాంధీ నాయకత్వ గుణదోషాల గురించి దేశబంధు చిత్తరంజన్‌దాస్ తరచూ చెబుతుండేవాడట. ఏమనంటే... మహాత్ముడు పోరాటాన్ని అద్భుతంగా ఆరంభిస్తాడు. వంక లేని ఒడుపుతో విజయవంతంగా ముందుకు తీసుకెళతాడు. తీరా పరాకాష్టకు చేరాక మనోధైర్యం కోల్పోయి తడబడతాడు.

దేశబంధు దాస్‌కి సన్నిహిత సహచరుడైన 'నేతాజీ సుభాష్‌చంద్రబోస్ The Indian Struggle గ్రంథంలో రాసిన ఈ మాటలు గాంధీగారి ఆరంభ శూరత్వానికి అతికినట్టు సరిపోతాయి. బ్రహ్మాండమేదో బద్దలు కొడుతున్నట్టు నానా హడావుడిచేసి, నరాలు చిట్లే ఉత్కంఠను రేకెత్తించాక, నడిమధ్యలో కాడి కింద పారేసి, నమ్మిన జనాన్ని నట్టేటముంచటంలో మహాత్మాజీ సాటిలేని మేటి. తన పోరాటాన్ని దెబ్బతీసే అవకాశం శత్రువులకు ఇవ్వకుండా, ఆ ఘనకార్యమేదో తన చేతులతో తానే కానిచ్చి, పైగా తాను చేసిందే కరక్టు అని జంకులేకుండా వాదులాడటంలో ఆయనది అద్వితీయ ప్రజ్ఞ. పట్టిన పట్టు విడవక, చేపట్టిన ఉద్యమాన్ని కడదాకా కొనసాగించిన దాఖలా గాంధీగారి సుదీర్ఘ జీవితంలో ఒక్కటి కూడా లేదు.

దీన్నిబట్టి మహాత్ముడికి పోరాటం చేయటం, ఉద్యమం నడపటం చేతకాదనే అనుకోవాలి. కాని ఆ మాటంటే ఆయన సుతరామూ ఒప్పుకోడు. అంతేకాదు. ఉద్యమం

నడపటం ఎలాగో తనకు మాత్రమే చేతనవునని, ఎవరైనా సరే - తనను చూసే ఆ విద్యను నేర్చుకోవాలని ఆయన అంటాడు. ఇతరులకు వదిలిపెడితే పాడుచేస్తారన్న భయంతో ఆయన వేరెవరికీ ఉద్యమం సాగించే అవకాశం ఇవ్వడు. విధిలేక ఇచ్చినా కాళ్లకు అడ్డంపడి, చేతులు కట్టేస్తాడు. పదుల కోట్ల జనులు, వేల సంవత్సరాల చరిత్ర, అద్భుత సంస్కృతి కల ఈ సువిశాల దేశంలో తనకు తప్ప ఎవరికీ పోరాడటం చేతకాదనీ, తాను చేసి చూపించి, బెత్తం పుచ్చుకుని పక్క నిలబడితే తప్ప ఏ ఉద్యమమూ సవ్యంగా సాగదని గాంధీకి వెర్రి నమ్మకం.

1921 నవంబరు 4న ఢిల్లీలో ఎఐసిసి సమావేశం గుర్తుందికదా ? గాంధీగారు 'సంవత్సరంలో గ్యారంటీ' అన్న గడువు ముగియ వస్తున్నా స్వరాజ్యం అతీగతీ లేక... వట్టి కబుర్లే తప్ప బ్రిటిషు సర్కారు భరతం పట్టేందుకు గాంధీ ఇచ్చిన కార్యక్రమమంటూ ఏదీ లేక... జనంలో అసహనం, కాంగ్రెస్ కార్యకర్తల్లో నిస్పృహ అలుముకున్న స్థితిలో ఎఐసిసి కొలువుతీరింది. దేశంలోని ప్రతి రాష్ట్రానికి సొంత బాధ్యతపై శాసనోల్లంఘన, పన్నుల నిరాకరణ ఉద్యమాలను చేపట్టేందుకు ఆ సమావేశం అధికారం ఇచ్చింది. ఉద్యమించే యోగ్యత పొందేందుకు అనేక షరతులు విధించి, అవన్నీ ఫలానా ప్రాంతంలో నెరవేరాయని సంతృప్తి చెందిన పక్షంలో ఆ ప్రాంతంలో ఆందోళన సాగించేందుకు సంబంధిత రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి స్వేచ్ఛ నిచ్చింది. ఇక దేశవ్యాప్తంగా శాసనోల్లంఘనోద్యమాన్ని చేపట్టేందుకు అడ్డుండకూడదు కదా ? దేశమంతటా ఏకకాలంలో ఉవ్వెత్తున ఉద్యమిస్తే తప్ప బ్రిటిషు సర్కారుకు దిమ్మతిరగదు. ఏదో ఒక్కచోటే ఆందోళన నడిస్తే ప్రభుత్వం దాన్ని కర్కశంగా అణచివేయక మానదు. కాబట్టి తెల్లదొరతనాన్ని దారికి తేవాలంటే విస్తృత ప్రజోద్యమం తప్పనిసరి. ఈ సంగతి కనీస లోకజ్ఞానం ఉన్న ప్రతి వాడికీ అర్థమవుతుంది. ఎఐసిసి సమావేశంలో ముస్లిం నాయకుడు హస్రత్ మొహానీ కూడా ఆమాటే అన్నాడు. మనం పెట్టిన కండిషన్లు ఎన్ని ప్రాంతాల్లో నెరవేరితే అన్నిచోట్ల ఒకేసారి ఉద్యమం లేవదీద్దాం- అని గట్టిగా కోరాడు. కాని- గాంధీ వింటేనా?

Gandhi appealed to the people to wait and see how he himself would lead the movement in Bardoli before they commenced theirs,.. ... He said: "I am going to start mass civil disobedience in Bardoli... The conduct of the campaign will be under my personal guidance. From the leaders of the rest of India I would ask for no further help than that of friendly sympathy in my effort... If peace prevails in the rest of the provinces, I have no fear that Victory is bound to crown our efforts."

[Mahatma, *D.G.Tendulkar,* Vol. II. P. 66]

(బార్డోలీలో తాను ఉద్యమాన్ని ఎలా నడిపించేదీ చూశాకే మిగతావారు తమ ఉద్యమాలను మొదలుపెట్టాలని గాంధీ విజ్ఞప్తిచేశాడు. "బార్డోలీలో నేను సామూహిక శాసనోల్లంఘనను ప్రారంభించబోతున్నాను. ఆ పోరాటాన్ని నేనే స్వయంగా నడిపిస్తాను. మిగతా దేశంలోని నాయకుల నుంచి నేనే సహాయమూ కోరను. నేను చేసే పనికి వారి స్నేహపూర్వక సానుభూతి చాలు. మిగతా రాష్ట్రాలు ప్రశాంతంగా ఉంటే మన ప్రయత్నాలు ఫలిస్తాయనటంలో నాకు ఏ భయమూ లేదు" అన్నాడాయన.)

దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్నట్టు... దేశవ్యాప్త ప్రజా ఉద్యమం నడపటానికి కాంగ్రెసు వరమిచ్చినా, గాంధీ మహాత్ముడు- ఠట్! వీల్లేదు. ఫలానాచోట నేను మాత్రమే ఉద్యమం నడుపుతాను. నన్ను చూసి ఉద్యమమెలా చేయాలో మీరు నేర్చుకోండి. అల్లరి చెయ్యకుండా బుద్ధిగా కూర్చుని గుడ్లప్పగించి చూడటమే మీ పని- అనటమేమిటి? అసలు - కాంగ్రెసు అయినా మరో రాజకీయ సంస్థ అయినా బతికేదే ప్రజల ఆదరణ మీద ఆధారపడి! ప్రజలను సేవించటానికి పుట్టిన కాంగ్రెసు సంస్థ ప్రజలకే షరతులు విధించి... మీరంతా రాట్నం వడికి, ఖద్దరు కట్టి, అంటరానితనాన్ని నిశ్శేషంగా నిర్మూలిస్తే తప్ప, ప్రజాకంటక ప్రభుత్వంపై తిరగబడే యోగ్యత మీకుండదు అని కండిషన్లు పెట్టటమే విడ్డూరం. సామాజిక పరివర్తనలో భాగంగా జరగాల్సిన అస్పృశ్యత నిర్మూలన, మత సమైక్యత వంటి ఆశయాలను తీసుకుపోయి విదేశీ దుష్ట ప్రభుత్వంపై తక్షణం జరగాల్సిన రాజకీయపోరాటంతో ముడిపెట్టి అది లేనిదే ఇది ఉండదు అని శాసించటమే చోద్యం. వారు పెట్టిన షరతులను చచ్చీచెడీ నెరవేర్చిన ప్రాంతాల్లో కూడా ఉద్యమం సాగేందుకు వీల్లేకుండా గాంధీ మాస్టారు అడ్డంపడి- మీకేమీ చేతకాదు. నేను ఏమి చేసేదీ చూస్తూ నోట్లో వేలేసుకుని కూర్చోండంతే - అని బెత్తం పట్టుకోవడం మరీ హాస్యాస్పదం.

గాంధీగారు తాను ఊహించుకుంటున్నట్టు సూపర్‌మానే కావచ్చు. మిగతా నాయకులెవరూ ఆయనంత శక్తిసంపన్నులు కాకపోనూ వచ్చు. దేశంలోని జనులంతా శుంఠలే అయి ఉండవచ్చు. కాని సూరత్ జిల్లాలో ఒక చిన్న తాలూకా అయిన బార్డోలీలో ఆ సూపర్‌మాన్‌గారు ఆచి తూచి, బహు జాగ్రత్తగా ఉద్యమిస్తే చాలు మొత్తం ఉప ఖండాన్ని ఏకచ్ఛత్రంగా ఏలుతున్న బ్రిటిషు దొరతనం తోక ముడిచి, గజగజ వణికి, దేశం వదిలి పరారవుతుందా? దేశమంతటా ఏ అలజడీ, ఎలాంటి ప్రతిఘటనా లేక అంతా ప్రశాంతంగా ఉంటే ఓ చిన్న ప్రాంతంలోని సత్యాగ్రహానికి కర్కోటక ప్రభుత్వం ఎందుకు బెదురుతుంది? దేశానికి స్వరాజ్యం ఎలా వస్తుంది?

మనలాంటి అల్పమానవులకు ఇలాంటి సందేహాలు ఎన్నో వస్తాయి. కాని యుగపురుషుడు, వీరాధివీరుడు అయిన గాంధీ మహాత్ముడికి తాను బార్డోలీలో ఇలా

ఉద్యమం మొదలెట్టగానే అలా 'భూకంపం' పుట్టి, ప్రభుత్వ వ్యవస్థ యావత్తూ చచ్చుపడి, స్వరాజ్యం ఉరుక్కుంటూ వచ్చేస్తుందనటంలో ఈషణ్మాత్రం అనుమానంలేదు. ఎఐసిసి సభాసదులకు ఆయన అనుగ్రహించిన ఈ ఉపదేశామృతాన్ని ఆస్వాదించండి.

Gandhi said: "Mass civil disobedience is like an earthquake, a sort of upheaval on the political plane. Where the reign of mass civil disobedience begins, there the subsisting Government ceases to function. There, every policeman, every soldier, every Government official must either leave the place, or enlist in the service of Swaraj. The police stations, the court offices etc., all shall cease to be the Government property and shall be taken charge of by the people. But for the purpose there should not be the slightest display or exercise of physical force by the people... When the Swaraj flag floats victoriously at Bardoli then the people of the Taluk next to Bardoli, following in the steps of Bardoli, should seek to plant the flag of Swaraj in their midst. Thus district by district, in regular succession, throughout the length and breadth of India, should the Swaraj flag be hoisted. If, however, while the movement is on, there is the slightest outbreak of violence in any part of the country, then it would not be safe or advisable to prosecute the campaign any further."

[*Mahatma*, D.G.Tendulkar, Vol. II. P. 66]

అర్థం చేసుకోగలిగితే గాంధీ బండారం మొత్తం ఈ పేరాలో ఉంది. గాంధీగారే స్వయంగా అక్షరమక్షరం సరిచూసి ఆమోదించిన గ్రంథరాజం కాబట్టి డి.జి. తెండుల్కర్ 'మహాత్మా' రెండో సంపుటిలో ఉటంకించిన గాంధీ పలుకులు నిజంగా అయన అన్నవా కావా అన్న అనుమానం అక్కర్లేదు. సారాంశం ఏమిటంటే - సామూహిక శాసనోల్లంఘనం భూకంపం లాంటిదట. రాజకీయ రంగంలో అది గొప్ప అలజడిని పుట్టిస్తుందట - సామూహిక శాసనోల్లంఘనం ఎక్కడ మొదలైతే అక్కడ ప్రభుత్వం పనిచేయటం ఆగిపోతుందట. అక్కడున్న ప్రతి పోలీసువాడు, ప్రతి సైనికుడు, ప్రతి ప్రభుత్వాధికారి ఇక ఆ చోటు వదిలిపెట్టి వెళ్లనైనా వెళ్లాలి, లేదా స్వరాజ్యం సేవకు అర్జీ పెట్టుకోవల్సిందేనట. పోలీసుస్టేషన్లు, కోర్టులు, ఆఫీసులు వగైరాలన్నీ ప్రభుత్వ ఆస్తులు కాకుండా పోతాయట, వాటిని ప్రజలు స్వాధీనపరచుకుంటారట.

ఇంతవరకూ బాగానే ఉంది. విప్లవం వచ్చినప్పుడు అలాగే జరుగుతుంది. ఫ్రాన్సులో, రష్యాలో, ఇంకా అనేకదేశాల్లో జనం తిరగబడినప్పుడు ప్రభుత్వ వ్యవస్థ

సరిగ్గా గాంధీ చెప్పినట్టే కుప్పకూలింది. కాని – అదంతా ఏ మహాత్ముడి మహిమ వల్లో దానికదే జరిగిపోలేదు. ప్రపంచంలో ఏ ప్రభుత్వమూ తన అధికారాన్ని స్వచ్ఛందంగా వదులుకోదు. దాన్ని నిలుపుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించి తీరుతుంది. ప్రజా ప్రతిఘటనను అణచివేయడానికి సర్వశక్తులూ ఒడ్డి, పశుబలమంతటినీ ప్రయోగించి, దారుణ దమన కాండకు పాల్పడుతుంది. ప్రభుత్వ బలాన్ని అదే స్థాయిలో అంతే కర్కశంగా ప్రజాబలం ఎదుర్కొని, గెలిచినప్పుడే విప్లవం ఫలిస్తుంది. ప్రభుత్వం కూలుతుంది. అధికారం ప్రజలకు హస్తగతమవుతుంది. చరిత్రలో ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా సాధారణంగా ఇదే జరిగింది. అంటే – నిరంకుశ ప్రభుత్వాన్ని లొంగదియ్యాలంటే బలప్రయోగం తప్పనిసరి.

కాని – అది మాత్రం కూడదంటారు మహాత్ములవారు. ప్రజలు బలం ప్రదర్శించడం గానీ, బలాన్ని ప్రయోగించటం కానీ ఎంతమాత్రమూ పనికిరాదని ఆయన ఆజ్ఞ !! పోలీసు స్టేషన్లు, కోర్టులూ, ఆఫీసులూ వాటికవే ఖాళీ అయిపోవు. ఎవరూ వెంటపడకుండా, పోలీసులూ, సైనికులూ వారంతట వారే పరారైపోరు. ప్రజలు ఉద్యమించి, శాసనోల్లంఘనకు దిగినప్పుడు ప్రభుత్వం తప్పనిసరిగా బలప్రయోగం చేస్తుంది. ఎదిరించిన వారిని హింసిస్తుంది. చంపేస్తుంది. క్రూరాతి క్రూరంగా వేధిస్తుంది. అప్పుడు ప్రజలు ఏమిచెయ్యాలి? ఏమి చెయ్యకూడదు. చంపితే నవ్వుతూ చచ్చిపోవాలి. చితకబాదితే చిరునవ్వుతో సహించాలి. ఎంత సతాయించినా భరించాలి. కనీసం ఆత్మరక్షణకు కూడా చెయ్యి ఎత్తరాదు. ఎదురుదాడి అసలే కూడదు – అని మహాత్ముడి ఆర్డరు !

మరి ప్రతిఘటనే లేకపోతే ప్రభుత్వం ఎందుకు తోకముడుస్తుంది? ఆ విషయంలో డౌటేవద్దు అంటారు మహాత్ములుంగారు ! బార్డోలీలో ఆయన అద్భుత శాసనోల్లంఘనాన్ని మొదలు పెట్టీపెట్టగానే అక్కడి ప్రభుత్వ వ్యవస్థ దానంతట అదే కుప్పకూలిపోతుందట. బార్డోలీలో స్వరాజ్య పతాకం ఎగరగానే, దాని పొరుగు తాలూకా బార్డోలీ అడుగుజాడల్లో నడిచి తనూ స్వరాజ్యం జెండా ఎగరవేయాలట. అలా తాలూకా తరవాత తాలూకా, జిల్లా తరవాత జిల్లా దేశం నలుమూలలా స్వతంత్ర పతాకం ఎగరేస్తాయట. ఆ విధంగా గాంధీగారి మంత్రదండం పుణ్యమా అని భారతదేశానికి అప్రయత్నంగా అహింసా యుతంగా స్వరాజ్యం వచ్చి ఒళ్లో వాలుతుందట.

ఇదీ– మన జాతీయోద్యమ సారథి, సర్వసైన్యాధిపతి అయిన మహాత్ముడి కార్యాచరణ ప్రణాళిక. వెర్రి ఊహలతో అల్లిన ఈ స్వరాజ్యాన్ని సాధించి తీరుతానని ఏ ధైర్యంతో ఆయన అన్నాడు? అంతా ఆయన చెప్పినట్లే నడచుకుని, ఆయన ఇష్టప్రకారమే ఉద్యమాన్ని మొదలుపెట్టనిచ్చి కాసేపయ్యాక 'ఏదయ్యా నువ్వు చెప్పిన స్వరాజ్యం' అని

అడిగితే మహాత్ముడు ఏమంటాడు? మొగంచెల్లక ఎంత ఇరకాటంలో పడతాడు- అని ఎవరూ బెంగపడాల్సిన పనిలేదు. అటువంటి సంకటం ఆయనకు రానేరాదు. ఎటుపోయి ఎటు వచ్చినా తనకు ఇబ్బంది లేకుండా కావలసిన బిగింపును ఆయన ముందే చేసుకున్నాడు. ఇండియాకు తిరిగొచ్చి, తన 'నిగూఢ రాచకార్యా'న్ని మొదలుపెట్టినది లగాయతు ప్రతి ఉద్యమానికి, ప్రతి కార్యానికి ముందు విధిగా తగిలిస్తున్న షరానే ఈసారీ ఆయనపైన ఉటంకించిన ప్రసంగంలోనూ జోడించాడు. ఉద్యమం నడుస్తున్న సమయంలో, దేశంలోని ఏ భాగంలోనైనా పిసరంత హింస తలెత్తితే చాలు పోరాటాన్ని కొనసాగించటం ఎంత మాత్రమూ క్షేమం కాదు అని!

అదీ కిటుకు ! ముప్పై కోట్ల జనం నివసించే విశాల దేశంలో రోజూ ఏదో ఒక మూల ఏదో ఒక ఘర్షణ, ఏదో విధమైన హింస తలెత్తుతూనే ఉంటుంది. కాబట్టి ఏ ఉద్యమాన్నయినా ఎప్పుడు తలచుకుంటే అప్పుడు అర్ధాంతరంగా ఆపెయ్యటానికి సాకుగా మహాత్ముడికి ఎల్లవేళలా ఏదో ఒక హింస దొరుకుతూనే ఉంటుంది. అదిగో ఆ హింస వల్లే నాకు మనసు విరిగింది. బంగారంలాంటి ఉద్యమం మీవల్లే పాడయింది అని ఎదురు తిరిగి ప్రజలనే తప్పుబట్టగలడు. కనుక మహాత్ముడికి చింతలేదు; బెంగలేదు. అనివార్యంగా తలెత్తే హింసను తన నిష్క్రియా పరత్వానికి కవచంగా వాడుకునే- ఆయన లోగడ రౌలత్ బిల్లులకు వ్యతిరేకంగా సత్యాగ్రహాన్ని మొదలుపెట్టీపెట్టగానే అహమ్మదాబాదు. బొంబాయిల్లో అల్లర్ల మిషతో మూడోనాటికల్లా నిలిపివేసిన సంగతి తెలిసిందే.

దాని తరవాత గాంధీ దేశానికి ఇచ్చిన సెకండ్ షాకు బార్డోలీలో. రాష్ట్రాలకు ఉద్యమ స్వేచ్ఛనిస్తూ తీర్మానం చేసినాసరే ఎవరూ ఏమి చేయకండి, అడుగుముందుకు వేయకండి, చేతులు కట్టుకుని బుద్ధిగా కూర్చుని బార్డోలీలో నేను చేయబోయే మహా ప్రయోగాన్ని చూసి నేర్చుకోండి - అని ఎఐసిసి సభ్యులకు 1921 నవంబర్ 4న ఆనతిచ్చి మహాత్ముడు ఏకాఏకి బార్డోలీ వెళ్లాడు. 'భూమి కంపించేలా' తాను తలపెట్టిన సత్యాగ్రహ మహా సంగ్రామానికి వల్లభ్‌భాయ్‌పటేల్‌తో కలిసి భారీ ఎత్తున సన్నాహాలు చేశాడు. నవంబర్ 17న వేల్సు యువరాజు భారత పర్యటనను బహిష్కరిస్తూ దేశమంతటా కాంగ్రెసు జరపదలచిన హర్తాళ్ తరవాత నవంబర్ 23న బార్డోలీ సత్యాగ్రహం మొదలవ్వాలని మాంచి ముహూర్తం పెట్టారు. సర్వసైన్యాధిపతిలా సేనలను మోహరించి, ఎవరికి వేయాల్సిన డ్యూటీ వారికి వేసి, శాసనోల్లంఘన నియమాలను, ప్రాశస్త్యాన్ని ప్రజలకు పదే పదే తెలియజెప్పి పత్రికల్లో ప్రకటనలు, వివరణలు గుప్పించి గాంధీచేసిన హడావుడితో వాతావరణం వేడెక్కింది. సర్వత్రా ఉత్కంఠ నెలకొని దేశ జనులందరూ ఊపిరి ఉగ్గబట్టుకుని చూస్తుండగా... ...

ఎవరూ ఊహించనిది జరిగింది. మహా పోరాటం మొదలవకముందే చివరి నిమిషంలో దానికి మహాత్ముడు సడెన్‌బ్రేక్ వేశాడు. కారణం మళ్లీ బొంబాయే. వేల్సు యువరాజు బొంబాయిలో అడుగుపెట్టిన రోజే బొంబాయిలో మిల్లు కార్మికులు, ఆందోళనకారులు చెలరేగి నానా ఆగం చేశారు. సర్కారు కొమ్ముగాసి యువరాజును స్వాగతించిన పార్టీల మీద, పోలీసులమీద దాడిచేసి, ట్రాముకార్లు తగులబెట్టి, భారీ విధ్వంసానికి పాల్పడ్డారు. అల్లర్లలో 53 ప్రాణాలు పోయాయి. ఆ రాత్రికి రాత్రే బార్డోలీలో తలపెట్టిన సత్యాగ్రహాన్ని నిలిపివేస్తూ మహాత్ముడు మెరపునిర్ణయం చేశాడు.

జనం ఉసూరుమన్నారు. కాని అర్థంచేసుకున్నారు. అల్లర్లు చెలరేగిన సమయంలో గాంధీగారు బొంబాయిలోనే ఉన్నారు. అరాచక శక్తుల ఆగడాలను ఆపడానికి యథాశక్తి ప్రయత్నించి విఫలమయ్యారు. "అహింసను జపిస్తూనే... మనతో విభేదించే వారిపై దౌర్జన్యానికి, హింసకు దిగటం దారుణం. నా కళ్లముందు చూసిన స్వరాజ్యం కంపుగొడు తోంది" అన్న గాంధీ ఆవేదనలో ప్రజలు పాలుపంచుకున్నారు. బొంబాయిలో హింసా కల్లోలం పేట్రేగినప్పుడు బొంబాయి ప్రెసిడెన్సీలోని బార్డోలీలో అహింసాయుత ఉద్యమం సాగించటం మంచిది కాదన్న వాదానికి తల ఊపారు.

ఏమైతేనేం? బార్డోలీలో గాంధీగారు ప్రకటించిన 'మోడల్ ఉద్యమం' ఆగిపోయింది. మళ్లీ ఎప్పుడు మొదలవుతుందో, అసలు జరుగుతుందో లేదో కూడా తెలియదు. ఇక ఖాళీగా కూర్చోవడమెందుకని ఆంధ్రా కాంగ్రెసువారు చొరవ తీసుకుని ఎఐసిసి తీర్మానానికి లోబడి గుంటూరు జిల్లాలో పన్నుల పోరాటం మొదలెట్టారు. అది ఉవ్వెత్తున అద్భుతంగా నడిచి యావద్భారత దృష్టినీ ఆకర్షించింది. దాన్నీ సజావుగా సాగనియ్యక గాంధీగారు అడుగడుగునా అడ్డంపడి, బార్డోలీలో తానెప్పుడో జరిపే ప్రయోగానికి అది అవరోధమని చిరాకుపడి, పండంటి ఉద్యమాన్ని బలవంతంగా ఎలా ఆపించిందీ కిందటి అధ్యాయంలో చూశాం.

ఆంధ్రాపోరాటాన్ని అడ్డగించటానికి బార్డోలీని డాలుగా అంతలా వాడేసుకున్నాక బార్డోలీ పోరాటాన్ని తాత్సారం చేయడానికి ఇంకేమాత్రం వీల్లేకుండా పోయిందను కున్నారేమో గాంధీ అన్యమనస్కంగానే కదిలాడు. వారంరోజుల్లోగా ప్రభుత్వం సత్యాగ్రహ ఖైదీలను విడిచిపెట్టి, పత్రికలపై ఆంక్షలు ఎత్తేసి, అహింసాత్మక ఆందోళనను సాగనిస్తామని ప్రకటిస్తే సరే, లేదా- బార్డోలీలో శాసనోల్లంఘనోద్యమం మొదలవుతుంది - అని 1922 ఫిబ్రవరి 1న వైస్రాయికి ఆయన అల్టిమేటం ఇచ్చాడు. ఆ పప్పులేవీ ఉడకవు. దేనికీ ఒప్పుకునేది లేదని ప్రభుత్వం 6న తెగేసి చెప్పింది. అయితే తప్పదు పోరాటం- అని ఫిబ్రవరి 6న గాంధీగారు శంఖం పూరించాడు. కాంగ్రెసు వర్కింగు కమిటీ అర్జంటుగా

సూరత్‌లో సమావేశమై బార్డోలీ ప్రజలను అభినందించి, 'విజయోస్తు' అని దీవించి, వీరతిలకం దిద్దింది. మిగతా దేశవాసులందరూ ఎక్కడెక్కడి ఉద్యమాలనూ కట్టిబెట్టి, బార్డోలీకి సంఘీభావంతో నిలిచి సహకరించాలని పిలుపిచ్చింది.

మళ్లీ వాతావరణం వేడెక్కింది. యావద్దేశం రెప్పవాల్చకుండా, ఊపిరి తీయకుండా బార్డోలీ మీదే దృష్టి నిలిపింది. బ్రహ్మాండమైన టెంపో నెలకొని ఎక్కడ విన్నా బార్డోలీ పేరు మారుమోగింది. అహింసా ప్రవక్త, స్వాతంత్ర్యసేనాని అయిన మహాత్ముడు స్వయంగా మందుండి నడిపించే లోకోత్తర పోరాటం ఎలా సాగుతుందా, చిరకాలంగా కోరు కుంటున్న స్వరాజ్యం ఏ దారిన, ఏ రీతిన వచ్చేస్తుందా అని నిఖిల లోకం నిరీక్షిస్తుండగా...

షరా మామూలే ! మళ్లీ ఊహించినదే జరిగింది. ఉత్తర కుమారుడి తాతలా కోతలు కోసి కోసి, చివరికి మహాత్ముడు తుస్సుమనిపించాడు. మొదలుకాకుండానే పోరాటాన్ని ఆపేశాడు. ఈసారి మూడో షాకుకు దొరికిన సాకు చౌరీచౌరా!

దేవుడు - సైతాను - గాంధీ

***"ఉ**ద్యమ దీక్షతో ఉద్వేగ భరితమై యావద్దేశం రగిలిపోతున్న సమయంలో పిడుగులాంటి కబురు. ప్రజలు నోట మాట రాక నిశ్చేష్టులయ్యారు. నియంత ఆదేశాన్ని అప్పటికి తలదాల్చినా కాంగ్రెసు శిబిరంలో పెద్ద తిరుగుబాటు లేచింది. ఎక్కడో చౌరా చౌరీలో ఏదో జరిగిందని చెప్పి దేశవ్యాప్త ఉద్యమాన్ని మహాత్ముడు గొంతు నులిమి వెయ్యటం ఎవరికీ అర్థంకాలేదు. శాసనోల్లంఘనోద్యమం విజయవంతం కావటానికి దేశంలో పరిస్థితి ఎంతో అనుకూలంగా ఉన్న తరుణంలో రాష్ట్రాల ప్రతినిధులెవరినీ అడగా పెట్టకుండా మహాత్ముడు ఈ పని చేయడం అందరికీ ఆగ్రహం కలిగించింది.*

"ప్రజల ఉత్సాహం ఉరకలేస్తుండగా ఉద్యమాన్ని వెనక్కి లాగడం జాతీయ ఉపద్రవం తప్ప మరొకటి కాదు. చెరసాలలో ఉన్న దేశబంధు దాస్, పండిట్ మోతీలాల్ నెహ్రూ, లాలాలజపతిరాయ్ వంటి ముఖ్య సర్దార్లందరూ ప్రజల క్రోధంలో పాలుపంచుకున్నారు. అప్పుడు నేను 'దేశబంధు'తోనే ఉన్నాను. మహాత్మాగాంధీ పదే పదే తప్పటడుగులు వేస్తున్న తీరుకు ఆయనకు పట్టరాని కోపం వచ్చింది..."

The Indian Struggle గ్రంథం(82వ పేజీ)లో **నేతాజీ సుభాస్ చంద్రబోస్** అన్న మాటలివి. అనంతర కాలంలో గాంధీజీనే ఎదిరించి, ఎన్నికలలో గెలిచిన ఫైర్‌బ్రాండు నాయకుడు కాబట్టి నేతాజీకి గాంధీ అంటే గిట్టదేమో, అందుకే ఇలా రాశాడేమో అని శంకించాల్సిన పనిలేదు. ఉద్ధృతంగా సాగుతున్న ఉద్యమాన్ని నిలువునా ఉసురుతీసిన గాంధీ నిర్వాకానికి దేశమంతటా చిన్నా పెద్దా నాయకుల్లో, లక్షలాది కాంగ్రెసు కార్యకర్తల్లో, కోట్లాది దేశభక్తుల్లో రగిలిన అసంతృప్తినీ, తీవ్రాగ్రహాన్నే సుభాస్‌బోస్ వ్యక్తీకరించాడు. ఉదాహరణకు - గాంధీకి అత్యంతప్రీతిపాత్రుడు, తరవాతి కాలంలో తన రాజకీయ వారసుడిగా బాపూజీయే ఎన్నిక చేసిన ప్రియశిష్యుడు అయిన **జవహర్‌లాల్ నెహ్రూ** ఇదే ఘట్టానికి సంబంధించి తన **ఆత్మకథ**లో ఏమన్నాడో చిత్తగించండి :

"ప్రతిఘటనోద్యమాన్ని గాంధీజీ ఆపేశారని తెలిసి, జైల్లోని మేము నిశ్చేష్టుల మయ్యాం. బలాన్ని సంఘటిత పరచుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్న సమయంలో పోరాటాన్ని అకస్మాత్తుగా ఆపెయ్యడమేమిటని మా అందరికీ చాలా కోపం వచ్చింది. దేశంలోని ప్రముఖ కాంగ్రెసు నాయకులు యావన్మందీ ఈ నిర్ణయాన్ని నిరసించారు. జైల్లో ఉన్న మా నాన్నగారైతే.చాలా బాధపడ్డారు. యువకులకు తీవ్రావేశం కలిగింది. మేము పెట్టుకున్న ఆశలన్నీ నేలకూలిపోయాయి."

కూలవా మరి ? ఫిబ్రవరి 1న ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చి, ప్రభుత్వం దాన్ని ఖాతరుచెయ్యకపోవటంతో 7వ తేదీన పోరాటానికి నడుము బిగిస్తూ గంభీర ప్రకటన చేసిన మహాత్ముడు మళ్లీ 24 గంటలు తిరక్కుండానే కాడికిందపారేసి... మొదలవకుండానే పోరాటాన్ని ఆపేసి... పురిట్లోనే సంధి కొట్టించటం సామాన్యమైన షాకా?! చరిత్రకారుడు అర్.సి. మజుందార్ అన్నట్టు - తమ ఆరాధ్య నాయకుడు, సర్వసైన్యాధిపతి అయిన మహాయోధుడు అర్భాటంగా ముందుకు అడుగువేసినట్టే వేసి - అంతలోనే అంత అవమానకరంగా వెనక్కి తిరుగుతాడని ఏ భారతీయుడూ కలనైనా ఊహించలేదు. 8వ తేదీ ఉదయం పత్రికల్లో చౌరా చౌరీ దురంతం గురించి పతాక శీర్షికలో చూసీచూడగానే... వాస్తవంగా జరిగిందేమిటో, దానికి దారితీసిన పరిస్థితులేమిలో నింపాదిగా తెలుసుకుని ఒక నిర్ణయానికి రావాలన్న విజ్ఞత లేకుండా... ఎప్పుడెప్పుడు ఉద్యమాన్ని ఆపేద్దామా అని గాంధీ తహతహలాడాడు. సందు దొరికింది అంతే చాలన్న ఆత్రంతో... ఉద్యమాన్ని తక్షణం నిలుపుచేయాలన్న నిశ్చయాన్ని అప్పటికప్పుడే ప్రకటించి... దాన్ని మమ అనిపించుకోవడంకోసం కాంగ్రెసు వర్కింగు కమిటీ సభ్యులను ఉన్న పళాన బార్డోలీకి పిలిపించి, చెవులు పిండి తీర్మానం చేయించుకున్నాడు.

శాసనోల్లంఘన జరపదలచింది బార్డోలీలో అయితే దుర్ఘటన జరిగింది చౌరాచౌరీలో. దానికీ దీనికీ మధ్య వెయ్యి మైళ్ల దూరం. ఇక్కడ ఉద్యమానికీ, అక్కడి హింసకూ ఎలాంటి సంబంధం లేదు. చౌరా చౌరీ అనేది గోరఖ్‌పూర్ దగ్గర చిన్న ఊరు. 1922 ఫిబ్రవరి 5న ఊరేగింపు తీసిన స్థానికులకూ, పోలీసులకూ మధ్య గొడవ జరిగింది. అందోళనకారులపై పోలీసులు కాల్పులు జరిపారు. వారు తిరగబడ్డారు. కొంతసేపటికి పోలీసుల తుపాకుల్లో తూటాలు అయిపోయాయి. అల్లరి గుంపునుంచి తప్పించుకునేందుకు పోలీసులు ఠాణాకు పరుగెత్తారు. జనం వెంట పడ్డారు. ప్రాణభయంతో పోలీసులు తలుపులు బిడాయించు కున్నారు. జనం పోలీసు స్టేషనుకు నిప్పుపెట్టారు. బయటికి పరుగెత్తబోయిన వారిని పట్టుకుని మంటల్లో విసిరేశారు. మొత్తం 22 మంది పోలీసులు సజీవదహనమయ్యారు.

అల్లరి మూకలు చేసింది ముమ్మాటికీ తప్పే. క్షమించరాని కిరాతకమే. సభ్య సమాజానికి తలవంపులు తెచ్చే దురాగతమే. సందేహం లేదు. గాంధీ అంతటి అహింసా ప్రవక్త ఈ పైశాచిక హింసాకాండకు తల్లడిల్లిపోవటమూ సహజమే. కాని యు.పి.లో ఈ దారుణం జరిగిందన్న మిషతో గుజరాత్‌లో మొదలవనున్న మహోద్యమాన్ని మొగ్గలోనే చిదిమెయ్యటం ఎంతవరకు సబబన్నది పాయింటు. విదేశీ దొరతనం పిచ్చెత్తినట్టు రెచ్చిపోయి దుర్భర దమనకాండతో ప్రజలను కాల్చుకు తింటున్న సమయమది. స్వతహాగా ఎంతటి శాంత స్వభావులకైనా ఒళ్లెరుగని కోపం రాక తప్పని పరిస్థితులను బ్రిటిషు సర్కారు పనిగట్టుకుని పరిపరి విధాల కల్పించింది. ప్రభుత్వమే తెగబడి ఇనుప పాదాలతో ప్రజలను అణచివేయబూనినప్పుడు అవేశకావేశాలు రెచ్చి ఎక్కడో ఒకచోట అవాంఛనీయ దుర్ఘటనలకు దారితీయటం వింత కాదు. అలాంటప్పుడు ఎక్కడో ఒక హింసాత్మక దుర్ఘటన జరిగిందని మొత్తం ఉద్యమాన్ని ఆపెయ్యటం భావ్యమా?

కాదు. ఆ మాట ఎవరో చెప్పక్కర్లేదు. సాక్షాత్తూ గాంధీ మహాత్ముడే స్వయంగా సెలవిచ్చి ఉన్నాడు. ఆర్నెల్లకింద (1921 సెప్టెంబర్ 15న) మద్రాసులో 'డైలీ ఎక్స్‌ప్రెస్' పత్రిక ఆయన్ని ఇంటర్వ్యూ చేస్తూ "ఇంతకు ముందు రౌలత్ సత్యాగ్రహంలో చేసినట్టే రేపు సహాయ నిరాకరణోద్యమాన్ని కూడా ఎక్కడైనా హింస చెలరేగగానే ఆపేస్తారా?" అని అడిగింది. దానికి గాంధీజీ ఇచ్చిన జవాబు ఇది:

"I am sorry I can not do so for the civil disobedience campaign was aimed at a particular Act. This non-co-operation movement is aimed at the whole system of Government, and as it is aimed at the whole system of Government, it is not possible for me to abandon it. It is a big movement and there are tremendous risks to be taken, in order to do away with the greatest of them which is the continuance of the system".

[*Collected Works of Mahatma Gandhi*, Vol. 24, #124, P.230]

(ఐ యాం సారీ, నేనా పని చెయ్యలేను. వెనకటి ఉద్యమం ప్రత్యేకంగా ఒక చట్టానికి వ్యతిరేకంగా తలపెట్టినది. ఇప్పటి సహాయనిరాకరణోద్యమం మొత్తం ప్రభుత్వ వ్యవస్థపై ఎక్కుపెట్టినట్టిది. కాబట్టి దీన్ని విడనాడటం నాకు సాధ్యం కాదు. ఇది చాలా పెద్ద ఉద్యమం. ప్రస్తుత వ్యవస్థను ఇలా కొనసాగనివ్వడమే అన్నిటికంటే గొప్ప రిస్కు అయినప్పుడు దాన్ని అంతమొందించటానికి ఎన్నో పెద్ద రిస్కులను తీసుకోవలసిందే.)

ససేమిరా చేయనని చెప్పిన పనినే సత్యవాక్కుల గాంధీ నిస్సంకోచంగా చేశాడు. "హిందుస్తాన్‌లో కొన్ని ప్రాంతాల్లో ఏవో ప్రత్యేక కారణాలతో జనం హింసకు దిగినంత

మాత్రాన నేను పౌర ప్రతిఘటన సత్యాగ్రహాన్ని కొనసాగించకుండా ఎలా ఉండగలను. ఎవరోకొందరు ఆ సమయంలో తప్పుచేసినంత మాత్రాన నేను ఒప్పు అనుకున్నది చేయకుండా మానాలా ? - అని 1919 అక్టోబరులో **'యంగ్ ఇండియా'** పత్రికలో గొప్పగా రాసుకున్న మహాత్ముడే తన మాటల్ని తానే నమిలిమింగేసి, బార్డోలీ ఉద్యమాన్ని మొదలవకుండానే చేతులారా తుదముట్టించాడు. ఏది చేయనని చెబుతాడో దాన్నే చెయ్యటమే గాంధీగారి సత్యనిష్ఠ.

మామూలుగా ఎవరైనా మాట తప్పితే మొగం చెల్లక ఇబ్బంది పడతారు. గాంధీగారు సామాన్య మానవుడు కాదు. కాబట్టి ఆయనకలాంటి అవస్థరాదు. తడవకోమాట మార్చినా, ఎన్ని వాగ్దాన భంగాలు చేసినా, అదే కరక్టనీ, అసలు తప్పంతా ప్రజలదేననీ ధర్మాగ్రహం వెలిబుచ్చటం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. ఆఖరి క్షణంలో పోరు మొదలెట్టకుండానే రంగంనుంచి పరారై యావద్భారతానికీ తీవ్ర ఆశాభంగం కలిగించిన తాజా నిర్వాకాన్నీ ఆయన దేవుడి ఖాతాలో వేసి ఎంత సొంపుగా సమర్థించుకున్నాడో చూడండి :

Bardoli's civil disobedience has vanished like a dream. God meant to stop it at the very moment when it was to start. It is only when we have had the experience again and again of things which had once appeared real to us having faded away into dreams, that we shall learn the true meaning of Swaraj...

God has warned me the third time that there is not as yet in India that truthful and non-violent atmosphere which alone can justify mass disobedience... God spoke clearly through Chauri Chaura. I understand that the constables who were so brutally hacked to death had given much provocation... It is claimed that no non-co-operation volunteer had a hand in the brutality... When India claims to be non-violent and hopes to mount the throne of liberty through non-violent means, mob- violence even in answer to grave provocation is a bad augury...

"But what about your manifesto to the viceroy and your rejoinder to his reply?" spoke the voice of Satan. It was bitterest cup of humiliation to drink. "Surely it is cowardly to withdraw the next day after pompous threats to the government and promises to the people of Bardoli. "Then Satan's invitation was

to deny Truth and therefore Religion, to deny God Himself... The drastic reversal of the programme may be politically unsound and unwise, but it is religiously sound..."

[*Young India* 16-2-1922, *Navjivan*, 19-2-1922
***CWMG*, Vol. 26, PP 177-180, 184]**

"(బార్డోలీలో పౌర ధిక్కారం కలలా మాయమైంది. మొదలవాల్సిన క్షణంలోనే దాన్ని ఆపెయ్యాలని దేవుడు అనుకున్నాడు... వాస్తవంగా కనపడినట్టివి మాటిమాటికీ కలలా కరిగి పోయినప్పుడే స్వరాజ్యానికి నిజమైన అర్థాన్ని మనం నేర్చుకుంటాం.

సామూహిక శాసనోల్లంఘనకు కావలసిన సత్యము, అహింసల వాతావరణం ఇండియాలో ఇంకా లేదని దేవుడు మూడోసారి నన్ను హెచ్చరించాడు. చౌరీ చౌరా ద్వారా దేవుడు స్పష్టంగా మాట్లాడాడు. అమానుషంగా చంపబడ్డ కానిస్టేబుళ్లు జనాన్ని చాలా రెచ్చగొట్టారని విన్నాను. అసహాయోద్యమ కార్యకర్తలెవరికీ ఘాతుకంతో ప్రమేయం లేదనీ అంటున్నారు... అహింసకు కట్టుబడినట్టు, అహింసాత్మకంగా స్వాతంత్ర్య సింహాసనాన్ని అధిరోహించాలని కోరుతున్నట్టు ఇండియా క్లెయిం చేస్తున్నప్పుడు ఎంతటి రెచ్చగొట్టే పరిస్థితుల్లోనైనా మూక హింస చెడ్డ శకునం.

"మరి వైస్రాయికి నీ మేనిఫెస్టో, ఆయన జాబుకు నీ ఎదురు జవాబు మాటేమిటి?" అని సైతాను పలికాడు. ఆ పరాభవ కషాయం కటిక చేదయినా నేను తాగకతప్పదు. ప్రభుత్వానికి బెదిరింపులు, ప్రజలకు వాగ్దానాలు ఆర్భాటంగా చేసిన మరునాడే వెనక్కి పోవటం కచ్చితంగా పిరికితనమే అన్నాడు సైతాను. ఆ రకంగా సత్యాన్ని, మతాన్ని, ఏకంగా దేవుణ్నే నేను వదులుకునేట్టు చేయాలని సైతాను పన్నాగం... ఉద్యమ కార్యక్రమాన్ని ఇలా వెనక్కి లాగటం రాజకీయంగా అవివేకం కావచ్చు. కాని మతపరంగా సమంజసం.)

ప్రజల పక్షాన నిలబడి, ఇతర విషయాలేవీ పట్టించుకోకుండా, అన్నమాట ప్రకారం జాతీయోద్యమాన్ని తదేక దీక్షతో ప్రారంభించటం అంటే సైతాను ప్రలోభంలో పడటమన్నమాట ! సత్యానికి, మతానికి, ఆఖరికి భగవంతుడికే దూరం కావటమన్నమాట!! అట్టహాసంగా తలపెట్టిన ఉద్యమాన్ని గాంధీగారు ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు ఆపేస్తే ఆయనను ఏమీ అనడానికి వీల్లేదు. ఆయనకాబుద్ధి దేవుడే పుట్టించాడు. మొదలవకుండానే ఆగిపోవాలని ఆ ఉద్యమం మొగాన భగవంతుడే రాసిపెట్టాడు. దైవ నిర్ణయం అలా ఉన్నప్పుడు మనమేమి చేయగలం? దేవుడి పుత్రుడు అయిన మహాత్ముడు ఏమి చెబితే అది నమ్మేసి, మన ప్రాప్తమింతే లెమ్మని ఉసూరుమనడం తప్ప !!

అంతా బాగానే ఉంది. కాని – గాంధీ మతాచార్యుడు కాదు. ఆయన చేస్తున్నది మత ప్రచారమూ కాదు. ఆయన ఉన్నది రాజకీయాల్లో. రాజకీయాలను రాజకీయాల్లా

నడపాలిగానీ తాను చేసే వాటికీ, చేయలేకపోయినవాటికీ సమర్థింపుగా మతం పేరు వాడుకోవటమేమిటి? రాజకీయంగా అవివేకం ఐనా మతపరంగా కరెక్టు అన్నారే... చేపట్టిన ప్రజా ఉద్యమాన్ని నట్టేట ముంచాలని ఏ మతం చెబుతుంది? దేశంలో ఎక్కడా ఏ మూలా హింస తలెత్తకుండా ఉంటేనే అహింసాయుత కార్యక్రమం నడవాలని, వెయ్యి మైళ్ల అవతల హింస మైల తగిలితే చాలు అహింస మడిబట్టను ఉన్నపళాన విప్పేసి అహింసోద్యమాన్ని తక్షణం ఆపెయ్యాలని, ఏ మత ధర్మశాస్త్రంలో ఏ అశౌచ ప్రకరణం గాంధీకి చెప్పింది?

పది ఐరోపా దేశాల పెట్టు అయిన సువిశాల దేశంలో ఎక్కడా ఏ విధమైన హింసా తలెత్తకూడదని ఆశించటం అవివేకమని గాంధీకి మాత్రం తెలియదా? తెలుసుకాబట్టే కదా... శాసనోల్లంఘన ఉద్యమాన్ని దేశవ్యాప్తం కానీయకుండా అడ్డుపడి, గుజరాత్‌లో ఒక చిన్న ప్రాంతానికే దాన్ని గాంధీ పరిమితం చేసింది? అహింసాయుత ఉద్యమం ఎలానడపాలో తనకు మాత్రమే తెలుసుననీ, ముందుగా తన ప్రత్యక్ష పర్యవేక్షణలో బార్డోలీలో ఆ ఉద్యమం ఎలా నడుస్తుందో చూసి మిగతావారు నేర్చుకోవాలని చెప్పిన పెద్దమనిషి తన కార్యక్షేత్రంలో అనూహ్యంగా హింస ప్రకోపిస్తే తల్లడిల్లి, తన నాయకత్వం మీద తనకే నమ్మకం పోయి పోరాటాన్ని నిలిపేశాడంటే అర్థంచేసుకోవచ్చు. కాని ఎక్కడో వందలమైళ్ల దూరంలో వేరేదో రాష్ట్రంలో ఇంకేదో కారణంపై హింసాకాండ చెలరేగిందని చెప్పి, దానిని దేవుడి ఆనతిగా దబాయించటమేమిటి?

చౌరీ చౌరాలోనైనా పైశాచిక హింసకు పాల్పడింది గాంధీశిష్యులైతే... గాంధీ నాయకత్వంలో నడుస్తున్న కాంగ్రెసుకు చెందిన సహాయ నిరాకరణ కార్యకర్తలకు అందులో భాగం ఉండి ఉంటే గాంధీగారికి మనసు విరిగి, తన నాయకత్వ పటిమ మీదే నమ్మకం సడలి చేతిలోని పోరాటాన్ని ఆపేశారంటే అర్థం ఉంది. చౌరీ చౌరాలో ఘాతుకానికి పాల్పడింది అల్లరి మూక. నాన్ కోఆపరేషను కార్యకర్తలెవరికీ జరిగిన దానిలో ప్రమేయం లేదని గాంధీయే అన్నాడు. అలాంటప్పుడు బాధ్యత లేని గుంపు క్షణికోన్మాదంలో రెచ్చిపోయి చేసిన ఘాతుకానికి – క్రమశిక్షణతో చక్కగా సాగుతున్న ఉద్యమాన్ని నిలువునా బలిచెయ్యటం ఏ రకమైన ఉన్మాదం ?

ఇంత పెద్ద దేశంలో ఎక్కడా ఏ రకమైనా హింసా చెలరేగకుండా ఉంటే తప్ప తన అహింస కార్యక్రమం నడవదనీ... హింస తలెత్తితే చాలు నడిచే ఉద్యమానికి సడన్ బ్రేక్ వేస్తాననీ కండిషను పెడితే ఉద్యమాన్ని నడపటం దేవుడి వల్ల కూడా కాదు. కల్పాంతం వరకూ వేచి ఉన్నా హింస వాసన సోకని సుముహూర్తం దొరకదు. ఒకవేళ దొరికినా ఏ ఉద్యమమూ తిన్నగా సాగదు. ఎవరికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని తలపెడితే వారు కాస్తంత హింసను పనిగట్టుకుని ప్రేరేపిస్తే చాలు ఉద్యమం ఆగిపోతుంది. స్టీరింగు ఉద్యమ

నాయకుడి చేతిలో ఉన్నా బ్రేకులు తమ కంట్రోల్లో ఉన్నాయని గ్రహిస్తే తెలివి మీరిన సర్కారు ఊరుకుంటుందా? ఉద్యమం ముందుకు నడవకుండా అడుగడుగునా బ్రేకులు వేయదా? **జవహర్లాల్ నెహ్రూ** కూడా అదే అన్నాడు :

"ఉద్యమాన్ని నిలిపెయ్యటం కంటే అందుకు చెప్పిన కారణాలు మమ్మల్ని ఇంకా కలవరపరిచాయి. చౌరీ చౌరా గర్హించదగ్గ దుర్ఘటనే. అహింసాయుత ఉద్యమస్ఫూర్తికి పూర్తిగా వ్యతిరేకమే. కాని ఒక మారుమూల పల్లెలో రెచ్చిపోయిన గుంపు మన జాతీయ పోరాటాన్ని తాత్కాలికంగానైనా ఆపెయ్యగలదా? ఒక చెదురుమదురు హింసాత్మక ఘటనకు పర్యవసానం ఇదీ అంటే అహింసా పోరాటం నడిపే పద్ధతిలోనే ఏదో లోపం ఉంది. అవాంఛనీయ ఘటనేదీ జరగదని గ్యారంటీ ఇవ్వటం అసాధ్యం. ముప్ఫై కోట్ల పైగా ఉన్న జనాభా మొత్తాన్నీ అహింసలో తర్ఫీదు ఇస్తే తప్ప మనం అడుగుముందుకు వెయ్యకూడదా? ఒకవేళ అలాంటిది జరిగినా, పోలీసులు తీవ్రంగా రెచ్చగొట్టినప్పటికీ చలించక మనలో ఎంతమంది ప్రశాంతంగా నిలవగలరు? ఒకవేళ మనకు అది సాధ్యమైనప్పటికీ మన ఉద్యమంలో చొరబడి హింసను ప్రేరేపించే విద్రోహుల మాటేమిటి? ఇదే కనక కండిషను అయితే అహింసాత్మక ప్రతిఘటన ఎప్పటికీ విఫలమే అవుతుంది."

[***An Autobiography,*** **Jawaharlal Nehru** పే. 82]

దేశవాసులందరి మనసుల్లో మెదలిన ప్రశ్నలు ఇవి. వీటికి సమాధానం గాంధీ దగ్గర లేదు. ఆయన పెట్టే షరతుల ప్రకారం జాతీయ పోరాటం సాగించడమంటే కుక్కతోకపట్టి గోదావరిని ఈదటం లాంటిదే అని మెడమీద తలకాయ ఉన్న ప్రతివాడికీ అర్థమయ్యే ఉండాలి. ఐనా... ఇంత చక్కగా సాధ్యాసాధ్యాలను, పర్యవసానాలను విశ్లేషించ గలిగిన నెహ్రూ వంటి మహామేధావులే తమ సందేహాలను తమలోనే దాచుకుని గాంధీ దారికే వచ్చి అది 'డెడ్ఎండ్' అని తెలిసి తెలిసీ గొర్రెల్లా అనుసరించారు. బేషరతుగా సరెండర్ అయ్యారు. అదే గాంధీ మహిమ !

దేశమా! మోసం చెయ్యకు!

The Congress... what is it but a fascist organisation? Gandhi is the dictator like Stalin... what Gandhi says they accept and even the working committee follows him; then it goes to the All India Congress Committee which adopts it and then the Congress. There is no scope for any difference of opinion.

-*Sri Aurobindo,* **India's Rebirth,** *P. 213*

కాంగ్రెసు ఫాసిస్టు సంస్థ. గాంధీ స్టాలిన్ లాంటి నియంత... గాంధీ ఏమి చెబితే అది వారు ఆమోదిస్తారు. వర్కింగ్ కమిటీ కూడా ఆయననే అనుసరిస్తుంది. తరువాత ఎఐసిసి. అదీ ఆమోదించాక కాంగ్రెసు మహాసభ వంతు. అభిప్రాయ భేదానికి ఎక్కడా అవకాశమే లేదు.

తొలితరం విప్లవకారుల్లో అగ్రగణ్యుడైన అరవిందఘోష్, ఆధ్యాత్మికం వైపు మళ్లి శ్రీ అరవిందులుగా మారాక వెలిబుచ్చిన ఈ అభిప్రాయం వింటే ఎవరికైనా ఏమనిపిస్తుంది? ఇది - దారుణమైన అరోపణ అనేకదా? ఔను దారుణమైన ఆరోపణే. ఎందుకంటే - భారత జాతీయ కాంగ్రెసులో అభిప్రాయ భేదాలకు చాలా చాలా అవకాశం ఉంది. ఎంతటి నాయకుడి మీదైనా, ఏ నిర్ణయం పైనైనా ఆక్షేపణలు గుప్పించటానికి ఆ మహా సంస్థ బోలెడు అవకాశం ఇస్తుంది. ఎవరు చెప్పినా వింటుంది. కాని విన్నది విన్నట్టు వదిలేస్తుంది. చివరికి తాను చేయవలసింది తాను - అధినేత ఎలా చెబితే అలా బుద్ధిగా చేస్తుంది.

ఉదాహరణకు నాన్ కోఆపరేషను ఉద్యమాన్ని మహాత్ములవారు చేజేతులా చంపిన ఘట్టాన్ని పరికించండి. కాంగ్రెసు నియంత అయ్యాక గాంధీ ఆధిపత్యానికి ఎదురైన మొట్టమొదటి పెద్ద సవాలు అది. దిక్కులదిరేలా ఆర్భాటం చేసి, చివరికి నిష్కారణంగా,

నిస్సంకోచంగా తుస్సుమనిపించిన గాంధీ నిర్వాకానికి దేశం యావత్తూ నిర్ఘాంతపోయింది. కలనైనా ఊహించని షాకునుంచి తేరుకుని, జరిగిందేమిటో గ్రహించేకొద్దీ గాంధీ కొట్టిన దెబ్బకు సర్వత్రా తీవ్ర వ్యతిరేకత అలుముకుంది. ఈ సంగతి చాలామంది చరిత్రకారులు అన్నారు వారూ వీరూ అన్నవి మనకు నమ్మశక్యం కాదు. కాబట్టి ఈ విషయంలో పరమప్రామాణికమైన కాంగ్రెసు సంస్థ అధికారిక చరిత్రలో నూటికి నూటొక్కపాళ్లుగా గాంధీ భక్తుడు అయిన భోగరాజు పట్టాభిసీతారామయ్య చెప్పిందే విందాం.

There was an outcry against Gandhi that he should have switched off the whole current and made the movement no longer a live wire. Long letters were written from behind the bars by Pandit Motilal Nehru and Lala Lajapat Rai. They took Gandhi to task for punishing the whole country for the sins of a place. Why should, Panditji asked, a town at the foot of Himalayas be penalised, if a village at Cape Camorin failed to observe non-violence? Isolate Chauri Chaura... but go on with Civil Disobedience... ... These letters were read to an informal gathering at Dr. Ansari's place... In reply Gandhi had but one word to say, namely that those who went to Jail were civilly dead and could not claim or be expected to advise those outside... But the storm blew with unexampled fury when the A.I.C.C. had a regular sitting. Gandhi was assailed on all sides. He was taken to task for resiling from the movement... Bengal and Maharashtra tore him to pieces... Even devoted men like Hardyal Nag raised the standard of revolt... Every line of the Bardoli resolutions was subjected to a scathing attack... A vote of censure on Gandhi was moved by Dr. Moonje at the A.I.C.C. meeting.

**[*The History of the Indian National Congress*,
B. Pattabhi Sitaramayya, P. 400]**

(గాంధీపై తీవ్ర వ్యతిరేకత లేచింది. కరంటు స్విచ్చి ఆపేసి మొత్తం ఉద్యమాన్ని నిస్తేజ పరిచినందుకు ఆయనను తప్పుపడుతూ ఖైదునుంచి పండిట్ మోతీలాల్ నెహ్రూ, లాలా లజపతిరాయ్‌లు పెద్ద ఉత్తరాలు రాశారు. ఒకచోట జరిగిన పాపానికి మొత్తం దేశాన్ని శిక్షించటమేమిటని వారు గాంధీని దుయ్యబట్టారు. కన్యాకుమారి దగ్గర ఒక గ్రామం అహింసను పాటించలేకపోతే హిమాలయాల దగ్గరి పట్టణాన్ని ఎందుకు దండించాలని పండిట్జీ అడిగారు. చౌరీ చౌరాను వేరుచేసి శాసనోల్లంఘనను కొనసాగించ

మని వారు కోరారు. ఈ ఉత్తరాలను డాక్టర్ అన్సారీ ఇంట్లో జరిగిన ఇష్టాగోష్ఠి సమావేశంలో చదివి వినిపించారు. జవాబుగా గాంధీ అన్నదల్లా ఒక్కటే. జైలుకెళ్లినవారు పౌరులుగా మరణించినట్టే! బయట ఉన్నవారికి వారు సలహా ఇవ్వజాలరు - అని ! ఐనా ఏఐసిసి మీటింగులో ఎన్నడూ లేనంత ప్రచండంగా పెనుతుఫాను చెలరేగింది. అన్ని వైపులనుంచీ గాంధీపై దాడి జరిగింది. ఉద్యమాన్ని విడనాడినందుకు ఆయనని అందరూ నిలదీశారు... బెంగాల్, మహారాష్ట్రల వారైతే ఆయనను నిలువునా చీల్చి చెండాడారు... హరదయాళ్ నాగ్ వంటి గాంధీ భక్తులు సైతం తిరుగుబాటు బావుటా ఎగరేశారు... బార్డోలీ తీర్మానంలోని ప్రతి లైను మీదా తీవ్రంగా దాడి జరిగింది... గాంధీని అభిశంసిస్తూ ఎ.ఐ.సి.సి. సమావేశంలో డాక్టర్ మూంజే ఏకంగా ఒక తీర్మానమే ప్రతిపాదించాడు)

ఇవాళ ఇది చదివితే మనకు బోలెడు ఆశ్చర్యం వేస్తుంది. జాతీయోద్యమ సారథి. అవతార పురుషుడు అనుకునే మహాత్ముడిమీదే జాతీయ కాంగ్రెసు అంతలా తిరగబడిందంటే ఒక పట్టాన నమ్మబుద్ధికాదు. అందునా ఎదురు తిరిగినవారు అల్లాటప్పా మనుషులుకారు. జాతీయోద్యమ మహానాయకులుగా నేటికీ మనం కృతజ్ఞతతో స్మరించే అతిరథ మహారథులు వారు. మహాత్ముడి పట్ల అపార గౌరవం కలిగి కూడా మొగమాటం లేకుండా అంతటి పెద్దలే బాహాటంగా ధ్వజమెత్తారంటే ఆ సమయాన అఖిల భారతంలో సాధారణ కాంగ్రెసు కార్యకర్తలు, సామాన్య ప్రజలు ఎంతగా కుతకుతలాడి ఉంటారో ఊహించవచ్చు.

సర్వాధికారినే నిలదీసి, అభిశంసన తీర్మానం తెచ్చేంతగా నాటి కాంగ్రెసులో రాజకీయ చైతన్యం, అంతర్గత ప్రజాస్వామ్యం. వెల్లివిరిశాయంటే ఆశ్చర్యంతోబాటు మనకు ఆనందంకూడా కలుగుతుంది. కాని- ఏం లాభం? అది మూడు ఘడియల ముచ్చటే. అందరూ కమ్ముకుని, గాంధీని నిలదీసి, అంత దారుణంగాఉద్యమం ఉసురుతీసినందుకు చీల్చి చెండాడిన మీదట ఏమి జరిగింది? గాంధీని కాంగ్రెసునుంచి బహిష్కరించారా? ఆయన చంపిన ఉద్యమాన్ని మళ్లీ బతికించారా? కాంగ్రెసు అధికారిక చరిత్రలో ఇచ్చిన పై బిల్డప్‌నుబట్టి అలాగే అనిపిస్తుంది. కానీ అలాంటిదేమీ జరగలేదు. దూదేకుళ్లు, చీల్చి చెండాడుటలు వగైరా కార్యక్రమమంతా అయ్యాక చివరికి ఏమైందో సీతారామయ్యే చెబుతాడు వినండి :

Some speakers supported the vote of censure by their speeches, but when it was put to vote only those who had spoken in favour voted for it, the rest of the House voting against it... The storm blew over and Gandhi, like the proverbal reed. remained unmoved.

[Ibid PP 400-401]

(అభిశంసన తీర్మానాన్ని సమర్థిస్తూ కొంతమంది ప్రసంగించారు. కాని ఓటింగుకు పెట్టినప్పుడు ఆ కొద్దిమంది మాత్రమే దానికి అనుకూలంగా ఓటు వేశారు. మిగతా వారంతా తీర్మానాన్ని వ్యతిరేకించారు. తుఫాను వెలిసిపోయింది. రెల్లు మొక్కవలె గాంధీ నిశ్చలంగా నిలబడ్డాడు.)

అదీ గాంధీ మెస్మరిజం. హేమా హేమీలెందరు తనకు ఎదురుతిరిగినా, ఎంతటి ప్రతికూలత ఏర్పడ్డా మాటల మంత్రంతో కనికట్టుచేసి అంతా తనదారికి వచ్చినట్టు వచ్చేట్టు చేయగలనని ఆయనకు తెలుసు. అందుకే కాంగ్రెసు అంటే ఆయనకు అలుసు. కలకత్తా కాంగ్రెసులో సహాయ నిరాకరణ తీర్మానం చేసి, నాగపూరు కాంగ్రెసులో దానికి నిర్దిష్ట రూపం ఇచ్చి, ఢిల్లీ ఏ.ఐ.సి.సి.లో తుది మెరుగులు దిద్ది, బహుళ జనామోదంతో స్వరాజ్య సాధనకై శాసనోల్లంఘన ఉద్యమాన్నంటూ తలకెత్తుకున్న తరవాత... దాన్ని ఆపెయ్యటానికి కాంగ్రెసు అనుమతి మామూలుగా అయితే కావలసిందే. నాయకుడికి సంస్థమీద, సమష్టి నాయకత్వ భావనపైన, ప్రజాస్వామ్య విలువల పట్ల ఏపాటి గౌరవం ఉన్నా కాడికింద పారేసేముందు సహచరులను సంప్రదించి, కాంగ్రెసు కమిటీల్లో చర్చించితీరాలి. గాంధీగారు అలాంటి జంజాటాలేవీ పెట్టుకోలేదు. సంస్థకంటే తాను గొప్ప అనీ... తాను ఎలా చెబితే అలా నడుచుకుని, ఎప్పుడు ఏమి చేస్తే దానికల్లా మమ అనడమే కాంగ్రెసు పని అనీ ఆయన ధీమా. అందుకే మోతీలాల్‌నెహ్రూ, లజపతిరాయ్ అంతటి మహానాయకుల అభ్యంతరాన్ని గడ్డిపరకలా కొట్టిపారేసి... జైల్లో ఉన్న వాళ్ల మాటల లెక్కేమిటి? పౌరులుగా వారు చచ్చినవాళ్లతో సమానమే అనగలిగాడు.

చౌరీ చౌరాలో మారణకాండ జరిగింది 1922 ఫిబ్రవరి 5న ఆ సంగతి పత్రికల ద్వారా దేశానికి (బహుశా గాంధీకి కూడా) తెలిసింది 8వ తేదీన. ఆ వార్త వినగానే మహాత్ముడికి నీరసం వచ్చింది. చేపట్టిన ఉద్యమం మీద ఉత్సాహం పోయింది. దాన్ని అనుకున్నట్టు కొనసాగించాలా, ఆపాలా అన్నది తేల్చడానికి ఎక్కడెక్కడి వర్కింగు కమిటీ సభ్యులనూ హుటాహుటిన తన దగ్గరికి చేరుకోమన్నాడు. మరి – కనీసం ఆ కమిటీవారు అర్జంటు సమావేశం జరిపి నిర్ణయం చేసేవరకైనా నాయకుడన్నవాడు ఓపికపట్టాలి కదా? గాంధీగారు ఆ అవసరం కూడా లేదనుకున్నారు. 11న సమావేశానికి పిలుపునందుకుని వర్కింగు కమిటీ మెంబర్లు పడుతూ లేస్తూ బార్డోలీకి సగం దారిలో ఉండగా... 10వ తేదీనే మహాత్ముడు బార్డోలీ కాంగ్రెస్ వర్కర్లను కేకేసి తిరుగులేని తుది నిర్ణయం ఇలా ప్రకటించాడు :

What I have heard now convinces me in the belief that most of those who are present here have failed to understand the message of non-violence. This convinces me that the country at large

has not accepted the teaching of non violence. I must therefore, immediately stop the movement for civil disobedience.

[Collected Works of Mahatma Gandhi, Vol 26, # 62, P.137]

(ఇప్పుడు నేను విన్నదాన్నిబట్టి ఇక్కడ ఉన్నవారెవరూ అహింస సందేశాన్ని అర్థంచేసుకోలేకపోయారని నమ్ముతున్నాను. ఇది చూస్తే అహింస ఉపదేశాన్ని మొత్తం దేశమే అంగీకరించడం లేదనీ నాకు నమ్మకం కలిగింది. కాబట్టి నేను తక్షణం శాసనోల్లంఘన ఉద్యమాన్ని ఆపెయ్యవలసిందే.)

విన్నారా? బార్డోలీలో ఆయన కేకేస్తే వచ్చిన కాంగ్రెసు కార్యకర్తలు అహింస పాఠాన్ని సరిగా ఒప్పజెప్పలేదట. దాన్ని బట్టి మొత్తం దేశం తన అహింస అధ్యాపనాన్ని లెక్కచెయ్యడం లేదని గాంధీ మాస్టారికి రూఢి అయిపోయిందట. ఇంకేం? బెత్తం పుచ్చుకుని ఉద్యమాన్ని చావగొట్టి తద్వారా దేశాన్ని శిక్షించదలిచారన్నమాట.

ఎంత గొప్ప మహాత్ముడైనా దేశంకంటే అధికుడు కాదు. తాను బోధకుడిననీ, తన బోధను దేశం అంగీకరించి తీరాలనీ తలపోసేవాడు మహాత్ముడు కానేకాడు. అనేక వేల సంవత్సరాల ఘన చరిత్ర కలిగి... ధర్మాన్ని కాచి వడబోసిన ఎందరో మహాత్ములు యుగ యుగానా నడయాడిన ఈ పావన, ప్రాచీన పుణ్యభూమికి అహింస గురించి, ధర్మాచరణ గురించి ఒక ఫారిన్ రిటర్న్డ్ బారిష్టరు పాఠాలు చెప్పాల్సిన పనిలేదు. తెల్ల కబంధుల బారిన పడిన దేశాన్ని విముక్తం చేయడానికి తరతరాలుగా ఎందరో దేశభక్తులు అకుంఠిత దీక్షతో పోరాడి ధన్యజీవులయ్యారు. ఇంకా ఎందరెందరో ధర్మవీరులు దేశమాత సేవకు అంకితమై బలిపీఠాలెక్కుతున్నారు. ఇలాంటి వందలాది, వేలాది ప్రజాసేవకుల శ్రేణుల్లో గాంధీ కూడా ఒకడు. ప్రజలను ఉద్ధరించాలని ఆయన అనుకుంటే వినయంతో, అణకువతో తాననుకున్నది ప్రజలముందు పెట్టాలి. తన శక్తిమేరకు సేవ చేయాలి. తనవల్ల తప్పుదొర్లితే లెంపలేసుకోవాలి. వేరేవారి వల్లనయినా తప్పు జరిగితే ఆ సంగతి ప్రజలముందు పెట్టి వారి ఇంగితమెరిగి మెలగాలి. అరణ్యాల్లో ముక్కు మూసుకుని తపస్సు చేసుకునే మునులు తమకు లోకంతో నిమిత్తం లేదనీ, తాము ఎవరికీ జవాబుదారీకామనీ అనగలరు. ప్రజాజీవితంలో ప్రవేశించి, నిత్యం రాజకీయాల్లో మునిగి తేలే గాంధీ వంటి ఆసామికి ఆ సావకాశం లేదు. తన బోధను దేశం బుద్ధిగా వినాలనీ, ఏ మూల ఎక్కడ ఏ కాస్త తేడా వచ్చినా దేశాన్ని గోడ కుర్చీ వేయిస్తానని చెప్పేవాడు బాధకుడే తప్ప ఏనాటికీ బోధకుడు కాలేడు.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. గాంధీగారు తన తప్పులను, బలహీనతలను ఏనాడూ దాచుకోలేదు. తనను నెత్తికెక్కించుకోమని ఆయన ఏనాడూ ఎవరినీ నిర్బంధించలేదు. తాను ఏమిటో, ఎలాంటివాడో ఆయనకు బాగా తెలుసు. అందుకే

ఉండుండి చక్కని ఆత్మవిమర్శనూ ఆయన అరమరికలు లేకుండా చెయ్యగలడు. మచ్చుకు చౌరీ చౌరాని దేవుడి ఖాతాలో వేస్తూ 1922 ఫిబ్రవరి 19 'నవజీవన్' పత్రికలో ఆయనన్న ఈ మాటలను చూడండి :

"If now people reject my leadership and regard me a fool, they will not be to blame. If I do not know human nature, why do I meddle with such affairs?" (ఇప్పుడు కనక ప్రజలు నన్ను బుద్ధిలేని వాడిగా పరిగణించి, నా నాయకత్వాన్ని తిరస్కరిస్తే వారిని నిందించనవసరం లేదు. మానవ స్వభావం నాకు తెలియనప్పుడు అలాంటి వ్యవహారాల్లో నేనెందుకు కంగాళీ చెయ్యాలి?)

వరహాలు విలువ చేసే మాట ! చాలా కరెక్టు ! ఆ ప్రశ్ననే వెయ్యాల్సిన సమయంలో వేసి, గాంధీ చెప్పిన పనిని జనం చేసి ఉంటే దేశానికి చాలా కష్టాలు తప్పేవి. కాని అసలైన అదనులో మొగమాటాలు, విధేయతలు, బద్ధకాలు అడ్డొచ్చాయి. కాలక్రమంలో ఆ వైఫల్యానికి జాతి పెద్ద మూల్యమే చెల్లించాల్సి వచ్చింది. ఆసేతు హిమాచల పర్యంతం ప్రజల్లో ఉద్యమదీక్ష, స్వాతంత్ర్య కాంక్ష వెల్లువెత్తి, దారుణ దమనకాండకు ఎదురొడ్డి లక్షలాది దేశభక్తులు ఎంతటి త్యాగానికైనా సిద్ధపడి, నియమ బద్ధంగా ధర్మపోరాటం సాగించి, విదేశీ దొరతనాన్ని పీచమణచడానికి ఉరకలువేస్తున్న ఆ కీలక ఘట్టంలో... గాంధీగారిని ఆయన వెర్రిమొర్రి అహింసా ప్రయోగాలు ఆయనను చేసుకోమని చెప్పి జాతీయోద్యమం తన దారి తాను చూసుకుని ఉంటే చరిత్ర గతి మరోలా ఉండేది. దేశమంతటా అంటుకున్న స్వాతంత్ర్య సమర జ్వాలలకు తాళలేక బ్రిటిషు మహాసామ్రాజ్యం గడగడలాడుతున్న స్థితిలో దేశానికి సరైన నాయకుడుండి, శల్యులూ, శకునుల దుష్ప్రభావం నుంచి బయటపడి, ఉద్యమం పట్టును మరికాస్త బిగించి ఉంటే బహుశా 1922 సంవత్సరం దాటకుండానే స్వరాజ్యం వచ్చేది.

జరగవలసింది జరగలేదు. కనుక జరగగూడనిది జరిగింది. ఆకాశమంత ఎత్తున ఆశలను రేకెత్తించి, చివరికి పాతాళానికి విసిరికొట్టి గాంధీచేసిన దగాను దేశం ఉపేక్షించింది కాబట్టి గాంధీయే అడ్డం తిరిగి, దేశమే తనను దగాచేసిందంటూ అన్నం మానేసి ఎదురు దాడికి దిగాడు. ఆ వైనాన్ని కూడా ఇంతకుముందు పేర్కొన్న 'నవజీవన్' వ్యాసం నుంచి ఆయన మాటల్లోనే చిత్తగించండి :

My fast is atonement for me but for the people of Chauri Chaura, it is a punishment... By undertaking bodily suffering I suggest to the country that it should not deceive me... So long as it accepts my services, it will have to accept non-violence and truth. This time I have been content with a fast of five days. If

however the people refuse to take the warning, five days may become fifteen and fifteen become fifty and I may even lose my life.

[*CWMG*, Vol. 26, # 86, P. 187]

(నా ఉపవాసం నాకు ప్రాయశ్చిత్తం, కాని చౌరా చౌరీ ప్రజలకు అది శిక్ష... నన్ను మోసగించవద్దని ఈ రకమైన శారీరక బాధ ద్వారా నేను దేశానికి చెబుతున్నాను. నా సేవలను అంగీకరించినంతకాలమూ అహింసను, సత్యాన్ని కూడా దేశం అంగీకరించ వలసిందే. ఈసారి ఐదురోజుల ఉపవాసంతో చాలిస్తున్నాను. ప్రజలు నా హెచ్చరికను మన్నించకపోతే, ఐదు రోజులల్లా పదిహేను అవుతుంది. పదిహేను కాస్తా యాభై కావచ్చు, నా ప్రాణమే పోవచ్చు.)

ఇది వింటే మతిపోతుంది. అల్లరిమూక క్షణికోన్మాదంలో చేసిన నేరానికి చౌరీ చౌరా ప్రజలకు శిక్ష వేయడమేమిటి? మారుమూల పల్లెలో ఏదో జరిగిన దాన్ని పట్టుకుని మొత్తం భారతదేశమే తనను మోసం చేసిందని యాగీ చేయటమేమిటి? తన అమోఘమైన సేవలు పొందాలంటే అహింసకు, సత్యానికి కట్టుబడవలసిందేనని దేశానికి కండిషన్లు పెట్టడమేమిటి? కర్ర పట్టుకుని గాంధీ నిలబడితే తప్ప ఈ పుణ్యభూమికి సత్యం విలువ, అహింస మహిమ తెలియనే తెలియవా? దేశమంతా అసత్యంతో నిండి, హింసోన్మాదంలో కొట్టుకుపోతున్నదా? ఏడేళ్ల కింద ప్రవాసం నుంచి దేశానికి తిరిగొచ్చిన ఒక రాజకీయ నాయకుడు దేశానికి షరతులు విధించడమే విడ్డూరం ! వాటికి కట్టుబడకపోతే అన్నం మానేసి మరణిస్తానని బెదిరించటం మరీ తెంపరితనం !

భలే మహాత్ముడు !

1944 ఫిబ్రవరి నెల. ఆగాఖాన్ పాలెస్‌లో భర్తతోపాటు నిర్బంధంలో ఉండగా కస్తూర్బాకు తీవ్రంగా జబ్బు చేసింది. ఊపిరాడక చాలా అవస్థపడేది. జైలు డాక్టర్లు పరీక్షచేసి బ్రాంకియల్ న్యుమోనియా అని తేల్చారు. పెన్సిలిన్ ఇంజక్షన్ ఇవ్వాలన్నారు. దానికేం, అలాగే ఇప్పిద్దాం అన్నాడు చిన్నకొడుకు దేవదాసు. కాని పతిదేవుడు అడ్డుపడ్డాడు. జబ్బొస్తే కాస్త గంగతీర్థం పుచ్చుకుని దేవుణ్ని నమ్ముకోవాలి. లేదా వైద్యరాజ్ ఇచ్చే సాంప్రదాయకమైన మందులు వాడాలి. అంతేగానీ నడమంత్రంగా వచ్చిన యాంటీ బయాటికును సూది ద్వారా శరీరానికి ఎక్కించటమేమిటి? ఎంత మాత్రం కుదరదు - అని మహాత్ముడు భీష్మించాడు.

'ఇంజక్షను ఇవ్వకపోతే అమ్మ బతకదు నాన్నా ! కాదనకు' అని కొడుకు ప్రాధేయ పడ్డాడు. తండ్రి మనసు కరగలేదు. 'మీ అమ్మ ఇప్పుడు దేవుడి చేతుల్లో ఉందిరా. ఆయన దయతలిస్తే బతికిస్తాడు. ఎంత అమోఘమైన ఔషధం వేసినా నువ్వు ఆమెను కాపాడలేవు. మళ్లీ ఇంజక్షను మాటెత్తకు' అని ఖండితంగా చెప్పాడు.

కస్తూర్బా పరిస్థితి అంతకంతకూ క్షీణించింది. ఆమె యాతన చూడలేక మూడు రోజుల తరవాత దేవదాస్ మళ్లీ తండ్రిని అడిగాడు. పెన్సిలిను ఇప్పించడానికి ఒప్పుకోమని అనేక విధాల బతిమిలాడాడు. పితాశ్రీ అనుమతి ఇవ్వలేదు."నువ్వు దేవుణ్ని ఎందుకు నమ్మవురా? అంతా ఆయన చూసుకుంటాడులే" అని కొడుకును కసిరాడు "మీ అమ్మ ఇప్పటికి పడ్డ బాధలు చాలవా? సూదులెక్కించి ఆమె యాతనను ఇంకా పొడిగించ జూస్తావా" అని దెబ్బలాడి ససేమిరా అన్నాడు.

ఆ రాత్రే కస్తూర్బా కన్ను మూసింది.

'అయ్యో ! దేవుడు నా విశ్వాసానికి ఎంతటి పరీక్ష పెట్టాడు' అని గాంధీగారు గొల్లున ఏడ్చారు. 'యాంటీ బయాటిక్ ఇంజక్షను ఇచ్చినా ఆమె బతికేది కాదు. కాని

అది ఆమెకు ఇవ్వనివ్వడంవల్ల నా విశ్వాసం యావత్తూ కొల్లబోయేది' అని డాక్టర్లకు గొప్ప వివరణ ఇచ్చాడట ఆ దయామయుడు.

Robert Payne రాసిన *The Life and Death of Mahatma Gandhi* (501-506 పేజీలు), Yogesh Chadda రాసిన *Gandhi : A Life* గ్రంథాలలో కనపడే ముచ్చట ఇది. దీన్ని వింటే గాంధీ భక్తుల కళ్లవెంట నీళ్లు జలజల రాలుతాయి. అరవై ఏళ్లు తనతో కలిసి కాపురం చేసిన ఇల్లాలు మృత్యుముఖంలో ఉన్నా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి, దేవుడి మీద భారం వేసి నిశ్చలంగా నిలబడ్డాడే ! ఆహా ! బాపూజీ ఎంతటి ధీరోదాత్తుడు - అని నిండు భక్తితో కళ్లు తుడుచుకుంటారు.

ఔను మరి ! మహాత్ముడికి వచ్చిన కష్టం, ఎదుర్కొన్న పరీక్ష సామాన్యమైనదా? లోకాపవాదానికి వెరిచి కట్టుకున్న భార్యను కానలకంపిన అయోధ్య రాముడికంటె... వ్రతభంగానికి వెరచి మంచానపడ్డ అర్ధాంగికి మందివ్వకుండా అడ్డుపడి కాటికి పంపిన పోర్బందరు గాంధీయే ఎన్నోరెట్లు గొప్పవాడు. డౌటే లేదు.

కాని - మాయదారి దేవుడు అక్కడితో ఆగలేదు. గాంధీగారి భక్తికి, విశ్వాసానికి ఇంకో పరీక్ష పెట్టాడు. భార్య గతించి, రెండోనెల తిరక్కుండానే మహాత్ముడు మలేరియాతో మంచానపడ్డాడు. డాక్టర్లు క్వినైన్ తీసుకోమన్నారు. రోగి వద్దు పొమ్మన్నాడు. పూర్తిగా ద్రవాహారమే తీసుకుని, అదే చాలులెమ్మన్నాడు. కాని - చాలలేదు. పరిస్థితి నానాటికీ క్షీణించింది. మూడు వారాలు గడిచాయి. రోగి కండిషను విషమించింది. డాక్టర్లు క్వినైను ఇవ్వక తప్పదని బలవంతపెట్టారు.

అప్పుడు మన సత్యవ్రతుడు గారు ఏమన్నారు? ఇల్లాలిని బతికించుకోవటం కంటే తన విశ్వాసాన్ని నిలబెట్టుకోవటం ముఖ్యమని మునుపు బిర్రబిగిసినట్టే... తన ప్రాణాలకంటే నమ్మకం ప్రధానమని తలిచారా? చావుబతుకుల్లోని భార్యను దేవుడి చేతుల్లో పెట్టినట్టే తననూ అదే దేవుడికి ఒప్పగించుకుని, దైవం మీద భారంవేసి, గంగాజలం పుచ్చుకుంటూ చావుకు సిద్ధపడ్డారా?

కచ్చితంగా అలాగే చేసి ఉంటారని మీరు అనుకుంటారు. కాని మీ ఊహ తప్పు. గాంధీగారు చటుక్కునలేచి మందు పుచ్చేసుకున్నారు. కొన్నాళ్లకల్లా తేరుకున్నారు ! తన దాకా వచ్చేసరికి దేవుడూ లేడు, విశ్వాసమూ లేదు. ఎలాగైనా ప్రాణం రక్షించుకోవటం ముఖ్యం. అదే న్యాయం తన భార్యకు మాత్రం వర్తించదు!

పోనీ - మలేరియా చికిత్సకు క్వినైన్ ప్రపంచంలో చాలాకాలంగా వాడుతున్నారు. పెన్సిలిన్ యాంటీ బయాటికేమో కొత్తగా అప్పుడే కనిపెట్టింది. కాబట్టి భార్యకు పెన్సిలినును నిరాకరించి, తనవరకూ క్వినైన్ స్వీకరించారు కాబోలని సరి పెట్టుకుందామా? అదీ

గాక మలేరియా మందు గొంతులో వేసుకునేది. పెన్సిలినేమో సూదితో ఇంజక్ట్ చేసేది. కాబట్టి గాంధీగారు అభ్యంతరమల్లా సూదిమందుపైనే లెమ్మని తృప్తిపడదామా ? వీలులేదు.

ఎందుకంటారా? అప్పటికి ఇరవై రెండేళ్ల కిందట యరవాడ జైల్లో ఉండగా (1924 జనవరి 12 సాయంత్రం) గాంధీకి భరించలేని కడుపునెప్పి వచ్చింది. హుటాహుటిన పుణే హాస్పిటల్లో చేర్చారు. బొంబాయి నుంచి భారతీయ వైద్యుల బృందాన్ని పిలవనంపారు. ఆ బృందం రైలెక్కి అడంగు చేరుకునేలోపే రోగి పరిస్థితి విషమించింది. బ్రిటిషు సర్జను కర్నల్ మడోక్ తక్షణం ఆపరేషను చెయ్యాలి. ఆలస్యం చేస్తే ప్రమాదం అని హెచ్చరించాడు.

మరి గాంధీగారేమన్నారు? ఒంట్లోకి సూది ఎక్కించటమే శరీరాన్ని హింసించటం దేవుడిపట్ల అపచారం, విశ్వాసానికి విఘాతం - అయినప్పుడు ఏకంగా కత్తికోతలకు ఎలా అంగీకరిస్తారు? ఏమైతే అదే అవుతుంది. అంతా దేవుడే చూసుకుంటాడు అని చెప్పి డాక్టరును గెంటేయాలి కదా ? కాని - ఆశ్చర్యం ! మహాత్ములవారు సరే, అలాగే కానివ్వండి అన్నారు ! నోటిమాట చాలదన్నారేమో, అంగీకారాన్ని కాగితం మీద ఇలా రాసిచ్చారు.

Sasoon Hospital,
Poona
9.45 P.M., January 12, 1924

DEAR COL. MADDOCK

I know that you know the history of my illness during the past 6 months. You, the surgeon General and other Medical gentlemen have come to the conclusion that any delay in performing the operation involves considerable risk... I have the fullest confidence in you and regard being had to the serious nature of the case I would ask you please to go on with the operation without delay.

[The Collected Works of Mahatma Gandhi, Vol 27, # 2, P.3]

(ససూన్ హాస్పిటల్, పూనా,
జనవరి 12, 1924 రాత్రి గం. 9.45 ని.లకు

ప్రియమైన కర్నల్ మడోక్

ఈ ఆరు నెలలుగా నా అనారోగ్యపు వివరాలు మీకు బాగా తెలుసు. మీరు సర్జన్ జనరల్‌గారు, ఇతర వైద్యులు ఆపరేషను ఆలస్యం చేస్తే ప్రమాదమన్న నిశ్చయానికి

వచ్చారు... నాకు మీ పట్ల పరిపూర్ణ విశ్వాసం ఉంది. కేసు తీవ్రత దృష్ట్యా దయచేసి వెంటనే ఆపరేషను చెయ్యండి)

మాట నిలకడ లేదని నన్ను నిందించవద్దు. నేను సత్యంతో నిరంతర ప్రయోగాలు చేస్తుంటాను. ఎప్పుడు ఏది సత్యమని తోస్తే అదే చెబుతాను. అంతే తప్ప ఇంతకు ముందేమి చెప్పాను; దానికీ దానికీ వైరుధ్యం ఉందా అన్నది చూడను - అని కదా గాంధీజీ పదేపదే అనేది? ఇదీ అంతేనేమో? 1922లో ఒంటిమీద కత్తికోత తప్పులేదని అనిపించిందేమో! 1944 నాటికి విశ్వాసం మరీ ముదిరి సూదిమందు కూడా తప్పు అని తోచిందేమో... అని సరిపుచ్చు కుందామా? కుదరదు.

కస్తూర్బా కాలంచేసిన మూడేళ్లకు గాంధీకి వరసకు మనవరాలైన మనుకు అపెండిసైటిస్ వచ్చింది. ముది వయసులో తనను హత్తుకుని దుప్పట్లో వెచ్చగా పడుకుని, తన నిగ్రహాన్ని ప్రతిరాత్రీ పరీక్షిస్తూ, తన బ్రహ్మచర్య యజ్ఞ ప్రయోగంలో పాలుపంచుకునే ఆ పిల్ల అంటే గాంధీతాతకు మహా ఇష్టం. అంతటి ముద్దుల మనవరాలు కడుపునెప్పితో విలవిలలాడుతుంటే ఆయన తట్టుకోలేకపోయాడు. అక్కడికీ కొన్నాళ్లు తాను గాఢంగా నమ్మే ప్రకృతి చికిత్సలూ, మూలికా వైద్యాలు ప్రయత్నించి చూశాడు. కాని పని చెయ్యలేదు. తనకు ప్రియాతి ప్రియమైన బాలికను అలా చచ్చిపోనివ్వటానికి ఆయనకు ధైర్యం చాలలేదు. భోరున ఏడ్చేసి, సర్జన్లు చెప్పిన ప్రకారం ఆమెకు పాట్నా ఆస్పత్రిలో ఆపరేషను చేయించాడు. అంతే కాదు. ఆపరేషను చేసేప్పుడు తాను దగ్గర ఉండవచ్చా అని డాక్టర్ డి.పి.భార్గవను అడిగాడు. గాజు మాస్కు వేసుకుని రావచ్చునని డాక్టరు చెప్పాడు. ఇంకేం? ముఖానికి తెల్లముసుగు తగిలించుకుని గాంధీగారు 1947 మే 15 రాత్రి ఆపరేషను జరిగిన గంటసేపూ పక్కనే కుర్చీలో కూచుని అన్నీ శ్రద్ధగా గమనించాడు. ఆ అపురూప దృశ్యాన్ని ఎవరో ఫోటో కూడా తీశారని Life of Mahatma Gandhi **లో లూయీ ఫిషర్** రాశాడు.

లాపియరి, లారీ కాలిన్స్‌లు తమ సుప్రసిద్ధ గ్రంథంలోనూ ఇదే ఉదంతం ప్రస్తావిస్తూ ఇలా వ్యాఖ్యానించారు :

The man who had denied his dying wife the violent therapy of a hypodermic nedle decided to allow his dying great - niece the violence of the surgeon's scalpel.

[*Freedom at Midnight,* Lapierre and Larry Collins, P-162]

(సూది ద్వారా మందు ఎక్కించటం హింస అని చెప్పి మరణశయ్యపై నున్న తన భార్యకు ఇంజక్షను ఇవ్వనివ్వనివాడు మరణయాతన పడుతున్న తన మనవరాలి ఒంటిపై సర్జను కత్తికి అనుమతించాడు!)

అందుకే ఆయన మహాత్ముడయ్యాడు !

గాంధీగారి మాటలు విని, రాతలు చదివి గాంధీ తత్వం అర్థమైందనుకుంటే పెద్ద పొరపాటు. ఆ మనిషి కొరకరాని కొయ్య. ఆయన సిద్ధాంతం బహుశా ఆయనకే అర్థంకానంత అయోమయపు పుంత. ఫలానా విషయం గురించి అప్పుడిలా అన్నాడు; ఇలా చేశాడు; ఇలా చేయమన్నాడు కాబట్టి ఆ విషయం గురించి ఎప్పుడూ అదేమాట మీద ఉంటాడు; అలాగే చేస్తాడు; అలాగే చేయమంటాడు అనుకోవటం పెద్ద భ్రమ. సమయానుకూలంగా, తడవకో రీతిగా అభిప్రాయాలు మార్చటంలో గాంధీ దిట్ట.

అహింసావాది ఎల్లప్పుడూ హింసకు తలవొగ్గే తీరాలా? ఎటువంటి పరిస్థితుల్లోనూ తిరగబడనే కూడదా? దౌర్జన్యానికి, అన్యాయానికి నిస్సహాయంగా తలవంచాల్సిందేనా? అందరి మనసుల్లో మెదిలే ఈ ప్రశ్నలకు **యంగ్ ఇండియా** పత్రిక వ్యాసంలో గాంధీజీ ఇచ్చిన సమాధానం ఇది:

'పిరికితనం, హింసల్లో ఏదో ఒకటే ఎంచుకోవలసివస్తే నేను హింసవైపే మొగ్గుతాను. నా పెద్దకొడుకు నన్నో ప్రశ్న వేశాడు. 1908లో దక్షిణాఫ్రికాలో నా మీద దాదాపుగా ప్రాణం పోయేంతలా దాడి జరిగిన సమయంలో ఒకవేళ తాను అక్కడ ఉండి ఉంటే ఏమి చేయాలి ? పారిపోవాలా? నన్ను చంపుతూంటే గుడ్లప్పగించి చూస్తుండాలా? లేక బలం ప్రయోగించి నన్ను రక్షించాలా? దీనికి నేను - హింసనైనా ఉపయోగించి నన్ను కాపాడటమే నీ ధర్మం అని బదులిచ్చాను. ఈ కారణం వల్లే నేను బోయర్ యుద్ధంలో, జులు తిరుగుబాటు సందర్భంలో, కిందటి ప్రపంచ యుద్ధంలో పాలుపంచు కున్నాను. ఈ ఉద్దేశంతోటే - హింసను విశ్వసించే వారికి ఆయుధాల తర్ఫీదు ఇవ్వాలని నేను చెబుతాను. భారతదేశం తన గౌరవానికి భంగం వాటిల్లుతుంటే నిస్సహాయంగా అగౌరవాన్ని సహించేకంటే ఆయుధాలుపట్టి తన మర్యాదను నిలబెట్టుకోవటం మేలని నా భావన. ఏమైనా... హింసకంటే అహింస ఇంతింతన లేనంత గొప్పదనే నేను నమ్ముతాను... ..."

[*The Collected Works of Mahatma Gandhi*, Vol 21, # 91, P.133]

అలాగే - గాంధీ బోధలను సంపుటీకరించిన selections from Gandhi గ్రంథంలో **నిర్మల్‌కుమార్‌బోస్** ఉటంకించిన ఈ ఉపదేశామృతాన్ని ఆస్వాదించండి.

"473. పోలీసులు తమ ఇళ్లను లూటీచేసి, తమ ఆడవాళ్లను పాడుచేస్తూంటే తాము ఏమీ చెయ్యక పారిపోయామని బెట్టయా సమీప గ్రామస్థులు నాకు చెప్పారు. నేను అహింసను పాటించమన్నాను కాబట్టే తాము పరారయ్యామని వారు అంటూంటే నేను సిగ్గుతో తలవాల్చుకున్నాను. అహింసకు అర్థం అది కాదని నేను వివరించాను.

ఎట్టి పరిస్థితుల్లోనూ రంగం నుంచి పారిపోకూడదు. మీ రక్షణలో ఉన్నవారికి హాని జరుగుతూంటే ఎంతటి మహాశక్తితోనైనా ధైర్యంగా తలపడాలి. చావుకు సిద్ధపడి కడదాకా పోరాడాలి. తన ఆస్తిని, తన గౌరవాన్ని, తన మతాన్ని రక్షించుకుందుకు కత్తిదూసి పోరాడటం పౌరుషమే అనిపించుకుంటుంది. తన స్వార్థం ఏమీ లేకపోయినా... కళ్లముందు తప్పుజరుగుతుంటే ప్రతిఘటించి, దోషులను దెబ్బతియ్యటం ఇంకా గొప్ప పౌరుషం. అంతేకాని తన ప్రాణం దక్కించుకుందుకు దుర్మార్గాన్ని ఎదిరించకుండా పారిపోవటం మగటిమి కాదు."

మరి - చౌరీ చౌరా జనానికి సరిగ్గా ఇదే పరిస్థితి ఎదురైంది. గాంధీస్ఫూర్తితో ఉత్తేజం పొంది గాంధేయ పద్ధతిలో సహాయ నిరాకరణ చేస్తూ ప్రశాంతంగా పికెటింగు చేస్తున్నవారి మీద పోలీసులు విరుచుకుపడ్డారు. సత్యాగ్రహులను గొడ్లను బాదినట్లు బాదారు. మహిళలను అవమానించి చెప్పరాని అఘాయిత్యాలు చేశారు. ఇళ్లు లూటీ చేశారు. పసివాళ్లను, ముసలివాళ్లను కూడా క్రూరంగా హింసించారు. నానా రకాలుగా ప్రజలను పోలీసులు రెచ్చగొట్టారని గాంధీ మహాత్ముడు సైతం అంగీకరించాడు. చివరికి నిరాయుధులైన ప్రదర్శకుల మీద తుపాకులు ఎక్కుపెట్టారు. కనీసం రెండు డజన్ల పోలీసులు తూటాలు ఖర్చయ్యేదాకా గుంపుమీద గురిపెట్టి కాలుస్తూనే ఉన్నారు. ఎన్ని ప్రాణాలు పొయ్యాయో, ఎంతమంది సత్యాగ్రహులు నేలకొరిగారో, ఎందరు క్షతగాత్రులయ్యారో ఎక్కడా రికార్డు లేదు. గాంధీగారు కానీ, కాంగ్రెసు పెద్దలు కానీ ఆ దిశగా ఆలోచించినట్టూ, ఆ వివరాలను ఆరా తీసినట్టూ ఎక్కడా కనిపించదు. రెచ్చిపోయిన విదేశీ సర్కారు ఉసికొలపగా పోలీసుభటులు నిర్భయంగా పేట్రేగి విచ్చలవిడిగా అమాయక జనంపై కాల్పులు జరిపితే ఆ దారుణ దృశ్యం ఎలా ఉంటుందో మానవత్వం ఉన్న వారెవరైనా ఊహించవచ్చు.

అలాంటి పరిస్థితుల్లో బాధిత జనం ఏమి చెయ్యాలి? రంగం నుంచి పారిపోకూడదు. ధైర్యంగా తిరగబడాలి. దౌర్జన్యాన్ని దౌర్జన్యంతో ఎదుర్కోవాలి. తమ గౌరవాన్ని, తమను నమ్ముకున్నవారి గౌరవాన్ని కాపాడుకోవటానికి ప్రాణాలకు తెగించి పోరాడాలి. అహింస అంటూ చేతులు ముడుచుకు కూచోకూడదు. ఆపద వచ్చినప్పుడు మగటిమి చూపాలి... అదే కదా గాంధీగారు చెప్పింది?

చౌరీ చౌరా వాళ్లు అదే చేశారు. దాన్నే మహాత్ముడు తప్పన్నాడు.

తిరగబడి పోరాడటంలో జనం హద్దుమీరిన మాట వాస్తవం. వారు ఎదురు తిరిగి దెబ్బకు దెబ్బ తీయటంతో పోలీసులు బెంబేలెత్తారు. పారిపోయారు. గుంపు వారి వెంటపడింది. పోలీసులు ఠాణాలోకి పరుగెత్తి తలుపులు బిగించుకున్నారు. గుంపు ఠాణాకు అగ్గి అంటించింది. 22 మందిని సజీవదహనం చేసింది. నిస్సందేహంగా అది

అమానుషం. నిర్ద్వంద్వంగా ఖండించాల్సిన దుశ్చర్య. కాని గాంధీగారు ఖండించింది ఆ దురాగతాన్ని మాత్రమే కాదు. జనం తిరగబడటాన్నే ఆయన తప్పుపట్టారు. హింసను ఎదుర్కోవడానికి హింసకు దిగడమే మహాపచారమని ఆయన నిందించారు. అవతలివారు ఎంత ఘోరానికి పాల్పడ్డా, ఎన్ని పాపాలు చేసినా సరే చెయ్యెత్తి, బలం ఉపయోగించి తిరగబడే హక్కు ప్రజలకు లేదు. తాను రుద్దిన ఆ శాసనాన్ని దేశం మన్నించకుండా, ఎక్కడ ఏమూల ఏపాటి హింసతలెత్తినా సహించేది లేదు. ఉద్యమాన్ని నడవనిచ్చేదిలేదు – అంటూ హఠం వేసికూర్చున్నారు.

బాగుంది. మరి – పిరికితనం కంటే హింస మేలు, మానరక్షణకు తిరగబడటంలో తప్పులేదు – అన్న గాంధీ బోధన ఏమైనట్టు? గాంధీగారికి ఎన్ని నాలుకలు?

మొత్తంమీద మనకు అర్థమయ్యేదేమిటంటే... గాంధీని ఎవరైనా చావగొడుతుంటే ఆయన కుమారుడేమో కర్ర తీసుకుని అడ్డంపడి, హింసకులను హింసించి, తండ్రిని కాపాడాలి. అది అహింసావ్రతానికి భంగంకాదు. అదే ఇంకే తండ్రినైనా చావగొడుతుంటే ఇంకెవరో పుత్రుడు అదే పనిచేసి పుత్రధర్మం నిర్వర్తిస్తేనేమో అది క్షమించరాని తప్పు, అహింసా వ్రతానికి మాయనిమచ్చ. అంతేనా ?

ఇతడా మా రక్షకుడు ?

"ఒక రోజు మహాత్మాగాంధీ తనవాళ్లముందు నిలబడి అన్నాడు: 'మీరు ఈ అస్పృశ్యులను దోచుకుంటున్నారు. బ్రిటిషు సామ్రాజ్య దాస్యం నుంచి బయట పడటానికి మనమందరం శాయశక్తులా పోరాడుతున్నప్పటికీ మనం వీరిని దోపిడీ చేసి, వీరి ఆత్మగౌరవాన్ని హరిస్తున్నాము. ఇక నేను ఆహారం ముట్టను. అస్పృశ్యుల నాయకులతో కలిసి అగ్ర కులాల పెద్దలు నా దగ్గరికి వచ్చి అంటరాని తనాన్ని అంతమొందిస్తామని చెప్పాలి. దేశంలోని హిందూ దేవాలయాల తలుపులు అస్పృశ్యులకు తెరచుకోవాలి. అప్పటిదాకా ఉపవాసం ఆపను.

"అన్నట్టే ఆయన తిండి మానాడు. రోజులు గడిచాయి. కడకు గాంధీ దాదాపుగా మరణించి చివరి శ్వాస తీయబోతుండగా అస్పృశ్యులనుంచి ఒక గ్రూపు, బ్రాహ్మణ కులం నుంచి ఒక గుంపు ఆయన దగ్గరికి వచ్చి ఇక తాము ఎంతమాత్రమూ కుల విధానాన్ని పాటించమంటూ స్టేట్‌మెంటు రాసి, సంతకం పెట్టాయి. గుడి పూజారి ఆయన దగ్గరికి వచ్చి అన్నాడు. "ఇప్పుడు దేవాలయాలన్నీ అస్పృశ్యులకు తెరవబడతాయి" – అని. ఆ మధ్యాహ్నం భారతదేశమంతటా అస్పృశ్యులు ఆలయాల్లో ప్రవేశించారు. ఆ వేలూ లక్షల జనం బ్రాహ్మణుల, ఇతర కులాల వారి మెడల చుట్టూ చేతులేశారు. రెండు వేల ఏళ్లుగా ఒకరినొకరు తాకని కోట్లాది ప్రజలు కలిసిమెలిసి ఇప్పుడు పాటలు పాడుతూ అందరినీ పొగుడుతున్నారు. ఇది మహాత్మా గాంధీ సాధించిన గొప్ప విజయం."

ఇదేమిటి... ఇంతటి మహాద్భుతం మనదేశంలో ఎప్పుడు జరిగింది అని ఆశ్చర్యపోతున్నారా ? ప్రపంచంలోని నల్లజాతీయుల ఆరాధ్యదైవం, అమెరికన్ నీగ్రో నాయకుడు అయిన రెవరెండ్ మార్టిన్ లూథర్‌కింగ్ (జూనియర్) తన సుప్రసిద్ధ "ఆత్మకథ"లో రాసిన పలుకులివి. అంతా ఉత్తదే. వట్టి గ్యాస్. ఆ సంగతి మీకూ నాకూ తెలుసు. కాని లూథర్‌కింగుకు తెలియదు. ఈ కథ ఎవరు పుట్టించారో ఆయనకు ఎవరు చెప్పారో, ఎక్కడ చదివాడో గాని అందమైన అబద్ధాల అల్లిక. ఎవరేది చెబితే అది కళ్లు మూసుకుని నమ్మేసేంతటి మూఢుడు కాదు మార్టిన్ లూథర్‌కింగ్. లోకాన్ని

చదివిన కుశాగ్రబుద్ధి. అంతటి మహనీయుడినే బోల్తా కొట్టించారంటే గాంధీ ప్రాపగాండా యంత్రాంగం ప్రపంచంలో ఏ స్థాయిన ఎంత పకడ్బందీగా పనిచేస్తున్నదో ఊహించవచ్చు.

పంచములకు గుడి తలుపులు తెరిపించటానికి గాంధీగారు (1932లో) పెద్ద ఉద్యమం మొదలెట్టిన మాట యథార్థం. కాని దాని ఫలితం మరీ గొప్పదీ, చరిత్రాత్మకమని చెప్పుకోదగినంత ఘనమైనదీ ఏమీకాదు! అని ఎలా చెప్పగలమంటారా ? చిన్న వివరం చాలు.

గాంధీగారి ఉద్యమం మొదలైన ఏడేళ్ల తరవాత (1939 ఆగస్టు 17న) బొంబాయి లెజిస్లేటివ్ అసెంబ్లీలో బి.కె. గైక్వాడ్ అనే షెడ్యూల్డు కులానికి చెందిన సభ్యుడు ఒక ప్రశ్న వేశాడు. 1932లో గాంధీ ఆలయ ప్రవేశ ఉద్యమం ప్రారంభించి దరిమిలా ఇప్పటివరకూ బొంబాయి ప్రెసిడెన్సీలో ఎన్ని దేవాలయాల్లో అస్పృశ్యులను రానిస్తున్నారు - అని ! ఆ సమయాన గాంధీగారి కాంగ్రెసుదే ప్రభుత్వం. కాంగ్రెసు మంత్రే దానికి సమాధానం చెప్పాడు. దాని సారాంశం ఏమిటంటే అటువంటి గుడులు మొత్తం కలిపి 142. వాటిలో రోడ్డు పక్క ఎవరికీ చెందక, దిక్కుమొక్కూ లేక పాడుబడి ఉన్నవి 121.

దీనికే ఆశ్చర్యపోకండి. గాంధీగారి సొంత గడ్డ అయిన గుజరాత్‌లో ఏడేళ్ల గాంధీ ఉద్యమం తరవాత కూడా ఒక్కటంటే ఒక్క గుడీ అస్పృశ్యులను లోనికి రానివ్వటం లేదట! కాంగ్రెసు మంత్రే అధికారికంగా బయటపెట్టిన సంగతిది.

నయాన ఎన్ని విధాల చెప్పినా కరడుగట్టిన సంప్రదాయవాదులు వినడం లేదని ఉద్యమం మొదలైన మొదటి సంవత్సరమే గాంధీగారికి బోధపడింది. ఇక లాభంలేదని గట్టి చర్యలకూ ఆయన నడుంకట్టాడు. గవర్నర్ జనరల్ గొంతు మీద కూర్చుని కేంద్ర లెజిస్లేచర్ (అప్పటి పార్లమెంటు)లో అస్పృశ్యులకు ఆలయ ప్రవేశం బిల్లును ప్రవేశపెట్టించాడు. అటు సూర్యుడు ఇటు పొడిచినా దాన్ని పాసు చేయించి తీరాలని శపథం పట్టాడు. అందుకు పరిపూర్ణంగా సహకరిస్తామని కాంగ్రెసు చేతా వరమిప్పించాడు. ఒక వైపు చట్టపరంగా కట్టుదిట్టానికి ప్రయత్నిస్తూనే ఇంకో వంక తన ప్రాణాన్ని ఒడ్డి అయినా అస్పృశ్యులకు గుడి తులుపులు తెరిపించటానికి తన చేతిలోని వజ్రాయుధాన్నీ ప్రయోగించాడు. కొడితే కుంభస్థలాన్నే కొట్టాలనుకున్నారు కాబోలు... సనాతన సంప్రదాయానికి పేరుమోసిన గురువాయూర్ గుడి మీదే గురిపెట్టి ఫలానా గడువులోగా అస్పృశ్యులను లోపలికి రానివ్వకపోతే ప్రాయోపవేశం చేస్తానని మహాత్ముడు ప్రకటించాడు.

మంచిదే కదా ? అంతకంటే ఆయన మాత్రం ఏమి చేయగలడు - అని మీరు అడగొచ్చు. తరవాత ఏమైందో దళిత బాంధవుడు **బాబాసాహెబ్ అంబేద్కర్** మాటల్లో ఆలకించండి:

"ఆలయ ప్రవేశం బిల్లును తప్పక బలపరుస్తానని మాట ఇచ్చిన కాంగ్రెసు తీరా సభలో చర్చకు వచ్చేసరికి అడ్డం తిరిగింది. ఎందుకంటే - ఆ బిల్లు హిందువులకు కోపం తెప్పిస్తుందట. దానికి మద్దతిస్తే వచ్చే ఎన్నికలలో వారు కాంగ్రెసును ఓడించి ప్రతీకారం తీర్చుకుంటారట. ఆ విధంగా కాంగ్రెసు అన్నమాట తప్పి బిల్లును చంపేస్తుంటే గాంధీ పట్టించుకోలేదు. పైగా కాంగ్రెసు చేసిందే సబబని సమర్థించాడుకూడా"

"ఇక గాంధీ నేరుగా బాధ్యత తీసుకున్న రెండోవిషయం. ఫలానా తేదీలోగా గురువాయూర్ ధర్మకర్తలు అస్పృశ్యులను రానివ్వని పక్షంలో ప్రాయోపవేశం చేస్తానని గాంధీ పెట్టిన గడువు తీరి పదమూడేళ్లు గడచినా ఈనాటికీ గురువాయూర్ గుడిలో అస్పృశ్యులకు ప్రవేశంలేదు. ఐనా ఇంతవరకు గాంధీ ఆమరణ నిరశనకు కూచోనూ లేదు. ఆలయ అధికారులకు నచ్చచెప్పి అస్పృశ్యులను లోపలికి రానిచ్చేందుకు ప్రయత్నించనూ లేదు. మీకోసం ఉపవాసం చేస్తానని చెప్పి కూడా చేయని వాడికి చిత్తశుద్ధి ఉందని అస్పృశ్యులు ఎలా నమ్మగలరు?"

"తన దగ్గర మానవులకు జరిగే అన్యాయాలను సరిచెయ్యటానికి రెండు విలక్షణ ఆయుధాలున్నాయని గాంధీ చెప్పుకుంటాడు. మొదటిది సత్యాగ్రహం. రాజకీయ తప్పులను తొలగించడానికి సత్యాగ్రహ ఆయుధాన్ని బ్రిటిష్ ప్రభుత్వంపై చాలామార్లు ప్రయోగించాడు. కాని బావుల దగ్గరికి, ఆలయాలలోకి అస్పృశ్యులను రానిచ్చేట్టు చెయ్యటానికి హిందువులపై సత్యాగ్రహ ఆయుధాన్ని గాంధీ ఎన్నడూ వాడలేదు. ఉపవాసం ఆయనకున్న ఇంకో ఆయుధం. మొత్తం 21 ఉపవాసాలు చేసినట్టు గాంధీ ఖాతాలో జమ అయింది. వీటిలో కొన్ని హిందూ - ముస్లిం ఐక్యతకోసం చేసినవి. మిగతావి చాలావరకూ - ఆయన ఆశ్రమంలో ఉండేవారు చేసిన నీతి బాహ్యమైన పనులకు ప్రాయశ్చిత్తంగా చేసుకున్నవి. ఒకటేమో పట్వర్థన్ అనే ఖైదీ పాకీపని చేస్తానని అడిగినా అందుకు అనుమతించని బొంబాయి ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా చేసిన ఉపవాసం. ఈ మొత్తం 21 ఉపవాసాల్లోనూ అస్పృశ్యత తొలగింపుకోసం చేసినది ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు."

What Congress and Gandhi have done to the Untouchables అనే సంచలనాత్మక గ్రంథంలో "అస్పృశ్యులు ఏమంటారు?" అధ్యాయంలో **బి.ఆర్.అంబేద్కర్** చెప్పిందిది.

దేశంలో తిరుగులేని నాయకుడుగా, స్వాతంత్ర్య సమర సర్వసైన్యాధిపతిగా దుర్నిరీక్ష్యంగా వెలిగిపోతున్న మహాత్ముడిని బాహాటంగా వ్యతిరేకించి ఆయన చేస్తున్నది తప్పని ఆయన మొగంమీదే అనడానికి చాలా ధైర్యం కావాలి. అంబేద్కర్‌కి ఉన్నదే అది. మహామేధావులూ, మహా మహా నాయకులే గాంధీ మోహంలో మునిగినా అంబేద్కర్ తొట్రుపడలేదు. మోసపోలేదు. **"నాలుకతో దేవుడి పేరు జపిస్తూ చంకలో కత్తి పెట్టుకుని తిరిగేవాడు మహాత్ముడైతే... మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ కూడా మహాత్ముడే"** అని

ఆయన ఏనాడో అన్నాడు. గాంధీ మహాత్ముడు, ఆయన చేతుల్లోని జాతీయ కాంగ్రెసు దళితులకు చేసిన దగాను సాక్ష్యాధారాలతో ఎండగడుతూ అంబేద్కర్ ఏకంగా ఒక పుస్తకమే (పైన ఉటంకించిన What Congress and Gandhi have done to the Untouchables) రాశాడు. అదీ గాంధీ జీవించి ఉండగానే, స్వాతంత్ర్యం రావడానికి ముందే, మార్టిన్ లూథర్‌కింగ్ రంగం మీదికి రావడానికి అనేక దశాబ్దాలకు పూర్వమే ఆ గ్రంథం వెలువడింది. దేశంలోని గాంధీ భక్తులను, గాంధీ అంతేవాసులను చాలా ఇబ్బంది పెట్టింది. అంబేద్కర్ పుస్తకాన్ని మార్టిన్ లూథర్‌కింగ్ చదివి ఉంటే గాంధీ అంటరాని తనంపై ప్రాణాలొడ్డి పోరాడి పారదోలిన మహితాత్ముడని పారవశ్యంతో ప్రస్తుతించేవాడు కాదు. కాని అబద్ధానికి నోరు పెద్దది. గాంధి ప్రాపగాండా యంత్రాంగం నిరంతరం సాగించే 'గాంధి సువార్త' ప్రచారహోరుతో పోలిస్తే అంబేద్కర్ వంటి వ్యతిరేకుల వాదనలకు లోకంలో వ్యాప్తి తక్కువ.

గాంధీగారి మాటలు కోటలు దాటుతాయి. కాని ఆయన కాళ్లు మాత్రం గడపలు దాటవు. అంటరానితనం నిర్మూలించడం మీద ఆయన చేసినంత హడావుడి ఆధునిక భారత చరిత్రలో మరే నాయకుడూ చెయ్యలేదు. అస్పృశ్యులకు హరిజనులని ముద్దుపేరు పెట్టాడు. వచ్చే జన్మంటూ ఉంటే పాకీవాడుగా పుట్టాలని ఉందన్నాడు. పాకీ పని గర్వించదగ్గ పవిత్ర వృత్తి అన్నాడు. అంటరానితనం దేశానికి శాపమన్నాడు. దాన్ని పొగొట్టటం స్వరాజ్యాన్ని సాధించటంకంటే ముఖ్యమన్నాడు. అస్పృశ్యతను నిర్మూలించనిదే సహాయ నిరాకరణ, శాసనోల్లంఘనలను చేపట్టే అర్హత ఏ ప్రాంతానికీ ఉండదని కండిషను పెట్టాడు. తాను భూమిమీదికి వచ్చి బుద్ధి గరిపేంతవరకూ హిందూ దేశంలో ఎవరూ అస్పృశ్యత పాపాన్ని గుర్తించనే లేదన్నట్టు క్లాసులు తీసుకున్నాడు. ఆఖరికి బీహార్‌లో భూకంపం వచ్చి వందల మంది చచ్చి, వేలూ లక్షల బతుకులు సర్వనాశనమైన విపత్కాలంలోనూ – అదంతా అస్పృశ్యత పాపానికి దేవుడి శాపమని చెప్పి ప్రజల పుండు మీద పుట్టెడు కారం చల్లాడు. అంటరానితనం మీద అంతటి క్రోధం, అంటరాని వాళ్లమీద వల్లమాలిన అభిమానం ఉన్న – లేక కలదని చెప్పుకున్న మహాత్ముడు ఆ దురాచారాన్ని నిర్మూలించేందుకు తాను చేసిందేమిటి? తరతరాలుగా దారుణ దుర్దయాలకు లోనైన దళిత జనావళిని తాను ఉద్ధరించింది ఏపాటి? చెబితే ఆశ్చర్యపోతారు.

సంవత్సరంలోగా స్వరాజ్యం వచ్చి ఒళ్లోవాలాలంటే తిలక్ స్వరాజ్య నిధికి కోటి రూపాయలు పోగెయ్యాలని చెప్పి గాంధీగారు దేశమంతటా సుడిగాలిలా తిరిగి నగలూ, నగదూ జనం నుంచి వొలుచుకుపోయారు గుర్తుందా? అనుకున్నదానికి మించి కోటి 35 లక్షల రూపాయలు ఆ నిధికి ప్రజల నుంచి వసూలైంది. అందులో అస్పృశ్యుల నిమిత్తం, అస్పృశ్యతా నిర్మూలన కార్యక్రమాల నిమిత్తం కేటాయించిందెంతో తెలుసా? ముష్టి 43 వేలు ! ఈ అన్యాయం తెలిసి కూడా గాంధీ నోరెత్తితే ఒట్టు.

చౌరీ చౌరా మిషతో స్వరాజ్య ఉద్యమాన్ని గుంటబెట్టి గంటవాయించి, అసలైన స్వాతంత్ర్య పోరాటాన్ని జయప్రదంగా పట్టాలు తప్పించిన మీదట... కార్యకర్తలకు ఏదో ఒక పని పెట్టటానికి సాంఘిక మహా సంస్కరణేదో జరిగిపోతున్నట్టు జనానికి భ్రమ కొలపటానికి... కొసరు నిర్మాణకార్యక్రమాన్నొకటి గాంధీగారు బార్డోలీలో కాంగ్రెసు తలకెత్తాడు. విదేశీ కబంధ హస్తాలనుంచి మాతృభూమిని విముక్తిచేసే ప్రప్రథమ కర్తవ్యం నుంచి దేశభక్తుల దృష్టి మరల్చి, పాకీదొడ్లు కడగటం లాంటి చిల్లర పనులను పురమాయించి, వాటిని సరిగా చేస్తేగాని స్వరాజ్యంకోసం పోరాడేందుకు దేశానికి యోగ్యత సిద్ధించదని దబాయించాడు. ఆయన అవసరం, అసలు కారణం ఏదైతేనేమి నిర్మాణాత్మక కార్యక్రమమంటూ చేపట్టాక కనీసం దాన్నయినా సవ్యంగా జరగనిచ్చాడా? అస్పృశ్యులను ఉద్ధరించడం బార్డోలీ కార్యక్రమంలో ముఖ్యమైన అంశం. దానికోసం ఏమిచేయాలో ఆలోచించి విధి విధానాలు రూపొందించడానికి ఒక కమిటీ వేసినట్టే వేశారు. పని తిన్నగా మొదలుపెట్టకుండానే, ఒకసారి కూడా సమావేశం కాకుండానే దాన్ని రద్దుచేశారు. అస్పృశ్యతా నిర్మూలన హిందూ మహాసభ చేపట్టాల్సిన పని అని భలేగా తేల్చి చివరికి చేతులు దులిపేసుకున్నారు. దీనిపై అంబేద్కర్ వ్యాఖ్య ఇది:

The Committee was dissolved and the uplift of the Untouchables as an item in Constructive Programme was dropped. Only Rs. 800 were allotted to the committee for working expenses. Why did Mr. Gandhi not protest against this niggardly and step motherly treatment of the Committee? Why did not Mr. Gandhi support Swami Shradhanand who was fighting with the Congress Working Committee for large funds being assigned to the committee? Why did not Mr. Gandhi protest against the dissolution of the committee? Why did he allow the work for the Untouchables to drop out as though it was of no importance?

[*What Congress and Gandhi have done to the Untouchables*, B. R. Ambedkar]

(కమిటీని రద్దుచేసి, నిర్మాణ కార్యక్రమంలో అస్పృశ్యత అంశాన్ని వదిలేశారు. పనిచేసేందుకు ఖర్చుల నిమిత్తం కమిటీకి 800 రూపాయలు మాత్రం కేటాయించారు. నికృష్టమైన ఈ సవతితల్లి వైఖరిని గాంధీ ఎందుకు నిరసించలేదు? సరిపడా నిధుల నిమిత్తం కమిటీ సభ్యుడైన స్వామి శ్రద్ధానంద కాంగ్రెసు వర్కింగు కమిటీతో కొట్లాడుతుంటే గాంధీ ఆయన్ని ఎందుకు సమర్థించలేదు? కమిటీనే రద్దు పరచటాన్ని గాంధీ ఎందుకు వ్యతిరేకించలేదు? అస్పృశ్యుల కోసం పనిచేయటం ముఖ్యమైనదే కానట్టు ఎత్తెయ్యడాన్ని ఆయన ఎందుకు ఉపేక్షించాడు?)

చీటికీ మాటికీ అన్నం మాని చచ్చిపోతానని బెదిరించే మహాత్ముడు తనకు ప్రియాతి ప్రియమైనవారు. కన్నబిడ్డలకంటే అధికమైనవారు అని చెప్పుకున్న 'హరిజనులకోసం ఒక్కసారీ ఉపవాసం చెయ్యలేదని ఇందాక అంబేద్కర్ ఆక్షేపించాడు. (అస్పృశ్యులకు ప్రత్యేక ఎలక్టోరేట్ల ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఆమరణ దీక్షకు కూచోలేదా అని ఎవరికైనా సందేహం రావచ్చు. ఆ సందర్భం వేరు. సమయం వచ్చినప్పుడు ఆ వివరాల్లోకి వెళదాం.) అస్పృశ్యులను బావుల దగ్గరికి, ఆలయాలలోకి రానివ్వాలని పట్టుబడుతూ తానైతే ఉపవాసం చెయ్యలేదు. సత్యాగ్రహమూ సాగించలేదు. సరే, కనీసం అస్పృశ్యులనైనా తమకోసం తాము సత్యాగ్రహం చేసుకోనిచ్చాడా? అదీ లేదు. దీనికీ అంబేద్కరే సాక్షి.

The true reasons why Mr. Gandhi will not go beyond sermons were revealed to the Untouchables for the first time in 1929, when the Untouchables in the Bombay Presidency opened a campaign of Satyagraha against the Hindus for establishing their civic rights in the matter of temple-entry and taking water from Public wells... When appealed to for support, Mr. Gandhi surprised the Untouchables by issuing a statement condemning their campaign of Satyagraha against the Hindus... He stated that Satyagraha was to be used only against foreigners, it must not be used against one's own kindred or countrymen... By this Mr. Gandhi made non-sense of Satyagraha.

(Ibid)

(ధర్మోపన్యాసాలకు మించి గాంధీ తమకు ఏమీ చేయలేడన్న సంగతి మొదటి సారిగా 1929లో అస్పృశ్యులకు అర్థమైంది. అప్పుడు బొంబాయి ప్రెసిడెన్సీలో అస్పృశ్యులు ఆలయ ప్రవేశానికి, ఊరి బావుల్లో నీరు పట్టుకోవటానికి సంబంధించి తమ పౌర హక్కులను సాధించుకోవటానికి అగ్రవర్ణాల హిందువులకు వ్యతిరేకంగా సత్యాగ్రహాన్ని ప్రారంభించారు. దానికి మద్దతివ్వమని అడిగితే ఆ సత్యాగ్రహాన్నే ఖండిస్తూ ప్రకటన చేసి, గాంధీ అస్పృశ్యులను ఆశ్చర్యపరిచాడు... సత్యాగ్రహాన్ని విదేశీయులపై వాడాలే తప్ప... ఆత్మబంధువుల మీద, తమ దేశ వాసుల మీద ప్రయోగించకూడదని అతడన్నాడు. ఈ రకంగా గాంధీ సత్యాగ్రహాన్ని నాన్సెన్సుగా చేశాడు.)

అందుకే అన్నాడు అంబేద్కర్ :

Good God! Is this man our saviour ? Beware of Gandhi !

(ఓరి దేవుడా ! ఇతడా మా రక్షకుడు ?

గాంధీ ఉన్నాడు జాగ్రత్త !!)

తాతయ్య ప్రేమ కలాపం

***గాం**ధీ గారు బ్రహ్మచర్య విద్యలో భీష్ముడికీ ఆంజనేయుడికీ కూడా కూచోబెట్టి చదువుచెప్పగలిగిన ఆదర్శ బ్రహ్మచారి. బ్రహ్మచర్యంతో ఆయన చేసినన్ని ప్రయోగాలు చేసినవాడు, ఆయనంతటి ఘోటక బ్రహ్మచారి చరాచర ప్రపంచంలో ఎక్కడా ఉండడు. ఆయనగారి బ్రహ్మచర్యం ఎంత విలక్షణమైన దంటే... గృహస్థాశ్రమంలో ఉన్నప్పటికీ సొంత భార్యతో కలిసి పడుకోవటం కూడా పనికిరాదు. కాని పరాయి వాడి భార్య మీద మనసు పారేసుకుని మహా ఇదైపోవటం మాత్రం ఆయన నిష్ఠకు పనికొస్తుంది ! పరసతితో సరాగాలాడి అంతలా ఇదైపోయిన ఘనుడెవ్వడనా మీ సందేహం? ఇంకెవరు? మహా బ్రహ్మచారి మహాత్మాగాంధీగారే !*

తాతగారి ప్రేమాయణాన్ని మనవడు చెబితేనే రమ్యుగా ఉంటుంది. మోహన్‌దాస్ గాంధీ కనిష్ఠ పుత్రుడు దేవదాస్ గాంధీకి కొడుకయిన **రాజమోహన్ గాంధీ** తాతయ్య జీవితగాథపై ఈమధ్య వెలువరించిన 745 పేజీల బృహత్ గ్రంథంలో దీనికి సంబంధించి రాసిన కథాక్రమం బెట్టిదనిన...

జలియన్‌వాలాబాగ్ ఊచకోత జరిగిన ఆరునెలల తరవాత... తమరు పంజాబ్ వెళ్లవచ్చునని బ్రిటిషు సర్కారు అనుమతి ఇచ్చిన మీదట... 1919 అక్టోబరు 24న గాంధీ లాహోర్ వెళ్లాడు. పంజాబ్ అత్యాచారాలను కాంగ్రెసు తరఫున విచారించే కమిటీ పనిమీద మూణ్నెల్లు పంజాబ్‌లో గడిపాడు. లాహోర్‌లో ఆయన విడిది రాంభుజ్‌చౌదరి ఇంట్లో. చౌదరిగారు పేరుమోసిన కాంగ్రెసు నాయకుడు. ఆ సమయంలో చాలామంది కాంగ్రెసు నాయకుల్లాగే ఆయన జైల్లో ఉన్నాడు. ఇంటాయన లేనందువల్ల ఆయన ఇల్లాలు వచ్చిన అతిథి యోగక్షేమాలు చూసింది. ఆ సందర్భంగా పరిచయం పెరిగింది. మహాత్ముడి మనసు వశం తప్పింది.

అప్పుడు గాంధీ వయసు 50. ఆమెకు 47. పేరు సరళాదేవి. పుట్టింటి వారిది కలకత్తా. ఆమె తండ్రి కాంగ్రెసు నాయకుడే. అన్నట్టు విశ్వకవి రవీంద్రనాథ్ టాగూరు

ఆమెకి మేనమామ. చిన్నప్పటినుంచీ రాజకీయాల్లో చలాకీగా తిరిగేది. బాగా రాసేది. చక్కగా మాట్లాడేది. తండ్రి కాంగ్రెసు కార్యదర్శిగా ఉండగా ఆయన పనిలో సహాయం చేసేది. 33వ ఏట చౌదరిగారిని పెళ్లిచేసుకుని లాహోర్‌కి వచ్చాకా రాజకీయాల్లో తిరిగేది. భర్త జైలుకెళ్లాక ఆయన నడిపే 'హిందుస్తాన్' పత్రిక సంపాదకత్వ బాధ్యత తానే తీసుకున్నది. ఆమెకు ఈడొచ్చిన కొడుకు ఉన్నాడు.

వారి ఇంట్లో దిగిన మూడురోజులకు 'సరళాదేవి మంచిది. నన్ను బాగా చూసు కుంటున్నది' అని గాంధీగారు అనసూయాబెన్‌కు ఉత్తరం రాశాడు. రోజులు గడిచే కొద్దీ ఆయనకు ఇష్టం పెరిగి చాలా దూరం వెళ్లింది. పంజాబ్‌లో ఉన్నన్నాళ్లూ గాంధీ ఎక్కడ పర్యటించినా సరళాదేవి వెంట వెళ్లేది. ఆయన సభల్లో మాట్లాడేది. పాటలు పాడేది. ఖద్దరు ప్రచారం చేసేది. గాంధీ పరిచయమైన రెణ్నెల్లకే ఆమె భర్త జైలు నుంచి తిరిగొచ్చాడు. ఆ తరవాతా వారి అనుబంధం కొనసాగింది. కొన్నాళ్లకు తన 13 ఏళ్ల కొడుకు దీపక్‌ను సబర్మతి ఆశ్రమానికి పంపింది. తరవాత తానూ వెళ్లి అక్కడ కొన్నాళ్లుంది. ఆశ్రమ నియమాలను ఆ అబ్బాయి కోసం సడలించటమేమిటని, సరళాదేవితో మరీ అంతలా ముచ్చట్లాడటమేమిటని గాంధీగారిని ఆక్షేపిస్తూ ఆశ్రమవాసులు చెవులు కొరుక్కున్నారు.

The following months saw a special relationship that Gandhi called 'indefinable' after its character changed in June 1920. In between he had not only overcome his caution but even thought of a 'Spirutual Marriage' whatever that may have meant, with Saraladevi.

[*Mohandas, A True Story*, Raj Mohan Gandhi, P.230]

(తరవాతి నెలల్లో, 'అనిర్వచనీయమ'ని గాంధీ పేర్కొన్న ప్రత్యేక సంబంధం పెరిగింది. 1920 జూన్‌లో దాని స్వభావం మారింది. ఈ మధ్యకాలంలో ఆయన జాగ్రత్తను వదిలేయడం ఒకటేకాదు. సరళాదేవిని 'ఆధ్యాత్మిక వివాహం' చేసుకోవాలని కూడా ఆలోచించాడు. దాని అర్థం ఏమిటో తెలియదు.)

తాను పుట్టటానికి 15, 16 సంవత్సరాల పూర్వం తాత నడిపిన ప్రేమ కలాపం గురించి మనవడు చెప్పిన ఈ సంగతులు నిజమా కాదా అని శంకించాల్సిన పనిలేదు. 1920 ఆగస్టు 10న జర్మన్ మిత్రుడు కల్లెన్‌బాక్‌కు రాసిన ఉత్తరంలో స్వయంగా గాంధీయే ఇలా అన్నాడు :

I have come in closest touch with a lady who often travels with me. Our relationship is indefinable. I call her my spiritual

wife. A friend has called it an intellectual wedding. I want you to see her. It was under her roof that I passed several months at Lahore in the Punjab.

[Collected works of Mahatma Gandhi, Vol. 21, #90, P. 131]

(నేను ఒకావిడకు చాలా దగ్గరయ్యాను. ఆమె తరచూ నాతో కలిసి ప్రయాణం చేస్తుంది. మా సంబంధం అనిర్వచనీయం. ఆమె నా **ఆధ్యాత్మిక భార్య** *అని నేనంటాను. ఒక మిత్రుడైతే మాది మేధోపరమైన వివాహం* **అన్నాడు.** *ఆమెను మీరు చూడాలి. లాహోర్‌లో ఆమె ఇంట్లోనే నేను చాలా నెలలు గడిపాను.)*

సారు గారేదో 'ఆధ్యాత్మిక భార్య' అంటున్నారు. వారిది మేధోపరమైన వివాహం అనేమో వారి మిత్రుడికి తోచిందట. దీన్నిబట్టి మోహన్ - సరళల సంబంధం పూర్తిగా ఆధ్యాత్మికపరమైనదీ, మేధోపరమైనది మాత్రమేనేమో; మామూలు ప్రేమకలాపాల్లాంటిది కాదేమో... అని మనబోంట్లకు సందేహం కలగటం సహజమే. ఏసుక్రీస్తుకి తక్కువ - అశోకుడికి ఎక్కువ ఐనట్టుగా ఘన ప్రచారం పొందిన అంతటి మహాత్ముడు పరస్త్రీతో, అందునా మరొకరి సతితో వివాహేతర సంబంధం పెట్టుకుని పాపపు ఆలోచన చేశాడంటే మనకు నమ్మబుద్ధికాదు. కాని ఏం చేస్తాం? వారిది పవిత్ర బంధమేమో, కనీసం వారి మధ్య ఉన్నది అమలిన శృంగారమేమో అని సంశయలాభం ఇవ్వాలనుకున్నా ఇవ్వలేము. ఎందుకంటే - ఇష్ట సఖిపట్ల ఆ సమయంలో తనకున్నది ఏ రకమైన భావనో స్వయానా గాంధీగారే దాచుకోకుండా చల్లగా బయటపెట్టారు. పదమూడేళ్ల తరవాత (1933 ఫిబ్రవరి5న) ఫాదర్ బిల్‌బాష్‌కు రాసిన లేఖలో గాంధీగారు రాసిందిది:

... I had, not very many years ago, all but fallen, but the thought of Devdas, who was then living with me, of Mahadev, Mathuradas and others who were at that time surrounding me... and the thought of my wife kept me from going to perdition. It was their love which chained me so tightly and strongly that I could not burst through the bond although the flesh was pulling hard enough to tear the chains to bits and rush into hell-fire.

[CWMG, Vol. 59 # 287, P. 196]

(కొన్ని సంవత్సరాల కిందట నేను దాదాపుగా పతనమవబోయాను. కాని ఆ సమయంలో నాతోబాటే ఉంటున్న నా కొడుకు దేవదాసు, నా చుట్టూ ఉన్న మహదేవ్, మధురాదాస్ తదితరులు ఏమంటారోనన్న ఆలోచన... నా భార్య ఏమవుతుందో నన్న చింతన నన్ను దుర్గతి నుంచి తప్పించాయి. బంధాలను తెంచేసుకుని పాపపు మంటల్లోకి

ఉరకమని నన్ను కామవాంఛ ఎంత బలంగా లాగినా వీరి ప్రేమే నన్ను గట్టిగా కట్టిపడేసింది.)

ఐనా మనకు నమ్మకం కలగదు. ఇదంతా ఆ సమయాన మహాత్ముడి మానసిక సంఘర్షణ మాత్రమేనేమో ! నిజంగా ఆయన ఏ తప్పూ చేయలేదేమో! ఒకింత పాపపు ఆలోచన రేఖామాత్రంగా పొడసూపినందువల్లే సున్నిత మనస్కుడైన ఆ మహానుభావుడు అంతలా ఇదైపోయాడేమో ! గోరంత దురాలోచనను కొండంత పాపంగా ఊహించుకుని ఆయన ఆవేదన చెందడాన్నే మనం అపార్థం చేసుకుంటున్నామేమో అన్న సంశయం పీడిస్తుంది. కాని ఇదంతా కేవలం మహాత్ముడి మానసిక క్షోభేననడానికి వీలుపడదు. ఎందుకన్నది మనవడు చెబుతాడు :

For four to five months-between January and May 1920 - Gandhi was clearly dazzled by her personality and seemed to fantasize that providence desired them together to shape India to a new design. He wrote to her that he often dreamt of her... But his son Devdas and others (Desai, Mathuradas and C.R. were among them) questioned Gandhi and asked him to think of the consequences for Kasturba, people like them and Gandhi himself, if he continued the special relationship with Saraladevi...

Rajagopalachari wrote Gandhi a strong letter on 16 June, saying that between Saraladevi and Kasturba the contrast was similar to that between a Kerosene Oil Ditmar lamp and the morning sun. Asserting that Gandhi had nursed a most dreadful delusion, C.R. added:" "come back and give us life.... Pray disengage yourself at once completely"...

. ... We must assume also that the relationship shocked and wounded Kasturba while it lasted and that its ending enhanced her prestige..."

[*Mohandas, A True Story....* Rajmohan Gandhi, *PP. 231-233*]

(1920 జనవరి నుంచి మే వరకు నాలుగైదు నెలలపాటు గాంధీ కళ్లు బైర్లు కమ్మేంతగా ఆమె మోజులో పడ్డాడు. భారతదేశానికి కొత్త రూపు ఇవ్వడానికే విధి తమ ఇద్దరినీ దగ్గరికి చేర్చిందని ఆయన ఊహించుకున్నట్టుంది. నువ్వు తరచుగా కలలోకి వస్తున్నావంటూ ఆమెకు ఉత్తరాలు రాసేవాడు. దేవదాసు, ఇతరులు (దేశాయి, మధురాదాస్, సి. రాజగోపాలాచారి వంటి వాళ్లు) గాంధీని నిగ్గదీశారు. సరళాదేవితో

మీ సంబంధం మూలంగా కస్తూర్బాకు, తమలాంటివారికి, అంతిమంగా మీకు (గాంధీకి) పర్యవసానాలు ఎలా ఉంటాయో ఆలోచించమని వారు మందలించారు.

రాజగోపాలాచారి జూన్ 16న గాంధీకి ఘాటైన ఉత్తరం రాశాడు. సరళాదేవికీ, కస్తూర్బాకూ మధ్య కిరోసిన్ దీపానికీ, ఉదయభానుడికీ ఉన్నంత తేడా ఉన్నదని అందులో అన్నాడు. గాంధీ 'అతిభయంకరమైన భ్రాంతి'లో పడ్డాడని నొక్కి చెబుతూ సి.ఆర్. ఇంకా ఇలా రాశాడు. 'వెనక్కి వచ్చేయండి. మమ్మల్ని బతికించండి. వెంటనే ఈ వ్యామోహం నుంచి పూర్తిగా బయటపడమని నాప్రార్థన'

ఈ సంబంధం సాగినంతకాలమూ కస్తూర్బాకు దిగ్భ్రమ కలిగించి గాయపరిచింది. దాని ముగింపు ఆమె ప్రతిష్ఠను పెంచింది.)

ఆమెతో సంబంధం మానుకో నాన్నా - అని కన్నకొడుకు చేత చెప్పించుకోవలసినంత పవిత్రంగానూ.. మీ ఇల్లాలికీ ఆమెకూ పోలికేలేదు. ఆమె భ్రాంతినుంచి బయటపడి, మమ్మల్ని బతికించండి స్వామీ అని సి.రాజగోపాలాచారి అంతటి పెద్దమనిషిచేత చివాట్లు పెట్టించుకోవలసి వచ్చేంత పరువుగానూ సరళాదేవితో మోహన్‌దాసు వ్యామోహం కొనసాగింది. సబర్మతి ఆశ్రమవాసులు చికాకు పడేంతగా... పర్యవసానాలేమిటోనని ఆప్తులు భయపడేంతగా... ఉత్తమ ఇల్లాలు కస్తూర్బాకు మనసు గాయపడేంతగాసాగి, నలుగురిలో కావలసినంత అల్లరిపాలయిన ఈ అక్రమ సంబంధాన్నే 'ఆధ్యాత్మిక ప్రణయం', 'మేధోపరమైన పరిణయం' అని మహాత్ముడు పాపభీతి లేకుండా వర్ణించుకున్నాడు. దీన్నిబట్టే ఆ మహానుభావుడి మానసిక స్థాయి ఎటువంటిదో ఊహించవచ్చు.

ఇక్కడ మీకో సందేహం రాకూడదు. గాంధీగారు నిత్య సత్యవ్రతుడు. ఏదీ దాచుకోడు. ఆఖరికి తండ్రి మరణయాతన పడుతున్నా దగ్గర ఉండకుండా పడక గదికి పరుగెత్తి తండ్రిగారు అంతిమ శ్వాస వదిలిన క్షణాన తాను పడుచు భార్య పని పడుతున్న సంగతి కూడా దాచుకోకుండా 'ఆత్మకథ'లో లోకానికి చాటిన మహనీయుడాయన. ఆఫ్రికాలో ఉండగా 37వ ఏట బ్రహ్మచర్య శపథం బూనాక దాన్ని నెరవేర్చడానికి తానూ భార్యా ఎన్ని తంటాలు పడ్డదీ, అయినా శరీరం సహరించక ఏ సందర్భంలో ఏమి జరిగిందో కూడా సంకోచం లేకుండా లోకంతో పంచుకున్నాడే ! అలాంటిది పరస్త్రీతో - మలినమో అమలిన శృంగారమో ఏదో ఒక - సాంగత్యం అన్నేసి నెలలపాటు నడిపి, పదుగురి నోళ్లలో నానినా... ఆ తరవాత ఐదేళ్లకు రాసుకున్న 'ఆత్మకథ'లో ఆ ఊసే కలికానికి కూడా కానరాదేమి? అని మనం అడగకూడదు. సత్యంతో ఇదోరకం ప్రయోగమని సరిపెట్టుకోవాలి.

సత్యం మాటేమోగాని బ్రహ్మచర్యంతో మాత్రం గాంధీగారు చాలా ప్రయోగాలు చేశాడు. ముప్పయ్యో ఏట మొదలుపెట్టి డెబ్బై తొమ్మిదో ఏట మరణించేంతవరకూ గాంధీ ప్రయోగశాలలో బ్రహ్మచర్య పరీక్షలు నాన్‌స్టాపుగా జరుగుతూనే ఉన్నాయి.

సాధారణంగా కుర్రతనంలో విషయ వాంఛలు ఎక్కువగా ఉంటాయి. వయసులో ఉన్నప్పుడే ఇంద్రియ నిగ్రహం ఎక్కువగా అవసరమవుతుంది. ముసలితనం వచ్చాక ఎవరో మద పిచ్చుగాళ్లను మినహాయిస్తే సంస్కారవంతులెవరికీ లైంగిక విషయాలపై దృష్టి పోదు. బ్లడ్‌ప్రెషరును, సుగరును పరీక్ష చేసుకున్నట్టు ఆత్మనిగ్రహాన్ని కూడా రెగ్యులర్‌గా టెస్టు చేసుకోవలసిన అవసరం ఉండదు. గాంధీగారు అలాకాదు. ఆయనకు ఎప్పుడూ బ్రహ్మచర్యం మీదే ధ్యాస. పెద్ద వయసువారు బి.పి. టాబ్లెటు రోజూ వేసుకున్నట్టు ఇంద్రియ నిగ్రహాన్ని ఆయన రోజూ పరీక్ష చేసుకోవలసిందే. నిత్యావసరం కాబట్టి అందుకు అనువుగా కావలసిన ఏర్పాటునూ ఆయన ఎల్లవేళలా ఎంచక్కా చేసుకుంటారు.

ఇంద్రియాలు మహాచెడ్డవి. ఎంతటి విద్వాంసులనైనా అవి బోల్తా కొట్టించగలవు. కాబట్టి వాటి బారిన పడకుండా ఉండాలంటే ప్రలోభాలకు దూరంగా ఉండాలని మన పెద్దలు చెప్పారు. అందుకే తల్లి, కొడుకు - తండ్రి, కూతురు - అన్న, చెల్లి అయినాసరే ఒకచోట పడుకోకూడదని పూర్వులు శాసించారు. గాంధీగారి దృష్టిలో వాళ్లంతా వెర్రివాళ్లు. ఆయనదంతా మోడరన్ టెక్నికు. పాపం జరుగుతుందేమోనని భయపడి పారిపోతే ఎలా? దగ్గరగానే ఉండాలి. బట్టలు విప్పేసి పక్కపక్కనే పడుకోవాలి. హత్తుకుని పడుకున్నా, నిర్వికారంగా ఉండాలి. తాను పురుషుడు, పక్కన ఉన్నది స్త్రీ అన్న లైంగిక స్పృహే లేకుండా పసిపిల్లల్లా నిర్మలంగా ఉండాలి. అదే బ్రహ్మచర్యం. అలా స్త్రీ పురుషులు పవిత్రభావంతో కలిసి పడుకుని నిగ్రహాన్ని పరీక్షించుకుని నపుంసకత్వాన్ని సాధన చెయ్యటమే బ్రహ్మచర్యయజ్ఞం. ఇదీ ఆయన కనిపెట్టిన సిద్ధాంతం.

ఒట్టి థీరీవల్ల ప్రయోజనం ఏమిటి? ప్రాక్టికల్సూ కావాలి కదా? గాంధీ మాష్టారు వాటికీ తన ఆశ్రమంలో ఏర్పాట్లుచేశారు. చివరి దశలో మహాత్ముడి ప్రైవేటు కార్యదర్శి **ప్యారేలాల్** చెప్పిన ప్రకారం - ఆ సందర్భంలో (1932) గాంధీ అన్నదిది :

"Those who have joined the Asharam after due deliberation have joined... fully conscious of all the risks involved therein. As for the young boys and girls, I look upon them as my own children, and as such they are automatically drawn within the pale of my experiments."

[Mahatma Gandhi - The Last Phase, Pyarelal, Vol. I, P. 211]

(ఆశ్రమంలో చేరినవాళ్లు అన్నీ ఆలోచించుకునే, రిస్కులకు పూర్తిగా సిద్ధపడే ఇక్కడ చేరారు... ఈ అబ్బాయిలనూ అమ్మాయిలనూ నేను నా సొంత బిడ్డలుగా చూస్తాను. కాబట్టి నా ప్రయోగాల పరిధిలోకి వారు ఆటోమెటిగ్గా లాగబడుదురు.)

ప్రయోగం భేషుగ్గా ఉంది. మరి ఫలితాల మాటేమిటి? అదీ బాపూజీయే చెప్పారు:

The result had been quite encouraging. "Both men as well as women have on the whole derived benefit from it... The greatest benefit has in my opinion, accrued to women. And this in spite of the fact that some of us have fallen, some have risen after sustaining a fall... Where there is cent percent success, it is not an experiment...

[Ashram Obervances in Action, M.K. Gandhi, P.53 Quoted by Pyarelal]

(ఫలితం చాలా ప్రోత్సాహకరంగా ఉంది. స్త్రీలు పురుషులూ మొత్తంమీద దీన్నుంచి ప్రయోజనం పొందారు. అన్నిట్లోకి గొప్పలాభం ఆడవారికి కలిగింది. ఐతే మాలో కొందరు పతనమయ్యారు. కొంతమంది పతనమై మళ్లీ లేచారు. అది సహజమే. నూటికి నూరుపాళ్లు విజయం సాధిస్తే అది ప్రయోగమే కాదు.)

ఆహా ! ఎంత చల్లగా చెప్పారు!! ఆడామగా కలిసి పడుకునే నిగ్రహ పరీక్షలో కొంతమంది ఫెయిలయ్యారట. కొంతమంది ఫెయిలయి మళ్లీ పాసయ్యారట. ఇలాంటి పరీక్షల్లో ఫెయిల్యూర్లు మామూలేనట. నూరుశాతం పాసులు ఎక్కడా ఉండవట. చాలా బాగుంది. మరి పతనమైన వారి సంగతి ఏమిటి? మహాత్ముడని నమ్మి కన్నబిడ్డను ఆశ్రమానికి పంపించగా... ఆ మహానుభావుడు ఇలాంటి పరీక్షల్లోకి కంపల్సరీగా లాగాక, జరగకూడనిది జరిగితే ఆ బాలికల తలిదండ్రులు ఎంత ఘోషిస్తారు? పతనమైన పడతుల గతి ఏమిటి? దిక్కుమాలిన ప్రయోగం పేర తమ బ్రతుకును బుగ్గిచేసిన మహానుభావుణ్ని వాళ్లెంత తిట్టుకుంటారు? నలుగురిలో ఎన్ని తలవంపుల పాలవుతారు ?

ఇదీ – సరళాదేవితో ప్రేమాయణం ముగిసిన పన్నెండేళ్ల తరవాత గాంధీ మహాత్ముడు తలమునకలైన బ్రహ్మచర్య వ్యాపకం ! అప్పటికి ఆయన వయసు 63. పోనీ తరవాతైనా ఆ ప్రయోగాలు చాలించాడా? ముది వయసులోనైనా మారాడా?

లేదు. సత్యాగ్రహాన్ని, శాసనోల్లంఘనను మొదట అందరికీ అనుమతించి, తరవాత 'మీకు చేతకాదు. నేను చేస్తాను. నన్ను చూసి మీరు నేర్చుకోండి' అన్నట్లే చివరికి బ్రహ్మచర్య ప్రయోగాన్నీ పూర్తిగా తనకే పరిమితం చేసుకున్నాడు. తనకు మనవరాలి వయసుగల ఈడొచ్చిన బాలికలను ప్రతిరాత్రీ తనకు అటూ ఇటూ పక్కలో వేసుకుని ఏ రాత్రికా రాత్రి తన నిగ్రహాన్ని పరీక్షించుకునేవాడు. నిదర్శనం కావాలా ? కలకత్తాలో తన విడిదిపై

మూకలు దాడిచేసి విధ్వంసం సాగించటంపై 1947 సెప్టెంబరు 1న గాంధీగారు వెలువరించిన పత్రికా ప్రకటన చూడండి. "రాత్రి గాఢ నిద్ర నుంచి నాకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. నాకు అటూ ఇటూ మను, అభాలు పడుకుని ఉన్నారు. వారు ధైర్యంగల అమ్మాయిలు" అంటూ చెప్పుకొచ్చారు.

ఈ ఇద్దరిలో మను స్వయానా గాంధీకి (వరసకు) మనవరాలే. Mahatma Gandhi- The Last Phase గ్రంథం Part - I లో ప్యారేలాల్ ఇచ్చిన వివరాల ప్రకారం మను గాంధికి చిన్నతనంలోనే తల్లిపోయింది. కస్తూర్బా దగ్గరే పెరిగింది. ఆగాఖాన్ ప్యాలెస్‌లో చనిపోతూ కస్తూర్బా ఆమెను భర్త చేతుల్లో పెట్టింది. అప్పట్నించీ బాపూయే ఆమెకి 'అమ్మ' అయిపోయారట. ఆ చనువుతోటే ఓ రోజు తన ఈడు పిల్లల్లా తనకు సెక్సు వికారాలేమీ కలగటం లేదేం అని అమాయకంగా అడిగిందట. వెంటనే గాంధీగారు ఆ 19 ఏళ్ల పిల్లలో ఆజన్మ బ్రహ్మచారిణిని కనిపెట్టారట. ఆమెను సరైన దారిలో నడిపించాల్సిన బాధ్యత తనదేనని అనేసుకున్నారట. నేను నీకు అమ్మను కదా? అలాగే ఉందాం. కలిసే పడుకుందాం. అలా మన నిగ్రహాన్ని రోజూ పరీక్ష చేసుకుందాం అని చెప్పి ఒప్పించారట. ఇంకేం గడ్డి పరుపుమీద ఒకరికొకరు హత్తుకుని వెచ్చగా పడుకునేవాళ్లట. వారికి ఏ దురుద్దేశం లేదు. కాని – పాడు లోకం ఊరుకోలేదు పెద్ద దుమారం లేచింది. గాంధీగారు జంకలేదు. ఊరుకోలేదు.

In one of his prayer addresses he referred to" "small talks, whispers and innuendos" going round him of which he had become aware. He told the gathering he did not want his most innocent acts to be misunderstood and misrepresented. He had his grand-daughter with him. She shared the same bed with him... It was an integral part of the Yajna he was performing and he invited them to bless the effort..."

[Pyarelal. PP. 219-20]

(ఒకరోజు ప్రార్థన సమావేశంలో ఆయన తన దృష్టికి వచ్చిన "చిల్లర మాటలు, గుస గుసలు, నర్మగర్భ వ్యాఖ్యానాల"ను ప్రస్తావించారు. తన అమాయక చర్యలను అపార్థం చేసుకోవద్దని ఆయన సభికులను కోరారు. నా మనవరాలు నాతోనే ఉంటున్నది. నా పక్కమీద నాతో కలిసి పడుకుంటున్నది... నేను సాగిస్తున్న యజ్ఞంలో అది భాగం. ఈ ప్రయత్నాన్ని ఆశీర్వదించండి – అని ఆయన చెప్పారు...)

జనం ఆశీర్వదించకపోగా చీదరించుకున్నారు. నవకాళి ప్రార్థన సమావేశాల్లో రెండు రోజులపాటు చెప్పటంతో ఊరుకోకుండా గాంధీగారు అక్కడ చెప్పిందంతా కాగితం

మీద పెట్టి, ప్రచురించమంటూ తన 'హరిజన్' పత్రికకు పంపారు. ధర్మకర్తలు దాన్ని ప్రచురించడానికి నిరాకరించారు. అంతేకాదు గాంధీజీ నవకాళి మకాంలో ఉన్నందున తాత్కాలికంగా ఆ పత్రిక సంపాదక బాధ్యతలు చూస్తున్న ఇద్దరు సహచరులు 1947 ఫిబ్రవరిలో ఆయన ప్రవర్తనకు నిరసనగా రాజీనామా చేశారు. 'పోతే పొండి. పత్రిక పని నేనే చూసుకుంటాను' అన్నాడు గాంధీ. 'వీల్లేదు, దానికి మేము ఒప్పుకోము' అన్నారు ధర్మకర్తలు. గాంధీగారు చేసేది లేక 'సరే మీ ఇష్టం' అన్నాడు.

ఇది గాంధీమహాత్ముడి 78వ ఏట జరిగిన ముచ్చట. ఆశ్రమంలోని ఆడ పిల్లలతో ఒళ్లంతా నూనె బహిరంగంగా మర్దన చేయించుకోవటం. అంతా చూస్తుండగా దాదాపు దిగంబరంగా స్నానాలాడటం, ఆడా, మగా బట్టలు ఎంత తక్కువ వేసుకుంటే అంత నయం; దిగంబరంగా ఉండటం నాకు ఇంకా ఇష్టం అనడం లాంటి గాంధీ లీలలకైతే అంతే లేదు. దక్షిణాఫ్రికాలో వందల సంఖ్యలో జులు తిరుగుబాటుదార్లను క్రూరంగా చంపేస్తున్న బీభత్స సమయంలో - తాను అర్జంటుగా ఇల్లాలితో మంచం పొత్తు మానుకోవాలన్న మహత్తరమైన ఆలోచన వచ్చిన నాటినుంచి... జీవితం చరమదశలో దేశం అల్లకల్లోలమై తనచుట్టూ వేలూ లక్షల మంది గొంతులు కోసుకుంటున్నా సరే- 'బ్రహ్మచర్య యజ్ఞాన్ని' మాత్రం ఒక్కరోజైనా ఆపేది లేదని భీష్మించడం వరకూ గాంధీది ఎప్పుడూ ఒకటే తీరు. తననే నమ్ముకున్న ఇరవై ఏళ్ల ఆడపిల్లలను ప్రతి రాత్రీ వాటేసుకుపడుకుని 'బ్రహ్మచర్య యజ్ఞం' సాగిస్తూ ముసలాయన తన నిగ్రహాన్ని పరీక్ష చేసుకోవటం ఏడ్చినట్టే ఉంది. ఎంతసేపూ తన నిగ్రహమూ, తన పరీక్ష అనడమే తప్ప ఆ దిక్కుమాలిన ప్రయోగం వల్ల అవతలి మనిషికి ఎంత దుర్భరంగా ఉంటుందో, ఎన్ని మానసిక వికారాలకు లోనవుతుందోనన్న ధ్యాసే గాంధీకి లేదు. ప్రయోగం అన్నాక వైఫల్యం సహజమేనని ఆ మహానుభావుడే అన్నాడు కదా? కర్మంచాలక ఏ రాత్రయినా ముసలివాడి ప్రయోగం విఫలమైతే ఆ అమ్మాయి గతేమిటి?

అయిన దానికీ కాని దానికీ గాంధీ 'హిందూమతం', 'సనాతన ధర్మం' అంటుంటాడు కదా ? తన భార్య కాని పరాయి స్త్రీని పక్కలో వేసుకుని పడుకుని, బ్రహచర్య ప్రయోగం చేసుకోవటానికి హిందూమతం, సనాతన ధర్మం ఎక్కడ అనుమతిచ్చాయి? ఇది నిగ్రహాన్ని పరీక్షించుకునే నెపం మీద నికృష్టపు కుతి తీర్చుకోవటంకాక మరేమిటి?

ఇన్ని లక్షణాలు ఉన్నవాడిని మామూలుగా ప్రపంచంలో ఎక్కడైనా కామపైత్యుడు అంటారు. మనం మాత్రం 'మహాత్ముడు' అని నెత్తిన పెట్టుకు పూజిస్తున్నాం.

కొల్లాయి గట్టితేనేమి ?

***అ**నేక వేల సంవత్సరాల్లో ఎందరెందరో మహాత్ములు మన పుణ్య భూమిలో నడయాడారు. కాని - 'మహాత్ముడు' అనగానే ఎవరికైనా మోహన్‌దాస్ గాంధీయే గుర్తొస్తాడు. ఆ బిరుదు ఆయనొక్కడికే హక్కుభుక్తమైనట్టుగా మన మనసుల్లో ముద్రపడిపోయింది. గాంధీని దేవుడిగా తలిచేవారు, కొలిచేవారు, ఆ మహానుభావుడిని మానవ కొలమానాలతో కొలవకూడదని వాదించేవారు ప్రపంచంలో నేటికీ లక్షోపలక్షలు. ఇంతకీ ఏమిటి ఆయన ప్రత్యేకత? మోహన్‌దాసు ఎందులో గొప్ప ?*

గాంధీ గొప్పింట పుట్టాడు. ఇంగ్లండు వెళ్లి పెద్ద చదువు చదివాడు. దక్షిణాఫ్రికాలో ప్లీడరు ప్రాక్టీసు ఎత్తేసి తిరిగొచ్చినది మొదలు దేశ సేవకే జీవితాన్ని అంకితం చేశాడు. దీన జనులను ఉద్ధరించాలని తపించి, వారితో తాదాత్మ్యం చెందాడు. ఆఖరికి ఒంటిమీద దుస్తులనూ వదిలేసి కొల్లాయే కట్టాడు. ఆశ్రమంలోనే ఉన్నాడు. నిరాడంబరంగా బతికాడు. మునిలాగే మసలాడు. స్వార్థమన్నది లేక సర్వస్వం దేశానికి ధారవోశాడు. అలాంటివాడు మహాత్యాగి కాక మరేమిటి? అని మన బుద్ధికి తోస్తుంది. స్వాతంత్ర్య పోరాటంలో లక్షల మంది గొప్ప త్యాగాలు చేశారని మనకు తెలుసు. కాబట్టి వారందరికీ స్ఫూర్తినిచ్చిన మహాత్ముడు వారికంటే మహా త్యాగమూర్తి అయి ఉంటాడని మనం అనేసుకోవటం సహజమే.

కాని వాస్తవం వేరు.

గాంధీని నమ్మిన దేశభక్తులకూ, గాంధీకీ ముఖ్యమైన తేడా ఉంది. ఆ దేశభక్తులు ఇతరులకోసం త్యాగాలు చేశారు. గాంధీ సంగతో? ఆయనకోసం ఇతరులు త్యాగాలు చెయ్యాలి. మొదటినుంచీ అంతే. ఒంటిమీది నగలను తల్లి త్యాగం చేస్తే గాంధీ పెద్ద చదువుకు ఇంగ్లండు వెళ్లాడు. చదువయ్యాక అన్నగారు డబ్బిచ్చి సహాయపడితే ప్రాక్టీసు పెట్టాడు. ఆ రోజుల్లో ఇంగ్లండు వెళ్లి బారిష్టరయిన వాళ్లు చాలామంది తిరిగొచ్చాక

రెండు చేతులా బోలెడు సంపాదించేవాళ్లు. కాని మనవాడు పిరికి. సరిగా మాట్లాడనే లేడు. వృత్తిలో ఘోరంగా విఫలమయ్యాడు. మళ్లీ అన్నగారే పలుకుబడిని ఉపయోగించి దక్షిణాఫ్రికా క్లయింటును పట్టుకుంటే తమ్ముడు దేశాంతరం వెళ్లాడు. దక్షిణాఫ్రికాలోనూ ప్లీడరీ బ్రహ్మాండంగా వెలిగిపోయిందేమీ లేదు. అక్కడ ఉన్నన్నాళ్లూ సంపన్న భారతీయ వ్యాపారులే గాంధీ ఖర్చులన్నీ భరించారు. అలాగని ఆయన బొత్తిగా నిర్ధనుడు కాదు. ప్రాక్టీసు మరీ గొప్పగా లేకపోయినా క్లయింట్ల నుంచి బాగానే సంపాదించాడు. రెండు దశాబ్దాలు ఆ దేశంలో ఉండి ఇండియా ఓడెక్కేసరికి గాంధీ దరిద్రుడేమీ కాదు. డబ్బు దగ్గర నిక్కచ్చి మనిషి కాబట్టి, అక్కడి బహిరంగ కార్యకలాపాల ఖర్చులన్నీ బయటివారే చూసుకున్నారు కాబట్టి ప్లీడరీలో ఆర్జించిన దానిలో బాగానే వెనకేసి ఉండాలి.

స్వదేశం తిరిగొచ్చి పర్మనెంటుగా స్థిరపడి, వృత్తిజోలిమాని పూర్తికాలం రాజకీయాలకే అంకితమయ్యాక గాంధీ ఏమి చేశాడు? అనంతరకాలంలో తన ఉద్బోధపై బంగారుగుడ్ల బాతులాంటి ప్లీడరీ వృత్తిని మానుకున్న మోతీలాల్ నెహ్రూ, చిత్తరంజన్‌దాస్, టంగుటూరి ప్రకాశం వంటి మహామహుల్లాగా... దేశం కోసం సర్వస్వం త్యాగంచేసి, ఆర్జించినదంతా ప్రజలకోసం, పోరాటంకోసం ఖర్చుపెట్టాడా? లేదు. వచ్చినప్పటి నుంచీ ఎవరి మీద వాలిపోదామా అనే చూశాడు. రాజకీయ గురువైన గోపాలకృష్ణ గోఖలే మొదట్లో గాంధీ సమస్త ఖర్చులనూ సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ నుంచి చెల్లించే ఏర్పాటుచేశాడు. ఆయన కాలం చేశాక గాంధీగారి అవసరాలు గుర్తుతెలియని వ్యక్తుల గుప్త దానాలూ గ్రాంటలతో వెళ్లిపోయాయి. అవి ఎలాంటివో అర్థమవాలంటే 'ఆత్మకథ'లో గాంధీగారే చెప్పుకొచ్చిన ఈ ఉదంతాన్ని చిత్తగించండి.

ఒక దశలో సత్యాగ్రహ ఆశ్రమాన్ని నడపటం కష్టమైందట. ఓ రోజు ఆశ్రమ నిర్వాహకుడొచ్చి – చేతిలోని డబ్బంతా అయిపోయింది. వచ్చేనెల ఖర్చులెలా? అన్నాడట. అలాంటి సమస్య ఎదురవటం గాంధీగారికి కొత్తకాదట. ఇబ్బంది వచ్చిన ప్రతిసారీ దేవుడే ఏదో సర్దుబాటు చేస్తాడట. ఈసారీ అంతే అయింది. ఇలా ఇబ్బంది ఎదురైందో లేదో అలా ఓ సేటు ఆశ్రమం ముందు ప్రత్యక్షమయ్యాడట. కార్లో కూచునే గాంధీని పిలిపించి 'ఆశ్రమానికి కాస్త సాయంచేస్తా తీసుకుంటారా?' అని అడిగాడట. ఈయన 'తప్పకుండా.' అన్నాడు.

'రేపు వస్తా, ఉంటారుగా?' అని వెళ్లిన సేటు మర్నాడు ఠంచనుగా వచ్చాడట. మళ్లీ కారు దిగకుండానే గాంధీని పిలిపించి, 13 వేల రూపాయల కరెన్సీ నోట్లు చేతిలో పెట్టి అటునుంచి అటే వెళ్లిపోయాడట. అప్పట్లో 13 వేలు అంటే ఈ రోజుల్లో 13 లక్షల కంటే చాలా ఎక్కువ. ఆ సొమ్ముతో సంవత్సరం ఖర్చులు వెళ్లిపోతాయని

గాంధీగారు సంతోషపడ్డారట. అంతేకాని - వచ్చిన వాడెవడు? ముక్కు మొగం ఎరగకుండా, ఎన్నడూ ఆశ్రమంలో అడుగుపెట్టకుండానే అంత సొమ్ము ఎందుకు ఇచ్చాడు? అంత డబ్బు ఎక్కణ్నించి వచ్చింది? అతడి సొంతమా, వేరెవరైనా పంపిందా? కొంపదీసి వాడేమైనా బ్రిటిషు ఏజంటా? అడక్కుండానే - అవసరాన్ని దివ్య దృష్టితో కనిపెట్టి అర్జంటుగా ఆదుకోవడం వెనుక మతలబు ఏమిటి? ఏ ప్రయోజనం ఆశించి? మనబోంట్లకు సహజంగా కలిగే శంకలేవీ గాంధీజీని బాధించలేదు. ఎవడో వచ్చాడు. పెద్ద మొత్తం ఇచ్చాడు. మారు మాట్లాడకుండా, పేరైనా అడక్కుండా, రసీదైనా ఇవ్వకుండా ఈయన సొమ్ము జేబులో వేసుకున్నాడు. అదేమిటంటే దేవుడే సర్దుబాటు చేశాడు పొమ్మని దబాయిస్తాడు!.

గాంధీగారిలా కొల్లాయి కట్టి తిరగకపోయినా ఆ కాలంలో చాలామంది దేశభక్తులు ఆశ్రమాలు పెట్టారు. నిస్వార్థంగా ఉద్యమాలు నడిపారు. వాటికయ్యే ఖర్చులకోసం వారు సొంత ఆస్తులను అమ్మి కష్టార్జితాన్ని వెచ్చించి, ఆఖరికి భార్యల ఒంటి మీది నగలను, మంగళ సూత్రాలను సైతం తెగనమ్ముకున్నారు. అంతేకాని- తమ అవసరాలను సంపన్న షావుకార్ల మీద వెళ్లదీసుకుని పరాన్నభుక్కుల్లా బతకలేదు. బడా వ్యాపారుల ప్రాపకాలకోసం అంగలార్చేంతగా తమనుతాము దిగజార్చుకోలేదు. గాంధీగారికి అలాంటి భేషజాలేవీ లేవు. సరోజినీనాయుడు చమత్కరించినట్టు గాంధీని నిరుపేదగా బతకనివ్వటం చాలా ఖర్చుతో కూడుకున్నపని !

ఆ ఖర్చులన్నీ భరించేది బిర్లాలు, బజాజ్‌లు ! అదీ బుద్ధిపుట్టి వారంతట వారు ఇవ్వటం, ఇచ్చింది పుచ్చుకోవటం కాదు. ఎంత ఇచ్చినా ఇంకా కావాలి. ఇంకా ఇవ్వు. అని పీడించి వసూలు చేసుకోవటం గాంధీగారి ప్రత్యేకత ! మచ్చుకు- 1927 జనవరి 10న ఘనశ్యామ్‌దాస్ బిర్లాను డబ్బు డిమాండు చేస్తూ మహాత్ముడు రాసిన ఈ జాబును చూడండి.

"My thirst for money in simply unquenchable . I need at least Rs. 2,00,000- for Khadi, Untouchablity and education. The dairy work makes another Rs. 50,000. Then there is the Ashram expenditure. No work remains unfinished for want of funds, but God gives after severe trials. You can give as you like for whatever work you have faith in."

[In the Shadow of the Mahatama, G.D. Birla. P.35]

(నా డబ్బు దాహం తీరేది కాదు. ఖాదీ, అస్పృశ్యత, విద్యలకు గాను నాకు రెండు లక్షల రూపాయలు కావాలి. పాడి పనికి ఇంకో 50 వేలు అవుతుంది. ఇవిగాక ఆశ్రమం

ఖర్చులు ఉన్నాయి. నిధులకోసం ఏ పనీ ఆగడం లేదనుకో - కాని దేవుడు కఠిన పరీక్షలు పెట్టాకే ఇస్తాడు. నీకు ఏది నచ్చితే ఆ పని కోసం ఎంత ఇష్టమైతే అంత ఇవ్వవచ్చు.)

బలవంతమేమీలేదు, నీకు ఇష్టమైనంతే ఇవ్వవచ్చు - అని గాంధీగారు మర్యాదకు అన్నా, ఆయన పెట్టిన ఏ డిమాండునూ బిర్లా ఏనాడూ కాదనలేదు. ఎన్నిసార్లయినా ఎంత అడిగితే అంత ఇచ్చేవాడు. ఇందాక పేర్కొన్న డిమాండ్లలో ఆశ్రమం ఖర్చులు అన్నారే తప్ప ఎంతో చెప్పలేదు. అవీ తక్కువేంకాదు. నెలకి లక్ష! మునుపు ఎవరో దారినపోయే దానయ్య 13 వేలు చేతిలో పెడితే హమ్మయ్య, ఆశ్రమానికి సంవత్సరం గ్రాసం వెళ్లిపోతుందని సంతోషపడ్డ మహాత్ముడు ఇప్పుడు నెలకు లక్ష ఖర్చుపెట్టటమేమిటని ఆశ్చర్యపోతున్నారా? అప్పటికీ ఇప్పటికీ మహాత్ముడి లెవెలు పెరిగింది. ఆశ్రమం జనాభా పెరిగింది. ఎంతమందైనా మరీ వందలూ, వేలూ కారు కదా? నిరాడంబరంగా మహా పొదుపుగా సాత్త్విక జీవనం గడపటానికి నెలకు లక్షా? అప్పట్లో లక్ష అంటే ఇప్పుడు పది కోట్లతో సమానం! తిండి తిప్పల ఖర్చులకు మరీ అంతా ? అదంతా ఎక్కణ్నించి వస్తుంది? ఇదే సందేహం అమెరికన్ జర్నలిస్టు **లూయీఫిషర్**కీ వచ్చింది. దాన్ని దాచుకోకుండా గాంధీ ముగాన్నే అడిగేశాడు. గాంధీగారి సమాధానం ఇది :

"In this ashram, we could live much more poorly than we do and spend less money. But we do not and the money comes from our rich friends."

(ఈ ఆశ్రమంలో మేము ఇంతకంటే పేదగా బతకగలం. ఖర్చులు ఇంకా తగ్గించుకోగలం. కాని అలా చేయం. కావలసిన సొమ్ము మా సంపన్న మిత్రులనుంచి వస్తుంది.)

అర్థమైంది కదా? పైకి మహా నిరాడంబరుడు. కొల్లాయి మాత్రమే కడతాడు. చిత్తు కాగితాలనే వెనక్కి తిప్పి రాసి కాగితం ఆదా చేస్తాడు. పొదుపు గురించి లోకానికి పాఠాలు చెబుతాడు. కాని తానుండే ఆశ్రమంలో ఖర్చులు తగ్గించుకోగలిగినా తగ్గించడు. బిర్లాలు, బజాజ్‌లు ఉన్నప్పుడు ఆయనకేమిటి లోటు? అన్నీ వాళ్లే చూసుకుంటారు.

కొల్లాయిగట్టటం, మేకపాలు తాగటం, కందమూలాలు తినడం, ప్రకృతి వైద్యం లాగే... గాంధీగారు ఎప్పుడూ మూడో తరగతిలోనే రైలు ప్రయాణం చేసేవారని మనకు గొప్ప గౌరవం. అంతటి మహాత్ముడు అన్నేసి వేల మైళ్లు కిక్కిరిసిన కంపార్టుమెంట్లలో ఎలా కూచున్నాడో, ఎన్ని అవస్థలు పడ్డాడోనని మనం కన్నీరు పెడతాం. మనలో చాలా మందికి తెలియని దేవ రహస్యం ఒకటుంది. Halfway to Freedom గ్రంథం 88-89 పేజీల్లో అమెరికన్ జర్నలిస్టు Margaret Bourke White దానిని

బయటపెట్టింది. ఏమిటంటే... గాంధీగారు థర్డ్ క్లాసు కంపార్టు మెంటులో సుఖంగా ప్రయాణం చెయ్యటంకోసం ఆయన ధనిక మిత్రులు ఆ రైలు పెట్టెలోని మొత్తం సీట్లకు టిక్కెట్లు కొనేసేవారు. పెట్టెనిండా ఆయన శిష్యులూ, అంతేవాసులూ, కాంగ్రెసు కార్యకర్తలే ఉండి, ఆయన ఏకాంతానికి, సౌఖ్యానికి ఏ అసౌకర్యం కలగకుండా చూసుకునేవారు. అవసరమనుకుంటే పక్క బోగీలనూ తీసుకొనేవారు. ఒక్కోసారి మొత్తం రైలంతా బుక్ చేసేవారు. దానికి చాలా డబ్బు ఖర్చయ్యేది. బిర్లాలాంటి "సంపన్న మిత్రులకు" అదో లెక్కలోనిది కాదు.

'హరిజనుల'ని తాను ముద్దుపేరు పెట్టిన అస్పృశ్యులకు సంఘీభావ చిహ్నంగా ఢిల్లీలోని వారి కాలనీకి వెళ్లి కొన్నాళ్లు ఉండాలన్న మహత్తరమైన ఆలోచన ఓసారి గాంధీజీకి వచ్చింది. ఇంకేం? ఆ మురికివాడలోని సగం మందిని బలవంతంగా వెళ్లగొట్టారు. దళితుల పూరిగుడిసెలు కూల్చేసి, చక్కని కుటీరాలు నిర్మించి, వాటిని అందంగా అలికి ముగ్గులు పెట్టించి, వట్టివేళ్ల చాపలు పరిచి, కాలనీ రోడ్లన్నీ చదును చేసి సకల సౌకర్యాలు కల్పించారు. బోలెడేసి ఖర్చుతో ఎందుకింత సెట్టింగు వేస్తున్నారని **మార్గరెట్ బౌర్క్‌వైట్** అడిగితే ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న బిర్లా కంపెనీ అధికారి "ఇది మాకేం కొత్తకాదు ఇరవై ఏళ్లుగా మేము గాంధీజీ సౌకర్యం సంగతి చూసుకుంటున్నాము" అన్నాడట. ఈ మతలబు తెలియని అమాయక జనం "అబ్బో! మహాత్ముడు అంటరానివాళ్ల మురికివాడలో వారితోబాటే గడిపి, రొచ్చు, దుర్వాసనల దుర్భర వాతావరణంలో ఎన్ని ఇక్కట్లు పడ్డాడో"నని మహాబాధపడతారు.

ఆశ్రమం ఖర్చులు, ప్రయాణాలు, బస వగైరాలు అనే ఏమిటి? గాంధీ నడిపిన రాజకీయ ఉద్యమాలకైనా ఖర్చుల్లో సింహభాగం బిర్లాయే భరించారు.

లూయీ ఫిషర్ చెప్పినట్టు–

Most of the money for the maintenance of Gandhi's ashram and of Gandhi's organisations... came from G.D. Birla... at whose house in New Delhi, the Mahatma stayed a number of times for shorter or longer Periods... The ashram cost Birla an estimated fifty thousand rupees a year... His outlay for Gandhian enterprises ran into millions of rupees. Gandhi's friendship gave Birla prestige and perhaps even business advantages, for he learned many political secrets from the Mahatma.

[*The Life of Mahatma Gandhi*, Louis Fischer PP. 467-468]

(గాంధీ ఆశ్రమాన్ని గాంధీ సంస్థలను నడపటానికి అయ్యే ఖర్చులో అత్యధిక భాగం జి.డి.బిర్లానుంచి వచ్చేది... న్యూఢిల్లీ బిర్లా నివాసంలో మహాత్ముడు చాలాసార్లు–

కొన్నాళ్ళో, చాలా రోజులో ఉన్నాడు. ఆశ్రమంపై బిర్లాకు ఏడాదికి యాభైవేలు ఖర్చయ్యేది. వివిధ గాంధీ సంస్థలపై బిర్లా ఖర్చు కోట్లలో ఉండేది... గాంధీ స్నేహం బిర్లాకు ప్రతిష్ఠ పెంచేది. వ్యాపారపరంగానూ లాభసాటిగా ఉండేది. గాంధీ ద్వారా అతడికి రాజకీయ రహస్యాలు చాలా తెలిసేవి)

దేశం మొత్తం తిరిగి జనం మీదపడి నగలు, నగదు నిలువుదోపిడీ చేయగా వచ్చిన సొమ్ము... లక్షలాది దేశభక్తులు స్వచ్ఛందంగా సమర్పించుకున్న విరాళాలు... ఎంత పోగైనా... అవసరమైతే ఇంకా ఎంతైనా నిస్వార్థంగా ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నా... బిర్లాలను, బజాజ్‌లను బాదడం గాంధీగారు మానలేదు. లాభం లేని వ్యాపారి వరదన పోడని సామెత. గాంధీమీద మంచినీళ్లలా డబ్బు ఖర్చుపెట్టే బడా వ్యాపారులు అంతకు పదింతల లాభం ఆయనవల్ల పొందకుండా ఊరుకోరు. బిర్లా డబ్బు విరజిమ్మి కాంగ్రెసులో సొంత లాబీలను నడుపుతున్నాడని మోతీలాల్ నెహ్రూ ఒకసారి కుమారుడు జవహర్లాల్‌కి రాసిన లేఖలో చిరాకుపడ్డాడు. జి.డి.బిర్లా తనకు ఒక రకంగా గురువులాంటివాడని, జమన్‌లాల్ బజాజ్ తన దత్తపుత్రుడని గాంధీగారు వరసలు బాగానే పెట్టేవాడు. తన బోధలు విని వారు, వారికి తోడుబోయిన ఇతరులు మహాసాధువులుగా మారి, తమ సంపదకు తాము ధర్మకర్తలమేనని గ్రహించి, నిస్వార్థంగా దేశంకోసం సొమ్ము సమర్పించుకుని ధన్యులయ్యారని ఆయన నమ్మకంగా చెబుతాడు. నిజానికి ఆయనతో సాన్నిహిత్యాన్ని వాటంగా ఉపయోగించుకుని బడా పరిశ్రమదారులు. జౌళి మిల్లుల యజమానులు, వర్తకులు బాగానే బాగుపడ్డారు. రెండో ప్రపంచ యుద్ధకాలంలో గాంధీ దయవల్ల సంపాదించిన గవర్నమెంటు వార్ కాంట్రాక్టుల పుణ్యమా అని బిర్లా ఆస్తి విలువ 33 లక్షల డాలర్ల నుంచి అమాంతం రెండు కోట్ల డాలర్లకు పెరిగిందట. అంతలేసి లాభం గాంధీ పేరుచెప్పుకుని రాబట్టగలిగినప్పుడు ఆశ్రమం ఖర్చులకు కొన్ని లక్షలు ఇవ్వటం, మొత్తం రైలును బుక్ చెయ్యటం, కాలనీలో సెట్టింగులు వెయ్యటం ఆ కుబేరులకో లెక్కా?

బులుసు సాంబమూర్తికో, టంగుటూరి ప్రకాశానికో, కొండ వెంకటప్పయ్యకో, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యకో ఘరానా వ్యాపారులు తగిలి... మీ బస, ప్రయాణం, మిగతా వసతుల సంగతి మేము చూసుకుంటాం... ఖర్చులన్నీ మామీద పడేసి మీరు సుఖంగా దేశసేవ చేసుకోండి... మీ పేరు, ప్రాపకం మేము ఎలా సొమ్ము చేసుకుంటామన్నది మాత్రం పట్టించుకోకండి... అని బేరం పెడితే ఏమనేవారు? చెప్పుచ్చుకు కొట్టరా? కనీసం కొట్టినంత పనిచేసి మొగం వాచేట్లు చివాట్లు పెట్టరా? మరి గాంధీగారు జంకూ గొంకూ లేకుండా పక్కా వ్యాపారుల విరాళాలూ, సహాయాలూ అందుకుని, వారి సొమ్ముతో పేద వేషాలు వేస్తూ బీద అరుపులు అరుస్తూనే జల్సాగా

బతికాడంటే ఆయన నిరాడంబరతను ఏమనాలి? అటువంటి త్యాగమూర్తులతో పోల్చితే గాంధీ త్యాగం ఏపాటి? ఆ మాటకొస్తే సొంతడబ్బు రూపాయి బయటికి తియ్యకుండా పెద్ద వ్యాపారుల సౌజన్యంతో ఖర్చులు వెళ్లదీసి, అమ్మాయిలతో ఒళ్లు పట్టించుకుంటూ, మూడో తరగతి స్పెషల్ బోగీలో ఫస్ట్‌క్లాసు దర్జా వెలిగిస్తూ ఆఖరికి చెరసాల వాసంలో కూడా బంధుమిత్ర పరివార సమేతంగా ప్రత్యేక సౌకర్యాలు పొందుతూ హాయిగా బతికేసిన మహానుభావుడు- నిజానికి చేసిన త్యాగం ఏమిటి? ఇలా మందిసొమ్ముతో సుఖంగా బతకటమే త్యాగశీలత ఐతే... ఆస్తులు తెగనమ్మి దేశంకోసం సర్వస్వం అర్పించి హారతి కర్పూరంలా హరించుకుపోయిన వేలాది, లక్షలాది దేశభక్తుల త్యాగాన్ని ఏమని పిలవాలి?

ఉపసంహారం

***చి**వరికొచ్చాం. కాని కథ అయిపోలేదు. ఇంకా మధ్యలోనే ఉన్నాం. ఇప్పటికి 'సహాయ నిరాకరణ' ప్రయోగ, ఉపసంహారాలు మాత్రమే అయ్యాయి. ఇంకా సైమన్ కమిషన్ రాలేదు. రౌండ్ టేబిల్ కూడనే లేదు. ఉప్పు సత్యాగ్రహం జరగనేలేదు. అల్లూరి సీతారామరాజూ, భగత్‌సింగూ, సుభాస్‌బోసూ రంగంలోకి రానేలేదు. క్విట్టిండియా శంఖం మోగనేలేదు. మౌంట్ బాటన్ ఎడమకాలు మోపనే లేదు. దేశం నిలువునా చీలనే లేదు. సోకాల్డ్ స్వాతంత్ర్యం రానే లేదు. అసలు కథంతా ముందే ఉంది.*

ఐనా ఇబ్బంది లేదు. కథా గమనాన్ని అర్థంచేసుకోవడానికి ఇప్పటికి నడిచింది చాలు.

తెల్లవాడు మూటాముల్లే సర్దుకుపోవటానికి ఇంకా పాతికేళ్ల టైముంది. నిజానికి అలా అనడమూ కరక్టుకాదు. దేశం గట్టిపట్టు పట్టి ఉంటే... ఎత్తిన 'సహాయ నిరాకరణ' ఆయుధాన్ని దించక పోరాడి ఉంటే... పెదనందిపాడులో మొదలై దొరలగుండెలు గడగడలాడించిన పన్నుల నిరాకరణ పాశుపతాస్త్రాన్ని యావద్దేశం అందిపుచ్చుకుని ఉంటే... చౌరీ చౌరాలో అంటుకున్న జనాగ్రహ జ్వాలపై మనవాడే చన్నీళ్లు కుమ్మరించకుండా ఉంటే... జాతి కృతనిశ్చయానికి అడ్డంపడి కాళ్లూ చేతులూ కట్టెయ్యకుండా జాతీయోద్యమ నేతలనేవారు సమయోచిత క్షాత్రాన్ని, మగటిమిని కనపరచి ఉంటే...

దేశానికి 1922లోనే... హిందువులు, ముస్లిములూ కలతలు లేక కలిసి మెలిసి పోరాడుతున్న శుభతరుణంలోనే... స్వాతంత్ర్యం వచ్చేది. భయంకర మత ప్రళయం తప్పేది. కన్నతల్లిని రంపంతో చీల్చడం కంటే ఘోరాతి ఘోరమైన దేశవిభజన పీడాకారం తప్పేది. సత్యాగ్రహ శంఖారావం విని, ఎక్కడి చదువులు అక్కడ, ఎక్కడి ప్రాక్టీసులక్కడ కట్టిపెట్టి జాతీయోద్యమంలోకి దూకి, లాఠీ దెబ్బలు తిని, ఒళ్లు హూనం చేసుకుని,

జైళ్లలో యమయాతనలు పడి, ఇళ్లూ, ఒళ్లూ గుల్ల చేసుకున్నా గుండె చెదరక... జాతీయజెండా విడవక వీరుల్లా నిలబడ్డ లక్షలాది సమరయోధుల శౌర్యానికి, త్యాగానికి సరైన ఫలితం దక్కేది. తరతరాల దాస్యశృంఖలాలను వీరోచితంగా తెంచుకుని అఖండ భారతదేశం నిండుగర్వంతో ప్రపంచ దేశాల సరసన శిరసెత్తి నిలబడేది.

కాని అలా జరగలేదు...అప్పుడు జయప్రదంగా ముగిసి ఉండాల్సిన జాతీయ పోరాటం 1947 దాకా దేకింది. 1922లోనే రావలసిన స్వాతంత్ర్యం పాతికేళ్లు ఆలస్యమైంది.

అలా ఎందుకు జరగలేదు... పండంటి ఉద్యమాన్ని పనిగట్టుకుని ఎవరు పాడుచేశారు... ఊపిరాడక గిలగిలలాడుతున్న విదేశీ దొరతనానికి ఉదారంగా ప్రాణవాయువు అందించిన ఆపద్బంధువెవరు – అన్నది ఇప్పటికే చూశాం. అప్పుడు మోరసాచిన నయవంచనలు, చెలరేగిన పెదధోరణులు మునుముందు ఏ రీతిన ప్రకోపించి... ఇంకెన్ని కపట నాటకాలకు తెరతీసి... విదేశీయుల పెత్తనానికి అంతలేసి దీర్ఘకాలం ఎలా కొమ్ముగాశాయన్నదే ఇక తిలకించాల్సిందల్లా.

భారతస్వాతంత్ర్య సంగ్రామానికి సంబంధించి సీమదొరలు, వారు విద్యా బుద్ధులు గరిపిన దేశీయ ప్రముఖులు. వారి అడుగుజాడలను అనుసరించే మహామేధావులు రాసిన సుప్రసిద్ధ చరిత్ర గ్రంథాలన్నీ ఇంచుమించుగా ఒకే మూసలో సాగుతాయి. అజ్ఞానాంధ కారంలో కొట్టుమిట్టాడుతున్న భారతదేశానికి బ్రిటిషు హయాంలో వెలుగొచ్చింది. స్కూళ్లూ, రైళ్లూ, టెలిగ్రాఫులూ వెలిసి నాగరికత అబ్బింది. జాతీయ భావమనేది కలిగింది. దొరల దయవల్ల ఎంతమేలు కలిగినా, వారి కర్కశపాలనవల్ల కొంతకీడూ జరిగింది. ఆ సంగతి సదరు ధర్మ ప్రభువులు దృష్టికి తెచ్చి వినయపూర్వక విధేయతా పూర్వక విజ్ఞప్తులతో వారిని ప్రసన్నం చేసుకుని, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు 1885లో జాతీయ కాంగ్రెసు పుట్టింది. బాగానే పనిచేసింది. కాని ప్రధానంగా నగరాలకూ, అందులోనూ విద్యాధిక, సంపన్న వర్గాలకూ మాత్రమే పరిమితమైంది. సరైన జాతీయోద్యమమనేదే లేక దిక్కుతోచక దేశం కొట్టుమిట్టాడుతున్న స్థితిలో అదృష్టవశాత్తూ గాంధీ మహాత్ముడు అరుదెంచాడు. అహింసాత్మక ధర్మయుద్ధంలో దక్షిణాఫ్రికాను జయించి మన పుణ్యఫలంకొద్దీ ఆయన స్వదేశానికి తిరిగొచ్చి జాతికి బుద్ధిగరిపి ఉద్ధరించే బాధ్యత పైన వేసుకున్నాడు. నిద్రాణమైన జాతి చైతన్యాన్ని సత్యాగ్రహ శంఖంతో మేల్కొలిపాడు. పిటిషన్లకు పరిమితమైన జాతీయ కాంగ్రెసును జాతీయోద్యమ వేదికగా, మహాపోరాటశక్తిగా మలిచాడు. అశేష జనాన్ని అందులోకి సూదంటురాయిలా ఆకర్షించి, అత్యద్భుత ప్రజా ఉద్యమం నిర్మించాడు. శాంతి, అహింసలు పరమావధిగా...

హిందూ-ముస్లిం సఖ్యత, దళిత జనోద్ధరణ స్వాతంత్ర్యం కంటే మిన్నగా తలచి, ఆచి తూచి అతి జాగ్రత్తగా అడుగువేసి, సర్వసైన్యాధిపత్యం వహించి, మహత్తర ఉద్యమాలు నడిపాడు. అనేక త్యాగాలు చేసి, అనేక పర్యాయాలు జైలుపాలై బోలెడుసార్లు అన్నం మాని ప్రాణాన్ని పణంపెట్టి దేశానికి సర్వస్వం అర్పించాడు. ఆయనంటే హడలుతోనే, ఆయన పోరాటానికి జడిసే తెల్లవాళ్లు చేతులెత్తేసి పరారయ్యారు. అనేక దశాబ్దాల పోరాటాల పర్యవసానంగా ఆయన చలవవల్లే దేశానికి ఎట్టకేలకు స్వాతంత్ర్యం వచ్చింది. ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !

స్థూలంగా ఇదీ మన చరిత్రలు మనకు చెప్పేది. అంతా వట్టిదే. అన్నీ గురికి బారెడు దూరమే ! కాంగ్రెసు బాణీ చరిత్రలు గొయ్యి తీసి కప్పిపెట్టే అసలు వాస్తవం వేరు. తెల్లవాడి కుతంత్రాన్ని, తెరలచాటు దురాక్రమణను మొదట్లో పోల్చుకోలేకపోయినా... మోసం బయటపడ్డాక భారతజాతి సహించలేదు. విదేశీ దాష్టీకానికి ఎంత మాత్రం దోసిలి ఒగ్గలేదు. గుడారంలో ఒంటె కథలోవలె తెల్లవారు ఏకులావచ్చి మేకుగా మారింది మొదలుకుని దేశంలో ఎక్కడో ఒకచోట ఎవరో ఒక వీరుడు ప్రాణాలకు తెగించి పోరాడుతూ జాతీయ ధ్వజాన్ని పడకుండా నిలబెడుతూనే ఉన్నాడు. చితుకుల మంటలన్నీ కలిసి దావానలంలా మారి 1857లో బ్రిటిషు అధికార వ్యవస్థను సమూలంగా దహించివేసింది. చావుతప్పి కన్ను లొట్టబోయి ఆ యమగండం నుంచి పళ్లబిగువున తెల్లవారు ఎలాగో బయటపడ్డారు. తిరుగుబాటును ఎంత క్రూరంగా అణచి, తిరుగుబాటుదారులను ఎంత కిరాతకంగా వేటాడినప్పటికీ... జాతీయ ప్రతిఘటనను తట్టుకుని నిలబడటం తమ తరంకాదని దేశీయుల్లో బలమైన ఒక విధేయ వర్గాన్ని మచ్చిక చేసుకుంటే తప్ప తమ పబ్బం గడవదని సీమ దొరలు గ్రహించారు. అందుకే 1885లో భారత జాతీయ కాంగ్రెసును విశ్వామిత్ర సృష్టి చేశారు. ఎ.ఓ. హ్యూమ్ అనే బ్రిటిషు అధికారి భారతీయుల మీద ప్రేమతో స్వచ్ఛందంగా చొరవ తీసుకుని కాంగ్రెసును స్థాపించాడని బహుళ ప్రచారంలో ఉన్న కథనం అబద్ధమనీ, ఆదినుంచీ బ్రిటిష్ సామ్రాజ్యమే వెనక ఉండి కాంగ్రెసును పుట్టించి, నడిపించిందనీ మన పరిశీలనలో వెల్లడైంది.

మొదట్లో బ్రిటిష్ అనుకూల లిబరల్ మేధావులు మాత్రమే కాంగ్రెసులో చేరారు. క్రమేణా జాతీయ అనుకూల భావాలుగల భారతీయ ప్రముఖులూ అందులో ప్రవేశించారు. రాజకీయప్రాతినిధ్యం, సర్కారీ రాయితీల వంటి మామూలు అంశాలకే పరిమితమవ కుండా జాతీయ ప్రయోజనాలనీ, ప్రజాసమస్యలనీ వారు ధైర్యంగా లేవనెత్తి ప్రజావ్యతిరేక మైన ప్రభుత్వ విధానాలను నిర్భయంగా ఖండించసాగారు. ముఖ్యంగా - లాల్ - బాల్ - పాల్‌గా ప్రసిద్ధులైన లాలా లజపతిరాయ్, బాలగంగాధరతిలక్, బిపిన్

చంద్రపాల్‌ల చొరవతో నేషనల్ కాంగ్రెసు నగరాల్లో సంపన్న, మేధావివర్గాల డ్రాయింగురూములను దాటి జనంలోకి వెళ్లింది. 1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా 'వందేమాతరం' ఉద్యమంతో దేశమంతటా ఉద్యమ దీక్ష ప్రబలింది. సాధారణ ప్రజల నిర్భీతిని, పోరాటకాంక్షను చూసి తెల్లదొరల గుండెలదిరాయి. అదే సమయంలో మిలిటెంటు విప్లవ వాదం విజృంభించి, బాంబుదాడులతో, ప్రజాకంటక అధికారుల హత్యలతో తెల్లదొరతనానికి ముచ్చెమటలు పోయించింది. నానాటికీ తీవ్రతరమవుతున్న ధిక్కార ధోరణులను ఉపేక్షిస్తే ఏదో ఒకనాటికి తమ కొంప ముంచుతాయని ఆంగ్ల ప్రభువులు గ్రహించారు. తమకు కొట్టిన పిండి అయిన కూటనీతిని ప్రయోగించి లాఘవంగా పావులు కదిపారు. తిలక్‌ను బంధించి, తమకు వీరవిధేయుడైన మితవాద నాయకుడు గోపాలకృష్ణ గోఖలేకు కాంగ్రెసు సారథ్యం కట్టబెట్టించారు. ఆయన సిఫారసుపైనే ఆయన శిష్యుడు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీని కనుగొన్నారు.

బోయర్ యుద్ధంనుంచి జులూ తిరుగుబాటు అణచివేత వరకూ దక్షిణాఫ్రికాలో 'సార్జంట్ మేజర్ గాంధీ' అహింస వ్రతాన్ని గట్టునపెట్టి బ్రిటిషు సామ్రాజ్యానికి నమ్మినబంటుగా వ్యవహరించిన తీరునుబట్టి తమను ఆపదలో ఆదుకొనగల శుభలక్షణాలన్నీ అతడికి ఉన్నాయని దొరవార్లకు అర్థమైంది. అనంతరకాలంలో నమ్మకస్తులకు చెప్పి తన జీవిత చరిత్రలు రాయించుకుని, వాటి కాపీలను లండన్‌లో పలుకుబడిగల ప్రముఖులను పంపించి, ఇంగ్లండులో తనకు తాను తెలివిగా ప్రచారం ఇప్పించుకుని, దక్షిణాఫ్రికాలో సత్యాగ్రహాలూ, లాంగ్ మార్చ్‌లూ సాగించి గాంధీ సంపాదించిన కీర్తిప్రతిష్ఠలు కూడా 'ఇండియా ఆపరేషనుకు' అదనపు అర్హతలయ్యాయి. కావలసిన అభ్యర్థిని గుర్తించి, ఎంచుకున్నాక వైస్రాయికీ గాంధీకీ నడుమ గోఖలే తడికచాటున ఎలా సంప్రదింపులు నడిచాయో, గాంధీపట్ల దక్షిణాఫ్రికా ప్రభుత్వ వైఖరి హఠాత్తుగా ఎలా మారిందో... చేతిలోని ఉద్యమాన్ని జయప్రదంగా ముగింపజేసి ఆయనను హుటాహుటిన ఓడెక్కించి, లండన్ రప్పించి, ఎలా ఎర్రతివాచీ పరిచారో వెనకటి అధ్యాయాల్లో చూశాం. 1857ను గుర్తుకు తెచ్చే రీతిలో ప్రవాస భారతీయుల గదర్ ఉద్యమం భీషణంగా సాగి, ఇండియాలో సాయుధ విప్లవానికి ముమ్మర సన్నాహాలు సాగిస్తున్న తరుణంలో విప్లవ వెల్లువనుంచి బ్రిటిషు సామ్రాజ్యాన్ని కాపాడుకునేందుకు స్వదేశానికి తిరిగివచ్చింది లగాయతు గాంధీ అందించిన విలువైన సేవలనూ గమనించాం. హింస నిషిద్ధమన్న నెపంతో భారతీయ విప్లవకారుల దేశభక్తి పూరిత సంఘర్షణలను మహాతీవ్రంగా తెగనాడిన మహానుభావుడు పౌరవిధేయత నెపంతో బ్రిటిషు సామ్రాజ్యపు అమానుష హింసాకాండలో ఎలా భాగం పంచుకున్నాడో, మొదటి ప్రపంచ

యుద్ధ కాలంలో బ్రిటిష్ సైన్యానికి రిక్రూటింగు ఏజంటుగా ఎలా పనిచేశాడో వివరంగా పరిశీలించాం.

మొత్తంమీద మనకు అర్థమయ్యేదేమిటంటే గాంధీ కాంగ్రెసు సంస్థను నిర్మించిందీ లేదు. జాతీయ భావాలను జాతికి అలవరిచిందీ లేదు. పోరాటపు పాఠాలు నేర్పి పటుతర సంస్థగా దానికి నడక నేర్పింది అంతకంటే లేదు. గాంధీ స్వదేశానికి తిరిగి వచ్చే నాటికే భారతీయుల్లో జాతీయభావం నిక్షేపంలా ఉంది. ఆయన సారథ్యం చేపట్టటానికి ముందే కాంగ్రెసు సంస్థ ప్రజలను సమీకరించి, పోరాటాల బాట పట్టించింది, సత్యాగ్రహం, శాసనోల్లంఘన, విదేశీ వస్తు బహిష్కరణ, అహింస వంటి గాంధీ ట్రేడ్‌మార్కు అస్త్రాలన్నీ ఆయన రంగంలో దిగడానికి చాలా ఏళ్ల ముందే 'వందేమాతరం', 'వంగ విభజన' వ్యతిరేక ఉద్యమాల్లో భేషుగ్గా ప్రయోగింపబడ్డాయి. దేశభక్తి, జాతీయభావం, స్వరాజ్యం వంటి ఉదాత్తభావాలు గాంధీ మాస్టారు కష్టపడి ఎక్కించాల్సిన అవసరం లేకుండానే తిలక్, అనీబిసెంట్, సురేంద్రనాథ్ బెనర్జీ వంటి ఎందరో దిగ్దంతుల పుణ్యమా అని భారతదేశంలో వ్యాపించాయి. ఉదాహరణకు 1884 మే20న 'సింధ్ టైమ్స్' పత్రిక ఏమి రాసిందో చూడండి.

Nadir Shah looted the country only once. But the British loot us every day. Every year wealth to the tune of 4.5 million dollars is being drained out, sucking our very blood. Britain should immediately Quit India.

(నాదిర్షా దేశాన్ని ఒక్కసారే దోచుకున్నాడు. బ్రిటిషువారు మనల్ని రోజూ లూటీ చేస్తున్నారు. మన రక్తాన్నిపీల్చేసి, ప్రతి సంవత్సరం 45 లక్షల డాలర్ల సంపదను పిండేస్తున్నారు. బ్రిటన్ వెంటనే ఇండియాను వదిలిపోవాలి)

ఇది – ఇంగ్లీషు మంత్రసానుల చేతుల్లో భారత జాతీయ కాంగ్రెసు పుట్టడానికి సంవత్సరం ముందు, 'క్విట్టిండియా' నినాదాన్ని గాంధీ కనిపెట్టటానికి 58 ఏళ్ల పూర్వం సింధీ పత్రిక నిర్భయంగా అన్నమాట! అలాగే – జలియన్‌వాలాబాగ్ ఊచకోత తరవాత కూడా బ్రిటిష్ ప్రభుత్వం మంచితనాన్ని నమ్మి సహకరిస్తూనే పోవాలని వాదిస్తూ, స్వరాజ్యం ఆలోచననే ఖండితంగా తిరస్కరిస్తూపోయిన... చాలా ఆలస్యంగా స్వరాజ్యానికి తప్పనిసరయి తల ఊచిన తరవాతా ముప్పైమూడు కండిషన్లు దేశం మీద రుద్ది అవి తీరిస్తే తప్ప స్వరాజ్యం ఊసెత్తే హక్కులేదని పితలాటకాలు పెట్టిన గాంధీ ఎక్కడ? "స్వరాజ్యం నా జన్మహక్కు... ఎలాగైనా దాన్ని సాధించి తీరుతా"నని గాంధీ రంగ ప్రవేశానికి చాలా సంవత్సరాల ముందే గర్జించిన తిలక్ ఎక్కడ?

గాంధీగారు పుట్టి పెరిగినది పక్కా ఫ్యూడల్ వాతావరణలో. ఫ్యూడల్ సంస్కృతిలో ప్రభువులకు అన్నీ హక్కులే ఉంటాయి. ప్రజలకేమో బాధ్యతలు మాత్రమే ఉంటాయి. పాలకులు ఏమన్నా, ఎన్ని అఘాయిత్యాలకు పాల్పడ్డా, కిమ్మనక సహించి బాధలు పడటమే ప్రజల బాధ్యత. ప్రభువులను ప్రజలు ఎదిరించటం, బాహాటంగా పోరాడటం ఫ్యూడల్ తత్వానికి పడదు. అదే ఆనువంశికంగా గాంధీకి సంక్రమించినట్టుంది. ప్రజలన్నా, ప్రజాశక్తి అన్నా అపనమ్మకం, సార్వభౌములపట్ల విధేయతాభావం ఆయనలో కొట్టొచ్చినట్టు కనపడతాయి. సర్కారువారు ఇళ్లమీదపడి, సర్వస్వం దోచుకున్నా, గొడ్లను బాదినట్లు బాదినా, స్థిరచరాస్థులను వేలం వేసినా, పిట్టల్ని కాల్చినట్టు కాల్చినా నోరెత్తక, కోపగించక, నిర్లిప్తంగా చూస్తూ, బాధలన్నీ భరించటమే అసలైన ధైర్యం; అదే ప్రజల కర్తవ్యం; అందుకు భిన్నంగా ఏమాత్రం వ్యవహరించినా క్షమించరాని మహాపరాధం అంటూ చీరాల, పెదనందిపాడు తదితర ప్రాంతాల సత్యాగ్రహులను గాంధీ ఉద్బోధించిన తీరు ఈ సందర్భంలో గమనార్హం.

గాంధీ చెప్పే అహింస ఒక మాయలేడి. జీవితమంతా దాని వెంటపడి నురగలు కక్కుతూ, ఎన్ని పరుగులు పెట్టినా దాన్ని సాధించటం గాంధీ వల్లే కాలేదు. పైగా ఆయన అహింసానియమం ప్రజలకే తప్ప వారిని పీడించే నిరంకుశ ప్రభువులకు వర్తించదు. ఎంతసేపూ హిందువులకే తప్ప ముస్లిములకు అది వర్తించదు. మాప్లా ముస్లిములు మతోన్మాదంతో వందలాది హిందువులను నిష్కారణంగా ఊచకోతకోసి, వారి స్త్రీలను చెరిచి, వారి ఆస్తులు నాశనం చేసి ఎంత హింసాకాండకు పాల్పడ్డా గాంధీ వారిని పల్లెత్తుమాట అనడు. పైగా ధైర్యశాలురు, తాము మతం అనుకున్నదానికోసం తమ పద్ధతిలో పోరాడిన శూరులు అని నిస్సంకోచంగా మెచ్చుకుంటాడు. అదే - హిందువులు ఓరిమి నశించి చౌరీ చౌరాలో (మాప్లా మారణహోమంతో పోల్చితే చాలా స్వల్పమైన) హింసకు పాల్పడగానే మహా పాపం జరిగిపోయినట్టు, మొత్తం దేశానికి ఆ నేరంలో భాగం ఉన్నట్టు బొబ్బలు పెట్టి... నడుస్తున్న ఉద్యమాన్ని ఆ వంకతో హఠాత్తుగా ఆపి, విదేశీ పాలకుల నెత్తిన పాలుపోస్తాడు. దక్షిణాఫ్రికాలో ప్రజల తిరుగుబాట్లను హింసాత్మకంగా అణచడానికి స్వచ్ఛందంగా సహాయపడి, మొదటి ప్రపంచ యుద్ధంలో సైనికుల రిక్రూటింగు ఏజంటుగా పనిచేసిన తనకు అహింస గురించి మాట్లాడే నైతికహక్కు ఎక్కడిదన్న సంకోచం ఆయనకు లేశమైనా కలగదు. విశాల దేశంలో ఎక్కడో ఏదో ఒక మూల ఒకింత హింసకు తమకు సంబంధించని వారెవరో పాల్పడ్డారన్న మిషతో ఎవరికీ చెప్పాపెట్టకుండా ఏకపక్షంగా ఉద్యమాన్ని నిలిపేసిన ఘనుడికి... తాను చేస్తున్న ఆ పనివల్ల ఎంతమంది ఎన్ని విధాల నష్టపోతారు... తన పిలుపుపై చదువులు మానుకుని,

ప్లీడరీ ప్రాక్టీసులు కట్టిపెట్టి అసహాయోద్యమ అగ్నిగుండంలోకి దూకిన లక్షలాది దేశభక్తులు ఉన్నపళాన పోరాటాన్ని ఆపేస్తే ఏమైపోతారు? - ఎంతదగా పడతారు అన్న ఆలోచనే కలగలేదు. 22 మంది పోలీసులను అల్లరిమూక తగలబెడితే రంకెలేసి ఏకంగా దేశానికే పెద్ద శిక్ష వేసిన మహాత్ముడు... అదే చౌరీచౌరా కేసులోనిందితులైన 225 మందిలో ఏకంగా 172 మందిని రుజువులూ... సాక్ష్యాలూ లేకుండానే అడ్డగోలుగా ఉరికంబం ఎక్కిస్తే... అది అన్యాయమని కనీసం మాటమాత్రమైనా అన్న పాపాన పోలేదు.

తన అధికారాన్ని నిలుపుకోవటానికి ఎన్ని అఘాయిత్యాలకైనా పాల్పడే హక్కు సర్కారుకు ఉంది. ఏమి చేసినా తిరగబడే హక్కు మాత్రం ప్రజలకు లేదు. సహనం నశించి ఏ మూల ఏ కాస్త హింస తలెత్తినా అహింసావ్రతం మైలపడిపోతుంది. సత్యాగ్రహ యాగం ఆగమైపోతుంది - అంటూ, ప్రజల పక్షాన ఉన్నట్టు కనబడుతూ ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడటమే కాదు. ప్రభుత్వాన్ని ఎదిరిస్తున్నట్టు కనపడుతూ అదే ప్రభుత్వానికి అనుంగుభృత్యుడిలా కొమ్ముగాస్తూ, సర్కారువారికి ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమూల్య సేవలందించటమూ గాంధీగారి ప్రత్యేకతే.

ఉదాహరణకు 'సైతాను' ప్రభుత్వాన్ని పారదోలి, సంవత్సరంలోగా స్వరాజ్యం సాధిస్తానని కదా గాంధీ 1920 ఆఖరున నాగపూర్ కాంగ్రెసులో ప్రతిన బూనింది? పెట్టిన సంవత్సరం గడువు అయిపోయినా స్వరాజ్యం జాడలేదు. శుష్క ప్రసంగాలతో పొద్దుపుచ్చటమూ, చొరవతీసుకుని పోరాడే వారికి అడ్డంపడి వారి ఉత్సాహాన్ని నీరుగార్చడమూ మినహా తమరు చేసిందీ, చేస్తున్నదీ ఏమీ కనపడదేమిటయ్యా అని వారూ వీరూ గొణగసాగిన మీదట బార్డోలీలో శాసనోల్లంఘనను తానే దగ్గరుండి మొదలుపెడతానని పెద్ద ఆర్భాటం చేశాడు. చివరికి దాన్నీ పుట్టకముందే పురిట్లోనే సంధి కొట్టించిన తరవాత గాంధీ చేసిన మొట్టమొదటి పని ఏమిటి? కాంగ్రెసు వర్కింగు కమిటీని అర్జంటుగా బార్డోలీలో కొలువు తీర్చి, తాను ముందే రాసిపెట్టిన చేంతాడంత తీర్మానాన్ని ఆమోదింపజేయటం! అందులో మొట్టమొదటే ఇలా చెప్పించటం:

The working committee of the Congress resolves that mass Civil disobedience contemplated at Bardoli and elsewhere be suspended and instructs the local Congress Committee forthwith to advise the cultivators to pay the land revenue and other taxes due to the Government and whose payment might have been suspended in anticipation of civil disobedience, and instructs them to suspend every other preparatory activity of an offensive nature.

(బార్డోలీలోనూ, ఇతరత్రా తలపెట్టిన సామూహిక శాసనోల్లంఘన ఉద్యమాన్ని నిలిపివేయాలని కాంగ్రెసు కార్యవర్గం తీర్మానిస్తున్నది. ఇలాంటి ఉద్యమం రానున్నదని తలచి ముందుగానే చెల్లింపులు ఆపివేసిన భూమిశిస్తును, సర్కారుకు కట్టవలసిన ఇతర పన్నులను వెంటనే ప్రభుత్వానికి చెల్లించవలసిందిగా రైతులకు చెప్పమని స్థానిక కాంగ్రెసు కమిటీలను కార్యవర్గం ఆదేశిస్తున్నది. ప్రభుత్వాన్ని ఎదుర్కొనే స్వభావం కలిగిన అన్ని రకాల కార్యకలాపాలనూ ఆపివేయవలసిందిగా కూడా స్థానిక కమిటీలను ఈ సమావేశం ఆదేశిస్తున్నది.)

ఎక్కడో వెయ్యిమైళ్ల అవతల హింస మైల సోకిందని చెప్పి, పన్నుల నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాన్ని మొదలెట్టకుండానే ఆపేశారు – చాలా బాగుంది ! అవాంతరం ఎందుకొచ్చింది; మళ్లీ అలాంటిది జరక్కుండా ఎలా చూడాలి; తమలోని బలహీనతలను ఎలా సరిచేసుకోవాలి; మరింత పటిష్ఠంగా దుష్టసర్కారుపై ఎలా విజృంభించాలి – అన్నవి కదా ఉద్యమ నాయకులు ఆ సమయాన ఆలోచించవలసింది? వాటికంటే ముఖ్యంగా – సర్కారు ఖజానాకు పడిన గండిని ఎంత త్వరగా పూడ్చాలి అని ఆరాట పడాల్సిన అవసరం వారికేమిటి? పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని నిలిపేస్తే ఎలాగూ ప్రజలు పన్నులు కడతారు. వారు కట్టకున్నా వెంటపడి కట్టించుకోవడానికి ప్రభుత్వం దగ్గర భారీ యంత్రాంగం ఎలాగూ ఉంటుంది. మరి – బకాయి పడ్డ పన్నులను వసూలు చేసి పెట్టే డ్యూటీని స్థానిక కాంగ్రెసు కమిటీలకు పురమాయించడంలో మర్మమేమిటి?

ఇప్పుడే కాదు. గుంటూరు జిల్లాలో పద్ధతి ప్రకారం చక్కగా సాగుతున్న పన్నుల నిరాకరణ ఉద్యమాన్ని నిలువునా నరికెయ్యాలని కంకణం కట్టుకుని 1922 జనవరి 17న బొంబాయి నుంచి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కొండ వెంకటప్పయ్యకు రాసిన జాబులోనూ గాంధీ ఏమి ఆజ్ఞాపించాడో గుర్తుంది కదా ?

I strongly suggest that you advise the ryots in all the districts to pay up atleast the first instalment and devote the whole of the time and the energy of all the workers to acquiring the necessary qualifications.

[Collected works of Mahatma Gandhi, Vol. 25# 212, P. 463]

(కనీసం మొదటి కిస్తీనైనా ఇప్పుడు చెల్లించమని అన్ని జిల్లాల్లోని రైతులకూ చెప్పవలసిందిగా నేను గట్టిగా కోరుతున్నాను. (ప్రభుత్వానికి కట్టాల్సింది కట్టించాక) ఉద్యమానికి అవసరమైన అర్హతలను పొందడానికి కార్యకర్తలందరూ తమ కాలాన్ని శక్తిని పూర్తిగా వెచ్చించవలెను)

చూశారా? ఇక్కడా - ప్రభుత్వాన్ని ఎదిరించే ప్రయత్నాలు కట్టబెట్టి, ఎండమావుల్లాంటి అర్హతలను పొద్దంతా సాధన చేస్తూ, మహాత్ముడి పరీక్షలో పాసై ఉద్యమించడానికి అర్హత సంపాదించే సుదినంకోసం కలలుగంటూ, నోరుమూసుకు కూచోమనే సర్వసైన్యాధిపతిగారు స్వాతంత్ర్య సేనలకు ఉపదేశిస్తున్నారు. ఒక గుంటూరు జిల్లాలో పన్నుల నిరాకరణ ఉద్యమం సరిగా జరగడం లేదేమోనని అనుమానం పొడసూపితే - ఆ జిల్లాలో ఆపమనాలి కాని - మొత్తం అన్ని జిల్లాల్లోనూ వెంటనే ఆపెయ్యమని ఆజ్ఞాపించడమేమిటి? దీన్నిబట్టి ఏదో ఒక మిష మీద అన్నిచోట్లా నడుస్తున్న ఉద్యమాలని ఆపేసి, ప్రభుత్వాన్ని చిక్కుల్లోంచి తప్పించటమే గాంధీ ఆంతర్యమని అంటే తప్పా? ఎఐసిసి పెట్టిన కఠోర షరతులన్నిటినీ సంతృప్తి పరిచి, పెద్దల అనుమతితోనే రాష్ట్రాల కాంగ్రెసు కమిటీలు సజావుగా సాగిస్తున్న పన్నుల నిరాకరణ పోరాటాలను నిష్కారణంగా, తలచిందే తడవుగా ఆపేయించి... ఎగవేసిన పన్నులను వెంటనే తిరిగి కట్టించమంటూ ఈ సందర్భంలో నేరుగా తాను... బార్డోలీలోనేమో వర్కింగు కమిటీ ద్వారానూ - గాంధీగారు ఆదేశాలివ్వటం గమనిస్తే దీనంతటి వెనుక బ్రిటిషు ప్రభుత్వ ప్రచ్ఛన్న హస్తం కొట్టొచ్చినట్టు కనబడటం లేదూ?! గుంటూరు జిల్లాలో సామూహిక పన్నుల నిరాకరణ మూలంగా పన్ను వసూళ్లు 5 శాతానికి పడిపోయి తెల్లదొరతనం పునాదులనే కదిలించిందని బ్రిటిష్ పార్లమెంటులోనే సర్కారీ ప్రముఖులు అంగీకరించారు. ఒక వంక ఆంగ్ల ప్రభువులు అంతలా హడలిపోగా ఇంకో చెంప మహాత్ముడే స్వయంగా రంగంలోకి దిగి నిరంకుశంగా ఉద్యమం ఉసురుతీసి, జనంచేత బకాయిలు కట్టించండంటూ కాంగ్రెసు వారి వెంట పడటాన్ని బట్టే ఆయన విధేయత ఎటో, ఆయన కాంక్షించింది ఎవరి క్షేమమో, ఇంకా చెప్పాలంటే - ఆయన ఎవరి ఏజంటో అర్థంకావటం లేదా?

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటిషు సర్కారుకు రిక్రూటింగు ఏజంటుగా పనిచేసినట్టే పన్నుల నిరాకరణల కష్టకాలంలో అదే సర్కారుకు కలక్షను ఏజంటుగానూ పనిచేయటంలో గాంధీగారికి అనౌచిత్యమేదీ కనిపించకపోవచ్చు. కాని ఆయనను నమ్మి, ఏమి చేసినా సహించి, నిప్పుల్లో దూకమంటే దూకటానికి సిద్ధపడ్డ దేశప్రజలకు మాత్రం తీరని అన్యాయం జరిగింది. గాంధీగారు మాటలరాయుడు బ్రిటిషు దుష్ప్రభుత్వపాలనను ధర్మబద్ధంగా, అహింసాయుతంగా, ఎవరికీ ఏ నెప్పిలేని విధంగా అంతమొందించి స్వరాజ్యం సాధించడం ఎలాగన్నదానిమీద ఆయన ఏళ్ల తరబడి దశాబ్దాల తరబడి ఎడతెగక మాట్లాడుతూనే ఉన్నాడు. బండ్లకొద్దీ జాబులను, పత్రాలను, వ్యాసాలను రాస్తూనే ఉన్నాడు. పచ్చి కూరల దగ్గరనుంచి, పిచ్చాసుపత్రుల దాకా లోకంలోని సమస్త

విషయాలమీదా తిరుగులేని తీర్పులను, ఉదాత్తమైన ఉపదేశాలను వెలువరిస్తూనే ఉన్నాడు. వాటిని వింటూ, నెమరువేసుకుంటూ... పాయిఖానాలు కడుగుతూ... మేకపాలు తాగుతూ... భజనలు చేస్తూ జీవించటమే తప్ప విదేశీ దుష్ట పాలనను తుద ముట్టించే దిశలో ఆ మహానుభావుడు స్థిరంగా ఒక్క అడుగూ ప్రజలను వేయనివ్వలేదు. ఒకవేళ వేసినా దాన్ని వెనక్కి తీసుకునేదాకా తాను నిద్రపోలేదు. ఎవరినీ నిద్రపోనివ్వలేదు.

దక్షిణాఫ్రికా రోజుల నుంచి కాంగ్రెసుకు తిరుగులేని నియంతగా తయారైన తొలిదశ దాకా ఇంతవరకూ మన పరిశీలనలో నిర్ద్వంద్వంగా వెల్లడైన అంశాలనుబట్టే గాంధీ తత్వమేమిటో, వాస్తవానికి ఆయన ఎవరి పక్షమో, ఆయన అసలు అజండా ఏమిటో మందబుద్ధులకు సైతం విస్పష్టమవుతుంది. అహింసా ప్రవక్తగారి ఈ ధోరణి ఇదే రీతిలో ఇంకా పాతికేళ్లు నిరాఘాటంగా సాగింది. నానా అనర్థాలకు మూల కారణమైంది. చివరికి రక్తపుటేరులకు దారితీసింది. వీలువెంబడి ఇంకో గ్రంథంలో ఆ పరిణామాలను చర్చిద్దాం.

ఇప్పటికిక్కడ ఆగుదాం.

పనికొచ్చిన పుస్తకాలు

1. *The Collected works of Mahatma Gandhi,* 98 Vol.s
2. *An Autobiography,* M.K. Gandhi.
3. *Hind Swaraj,* M.K. Gandhi.
4. *Satyagraha in South Africa,* M.K. Gandhi.
5. *The History of the Indian National Congress,* B. Pattabhi Sitaramaiah.
6. *History of the Freedom Movement in India,* R.C. Majumdar, Vol. II, & Vol. III.
7. *Struggle for Freedom,* R.C. Majumdar
8. *Mahatma,* D.G. Tendulkar, Vol. I & II
9. *The Life of Mahatma Gandhi,* Louis Fisher
10. *Mahatma Gandhi,* Romain Rolland
11. *Mahatma Gandhi,* B.R. Nanda
12. *Mahatma Gandhi,* H.S.C. Polak, Brailsford, Pethick Lawrence
13. *The Life and Death of Mahatma Gandhi,* Robert Payne
14. *Gandhi, A Life,* Yogesh Chadda
15. *Mohandas : A True Story,* Raj Mohan Gandhi.
16. *Halfway Freedom,* Margaret Bourke-White
17. *In the Shadow of the Mahatma,* G.D. Birla
18. *Mr. Gandhi,* The Man, Millie Polak
19. *Selections From Gandhi,* Nirmal Kumar Bose
20. *Gandhi : Behind the Mask of Divinity,* G.B. Singh
21. *Gandhi And Anarchy,* C. Sankaran Nair.
22. *The Future of Indian Politics,* Anne Besant
23. *A Nation in Making,* Surendranath Banejea
24. *The Indian Struggle,* Subhas Chandra Bose
25. *My Indian Years,* Lord Hardinge
26. *India's Rebirth,* Sri Aurobindo
27. *An Autobiography,* Jawaharlal Nehru.
28. *What Congress and Gandhi Have Done to the Untouchables,* B.R. Ambedkar.
29. *Thoughts on Pakistan,* B.R. Ambedkar
30. *Pakistan or the Partition of India,* B.R. Ambedkar.
31. *The Un-Gandhian Gandhi,* Claude Markovits
32. *British Administration And The Amritsar Massacre,* B.G. Horniman.
33. *Sir Minntes To Sunset,* Arthur Swinson.
34. *Mahatma Gandhi, The Last Phase,* Part I & II, Pyarelal
35. *Bondage And Freedom,* Bisheshwar Prasad.
36. *History of the Indian Revolutionary Movement,* Manmathnath Gupta,

37. *They Lived Dangerously,* Manmath Nath Gupta,
38. *Armed Struggle for Freedom: 1857 to Subhash,* Balshastri Hardas
39. *Freedom At Midnight,* Dominique Lapierre & Larry Collins
40. *The Indian National Movement,* D.C. Gupta.
41. *Gandhi the Murderer of Gandhi,* Dr. K.V. Seetharamaiah
42. *Gandhi-Muslim Conspiracy,* A Hindu Nationalist.
43. *Gandhi And Hindu - Muslim Unity,* S.R. Bakshi.
44. *Biographycal Sketch of A.O. Hume,* W. Wedderburn
45. ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ, కొడాలి ఆంజనేయులు.
46. స్వీయచరిత్ర, కొండ వెంకటప్పయ్య
47. నా జీవితయాత్ర, టంగుటూరి ప్రకాశం
48. నా జీవితకథ – నవ్యాంధ్రము, అయ్యదేవర కాళేశ్వరరావు.
49. గుంటూరు జిల్లాలో స్వాతంత్ర్యోద్యమం, తెలుగు అకాడమీ.
50. గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం, మాదల వీరభద్రరావు.
51. స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర, కృష్ణాజిల్లా స్వాతంత్ర సమరయోధుల సంఘం.
52. ఆంధ్రలో సహాయ నిరాకరణోద్యమం, డాక్టర్ భద్రిరాజు శేషగిరిరావు.
53. ఆంధ్రలో స్వాతంత్ర్య సమరము, ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య, ఎన్. ఇన్నయ్య.

ఇదే రచయిత ఇతర గ్రంథాలు

ఆర్యులనుంచి ఔరంగజేబుల దాకా భారత చరిత్ర గతిని, మెకాలే మార్కు
చరిత్రకారుల చేతుల్లో అది లోనైన దారుణ వక్రీకరణలను ఎండగట్టే



ఏది చరిత్ర

పేజీలు: 298 **వెల: రు.180**

మొగలాయీల తరవాత మరాఠా సామ్రాజ్య ఉత్థానపతనాల నుంచి
కుట్రలూ కూహకాలతో ఆంగ్లరాజ్య స్థాపన వరకూ



ఇదీ చరిత్ర

పేజీలు: 300 **వెల: రు.150**

(చాలా కొద్ది కాపీలు మాత్రమే ఉన్నాయి)

మనం మరచిన మహాయుద్ధం



1857

పేజీలు: 297 **వెల: రు.150**

సంక్లిష్ట కాశ్మీర్ సమస్యపై సమగ్ర అవగాహన కలిగించే



కాశ్మీర్ కథ

పేజీలు: 186 **వెల: రు.90**

మన విద్యావిధానపు తీరుతెన్నుల విశ్లేషణ



మన చదువులు

పేజీలు: 120 **వెల: రు.60**



Mana Mahatmudu

by

M.V.R.Sastry

భారతదేశానికి స్వాతంత్ర్యం గాంధీ వల్ల వచ్చిందా?
గాంధీవల్ల ఆలస్యమైందా? అవతారపురుషుడు,
అహింసాప్రవక్త, అపరక్రీస్తు అని నిఖిలలోకం
కీర్తించిన మహాత్ముడి నిజస్వరూపమేమిటి?
స్వాతంత్ర్యసంగ్రామంలో ఆయన పాత్ర
ఏ రకమైంది? వాస్తవానికి ఆయన ఎవరి పక్షం?
ఆయన తప్పులకు దేశం ఎటువంటి మూల్యం
చెల్లించింది?
ఇంతకీ దేశానికి గాంధీ వరమా? శాపమా?

ఆఫ్రికానుంచి 'అసహాయం' దాకా గాంధీ కెరీర్‌ను
విశ్లేషించే
మన మహాత్ముడు

మెకాలే మానసపుత్రులు శీర్షాసనం వేయించిన
భారత చరిత్రలోని వక్రీకరణలను ఎండగడుతూ
ఎం.వి.ఆర్.శాస్త్రి రచించిన గ్రంథపరంపరలో ఇది
నాలుగవది.

ఇది దుర్గా పబ్లికేషన్స్ ప్రచురణ

₹250/-